శ్రీమదాంధ్రపద్మపురాణము

ప్రథమసంపుటము.

అట్టబైండు 7-0 0

కాలికోబైండు 8-0-0

నాలుగుసంపుటములు 25-0-0

పుస్తకములు దొరకుచోటు

విద్వాన్, పిసుపాటి విశ్వేశ్వరశాస్త్రి

ఆంధ్రాధ్యాపకుఁడు

వేంకటగిరిరాజాకళాశాల నెల్లూరు

ముద్రాపకులు

ప్రభాతముద్రణాలయము, నెల్లూరు.

(ఆదిఖండమున 17 ఫారము మొదలు 92 ఫారము వరకు నవయుగముద్రణాలయమున ముద్రితము)

శ్రీ మాత్రే నమః

పరిచయము

శ్లో. యస్మా దిదం జగ దజాయత యత్ర తిష్ఠ
త్యంతే సమస్త మిద మస్త ముపైతి యత్ర।
తస్మై నమ స్సదసదాదివికల్పశూన్య
చైతన్యమాత్రవపుషే పురుషోత్తమాయ.

శ్లో. అచతుర్వదనో బ్రహ్మా, ద్విబాహు రపరో హరిః।
అఫాలలోచన శ్శంభు, ర్భగవాన్ బాదరాయణః.

సకలవిజ్ఞానమూలకందములు వేదములు. అందు లేనిది లేదు. అందలివిజ్ఞానమే సర్వత్ర ప్రపంచితమైనది. అది మహాగంభీరము. తదర్థవ్యక్తికే షడంగములుమున్నగునవి యేర్పడినవి. అయినను వేదవేదాంగవ్యాసంగము కావింపలేనివారి కెల్లఁ దద్గంభీరార్థమును గరతలామలక మొనర్పఁ దలఁచి పరమకారుణికు లగుమహర్షులు వేదార్థవర్ణనపరము లగుపురాణేతిహాసములరచనకుఁ బూనుకొనిరి. "ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్" అని కదా యార్షవచనము. కాని యీ పురాణేతిహాసములకుఁగూడఁ బ్రథమప్రకాశనస్థానము బ్రహ్మయే. "అస్య మహతో భూతస్య నిశ్శ్వసిత మేత ద్యదృగ్వేదో యజుర్వేద స్సామవేదోఽథర్వాంగిరస ఇతిహాసః పురాణమ్" (బృహదారణ్యకము.) జీవునకు నిశ్శ్వాసముతో యావద్ద్రవ్యభావిత్వరూపసంబంధ మున్నట్లు శాశ్వతుఁ డగుపరమాత్మకు వేదేతిహాసపురాణములతో యావద్ద్రవ్యభావిత్వరూపసంబంధము (అనఁగా శాశ్వతసంబంధము) కలదనియుఁ గావుననే వేదములవలె నితిహాసపురాణములును శాశ్వతము లనియును బై శ్రుతివాక్యము సూచించుచున్నది. కల్పాంతమునం దంతర్హితము లైనయీపురాణములను గల్పాదియందుఁ జతుర్ముఖబ్రహ్మ మరల స్మరించి దేవతలకు మరీచ్యాది మునులకు నుపదేశించెను. అది యేకరూపము. శతకోటి ప్రవిస్తరము. దానిని వ్యాసభగవానుఁడు నాలుగులక్షలగ్రంథము (=శ్లోకములు) గా సంగ్రహించి పదునెనిమిదిపురాణములు గా విభజించెను. ఇప్పుడు మనము పఠించునష్టాదశపురాణము లివియే.

శ్లో. పురాణం సర్వశాస్త్రాణాం, ప్రథమం బ్రహ్మణా స్మృతమ్।
అనంతరం చ వక్త్రేభ్యో, వేదా స్తస్య వినిర్గతాః.
పురాణ మేక మే వాసీ, చ్ఛతకోటిప్రవిస్తరమ్.

ఇత్యాదిపురాణవచనములఁ బ్రదర్శించి యీవిషయము విష్ణుపురాణవ్యాఖ్యయగువిష్ణుచిత్తీయమున నిట్లు నిర్వచింపఁబడినది.

"అయమర్థః. కృతయుగే వేదా త్పూర్వం బ్రహ్మణా దృష్టస్య శతకోటి ప్రవిస్తరస్య పురాణస్కంధస్య బ్రాహ్మసంజ్ఞస్య త్రేతాయాం పున ర్బ్రహ్మదృష్టా దశర్షిభి ర్గ్రంథకోట్యా సంక్షిప్య బ్రాహ్మపాద్మాద్యష్టాదశపురాణాత్మనా విభక్త స్యైకాదశాధికశతసంహితస్య పున ర్ద్వాపరాంతే తస్య సారం వేదవ్యాస శ్చతు ర్లక్ష్యా సంక్షి ప్యాష్టాదశపురాణసంహితాం కృత్వా రోమహర్షణం సూత మధ్యాపయ దితి"

పురాణములకుఁ బంచమవేదత్వము

ఇతిహాసపురాణములకుఁ బంచమవేదత్వప్రతీతి వేదములందే కానవచ్చు చున్నది. "ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేద మథర్వాణం చతుర్థ మితిహాసం పురాణం పంచమం వేదానాం వేదమ్" ఛాందోగ్యోపనిషత్తు.

శ్లో. పురాణాని చతుర్లక్షా, ణ్యేతాని ధరణీతలే।
తథా మహాభారతం చ, లక్షసంఖ్యం ప్రకీర్తితమ్.
పంచలక్ష మిదం రాజన్, కథితం బ్రహ్మ కేవలమ్।
వేదః పంచమనామైష, లోకనిస్తారకః పరః.

పద్మపురాణము.

ఇతిహాసము గూడఁ బురాణములలో నంతర్భూత మనియే చెప్పియున్నారు. "ఇతిహాసస్య పురాణే ష్వంతర్భావః" (విష్ణుపురాణవిష్ణుచిత్తీయవ్యాఖ్య.)

పురాణములకు నితిహాసములకుఁ గలప్రధానభేద మిది. పురాణకర్త యితిహాసములలో నాఖ్యానములను (=స్వయముగాఁ జూచినవిషయములను) బ్రధానముగాను సృష్ట్యాదితత్త్వమును దక్కువగాను జెప్పును. పురాణములలో నుపాఖ్యానములను (=వేదములవలన వినినవిషయములను) సృష్ట్యాదితత్త్వమును బ్రధానముగాను నాఖ్యానములను దక్కువగాను జెప్పును. కావుననే యితిహాసవిషయములు పురాణములలోను బురాణవిషయము లితిహాసములలోను నున్నవి.

పురాణములకు "జయ"నామము

అష్టాదశపురాణములకు "జయము" అనుపేరు గలదు.

శ్లో. నారాయణం నమస్కృత్య, నరం చైవ నరోత్తమమ్।
దేవీం సరస్వతీం వ్యాసం, తతో జయ ముదీరయేత్. మహాభారతము.

"జయం"

శ్లో. అష్టాదశపురాణాని, రామస్య చరితం తథా।
కార్ష్ణం వేదం పంచమం చ, యన్మహాభారతం విదుః.
తథైవ విష్ణుధర్మాశ్చ, శివధర్మాశ్చ శాశ్వతాః।
జయేతి నామ తేషాం చ, ప్రవదంతి మనీషిణః.

ఇతి భవిష్యవచనాత్పురాణాదికం వా, "చతుర్ణాం పురుషార్థానా మపి హేతౌ జయోఽస్త్రియా" మితికోశా దన్యం వా సర్వపురుషార్థప్రతిపాదకం గ్రంథం శారీరక సూత్రభాష్యాదిరూప ముదీరయేత్." నీలకంఠీయవ్యాఖ్య.

"జయం. జయ త్యనేన సంసార మితి జయో గ్రంథః"

భాగవతము ౧ స్కం. ౨ అ. శ్రీధరీయవ్యాఖ్య.

పై గ్రంథములనుబట్టి ధర్మార్థకామమోక్షప్రతిపాదకమై సంసారజయమునకు సాధనభూత మగుగ్రంథమునకు జయనామము కల దని తేలినది. అట్టిగ్రంథములు:- అష్టాదశపురాణములు, మహాభారతము, రామాయణము, విష్ణుధర్మములు, శివధర్మ ములు, శారీరకసూత్రభాష్యము మున్నగునవి.

పురాణశబ్దనిర్వచనము

ఈశబ్దమును బలువురు పలువిధముల నిర్వచించి యున్నారు. మొదట వ్యాస భగవానునినిర్వచనమును బ్రదర్శించి పిమ్మట మఱికొన్ని నిర్వచనములు ప్రద ర్శింతును.

శ్లో. యస్మా త్పురా హ్యన క్తీదం, పురాణం తేన త త్స్మృతమ్.

బ్రహ్మాండపురాణము. ప్రక్రియాపాదము.

పురా = అతీతానాగతవృత్తములను. అన క్తి = పొందించునది (తెలుపునది) పురాణము అని వ్యుత్పత్తి. పురా భవమ్ (=పూర్వమందుఁ బుట్టినది) అని కొందఱు. పురా = అతీతానాగతావర్థా. అణతి (= భూతభవిష్యద్విషయములను జెప్పునది.) అని కొందఱు. పురాపి నవం పురాణమ్ (=పూర్వమందును గ్రొత్తది అనఁగాఁ బూర్వపూర్వయుగములందలి విషయములను దెలుపునవి యైనను ఎప్పటి కప్పుడు నవ్యనవ్యములై మానవహృదయముల నాకర్షించునవి పురాణము లని భావము)

పురాణరచనాక్రమవిధానములు

అష్టాదశపురాణములలోఁ బద్మపురాణమునే మొదటఁ గృష్ణద్వైపాయన మహర్షి రచియించె నని, పిమ్మట సర్వపురాణములనుండి సారము నాకర్షించి భాగవ తము రచియించె నని పద్మపురాణమునఁ గలదు.

శ్లో. తత్ర పద్మపురాణం తు, ప్రథమం చ ప్రణీతవాన్।
తతోఽన్యాని పురాణాని, కృత్వా షోడశ తు క్రమాత్.
అష్టాదశం భాగవతం, సార మాకృష్య సర్వతః।
కృతవాన్ భగవాన్ వ్యాసః, శుక మధ్యాపయ త్స్వయమ్,

*ఆఖ్యానోపాఖ్యానగాథాకల్పవృత్తాంతనిర్ణయములతో సర్గాదిపంచలక్షణయుక్తమును నష్టాదశపురాణసంక్షేపరూపమును నగుపురాణసంహితను వేదవ్యాసమహర్షి రచియించెను.

శ్లో. ఆఖ్యానై శ్చా ప్యుపాఖ్యానై, ర్గాథాభిః కల్పశుద్ధిభిః।
పురాణసంహితాం చక్రే, పురాణార్థవిశారదః.

విష్ణుపురాణము. 3. ౬. ౧౫.

శ్లో. స్వయందృష్టార్థకథనం, ప్రాహు రాఖ్యానకం బుధాః।
శ్రుతస్యార్థస్య కథన, ముపాఖ్యానం ప్రచక్షతే.

ఆఖ్యానై ర్భారతాదీతిహాసైః, ఉపాఖ్యానై స్తత్ప్రసక్తే ఋభునిదాఘకథాద్యైః. గాథాః పితృపృథివీగీతాద్యాః, కల్పశుద్ధి ర్వారాహాదికల్పవృత్తాంత నిర్ణయః. పితృకల్పమంత్రకల్పవిధి ర్వా, ఏతై స్సహ సర్గాదిపంచలక్షణాం పురాణ సంహితామష్టాదశపురాణానాం సంక్షేపరూపాం వ్యాస శ్చక్రే. (విష్ణుచిత్తీయవ్యాఖ్య)

పురాణకర్త స్వయముగాఁ జూచి చెప్పినది యాఖ్యానము. (ఉదా: భారత కథ, మొ.) వేదములవలన విని చెప్పిన దుపాఖ్యానము. (ఉదా: హరిశ్చంద్ర కథ, మొ.) పితృగీతలు, పృథివీగీతలు మున్నగునవి గాథలు. వారాహాదికల్ప నిర్ణయము కల్పశుద్ధి.

పురాణలక్షణము

శ్లో. సర్గశ్చ ప్రతిసర్గశ్చ, వంశో మన్వంతరాణి చ।
వంశానుచరితం చేతి, పురాణం పంచలక్షణమ్.

తత్ర సర్గ స్త్రివిధః ప్రథమమధ్యమాంత్యభేదేన. తత్ర ప్రథమసర్గో మూలప్రకృతే శ్చతుర్వింశతితత్త్వప్రాదుర్భావః. మధ్యమసర్గ స్తత్త్వవిశేషై శ్చతుర్దశలోకమనుప్రజాపతీంద్రదేవసప్తర్షిప్రముఖారంభః. అంత్యసర్గో భూలోకే మనుష్య, పశు, మృగ, పక్షి, సరీసృప, స్థావరవిశేషాణాం ప్రతిశరీరారంభః. ప్రతిసర్గః ప్రదర్శిత సర్గస్య త్రివిధస్య ప్రతిలోమసర్గః ప్రళయః. వంశో బ్రహ్మాదేః పుత్రపౌత్రపరంపరానుగతః శరీరసంతతిప్రవాహోఽద్యాఽపి వర్తమానః. మన్వంతరమ్—బ్రహ్మణో దివసః కల్పః. తస్మిన్ కల్పే చతుర్దశ మనవః. ఏకసప్తతిచతుర్యుగావృత్తి రేకో మనుః. మనో ర్మన్వంతరప్రాప్తికథనం మన్వంతరమ్, , వంశానుచరితం వంశజానాం మహతా మాచారగుణసంకీర్తనమ్.

(ప్రపంచహృదయము. ఉపాంగప్రకరణము. 45పా.)

సర్గము = ప్రథమమధ్యమాంత్యసృష్టి (ఇదియే బ్రహ్మ సత్యాదిసృష్టి) ప్రతిసర్గము = ప్రళయము (=పై మూఁడువిధముల సృష్టికిఁ బ్రతిలోమసృష్టి) వంశము

= బ్రహ్మాదికులపుత్రపౌత్రపరంపరానుగత మగుశరీరసంఘాతప్రవాహము. (ఇం దే సూర్యచంద్రఋషివంశములును జేరును) మన్వంతరము = స్వాయంభువు మున్నగు మనువులకాలమునందలి దేవతాధర్మాదిస్థితి. వంశానుచరితము = వంశజాతు లగు మహాపురుషులయాచారగుణములను వర్ణించుట. ఇట్టిపంచలక్షణములు గలది పురాణము.

మహాపురాణలక్షణము

మహాపురాణము దశలక్షణోపేతము.

౧. సర్గము = కారణసృష్టి (= బ్రహ్మసృష్టి)

౨. విసర్గము = బ్రహ్మసృష్టి ననుసరించి బ్రహ్మమానసపుత్రు లగుదక్షమరీచ్యాదులు కావించినసృష్టి.

౩. వృత్తి = భూతములకు ఆవశ్యకము లగుజీవికాసాధనములు. (ఆహారాదులు)

౪. రక్ష = దుష్టసంహారమునకై నభగవదవతారములు. వానిలీలలు.

౫. మన్వంతరము = స్వాయంభువు మున్నగుమనువులకాలమునందలి దేవతాధర్మాదిస్థితి

౬. వంశము=బ్రహ్మాదులపుత్రపౌత్రపరంపరానుగత మగుశరీరసముదాయ ప్రవాహము.

౭. వంశానుచరితము = వంశజాతు లగుమహాపురుషులయాచారగుణములవర్ణనము.

౮. సంస్థ=ప్రళయము (ఇది నైమిత్తిక, ప్రాకృతిక, నిత్యా,ఽఽత్యంతిక భేదమునఁ జతుర్విధము).

౯. హేతువు = సృష్టికి హేతుభూతుఁ డగుజీవునిగుఱించి తెలుపునది.

౧౦. అపాశ్రయము = జాగ్రత్స్వప్నసుషుప్తులు అనునవస్థాశ్రయమునఁ గనఁబడు విశ్వతైజసప్రాజ్ఞులు అనుమాయావృత్తులు మూఁడింటియందును బరమాత్మ సాక్షిమాత్రుఁడై యుఁడును. దీనినిగుఱించి తెలుపునది. భాగ. ౧౨. ౬ అ.

మఱియొకచో ని ట్లున్నది.

శ్లో. మహతాం చ పురాణానాం, లక్షణం కథయామి తే।
సృష్టి శ్చాపి విసృష్టిశ్చ, స్థితి స్తేషాం చ పాలనమ్.
కర్మణాం వాసనా వార్తా, మనూనాం తు క్రమేణ చ।
వర్ణనం ప్రళయానాం చ, మోక్షస్య చ నిరూపణమ్.
ఉత్కీర్తనం హరే రేవ, దేవానాం చ పృథక్ పృథక్
బ్రహ్మవైవర్తము. (శ్రీ) కృష్ణజన్మఖండము. ౧౩౨ అ.

ఉపపురాణలక్షణము

ఉపపురాణము పంచలక్షణోపేతము. అవి సర్గాదులు. అష్టాదశపురాణముల వలె నేకకర్తృకములు గాక నానామునికర్తృకము లగుటయు వీని కొకవిశేష లక్షణము.

శ్లో. సర్గశ్చ ప్రతిసర్గశ్చ, వంశో మన్వంతరాణి చ।
వంశానుచరితం విప్ర, పురాణం పంచలక్షణమ్.
ఏత దుపపురాణానాం, లక్షణం చ విదు ర్బుధాః।

బ్రహ్మవైవర్తము. శ్రీకృష్ణజన్మ. ౧౩౨ అ.

"అన్యా న్యుపపురాణాని, మునిభిః కథితా న్యపి" కూర్మపురాణము.

మహాపురాణములు

ఇవి పదునెనిమిది. ఇవి యన్నియును వ్యాసప్రోక్తములే. 1. బ్రహ్మ 2. పద్మ 3. విష్ణు, 4. శివ, 5. భాగవత, 6. భవిష్య, 7. నారద, 8. మార్కండేయ, 9. అగ్ని, 10. బ్రహ్మవైవర్త, 11. లింగ, 12. వామన, 13. స్కాంద, 14. మత్స్య, 15. కూర్మ, 16. వరాహ, 17. గరుడ, 18. బ్రహ్మాండపురాణములు.

పురాణశబ్దము మహాపురాణపరముగాఁ గూడఁ బురాణములం దెల్లెడల వాడఁబడియున్నది.

ఉపపురాణములు

ఇవియును బదునెనిమిది.

శ్లో. ఆద్యం సనత్కుమారోక్తం, నారసింహం తతః పరమ్।
తృతీయం వాయవీయం చ, కుమారేణ చ భాషితమ్.
చతుర్థం శివధర్మాఖ్యం, స్సాక్షా న్నందీశభాషితమ్।
దుర్వాస సోక్త మాశ్చర్యం, నారదీయ మతః పరమ్.
నందికేశ్వరయుగ్మం చ, తథై వోశన సేరితమ్।
కాపిలం వారుణం సాంబం, కాళికాహ్వాయ మేవ చ.
మాహేశ్వరం తథా కల్కి, దైవం సర్వార్థసిద్ధిదమ్।
పరాశరోక్త మపరం, మారీచం భాస్కరాహ్వాయమ్.

కూర్మపురాణము.

దేవీభాగవతాదులలో మహాపురాణోపపురాణపరిగణనమున నొక కొంత భేదము గలదు. దానికిఁ గల్పభేదాదికము కారణము కావచ్చును. ఇఁక దేవీభాగవత, విష్ణుభాగవతములవిషయమున నేది మహాపురాణమో యేది

యుపపురాణమో నిర్ణయించుటకై పలువురు వ్యాఖ్యాతలు యత్నించిరి. నీలకంఠభట్టీవిషయము నిట్లు పరిష్కరించియున్నాఁడు.

"నారదీయాదిపురాణమతేన శ్రీవిష్ణుభాగవతం మహాపురాణమ్...... దేవీభాగవతం తు తన్మతే ఉపపురాణమ్. శైవమాత్స్యపురాణాదిమతేతు దేవీభాగవతం మహాపురాణమ్. విష్ణుభాగవత మర్థా దుపపురాణ మితి సిద్ధమ్.వస్తుతస్తు-ఉభయోరపిపురాణయోః పురాణమతభేదేన మహాపురాణత్వముపపురాణత్వం చ"
(దేవీభాగవతటీక.)

పురాణప్రతిపాదితవిషయములు

సామాన్యదృష్టితో నొక్కచోఁ బురాణప్రతిపాదితవిషయము లిట్లు సంగ్రహముగాఁ జెప్పఁబడినవి.

శ్లో. ఋషిదేశమహావీర, చరితా న్యవతారకాః।
లాజావిధి ర్వ్రతా స్తీర్థా,నామ్నాం సాహస్ర మేవ చ.
ఋషిరాజ్ఞాం వంశసూచీ, యుగా స్సృష్టి శ్చ ద్వాపరః।
సామాన్యతః పురాణేషు, విషయాః ప్రతిపాదితాః.

పురాణములందుఁ గలవిషయము లివి మాత్రమే కావు. "విజ్ఞానసాగరమ్" అని "యదిహా స్తి త దన్యత్ర,య న్నేహా స్తి న త త్క్వచిత్" అని వ్యాసభగవానునిచే నుతింపఁబడినపురాణేతిహాసములందు లేనిది లేదు. తఱచినకొలఁది యందు విజ్ఞానామృత ముద్భవించును.

విరోధపరిహారము.

కొన్నికథ లొకపురాణమున నొకవిధముగను మఱియొకపురాణమున మఱియొకవిధముగను గనఁబడుచున్నవి. దీనినిబట్టి పురాణగాథల కైక్యము లేదని, పురాణములు పరస్పరవిరుద్ధము లని, అందుచే నవి యప్రమాణము లని కొందఱనుచున్నారు. వారికి వ్యాసభగవానుఁ డిట్లు సమాధానము చెప్పియున్నాఁడు.

"ఏకార్థాని పురాణాని, వేదా శ్చైకార్థసమ్మితాః" (మహాభారతము)

శ్లో. క్వచి త్క్వచి త్పురాణేషు, విరోధో యది దృశ్యతే।
కల్పభేదాదిభి స్తత్ర, వ్యవస్థా సద్భి రిష్యతే.

ప్రతికల్పమున జరుగుసృష్టిలో రామకృష్ణాద్యవతారములయు నితరమహాపురుషులయు సృష్టి జరుగును. తద్గాథలలోఁ గల్పభేదప్రయుక్త మగుకించిద్భేదము సంభవింపవచ్చును. అది దోషము గాదు. అట్టివిషయములను బురాణములు వదలక తెలుపును. ఈ విషయము పద్మపురాణమునఁ బాతాళఖండమునఁ బూర్వకల్ప

రామాయణకథనసమయమున వివరింపఁబడినది. కావుననే ప్రతిపురాణమునను ఈపురాణము ఈకల్పవృత్తాంతమును దెలుపు నని వ్యాసభగవానుఁడు చెప్పి యున్నాఁడు.

పురాణములందు మనకుఁ గలుగుసంశయముల కెల్ల వానియందే సమాధానములు దొరకఁ గలవు. కాని మిగుల జాగరూకులమై సత్యదృష్టితోఁ బురాణవాఙ్మయము నెల్లఁ బరిశోధింపనిచో నవి యన్నియు లభింపవు. మనలను సన్మార్గమున నడపువ్యాఖ్యాతలసాహాయ్యముసైత మత్యవసరము. లోకానుగ్రహమే ప్రధానకృత్యముగా భావించి పురాణరచనకుఁ బూనుకొనిన శ్రీవేదవ్యాసమహర్షియం దచంచలవిశ్వాసము అన్నింటికంటెను ముఖ్యము.

మన్వంతరకల్పస్వరూపాదికము.

మనుష్యమానమునఁ గించిదధికము లగు 71 మహాయుగములకు (అనఁగా 308571428 సంవత్సరముల 6 మాసముల 25 దినముల 42 గడియలకాలమునకు) ''మన్వంతర'' మని పేరు. ఇట్టిమన్వంతరములు పదునాలుగు (అనఁగా 432 కోట్ల మనుష్యవత్సరములు) బ్రహ్మదేవున కొక్కపగలు. దీనికి ''ఉదయకల్పము'' అని పేరు. ఇందు బ్రహ్మాదులసృష్టి సాగును. మరల నింత కాలము బ్రహ్మదేవునకు రాత్రి. దీనికి ''క్షయకల్పము'' అని పేరు. ఇందు సంకర్షణాగ్నిచే భూర్భువస్సువర్మహర్లోకములు దగ్ధము లగును. దీనినే నైమిత్తికప్రళయ మందురు. ఉదయక్షయకల్పములు రెండును గలిసిన బ్రహ్మ కొకయహోరాత్ర మగును. దీనికే ''కల్పము'' అని పేరు. 360 కల్పములు బ్రహ్మదేవున కొకసంవత్సరము. ఇట్టిసంవత్సరములు నూఱు బ్రహ్మదేవునిపరమాయుర్దాయము. దీనికి ''మహాకల్పము'' అని పేరు. మహాకల్పానంతరప్రళయమును ''ప్రాకృతికప్రళయ'' మందురు.

కల్పము లనంతములు. ఇవి సాత్త్వికములు రాజసములు తామసములు సంకీర్ణములు అని నాలుగువిధములు.

కల్పనామములు.

1. శ్వేతవరాహ, 2. నీలలోహిత, 3. వామదేవ, 4. రథంతర, 5. రౌరవ, 6. ప్రాణ,(దేవ) 7. బృహత్,8. కందర్ప,9. సత్య, 10. ఈశాన, 11. ధ్యాన,(తమః) 12. సారస్వత, 13. ఉదాన, 14. గరుడ, 15. కూర్మ, 16. నారసింహ, 17. సమాధి, 18. ఆగ్నేయ, 19. విష్ణుజ, 20. సౌర, 21. సోమ, 22. భావన, 23. సుప్తమాలి, 24. వైకుంఠ, 25. ఆర్చిష, 26. వల్మీక, 27. వైరాజ, 28. గౌరీ, 29. మాహేశ్వర, 30. పితృ, 31. మానవ, 32. తత్పురుష, 33. వైకుంఠ, 34. లక్ష్మీ 35. సావిత్రీ, 36. అఘోర, 37. పద్మకల్పాదులు. ఇవి యనంతములు.

చతుర్దశమనువులు.

1. స్వాయంభువుఁడు, 2. స్వారోచిషుఁడు, 3. ఉత్తముఁడు, 4. తామసుఁడు, 5. రైవతుఁడు, 6. చాక్షుషుఁడు, (వీరు గడచిపోయినవారు) 7. వైవస్వతుఁడు, (ఇతఁ డిప్పటిమనువు) 8. సావర్ణి, 9. దక్షసావర్ణి, 10. బ్రహ్మసావర్ణి, 11. ధర్మసావర్ణి, 12. రుద్రసావర్ణి, 13. దేవసావర్ణి, 14. ఇంద్రసావర్ణి, (వీరు రాఁబోవుమనువులు) (భాగ. ౮.౧. అ.) మనువులనామములందుఁ గొంతభేదము వేఱువేఱుపురాణములోఁ గలదు. అది కల్పభేదప్రయుక్తము.

వ్యాసస్వరూపాదికము.

ఇంద్రాదిశబ్దములవలె వ్యాసశబ్దము గూడ బిరుదవాచకము. కృత, త్రేతా, ద్వాపర, కలియుగములు నాలుగును గలిసి "మహాయుగ" మనఁబడును. దీనిప్రమాణము 4320000 మానవసంవత్సరములు. ఇట్టిమహాయుగములు కించిదధికములు డెబ్బదియొకటి యొకమన్వంతరము. ఇందలిప్రతిద్వాపరాంతమునను నొక్కొక్క తపోనిధి వేదవిభాగము, అష్టాదశపురాణనిర్మాణము, అష్టాదశవిద్యావ్యాపనము కావించి "వ్యాస" బిరుదమును బడయును.

శ్లో. ద్వాపరే ద్వాపరే విష్ణు,ర్వ్యాసరూపేణ సర్వదా ।
వేద మేకం స బహుధా,కురుతే హితకామ్యయా.

శ్లో. మన్వంతరేషు సర్వేషు,ద్వాపరే ద్వాపరే యుగే ।
ప్రాదుఃకరోతి ధర్మార్థీ,పురాణాని యథావిధి.

దేవీభాగవతము, 1 స్కం. 3 అ.

వైవస్వతమన్వంతరమున నేఁటికిఁ గడచినయిరువదియెనిమిదిద్వాపరములం దవతరించినవ్యాసులనామములు—

1. బ్రహ్మ, 2. ప్రజాపతి, (మనువు) 3. ఉశనుఁడు, 4. బృహస్పతి, 5. సవిత, 6. మృత్యువు, 7. ఇంద్రుఁడు, 8. వసిష్ఠుఁడు, 9. సారస్వతుఁడు, 10. త్రిధాముఁడు, 11. త్రివృషుఁడు, 12. భరద్వాజుఁడు, 13. అంతరిక్షుఁడు, 14. ధర్ముఁడు, 15. త్రయ్యారుణి, 16. ధనంజయుఁడు 17. మేధాతిథి, 18. వ్రతి, 19. అత్రి, 20. గౌతముఁడు, 21. ఉత్తముఁడు, (హర్యాత్మ) 22. వేనుఁడు. (వాజిశ్రవుఁడు) 23. సోముఁడు, (ఆముష్యాయణుఁడు) 24. తృణబిందువు, 25. భార్గవుఁడు, 26. శక్తి, 27. పరాశరుఁడు, 28. కృష్ణద్వైపాయనుఁడు.

రాఁబోవుద్వాపరయుగమున నశ్వత్థామ వ్యాసుఁడు కాఁగలఁడు. వ్యాసనామములు కూర్మాదిపురాణములలోఁ గొన్ని భిన్నములుగాఁ గనిపించుచున్నవి. అవి కల్పభేదమును బట్టి యేర్పడిన వని దేవీభాగవతతిలకవ్యాఖ్యాత తెలిపియున్నాఁడు.

పురాణములకుఁ గల్పసంబంధము.

ఒక్కొక్కపురాణ మొక్కొక్క కల్పవృత్తాంతమును దెలుపు చున్నది. దొరకినంతవఱకు ఏపురాణ మేకల్పవృత్తాంతమును దెలుపునదియును, ఆపురాణ శ్లోకసంఖ్యయును గ్రిందిపట్టికలో నొసఁగెదను.

1.	బ్రహ్మపురాణము-	బ్రహ్మకల్పము.	౧౦౦౦౦	శ్లో.
2.	పద్మ ,,	పద్మ ,,	౫౫౦౦౦	,,
3.	విష్ణు ,,	వరాహ ,,	౮౦౦౦	,,
4.	శివ ,,	శ్వేత ,,	౨౪౦౦౦	,,
5.	భాగవత ,,	సారస్వత ,,	౧౮౦౦౦	,,
6.	భవిష్య ,,	అఘోర ,,	౩౧౦౦౦	,,
7.	నారద ,,	బృహత్ ,,	౨౫౦౦౦	,,
8.	మార్కండేయ ,,	మాధురీ ,,	౯౦౦౦	,,
9.	అగ్ని ,,	ఈశాన ,,	౮౦౦౦	,,
10.	బ్రహ్మవైవర్త ,,	రథంతర ,,	౧౨౦౦౦	,,
11.	లింగ ,,	అగ్ని ,,	౧౧౦౦౦	,,
12.	వామన ,,	కూర్మ ,,	౧౪౦౦౦	,,
13.	స్కాంద ,,	తత్పురుష ,,	౧౦౦౦౦౦	,,
14.	మత్స్య ,,	సత్య ,,	౧౪౦౦౦	,,
15.	కూర్మ ,,	లక్ష్మి ,,	౬౦౦౦	,,
16.	వరాహ ,,	మానవ ,,	౨౪౦౦౦	,,
17.	గరుడ ,,	గారుడ ,,	౧౯౦౦౦	,,
18.	బ్రహ్మాండ,,	భవిష్య ,,	౧౨౦౦౦	,,
			౪౦౦౦౦౦	శ్లో.

కొన్నిపురాణములలో శ్లోకసంఖ్య కొంత కొంత భిన్నముగా నున్నది. అది సంహితాభేదాదిప్రయుక్త మని విష్ణుచిత్తీయవాఖ్యలోఁ గలదు. వ్యాసోక్తము లగు పదునెనిమిదిపురాణములశ్లోకసంఖ్య నాలుగులక్ష లనుటలో మాత్ర మన్నిపురాణములు నేకీభవించియున్నవి.

సాత్త్విక రాజస తామస పురాణములు

శ్లో. వైష్ణవం నారదీయం చ, తథా భాగవతం శుభమ్ ।
గారుడం చ తథా పాద్మం, వారాహం శుభదర్శనే.
సాత్త్వికాని పురాణాని, విజ్ఞేయాని శుభాని వై

బ్రహ్మాండం బ్రహ్మవైవర్తం, మార్కండేయం తథైవ చ,
భవిష్యం వామనం బ్రాహ్మం, రాజసాని నిబోధత ।
మాత్స్యం కౌర్మం తథా లైంగం, శైవం స్కాందం తథైవ చ,
ఆగ్నేయం చ షడేతాని, తామసాని నిబోధ మే.

పద్మపురాణము. ఉత్తరఖండము. ౨౬౩ అ.

విష్ణు,నారద, భాగవత, గరుడ, వరాహ, పద్మపురాణములు సాత్త్విక పురాణములు.

బ్రహ్మ, బ్రహ్మాండ, బ్రహ్మవైవర్త, మార్కండేయ, భవిష్య, వామన పురాణములు రాజసపురాణములు. అగ్ని. మత్స్య, కూర్మ, లింగ, శివ, స్కంద పురాణములు తామసపురాణములు.

ఇట నొకకొంత పరిశీలన మవసరము. సత్త్వరజస్తమోగుణములు కల్పము లవి కాని పురాణములవి కావు. సాత్త్వికరాజసతామసకల్పములందు రచితము లైన పురాణములందు సాత్త్వికాదివ్యవహార మౌపచారికము.

శ్లో. అసంఖ్యాతా స్స్మృతాః కల్పా, బ్రహ్మవిష్ణుశివాత్మకాః ।
కథితాశ్చ పురాణేషు, మునిభిః కాలచింతకైః.
సాత్త్వికే ష్వథ కల్పేషు, మాహాత్మ్య మధికం హరేః ।
తామసేషు మహేశస్య, రాజసేషు ప్రజాపతేః.
క్వచి ద్బ్రహ్మా క్వచి ద్విష్ణుః, క్వచి ద్రుద్రః ప్రశస్యతే ।
నానేన తేషా మాధిక్యం, న్యూనత్వం వా కథంచన.
తత్తత్కల్పాంతవృత్తాంత, మధిగమ్య మహర్షిభిః ।
తాని తాని ప్రణీతాని, విద్వాం స్తత్ర న ముహ్యతి. కూర్మపురాణము.

ఈసాత్త్వికాదివిభాగ మొక్క పురాణములకే కాదు. వేదములకును గానిపించు చున్నది. ''యజుర్వేదము సాత్త్వికము. ఋగ్వేదము రాజసము. సామవేదము తామసము'' శివపురాణము. వాయుసంహిత.

స్మృతులకు శాస్త్రములకు సైతము సాత్త్వికాదిభేదము చెప్పఁబడినది. గౌతమ, శంఖ, లిఖితాదిస్మృతులు, న్యాయసాంఖ్యాదిశాస్త్రములు తామసములు. ఇట్లే మంత్రములకుఁ ద్రిమూర్తులకుఁ గూడ నీభేదము వ్యాపించినది. వేయేల? నిత్యము నిర్గుణము నగు పరమాత్మ యొక్కఁడు తక్క సగుణ మెల్ల సాత్త్వికాది భేదమునకు లోఁబడినదే. సకలచరాచరజగత్సృష్టికి మూలకారణము పరమేశ్వ రునియిచ్ఛ. దీనినే ప్రకృతి యని, ప్రధాన మని, అవ్యాకృత మని వ్యవహ రింతురు. దీనిగుణములే సత్త్వరజస్తమస్సులు. ప్రకృతికల్పిత మగుసృష్టియం దంతట

దానిగుణములు సంక్రమించి యున్నవి. కావునఁ ద్రిమూర్తులు మొదలుకొని చీమవఱకును గలసర్వజగత్తునందును సాత్త్వికాదిభేదము సంభవించినది. ఈభేదమే మానవులలో సైతము కలిగినది. సత్త్వగుణ మధికముగా నుండువారు సాత్త్వికులు. రజోగుణ మధికముగా నుండువారు రాజసులు. తమోగుణ మధికముగా నుండువారు తామసులు. వీరిలో సాత్త్వికు లుత్తమాధికారులు మోక్షకాంక్షులు. రాజసులు మధ్యమాధికారులు స్వర్గాదిఫలకాంక్షులు. తామసు లధమాధికారులు ఐహికఫలకాంక్షులు. ఇట్టిత్రివిధప్రకృతులవారు వారివారియిచ్ఛల కనుకూలము లగుదేవతాదికమును జూపి, తత్తన్మహిమాదికమును దెలిపిననే కాని సరి యగుత్రోవకు రారు. అందుచేతనే యకారణకారుణికుఁ డగువేదవ్యాసమహర్షిచే సాత్త్వికపురాణములందు మోక్షసాధనములు, రాజసపురాణములందు స్వర్గాదిసాధనములు, తామసపురాణములం దైహికఫలసాధనములు ప్రధానముగను దక్కిన విషయము లప్రధానముగను వర్ణింపఁబడినవి. మఱియుఁ దత్తత్ప్రకృతుల కనుకూలము లగుదేవతలు, మంత్రములు, ఉపాసనలు నుపదేశించి, వీరి కెల్లఁ దరణోపాయము చూపింపఁబడినది.

కావుననే తత్తద్గుణాశ్రయు లగుబ్రహ్మవిష్ణుమహేశ్వరులలో నెక్కువతక్కువలు లే వని, వీరి కందఱకు నిర్గుణము నిరంజనము నిత్యము శుద్ధము నగుచైతన్యమే మూల మని సకలపురాణములందును దెలుపఁబడియే యున్నది. ఈరహస్యమును సమరసభావముతో గ్రహించిననే సకలపురాణములకు సమన్వయము కుదురఁ గలదు.

పురాణరచనోద్దేశము.

కరుణామయుఁ డగుపరమేశ్వరుఁడు మానవసమాజము నెల్ల నుద్ధరింపఁ దలఁచి వారివారియధికారమునకుఁ దగునట్లు కర్మమార్గము, ఉపాసనామార్గము, జ్ఞానమార్గము అనుమూఁడుమార్గములను వేదములందు నుపనిషత్తులందును బ్రదర్శించెను. ఆవేదములు ప్రభుసమ్మితములు. ప్రభువు "ప్రజలు ఈపని చేయవలెను. ఈపని చేయరాదు" అని శాసించినట్లే వేదములును "ఈకర్మము చేయవలెను. ఈకర్మము మానవలెను" అని ప్రజలను శాసించుచున్నవి. ఇట్టివేదములవలన నత్యల్పసంఖ్యాకు లగుసాత్త్వికప్రకృతులు మాత్రమే తరింతురు. వారికిఁ గారణజిజ్ఞాస యుండదు. వేదములం దీశ్వరవచనము లనెడియచంచలవిశ్వాసమే వారిని వానియడుగుజాడలలో నడిపించును. వీరు ఉత్తమాధికారులు. ఇఁక రజస్తమఃప్రకృతికు లగుమానవులను సైతము తరింపఁజేయుటకై పురాణములు మహర్షులచే నిర్మింపఁబడినవి. ఇవి సుహృత్సమ్మితములు. తల్లిదండ్రులమాటలు లెక్కచేయక యథేచ్ఛముగా సంచరించుచుండుజనునకు మంచిమనస్సు గలమిత్రుఁడు నెమ్మదిగా దగ్గ

ఆకుఁ జేరి, ఆయాప్రస్తావములు దెచ్చి దినదినమును మంచిశ్రోవను బోధించుచు మెల్లమెల్లగా నాశ్రోవలోనికి మలఁపునట్లు పురాణము లాయాకథలమూలమున, వారివారిసంభాషణములమూలమున, ఆయాదేవతలమహిమలను ప్రశంసించుట మూలమున రజస్తమఃప్రకృతికు లగుమానవులచిత్తవృత్తుల నాకర్షించి వారికి హితవును బోధించును.

మఱియు సకలవిజ్ఞాననిధు లగువేదములలోనినిగూఢార్థమును సర్వజనులకు సులభముగాఁ దెలియునట్లలోఁ బురాణములు వెల్లడించి యున్నవి. అందుఁ బలువురు దేవతలను దదుపాసనలను దన్మహిమలను వర్ణించుట త్రివిధప్రకృతు లగు జనుల నెల్ల నాకర్షించి వారిని శ్రేయోమార్గమునకు మరలించుటకే యని తెలిపియే యున్నాను.

మఱియొకమాట. గణితము, భూగోళము, ఖగోళము, శకునశాస్త్రము, వ్యాకరణము, న్యాయవేదాంతకాపిలాదిశాస్త్రసిద్ధాంతములు, ఛందస్సు, నిరుక్తము, యోగము, సదాచారములు, ధర్మములు, తీర్థక్షేత్రమహిమలు, ప్రాచీనచరిత్రలు, ఆయుర్వేదము, వృక్షాయుర్వేదము, పంచభూతశక్తులు, పరస్పరద్వేషరహితులై మానవులు సుఖజీవనము సాగించు తెరువులు. ఇవి యవి యననేల? సకలవిషయములును దరిచినకొలఁదిఁ బురాణసాగరమునుండి వెలువడుచున్నవి. ఇట్టి విజ్ఞానసాగరము లగుపురాణములను మనకుఁ గటాక్షించినపరమకారుణికుఁ డగువేదవ్యాసభగవానునకుఁ జేతులు జోడించి మాఱుమాటాడక తదుక్తమార్గమున సంచరించుటయే మనకుఁ గర్తవ్యము. అప్పుడే భారతదేశము సర్వోత్తమము కాఁగలదు.

పురాణవేత్తకు సర్వజ్ఞబిరుదము.

అష్టాదశమహాపురాణములు, అష్టాదశోపపురాణములు, మహాభారతము తెలిసినవారికి భవిష్యపురాణము "సర్వజ్ఞ" బిరుద మొసఁగి యున్నది.

శ్లో. యే త్వేతాని సమస్తాని, పురాణాని చ జానతే।
భారతం చ మహాబాహో, తే "సర్వజ్ఞా" మతా నృణామ్.

"బాగుగాఁ బురాణములను దెలిసికొననివాఁడు– నాలుగువేదములు ఉపనిషత్తులు షడంగములు తెలిసికొన్నను విచక్షణుఁడు కాఁడు" అని బ్రహ్మాండపురాణము వ్యతిరేకమార్గమునఁ బైవిషయమునే దెలుపుచున్నది.

శ్లో. యో విద్యా చ్చతురో వేదా, న్సాంగోపనిషదో ద్విజః।
న చే త్పురాణం సంవిద్యా, న్నైవ స స్యా ద్విచక్షణః. (ప్రక్రియాపాదము.)

పద్మపురాణము — తన్నామనిర్వచనము.

పద్మపురాణము రచనలో మొదటిదిగాను, పురాణములలో రెండవదిగాను బరిగణింపఁబడినది. పరిమాణమునఁ గూడ నిది ద్వితీయస్థానము నాక్రమించుచున్నది. (ప్రథమస్థానము నాక్రమించినపురాణము లక్షశ్లోకాత్మక మగు స్కాందము.) ఇందలిశ్లోకసంఖ్య యేఁబదియైదువేలు. ఇందు ఆది, భూమి, బ్రహ్మ, పాతాళ, సృష్ట్యుత్తరఖండము లనునాఱు ఖండములు గలవు ఇది పద్మకల్ప వృత్తాంతమును వెల్లడించుచున్నది. ఆకల్పమున విష్ణుదేవునినాభినుండి క్షోణీలక్షణములతో నొప్పుపద్మ మొకటి యుద్భవిల్లెను. ఆపద్మము హిరణ్మయము. బహుయోజనవిస్తృతము. అదియే యాకల్పమున భూమి యయ్యెను. దానికేసరములే హిమవన్మేరుకైలాసాదిశైలము లయ్యెను. అందుచేతనే యాకల్పమునకుఁ "బద్మకల్ప" మనుపేరు వచ్చినది. ఆకల్పవృత్తాంతమును దెలుపుచుండుటచే నీపురాణమునకును "బద్మపురాణ" మనునామధేయము కలిగెను. ఇందుఁ బ్రధానప్రతిపాద్యము హరిపారమ్యము. చైత్రాదిద్వాదశమాసమాహాత్మ్యములు, షడ్వింశత్యేకాదసులస్వరూపమహిమాదికము, పితృభక్తివిష్ణుభక్తిమాహాత్మ్యము, భగవద్గీతామహిమము, రామనామవైభవము, పంచాఖ్యానము మున్నగు నితరవిషయములు వేలకొలఁది ప్రతిపాదితములు. అవి విషయసూచికలలో నీయఁబడియుండుటచే నిక్కడ మరల వివరింపలేదు. ఏపురాణమునను లేనియష్టాదశపురాణాత్మకవిష్ణుస్వరూప మిందుఁ దెలుపఁబడుట విశేషము. (చూ. ఆం. పద్మ. ఆది. 827–828) ఇతరపురాణములను జదువునప్పుడు మనకుఁ గలుగుననేకసందేహము లీపురాణమును జదివినఁ దీఱఁగలవు. ఇందులకుఁ బాతాళఖండమున వర్ణించినపూర్వకల్పరామాయణాదిక ముదాహరణము.

ఆంధ్రీకరణము

ఇట్టిపద్మపురాణమును సంపూర్ణముగ నాంధ్రీకరించి యాంధ్రభారతికిఁ గైకాన్కఁ జేసినభాగ్యము శ్రీచిదంబరశాస్త్రిగారి కొక్కరికే దక్కినది.

శ్రీనాథునితాత కమలనాభామాత్యుఁడు "పద్మపురాణసంగ్రహము" రచియించినాఁడఁట! (చూ. భీమఖండము. ౧–౧౦) దానిజాడయే యెక్కడను గానరాదు మడికి సింగనమంత్రి "ఉత్తరఖండము" మాత్రమే తెనుఁగుచేసియున్నాఁడు.

శ్రీ శాస్త్రిగారు వాగనుశాసనునివలెఁ గవితాజీవితములందు బహునియమవంతులు. వీరు పద్మపురాణరచనలోఁ జాలనియమములు పాటించియున్నారు. ఉదాహరణమునకై యొండు రెండు తెలిపెదను. (ళళలకుఁ దప్ప) అభేదయతిని గాని, అభేదవర్గయతిని గాని వీ రీమహాగ్రంథమున వాడనే లేదు. ముభక్తియతినే కాని, ఋకారయతిని వాడలేదు. ఇట్టివానిని బరిశోధకులు పరిశీలింపఁగలరు.

శ్రీశాస్త్రిగారికవిత వారియెడఁదవలె బహునియమకలిత మైనను మృదుమధురము, వీరిప్రవర్తనవలె శైలిసైతము వక్రతావిరహితము. వీరికవితాధార గంగాఝరివలె నిరర్గళము, స్వచ్ఛము. వ్యర్థపదములు మందునకైనను గానరావు. ఆదినుండి తుదివఱకు గ్రంథ మంతయు నొక్కశైలిలో నడచినది. ఆయాసందర్భముల కనుకూలములై రసోద్బోధకము లగువృత్తములు వాడఁబడినవి. (చూ. ఆది. ౨౩౧-౨౩౮.) ఇట బాణాసురునిశివభక్తి తోటకవృత్తములలోఁ దొణికిసలాడుచున్నది. ఇట్లే యుత్తరఖండమున మార్కండేయునిశివభక్తి యమునియెడఁ గల నిర్లక్ష్యభావము మత్తకోకిలవృత్తమున వ్యక్తమగుచున్నవి. ఒక్కయాంధ్రదేశమునే కాక యాసేతుహిమాచలము తమమధురకవితాస్రవంతినిలో ముంచి తేల్చిన శ్రీచిదంబరకవీంద్రునికవితారీతుల నిప్పు డిటఁ బ్రత్యేకముగాఁ బ్రశంసింప వలెనా?

ఆంధ్రీకరణము మక్కికి మక్కిగాఁ గాక స్వతంత్రగ్రంథమువలె సాగినది. అయినను మూలస్థవిషయములను మాత్ర మెక్కడను విడువలేదు.

ఒకవిషయమే ప్రసంగవశమునఁ గొంత యొకఖండమునను మఱికొంత యింకొకఖండమునను మూలమునఁ జెప్పబడినప్పుడు దానిని పాఠకులసౌకర్యమునకై యాంధ్రీకరణమున నొక్కచోటనే చేర్చి చెప్పియున్నారు. ఉదా: ౨౬. ఏకాదశులమహిమాదికము. (చూ. ఆం. పద్మ. బ్రహ్మ. ౪౧౨-౬౩౫ వఱకు) ఇది మూలమున బ్రహ్మఖండము. ౧౫ అధ్యాయమున, ఉత్తరఖండము. ౩౫ అధ్యాయము మొదలు ౬౪ అధ్యాయమువఱకును గలదు.

ఇట్టిచిఱుమార్పులు కొన్ని యట నటఁ గలవు. ఆంధ్రీకరణమునందలివిశేషముల నెల్ల విపులముగా నాల్గవసంపుటమునఁ దెలుపఁదలఁచియుండుటచే నీవిషయ మిప్పు డింతటితో ముగించుచున్నాను.

ముద్రణప్రయత్నము

"శ్రీమదాంధ్రపద్మపురాణ" రచయిత యీమహాగ్రంథ మచ్చుపడక ముందే కాలధర్మము నొందుటచేఁ దదాజ్ఞావశవర్తులమై నేను శ్రీమాయన్నగారగు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు నేతద్గ్రంథముద్రణమునకై యథాశక్తి యత్నింప సాగితిమి. ఈసందర్భమును గుర్తించిన శ్రీ వేంకటగిరిరాజకళాశాలావిద్యార్థులు షోడశోత్తరశతాధికసహస్రరూప్యములు (రు. 1116-0-0) సమర్పించి తమభాషాభిమానమును వెల్లడించిరి. గురుభక్తిభరితాత్ము లగునీవిద్యార్థులకుఁ గృతిపతియగు కాశీవిశ్వేశ్వరుఁడు సర్వదా సకలశ్రేయము లొసఁగి బ్రోచుఁగాక యని యాశీర్వ

దించు చున్నారము. ఇప్పు డిప్పుడే మఱికొందఱు పెద్దలుసైత మీసత్కార్యమునకుఁ జేయూఁత యిచ్చుచున్నారు. వీరిపవిత్రనామధేయము లనుబంధమునఁ బ్రకటింపఁ బడినవి.

ఈ కార్యము బహుద్రవ్యసాధ్య మగుటచే నిందుల కీక్రిందిప్రణాళిక యేర్పఱుపఁ బడినది.

1. మహారాజపోషకులు	...	రు.	1000-0-0
2. రాజపోషకులు	...	రు.	250-0-0
3. పోషకులు	...	రు.	100-0-0
4. సహాయులు	...	రు.	50-0-0
5. ప్రోత్సాహకులు	...	రు.	25-0-0

పై యైదు తెఱఁగులవారికి ముద్రిత మైన వెంటనే ప్రతిసంపుట మొక్కొక్క ప్రతి పంపఁబడును. వీరినామధేయములుసైతము గ్రంథమున ముద్రింపఁబడును.

ఏతద్గ్రంథముద్రణమునకుఁ జెందినవస్తుసంభారము నుంచుకొనుటకై తమ యింటఁ దావొసంగినమహోదారులు భాషాభిమానులు శ్రీతూములూరి శివరామయ్యపంతులు (B. A. B. L.) గారికిఁ గృతజ్ఞతాపూర్వకనమోవాకములు.

శ్రీకాశీవిశ్వేశ్వరునికరుణాకటాక్షమున నేఁటికిఁ బ్రథమసంపుటము ప్రకటింపఁ బడినది. ఇందు ఆది, భూమి, బ్రహ్మఖండములు మూఁడును గలవు. ఇఁక ముద్రింప వలసినవి పాతాళ, సృష్ట్యుత్తరఖండములు మూఁడు. ఈ మూఁడుఖండములు పెద్దవి గావున నొక్కొక్కటి యొక్కొక్కసంపుటముగా ముద్రింపవలసియున్నవి. ఉదారు లగునాంధ్రమహోదయులతోడ్పాటుతో నచిరకాలముననే తక్కినసంపుటములను గూడఁ బ్రకటించి యాంధ్రభాషామతల్లికి సమర్పింపఁగల మని విశ్వసించుచున్నాఁడను.

ఇట్లు
విన్నవించుభాషాసేవకుఁడు,
పిసుపాటి విశ్వేశ్వరశాస్త్రి
ఆంధ్రాధ్యాపకుఁడు - వేంకటగిరి రాజకళాశాల

నెల్లూరు
30-11-1953

శ్రీమహీశూరమహారాజాస్థాన మహావిద్వాన్ కావ్యకళానిధి ఆశుకవికేసరి
విద్యాభూషణ శతావధాని శ్రీమదాంధ్రపద్మపురాణాదిబహుగ్రంథకర్త

బ్ర. శ్రీ. పిసుపాటి చిదంబరశాస్త్రిగారు

జననము  నిర్యాణము

22-2-1892 11-12-1951

మహీశూర మహారాజాస్థాన మహావిద్వాన్ కావ్యకళానిధి
ఆశుకవి కేసరి విద్యాభూషణ శతావధాని
బ్రహ్మశ్రీ పిసుపాటి చిదంబరశాస్త్రి
జీవితచరిత్రసంగ్రహము.

వంశము

ఆంధ్రదేశమున వెలనాటిబ్రాహ్మణశాఖ మిక్కిలి పేరుమోఁగినది. ఇందు గుంటూరుమండలాంతర్గతకరవదిగ్రామవాస్తవ్యులు, శ్రీరామభక్తాగ్రగణ్యులు, సహజకవితావిలసితులు పిసుపాటి పేరుభట్టుగారు సుప్రసిద్ధులు. వీరిపుత్రులు శ్రీరామ రాఘవ లక్ష్మీనారాయణ వేంకటరమణ సీతారామ సుబ్రహ్మణ్యనామధేయులు ఆఱుగురు. వీరిలో నైదవవారగుసీతారామయ్యగారిని వంగవోలుపురవాసులు సహజౌదార్యులు పిసుపాటి చిదంబరముగారికి దత్తపుత్రునిఁగా నొసఁగిరి. సీతా రామయ్యగారికి వంగవోలుతాలూకా పోతవరగ్రామవాస్తవ్యులు పాలపర్తి సుబ్బయ్యగారు తమపుత్రిక యగుకనకాంబ నిచ్చి వివాహముచేసిరి. ఈదంపతులకు శ్రీచిదంబరశాస్త్రిగారు ఖరసంవత్సరమాఘబహుళనవమీసోమవారమునాఁడు (22-2-1892) మాతామహగృహమున జన్మించిరి. శ్రీశాస్త్రిగారిమాతా మహి లింగమ్మ. మేనమామ అచ్యుతరామశాస్త్రి. ధర్మపత్ని అచ్యుతరామశాస్త్రి గారిద్వితీయపుత్రిక యగునలివేణమ్మ.

శ్రీ చిదంబరశాస్త్రిగారికి సుబ్రహ్మణ్యశాస్త్రి, విశ్వేశ్వరశాస్త్రి అనునిరువురు తమ్ములును, కామాక్షమ్మ, వేంకటసుబ్బమ్మ, అన్నపూర్ణమ్మ అనుముగ్గురు చెల్లెండ్రును గలరు. వీరిద్వితీయసోదరి వేంకటసుబ్బమ్మగారికుమారుఁడు-పోతుకుచ్చి సుబ్రహ్మణ్యశాస్త్రి. ఏతత్సోదరభాగినేయులు ముప్వురును వీరియొద్దనే సంస్కృతాంధ్రకావ్యనాటకాలంకారాదిజ్ఞానమును, అవధానకరణశక్తియును, ఉభయ భాషాకవితాపాటవమును సంపాదించియున్నారు. శ్రీశాస్త్రిగారు చక్కనివిమర్శన శక్తి గలవారు. కావుననే పాఠప్రవచనాదిసమయములలో శిష్యులకు సవిమర్శ ముగా విద్యారహస్యముల నెల్ల వివరించి బోధించు చుండెడివారు.

బాల్యము — విద్యాభ్యాసము.

నాలుగేండ్లప్రాయమున శ్రీశాస్త్రిగారు మాతామహగృహమున నుండఁగా నొకసాముద్రికశాస్త్రవేత్త వీరినిఁ జూచి "ఈకుఱ్ఱవాఁడు నిరంతరము రాజసభ లలో విహరించి గొప్పకీర్తి నార్జింపఁ గలఁడు" అని చెప్పినాఁడఁట! ఆయనమాట సర్వవిధముల నిజమైనది. వీరు కరవదిగ్రామమునఁ గరవది రామదాసుపంతులు అనువారియొద్ద బడిచదువు చదివి సంస్కృతవిద్య నభ్యసించునభిలాషతో నిడుమా నూరిలో శ్రీగొల్లపూడి సుబ్బరామశాస్త్రిగారియొద్ద శబ్దమంజరి యొండు రెండు

కావ్యములు చదివి, అటనుండి కుంచవరమున కేఁగి కొన్నాళ్లట నుండి కాళిదాసత్రయము ముగించి పిమ్మట శ్రీచిఱ్ఱావూరి సీతారామశాస్త్రిగారియొద్ద సికింద్రాబాదుపాఠశాలలో నైషధాంతము కావ్యములు పఠించి, తిరుపతి కేఁగి యట శ్రీవేంకటేశ్వరసంస్కృతపాఠశాలలో హర్షచరిత్ర, కాదంబరి, కరిగిరిచంపువు, భారత, రామాయణచంపువులు మున్నగుగ్రంథములు చదువుటయేగాక యసామాన్యమేధాశాలులు విద్వత్కవిప్రవరులు నగుశ్రీనరకంఠీరవశాస్త్రిగారిసాన్నిధ్యమువలన సంస్కృతమున మధురకవితాలాభమును గూడఁ బొందిరి. పైఁగాఁ దర్కవ్యాకరణశాస్త్రాంబుధికృతావగాహులు, అభినవకాళిదాసబిరుదాంకితులు నగు శ్రీశంకరభట్టశాస్త్రిగారితోడిమైత్త్రి వీరిలలితకవితామంజరికి మఱింతపరిమళము చేకూర్చినది. అనారోగ్యకరముగా నుండుటచే నంతతో నాచోటు వదలి గోదావరీమండలములోని యిందుపల్లికిఁ జేరి యచ్చట నేలేశ్వరపురామశాస్త్రిగారియొద్ద శాకుంతల మురారిప్రభృతినాటకములు కువలయానందసాహిత్యదర్పణాద్యలంకారగ్రంథములు చదివి చక్కనిసాహిత్యము నలవఱుచుకొనిరి. అటుపైని వ్యాకరణశాస్త్రము నభ్యసింపఁ దలఁచి ఆగిరిపల్లి కేఁగి యట సంస్కృతపాఠశాలావ్యాకరణోపాధ్యాయులుశ్రీజయంతిభగీరథశాస్త్రిగారియొద్దఁబాణినీయము నధ్యయనించుచు నవకాశ మున్నప్పుడెల్లఁ బాణినీయసాధితము లగుశబ్దవిశేషములు ప్రయోగించుచు సంస్కృతమున మిక్కిలి వేగముగాఁ జక్కనికవన మల్లుచుండిరి. ఆసమయముననే శ్రీవేలూరి శివరామశాస్త్రిగారుగూడ నచట వ్యాకరణశాస్త్రము నధ్యయనించుచుండిరి. శ్రీశివరామశాస్త్రిగారిసాహచర్యమువలన వీరి కాంధ్రగ్రంథపఠనాభినివేశమును, ఆంధ్రకవితాభిలాషయును గలిగినవి. సుప్రసిద్ధవైయాకరణులు కంభంపాటి రామమూర్తిశాస్త్రి, జయంతిసూర్యనారాయణశాస్త్రి, వారణాసి రామబ్రహ్మశాస్త్రిప్రభృతులు వీరి సహాధ్యాయులు. ఒకనాఁడు శ్రీవారణాసి రామబ్రహ్మశాస్త్రిగారు సంస్కృతమున వీరియాశుకవితాశక్తిని బరీక్షింపఁ దలఁచి కాముకీవిరాగులసంభాషణరూప మగునొకశతకమును శుకరంభాసంవాదమువంటి దానిని ఒకదినములో రచింపఁ గోరిరి. వల్లెయని శ్రీశాస్త్రిగా రప్పుడే యారంభించి శతకము వ్రాసి తమగురువులయు సహాధ్యాయులయు సమక్షమున మఱునాఁడు వినిపించి వారిమెప్పుల నందిరి. అందలివి స్థాలీపులాకన్యాయమునఁ గొలఁదిశ్లోకము లుదాహరింతుము.

కాముకీ:- శ్లో. తన్వ్యాస్తు శారదకళానిధిపూర్ణబింబ
న్యక్కారి హాసనదనం వదనం సరాగమ్ ।
యో వా న పశ్యతి త దేకమతిః పురస్తా
ద్ధిక్ తస్య జీవిత మజాగళగ స్తనాభమ్.

విరాగీ:- శ్లో. ఫాలే చ భస్మితమనోభవ మక్షి యస్య
మస్తే కలానిధికలా కమనా విభాతి।
తం యో న పశ్యతి తదేకమనా స్సమాధౌ
ధిక్ తస్య.........................
కాముకీ:- శ్లో. కస్తూరికాతిలకశోభితఫాలభాగాం
గాంగేయరత్నమయభూషణభూషితాంగీమ్।
నో య స్సదా స్మరతి తాం భువి కంబుకంఠీం
ధిక్ తస్య.....................
విరాగీ:- శ్లో. రుద్రాక్షశోభితగళం చ విభూతిపుండ్రై
రాజన్ముఖాంబుజ మమేయచరిత్ర మాద్యమ్।
మృత్యుంజయం స్మరతి యో న హృదా సదాఽపి
ధిక్ తస్య..........................
కాముకీ:- శ్లో. యో వా దృశా ప్రసవబాణగణం సృజంతీం
కాంతాం వహ న్నురసి మూలధనం మమేయమ్।
ఇత్థం వదం స్తదధరోత్థసుధాం న పాతి
ధిక్ తస్య.....................
విరాగీ:- శ్లో. బ్రహ్మస్వరూప మమలం రస మద్వితీయం
పాతుం ప్రయత్న మపి య స్సతరా మకుర్వన్।
మోహేన పాతి వనితోష్ఠరసం విగంధం
ధిక్ తస్య......................

ఇట్లే యీశతక మంతయు మనోహరశైలీభావభాసురమై యున్నది.

అది శ్రీ తిరుపతి వేంకటేశ్వరకవులమధురకవితాస్రవంతి యాంధ్రదేశమునం దెల్లెడల వెల్లివిరియుచున్నకాలము. ఆనాఁడు వారియవధానములు ఆశుకవితాధోరణి సకలాంధ్రజనహృదయములఁ జూఱకొనినవి. అవి చూచియు వినియు ననేకులు కవులు నవధానులును బయలుదేఱిరి. అందు శ్రీ చిదంబరశాస్త్రిగారు నైత మొకరు. అయినను గొనవఱకు ఆకార్యమును సాగించి గడిదేఱినవా రత్యల్పసంఖ్యాకులే. అందును శ్రీ తిరుపతివేంకటకవులు నైతము నేఁగనియాంధ్రేతర మండలములలో (అనఁగాఁ గర్ణాట ద్రావిడ మళయాళ కాశీ దర్భాంగాదిమండలములలో) గూడఁ దమయత్యద్భుతావధానకౌశలమును, ఆశుకవితానైపుణమును బ్రకటించి మహత్తరసత్కారగౌరవముల నంది యాంధ్రదేశమునకును గౌరవము చేకూర్చినవా రొక్క-చిదంబరశాస్త్రిగారే యనుట నిర్వివాదము; తమసతీర్థ్యు లగు

శ్రీ శివరామశాస్త్రిగారప్పుడప్పుడే యవధానములు చేయ నారంభించుటయు శ్రీ శాస్త్రిగారియవధానకరణశక్తిసముపార్జనకు ద్విగుణీకృతోత్సాహము నొసంగినది. ఎట్టికఠినకార్యము నైనను బట్టినపట్టు విడువక సాధించుట శాస్త్రిగారికి జన్మసిద్ధగుణము.

ఆ. పట్టు పట్టరాదు పట్టి విడువరాదు
పట్టెనేని బిగియఁ బట్టవలయుఁ
బట్టి విడుటకంటెఁ బడి చచ్చుటయె మేలు ......

అని కదా వేమనసూక్తి! శ్రీశాస్త్రిగారు తమవ్యాకరణశాస్త్రాధ్యయనము సమాప్తము కాఁగానే యవధానములు చేయ దొరఁకొని మొదటియష్టావధానము తమగురువులసన్నిధిని ఆగిరిపల్లిలోనే 16-2-1910 తేదిని విజయవిలసితముగా నెఱవేర్చి వారియాశీఃపూర్వకాభినందనభాగ్యము నందిరి.

పిమ్మట రాజమహేంద్రవరవాస్తవ్యులు ఆదిభట్ట రామమూర్తిశాస్త్రిగారిశిష్యులు న్యాయవేదాంతమంత్రశాస్త్రనదీష్ణులు నగు శ్రీ చల్లాసూర్యనారాయణశాస్త్రిగారియొద్దఁ దర్కగ్రంథములు చదివిరి. పీఠికాపురాస్థానవేదాంతవిద్వాంసులు "శాస్త్రరత్నాక"రాదిబిరుదాంకితులు శ్రీ దెందుకూరి నరసింహశాస్త్రిగారియొద్ద వేదాంతశాస్త్రము నభ్యసించిరి. వేదాంతశాస్త్ర మనిన వీరికిఁ జిన్నతనమునుండియు మిగుల మక్కువ. కావుననే యందు స్వతంత్రకృషినైతము హెచ్చుగాఁ గావించిరి. గోదావరీమండలమునందలియనాతవరగ్రామవాసులు, మంత్రమూర్తిబిరుదాంకితులు శ్రీ నూఁకల సుబ్రహ్మణ్యశాస్త్రిగారియొద్దఁ బాదుకాంతదీక్షను గైకొని కొంతకాలము నిరంతరము మంత్రదీక్షలతోఁ గడపిరి. ఆసమయముననే మంత్రమహోదధి మంత్రమహార్ణవము శారదాతిలకము పరశురామకల్పసూత్రములు మున్నగుననేకమంత్రశాస్త్రగ్రంథముల నామూలచూడముగాఁ బరిశీలించిరి. కొంతకాలము యోగశాస్త్రమునఁ బరిశ్రమించి యాసనప్రాణాయామధ్యానాద్యష్టాంగములను బాగుగా నభ్యసించిరి. వీరియవధానాభ్యాసమునకు యోగశాస్త్రప్రవేశ మెంతేని యుపయోగించినది. కావుననే మైసూరుమహారాజుసభలో నవధానవిషయము నీవిధముగా నిరూపించి యున్నారు.

శ్లో. చిత్తైకాగ్ర్య మిహావధాన ముదితం దేశే వివిక్తే పునా
రాత్రౌ త త్సమవాప్యతే సుకృతిభిః కాలే తురీయే తథా।
అభ్యాసే సతి దేశకాలనియమోఽప్యాస్తాం నిరస్త స్స్వయం
సైషా యోగవిద శ్చిదంబరకవే రాత్మానుభూతిస్స్మృతిః।

వీ రష్టావధానమునఁ "బుష్పాణాం గణనం పురాణకథన" మిత్యాదిప్రాచీన పద్ధతి కొంత మార్చి యంతకన్నఁ గష్టతమ మగుపద్ధతి నిర్వచించి నిర్వహించి యున్నారు. (చూ. అవధానాదర్శము)

1920 సం॥ ప్రాంతమున ధర్మశాస్త్రవ్యాసంగమునకుఁ బూనుకొని కొంత కాలము తదేకదీక్షతో మను, యాజ్ఞవల్క్య, పరాశరాదిస్మృతులు, తద్వ్యాఖ్యలు, నిర్ణయసింధు, వైద్యనాథదీక్షితీయాదినిబంధనగ్రంథములు సమగ్రముగా నవలోడ నము చేసిరి.

ఆరంభించిన కార్యమును అసమగ్రముగా వదలుట వీరి కనభ్యస్తము. అది గాక కుశాగ్రమువంటివీరి మేధకుఁ జొరరానివిషయమును లేదు. కావుననే యిన్ని విషయములలోను వీరు నిగూఢప్రజ్ఞ నార్జించిరి.

వా ణీ క టా క్ష ము

శ్రీ శాస్త్రిగారి కుపనయన మయినదిమొదలు గాయత్రీమంత్రము జపించు టకై కనులు మూసినంతనే భ్రూమధ్యమున వాణీబీజ మగు "ఐ" అనునక్షరము (దేవనాగరీలిపిలో) గోచరించుచు జపము నాఁపి కనులు దెఱచినతోడనే యంతర్హిత మగుచు నుండెడిదఁట! కొంతకాలమువఱకు వీ రీవిషయమును సరిగా గుర్తింపలేక పోయిరి. కాని మంత్రశాస్త్రజ్ఞానపూర్వకముగా మంత్రపురశ్చరణము లారంభించిన పిదప జన్మాంతరోపాసనాసిద్ధ మగునీబీజస్వరూపము వీరికి బాగుగా గోచరించినది. అయినను వీ రీవిషయమును జిరకాల మెవ్వరికిని దెలుప లేదు. తమయంత్యరచన యగుశ్రీమదాంధ్రపద్మపురాణమున మాత్రము

కం. మనమున కత్యుత్సాహం
బెనయఁగ నాకనులయెదుట నెల్లపుడును ద
ర్శనమిచ్చుచుండువాగ్భవ
మును గొల్తు మదీయపూర్వపుణ్యఫలంబున్.

ఆం. పద్మ. ఆదిఖం. ౧౧.

అని యీరహస్యమును వెల్లడించి యున్నారు. (వాగ్భవము = వాణీబీజ మగు "ఐం" అను నక్షరము.) ఇట్లు వాణీకటాక్షము వీరియందుఁ బ్రసరించియుండు టచేతనే వీరు గద్వాల, కాశీ, శృంగేరి, మున్నగుచోట్లఁ దటస్థించినవివాదముల లోను, పరీక్షలలోను విజయములను జూఱకొనిరి. మఱియును వీరు చిన్నతనమునుండియు నేగ్రంథము వ్రాసినను, ఏసభలో నిలిచినను బరదేవతాస్తుతి వదల లేదు. ఇది వీరికిఁ గలపరమేశ్వరీభక్తికిఁ బ్రబలనిదర్శనము.

దే శా ట న ము - స భ లు

15-2-1910 తేదిని శ్రీవేలూరిశివరామశాస్త్రిగారు ఆగిరిపల్లిలో అష్టావధానము చేసిరి. మఱునాఁడే శ్రీచిదంబరశాస్త్రిగారి మొదటియష్టావధానము ఆగిరిపల్లిలో 16-2-1910 తేదిని జరిగినది. ఆసభలో విజయముతోపాటు గురువుల యాశీర్వాదములు

శ్లో. అస్యాం సభాయాం బుధపూరితాయాం
సమాచర త్యద్య హి లీలయైవ।
యోఽష్టావధానం శతమానుషాణాం
మన్యే వధానం స కరిష్యతీతి.

(వారణాసి సత్యనారాయణశాస్త్రి)

ఇత్యాదిమిత్త్రులప్రశంసలును లభించినవి. 11-9-1910 తేదిని మరల నచటనే యొకయష్టావధానము జరిగినది.

శాస్త్రాధ్యయనము 1911 సంవత్సరాంతమునకు ముగించుకొని చిదంబరశాస్త్రిగారు ఆశుకవితావధానాభ్యాసము నధికముగాఁ జేయఁదొడఁగిరి.

10-3-1912 తేదీని గుడివాడయష్టావధానసభలో

సీ. మొదట సంస్కృతము చెప్పి దయ చూపినసుబ్బ
రామశాస్త్రికి సత్ప్రణామ మొసఁగి
పిదపఁ గావ్యముల నేర్పి ప్రశంసఁ గన్నసీ
తారామశాస్త్రిపాదముల కెఱఁగి
అటుమీఁద నాటకార్భటుల నేర్పినయట్టి
రామశాస్త్రివతంసురాణిఁ గొలిచి
ఆమీఁదఁ బాణినీయమును బోధించిన
గురు భగీరథశాస్త్రివరు నుతించి

గీ. చిన్నినాకైతకన్నెకు వన్నెచిన్నె
లలరఁజేసినకవిచంద్రములఁ దలంచి
సలలితాష్టావధానమ్ము సలుపఁ బూని
నాఁడ దయయుంచు మోగుడివాడతల్లి.

అని గురువందనము గావించిరి. అచ్చటనే 17-3-1912 తేదిని మరల నొక యష్టావధానసభ జరిగినది. పై రెండుసభలలోను సత్కారములు, సభ్యులప్రశంసలు విరివిగా లభించినవి. చలి దీఱినది. ధైర్యము నెలకొనినది. ఈ విషయమును శ్రీచెళ్లపిళ్లవేంకటశాస్త్రిగారికి లేఖమూలమున నిట్లు తెలిపిరి.

చ. జయ మిటఁ గల్గె రెండువరుసల్ సభ చేసితి; భీతిఁ దీఱె; మీ
దయఁ బరమేశ్వరీదయను దన్వితి సభ్యుల వేంకటేశ్వరా
హ్వాయకవివర్య, కార్య మిది యయ్యె; నిఁకన్ జనవచ్చు నంచు నేఁ
బయనముఁ బూనితిన్ విజయవాటికి మీమదిఁ జిత్తగింపుఁడీ.

గుడివాడ 19–3–1912
పరీధావి సం॥ చైత్రశుక్లప్రతిపత్తు

విధేయుఁడు,
పి. చిదంబరశాస్త్రి.

పిమ్మట అమలాపురము మున్నగుతావులలో అష్టావధానములే కాక శతావధానములు గూడఁ జేయ నారంభించిరి.

1913

బాపట్లపురవాసి అష్టావధాని శ్రీ వేమూరి నృసింహశాస్త్రిగారు చిదంబరశాస్త్రిగారి సమస్యాపూరణశక్తిని సాహిత్యపటిమను బరీక్షించుటకై "బభౌ మయూరో లవశేషసింహః" అనునొక క్లిష్టసమస్య నిచ్చి పూరింపఁ గోరిరి. వారీసమస్యను బలువురు శతావధానుల కిచ్చినట్లును దానిని వారు పూరింపలేక వదలినట్లును జెప్పిరి. ఆసమస్యను మనశాస్త్రిగా రిట్లు పూరించి సంస్కృతమున నొక వ్యాఖ్యగూడ వ్రాసి, వినిపించి వారిమెప్పుల నందిరి.

స మ స్యా పూ ర ణ ము

శ్లో. కాం కే ఖగే ఘే జచచే ఛచాఛో
జాఝో ఞటేఠే డఢఢో ణతోఽథ।
దదాం దధానో ను న పాపపోఫః
"బభౌ మయూరో లవశేషసింహః"

ఈసమస్యాపూరణము శ్రీ శాస్త్రిగారియేకాక్షరనిఘంటుపాండిత్యమునకు ద్యోతకము. దీనివ్యాఖ్య "రాజసభావిహారము" నఁ గాంచ నగును. ఈవిధముగా నెట్టికఠినసమస్యల నైనను శ్రీశాస్త్రిగా రవలీలగాఁ బూరించుచుండిరి. 3–12–1913 తేదిని బిక్కవోలుగ్రామమున సుబ్రహ్మణ్యషష్ఠికి జరుగుకవితాసభల కేఁగిరి. ఆనాఁటిసభలో సంస్కృతమున "నలచరిత్రమును" ఆశువుగా రచింపుఁ డని సభ్యులు కోరిరి. అంతఁ బదిమంది పండితకవులు వరుసగా నొక్కొక్కరొక్కొక్కశ్లోకము చెప్ప నారంభించిరి. వేగముగాఁ గవిత సాగనివారిని వదలి తరువాతివారు చెప్పనేర్పాటు కావించుకొనియుండిరి. రెండుమూఁడు వరుసలు తిరుగునప్పటికి శ్రీ చిదంబరశాస్త్రిగారును, శ్రీ పుల్య ఉమామహేశ్వరశాస్త్రిగారును మాత్రమే మిగిలిరి. ఈయిరువురు నొకరికొకరు తీసిపోవక సుమారు నూటయేఁబది శ్లోకములలోఁ గథ యంతయు నాశువుగా రచించిరి. ఆనాఁటియాశువున కచ్చెరువడి

చిక్కవోలుగ్రామకరణము శ్రీ తక్కెళ్లపాటి వేంకటనరసయ్యగారు ప్రోత్సహింపఁగా చిక్కవోలు సుబ్రహ్మణ్య స్వామిచరిత్రమును "సుబ్రహ్మణ్యేశ్వరీయము" అనుపేర నాంధ్రమున నొక ప్రబంధముగా రచించియా దేవునకే శ్రీశాస్త్రిగారు కృతియిచ్చిరి.

పిమ్మట సురభికంపెనివారికోరికపై "శ్రీరామాంజనేయము" మనునాటకమును వ్రాసిరి. ఆనాటకమును సురభికంపెనివారు మొదటఁ బెంటపాడుగ్రామమునఁ బ్రదర్శించి యానాఁడు వచ్చినద్రవ్యము నంతను శ్రీశాస్త్రిగారికి సత్కారపూర్వకముగా నొసఁగిరి. ఆసభలోఁ బలువురుకవులు పలువిధముల శ్రీశాస్త్రిగారికవితను బొగడిరి. మచ్చున కొకటి రెండు

ఉ. చందనపాదపంబునను జక్కనిపూవులు పూయురీతి మే
లుక్కందనమందుఁ దావి యొనగూడినకై వడి పాలలోపలన్
బొందుగఁ బంచదార పడుపోలిక చెర్కునఁ బండు గల్గునా
చందము గాదె నీకుఁ గలసాహితికి న్గవితాచమత్కృతుల్.

చ. చవిఁ గనుపంచితాళికిఁ బ్రశస్తరసాలఫలంబు గాయక
ప్రవరులకున్ సుధాకలితభాండ మఖండదిగంతకీర్తిభృ
త్కవులకుఁ గండచక్కెర యథార్థము సుమ్ము భవత్ప్రణీత మా
నవనవమాధురీమిళితనాటకరాజము శ్రీ చిదంబరా!.

పెంటపాడు. } తిరుమల రాఘవాచార్యులు
కోన రాఘవయ్య

శ్రీ శాస్త్రిగారు వేంకటగిరిసంస్థానమునకు 1914 సంవత్సరమున నేఁగిరి. అప్పటిప్రభువు శ్రీశ్రీ రాజగోపాలకృష్ణయాచేంద్రులు. వీరు మంచిపాండిత్యము విమర్శనశక్తి కలవారు. కావునఁ గవులపాండిత్యమును బరీక్షింపక దర్శనసత్కారములు జరిపెడివారు కారు. అందుచేతనే శ్రీ శాస్త్రిగారు పంపినవిజ్ఞాపనపత్త్రము నందలి "శతవధానంబును సాధింపఁగాఁ జూచి యానంద మొంద నీ కాశ గలదా" అనుదానిలోని "వధాన" శబ్దసాధుత్వమును గూర్చి లేఖమూలమున శాస్త్రిగారిని బ్రశ్నించిరి. దానికి,

క. అవి యని యవ యని వెలసిన
యుపసర్గంబులయ కార మూఁడు నటించున్
బ్రపఠించె భాగురిమహ
ర్షి పాణినిమహర్షి యటులు చెప్పఁడు భూపా.

క. నృపవర ! యవధానపదం
బపిధానపిధానపదములట్టు లకార
వ్యపగత మయ్యును గాకయు
నుపయుక్తం బగుట శాస్త్రయుక్తము సుమ్మా.

అని వీరు సమాధానము వ్రాసి పంపిరి. దానిపై రాజుగారు హ్రస్వాక్షరముపై నర్ధబిందుపూర్వక "క" ప్రాసముతోఁ గందపద్యము చెప్పవలె నని మఱియొక ప్రశ్న పంపిరి. వెంటనే యాశువుగా

క. ఇఁక వినుము భూప! బుధున క
ణఁకువయు, సభకున్ బుధుండు, నమ్మికిఁ బురి, నా
యఁకరము రాజన్యునకుఁ, గొ
లఁకునకు రాయంచయును నలంకారంబుల్.

అని సమాధానము వ్రాసి పంపిరి. దానిపైఁ రాజుగారు గొన్ని సమస్యలు పంపి పూరింపుఁ డని చెప్పిపంపిరి. వానిని శాస్త్రిగారు చక్కఁగాఁ బూరించిరి. వానిలో నొక్కటిమాత్ర ముదాహరింతును. తక్కినవి "రాజసభావిహారము" అనుగ్రంథమునఁ జూడ నగును.

సమస్య:- తురకలు సంధ్య వార్తురఁట తొయ్యలి తోయము లిమ్ము వారికిన్.

చ. ధరణిసురుల్ సమర్థులు స్వధర్మవిధానమునందు, భూజనో
ద్ధరణమునందు ధీరులు, సుధారస మొల్కెడిభాషణంబులన్
గురువులు, క్రోధభార మొనగూడినఁ దిట్టులు దిట్టుపట్టుసన్.

ఈవిధముగా నొకవారము దినములు మహారాజు ప్రశ్నలు పంపుట శాస్త్రి గారు సమాధానము లంపుటయు జరిగినతరువాత మహారాజు శాస్త్రిగారికి దర్శన మిచ్చి గొప్పసత్కారము చేసిరి. అప్పుడు

ఉ. వచ్చితి రాజసత్కృతులవైభవ మొందఁ "దదేవలగ్న" మం
చిచ్చటి కేను ముందుగనె యావు కవిత్వపరీక్ష చేసి వి
ద్వచ్ఛయ మెల్ల మెచ్చెడివిధంబున సత్కృతి చేసినాఁడ వ
భ్యుచ్ఛ్రయసూచకంబుగ నృపోత్తమ! మత్కవితాలతాంగికిన్.

చ. ఇరువదివత్సరంబులకు నించుక న్యూనమ నావయస్సు రా
ట్పరిచయభాగ్య మిట్టితఱిఁ బ్రాప్తము గాఁగలయోగ మబ్బె మా
గిరితనయాకృపామృతము కేవలమే మదుపాత్తశక్తికిన్
గరణము గాని వే ఱొకటి గాదు సుమీ నరపాలచంద్రమా!

అని తమయాశయమును వెల్లడించిరి.

వీరు సందర్శించినసంస్థానములలో మొదటిది వేంకటగిరి. అటుపిమ్మట వదాన్యశేఖరు లగు శ్రీముద్దుకృష్ణయాచేంద్రుల దర్శించి వారిచే సత్కారముల నందిరి. వీరు రచించిన 'శ్రీరామాంజనేయము' అనునాటకమును ముద్దుకృష్ణయాచేంద్రులవా రచ్చు వేయించిరి. శాస్త్రిగారు వారు చూపినయాదరమును

క. వింటివి నాగ్రంథంబులు, కంటివి నాయాశుకావ్యకౌశల్యము నీ
వంటికవీంద్రుఁడు దుర్లభుఁ, డంటివి నీ వెంతరసవిదగ్రణివో నృపా!

క. ఊరును బేరును నిలిపెడి, మీరలు గాకున్న నెవరు మీకంటెను స
త్కారార్హు లనుచు నీతో, సారటు లెక్కించి త్రిప్ప సాగితి వధిపా!

ఇత్యాదిగా వాక్రొనిరి. పిమ్మట సరసాగ్రేసరు లగు రాజా శ్రీచెలికాని జగన్నాథరావుగారియొద్ద 'అష్టావధానము' చేసి సత్కృతుల నందిరి. అది మొదలు తఱచుగ వేంకటగిరిసంస్థానమునకు వీ రేఁగుచుండుట తత్ప్రభువులు వీరిని సత్కరించుచుండుట చాలకాలము సాగినది. 1914 సంవత్సరమున శ్రీరాజగోపాలకృష్ణయాచేంద్రు లారంభించినసత్కారగౌరవములు వీరికుమారులు శ్రీరాజా గోవింద కృష్ణయాచేంద్రులును, వీరిమనుమలు ప్రకృతమహారాజులు నగు శ్రీసర్వజ్ఞకుమార కృష్ణయాచేంద్రులవారును శ్రీశాస్త్రిగారికి సాగించుచునే వచ్చిరి.

పిమ్మట సుప్రసిద్ధాశుకవి శతావధాని శ్రీఅవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారును వీరును గలిసి కొన్నిసభలు కావించిరి. అట్టిసభలలో యాదగిరినృసింహస్వామి దేవాలయమున జరిగినయష్టావధానసభ యొకటి. ఆసభలో నవ్వారివారి యాశుకవితాకౌశలము చిదంబరశాస్త్రిగారియవధాననైపుణము సభ్యుల నానంద వార్ధినిమగ్నులఁ గావించినవి. మఱునాఁడు (22-11-1914) వీ రిరువురును గలిసి యాశుకవితాసభ గావించిరి. ఆసభలో నీయిరువురయాశుకవనములు సమానధాటిలో నడచినవి. ఒకరి నొకరు మీఱ లేకపోయిరి. ఆయత్యద్భుతాశుకవితాసభను సభ్యులే కాక దేవస్థానాధికారులును మిగుల మెచ్చుకొని యీజంటకవులకుఁ జెటి నూటపదాఱులు, పట్టువస్త్రములు సత్కరించిరి. ఆసమయమున అయినాపురము సీతారామశాస్త్రిగా రిచ్చినదుష్కరప్రాసనమస్య.

ఉ. ఆః ఖలుఁ డిట్లు మ మ్మడుగునా? యన కోమహనీయవాక్యపా
థఃఖనులార! నిర్జితసుధామధురోక్తులచేత నామనో
దుఃఖము వాయ దీనితుదిఁ దోఁచుసమస్యను బూర్తి చేయుఁడీ
"దుఃఖము గాదె చక్రనివధూటిరతంబు విదగ్ధకోటికిన్".

దీనిని

ఉ. గీఃఖనసంబు లేల పరికించి వచించెద నొక్కమాట 'జా
రాః ఖలు పాపినో'యని తిరంబుగఁ బల్కెడిఛాందసోక్తులన్
భాఃఖచితోక్తులంబలె మనంబున నెంచకుఁడీ నిరస్తధీ
"దుఃఖము గాదె చక్కనివధూటిరతంబు విదగ్ధకోటికిన్"
అని శ్రీ చిదంబరశాస్త్రిగారు పూరించిరి. దానికి సంతసించి శ్రీసీతారామ
శాస్త్రిగారు

ఉ. ఎన్నఁడు చూడఁ గల్గునో కవీశ్వరవర్గము? నీసమస్య కిం
కెన్నఁడు పూర్తి గల్గునో? మఱెన్నఁడు నామది సంతసిల్లునో?
పన్నగశాయి! యం చతిప్రపన్నత యాదగిరీశు వేఁడ నా
కన్ని లభించె నేఁటికిఁ జిదంబరశాస్త్రికవీంద్ర! నీకృపన్.
అని శాస్త్రిగారిని బొగడిరి.

శాస్త్రిగారును, అవ్వారిసుబ్రహ్మణ్యశాస్త్రిగారును గొలఁదికాలము
మాత్రమే యిట్లు కలిసి సభలు చేయుట ఘటిల్లినది. ఐనను దానివలనఁ జిదంబర
శాస్త్రిగారియాశుకవితాధాటి మిగుల వర్ధిల్లినది.

1915

అటుపిమ్మట యథాపూర్వముగా శ్రీ శాస్త్రిగా రొక్కరే సభాప్రచారము
సాగించుచు నిజాము రాష్ట్రములోనినవాబుపేఁటసంస్థానమున రాక్షససంవత్సరగణపతి
నవరాత్రములలో (15,16-9-1915) పేఁబదియైదుమందికి శతావధాన మొనర్చి
నూటపదార్ల సత్కార మందుకొనిరి. అందలి సమస్యలు ప్రశ్నలు తత్పూరణములు
సమాధానములు పఠితల కత్యంతప్రమోదదాయకములు. వీనినిబట్టి శ్రీశాస్త్రిగా
రప్పటికే యవధానకృత్యమున నెంతగా నాఱితేఱినది వెల్లడి కాఁగలదు.
ఒక మచ్చుతునుక. సమస్య. "మానపూజాపహారః"

శాస్త్రిగారిపూరణము.

శ్లో. సోఽయం రాజా భువి విజయతాం సుస్థిరం రాఘవేంద్రః
క్రీడాకాలే పటుతరబలే దానధారాప్రసంగే।
సంపల్లక్ష్మ్యాం హరిహరపదాంభోరుహద్వంద్వభాగే
కీర్తిశ్యామాకుచయుగతటే "మానపూజాపహారః"

ఈ సమస్యలో నొకచమత్కారము కలదు. దానిని ముందుగా గుర్తింపనిచో
నీసమస్యను సరసముగాఁ బూరించుట యశక్యము. ఐనను శ్రీ శాస్త్రిగా రీసమ
స్యను వినినవెంటనే యిందలికిటుకును గ్రహించి పై రీతిని బూరించిరి. ఆరహస్య మిది.

అంత్యాక్షరముతో మొదటనుండి యొక్కొక్కయక్షరమును గలుపుచు రావలెను. అప్పుడు — మారః, నరః, పూరః, జారః, పరః, హారః— అనునవి యేర్పడును. వీని కనుకూలముగా సమస్యను బూరించుకొనవలెను. ఇప్పుడు పైపూరణ మెంతచక్కగాఁ గావింపఁబడినదో పాఠకులకు విశదము కాఁగలదు.

పిమ్మటఁ గారుమంచిగ్రామమునఁ బుష్పగిరిపీఠాధిపతి శ్రీవిద్యాశంకర భారతీస్వామివారిసన్నిధియం దష్టావధానశతావధానసభలు రెండును నవంబరు నెల 26,27,28 తేదులలోఁ జేసి మిక్కిలిగా సత్కృతు లైరి.

1916

శ్రీ శాస్త్రిగారు జగ్గయ్యపేఁటలోఁ బురజనులయాదరమున శతావధానాష్టావధానాశుకవితాసభలు మూఁడును సామాజికసన్నుతులు మిన్నుముట్ట నెఱవేర్చిరి. ఆశువున వర్ణ్యము "పార్వతీపరిణయగాథ". గంటకు నూటికిఁ బైఁగాఁ బద్యములు చెప్పినారఁట!. అటఁ బలువురు కవీశ్వరులు వీరికవితావైభవమును మిగుల సన్నుతించుచుఁ బలుపద్యములు చెప్పి యున్నారు. మచ్చునకు ముచ్చటగా మూఁడు పద్దెములు.

ఉ. కూర్చెడికూర్పులన్ సుపదగుంభనమున్ గవితాప్రసాదమున్
మార్చెడిమార్పులన్ సరసమంజులకోకిలకాకలీకలా
భ్యర్చిత మైనకంఠముహాయల్ మది కింపు జనింపఁజేసె, మేల్
తేర్చినతేనె మీకవిత దివ్యము భవ్యము నవ్య మై తగున్.

ఉ. ముద్దులు మూటగట్టునుడిపోడిమి గల్గి శతావధానమున్
దిద్దెడి నేర్పు గల్గి గడి దేఱిన మేటికవీంద్రమండలిన్
దద్దయుఁ గీర్తి గాంచినచిదంబరశాస్త్రిశతావధానిగా
రద్దిర! యస్మదాదుల ముదంబుధి ముంచిరి యాశువైఖరిన్.

శతావధాని, సంపన్మూడుంబి, సింగరాచార్యులు.

ఉ. కౌరవశత్రు వైనసరుగాండివముక్తశరాళిపోకడల్
మీఱి, రయంబునన్ మహి గమించెడియాజడివానచిన్కులన్
గేరి, వెసన్ భవద్హృదయగేహమునందు జనించి హృద్యవా
గ్ధోరణి నిర్గమించుపదగుంభితసల్లలితాశువుల్ సభా
స్తారులు మెచ్చ కుందురె చిదంబరశాస్త్రివరేణ్య! యిత్తఱిన్.

కొండపల్లి, లక్ష్మణపెరుమాళ్ళరావు.

అవధానికి సకలశాస్త్రసంప్రదాయపరిజ్ఞాన మత్యావశ్యకము ఈ విషయమును జగ్గయ్యపేఁట, తిరుపతి మున్నగు ప్రదేశములందలియవధానములలో శ్రీశాస్త్రిగారి

కిచ్చినప్రశ్నలు వ్యక్తపఱుచుచున్నవి. జగ్గయ్యపేటశతావధానమునందలిప్రశ్న.

'పరాపశ్యంతీమధ్యమానాం స్థానాని తత్సాక్షీ చ వర్ణ్యాః'

శాస్త్రిగారిసమాధానము.

శ్లో. వృక్షే ష్వాస్తే పర మిహ పరా నిర్వికల్పానుభూతిః
పశ్యంతీ చ ప్రథితభుజగే ష్వస్తి విస్ఫూర్తిభావా।
ఇచ్ఛారూపా పశుషు నితరాం విద్యతే మధ్యమాఽసౌ
తాసాం సాక్షీ కలయతి పర స్సచ్చిదానందరూపః.

తిరుపతిసంస్కృతాష్టావధానమున (3-2-1924) ఛందోభాషణము.

ప్రశ్నః - కా నదీ పాణినేస్తంత్రే?
ఉత్తరమ్ - యూస్త్ర్యాఖ్యౌ తు నదీ స్మృతౌ.
(ప్ర) - గౌతమే కతి మానాని?
(ఉ) - చత్వా ర్యాహు ర్మనీషిణః.

1918

కాకినాడ, వరంగలు, పెద్దాపురసంస్థానము మున్నగుచోట్ల శతావధానాష్టావధానాశుకవితాసభలు విరివిగా జరిగినవి.

1919

దొంతి, గణపురసంస్థానములలో శతావధానసభలు రెండు మహోజ్జ్వలముగా సాగినవి. 2-9-1919 తేదిని దొంతిసంస్థానశతావధానమున "శతచంద్రం నభస్తలమ్" అనుసమస్య నీయఁగా

శ్లో. విధే! పిధేహి శుభ్రాంశు, మద్వ్యేకోఽపి సుదుస్సహః।
కురు ప్రియాసమాశ్లేషే, "శతచంద్రం నభస్తలమ్"

అని మిగుల సరసముగాఁ బూరించిరి. సమస్యాపూరణమున నిట్టిమెలఁకువలు శ్రీశాస్త్రిగారికి వెన్నతోఁ బెట్టినవి.

ఏలూరు, మైలవరము, భువనగిరి మున్నగుపట్టణములలో ననేకాష్టావధాన శతావధానాశుకవితాసభలు చేసి విజయలక్ష్మిబిగికౌఁగిళ్లలో మైమఱచిరి.

1920—నంద్యాల

కవిపండితసమ్మానములు చేయునాంధ్రసంస్థానములలో గద్వాలసంస్థానము మేటి. ఆసంస్థానమునఁ బ్రతివత్సరము మాఘపూర్ణిమకుఁ గవితాపరీక్షలు జరుగును. ఈపరీక్షలలోఁ బాల్గొనుటకై సిద్ధార్థిసంవత్సరమున శ్రీశాస్త్రిగా రేఁగుచుఁ

ద్రోవలో నంద్యాలలో దిగి యొకధనికబ్రాహ్మణగృహస్థు నింటి కేఁగిరి. ఆగేస్తు వీరిని సామాన్యవిప్రునిఁగాఁ దలఁచి యాతిథ్య మీయక నిరాకరించెను. అప్పుడు

చ. అతిథుల నాదరించు టది యట్టుల నుండఁగనిమ్ము; మేదినీ
పతిముకుటీమణీకిరణపాటలితాంఘ్రిసరోరుహాధరీ
కృతకుకవిప్రకాండపరికీలితదుర్మదతుంగశృంగుఁ డ
ద్భుతకవిచంద్రుఁ డం చయిన భోజనముల్ సమకూర్పరాదొకో?

అని యాశువుగా నొకపద్యము చెప్పిరి. కొంతభాషాజ్ఞానము గలయాగృహస్థుఁ డది వినినవెంటనే శ్రీశాస్త్రిగారి నాదరించి షడ్రసోపేతభోజనము పెట్టి నాయపచారము క్షమింపుఁ డని ప్రార్థించెను. కావుననే కదా పెద్దలు "విద్యాబంధు రసౌ విదేశగమనే" అని నొడివి యున్నారు!

గద్వాల సంస్థానము — ప్రథమదర్శనము

అటనుండి గద్వాల కేఁగిరి. మహారాజప్రథమదర్శనమున సభలోఁ దమ విషయ మెల్ల నాశుపద్యధోరణిలో మహారాజునకు విన్నవించిరి. అందుండి రెండు మూఁడుపద్యములు మాత్ర ముదాహరింతును.

ఉ. ఖాండవముల్ ధనంజయముఖంబున వేల్వఁగ నీ సమస్తభూ
మండలముల్ జయింపఁగ సమర్థత పార్థుఁడు దాల్చినట్టు లో
కుండను నేన తాల్తు నధికారము నాశుకవిత్వ మల్ల ను
ద్దండశతావధానము ప్రధానవిధిన్ బొనరింప భూధవా!

ఉ. గంటకు నిన్ని యన్ని యని గట్టిగ నొక్కి వచింప నేల? ని
ష్కంటకరీతి నోరు క్షణకాలము గూడను నాఁగకుండ నొ
క్కంటను దప్పకుండ నొడికంబుగ నే రచియింతు భూప! మీ
వంటిరసజ్ఞు లెల్ల వహవా వహవా యన నాశుపద్యముల్.

ఉ. ప్రాసము దప్పకుండ యతిభంగము వాటిలకుండ నర్థవి
న్యాసము మాఱకుండ గమనమ్ము గణమ్ము తొలంగకుండ ను
ల్లాసముతోడ నాశుకృతులన్ గురియించుచు నుండుపట్టునన్
వ్రాసెద నంచుఁ బూనుకొనువానికిఁ జేసెద శృంగభంగముల్.

మఱునాఁటిసభలో సంస్థానవిద్వాంసు లిచ్చినకఠినసమస్యలు సరసముగాఁ బూరించి వారికి మిగుల సంతసము చేకూర్చిరి. పూర్ణిమనాఁడు హైమవతి యను నొకవేశ్య గానసభ కావించెను. ఆగానమునకు మెచ్చికొని శ్రీచిదంబరశాస్త్రిగారు

ఉ. కమ్మనితేనె లొల్కఁగను గానము చేసితి, వద్ది శ్రోత్రసౌ
ఖ్య మ్మొనగూర్చి యున్నయది; యైనను గొందఱు మెచ్చరేమొ పో
ని మ్మది యెట్టు లుండినను నే నిజమాడెద నీముఖేందుబిం
బమ్మున కీయ వచ్చు శతపద్యము లైనఁ గురంగలోచనా!

అని యొకపద్యము చెప్పిరి. వెంటనే పసపురాటు భుజంగారెడ్డి యనునొకకవి 'రాజసన్నిధిని వేశ్యను వర్ణింతురా' యని శాస్త్రిగారి నాక్షేపించుచు నొకపద్యము నాశువుగాఁ జెప్పెను. దానికి సమాధానముగా శ్రీశాస్త్రిగారు

ఉ. ఈవు భుజంగనామము వహించియు వేశ్యను జేనియొద్ద సం
భావన సేయరా దనుచుఁ బల్కుట భావ్యము గాదు; కాన నీ
భావమునం దొకప్పుడును బణ్యవధూటులఁ జౌక సేయఁగాఁ
బోవక యున్నచో నపుడె పొందెదు పేరికిఁ దగ్గకీర్తిన్.

అని సమయస్ఫూర్తితో సచమత్కారముగా నొకపద్యమును జెప్పిరి. దానిపై భుజంగారెడ్డికవి మఱికొన్ని ప్రసంగములు తెచ్చి యాశుపద్యములు చెప్పుటయును శాస్త్రిగారు వాని కన్నింటికిని సమాధానములు చెప్పుచుఁ దమయాశుకవితాపాటవము నపారముగాఁ బ్రదర్శించిరి. నడుమ నడుమ భుజంగారెడ్డికవి సమాధానము చెప్పుటకై పూనుకొని యాశుకవిత సాగక తడఁబడుచుండఁగా శ్రీశాస్త్రిగారు

క. తడఁబడెద వేల? యాశువు
నుడువుటకై పూనుకొని ఘనుల్ గలసభలోఁ
గుడి యెడమ లేదె? సింహము
కడనా? హరిణములకుప్పిగంతులయాటల్.

సీ. శతవధానవిధానచాకచక్యముఁ జూపఁ
గలరేని రండు వాక్కలహ మేల?
అష్టావధానవిద్యాపాటవముఁ జూపఁ
గలరేని రండు వాక్కలహ మేల?
ఆశుధారాకవిత్వాటోపమును జూపఁ
గలరేని రండు వాక్కలహ మేల?
సంస్కృతాంధ్రగ్రంథసంధానమును జూపఁ
గలరేని రండు వాక్కలహ మేల?

గీ. చతురమతి యగుగద్వాలజనవిభుండు
సాక్షియై యుండ నేతత్సభాంగణమునఁ
దారతమ్యం బెఱుంగక తప్పుదారిఁ
బడినమీగర్వ మెల్లను బాపువాఁడ.

గీ. కవుల మనుగర్వమునఁ గన్ను గానకుండ
నిన్న మొన్నటిదాఁక ననేకగతుల
సంచరించితి రిఁకమీఁద సాగఁబోవు
వచ్చియున్నాఁడు శ్రీచిదంబరుఁడు నేఁడు.

ఇత్యాదిగా హిమవన్నగాగ్రసంపతద్గాంగఝరీవేగధిక్కృతిచణ మగు నాశుకవితావాహిని నతివేలముగాఁ బ్రవహింపఁజేయ ఔచ్చవడినభుజంగారెడ్డి యొకకాగితముపై రెండుపద్యములు వ్రాసి లేచి సభలోఁ బఠించి శ్రీశాస్త్రిగారికి సమర్పించెను. అందుండి యొకటి.

చ. ధరణి శతావధానసువిధానయశోమహనీయ! యోచిదం
బరకవిసార్వభౌమ! పలుభంగులఁ గైత యొనర్తు నంచు సం
బరపడి పైని నీదగునపారకవిత్వమహాప్రభావసా
గరమున కోడి ఔచ్చవడి గౌరవబుద్ధి చెలంగుచుండ నీ
చరణము లంటి మ్రొక్కితిని సైఁపుము నేను భుజంగరాయఁడన్.

ఇట్లు,

సిద్ధార్థిసం. మాఘశుద్ధపూర్ణిమ
గద్వాల

పసపురాటు భుజంగారెడ్డివ్రాలు.

అటుపైని శ్రీశాస్త్రిగారు

క. తరతమభావము నెఱుఁగక, చరియించినకతన నింత జరుగఁగ వలసెన్
గరుణించినాఁడఁ బొమ్మిఁక, ధరణీసురులు క్షణికకోపధారులు వత్సా!

అని వెంటనే ప్రసన్నులైరి.

ఆసభలో జరిగినవిశేషములు కొంతవఱకు సవిస్తరముగా "రాజసభావిహారము"న నవలోకింప నగును. శ్రీశాస్త్రిగారు నాఁటిసభలోఁ గావించినకవితావీరవిహార మవలోకించి యానందింపవలసినదే కాని వర్ణింప నలవి యైనది గాదు. ఆనాఁటిసభలో విజయముతోపాటు "ఆస్థానకవిపదవి" గూడ శ్రీశాస్త్రిగారికి లభించెను. పిమ్మట సకుటుంబముగాఁ గొంతకాల మచ్చటనే నివసించిరి.

బెళగల్లు

ఆసమయముననే గద్వాలమహారాజసోదరుఁ డగు శ్రీ తిరుమలరెడ్డిగారికి బెళగల్లుగ్రామమున వివాహము జరిగినది. దైవము డిన్నె జమీందారు వదాన్యుఁడు సరసాగ్రేసరుఁడు నగు శ్రీరామిరెడ్డిగారు కన్యాదాత. గద్వాలాస్థానకవులు గావున శ్రీశాస్త్రిగారు గూడ వివాహమునకు కేఁగిరి. అప్పట వివాహసమయమున శ్రీశాస్త్రిగారిచే శ్రీరామిరెడ్డిగారియగ్రజులు మైసూరురెడ్డిగారు శతావధానము చేయించి నూటపదాఱులు సేలువలు సత్కరించిరి. అవధానాంతమున నట

శ్రీశాస్త్రిగారి ననేకులు విద్వత్కవులు పద్యములతోఁ బొగడిరి. అందుండి మచ్చునకు రెండు మూఁడు పద్యములు.

ఉ. ధారణ కడ్డు లేదు కవితావిషయంబున లోటు రా దలం
కారము వీడఁబోదు రసకాండము లేఁగ వీఁ కెన్నియో చమ
త్కారము లుల్లసిల్లె నవధానపుదీక్షను మీరు నిల్వ నో
సూరివరేణ్య! మీమహిమ చోద్యము చోద్య మి దెల్లభంగులన్.

గాడేపల్లి, వీరరాఘవశాస్త్రి, శతావధాని.

సీ. ఒక్కచోఁ జక్కెరముక్క లక్కజముగఁ
చేర్చినమాడ్కి సంప్రీతిఁ గొల్పి
ఒకచోట గాంగవీచికలఘుమంఘుమా
ర్భటి తెఱంగున హుటాహుటి ఘటించి
ఒక్కచో మలయానిలోత్ఫుల్లకేతకీ
సౌరభంబట్టులు సౌరు నెఱపి
ఒకచోట మత్తాళినికరఝుంకారంబు
విధమున వీనులవిందుఁ జేసి
గీ. ఒక్కచో ముగ్ధకాంతాసముజ్జ్వలాంగ
మార్దవంబు చందంబున మహిమఁ గూర్చి
తావకశతావధానవిధాన మలరె
సారధుర్య! చిదంబరశాస్త్రివర్య!

గోపాలుని, సుబ్బరామయ్య.

సీ. మందరపర్వతమథితాబ్ధిసంభూత
యాసుధాధార మీయాశుధార
త్రైలోక్యజిత్స్మరధనురుదితేక్షుర
సాంచితధార మీయాశుధార
మందారమంజరీబృందగళన్మరం
దానూనధార మీయాశుధార
ఖచరరాట్పాలితకామధేనుస్తనో
ద్యత్పయోధార మీయాశుధార
గీ. కలితనందనారామమాకందబృంద
సంచరత్కీరచంచూనిశాతహేతి
దళితతత్ఫలానర్గళోద్గళితఫలర
సాభినవధార నిజము మీయాశుధార. బుగ్గ, రామకవి.

పిమ్మట ఆత్మకూరు, వనపర్తి సంస్థానములలో నాశుకవితాసభలు కావించి తత్ప్రభువులసత్కారము లందుకొని కర్ణాటదేశభూషణం బగుమహీశూరపురము నకుఁ బయనించిరి.

మైసూరు సంస్థానము

మైసూరులోఁ దెలుఁగు వచ్చినవారే యరుదు. కావుననే యట శ్రీశాస్త్రి గారిసభ లన్నియును సంస్కృతభాషయందే సాగినవి. మైసూరుపురమున శ్రీశాస్త్రి గారిమొదటిశతావధానము 16-11-1920 తేదిని మహీశూరమహారాజగురుపీఠ మగుపరకాలమఠమున జరిగినది. ఆసభను డాక్టర్, రాధాకుముదముఖర్జీ, ఆర్. శ్యామ శాస్త్రిప్రభృతిసంస్కృతాంగ్లాదిభాషావిశారదులు, సంస్థానవిద్వాంసులు ననేకు లలంకరించియుండిరి. సభాధ్యక్షులు షట్ఛాస్త్రపారంగతులు, అలంకారమణిహారాది మహాగ్రంథకర్తలు, మహారాజగురువులు నగువాగీశబ్రహ్మతంత్రపరకాలస్వామి వారు. ఇట్టిమహావిద్వత్సభలో నెల్లరను శ్రీశాస్త్రిగారు స్వీయశతావధానానంద సాగరమున ముంచి తేల్చిరి. పిమ్మటఁ బ్రాచ్యకోశాలయము (Oriental Library) మున్నగుచోట్ల మఱికొన్ని యవధానములు, ఆశుకవితాసభలు సాగినవి. ఈవిష యము లన్నియు నెప్పటి వప్పుడు "సంపదభ్యుదయ" అనుకర్ణాటకపత్రికలోఁ బ్రకటితము లగుచుండెను.

అవధానము—ఆస్థానమహావిద్వదవీప్రాప్తి

శ్రీశ్రీ కృష్ణరాజఒడయరుమహారాజులకు సంస్థానమున నవధానసభ చేయింపుఁ డని శాస్త్రిగారువిజ్ఞప్తి పంపుకొనిరి. దానిపై మహారాజు 'అష్టావధానసభ' కాజ్ఞ యిచ్చుచు నఱగంటకాల మవకాశ మిచ్చిరి. ఎంతవేగముగాఁ జేసినను రెండుగంటలకాలము నకుఁ దక్కువ పట్టనియష్టావధానసభను అఱగంటలోఁ జేయుట యెటులా యని శ్రీ శాస్త్రిగా రనుమానించిరి. అప్పుడు మైసూరుపురన్యాయవాదియు నాంధ్రుఁడు నగు శ్రీ కే. చంద్రశేఖరయ్యగారు 'సమయము చాల దని మహారాజునకుఁ దెలిపిన యెడల మరల నిట్టియవకాశమే దొరకదు. మహారాజు సంస్కృతభాషాభిజ్ఞుఁడు. కనుక మృదుమధుర మగుమీయాశుకవితాగాంగఝరిలో వారి నోలలాడించి, తన్మయులఁ గావించి గడచినకాలము తెలిసికొనలేకుండునట్లు చేయవలెను. అట్టి శక్తి మీకుఁ గలదు. కావున సంశయింపక వెంటనే మీయంగీకారమును దెలియఁ జేయుఁ' డని చెప్పిరి. ఆప్తమిత్రు లగువారియాలోచనచొప్పుననే శ్రీ శాస్త్రిగారు తమయంగీకారము మహారాజునకుఁ దెలిపిరి. ఆస్థానమహావిద్వాంసులు పృచ్ఛకులై యుండ మహీశూరమహారాజసన్నిధియం "దష్టావధానసభ" 14-12-1920 తేదిని గావింపఁబడినది. అవధానారంభమున నవధానమును గుఱించియు మహారాజును గుఱించియుఁ దమకవితాశక్తిని గుఱించియు నేఁబదిశ్లోకములకుఁ బైఁగా నాశువుగాఁ

జెప్పిరి. మహారాజు ఆమధురకవితామకరందమును గ్రోలుచుఁ దన్మయుఁడై యుండ నవధానము నారంభించి ప్రశ్నముల కన్నింటికిని దగుసమాధానములు సెప్పుచు నడుమ నడుమ రంజకతాభంగము లేకుండ నాశుపద్యములు గుప్పుచు నత్యద్భుత చాకచక్యముతో 1½ గంటకాలములో నవధానమును ముగించిరి. ఆనాఁడు ప్రదర్శించినయాశుకవితావైభవము అవధానవైపుణి కని విని తీరవలసినవే గాని వర్ణింప నలవి యగునవి కావు. "అవధాన మవసిత" మ్మని శ్రీశాస్త్రిగారు తెలుపువఱకును సామాజికు లగువిద్వాంసులును మహారాజును దన్మయు లయియే యుండిరఁట! అనంతరము మహారాజు గడియారము చూచుకొని తా మిచ్చిన కాలముకన్న నొక గంటకాల మధికముగాఁ గడచినను దా మది గుర్తింపలేనియట్లు చేసిన శ్రీశాస్త్రిగారికవితాశక్తికి నవధానవైపుణ్యమునకు నచ్చెరువడి ముక్కుపై వ్రేలు వైచికొని యానాఁటిసభ ముగించిరి. మఱునాఁడు సత్కారసభ జరిగినది. అందు మహారాజు సంస్థానమర్యాద లన్నియును శ్రీశాస్త్రిగారికి జరిగించి, గొప్పపారితోషికము నిచ్చి 1-1-1921 నుండి గౌరవమాసవేతనముతోడి యాస్థానవిద్వత్పదవినిగూడనొసఁగిరి. అంతతోఁ దృప్తి నొందక 1-6-1921 నుండి గౌరవమాసవేతనాభివృద్ధితోఁ గూడిన యాస్థానమహావిద్వత్పదవి, ఆస్థానశతావధానిపదవి నొసఁగి గౌరవించిరి. అది మొదలు శ్రీశాస్త్రిగారికి జీవితాంతమువఱకు గౌరవవేతనము ప్రతిమాసము లభించుచుండెను. 30-10-1924 లో మహారాజు పెట్టించినకవితాపరీక్షకై "మహీశూర రాజ్యాభ్యుదయచంపువు"ను రచించి సంస్థానసత్కారమును బడసిరి. 20-12-1920 తేదిని మైసూరుపురమందిరమునఁ బౌరులు శతావధానసభను జేయించి సువర్ణపదకమును బహూకరించిరి. మైసూరులో నెక్కడ విన్నను గన్నడపుఁబలుకులే గాని మృదుమధుర మగు తెనుఁగుమాట యొకటియుఁ జెవిని బడమి నొకపరి శ్రీశాస్త్రిగారిట్లు చెప్పిరి.

సీ. ఘూాఢబేకులలోన నోడాడి యోడాడి
 హోకుసాకులలోన నలసి సొలసి
బట్టిహోగిరులలోఁ బచరించి పచరించి
 నానునీనులలోన నాని నాని
అల్లియిల్లులలోన సల్లిబిల్లుల నాడి
 హేళికేళులలోన నీఁది యీఁది
నోడుబేడుల్లలోన నూల్కొని నూల్కొని
 యూటమాడులలోన నొదిఁగి యొదిఁగి

గీ. యష్టయిష్టులలోపల నడఁగి యడఁగి
సారునీరులలోపల నూరి యూరి
శ్రుతిపుటంబున కెంతేని హితవు దఱుఁగఁ
బరిచరించితి మహిశూరపురమునందు.

తరువాత నంజనగూడు, శివమగ్గ, తీర్థహాల్లి మున్నగుచోట్ల నాశుకవితాష్టావధానశతావధానసభలు జరిగినవి.

శృంగేరి

పిమ్మట శృంగేరి కేఁగిరి. అచ్చటనాదిశంకరస్థాపిత శ్రీశృంగేరీశారదాపీఠాధిపతి జగద్గురు శ్రీ శ్రీచంద్రశేఖరభారతీస్వామివారిసన్నిధియం దష్టావధానసభ సత్యద్భుతముగా నెఱవేర్చిరి. అందుఁ బృచ్ఛకులు-సర్వశాస్త్రవిశారదు లగు శ్రీస్వామివారు, తదాస్థానవిద్వాంసులును. ఇట్టిమహాపండితసభలో శ్రీశాస్త్రిగారు స్వమతగురుపీఠ మగుటచేఁ దమప్రజ్ఞావిశేషమును బ్రదర్శింపఁ దలఁచి నిషేధాక్షరిలోఁ బ్రత్యక్షరమును ఏకాక్షరమాత్రనిషేధము గాక ద్వైదేసియక్షరములను నిషేధింపఁ గోరిరి. శ్రీవారుగూడఁ బట్టుడలతో నట్లే యని మఱి నలువురు పండితులు తామును గలిసి నిషేధించిరి. ఐనను అవలీలగా నిషేధాక్షరిని శ్రీశాస్త్రిగారు నిర్వహించి శ్రీవారియాశీఃపూర్వకప్రశంసాసత్కారములకుఁ బాత్రు లైరి. శృంగేరీ సత్త్రభోజనకాలమున

శ్లో. కామక్రోధాదయో యేన, యాంతి నామావశేషతామ్ ।
తస్మై జగద్గురో స్సత్త్ర, భోజనాయ నమో నమః.

అని హాస్యరసగర్భితముగా నొకశ్లోకము చెప్పిరి. దేశయాత్రాచరిత్రమునఁ బై సందర్భమున నిట్లు వ్రాసికొనియున్నారు.

శ్లో. తుంగభద్రానదీస్నానం, సత్త్రే రక్తాన్నభోజనమ్।
మఠే స్వాపో మమ ప్రాప్తా, భిక్షుకాణా మివ స్వయమ్.

కాశీ

పిమ్మటఁ గాశీనగరమున కేఁగి యటఁ గాశీమహారాజాస్థానమునఁ గాశీమహావిద్వాంసు లందఱు చేరియున్న మహాసభయం దష్టావధాన మొనరించిరి. అవధానమధ్యమున నొకపండితుఁడు లేచి మీరు సమస్యాపూరణము నాలస్యముగాఁ జేయుచున్నా రని యాక్షేపించెను. దానికి శాస్త్రిగారు అవధానమున ధారణ యుండవలయును. కావునఁ గొంతయాలస్యము కాక మాన దనియు నైనను దాము వేగముగనే చేయుచున్నా మనియును మొదట సరసముగా సమాధాన మిచ్చిరి. దానికిఁ బృచ్ఛకుఁడు నే నింతకన్న శీఘ్రముగా సమస్యాపూరణము, అవధానము

గూడఁ గావింపఁగల నని మరల శాస్త్రిగారి నాక్షేపించెను. దానిపై శాస్త్రిగారికిఁ గోపము వచ్చి యట్లైన నీసమస్యను బూరింపు మని తమకు నవాబుపేటశతావధానమున నిచ్చినదియుఁ దముచేఁ బూరింపఁబడినదియు నగు "మానపూజాపహారః" అనుసమస్య నొసఁగిరి. ఆపండితుఁ డాసమస్యను బూరింప నెంత యత్నించినను మార్గము తెలియక తబ్బిబ్బుపడు చుండెను. ఈలోపల శ్రీ శాస్త్రిగా రవధానము సక్రమముగాఁ బూర్తిచేసి 'మీరు సమస్యను బూరించితిరా' యని యాపండితు నడిగిరి. ఆతఁడు దానికి జంకుచుఁ 'బూరణ మింకను గాలే' దనెను. కొంత సేపటివఱకు నూఱకుండి వెకుకటివలెనే మరల శాస్త్రిగా రాతని నడిగిరి. అప్పు డాతఁడు తప్పులతడక యగునొకపూరణమును జదివెను. ఆమహాసభలో నందలిదోషముల నెల్ల నుద్ఘాటించి నవాబుపేటశతావధానమునఁ దాము గావించినపూరణమును గూడ సభ్యులకు వివరించిరి. అప్పుడు సభ్యులగుధర్మప్రాణ, ద్రావిడలక్ష్మణశాస్త్రి ప్రభృతులు నిండుసభలో శ్రీశాస్త్రిగారిపూరణమును మెచ్చుకొని యాపండితుని పూరణము దోషభూయిష్ఠ మని, సమస్యలోనికిటుకే యాపండితునకుఁ దెలియలే దని స్పష్టముగాఁ జెప్పి యాపండితుని మందలించిరి. అంతటఁ గాశీమహారాజు శ్రీశాస్త్రిగారికి నూటపదార్లు పట్టుసేలువలు సత్కరించిరి. కాశీనగరమున మఱిరెం డాశుకవితాసభలు జరిగినవి.

దర్భాంగ

కాశీమహారాజసభలో విజయము నార్జించి, భారతధర్మమహామండలీ సభాధ్యక్షు లగుదర్భాంగమహారాజ శ్రీశ్రీరమేశ్వరసింహప్రభువులసన్నిధిని మఱియొకయష్టావధానము చేసిరి. అందలిసభ్యులు పలువురు మహామహోపాధ్యాయులు. ఆయవధానమున శాస్త్రిగారు ప్రదర్శించిననైపుణ్యపాండిత్యములకు వారు మిగుల సంతసించిరి. శ్రీమహారాజు పండితప్రేరణమున శ్రీశాస్త్రిగారికి నూటపదార్లతోపాటు "కావ్యకళానిధి" అనుబిరుదమును గూడ నిచ్చి తమయానందమును వెల్లడించిరి.

1922—ముక్త్యాల

ముక్త్యాలజమీందారు ఒక్కదినములో నూఱుపద్యములకుఁ దగ్గకుండ నొక యాశుకావ్యము నిర్మింపఁ గోరిరి. వర్ణ్యము భాగవతప్రసిద్ధ మగు "కపోతకిరాతకథ". శ్రీశాస్త్రిగారు వారు కోరినకావ్యము నొక్కదినములోనే రచించి వినిపించిరి. అందులకు మెచ్చుకొని శ్రీజమీందారుగారు నూటపదార్లు మిక్కిలివిలువగల పట్టువస్త్రములు సత్కరించిరి.

అనంతశయనసంస్థానము

పిమ్మట దసరామహోత్సవములలో వార్షికనియమము ననుసరించి మైసూరు సంస్థానమున కేఁగి యక్కడనుండి తిరువాన్కూరు (అనంతశయన) సంస్థానమున్కు కేఁగిరి. అచ్చటఁ బ్రాచ్యకోశాలయమున మహామహోపాధ్యాయ, తరువై గణపతి శాస్త్రిగారి యాధ్యక్ష్యమున నవధానస్వరూపవివరణోపన్యాసపూర్వకముగా నొక యష్టావధానసభ (2-10-1922) జరిగినది. ఆసభకుఁ బలువురు విద్వాంసులు సంస్థానోద్యోగులు వచ్చి శ్రీశాస్త్రిగారియవధానశక్తికి, ఆశుకవితాధాటికి మిక్కిలి యానందించిరి. పిమ్మటఁ బురజనులయాదరమున (Unian club) 10-10-1922 అష్టావధానసభ జరిగినది. పుర మంతయు నవధానాశుకవితాప్రశంసలతో మాఱు మ్రోఁగినది.

పిదప (12-10-1922) శ్రీమదనంతశయనమహారాజ మహామహిమ శ్రీశ్రీరామవర్మ సన్నిధియం దష్టావధానసభ యతిమనోహరముగా జరిగినది. అడిగినప్రశ్నల కన్నింటికిని జక్కనిసమాధానములు చెప్పఁబడినవి. సభాంతమున నానందతుందిలహృదయారవిందుఁ డగు శ్రీమహారాజు స్వయముగాఁ "కవివీర సింహాకంకణము"తో శ్రీశాస్త్రిగారికరము నలంకరించిరి. మూఁడునూటపదాఱులు సేలువలు బహూకరించిరి. శ్రీగణపతిశాస్త్రిగారిప్రేరణచే ననంతశయనగ్రంథావళీముద్రితగ్రంథముల నెల్ల నొసఁగిరి. పిమ్మట మహారాజ్ఞి మున్నగుమహిళామణులు సంస్కృతభాషాపాండిత్యభూషితలు పలువురు బాలికాపాఠశాలలో నొక యష్టావధానసభ చేయించిరి. అందు స్త్రీలే పృచ్ఛకురాండ్రు. నేఁటికిని కేరళదేశమున సంస్కృతాభిమానము పెల్లుగా నుండుట యెల్లరకును విదితమే. ఈసభలోఁ గేరళదేశపుఁజారును వర్ణింపుఁ డని కోరఁగా శ్రీశాస్త్రిగారు

శ్లో. అ స్తీతి కేచి దమృతం నిగదంతి చంద్రే
కేచి ద్వద న్తి లలనాధరపల్లవేషు।
బ్రూమో వయం సదసి సంప్రతి కేరళీయై
రాకల్పితే సురభిశాల్మరసే మనోజ్ఞే.

అని మిగుల సరసముగా వర్ణించిరి.

శ్రీశాస్త్రిగారిహృదయమును కేరళదేశము తత్రత్యజనవేషములు దేవాలయాదులు మిగుల నాకర్షించినవి. కావుననే దేశయాత్రాచరిత్రమున

శ్లో. కేరళేషు పురశ్చూడాః, పుమాంసః కుక్కుటా ఇవ।
లతా ఇవ ఫలోపేతాః, స్త్రియో విగతకంచుకాః.

శ్లో. దేవాలయానాం సౌభాగ్యం, కేరళే ష్వేవ విశ్రుతమ్।
గోశ్రీరాష్ట్రప్రభూతానాం, ప్రజానాం తపసాం ఫలమ్.
శ్లో. స్నాత్వా నిబద్ధకేశాంతాః ప్రాతర్దేవ్యాలయం గతాః।
దృశ్యంతే కేరళే దేశే, స్త్రియో భక్తిసమన్వితాః.
శ్లో. ఏకైకో హ్రద ఆరామః, కూపః ప్రతిగృహం తథా।
కేరళే పరిదృశ్యంతే, సర్వత్రాఽపి మనోహరాః.
శ్లో. ఆశ్రమా ఇవ లక్ష్యన్తే, మహర్షీణాం పురాతనాః।
విశాలే కేరళే దేశే, సదనాని సమంతతః.
శ్లో. మృదుసంభాషణా దృశ్యాః, స్మితజ్యోత్స్నావృతాననాః।
కృశావలగ్నా స్సుదృశః, కేరళీయా మనోరమాః.
శ్లో. వార్షికీం జన్మవర్ధన్తీం, మద్రాషుం తస్య భూభృతః।
పిష్టప్రవాహై శ్శ్వేతేషు, రాజమార్గే ష్వహం గతః.
శ్లో. అద్భుతః కేరళీయానాం, రాజభక్తిధ్వని శ్శ్రుతః।
తత్రాఽఽస్తే భాగినేయస్య, రాజ్యం దేయ మితి క్రమః.

రాజు వీథిని బోవునపుడు కేరళస్త్రీలు "ఉలూలు" అనుధ్వని చేయుదురఁట! అనర్ఘరాఘవనాటకమున భట్టమురారియు నీయులూలుధ్వనిని వర్ణించియున్నాఁడు. శ్రీశాస్త్రిగారు తాము పర్యటించిన దేశములలోనియాచారాదులు సభావృత్తాంతములు "దేశయాత్రాచరిత్రము"న వర్ణించియున్నారు.

మధుర

23-10-1922 మధురానగరమున "రామనాధగీర్వాణకళాశాల"లో అభినవభట్టబాణ, విద్యావారిధి, ఆర్. కృష్ణమాచార్యులు (M. A.) గారియాధిపత్యమున "అష్టావధానసభ" జరిగినది. అవధానము సభ్యులు మిగుల సన్నుతించిరి. పిమ్మట శ్రీరంగమున శ్రీశంకరాచార్యగురుకులమున నొకయష్టావధానసభ జరిగినది. గురుకులవిద్వాంసులు శ్రీశాస్త్రిగారిని మిగుల వినుతించి సత్కరించిరి.

1923 - బెంగుళూరు

బెంగుళూరిలో "శ్రీసీతారామమందిరము"న నొక యష్టావధానసభ (23-6-1923) జరిగినది. అచ్చటనే 24-6-23 తేదిని ఆశుకవితాసభలో గంటకు నూఱుశ్లోకములు రచియింపఁబడినవి. రామశతకము వర్ణ్యము. దేవాలయాధికారులుచితసత్కృతి చేసినారు. 9-12-1923 ఆర్యధర్మబోధినీసభయం దష్టావధానమొనరించి సువర్ణపదకబహూకృతి నందుకొనిరి. ఈయవధానమున నవధానకృత్యముతో పాటు ఎనిమిది సమస్యలుపూరింపఁబడినవి. ఇం దిది విశేషము. శివగంగామఠమున

నొక యష్టావధానసభ జరిగినది. పిమ్మట ఆర్యధర్మబోధినీసభవారు యోగశాస్త్రోప న్యాసపూర్వక మగుమఱియొకయష్టావధానమును దమసభలోఁ జేయించి సత్కరించిరి. మొత్తము నాలు గష్టావధానసభలు, ఒకయాశుకవితాసభ బెంగుళూరుపురమున మహోజ్జ్వలముగా జరిగినవి.

వ్యాసరాయపీఠము

15-11-1923 సోమలలో శ్రీవ్యాసరాయపీఠాధిపతి, విద్యావారిధి దేశికనామక మధ్వాచార్యసన్నిధానమునం దష్టావధానసభఁ గావించి, తార్కికశిరోమణి యగు శ్రీవారిసత్కారముల నందుకొనిరి. శ్రీవారు అంతతో నాఁగక శ్రీశాస్త్రిగారి "శతావధాన" నైపుణ్యమును గూడఁ బరిశీలింపఁ దలఁచి 21-11-1923 తేదిని "శతావధాన"సభ చేయించి యాశీర్వచనపూర్వకముగా నూటపదాఱు రూప్యములు మిగుల విలువ గలపట్టువస్త్రములు సత్కరించిరి.

"ఆశుకవికేసరి" బిరుదము

అటనుండి గజారణ్యక్షేత్రము దక్షిణకాశి యనుప్రసిద్ధి నొందినతలకాడుపురికి వెడలిరి. అచట 26-11-1923 తేదిని అష్టావధానసభ చేసిరి. 27-11-1923 తేదిని బూర్ణమంగళకామాక్షీదేవీసన్నిధిని దేవాలయాధికారులప్రేరణమున "భార్గవ చరిత్ర" మాశుకావ్యముగా రచింపఁబడినది. హిమవద్గిరిదరీసంప్రవహద్గాంగఝరీ వేగమున నందు గంటకు నూటి కెక్కువగా శ్లోకములు దొరలినవి. ఆయత్యాశు కవిత కచ్చెరువడినవిద్వత్సభ్యు లాసభలో "ఆశుకవికేసరి"యనుబిరుద మిచ్చి శాస్త్రిగారిని సత్కరించిరి. దేవాలయాధికారులు నూటపదార్లు బహూకరించిరి. అచట నొకలోభిని గుఱించి శ్రీశాస్త్రిగారు "దేశయాత్రాచరిత్రము"న

> శ్లో. తతః కశ్చి న్మహైశ్వర్యో, దానమానవివర్జితః।
> నామ్నా శ్యామో గుణై శ్శ్యామో, వర్ణేన శ్యామతాం గతః,
> శ్యామావతార స్సందృష్టః ...

అని వర్ణించి యున్నారు. కవులదృష్టి కెక్కినవారికిఁ గీర్తి యేని యపకీర్తి యేని శాశ్వతముగా నుండును గదా!

1 9 2 4

విక్రమసింహపురమున (నెల్లూరు) "సంస్కృతకళాశాల"లోను "కన్యకాపరమేశ్వరీ దేవ్యాలయము"నను 19,24-1-1924 తేదులలో రెం డష్టావధానసభలు విజయోత్తేజితములుగా జరిగినవి. కన్యకాపరమేశ్వరీదేవ్యాలయమున జరిగినసభకు మహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ, శ్రీవేదము వేంకటరాయశాస్త్రిగారధ్యక్షత వహించిరి.

తి రు ప తి

శ్రీ వేంకటేశ్వరసంస్కృతకళాశాలలో (3-2-1924) జరిగినయష్టావధాన మున శ్రీశాస్త్రిగారు ప్రదర్శించినయాశుకవితావధానకౌశల్యములకుఁ బాండిత్యము నకు మిగుల నానందమును నచ్చెరుపాటును జెందినమహామహోపాధ్యాయ, కళా ప్రపూర్ణ, శ్రీకపిస్థలము దేశికాచార్యులవారు

శ్లో. పండితసదసి చిదంబర, శాస్త్రికృతాష్టావధానేన।
ఆనందాద్భుతసింధ్వో, స్సంభేదే మగ్నమానసా స్సర్వే.

అని యభినందించి యున్నారు. ఈసభ యంతయుఁ గేవలసంస్కృతమున సవి మర్శముగా సాగినది. శ్రీశాస్త్రిగారు పండితవిమర్శల కన్నింటికిఁ దగినసమాధాన ములు చెప్పి వారిని మిగుల సంతసపఱచిరి. అచటనే మఱునాఁడు (4-2-1924) కేవలాంధ్రమున నొకయష్టావధానసభ జరిగినది. అందు సభ్యు లిచ్చినదుష్కర ప్రాసనమస్య. 'ప్రాజ్ఞగమందు శంభుఁడు సుభద్రను గూడఁగఁ బుట్టె గాంధియే' దీనిని శాస్త్రిగారు

ఉ. రుజ్ఞిలయం బినుం డుదయరోచి నెసంగు నెటన్; మతంగజ
త్వఙ్నవవస్త్రు మెవ్వఁడు సదా ధరియించు; మహేంద్రసూతి యే
దృఙ్నలినన్ రమింప నుదయించె ఘనుం డభిమన్యుఁ; డాంగ్లభూ
భుఙ్నివహంబుతో నెదిరి పోర నెవండు జనించె నిద్ధరన్.

అని పూరించిరి. సరిగా నాసమయమునకే కారాగారమునుండి గాంధిమహాత్ముని వదలినట్లు తంత్రీవార్త వచ్చినది. ఈ విచిత్రసంఘటనకు "రవి గాననిచోఁ గవి గాంచునే కదా" యనుచు సామాజికు లత్యంతానందముతో శ్రీశాస్త్రిగారి నభి నందించిరి. అటకు వచ్చినపౌరులే యానాఁటిసభలో శ్రీశాస్త్రిగారికి సత్కారము గావించిరి.

6-2-1924 సరస్వతీవిలాససభలో "ప్రహ్లాదచరిత్రము" ఆంధ్రమున నాశు కావ్యముగా రచింపఁబడినది. గంటకు నూఱుపద్యములకుఁ దగ్గక శరవేగముతోఁ గవిత సాగినది.

10-2-1924 మఱల నొకయాంధ్రాశుకవితాసభ జరిగినది. అందు వర్ణ్యము "రామదాసచరిత్రము", నాఁడు సకలసామాజికహృదయంగమముగాఁ గవితాఝురి ప్రవహించినది. క్షేత్రవాసిబ్రాహ్మణులు చక్కనిసత్కారము గావించిరి. శ్రీనాగ పూఁడి కుప్పుస్వామిగారు (B. A.) పద్యముతోఁ బ్రశంసించిరి.

అలమేలుమంగాపురమున(చిఱుతానూరు)ద్వైతమతస్థాపనాచార్య,ఉత్తరాది మఠాధిపతి, శ్రీసత్యధ్యానతీర్థస్వామిసన్నిధియందు(15-2-1924)"శ్రీపద్మావతీచరి

త్రము''ను సంస్కృతమున నాశుకావ్యముగా రచించిరి. ఒకగంటకాలములో సుమారు నూటముప్పదిశ్లోకములు చెప్పినారఁట! అందలివి రెండు శ్లోకములు.

శ్లో. సత్యధ్యానయతీంద్రసన్నిధి రయం ప్రాజ్ఞా స్సదస్యాః పున
ర్వక్తవ్యం ఘటికాశతం నిరుపమం వృత్తం నవత్వాస్పదమ్ ।
సోఽయం సాంప్రతికో మహా నవసరః ప్రాప్తః కవిత్వప్రదే!
మాతః! పద్మవతి!త్వదీయకరుణాపీయూషధారాగ తేః.

శ్లో. లేఖకాః పంచ విద్యంతే, పంచబాహుబలాన్వితాః ।
పంచాననో యథాఽహం స్యాం, తథా దేవి! ప్రసీద మే.

16-2-1924 అచ్చటనే ''అష్టావధాన''సభ కూడ జరిగినది. శ్రీవారి యాశీఃప్రశంసాపూర్వకసత్కారముల నందుకొని యటనుండి 1-3-1924 నాఁటికి గద్వాలసంస్థానమునకుఁ జేరిరి.

గద్వాలసంస్థానము—[ద్వితీయసందర్శనము]

అక్కడ మహారాజసభలో శ్రీశాస్త్రిగారు

సీ. మహిశూరరాష్ట్రక్ష్మాపాలునాస్థాన
మందు విద్వత్పదం బధిగమించి
దర్భాంగభూపాలుదర్బారులోపలఁ
గావ్యకళానిధిఖ్యాతి గాంచి
వారణాసీరాజవరునిసన్నిధియందుఁ
గవిసింహ మనెడిగౌరవము నొంది
తిరువానుకూరుధాత్రీనాధుసభలోనఁ
గవిపీఠసింహకంకణము వడసి

గీ. శృంగగిరిపీఠపతిబహూకృతి గ్రహించి
యంది పరకాలపీఠనాయకుని కాన్క
వ్యాసరాయపీఠాధీంద్రునాదృతి గొని
యరుగుదెంచితి మరల నీదరికి భూప!

అని యాత్మవృత్తాంత మాశుకవితాధోరణిలోఁ జెప్పఁగా విని మహారాజు పరమానందభరితుఁడై ''చిదంబరకవీంద్రులరాకచే — నాలుగుసంవత్సరములకు — మరల మాదర్బారుకుఁ గళ వచ్చినది'' అని నిండుసభలో శ్రీశాస్త్రిగారిని నుతించి మిగుల గౌరవించెను.

1920 సం. లో శ్రీశాస్త్రిగారియాశుకవితామృతము నాకంఠముగఁ గ్రోలియున్నవాఁడు గద్వాలమహారాజు. కావుననే యానాఁ డంతగౌరవము చేసినాఁడు.

కాని, ఆగౌరవము సంస్థానోన్నతోద్యోగి యగుశ్రీ ఆదిపూడి ప్రభాకర
రావుగారి కసూయాజనక మైనది. అందుచే వా రెట్లేని శ్రీ శాస్త్రిగారి కవ
మానము ఘటిల్లఁజేసి మహారాజునకు వారిపైఁ గలగౌరవము తొలఁగింపవలె నని
నిశ్చయించుకొని యవకాశము దొరకినపు డెల్ల శాస్త్రిగారిపై నున్నవి లేనివి
దోషములు కల్పించి మహారాజునకు బోధించు చుండిరి. మఱియు శ్రీ రావుగారు
సరిగా నాసమయమునకే యటకు వచ్చినయున్న శ్రీ ఉపద్రష్ట సుబ్రహ్మణ్యశాస్త్రి
గారిచే రహస్యముగా నతికఠినము లగుపదునాఱు ప్రశ్నలు సంఘటనచేయించి
యుంచుకొని కవితాపరీక్ష యనుపేర మహారాజుసమ్మతి వడసి హఠాత్తుగా నొక
నాఁటిసభలో "నేఁడు కవితాపరీక్ష జరుగును. అందుఁ బాల్గొన్నవారికే యీ
యేఁడు సత్కారము జరుగును. శతావధానులు సైతమీప్రశ్నలకు సమాధాన
ములు వ్రాయవలెను. ఇది మహారాజు సెలవు" అని ప్రకటించి యాప్రశ్నపత్త్ర
ముల నొసఁగెను. ఈకఠినపరీక్ష శ్రీ చిదంబరశాస్త్రిగారిమీఁది ద్వేషముచే
వారికొఱకే కల్పింపఁబడిన దని యెల్లరకును దెలిసినను, పరిస్థితి యందఱును సమా
ధానములు వ్రాయవలసినట్లే యేర్పడినది. ఐనను ఆ ప్రశ్నలలో నొకదానికి
మాత్రమే కొందఱు సమాధానము వ్రాసిరి. మఱికొందఱు రెండింటికి, ఇంకను
గొందఱు మూఁడింటికి మాత్రమే బదులు వ్రాసిరి. వేఱొకకొంద ఱొక్కదానికిఁ
గూడ సమాధానము వ్రాయకయే విడిచిపెట్టిరి. చిదంబరశాస్త్రిగారు మాత్రము
వారికి సహజ మగుపట్టుదలతోఁ బదునాఱు ప్రశ్నలకును జక్కనిసమాధానములు
నియమితకాలమున వ్రాసి యుత్తమసమ్మానమును స్వీకరించిరి. ఈప్రశ్నలు
తత్సమాధానములు నవధానసంగ్రహమునఁ బ్రకటింపఁబడును. ఈపరీక్షనాఁటికి
మహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ, వేదము వేంకటరాయశాస్త్రిగారు గూడ
గద్వాలలో నున్నారఁట!.

కవితాపరీక్షలో శ్రీశాస్త్రిగారి కవమానము ఘటింప నెంచి విఫలప్రయత్ను
లైనప్రభాకరరావుగారు సంపూర్ణశతావధానము చేయించి యందుఁ బరాభ
వింపఁ దలఁచి ధారణకు వీలుపడనిరీతిని నూఱు ప్రశ్నలు సంఘటించి యుంచి మహా
రాజుచేత శాస్త్రిగారికి "శతావధానము చేసి సత్కారములు గైకొనుఁ" డని
చెప్పించెను. అందులకుఁ గవికేసరి యగుశ్రీశాస్త్రిగా రించుకయు సంశయింపక
"వల్లె" యనిరి. వెంటనే 20-4-1924 పగలు 10 గంటలకు "శతావధాన"
మారంభ మగు నని ప్రకటించిరి. ఆనాఁడు సభ్యులు శాస్త్రిగారును సమయము
నకు వచ్చిరి. కాని, మహారాజు నిద్రించుచుండెను. వా రెప్పుడు మేలుకొందురా
యని యందఱు కనిపెట్టుకొని యుండిరి. మధ్యాహ్నము 2 గంటలకు మహారాజు
మేలుకొనెను. తఱచుగా రాత్రి దర్బారు సాగించుట పగలు చాలసేపటివఱకు నిద్రిం

చుట వీరికిఁ బరిపాటి. వెంటనే పరిచారకులు "10 గంటలనుండి శతావధానిగారు సభ్యులు తమకొఱకు నిరీక్షించుచున్నా"రని విన్నవించిరి. వేగముగాఁ గాల్య కృత్యములు నెఱవేర్చికొని మహారాజు సభకు వచ్చి "అవధానము నారంభింపుఁ" డని సెలవిచ్చెను. అప్పటికిఁ బగలు మూఁడుగంట లైనది. అయినను వెడలిపోవక యెనుబదినలుగురు సభ్యులుమాత్రము నిలిచిరి. అప్పుడు శ్రీప్రభాకరరావుగారు తాను సిద్ధపఱచియుంచినప్రశ్నపత్రములను (84) బృచ్ఛకుల కొసఁగి వారితో "మేము వ్రాసియిచ్చిన ప్రశ్నలనే కాని మీాయిష్టము వచ్చినప్రశ్నముల నడుగ వీలు లే" దని చెప్పి - అవధానిగారితో "ఇతరశతావధానులవలె మీారును మూఁడు దినములలో నవధానము చేయ వీలు లేదు. దినమునకు 12 గంటలచొ. రెండు దినములలోనే శతావధానము ముగింప వలె"నని చెప్పిరి. వైరికల్పితము లగు నెట్టికష్టముల కైన నోర్చి శతావధానము చేసి శత్రుజయముతోపాటు విజయలక్ష్మిని జేపట్టవలయు ననుపట్టుదలతో నున్నశ్రీశాస్త్రిగారు రావుగారి మాటకు "వల్లె" యని యవధానకృత్య మారంభించిరి. ఈ విధముగాఁ బగలు మూఁడుగంటల కారంభించినయవధానము రాత్రి మూఁడుగంటలవఱకును జరిగినది.

అప్పటికి శాస్త్రిగారు ప్రథమపాదము ముగించి ద్వితీయపాదమున డెబ్బది పాదములు చెప్పిరి. ఇఁకఁ బదునాలుగుపాదములు చెప్పిన ద్వితీయపాదముసైతము ముగియును. అప్పుడు ప్రభాకరరావుగారు "శాస్త్రిగా రవలీలగా నవధానము ముగించి మహారాజసత్కృతులు వడయఁ గలరు. దానికి విఘాతము గలిగించుట కింతకన్న నవకాశము దొరక" దని తలఁచి లేచి శ్రీశాస్త్రిగారితో ని ట్లనెను. "అయ్యా, ఇప్పటి కవధాన మారంభమై పండ్రెండుగంట లైనది. మీా రెనుబది నాలుగు ప్రశ్నలకు సమగ్రముగా రెండుపాదములు ముగింపలేదు. ఇంకను 14 పాద ములు మిగిలి యున్నవి. కావున నియమితకాలమున మీా రవధానము చేయలేక యోడిపోయినారు" అని పలికెను. ఏకాగ్రమనోనిష్ఠాగరిష్ఠులై మహాయోగివలె నున్నశతావధానిగారి కామాట మిగులఁ గోపకారణ మైనది. ఐనను వీరితో మాటాడుట నిష్ప్రయోజన మని తలఁచి మహారాజును బిలిపించి యిట్లు పలికిరి. "మహారాజా! ప్రభువు పక్షపాతరహితుఁడై న్యాయాన్యాయములు చక్కఁగాఁ బరిశీలించి న్యాయనిర్ణయము కావింపవలె నని వేదశాస్త్రములు ఘోషించు చున్నవి. కావున నాపలుకుపలుకులను శ్రద్ధతో విని న్యాయము నిర్ణయింపుఁడు. తమసంస్థానమున నెందఱో మహాకవు లవధానములు చేసి యున్నారు. ఆయవధాన ములు తమరు చూచి యున్నారు. శ్రీ తిరుపతివేంకటేశ్వరకవులు మొద. లీనాఁటి దనుక నవధాను లెల్లరు దినమునకు 8 గంటలచొప్పున మూఁడు దినములలో (అనఁగా 24 గంటలలో) సంపూర్ణశతావధానము గావించు చున్నారు. అందును

మొదటిదినమున మొదటిపాదము చెప్పవలెను. నేటివఱకు మొదటిదినముననే ప్రథమద్వితీయపాదములు రెండును జెప్పినవారు -నేను దప్ప- మఱియెవ్వరును లేరు. అది యట్లుండనిండు. అవధానారంభమున నిండుసభలోఁ దమసమక్షమున శ్రీప్రభాకరరావుగారు దినమునకుఁ బండ్రెండు గంటలచొప్పున రెండుదినములలో (అనఁగా 24 గం. లో) నవధానము ముగింపవలె నని మాత్రమే చెప్పియున్నారు గాని మొదటిదినముననే ప్రథమద్వితీయపాదములు పూర్తిగాఁ జెప్పవలయు నని చెప్పలేదుగదా! దానికి సభ్యులు తమరును సాక్షులే. ఇఁక నేటినాయవధానమున రెండవపాదమున 14 పాదములు మాత్రము మిగిలి యున్నవి. ఇవియును మూఁడు నాలుగు పాదములును రేపు నియమితకాలము దాఁటకుండఁగనే చెప్పి ముగింతును. అది మీకు సమ్మతము గాదేని యిప్పుడే యొకయఱగంట కాల మవకాశ మిచ్చినచో నీపదునాల్గుపాదములు గూడఁ బూరింతును. రేపటి పండ్రెండుగంటలలో నీయఱగంటకాలము తగ్గించుకొనవచ్చును.

మఱియొక్క మాట. మొదటిపాదమున నవధాని నూఱువిషయములును ధారణ కనుకూల మగురీతిలో నమర్చుకొనుటయుఁ బ్రశ్నలకు సమాధానము లె ట్లెట్లు చెప్పవలయునో నిర్ణయించుకొనుటయు నత్యవసరము. అందుచేత నే యవధానమున మొదటిపాదమునకు హెచ్చుకాలము పట్టును. ఇది యవధానరహస్యము. కావుననే మొదటిదినమున నవధాను లందఱును మొదటిపాదముమాత్రమే చెప్పుదురు. అదిగాక దానివలన మఱునాఁటిసభాప్రారంభకాలమువఱకుఁ దాను జెప్పినప్రథమపాదమును గట్టిపఱచుకొనుటకు నితరపాదముల నాలోచించుకొనుటకును నవధాని కవకాశము దొరకును. ఇఁక నాయవధానము నెట్లైని భగ్న మొనరింపఁ దలఁచి ప్రభాకరరావుగారు మూఁడుదినములను రెండుదినములకుఁ గుంచించిరి. ఐనను మదుపాస్య యగుపరమేశ్వరిపై భారము వైచి నే నీకార్యము నిర్వహింపఁ బూనుకొని యింతవఱకు సక్రమముగా నెఱవేర్చితిని. రేపటిసభలోఁ దక్కినవి గూడఁ బూరింపఁగలను. ఇం కొక్కమాట. ఈనాఁటిసభ పగలు పది గంటల కారంభ మగు నని నేను దొమ్మిదిగంటలకే భుజించి వచ్చితిని. ఇప్పుడు రాత్రి నాలుగుగంట లైనది. ఆహారమూ లేదు సమయమూ నిద్రాసమయము. చెప్పునదియూ కవిత. చేయునదియూ యవధానము. ఐనను అన్నింటికి నోర్చి నే నీకార్యము సక్రమముగా సాగించితిని.

ఇది ధార్మికసంస్థానము. ధర్మపరిపాలకుఁడు శ్రీకేశవస్వామి. ఈవిషయము ప్రభువులు మనమునం దుంచుకొని వ్యవహరింపఁ గోరుచున్నాను. ఇటుపైని మహారాజుచిత్తము'' అని. పిమ్మట మహారాజు ఈపని యంతయుఁ బ్రభాకరరావు గారిపై నుంపఁబడినది. వారితోఁ [illegible] చాలించిరి.

శాస్త్రిగారు పారము దినములవఱకు సభాసమాధానములకై నిరీక్షించినను మహారాజెట్టి సమాధానమును బంపనందున నిఁక సభ చేయింప రని నిశ్చయించుకొని కొందఱు సభ్యులతో శ్రీ కేశవస్వామి దేవాలయమున కేఁగి యచ్చటనే తక్కిన పాదము లన్నియును జెప్పి శ్రీ కేశవస్వామిసన్నిధియం దెనుబదినాలుగు పద్యములు నొప్పగించి స్వామికిఁ గర్పూరహారతి యిచ్చుచు నాశువుగా

ఉ. ఏమి వచించిరో కుజను? లే మని తా గ్రహియించెనో? మ తే
మేమి తటస్థ మైనదియొ? యే గ్రహచారము సంభవించెనో?
భూమితలాధినేత వినఁ బూనని హేతువుచేతఁ గేశవ
స్వామి! శతావధానకృతి సర్వము నీకడ నొప్పగించితిన్.

క. తెలిసికొని గుణము దోషము
ఖలులను శిక్షించునీవె కాక మ ఱెవ్వం
డిలలో ధర్మము నిలుపం
గలవాఁడు గలండు తెలుపఁగా వలెనె? హరీ!

అని రెండుపద్యములు చెప్పిరి. పిమ్మట రాజుగారికిఁ బద్యములతో నొక రిజిష్టరు లేఖ వ్రాసిరి.

రి జి ష్ట రు లే ఖ

క. నే నొనరించెడిమనవిని
వీనులకుం దెచ్చికొమ్ము విని రోషమ్మున్
బూనకు మిది ధార్మికసం
స్థానం బగుటను వచింపఁ దలఁచితి భూపా!

క. ఎనుబదినాలుగుప్రశ్నల
కనర్గళప్రతిభతోడ నవధానంబున్
బొనరించితి నసమయమున
ననుసంగతి నీకుఁ దెలియుదా? జననాథా!

క. సమయము రాతిరి, కార్య
క్రమమా యొకపట్టునందు కాఁదగినది, యీ
సమయములకు లోఁబడి నా
సమర్థతను జూప మెచ్చఁజనదే భూపా!

ఆ. పగలు మూఁడుగంట లగుసమయ నారంభ
మవల మూఁడుగంట లగుడు రేయి
నంత మిట్లు లెవ్వఁ డవధాన మొనరించెఁ
జెప్పుమయ్య! నీవె క్షితితలేంద్ర!

ఉ. ఇచ్చినప్రశ్న లెట్టివో? వహించిన కార్యభరం బదెట్టిదో?
యిచ్చిన కాల మెంతో? వచియించిన దెంతో? గ్రహించికొమ్ము నే
నిచ్చుటఁ జేసినట్టు లెవఁ డేనియు నొక్కదినంబునందె వి
ద్వచ్ఛయ మౌననన్ శతవధానము చేసెనె? మేదినీశ్వరా!

క. ధారణకు భంగ మొదవెడు
తీరునఁ బ్రశ్నంబు లేఁగుదెంచినను మహా
ధీరతతోఁ గావించిన
పూరణమున కెవఁడు ముదము పొందఁడు భూపా!

ఉ. శత్రుజనంబు చుట్టుకొని సంభ్రమమున్ గలిగించుచుండ నే
మాత్రముగూడ జంకక సమర్థతతోడ శతావధానమున్
ఛాత్రులు మెచ్చఁ దావకసభాస్థలిఁ జేసితి నన్నసంగతిన్
నేత్రము లున్నవారు గమనింపక పోవరు మేదినీశ్వరా!

ఉ. నే నొకరుండ నిల్చి ధరణీతలవల్లభ! నీసంభాగణ
స్థానములోపలన్ శతవధానము చేసితి నన్నదాని కీ
మానవు లెల్ల సాక్షులు క్షమాపతి! నీవు నిజంబు పల్కు మే
దైనను లోప మిందుఁ గల దంచు నెడందఁ దోఁచె నేనియున్.

క. వ్యాకరణదోష మున్నదొ?
వైకల్యము ధారణకును వచ్చెనొ? లేదా
చేకుఱెనో లోటు కైతకు?
నేకడఁ జూపెదవు లోప మీవు? నృపాలా!

ఉ. ఓ న మ యంచుఁ జెప్పికొను చుండెడివాఁ డెవఁడో వచింప నీ
మానసమందుఁ బెట్టికొని మా కెటులేని పరాభవంబు సం
ధానము చేయ నెంచితివి; దైవము లేదొకొ సాక్షి; యాతఁ డె
వ్వానికిఁ జేయ నెంచెనో యెవం డెఱుఁగున్ ధరణీతలాధిపా!

ఉ. మూలలయందుఁ జేరికొని మూల్గుచు నుండెడివారిమాటలన్
జాలఁగ విశ్వసించుట రసాతలవల్లభు లైనవారికిన్
మే లొనగూర్పఁగాఁ గలుగునే? యిది మెత్తురె లోకులెల్ల? నీ
గోలలతోడ నేమి పని? కూర్పుము నేర్పున నేఁడె సత్సభన్.

ఉ. ఆసభలోపలన్ రసికు లైనమహాజను లెల్ల విద్వదు
ల్లాసముఁ గొల్పువాఙ్మయవిలాసము లొల్క శతావధానమున్
జేసితి నందురో మఱియుఁ జేయఁగ లే దని యందురో సము
ల్లాసముతోడఁ గన్గొనుము వాలంతికులమాటలు నమ్మఁ జెల్లునే?

చ. రసికత గల్గినట్టికవిరాజులు మెచ్చ శతావధాన మిం
పెసఁగ నొనర్చినందులకు నెల్లరు సంతసిలన్ బహూకృతిన్
వెస నొనరించి కీరితిని నిల్పుము దిక్తటులందు భూప! నీ
రసులు వచించుమాట విని రాణకు లోపము చేయఁబోకుమా.

క. గద్వాలరాజ్య మనఁగను
విద్వాంసులపూజకొఱకె వెలసె ననుచు భూ
భృద్వర! జను లాడుదు రా
సద్వార్తను దగదె నీకు సంరక్షింపన్.

క. సుకవిని సమ్మానించుట
సకలమునకు గౌరవంబు సలుపుటయె సుమీ
సుకవిని ననాదరించుట
సకలమున కనాదరంబు సలుపుటయె నృపా!

క. నే నర్థి నగుచు నెవనిన్
భూనాయక! వేఁడికొనఁగఁ బోయెడివాఁడన్
గాను సుమీ నావిద్యను
గానఁబఱచి ప్రతిఫలంబు గైకొను చుందున్.

చ. గొడవల కేమి నేను సభఁ గూర్చెడివాఁడను గా నటంచు నీ
యెడలను బట్టు పట్టునెడ నీవు మదీయవధానవృత్తమున్
విడువక చెన్నకేశవునివీనులకున్ వినిపించి నేను నీ
గడియెనె మాట గట్టుకొని క్ష్మావర! కాలికి బుద్ధి చెప్పెదన్.

ఈరిజిష్టరులేఖ శ్రీరాజుగారు చదివించుకొని మిగుల నాగ్రహపడుచుండి రనియును మీరు వెంటనే యిటనుండి వెడలి పోవకున్న గొప్పచిక్కు కలుగు ననియును రాజహితుఁడు వయోగుణవృద్ధుఁడు విద్వత్పక్షపాతియు నగు నమరవాయి తిమ్మారెడ్డిగారు చెప్పిన వెంటనే శ్రీకేశవస్వామిసన్నిధి కేఁగి

సీ. విద్వత్కవుల గౌరవించెడిప్రభు వంచు
నెంచి సన్నిధి కేఁగుదెంచుటయును
తాను జేసిననిబంధనలకు లోఁబడి
శతవధానంబును జలుపుటయును
అవధానమునఁ జెప్పినట్టిపద్యంబులు
విని మెచ్చి మనవి గావించుటయును
చేసినమనవికిఁ జెవి యొగ్గమిం జేసి
న్యాయ్యరీతిని లేఖ వ్రాయుటయును

గీ. తప్పులుగఁ దోఁచెనో యేమొ ధరణిపతికిఁ
గానిచో నాగ్రహం బేల కలుగవలయుఁ
దప్పులో యొప్పులో విప్పి చెప్పుమయ్య
సర్వసాక్షివి కేశవస్వామి! నీవు.

క. సెలవీయు మింక నేఁగెదఁ
దెలుపంగాఁ దగినయట్టి దేవుఁడ వగుటన్
దెలిపితి నీకడ నంతయు
ఫల మీయఁగ దేవ! నీదె భారము సుమ్మా.

అని విన్నవించి శతావధానిగారు గద్వాలనుండి బయలుదేఱి యాదోని కేఁగిరి.

శాస్త్రిగారు వెడలిపోయిననాఁడే మహారాజునకు సన్నిపాతజ్వర మారంభమైనదఁట! ఎన్నియో వైద్యములు చేయించిరఁట! ముడుపులు గట్టిరఁట! ఏమి చేసినను జ్వరము తగ్గలేదఁట! చివరకు 26–5–1924 తేదిని గద్వాలమహారాజు శ్రీసీతారామభూపాలుఁడు స్వర్గస్థుఁ డైనాఁడఁట! శ్రీ శాస్త్రిగారు దేశయాత్రాచరిత్రమున నీసందర్భమున నిట్లు వ్రాసి యున్నారు.

శ్లో. అమోఘవాగ్బ్రహ్మమనః, క్లేశసంజననేన వా।
దైవశాపేన వా కర్మ, పరిపాకేన వా పునః.
సన్నిపాతజ్వరాక్రాంత, స్తదారభ్య మహీపతిః।
ఏకమాసాంతరే కాలే, కాలధర్మ ముపాగతః.

ఆదోని - హైమవతీవిలాసరచన

పిమ్మట నాదోనిలో శతావధానాష్టావధానసభలు మేనెల 10, 11, 12 తేదులలో సత్కారమేదురములుగా సాగినవి. 14 తేదిని బదినేహాలుగ్రామమున శతావధానసభ యద్భుతముగా జరిగినది. పలువురు కవులు శాస్త్రిగారి యవధాననైపుణ్యమును బద్యములలోఁ బ్రశంసించిరి. శ్రీబదినేహాలు తమ్మిరెడ్డిగారు బంగారుగొలుసుతోడిసువర్ణపతకమును నూటపదాఱులును సత్కరించిరి. పిమ్మట రెడ్డిగారి ప్రేరణచే "హైమవతీవిలాస" మనుమూఁడాశ్వాసములమృదుమధురప్రబంధము నొకనెలదినములలో వ్రాసి శ్రీ మల్లికార్జునస్వామికిఁ గృతియిచ్చి శ్రీతమ్మిరెడ్డిగారి సభక్తికసత్కారములకు భాజనమైరి. ఆగ్రంథము వెంటనే యచ్చువేయించి రెడ్డిగారు శాస్త్రిపాదులకు సమర్పించిరి.

పీఠికాపురసంస్థానము - సంపూర్ణశతావధానము

పిమ్మట రక్తాక్షి శారదనవరాత్రములకు శ్రీశాస్త్రిగారు పీఠికాపురసంస్థానమున కేఁగిరి. అట మహారాజునకుఁ బంపినవిజ్ఞాపనపత్త్రమునందలి రెండు మచ్చుతునకలు.

సీ. సంస్కృతాంధ్రప్రజ్ఞ చాలకుండఁగఁ గైత
 చెప్పెడికవులలోఁ జేరఁబోను
కవితారసామృతగ్రహణయోగ్యత లేక
 యుండువారలచెంత నుండఁబోను
ధనధాన్యములు గల్గియును దాత యనిపించు
 కొననివానిసమీపమునకుఁ బోను
కవిచంద్రులకుఁ జేయఁదగుగౌరవము నెఱుం
 గనివానిమొగమైన గానఁబోను

గీ. కవనసారస్య మేమియుఁ గాంచకుండ
 బహుమతులు సేయవచ్చినఁ బడయఁబోను
 నీకు నెఱిఁగించినాఁడ నా నిర్ణయముల
 నరయుమయ్య మహారాజ! యాంధ్రభోజ!

సీ. ఆశుకవిత్వంబు నల్లఁ బూనితినేని
 హరిదశ్వవాహంబు నడలవలయు
అష్టావధానంబు నాచరించితినేని
 యష్టమూర్తులు శివాలాడవలయు
శతవధానంబును సలుపఁబూనితినేని
 శతధృతిధైర్యంబు సడలవలయు
నేత్రావధానంబు నెఱవేర్చితినేని
 చక్షుశ్శ్రవుండైన జంకవలయు

గీ. సంస్కృతాంధ్రప్రబంధప్రచారమునకు
 దంటతన మేర్పడఁగఁ బూనుకొంటినేని
 యంబ నాగ్రమ్మోలఁ దాండవం బాడవలయు
 భూరిగుణజాల! పీఠికాపురనృపాల!

ఆంధ్రభాషాభిమానులు వదాన్యులు నగుమహారాజుగారు శాస్త్రిగారిని సంపూర్ణశతావధాన మొనరింపఁ గోరిరి. "వల్లె" యని శ్రీశాస్త్రిగారు 1924 అక్టోబరు 4,5,6 తేదులలో సంపూర్ణశతావధానము చేసి పృచ్ఛకులుగా నున్నమహామహోపాధ్యాయులను శతావధానులను దదితరమహావిద్వాంసులను మహారాజును మహానందతుందిలహృదయారవిందులఁ గావించి మహోత్కృష్టము లగుసన్మతులు సత్కారములు నందుకొనిరి. ఆనాఁటిశతావధానమును గుఱించి నేడుగూడఁ బ్రశంసించువారు పలువురు గలరు. శతావధానారంభమునఁ జెప్పిన యొకపద్యము మాత్ర ముదాహరింతుము.

ఉ. సీమములోఁ జ సీతనికి నేను గడంగితిఁ గాని కర్తిపై
సా మిది, దీనిలోఁ బడినఁ జావక చచ్చినవాఁడె, నిల్చెనేని
మృతి నొందినఁగా బ్రతికి నిల్చినవాఁడె జగంబులోన, నీ
జామున నెట్లు చూచెదవొ చల్లనిచూపులతల్లి! శాంకరీ!

1925—బెజవాడ

ఈ సంవత్సరమున జరిగినసభలలో బెజవాడశతావధానము ప్రధానము. అం దిచ్చినసమస్యలు ప్రశ్నలు కఠినము లైనను ఉల్లాసహేతువులు. మచ్చున కొక్కసమస్య. "కా ఖా గా ఘా కిజ కాటన్నాయా టీజ"

దీనికి శాస్త్రిగారిపూరణము.

"చా ఛా జా ఝా చిజ చంచన్నాయా ఛీజ
తా థా దా ధా తిజ తాతన్నాయా థూజ
పా ఫా బా భా పిజ పాపన్నాయా ఫీజ"

అవధానాంతమునఁ బృచ్ఛకునకు శాస్త్రిగారికి నీసమస్యను గుఱించి యీ విధముగా సంభాషణ సాగినది.

పృచ్ఛ :— అవధానిగారూ! మీసమస్యాపూరణమున కర్థము గలదా?

శాస్త్రి :— మీసమస్య కర్థము గలదా?

పృచ్ఛ :— కలదు. గంపెఁడర్థము గలదు.

శాస్త్రి :— మాపూరణమునకుఁ గూడ మూఁడుగంపలయర్థము గలదు. ముందుగా మీయర్థము చెప్పుఁడు. పిమ్మట మాయర్థము చెప్పెదను.

పృచ్ఛ :— కాటన్నాయఁ డనునొకధనికుఁ డుండెడివాఁడు. ఆతఁడు విద్యాగంధశూన్యుఁడు. కాని తనపేరు పలుమార్లు చెప్పుచుఁ బొగడువారి నతఁడు ధనరాసులతో ముంచివేయును. ఈగుట్టు తెలియనికవులు గాయకులు మున్నగువారతనియొద్ద నొక కానిగూడఁ దేలేక "లోభి"యని వానిని నిందింపఁజొచ్చిరి మేధావియొకఁ డీరహస్యము నెట్లో కనిపట్టి యాతనియొద్ద కేఁగి తాళము వేయుచు నీపాదమునే రకరకములుగా గానముచేసి గొప్పసత్కారము నొంది వచ్చెను. ఇది యీసమస్యలోఁ గలభావము.

శాస్త్రి :— ఈయనంతసృష్టిలో మీకాటన్నాయనివంటివారే మఱి ముగ్గురు గలరు. వారు చంచన్నాయఁడు, తాతన్నాయఁడు, పాపన్నాయఁడు అనువారు. మీ మేధావికన్న మామేధావుల లధికులు. కావుననే వ్యంగ్యరీతిని ఛీ, థూ అని వారిమాధ్యమును నిందించుచునే వారిచే సత్కృతు లైనారు.

పృచ్ఛ :— అవధానిగారూ! మీరు అపారమేధాసంపన్నులు. అన్నివిధముల నాటితేటివవారిని కన్నుకచే కన్నును నొత్తు విప్పుటకుఁగూడ నవకాశము లేకుండఁ

చేసినారు. నే నీసమస్య ననేకుల కవధానములలో నిచ్చియున్నాను. కాని యొక్కరును బూరింప లేదు. అవలీలగా మీరు పూరించితిరి. మీకు నానమోవాకములు.

1926—అన్నవరము—వాక్సిద్ధి.

అన్నవరమున శ్రీ సత్యనారాయణస్వామికల్యాణోత్సవములలో శ్రీ శాస్త్రిగారు శతావధాని, శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు, కవిసార్వభౌమ, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు సభ్యులై యున్నసభయం 'దష్టావధాన' మొనర్చిరి. అష్టావధాన మనుపేరేగాని పృచ్ఛకు లిరువదిమందికిఁ బైఁగాఁ గలరు. సాధారణముగా శ్రీ శాస్త్రిగారి యష్టావధానము లన్నియు నిట్లే జరుగుచు వచ్చినవి. సభ ప్రారంభమైన వెంటనే పెద్దపెద్దమేఘము లాకస మంతయు నలముకొనినవి. దిక్కులఁ జీకటులు గ్రమ్మినవి. ఆచ్ఛాదనము లేనియాచోట సభ యిఁక సాగ దని యందఱకును దోఁచెను. అప్పుడు

చ. ప్రళయ మనన్ మహాజలధరంబులు పైకొని చిమ్మఁజీకటుల్
గాలిపెడి దిక్కులన్; దలఁచుకొన్నవధానము విఘ్న మొందఁగాఁ
గలుగునవస్థ యెన్నఁడును గాన భవత్కృపచేత; నేఁ డిటుల్
గలిగెను; మంచిచెడ్డలను గైకొనుదానవు నీవె శాంకరీ!

అని యొకపద్యము నాశువుగాఁ జెప్పిరి. వెంటనే యత్యద్భుతముగా నెక్కడి మేఘము లక్కడ శమించిపోయినవి. అందఱును * వీరివాక్సిద్ధికి మెచ్చుకొనిరి. అవధానము చక్కఁగా సాగినది. ఈయవధానమునఁ జెప్పినయపార మగు నాశుకవితను ధారణాపటిమను అధ్యక్షు లిరువురు మిగులఁ బ్రశంసించిరి దేవాలయధర్మకర్తలు శ్రీరాజా, ఇనుగంటి రాజగోపాలరామసూర్యప్రకాశరాయణింగారు నూఱుఱూలు లిచ్చి సత్కరించిరి.

---

* శ్రీశాస్త్రిగారి వాక్సిద్ధి కనేకనిదర్శనములు గలవు. అందుండి మఱి యొక్కటి మాత్ర ముదాహరింతును. లక్షరూప్యములు వెలచేయు శ్రీ గద్వాల మహారాజుగారివజ్రపుటుంగరములు మూఁడు పరిచారకు లెవరో యపహరించిరి. అప్పుడు మహారాజా జీసంగతి తెలుపఁగా శ్రీశాస్త్రిగారు

ఉ. ఎక్కడ కేఁగు నుంగరము? లెవ్వఁడు తీసి ధరింపఁ గల్గు? నీ
ప్రక్కకు వచ్చు నీరయిదురాత్రులలోపల; సంశయంబు నీ
కక్కఱ లేదు; రాని యెడ నా తెలివాటు [illegible] శీర్షముల్
ప్రక్క లొనర్తు నిక్కముగ [illegible] చేన్.

అని తాత్కాలికముగా నొక్కపద్యము [illegible]. [illegible] గడువులోపల [illegible] యుంగరాలు దొరకినవి. మహారాజా [illegible] [illegible]

శ్రీసూర్యరాయాంధ్రనిఘంటుపండితపదవి

పిమ్మట శ్రీసూర్యరాయాంధ్రనిఘంటుసంపాదకులు కళాప్రపూర్ణ శ్రీజయంతి రామయ్యపంతులుగారియాహ్వానము ననుసరించి శ్రీసూర్యరాయాంధ్రనిఘంటు కార్యాలయమున 1926 సం॥ నవంబరు నెలలోఁ బండితులుగాఁ జేరిరి. ఇది మొదలు భాషావిమర్శనము హెచ్చినది. అవధానప్రచారము తగ్గినది. ఐనను అనువత్సర మొక నెల సెలవుపెట్టి యవధానప్రచారము సాగించుచునే యుండిరి. మఱియు దసరాసెలవులలో నేదే నొకసంస్థానమున కేఁగుచునే యుండిరి. అందువలననే యవసానసమయమువఱకును వీరి. కాశుకవితావధానశక్తి యిసుమంతయుఁ గొఱ వడలేదు.

1927

అన్నవరమున (16-5-1927) ప్రభవవైశాఖశుద్ధపూర్ణిమకు జరిగినకవితా పరీక్షలో సంస్కృతమున సువర్ణపదకబహుమాన మందుకొనిరి.

1928

అన్నవరమున (4-5-1928) విభవవైశాఖపూర్ణిమకు జరిగినకవితాపరీక్షలో నాంధ్రమున సువర్ణపదకబహుమానము కైకొనిరి.

బొబ్బిలిసంస్థానము

బొబ్బిలిసంస్థానమున శ్రీరాజా, శ్వేతాచలపతి రామకృష్ణమహీజానియొద్ద విభవశారదనవరాత్రములలో 20-10-1928) అష్టావధానసభ చేసి నూటపదార్ల సేలువలు కైకొనిరి. వదాన్యులగు శ్రీరాజుగారు శ్రీశాస్త్రిగారికవితామృతప్రవాహమున నోలలాడి నూటపదాఱులు వార్షికముగా నిచ్చెద మని సెలవిచ్చిరి. అట్లే యీశ్వరవత్సరాంతమువఱకును (1928 మొదలు 1937 వఱకు) వార్షికముగా శ్రీరాజుగారు నూటపదాఱు లొసఁగిరి.

విజయనగరము

శ్రీకాంచీకామకోటిపీఠాధిపతుల సన్నిధియం దష్టావధానము గావించి యాశీః ప్రశంసామేదురము లగు శ్రీవారిబహుమతులు పడసిరి.

1932

కొచ్చిసంస్థానము

శ్రీశాస్త్రిగారు కొచ్చిసంస్థానమునకు కరిగిరి. అట మూఁడుశాస్త్రములలో మహావిద్వాంసుఁడు కొచ్చియువరాజు నగు శ్రీ కేరళవర్మసన్నిధియందుఁ దమవృత్తాంతము నిట్లు విన్నవించిరి.

శ్లో. శ్రుణు కేరళవర్మవిభో!, కించి ద్వినివేదయామి మమ గాథామ్।
నామ్నా చిదంబరోఽహం, వశ్యా కవితైవ మమ హి సర్వస్వమ్.
శ్లో. గౌరవం క్వచి దగౌరవం క్వచి, దూషణం క్వచన దూషణం క్వచిత్।
సర్వతః పరిషదుత్సుకాత్మనా, నిర్విచార మనుభూయతే మయా.
శ్లో. కదాచి దత్యుత్తమసౌధవాసైః, కదాచి దత్యల్పకుటీరవాసైః।
గజాశ్వయానేషు గతైః కదాచి, ద్యాంతి క్షణాః పాదగతైః కదాచిత్.
శ్లో. రాజాధిరాజసాష్టాంగ, ప్రణామై రర్చనం క్వచిత్।
ద్వారేషు ధనినాం భూయో, భక్తై రుచ్చాటనం క్వచిత్.
శ్లో. సమర్పితైః షడ్రసభోజనైః క్వచిత్, క్షుధాఽనవాప్తాభ్యవహారయా క్వచిత్।
ప్రబోధయంతిస్వయమేవ మేక్షణాః, ప్రభో!విచిత్రాం సుఖదుఃఖయో ర్దశామ్.
శ్లో. అత్యుత్కటేషు సుఖదుఃఖపరంపరాయాః
ప్రాప్తే ష్వపి ప్రచలనేషు బహుప్రకారైః।
భూయః ప్రచారయతి హన్త శరీరయంత్రే
ప్రాణానిలం సుకవితాఽమృతవల్లరీ మే.

వెంటనే 30-6-1932 తేదిని యువరాజు అష్టావధానసభ చేయించి సత్కరించెను. పిమ్మట 2-7-1932 తేదిని కొచ్చిమహారాజు శ్రీరామవర్మసన్నిధియం దష్టావధానసభ కావించి సువర్ణపదకము నూటపదార్లను బహుమానముగాఁ బడసిరి. తరువాత మహారాజ్ఞి శ్రీమతి కుంజక్కావాదేవి 6-7-1932 స్వయముగా నొకయష్టావధానసభ చేయించి శాస్త్రిగారిని సత్కరించెను. తిరువాన్కూరు బాలికా పాఠశాలలో వలె నిటఁ గూడఁ గేవలము స్త్రీలే పృచ్ఛకురాండ్రు. కేరళదేశమున సంస్కృతభాషాపాండితీభూషిత లగుస్త్రీలు పలువురు నేఁడునైతము గలరఁట! పై విధముగాఁ గొచ్చిసంస్థానమున మూఁడు సభలు జరిగినవి. ఈసమయమునఁ గేరళదేశీయమాంత్రికులలోఁ బలువురతో సంభాషించి యనేకములు మంత్రశాస్త్ర విషయములు శ్రీశాస్త్రిగారు సేకరించిరి.

జయపురసంస్థానము

(1-10-1932) జయపురసంస్థానమున కేఁగి శ్రీవిక్రమదేవవర్మమహారాజ సన్నిధానమునందష్టావధానసభ మహోజ్జ్వలముగాఁ గావించి నూటపదాఱులు వార్షికముగాఁబడసిరి. ఈవార్షికము 1936 సంవత్సరము దనుక సాగినది.

1935-శివగంగ

శ్రీశాస్త్రిగారు 12-8-1935 తేదిని శివగంగామఠాధిపతిసన్నిధియం దష్టావధాన మొనర్చిరి. దానికిఁ బరితోష మందిన శ్రీమదభినవగంగాధరసుబ్రహ్మణ్య శి

భారతీస్వామివారు ప్రశస్తసత్కారము గావించిరి. బహుమానసమయమునఁ జెప్పిన యాశ్లోక మొక్కటి గమనింపఁదగినది.

శ్లో. అష్టావధాన మవలోక్య భవాన్ మదీయం
మధ్యేసభం య దకిర న్మయి తే కటాక్షాన్।
స్వామి న్నతః పరతరం బహుమాన మన్య
దస్మాదృశాం కవయతాం కిము వాంఛనీయమ్.

రా మే శ్వ ర ము

పిమ్మట సకుటుంబముగా రామేశ్వరయాత్ర కేఁగిరి. అటఁ దీర్థయాత్రతోపాటు కవితాయాత్రగూడఁ గొంత సాగించిరి. అచ్చట దేవీకల్యాణమండపమున వరుసగా రెండుదినములు రెం డష్టావధానసభలు జరిగినవి. త్రైర్థికులు పౌరులు పలువురాసభలకు వచ్చి మిగుల నానందించిరి. ఈవిధముగా శాస్త్రిగారు దర్భాంగ మొదలు రామేశ్వరమువఱకును గలయావద్భారతదేశమును దమకవితాసుధా వాహినిలో నోలలాడించిరి. ఈవిషయము నే

సీ. తిరుపతివేంకటేశ్వరసుధీవరు లవ
ధానాశుకవితాప్రధానగురువు
లాంధ్రదేశమ్మునం దఖిలస్థలంబుల
నీరాజనం బిచ్చినారు నీకు
వారిమార్గమునందె వర్తించినమహాత్ముఁ
డస్మదగ్రజుఁడు చిదంబరకవి
యాంధ్రపద్మపురాణ మతిహృద్యతమశైలి
వెలయించినట్టికవిప్రకాండుఁ
డాసేతుశీతనగావనీనాయకు
లిచ్చినకాన్క లందిచ్చినాఁడు.

అని యాంధ్రసాహితీయోషకు విన్నవించి యున్నాను.

1 9 3 7 - మై సూ రు

మైసూరుపురమున ధర్మాధికారి,ఆస్థానమహావిద్వాన్,కుణిగల్ రామశాస్త్రి గారిభవనమునం దష్టావధానసభ 21-6-1937 తేదిని విద్వత్ప్రమోదావహమై ప్రవర్తిల్లినది.

1 9 3 8 — సి కిం ద్రా బా దు

సికింద్రాబాదునగరమున 18-2-1938 అష్టావధానసభ సభ్యుల కానందము నాపాదించినది.

1940 - చెన్నపురి

చెన్నపురియందు దష్టావధానాశుకవితాసభ (2-6-1940) జరిగినది. సువర్ణ పతకాదిబహుసన్మానములు కవిస్తుతులు చేకూరినవి. మచ్చున కొక్కటి.

మ. కవు లెవ్వారలొ యెందఱో గలరు, వీరల్ సంస్కృతాంధ్రోరువై
భవముల్ నవ్యమరందబిందుచయసంపాతంబులై తోచున
త్కవిమూర్ధన్య భవాదృశుల్ భువిఁ గనంగాఁ గల్గునే? కావ్యకా
ర్యవిశేషజ్ఞ! చిదంబరార్య! కవిధీరంమన్యభూభృత్పవీ!

దోమా, వేంకటస్వామిగుప్త. శతావధాని.

కాకినాడ

పీఠికాపురరాజకళాశాలలో జరిగిన "యాంధ్రాభ్యుదయోత్సవము" లలో నత్యద్భుతాశుకవితాసభ సాగినది. అధ్యక్షులు శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు. నాఁటియాశువు నధ్యక్షు లతివేలముగాఁ గొనియాడిరి

1941

వేంకటగిరిసంస్థానమున రాజా, శ్రీ వేంకటరాజగోపాలకృష్ణయాచేంద్రులసన్నిధియం దష్టావధానసభ చేసి నూటపదార్లచే సత్కృతులైరి.

మే నెలలో శ్రీసూర్యరాయాంధ్రనిఘంటువిద్వత్పదవిని బరిత్యజించిరి.

1942

మార్చి నెలలో సకుటుంబముగాఁ గాశిగయాప్రయాగములు సేవించిరి. అప్పుడే పద్మపురాణము నాంధ్రీకరించి శ్రీకాశీవిశ్వేశ్వరునకుఁ గృతియిచ్చుటకు సంకల్పించిరి. ఈసత్సంకల్ప మాదేవదేవునికృపచే నిర్విఘ్నముగను సమగ్రముగను 1951 మార్చినెలనాఁటికి నెఱవేఱినది.

1942

జూన్ నెలలో వేంకటగిరిసంస్థానమున కేఁగి రాజా శ్రీసర్వజ్ఞకుమారకృష్ణయాచేంద్రులసన్నిధియం దష్టావధానసభ యత్యాశుకవితాసముపబృంహితముగా సాగించిరి.

శ్రీరాజుగారు, తత్సోదరులు రాజా, శ్రీ వేంకటరాజగోపాలకృష్ణయాచేంద్రులవారును మిగుల నానందముతో నూటపదాఱులు సత్కరించి, తమయాస్థానవిద్వత్పదవి నలంకరింపఁ గోరిరి. ఇది శ్రీకాశీవిశ్వనాథుని ప్రేరణముగా భావించి శ్రీశాస్త్రిగారు పద్మపురాణాంధ్రీకరణకార్యనిర్వహణామునకై యుట్టఁ బ్రవేశించిరి. ఆసందర్భమునఁ జెప్పినపద్యములనుండి రెండుమాత్ర ముదాహరింతుము.

చ. కవి యనువాని కెల్ల నిది కాఁదగుకార్యము గాదు సంస్కృతాం
ధ్రవిదుఁడు లోకవేత్తయు గుణజ్ఞుఁడు గ్రంథవిమర్శకుండు ప
ట్టు విడువనట్టివాఁడును గడుంగడు విశ్రుతిఁ గోరువాఁడు స
త్కవి యగువాఁ డొకానొకఁడు గాక, తదన్యుఁడు దీని కర్హుఁడే?

చ. అవనితలాధినాథ! వినుమా విభవంబు లశాశ్వతంబు లీ
భువనమునందు నెప్పుడును బోనిది యొక్కయశంబ దానికై
కవులను నొద్దఁ జేర్చికొని గ్రంథములన్ రచియింపఁ జేసి భూ
ధవులు స్వనామధేయమును స్థాపనముం బొనరింతు రుర్వరన్.

వేంకటగిరిసంస్థానమునఁ బ్రవేశించినదాది శాస్త్రిగారు ప్రధానముగాఁ బురాణాంధ్రీకరణకార్యమునే కావింపఁ జొచ్చిరి. ఎప్పుడు వ్రాసినచిత్తుప్రతి నప్పుడే యచ్చువేయించుట కనువగునట్లు వ్రాయించుచుండిరి. ఈవిధముగా వేంకటగిరి సంస్థానమున 1942 ఆగస్టునెల మొదలు 1948 ఆగస్టునెలవఱకు ఆది, భూమి, బ్రహ్మ, పాతాళఖండములు నాలుగును సమగ్రముగా నాంధ్రీకరించిరి.

1943 వేంకటగిరి

రాజా, శ్రీవేంకటరాజగోపాలకృష్ణయాచభూపాలపుత్త్రికావివాహసమయమునం దష్టావధానసభ చేసి శ్రీశాస్త్రిగారు నూటపదాఱులు సేలువలు సత్కారముగాఁ బడసిరి.

1944 సికింద్రాబాదు

సికింద్రాబాదు నగరమున ఫిబ్రవరినెలలో రెండష్టావధానసభలు నొక యాశుకవితాసభయు విద్వత్కవులసన్నుతులు మిన్నుముట్ట సాగినవి. అర్థసత్కారములు చేకూరినవి.

1945

అన్నవరము శ్రీసత్యనారాయణస్వామిసన్నిధియందు వైశాఖపూర్ణిమనాఁడు తమయాంధ్రపద్మపురాణమునందలికొన్నిఘట్టములు వినిచి సభ్యుల నానందతుందిలహృదయారవిందులఁ గావించిరి. దేవాలయధర్మకర్తలు రాజా, శ్రీఇనుగంటి వేంకటరామసూర్యప్రకాశరాయణింగారు సువర్ణకుండలములు సమర్పించి నూటపదాఱులు వార్షికముగా నేర్పఱచిరి. ఈవార్షికము 1950 వఱకును సాగినది.

1948

సెప్టెంబరునెలలో శ్రీశాస్త్రిగారు వేంకటగిరిసంస్థానమును వదలవలసి వచ్చినది. అప్పటికి శ్రీమదాంధ్రపద్మపురాణమున – ఆది, భూమి, బ్రహ్మ, పాతాళఖండము లాంధ్రీకృతము లైనవి. ఇది మొత్తముగ్రంథములో సగము మాత్రమే. ఇఁక సృష్టిఖండము, ఉత్తరఖండము అను రెండుఖండము లాంధ్రీకరింపఁబడవలసి

యున్నవి. ఈరెండు ఖండములును మిగులఁ బెద్దవి. కావున నీయివి రెండును సగము గ్రంథము. ఐనను దలపెట్టిన కార్యమును దుదముట్టింపక వదలని (శ్రీ) శాస్త్రిగారు తక్కిన గ్రంథమును శీఘ్రముగా రచింప నెంచి తదనుకూలసాహాయ్యమునకై నెల్లూరుపురమున కేతెంచిరి. (శ్రీ) శాస్త్రిగారు సంసారనిర్వహణభార మంతయుఁ దమయూఁపుననే భరించుటచే యశోధనము మాత్రమే వారికి మిగిలినది. అందుచే నితరులసాయము కోరవలసివచ్చినది. పురమందిరమునఁ గవిసార్వభౌమ, శ్రీ శ్రీపాద, కృష్ణమూర్తిశాస్త్రిగారియాధ్యక్ష్యమున నొకసభ జరిగినది. అందుఁ బద్మపురాణము నందలికొన్ని ఘట్టములు చదివి వినిపించిరి. న్యాయవాదిశేఖరులు, సంస్కృతాంధ్రాంగ్ల భాషాకోవిదులు, ధార్మికవతంసులు, శ్రీమంతులు నగు బ్రహ్మశ్రీ ఇంగువ, శ్రీకృష్ణయ్య గారు (B. A., B. L.) పురాణరచన ముగియువఱకును (శ్రీ) శాస్త్రిగారికుటుంబమునకుఁ గావలసిన ప్రధానద్రవ్యము (బియ్యము) నిచ్చెద మని యాసభలోఁ బ్రకటించి తమ జన్మస్థాన మగు కరేడుగ్రామమునఁ దమయింటనే నివసించి పురాణశేషమును రచియింపఁ గోరిరి. దానికి (శ్రీ) శాస్త్రిగారు "వల్లె" యని యటఁ బ్రవేశించిరి. పిమ్మట నితరవ్యయములకై కొందఱు భాషాభిమానులు శ్రీశాస్త్రిగారికి సహాయపడిరి.

1. శ్రీతూములూరి, శివరామయ్యగారు. B. A., B. L. నెల్లూరు. రు. 116/-
2. శ్రీచివుకుల, మాలకొండయ్యగారు. B. A., B. L. నెల్లూరు. ,,
3 శ్రీధరణికోట, సుబ్రహ్మణ్యముగారు. కరేడు. ,,
4. శ్రీ దేవరపల్లి, వేంకటకృష్ణారెడ్డిగారు. ఉలవపాడు ,,
5. శ్రీవాకా, సుబ్బారెడ్డిగారు. కరేడు. ,,
6. కీ. శే. శ్రీ రేబాల, పట్టాభిరామిరెడ్డిగారు. నెల్లూరు. 100/-
7. శ్రీతిక్కవరపు, రామిరెడ్డిగారు. నెల్లూరు. ,,
8. శ్రీబెజవాడ, రామచంద్రారెడ్డిగారు. బుచ్చిరెడ్డిపాలెము. 58/-
9. శ్రీపులుగిండ్ల, వేంకటకృష్ణయ్యగారు. B. A., B. L. నెల్లూరు. ,,

శ్రీశాస్త్రిగారి ట్లుదారులతోడ్పాటుతోఁ గరేడుగ్రామమున 14-11-1948 తేదిని బ్రవేశించి తదాది రాత్రిందివము శ్రమించి 15-3-1951 నాఁటికి "శ్రీమదాంధ్ర పద్మపురాణ" రచనను ముగించుకొని పునఃపరిశీలనము గూడఁ గావించుకొని యట నుండి మరల నెల్లూరుపురమున కేతెంచిరి. కాని, శరీరనిరపేక్ష మగుదీక్షతో నతి వేగముగా నహోరాత్రములు గార్యమును సాగించుటచే శ్రీశాస్త్రిగారియారోగ్యము చెడినది.

అనుగ్రహము

(శ్రీ) శాస్త్రిగారు రుగ్ణులై సింహపురమున నుండఁగా నొకనాఁడు స్వప్నమునఁ సరస్వతీదేవి దర్శన మిచ్చి "(శ్రీ) మదాంధ్రపద్మపురాణము నా కత్యంత ప్రీతిపాత్ర

దము గొల్పిన"దని సెలవిచ్చి తనచేత నున్నమల్లెపూలదండను సభక్తికముగా నొగ్గిన శాస్త్రిగారిదోసిట నునిచి యంతర్ధాన మయ్యెను. ఈవిషయము నంతను మఱునాఁ డుదయముననే. మాతోఁ జెప్పి తమశ్రమ మిప్పటికి సార్థకమైన దని శ్రీశాస్త్రి పాదులు మిగుల నానందించిరి. అప్పు డప్పుడు శ్రీశాస్త్రిచరణులకు వాగ్దేవి యిట్లు స్వప్నమున దర్శన మిచ్చుచుండుటయు నాయావిషయములు తెలుపుచుండుటయు జరుగుచుండెడిది.

కృతిసమర్పణము

శ్రీశాస్త్రిగారు తమగ్రంథము లెల్ల భగవదంకితములు గావించి జన్మము సఫలం బొనర్చుకొనిరి. మఱియు వారికడపటికృతి యగుపద్మపురాణముకృతిప్రదానమున నింకొకవిశేషము సైతము గల దనియు, అది మహాభాగ్య మనియు వారే వచించియున్నారు.

క. హరిహృదయం బఁట కృతి; కృతి,పరిగ్రహీత యవిముక్తపతి యగువిశ్వే
శ్వరుఁ డఁట; కృతిదాత చిదం,బరుఁ డఁట;యిది యింతయంతభాగ్యమె తలఁపన్?

ఆం. పద్మ. ఆది. ౨౫.

[కృతి = పద్మపురాణము. హరిహృదయము = పురాణరూపుఁ డగువిష్ణువునకు హృదయము. (చూ. ఆం. పద్మ. ఆది ౮.౨౮) అనఁగా శివుఁడు అని భావము. "శివస్య హృదయం విష్ణు, ర్విష్ణోశ్చ హృదయగ్ం శివః" అని శ్రుతి. ఇఁకఁ గృతిదాతృప్రతిగ్రహీతలు గూడ శివులే. ఈవిధముగా -దేయదాతృప్రతిగ్రహీతల కేకత్వము (అనఁగా శివత్వము) ఘటిల్లుట తమమహాభాగ్య మని కవిహృదయము.]

నిర్యాణము

శ్రీచిదంబరశాస్త్రిగారు 1951 అక్టోబరునెలలో సింహపురినుండి తెనాలి కేఁగి యచ్చటనే (11-12-1951) ఖరసంవత్సరమార్గశీర్షశుక్లచతుర్దశీకృత్తికానక్షత్రయుక్తభౌమవాసరమున రాత్రి 8 గంటలకు "శివోఽహ" మ్మని భావించుచు శివునితో నైక్యము నొందిరి.

కైమోడ్పు

నీమహిమం బచింత్యము; గణింప నశక్యము నీకవిత్వశో
భామహిమంబు; బుద్ధ్యాత్తము భవత్కృతి; తావకపాత్రపోషణ
శ్రీమహిమం బప్రమేయము; విశిష్టము నీయవధానవైభవం
బోమహిమాకరా! తెలుప నోపినభంగి; ననుగ్రహింపుమీ.

విద్వాన్, పిసుపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి
విద్వాన్, పిసుపాటి విశ్వేశ్వరశాస్త్రి

శతావధాని శ్రీపిసుపాటి చిదంబరశాస్త్రిగారి గ్రంథములు

సంస్కృతగ్రంథములు

1. పంచాయతనపంచశతి.
2. కృష్ణరాజాభ్యుదయము.
3. అవధానాదర్శము. (విద్వాన్, పి. సుబ్రహ్మణ్యశాస్త్రికృతభావబోధినీవ్యాఖ్యానసహితము)
4. రాజధర్మము. (అర్థశాస్త్రకావ్యము—విద్వాన్, పి. విశ్వేశ్వరశాస్త్రికృతజయవ్యాఖ్యాసంవలితము.) (అముద్రితము)
5. అష్టకకదంబము. (63 అష్టకములు) ,,
6. శివసూత్ర సంగ్రహము. ,,
7. తృణభావబోధిని. ("తృణ మంతరతః కృత్వా బభాషే జనకాత్మజా" అను వాల్మీకి రామాయణవాక్యమునకు భావవివరణము.) ,,
8. దేశయాత్రా చరిత్రము, ,,
9. మహీశూరపురాభ్యుదయచంపువు ,,

ఆంధ్రగ్రంథములు

పురాణము

10. శ్రీమదాంధ్ర పద్మపురాణము. (4 సంపుటములు)

ప్రబంధములు

11. హైమవతీవిలాసము.
12. సుబ్రహ్మణ్యేశ్వరీయము.
13. కపోత కిరాతము.
14. కన్యకాంబాచరిత్రము.

నాటకములు

15. శ్రీ రామాంజనేయము.
16. శ్రీ కృష్ణసందేశము.
17. పంచనళీయము. (అముద్రితము)
18. ప్రచండగాధేయము. ,,
19. మోహినీ రుక్మాంగదము. ,,

గ్రంథలక్షణము

20. అర్ధానుస్వారశకటరేఫనిర్ణయము. ,, (సోదాహరణము—అసంపూర్ణము.)

శతకములు, తదితరములు

21. దత్తాత్రేయ శతకము.
22. సీతారామ శతకము.
23. దారుణ శతకము.
24. రాజరాజేశ్వరీ శతకము.
25. పాయకరావుపేటసీతారామశతకము.
26. రాజసభావిహారము. (అముద్రితము) (ఇందు—దర్భాంగ, కాశి, మైసూరు, అనంతశయనము, కొచ్చి, శృంగేరి, గద్వాల, వేంకటగిరి, పిఠాపురము, బొబ్బిలి, జయపురము మున్నగు సంస్థానములలోని ప్రభువుల గురించి 1910 నుండి 1950 వఱకు సంస్కృతాంధ్రభాషలలోఁ జెప్పిన పద్యములు, అచ్చటిసభావృత్తాంతములు, అచ్చటి పండితులు, ప్రభువులు నొసంగినప్రశంసాపత్రములు బిరుదములు మున్నగునవి గలవు)
27. శృంగారభూషణము. ('శృంగారతిలకము' అనుసంస్కృతగ్రంథమునకు ఆంధ్రీకరణము)
28. గోవిందగీతము.
29. భారతీయప్రబోధము.

గద్య గ్రంథములు

30. షోడశమహారాజచరిత్రము.
31. మహాభారతనీతికథాసంగ్రహము.
32. సప్తర్షిచరిత్రము. (అముద్రితము)

అవధానములు

33. పీఠికాపురసంస్థాన శతావధానము. (సంపూర్ణము)
34. నవాబుపేటసంస్థానశతావధానము.
35. బెజవాడ శతావధానము.
36. ఒంగోలు శతావధానము.
37. గద్వాలసంస్థానశతావధానము. (అముద్రితము)
38. అష్టావధానసంగ్రహము. ,,

ప్రశంసాపత్త్రిములు

శ్లో. మహాత మ్తమసః పారే, పురుషం హ్యాతితేజసమ్।
యం జ్ఞాత్వా మృత్యు మత్యేతి, తస్మై జ్ఞేయాత్మనే నమః.

శ్రీయుక్త! పండిత! చిదంబరశాస్త్రిమహాశయ! మహీశూరమహారాజాస్థాన శతావధానిన్!

జ్ఞానస్య జననీ విద్యా. అవిద్యారూపం తమో యయా నిరస్యతే సా విద్యా. పారమార్థికం చ తస్యా విద్యాయాః స్వరూపం సంస్కృతాం దేవగిరం ద్వారీకృత్యైవ జగతి ప్రాకాశ్యత. సాంప్రత మధఃపతితాయా మార్యజాతౌ సద్విద్యాం పునః ప్రచార్యాజ్ఞానోద్యమరాహిత్యాదిదోషజాతం చ దూరీకృత్య యావ దస్యాం ధర్మశక్తి ర్న పున రావిర్భావ్యతే తావ దస్యా జీవనరక్షా కర్తుం న శక్యతే. ఆదిశిక్షితాయా మాదిమననశీలాయా మాదివిజ్ఞానవిది జగద్గురుత్వే నాభిమతాయా మార్యజాతౌ సద్విద్యాయాః పున ర్వికాసార్థం సనాతనధర్మస్య పున రభ్యుదయసాధనపురస్సరం జగత్కల్యాణకారిణ్యా ధర్మశక్తే రావిర్భావార్థం చ సకలధర్మసభాధర్మాలయానాం సమష్టిరూపాయాః శ్రీభారతధర్మమహామండలాఖ్యాయా విరాడ్ధర్మసభాయాః స్థాపన మభూత్. అత్ర యే కేచిత్ శ్రీసరస్వతీదేవ్యాః కృపాస్పదీభూతాః సంస్కృతజ్ఞా విద్వాంసో విద్యోన్నతౌ రతా స్తే సర్వేప్యస్యాః స్వజాతీయవిరాడ్ధర్మసభాయాః ప్రేమభాజనా నీతి భవత స్సంస్కృతవిద్యాయాం యోగ్యతయా ప్రసన్నేయం స్వజాతీయధర్మమహాసభా సద్విద్యాయాః సమ్మానవృద్ధ్యర్థం భవన్తం కావ్యకళానిధి విద్యోపాధిరూపాలంకారేణాలం కృత్య పరమం ప్రమోద మశ్నుతే. సర్వజ్ఞానమయస్య సర్వశక్తిమతః పరమేశ్వరస్య చరణకమలయో స్సవినయం ప్రార్థయతే చ భవత ఆధ్యాత్మిక్యున్నతి ర్భూయా దితి శమ్.

శ్రీకాశీధామ్ని శ్రీభారతధర్మమహామండలప్రధానకార్యాలయః అతిథాకృష్ణపక్షేమాఘమాసే 1978వర్షే కవీంద్రనారాయణసింహః, ప్రధానాధ్యక్షః.	శ్రీ రమేశ్వరసింహః మహారాజాధిరాజ, మిథిలేశ, జీ. సీ. ఆ. ఈ. ఈ. కే. బీ. ఈ. సభాపతిః శ్రీభారతధర్మమహామండలస్య.

ప్రశంసాపత్త్రిము లనేకములు గలవు. అందుండి కొలఁదిగా నిటఁ బ్రకటించుచున్నారము. తక్కినవి "రాజసభావిహారము"నఁ బ్రకటింపఁబడును.

శ్లో. శ్రీమంతౌ తౌ హయముఖ,లక్ష్మీనారాయణౌ శ్రియం తనుతామ్ ।
రాజయువరాజభూతౌ, పరకాలాస్థానరాజ్యసీమని యౌ.

శ్రీమద్వేదమార్గప్రతిష్ఠాపనాచార్యైః పరమహంసపరివ్రాజకాచార్యైః శ్రీమత్కవికథకకంఠీరవచరణనలినయుగలవిన్యస్తాత్మభరైః శ్రీమద్రామానుజసిద్ధాంతనిర్ధారణసార్వభౌమైః శ్రీమన్మహీశూరశ్రీకృష్ణరాజేంద్రసార్వభౌమసంతతిపరమాచార్యైః శ్రీమత్పరకాలసంయమివరాస్థానమూర్ధాభిషిక్తైః శ్రీవాగీశబ్రహ్మతంత్రపరకాలస్వామిభిః కవివర్యే శ్రీమచ్చిదంబరశాస్త్రిణ్యనేకనారాయణస్మరణపూర్వకమనుగృహీతం సప్రశస్తి మంగళాశాసనశ్రీముఖపత్రమ్.

రౌద్రివత్సరాశ్వినకృష్ణైకాదశ్యాం శ్రీహయగ్రీవలక్ష్మీనారాయణాస్థానాస్మత్సమక్షం నిర్వర్తితాయా మధికారిభిర్విద్వన్నివహైశ్చ నిరంతరాయాం పరిషది యథావిద్వదభిలాషం ఛందోవృత్తాలంకృతిభి రేకదా నిర్దిష్టాన్ విషయాన్ శ్లోకరూపేణ ప్రాథమికపాదమాత్ర మేవోత్తరయన్ ద్వైతీయీకతార్తీయీకతురీయావృత్తా వపృష్ట్వైవ తత్తద్విషయా నవశిష్టపాదత్రయేణ స్వప్రతిభాబలేన వైచిత్ర్యవ్యంగ్యభంగ్యాదీ నత్యజన్నేవ కావ్యగుణాన్ ఝుటితి వదమానః పారిషద్యానా మస్మాకం చాంతరంగం విస్మయహర్షజలనిధౌ న్యమజ్జయ త్కవి రయం స్వవిరచితేన శతావధానేన. ఆశాస్మహే చైన మితోఽపి భగవాన్ శ్రీహయాననః శ్రేయసా భూయసా సంయునక్త్వితి. నారాయణస్మృతిః. శ్రీః.

Mahamahopadhyaya
T. GANAPAITSASTRI, HON. M. R. A. S.
Curator of Oriental Literature.
TRAVANCORE STATE.

ఆంధ్రదేశాంతర్గతవంగోలుపురాభిజన ఏష శ్రీచిదంబరపండిత ఇహాద్య సమ్మేళితే విద్వత్సమాజేఽష్టావధానవిద్యాపాటవం తథా నిపుణం చ చమత్కృతం చ ప్రకాశితవాన్, యథా శతావధానిత్వప్రథానుగుణ మవధానశత మప్యనేనేషత్కర మితి సామాజికై రమాని. లోకోత్తరాయా నామాస్య మేధాయా అవధేయే వ్యక్తే వ్యస్ఖలిత మసకృత్ పర్యాయావగాహేన మనవద్యసరసోచితనానాశ్లోకావిర్భావనసుభగం విస్మయనీయ మస్మాభి రుపలబ్ధమ్. శ్రీమాననన్తశయనమహారాజశ్చ మహామహిమా శ్రీరామవర్మా శతావధానికవిమణి మేవం కనకవలయోత్తమవితరణాదినా బహ్వమన్యత.

Trivandrum
2-10-1922

తరువై, గణపతిశాస్త్రీ
మహామహోపాధ్యాయః

శ్లో. శ్రీమతా విద్వదగ్రణ్యా, చిదంబరమనీషిణా।
శతావధానం వ్యరచి, ప్రాచ్యకోశాలయే ఽధునా.
నిర్దిష్టవృత్తవిషయాన్, బహూనాం సర్వతోముఖాన్।
తాం స్తాన్ ప్రశ్నాన్ ఝటి త్యేవ, సముత్తరితవాన్ స్వయమ్.

శ్లాఘ్యా కిలాశుకవితా, తత్రాఽపి సరళా భృశమ్।
అవధానేన సహితా, కం వా న పరితోషయేత్.
గైర్వాణ్యా మాంధ్రభాషాయా, మపి ప్రావీణ్య మద్భుతమ్।
ధారణాశక్తి మత్యంతం. విమృశ్య ముద మాప్నుమః.
ఇత్థం మహీశూరపురీ, ప్రాచ్యకోశాలయస్థితైః।
ప్రశస్తిపత్త్రికా దత్తా, విద్వద్భి ర్గుణలోలుపైః.

మైసూరు
28-11-1920

R. శ్యామశాస్త్రీ. B. A.
Curator,
Govt. Oriental Library, Mysore.

కే.రంగస్వామిఅయ్యంగార్.తర్కవిద్వాన్, లైబ్రేరియన్.
జి. వేంకటనరసింహశాస్త్రీ. సాహిత్య,ధర్మశాస్త్ర, వేదాన్తవిద్వాన్.
శ్రీనివాసగోపాలాచార్యః, వ్యాకరణవిద్వాన్.
సోమేశి నరసింహాచార్యః. న్యాయ, వ్యాకరణవిద్వాన్.

శ్రీమన్మహీశూరపుర్యాం శ్రీహయగ్రీవమఠే శ్రీశ్రీపరకాలస్వామినాం సన్నిధౌ ప్రవర్తితాయాం మహావిద్వజ్జనసభాయాం శతావధానిభిః బ్రహ్మశ్రీ చిదంబరశాస్త్రిభి ర్నిర్వర్తితం శతావధాన మత్యద్భుత మస్మాక మమంద మానంద మజీజనత్. అత్ర చ శాస్త్రిణా మతివేలం సంస్కృతాంధ్రోభయభాషాకవితా కౌశల మసాధారణం ధారణావిశేషం చ సమాకలయ్య ప్రమోదాతిశయే నాస్మాభి ర్వితీర్ణ మిదం ప్రశస్తిపత్త్రం విజయతా న్తరామ్.

పండితరత్నం, లక్ష్మీపురం శ్రీనివాసాచార్యః. ఆస్థానమహావిద్వాన్.
ఆస్థానధర్మాధికారీ, కాశీ శేషవేంకటాచలశాస్త్రీ వ్యాకరణప్రధానోపాధ్యాయః.
మహామహోపాధ్యాయః, పంచాపగేశశాస్త్రీ.అద్వైతవేదాన్తోపాధ్యాయః.
పెరియకోశం రామచంద్రాచార్యః. ద్వైతవేదాన్తప్రథమోపాధ్యాయః,
ఆస్థానమహావిద్వాన్.

బ్రహ్మతర్కం శ్రీకృష్ణాచార్యః. తర్కశాస్త్రముఖ్యోపాధ్యాయః,
ఆస్థానమహావిద్వాన్.

కరపత్తూరు వేంకటరామశాస్త్రీ. వేదభాష్యోపాధ్యాయః, ఆస్థానమహావిద్వాన్.
హాసనాభిజనో నరసింహశర్మా. సాహిత్యముఖ్యోపాధ్యాయః, ఆస్థానమహావిద్వాన్.
దూసి నరసింహాచార్యః. మీమాంసాశాస్త్రోపాధ్యాయః, ఆస్థానమహావిద్వాన్.
సి. నరహరిదైవజ్ఞః. జ్యోతిశ్శాస్త్రప్రధానోపాధ్యాయః, ఆస్థానమహావిద్వాన్.
ద్వివేది సుబ్రహ్మణ్యావధానీ. ఋగ్వేదముఖ్యోపాధ్యాయః, ఆస్థానమహావిద్వాన్.
అయ్యాఘనపాఠీ. యజుర్వేదముఖ్యోపాధ్యాయః, ఆస్థానమహావిద్వాన్.
భాగ్యవల్లి శ్రీనివాసాచార్యః. సాహిత్యవిద్వాన్.

మైసూరు
8-11-1920 } శ్రీమన్మహీశూరమహారాజసంస్కృతపాఠశాలా.

శ్రీయుత పిసుపాటిచిదంబరశాస్త్రిణా కవివర్యేణ విరచితాన్ సంస్కృతాంధ్రగ్రంథాన్ కాంశ్చిదవాలోకిషి. అస్య కవితా రసనిష్యందినీ ప్రసాదగుణమాయిష్ఠా సముచితపదలంకారశోభితా చ సహృదయానందదాయినీ చకాస్తి కవివరేణ్యోఽయం రక్తాక్షిసంవత్సరశాదనవరాత్రసమయే శ్రీపీఠికాపురమహారాజ శ్రీసూర్యరాయసంఘటితాయాం విద్వత్సభాయాం శతావధానం ప్రతిజ్ఞాయ విద్వచ్ఛతేన ప్రత్యేక ముపదిష్టచ్ఛందఃకల్పనాదిక మనుసృత్య ప్రథమ మేకైకపాదం విరచయ్య పున రపృష్ట్వైవ పర్యాయక్రమేణ ద్వితీయపాదాదిరచనేతి నియమ మనురుధ్య షష్టిఘటికాపరిమితే కాలే శతపద్యా న్యారచయ్య ధారణాబలేన సర్వా ణ్యపి పద్యాని పునః పఠిత్వా చ తత్ర సన్నిహితాన్ విద్వద్వరేణ్యాన్ మహారాజ మమాత్యాదీంశ్చ విస్మయానందసంభరితాంతరంగా నకరోత్. మహారాజోఽపి విద్వజ్జనానా మానంద ముపజనయన్ సముచితసత్కారై ర్బహూకార కవివరేణ్యం చిదంబరశాస్త్రిణ మితి తత్ర సన్నిహితోఽహం సానందం ప్రకటయితు ముత్సహే. ఇతి నివేదయితా.

తాతా సుబ్బరాయశాస్త్రీ. మహామహోపాధ్యాయః, కళాప్రపూర్ణః,
మహారాజసంస్కృతకళాశాలాప్రధానోపాధ్యాయః.
విజయనగరసంస్థానమ్.

విషయసూచిక

విషయము	బ్రహ్మఖండము	పుట
అపుత్రతాది హేతుతన్నివారణోపాయకథనము	,,	3
వైకుంఠప్రాపకపుణ్యకథనము	,,	4
నరమేధవృత్తాంతము	,,	5
పణ్యసుందరీవృత్తాంతము	,,	7
గోలోకప్రాపకపుణ్యకథనము	,,	8
సముద్రమథనవృత్తాంతకథనము	,,	9
వారుణీదేవీప్రాదుర్భావము	,,	10
జ్యేష్ఠాదేవీప్రాదుర్భావకథనము	,,	11
జ్యేష్ఠాదేవీనివాసస్థానకథనము	,,	,,
విష్ణువు మోహినీరూపముం దాల్చుట	,,	12
లక్ష్మీవారవ్రతమాహాత్మ్యము	,,	13
లక్ష్మీవారవ్రతకథనము	,,	14
లక్ష్మీవారవ్రతమాహాత్మ్యము	,,	15
కృష్ణాష్టమీవ్రతమాహాత్మ్యము	,,	16
శ్రీకృష్ణజననము	,,	18
బ్రాహ్మణమాహాత్మ్యకథనము	,,	21
గాయత్రీప్రకారకథనము	,,	23
నానాస్నానస్వరూపకథనము	,,	26
సుపర్ణచరిత్రకథనము	,,	28
భీమవృత్తాంతకథనము	,,	34
బ్రాహ్మణాపచారఫలకథనము	,,	35
బ్రాహ్మణజీవికాప్రకారకథనము	,,	37
గోమాహాత్మ్యకథనము	,,	39
ఆశ్వీనపూర్ణిమామాహాత్మ్యకథనము	,,	41
ఏకాదశీమాహాత్మ్యకథనము	,,	42
మార్గశీర్షకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము	,,	46
మార్గశీర్షశుక్లైకాదశీమాహాత్మ్యకథనము	,,	47
పౌషకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము	,,	48
పౌషశుక్లైకాదశీమాహాత్మ్యకథనము	,,	49
మాఘకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము	,,	50

విషయము	బ్రహ్మఖండము	పొరట
మాఘశుక్లైకాదశీమాహాత్మ్యకథనము	,,	52
ఫాల్గునకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము	,,	53
ఫాల్గునశుక్లైకాదశీమాహాత్మ్యకథనము	,,	55
చైత్రకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము	,,	56
చైత్రశుక్లైకాదశీమాహాత్మ్యకథనము	,,	57
వైశాఖకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము	,,	59
వైశాఖశుక్లైకాదశీమాహాత్మ్యకథనము	,,	,,
జ్యేష్ఠకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము	,,	60
జ్యేష్ఠశుక్లైకాదశీమాహాత్మ్యకథనము	,,	61
ఆషాఢకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము	,,	62
ఆషాఢశుక్లైకాదశీమాహాత్మ్యకథనము	,,	63
శ్రావణకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము	,,	,,
శ్రావణశుక్లైకాదశీమాహాత్మ్యకథనము	,,	64
భాద్రపదకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము	,,	65
భాద్రపదశుక్లైకాదశీమాహాత్మ్యకథనము	,,	66
ఆశ్వయుజకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము	,,	67
ఆశ్వయుజశుక్లైకాదశీమాహాత్మ్యకథనము	,,	68
కార్తికకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము	,,	69
కార్తికశుక్లైకాదశీమాహాత్మ్యకథనము	,,	71
అధికమాసకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము	,,	72
అధికమాసశుక్లైకాదశీమాహాత్మ్యకథనము	,,	73
చాతుర్మాస్యవిధికథనము	,,	74
మాఘభోజనఫలకథనము	,,	76
చాతుర్మాస్యోద్యాపనావిధికథనము	,,	77
త్రిస్పృశామాహాత్మ్యకథనము	,,	78
ఉన్మీలనీమాహాత్మ్యకథనము	,,	80
పక్షవర్ధినీమాహాత్మ్యకథనము	,,	81

శ్రీరస్తు

శ్రీమదాంధ్రపద్మపురాణము

ఆదిఖండము



మంగళశ్లోకము

సత్త్వం పరిపాలనే ద్రుహిణతాం సృష్టౌ లయే రుద్రతాం
సంప్రాప్య స్వయమేక ఏవ బహుధా సంపద్యమానః ప్రభుః।
విశ్వస్యాంతరివ స్థితో బహిరపి స్వజ్యోతిషా భాసయ
న్నాదిత్యాద్యఖిలగ్రహాన్ భవతు నః క్షేమాయ విశ్వేశ్వరః. 1

—: దేవతా ప్రార్థన :—

శా. శ్రీవాణీహృదయేశ్వరుల్ సఖులు కాశీపార్వతీజాహ్నవుల్
దేవేరుల్ సురలెల్ల సేవకులుగా దీపించుచున్ శిష్టులన్
గావన్ దుష్టుల రూపుమాపఁగను దీక్షాయుక్తుఁడై యుండు కా
శీవిశ్వేశ్వర దేవదేవునకు నాచిత్తంబు నర్పించెదన్. 2

చ. సకలజగంబులందుఁ గలజన్యుల కెల్లను సర్వదేవతా
త్మిక యయి వాంఛితార్థములు దీర్చుచు నుండెడిదేవి కన్నపూ
ర్ణకు జగదేకమాతకుఁ బ్రణామసహస్రము లాచరింతు మా
మకకృతికన్యపై స్వసృసమాదర ముంచి యనుగ్రహింపఁగన్. 3

శా. ఆనందంబున నెల్లవేళల నిజధ్యానంబు గావించుచున్
జ్ఞానోపార్జనముం బొనర్చికొని సంసారాంబుధిన్ బల్వల
స్థానీయంబుగఁ జేసికొంట కవకాశం బిచ్చి నన్నోముల
శ్రీలక్ష్మీనారాయణులన్ భజించెదను నాక్షేమంబు నేఁ గోరుచున్. 4

క. మతిహీనుల నేని బృహ, స్పతులను గావించి లోకశాసనపీఠ
స్థితులను జేసెడివాణీ, చతురాననులను దలంతు జాడ్యము దొలఁగన్. 5

మ. అమరేంద్రాదులకున్ లభింపఁగ నశక్యంబైనయానందయో
గము చేఁ గాలముఁ ద్రోయుభాగ్యము నొసంగం జాలుకారుణ్యభై
క్షము నర్థించెడినాకు మంజుకవితాసామ్రాజ్యపట్టాభిషే
కము గావించినయాజగజ్జననికిన్ గైమోడ్పు లర్పించెదన్. 6

గీ. అఖిలజను లెన్నఁగా సంస్కృతాంధ్రభాష, లందు రెంటను శతఘంటికావధాన
కౌశలము ఘటికాశతగ్రంథకరణ, శక్తియును నా కొసంగినశక్తి నెంతు. 7

సీ. మహిశూరపురమహీమండలేంద్రునిసభా, స్థలి మహావిద్వత్ప్రదంబు గొనుట
దర్భాంగకుంభినీధవునిసదస్సులోఁ, గావ్యకళానిధిఖ్యాతి గొనుట
తిరువనందపురిభూవరునియోలగములోఁ, గవివీరసింహకంకణము గొనుట
రత్నాద్రిసత్యనారాయణాస్థానిలోఁ, దపనీయఖండలద్వయము గొనుట

గీ. పెక్కుసభలందునూ జాస్లుబిరుదములును, బుధవరేణ్యులసంస్తవంబులును గొనుట
యేజగన్మాతకృపను నా కేరుపడెనొ, యామె కభివాదశతంబు లాచరింతు. 8

క. ఒనగూర్చి సూర్యరాయాంధ్రనిఘంటుకృతిప్రణేతృతను నాకు జగం
బున సుప్రసిద్ధి గలిగించినపరదేవత నుపాస్తిచేసెద నెదలోన్. 9

క. నవనవకుమార్గములఁ బడి, చవి చెడిపోకుండఁ బ్రాచ్యసత్పథమున మ
త్కవితాకన్యను నడిపెడి, భవానిచరణాబ్జములకుఁ బ్రణతు లొనర్తున్. 10

క. మనమున కత్యుత్సాహం, బెనయఁగ నాకనులమెదుట నెల్లపుడును ద
ర్శన మిచ్చుచుండువాగ్భవ, మును గొలుతు మదీయపూర్వపుణ్యఫలంబున్. 11

క. అనుజుల నిరువుర భగిని, తనయుని నొక్కరునిఁ బండితప్రవరుల సా
ధ్వీని సతిని నుత్తమస్వస, లను నా కొనగూర్చినట్టిలలితన్ దలఁతున్. 12

గీ. విఘ్నదేవత లెవ్వాని విస్మరింప, నావరింతురొ దంతావళాస్యు నతనిఁ
దలఁపులోఁ బాదుకొల్పుదుఁ దలఁచినట్టి, కార్యమున కంత రాయంబు గలుగకుండ.

—: గురువందనము :—

క. ఎవనిరసనాగ్రమున ను, ద్భవమయ్యెనొ వాణి మొదట భద్రాకృతితో
నెవఁ డిడెనొ కావ్యభిక్షను, గవుల కతనిఁ దలఁతు నాదికవి వాల్మీకిన్. 14

చ. సకలపురాణకర్తయయి సంస్కృతివార్ధినిమగ్నులైనవా
రికి సువివేకనౌకను దరించుటకై కరుణించి మార్గద
ర్శకుఁ డనుపేరు గాంచినపరాశరసూతికి వ్యాసమౌనికిన్
ద్రికరణశుద్ధితోడ నొనరింతు నజస్రనమస్సహస్రముల్. 15

క. హృద్యతమసాహితీశ్రీ, విద్యా వ్యాకరణ తర్కవేదాంతము లా
స్వాద్యముగ నా కొసంగిన, విద్యాదేశికుల దావవీరుల నెంతున్. 16

క. భారద్వాజసగోత్రుని, భూరియశోధనుని విప్రపుంగవుని సదా
చారుని మజ్జనకుని సీ. తారామాభిధుని సన్నుదన్ మదిలోనన్. 17

క. సీతారామపదాంభో, జాతసలీనాంతరంగషట్పద యనుప్ర
ఖ్యాతిన్ గడియించినమా, మాతకుఁ గనకాంబ కివె నమస్కారంబుల్ 18

గీ. మత్పితామహులకు ధర్మతత్పరులకు, వంగవోలుమహాగ్రామవర్తనులకు
సకలుషులకుఁ గామాక్షీచిదంబరులకు, నాచరింతుఁ బ్రణామసహస్రములను. 19

గీ. అవిరతపరోపకారసంప్రాప్తకీర్తి, ధర్మధనులకు మత్ప్రపితామహులకు
బండెమూంబకుఁ బరదేశిభట్టనామ, ధేయునకు వందనంబులు చేయువాఁడ. 20

గీ. అవ్యయగులింగమనుదాతలైన సుబ్బయాహ్వయునిన త్రియగురుక్మిణమనుమామ
లైనయచ్యుతరామయాహ్వయుని నెంతు, గౌతమసగోత్రులనుధర్మకౌతుకులను. 21

—: సు క వి పు ర స్కా ర ము: —

చ. తెనుఁగును సంస్కృతంబును మథించి మహాకృతిజాతిరత్నముల్
జనులకుఁ జెందునట్లు వెదచల్లినయట్టిసనాతనాధునా
తనకవిసార్వభౌములపదంబులకున్ వినయంబుతోడ వం
దనము లొనర్తుఁ గాకవివితానము వెల్వోఁబాతి చూడఁగన్. 22

—: భా గ్య సం స్త వ ము :—

ఉ. నన్నయతిక్కనాదికవినాయకు లెన్నొ మహాపురాణముల్
మున్ను దెలుంగు సేసియును ముఖ్యతమం బగుపాద్మ మాంధ్రభా
ష న్నెలకొల్పరైరి నిజశక్తి దెలుంగనియట్లు వారిలో
నెన్నికకెక్కి నేను కృతకృత్యుఁడ నయ్యెడిభాగ్య ముండుటన్. 23

క. చెప్పెడునది పాద్మం బఁట, చెప్పించెడితల్లి పలుకుఁజెలి యఁట దానన్
జెప్పిన మోక్షము గల దఁట, చెప్పక యట్టిది మఱొండు చెప్పఁగ నేలా. 24

క. హరిహృదయం బఁట కృతి కృతి, పరిగ్రహీత యవిముక్తపతి యగువిశ్వే
శ్వరుఁ డఁట కృతిదాత చిదంబరుఁ డఁట యిది యింతయుంతభాగ్యమె తెలుపన్.

క. తగు నవఁగను కృతికన్యల, భగవంతున కిచ్చుకొనెడిభాగ్యముకంటెన్
మిగిలినభాగ్యం బున్నదె, జగమున నెందేని కావ్యసంతానులకున్. 26

క. జననము శ్రోత్రియవంశం, బున వాసం బాంధ్రదేశమున నద్వైతం
బున మతి సుకావ్యరచనం, బున ననురాగమును బూర్వపుణ్యఫలంబుల్. 27

—: కృ తి స మ ర్ప ణ ము :—

వ. ఇట్లు దేవతాప్రార్థనాగురువందన సుకవిపురస్కారభాగ్యసంస్తవంబులం గావించి
యష్టాదశమహాపురాణంబులలో నుత్తమపురాణంబును బురుషోత్తమదివ్యకథా
పవిత్రంబును మోక్షసాధనంబును నగుపద్మపురాణంబు నాంధ్రీకరించి యన్న

సాఫల్యం బొదవ నఖిలజగన్నివాసి యయ్యును లోకానుగ్రహార్థంబు వారాణసీ
క్షేత్రంబు నిత్యనివాసంబుగా నంగీకరించి యుండు. 28

క. మూర్తిత్రయస్వరూపున, కార్తజనత్రాణపరున కఖిలజ్ఞునకున్
కర్తకుఁ గారయితకుఁ గృతి, భర్తకుఁ గాశీశ్వరునకుఁ బూర్ణునకున్. 29

క. అకలంకునకుఁ జిదంబరు, నకు నాశ్రితజనశరణ్యునకు నిత్యునకున్
సకలజగదేకనాయకు, నకుఁ బరమేశ్వరునకున్ బినాకధరునకున్. 30

క. ఆది కనాదికి శరదం, భోదాకారునకు నన్నపూర్ణాహృత్పా
సాదవిలాసవిహారా, హ్లాదికి విశ్వేశ్వరునకు నద్వైతునకున్. 31

వ. ఉపాయనంబుగా సమర్పింపం బూని తత్పురాణకథాక్రమంబు విన్నవించెద. 32

—: పద్మపురాణప్రవచనారంభము :—

క. శ్రీశవిధీంద్రాద్యమర, ప్రాశస్త్యాధానచణకృపావీక్షణ భ
క్తాశంసితార్థపూరణ, కాశీపురవిశ్వనాథ గౌరీనాథా. 33

వ. అవధరింపుము. 34

క. ఒకసమయంబునఁ బూర్వము, సకలమునీంద్రులును గూడి చనుదెంచిరి కౌ
తుకమున మహాత్ముఁ డగు శౌ, నకునిఁ గనుంగొనఁ దలంచి నైమిషమునకున్.

క. అరుదెంచినయమ్మునులకుఁ, బరమానందమున నర్ఘ్యపాద్యాదివిధుల్
నెరపి కుశలప్రసంగము, జరిపెను శౌనకుఁడు వారు సంతసిలంగన్. 36

క. అంతట నమ్మును లందఱుఁ, జింతాంతరములను దొఱఁగి శ్రీపతికథలన్
వింతలుగఁ జెప్పికొనుచును సంతోషముఁ జెందుచున్నసమయమునందున్. 37

సీ. మును పృథుక్షితినాథుఁ డొనరించినమఖంబు, నను హవిర్వ్యత్యాసమునను జేసి
యగ్నికుండంబున నావిర్భవించి వ్యాసమహర్షికడఁ బురాణముల నెల్లఁ
జదివి రహస్యార్థసహితంబుగను జెప్పి, మహనీయు లున్నధామంబులందు
సకలజనంబులు సంస్తవం బొనరింపఁ, బౌరాణికుం డనుపేరు వడసి

గీ. తాఁ బురాణంబుఁ జెప్పెడితఱిని రోమ, హర్షమును గలిగించుట నందఱకును
రోమహర్షణుఁ డనుసార్థనామ మొంది, నట్టిసూతుఁడు విచ్చేసె నచ్చటికిని.

క. అందున్నమహర్షులకున్, వందన మొనరించుటయును వార లమందా
నందమున గౌరవం బిం, పొందఁగ బ్రహ్మాసనంబు నొసఁగి యతనికిన్. 39

క. సూతా నీయాగమనము, చేతోమోదంబు గలుగఁజేసెడి మాకున్
బూతము లైనపురాణ, వ్రాతములు వచించుపుణ్యవంతుఁడ వగుటన్. 40

క. హరికథలకంటె నఘములు, హరియించెడికథలు వేఱ యగపడవు సుమీ
హరికంటెను భవసింధువుఁ, దరియింపఁగఁ జేయు దేవతలు లేరు సుమీ. 41

క. వినినార మెన్ని మాఱులొ, వనజాక్షునిచరితములను వారును వీరున్
వినిపింప వినినకొలఁదిని, విన వలయు నటంచు నుద్భవించెడిఁ గోర్కుల్. 42

క. హరిపారమ్యముఁ దెలిపెడి, హరినాభిసరోజవిషయ మంతయును సవి
స్తరముగ నెఱిఁగించెడియొక, పురాణమును జెప్పు మయ్య పూతచరిత్రా. 43

చ. అనవుడు దేహమందుఁ బులకాంకురముల్ వెలయంగఁ గన్నులన్
బెనఁగొన హర్షబాష్పములు నెమ్మనంబు హరింప నేమియున్
గనఁగొన లేమి నొక్కక్షణకాలము చేష్టలు దక్కి యుండి ని
ద్రను గని మేలుకాంచినవిధంబున సూతుఁడు గాంచి బోధమున్. 44

క. మునులార నన్ను ధన్యుని, నొనరింపఁగ మీకు వాంఛ యుదయించెఁ బరా
త్మునిపుణ్యగాథ తెలిమిని, వినిచెద నా కింతకంటె వే ఱేమిటికిన్. 45

క. అని పలికి సవినయంబుగ, మనమున గురు వైనవ్యాసమహానీంద్రుని భా
వనచేసి భక్తితో నీ, యనువున వినిపింపఁ దొడఁగె నత్తపసులకున్. 46

క. కల దొకమహాపురాణము, కలిహర మైనదియు విష్ణుగాథామృతమున్
జిలుకునదియుఁ బద్మాహ్వయ, కలితం బైనదియు మోక్షకర మైనదియున్. 47

వ. కల్పాంతంబునందు జగంబు లన్నియు నర్ణవమయంబులు గా మరలఁ
గల్పాదియందు మత్స్యరూపుఁ డగుపుండరీకాక్షునిచే నర్ణవమునుండి వేద
వేదాంగపురాణంబులతోడం గూడ నమ్మహాపురాణం బుద్ధృతం బై దేవలో
కంబున శతకోటిప్రవిస్తరంబుగను భూలోకంబునఁ జతుర్లక్షపరిమితంబుగను
బ్రతిష్ఠింపంబడియె. అందు మున్ను బ్రహ్మచేఁ బంచపంచాశత్సహస్రశ్లోకపరి
మితం బగుగ్రంథంబు ప్రకాశితంబయ్యె. అయ్యది యాదిఖండంబును భూమి
ఖండంబును బ్రహ్మఖండంబును బాతాళఖండంబును సృష్టిఖండంబును నుత్తర
ఖండంబును ననునాఱుఖండంబులు గలిగి యున్నయది. 48

—: పద్మపురాణనామ నిర్వచనము :—

క. హరినాభిపద్మవార్తా, కర మై తల్లక్షణములఁ గ్రాలుటచేతన్
సురనరలోకంబులలోఁ, బరగెఁ బురాణంబు గూడఁ బద్మము నాఁగన్. 49

గీ. ఆపురాణంబునందు మీ రడిగినట్టి, యంశముల కెల్ల నుత్తరం బనువు గాఁగఁ
జెప్పఁబడియుంట నయ్యది చెప్పకుండ, నితరములు వేయి చెప్పిన నేమి ఫలము.

క. దాని వినినంతమాత్రన, నానాజన్మాంతరోపనతపాతకసం
తానం బెల్ల నశించు ద, వానలకీలలను దరుచయంబులు వోలెన్. 51

గీ. శ్రద్ధతోడను విన్న సంశయము లేదు, ప్రాప్త మగుటకు మోక్షసామ్రాజ్యపదము
శ్రద్ధ లేకుండ విన్నను సంఘటిల్లు, సద్గతిప్రద మగుపుణ్యసంగ్రహంబు. 52

క. కావునఁ బద్మపురాణము, నేవిధమున నైన వలయు నెల్లరు వినఁగన్
గావు సమంబులు దానికి, నేవియు నది మాధవునకు హృదయం బగుటన్. 53

గీ. ఆపురాణంబు హరి బ్రహ్మ కతఁడు నారదున కతండు పరాశరతనయునకును
నతఁడు నాకును నెఱిఁగించె నదియె మీకు, నే నెఱింగింతు విప్రమానులార. 54

క. మును భీష్ముం డొక్కదినం, బున సంతస మొదవఁ బాద్మమును విని శీఘ్రం
బును గాంక్షించుటయు నని, ట్లనియెం బులస్త్యుండు వికసితాననుఁ డగుచున్. 55

—: పద్మపురాణశ్రవణదీక్షావిధికథనము :—

వ. బ్రాహ్మముహూర్తంబునం దుత్థితుండై పద్మాసనంబునం గూర్చుండి సహస్రారంబునందు శ్వేతవస్త్రోపవీతుండును శ్వేతమాల్యధరుండును శ్వేతగంధానులేపనుండును నగుగురుని ధ్యానించి నదికిం బోయి బ్రహ్మమంత్రంబుచే దంతకాష్ఠంబును మంత్రించి "ఆపోహిష్ఠా" యనుమంత్రంబుచే నేడుమాఱులు సంస్కరించి "దేవస్యత్వా" యనుమంత్రంబు జపించి "యుంజాన" యనుమంత్రంబుచే హస్తంబునం దుంచుకొని "ఈశావాస్య" యనుమంత్రంబుచేఁ బ్రక్షాళనంబు గావించి "బ్రహ్మోదన" యనుమంత్రంబుచే నోటం బెట్టి రుద్ది దూరముగాఁ బాఱవైచి దానిం జూడవలయు నాకాష్ఠంబు సమ్ముఖంబుగాఁ బడెనేని దేవతాలబ్ధియును మంత్రసిద్ధియునుం గలుగు పరాఙ్ముఖంబుగాఁ బడెనేని దేవత లెల్లఁ బరాఙ్ముఖు లగుదురు. ఉత్తరదిక్కునం బడెనేని కార్యసిద్ధి సందిగ్ధం బగు. దక్షిణంబుగాఁ బడెనేని మృత్యుప్రదం బగు. తరువాత స్నానసంధ్యాదు లొనరించి గురుసన్నిధికిం జేరవలయు. గురుండు షోడశారపద్మంబు గాని నవనాభపద్మంబు గాని యష్టదళపద్మంబు గాని లిఖించి తన్మండలంబుం జూపి సితవస్త్రంబుచే శిష్యునకు నేత్రబంధంబు గావించి మండలంబున నష్టదిక్కులందును నష్టదిక్పాలకుల స్థాపించి పూజించి పూర్వంబునఁ గమండలువును దక్షిణంబున స్రుక్కును బశ్చిమంబున హంసమును నుత్తరంబున స్రువమును నాగ్నేయంబున బృసియును నైరృతిభాగంబునఁ బాదుకలును వాయవ్యభాగంబున యోగపట్టంబును నీశానభాగంబున గళంతికయును నుంచి పూర్వదిక్కునందు విష్ణువును బ్రహ్మను ఋగ్వేదంబును బురాణేతిహాసంబులను దక్షిణదిక్కునందు శంకరుని గాయత్రిని యజుర్వేదంబును ఛందస్సును బశ్చిమదిక్కునందు రవిని సావిత్రిని సామవేదంబును జ్యోతిషంబును నుత్తరదిక్కునందు ఋషులను సరస్వతిని నథర్వవేదంబును ధర్మశాస్త్రంబులను బ్రతిష్ఠించి పూర్వదళంబున బలరాముని నీశానుని భాస్కరుని దక్షిణదళంబునఁ బ్రద్యుమ్నుని సద్యోజాతుని దివాకరునిఁ బశ్చిమదళంబున ననిరుద్ధుని వామదేవునిఁ బ్రభాకరుని నుత్తరదళంబున వాసుదేవునిఁ దత్పురుషుని గ్రహరాజును

ప్రతిష్ఠాపించి యథాక్రమంబుగఁ బూజించి యఘోరుని మండలమందు దంత
టను నర్చించి పిదప దిఙ్మండలంబులం దష్టకలశంబులను మధ్యంబున బ్రాహ్మ
కలశంబును స్థాపించి పూజించి ముక్తికామునకు బ్రహ్మకలశంబుచేతను
రాజ్యార్థికి నింద్రకలశంబుచేతను ప్రతాపకాంక్షికి నాగ్నేయకలశంబు చేతను
మృత్యుంజయాభిలాషికి యామ్యకలశంబుచేతను శత్రుధ్వంసకాంక్షికి నైరృత
కలశంబు చేతను పాపనాశనార్థికి వారుణకలశంబుచేతను నారోగ్యకామికి
వాయవ్యకలశంబు చేతను ధనకాంక్షికిఁ గౌబేరకలశంబు చేతను జ్ఞానార్థికి నీశాన
కలశంబు చేతను నభిషేకంబు గావింపవలయు. సర్వకలశాభిషిక్తుం డగు
వాఁడు బ్రహ్మసదృశుండు గాని భూమండలాధిపతి గాని యగు. అట్లభి
షేకంబు గావించి పరీక్షితుండై యున్న శిష్యునకు నాగ్నేయధారణచేఁ బాప
దాహంబును వాయుధారణచేత దగ్ధపాపవిధూననంబును సోమధారణచే నమృ
తాప్యాయనంబును గావించి దాన నర్హత గలిగించి. 56

క. హరిహరవిధులను గురువును, సురలను విప్రులను దాపసుల గ్రహముల భూ
పరిపాలకులను గూడదు, తిరస్కరింపంగ ననుచుఁ దెలిపి సనుయమునన్. 57

వ. "ఓం నమో బ్రహ్మణే భగవతే సర్వరూపిణే హుం ఫట్ స్వాహా" అను షోడ
శాక్షరమంత్రంబుచే గర్భాధానాదిసర్వాహుతులు హోమంబుచేయించి
హోమాంతంబున శక్త్యనుగుణంబుగా శిష్యుం డొసంగెడిగురుదక్షిణ
గ్రహింపవలయు.

గీ. అట్లు దీక్షితుఁ డగుట ననంత మైన, పుణ్యమును మహిమంబును బొంది వినినఁ
బాద్మము ద్విజుండు చెందును బ్రహ్మపదము, సకలపుణ్యక్రియాఫలావాప్తివలన. 59

గీ. భరతవర్షంబునందు నుద్భవము నొంది, దీక్షితుల మయి గురునికటాక్షమునను
బాద్మమును విను భాగ్యంబుఁ బడయు టెపుడొ, యనితపించుచునుందురస్వాహమునురలు

వ. స్త్రీశూద్రులు శ్రద్ధాభక్తిపురస్సరంబుగా నాలకించినఁ దత్ఫలంబుపడయంగలుగు.

క. అనవుడు భీష్ముఁడు సంతస, మొనయఁగ నెడఁ బాద్మకల్పసృష్టిక్రమమున్
వినఁ గాంక్షించుటయును ని, ట్లని యెఁ బులస్త్యుండు పులకితాంగుం డగుచున్. 62

—: పాద్మకల్పసృష్టిప్రకారకథనము :—

సీ. జననాథ నారాయణునిమహత్త్వముఁ జెప్ప, నలవి గా దెట్టివారలకు నైన
నైనను నారాయణావతారం బగు, ద్వైపాయనమహర్షి వలన నేను
వినినదానిని నీకు వినుతు నాలింపుము, పద్మనాభునిగాథ పాపహరము
స్థావరజంగమాత్మక మైనవిశ్వంబు, లన్నియుఁ గూడ నారాయణుండె

గీ. ప్రణవమును వేదములునునారాయణుండె, యజ్ఞములు యజ్ఞఫలము నారాయణుండె
యాదిమధ్యాంతములును నారాయణుండె, లేదు నారాయణేతరం బేది గాని,

వ. కల్పాంతంబునందు నారాయణుండు జగత్సంహారార్థంబు వాయురూపంబునఁ బ్రాణంబులను లాగికొని యాదిత్యరూపంబునఁ బ్రజ్వరిల్లుచుఁ బ్రదీప్తగభస్తి చయంబుచే సాగరంబులను నదులను కూపంబులను హ్రదంబులను నెండించి ప్రాణిజాతంబునం దుండుమూత్రశుక్లరక్తాదిద్రవపదార్థంబును జక్షువులను లాగికొని సర్వప్రపంచంబులను నిర్జలంబుగావించి సంవర్తకానలరూపంబున నఖిలలోకంబులను దహించి భస్మంబుగావించి యాభస్మంబు ధరియించి మహాకృష్ణమేఘరూపంబున క్షీరసంకాశం బగుదివ్యోదకవృష్టిచే మేదినిం దృప్తిపఱిచి నష్టార్కచంద్రపవనపావకాకాశంబును బ్రాణివివర్జితంబును వస్త్వంతరరహితంబును నేకార్ణవీభూతంబును నగునమ్మహాజలంబునం దేకాకియై సనాతనస్వరూపంబున శయనించి మహాయోగసమాధినిష్ఠాగరిష్ఠుండై యుండె.

సీ. అతనిరూపం బేదొ యాతఁ డెవ్వఁడొ యతం, డొనరించుచుండెనే యోగ వేదొ
యావిధంబునను నేకార్ణవోదకమునఁ, గదలక యూఁగుచుండు కాల మెంతొ
తెలిసికొనంగ నేదిక్కును దేనియు, నొకఁడును లేఁ డాతఁ డొకఁడె తక్క
విశ్వంబు లన్నియు విశ్వకారకుఁడైన, యతనిగర్భంబులో నణఁగి యుండె

గీ. నట్టులుండంగ దక్షుకుక్షియందు భూమి, యందుఁ బోలె మార్కండేయుఁడను మహర్షి
సంచరించుచు దైవవశమున దారి, దొలఁగి తద్వక్త్రమున నుండి వెలికి వచ్చి. 65

సీ. కాంచి యేకార్ణవాకారంబుగా నున్న, జగమును లోన నాశ్చర్య మొదవ
నిపు డున్నజగ మెల్ల నెటు వోయె నెక్కడ, నే నుంటి నాకు దిక్కెవ్వ రిచట
భ్రాంతియో లేక స్వప్నంబొ యియ్యది కాదు, స్వప్నంబు భ్రాంతియు సత్యమగుట
యని వితర్కించుచు నాత్మలో వడఁకుచు, భయముచే నెటుఁ బోవఁ బథము లేమిఁ

గీ. జూచి యొకచోట నాసీనుఁ జొచ్చియున్న, దివ్యరూపంబు నొకదానిఁ దెలివిఁ బొంది
నీ వెవఁడ వని యడుగుచు దైవమాయ, వలన వెంటనె మరల లోపలికిఁ బోయె.

ఉ. అట్టులు లోనికిం జనినయమ్ముని శ్రీపతికుక్షిలోనఁ గ
న్పట్టెడిసర్వలోకముల బాగుగఁ జూచి యి దేమి యిట్లు చూ
పట్టెడి నింతలోన నిది భ్రాంతియొ మాయయొ కాకయున్నఁ గ
న్పట్టక యున్న యప్పుడు కనంబడినట్టిమహార్ణవం బిటన్. 67

మ. అని లోలోపల సంశయించుచును సత్యాసత్యముల్ దేలకుం
టను విశ్వాసము లేనిమానసముతోడన్ బుణ్యతీర్థంబులన్
జనులన్ యాగములన్ నదీనదములన్ గ్రామంబులన్ శైలకా
ననసందోహములన్ గనుంగొనుచు వింతన్ జెందుచున్ సారెకున్. 68

ఆ. తిరిగి తిరిగి లోన దివ్యవర్షశతంబు, దైవికముగ నొక్కతరుణమందు
మరల విష్ణువక్త్రమార్గంబులోనుండి, వెలికి వచ్చి చూచి జలము నెల్ల. 69

క. కనఁబడమి జనులు పురములు, గనఁబడమిని గానములు గనఁబడమి గిరుల్
గనఁబడమి భూమి యేమియుఁ, గనఁబడమిని భీతి నొంది కడకొకచోటన్. 70

సీ. పవళించి న్యగ్రోధపత్త్రంబుమీఁదను, దేలుచు జలముపైఁ దెప్ప వోలె
రవికోటిదీప్తిచే రాజిల్లుచుండిన, బాలు నొక్కనిఁ గాంచి భయముఁ జెంది
కంపించుచుండంగఁ గని బాలుఁ డాతనిఁ, గరుణాకటాక్షవీక్షణముతోడ
రమ్మ నాకడకు మార్కండేయ నీకు నే, నభయం బొసంగితి నని వచించె

గీ. నంత నామాట విని ముని యాగ్రహించి, నన్ను దీర్ఘాయు వని పిల్చె నళినజుఁడును
నామమునఁ బిల్వ నవమతి నాకుఁ గల్గె, నెవ్వఁడవొ నీవు నీనామ మేమొ చెపుమ.

సీ. అనుటయు బాలుఁ డిట్లనియె నవ్వుచు వత్స, జనకుండ నేను ముజ్జగములకును
నారాయణుండు నాపేరు నీతండ్రిపు, త్రార్థియై తపియించి యాంగికసుఁడు
వరమును బొందె నావలనఁ బూర్వము లయ, కాలంబులందు లోకములు లేమి
జలములో యోగినై శయనించి యున్నను, వీక్షించుసుతుఁ డుద్భవించునట్లు

గీ. దాన దీర్ఘాయు వైతి వద్దాని కేనె, కారణం బైతి నాపైనిఁ గనల నగునె
యనుడు నమ్మౌని సాష్టాంగ మాచరించి, సైఁపు మపచార మని వేఁడి సవినయముగ.

గీ. దేవ నీమాయ యెట్టిదొ తెలియరాదు, పవ్వళింపఁగ బాలరూపమున నిట్టు
లొంటిగను హేతు వేమియొ యుదధియందు, నెట్టివాఁడవొ నీవు నాకెఱుఁగఁ జెపుమ.

వ. అని ప్రార్థించుటయు నారాయణుం డాతని కిట్లనియె. 74

సీ. వినుము కుమార నావృత్తాంత మొకకొంత, వినిపించెదను నీకు విశదముగను
నొకదినంబున నేనె యొనరింతు సృష్టియుఁ, బ్రళయంబు గూడఁ బ్రపంచములకుఁ
బగలు సృష్టియు రేయి ప్రళయంబు జరుగును, బ్రళయంబునను లోకములను నెల్లఁ
గుక్షిలోపల నుంచుకొని యోమి సర్గంబు, సలుపు కాలము రాఁగ వెలికి విడుతు

గీ. విలయమును జెంద జగములు ప్రళయమందు, సర్వము జలాత్మకంబగు సమయమునను
నాజలంబునఁ గ్రీడింతు నర్భకుండ, నగుచు సర్గేచ్ఛ గలిగెడునంతవఱకు. 75

ఆ. నేనె సృష్టికర్త నేనె రక్షణకర్త, నేనె ప్రళయకర్త నేనె బ్రహ్మ
హరిహరాత్మకుఁడను నంతరాత్మను నేనె, సర్వలోకములకు సాక్షి నేనె. 76

సీ. దయ నేనె నేనె సత్యము నేనె ధర్మంబు, యజ్ఞంబు నేనె హవ్యంబు నేనె
నేనె సూర్యుండను నేనె చంద్రుండను, క్షమ నేనె పంచభూతములు నేనె
బ్రాహ్మణుండను నేనె బ్రహ్మచర్యము నేనె, కాలంబు నేనె సాంఖ్యంబు నేనె
వారివాహము నేనె వర్షంబు నేనె వ, ర్ణాశ్రమంబులు నేనె యతిని నేనె

గీ. వేదములు నేనె తత్ప్రోక్తవిధులు నేనె, ప్రణవమును నేనె మంత్రతంత్రములు నేనె
యిది యది యటంచు వచియింప నేల నేనె, జంగమస్థావరాత్మకజగము లెల్ల. 77

గీ. మరల సర్గంబు గావింపఁ దరుణ మయ్యె, నిపుడె నాకుక్షిలోనికి నేఁగి నీవు
కాంచెదవు కాక నాసృష్టికౌశలంబు, నని తెఱచి నోరులోనికిఁ గొనియె నతని. 78

ఆ. అమ్మునీంద్రుఁ డతనియాస్యంబులోనుండి, మున్నువోలె గర్భమునను జేరి
విస్మయంబుతోడ విశ్వంబులను నెల్లఁ, గాంచుచుండె మొదటఁ గాంచినట్లు. 79

సీ. అంతటఁ బద్మాక్షుఁ డానీటిలో విహ, రించుచు నుండంగ నంచవోలెఁ
గలిగె నాతనికి సంకల్పంబు సృజియింప, జగముల నంత నాజలములోన
సంక్షోభ మొదవె నాసంక్షోభమున నీట, నొక్కసూక్ష్మచ్ఛిద్ర ముద్భవించె
నాఛిద్రముననుండి యావిర్భవించి వా, యువు తన్బుద్ధి మొనరించె నుదక మెల్ల

గీ. సలిలమారుతసంఘృష్టశక్తివలన, నగ్ని పుట్టి పయఃప్రవాహంబు నెల్ల
శోషిలఁగఁ జేసె నంతి నాసూక్ష్మరంధ్ర, మాకసం బయి సర్వంబు నావరించె. 80

సీ. అప్పుడు పుండరీకాక్షుండు మదిలోనఁ, బృథివిని సృజియింప నెంచుచుండ
నిజనాభియందు క్షోణీలక్షణములతో, నొప్పారుపద్మ మొండుద్భవించె
నాపద్మము హిరణ్మయము బహుయోజన, విస్తృతం బుదితరవిప్రభంబు
వేదవేత్తలచేత మేదిని గా నదె, పాద్మకల్పమునఁ జెప్పంగఁబడియె

గీ. దాని కేసరములె దేవతలకు ఋషుల, కాశ్రయము లగుశృంగవదస్తవింధ్య
నీలమందరకైలాసనిషధమేరు, హిమవదాదిమహాగిరు లెల్ల వింటె. 81

గీ. అమ్మహాకేసరములమధ్యమున నుండు, నట్టిమధువె సమస్తపుణ్యస్రవంతు
లకు నఖిలపుణ్యతీర్థంబులకును స్థాన, మయి వెలుంగుజంబుద్వీప మవనినాథ. 82

క. అది యధ్వరంబులకు నెల, వది దానతపోజపవ్రతాదులకును నా
స్పద మిది యది యన నేటికి, నది పుణ్యక్రియల కెల్ల నాశ్రయము సుమీ. 83

వ. మఱియును నసంఖ్యేయంబు లగుక్షుద్రపర్వతంబులును దదాశ్రయంబు లగు మ్లేచ్ఛదేశంబులును గాననంబులును నాపద్మంబునకుఁ బూర్వపర్ణంబులు. దాని యధోభాగపర్ణంబులు దైత్యులకును బన్నగంబులకును నివాసస్థానంబులు. వానిమధ్యప్రదేశంబు మహాపాపకర్ములుండెడియసహ్యనరకస్థానంబు. మఱియును దద్విశేషంబులు వినుము, 84

—: నానాద్వీపపర్వతవర్షనదీజనపదాదివృత్తాంతకథనము :—

చ. కలదు సుదర్శనం బనునొకానొకద్వీపము చక్రమట్లు వ
ర్తుల మయి పర్వతంబులు నదుల్ వనముల్ ధనధాన్యసంపదల్
గలిగినమేటిదేశములు గల్గి మఱిఁక లవణాబ్ధివేష్టనం
బెలసియుఁ గాంచువారలకు నెంతయు విస్మయ మావహిల్లఁగన్. 85

గీ. దానియంశద్వయంబునఁ దనరుచుండు, శశము నా నొక్కద్వీప మంశద్వయమునఁ
బిప్పలం బనుద్వీపంబు నొప్పుచుండు, నన్యభాగంబు లన్నియు నమ్మయములు. 86

వ. శకద్వీపంబునందుఁ బూర్వపశ్చిమసముద్రములరెండుప్రక్కలను వ్యాపించి
ప్రాగాయతంబులై హిమవంతంబును హేమకూటంబును నిషధంబును నీలం
బును శ్వేతంబును శృంగవంతంబును ననునాఱురత్నపర్వతంబులు గలవు. వీని
మధ్యవిష్కంభ మనేకసహస్రయోజనములు. అందుఁ బుణ్యదేశంబులును
బుణ్యవర్షంబులును ననేకంబులు గలవు. వానిలో నానాజాతు లగుప్రాణి
కోటులు వసియించుచుండు. అందులో నివి ప్రథమ మగుభారతవర్షంబు దీనికిఁదరు
వాత హైమవతంబును దానికిఁ బిమ్మట హేమకూటంబు దదనంతరంబు హరి
వర్షంబును నీలపర్వతంబునకు దక్షిణభాగమందును నిషధపర్వతమునకు నుత్తర
భాగమందును బ్రాగాయతం బగుమాల్యవత్పర్వతంబును గలవు. మాల్య
వంతమునకుఁ బిదప గంధమాదనపర్వతంబు గలదు. ఆరెంటికిని నడుమ మేరు
పర్వతంబు గలదు. అది యెనుబదినాలుగువేలయోజనంబులపొడుగును నంతియె
క్రింది భాగంబును గలదియై క్రిందుగను మీఁదుగను నడ్డముగను లోకముల
నావరించియుండె. అచ్చట సుపార్శ్వపత్యం బగుసుముఖం బనువిహంగంబు
స్వర్ణమయంబు లగువాయసంబులం గాంచి.

క. అనుకొనియె మున్ను దనమన,మున నుత్తమమధ్యమాధముల నేకముగా
నొనరించెడి యిచ్చోటను, జనదు నిలువ నాకు నొక్కక్షణమే ననుచున్. 88

వ. దానిపార్శ్వంబులందు భద్రాశ్వంబును కేతుమాలంబును జంబూద్వీపంబును
నుత్తరకురువులును ననునాలుగుపుణ్యద్వీపములు గలవు. 89

సీ. తారలు సూర్యచంద్రగ్రహంబులు నుండు, ధగధగ మనుచు నెద్దానియందు
కార్తస్వరాకృతుల్ గలిగినభవనముల్, తనరారుచుండు నెద్దానియందు
నప్సరోగణయుక్తులై దేవయోనిసం, తతులు క్రీడింతు రెద్దానియందు
బ్రహ్మరుద్రేంద్రాదిబర్హిర్ముఖులు మహో, త్సవము లొనర్తు రెద్దానియందు
గీ. గానములు సేయుచుందు రెద్దానియందు, నారదాదిమహర్షు లానంద మొదవ
నెందు సప్తర్షులును వసియించుచుందు, రమ్మహామేరువును గొనియాడఁ దరమె.

క. కనకాచలమూర్ధంబున, దనుజులతోఁ గూడి యుండు దైత్యగురుండున్
గనకాచలసంబంధం, బున నుండు ననేకరత్నభూమీధరముల్. 91

గీ. త్ర్యంబకసఖుండుజాంబూనదాద్రినుండి, నాలుగవయంశమును సువర్ణము గ్రహించి
దానిలోనికలాంశంబు మానవులకు, నొసఁగు ధనదుండ నెడికీర్తి యొసఁగఁ జనఁడు.

ఉ. ఉన్నది కర్ణికారవన మొక్కటి సర్వఋతుప్రసూనసం
పన్నము గాఁగ మేరుగిరిమధ్యమునన్ హరుఁ డుండె దానిలోఁ
దన్నవసూనమాలికను దాల్చి పదంబులదాఁకఁ గాంతతోఁ
దన్నులకాంతి దీరఁగను గాంచుచు నుండ మహాత్ము లెల్లరున్. 93

క. హరిదశ్వత్రితయమువలెఁ, బరగెడునేత్రత్రయమున భాసిల్లుమహే
శ్వరునిం దిలకింపఁ జాలరు, దురితంబు లొనర్చినట్టిదుర్మతు లెపుడున్. 94

గీ. అమ్మహామేరుగిరిశిఖరమ్మునుండి, విశ్వరూపంబుతో బయల్ వెడలి దుర్ని
వారముగ వచ్చుగంగాస్రవంతిఁ గుసుమ, మాలవలెఁ దాల్చె నాశూలిమస్తకమున.

క. శతవర్షసహస్రంబులు, శితికంఠుఁడు గంగఁ దాల్చి శిరమున మేరు
క్షితిధరమధ్యంబున సు, స్థితుఁ డయ్యెను విస్మయంబుఁ జెంద సుపర్వుల్. 96

క. అమ్మేరువుపశ్చిమపా, ర్శ్వమ్మున సంపదల నొప్పుసుగుజంబూఖం
డమ్మునను గేతుమాలా, ఖ్యమ్మగునొకజనపదంబు గ్రాలుచు నుండున్. 97

ఆ. అచట నుండుజనుల కాయువు పదివేల, వత్సరములు లేవు వ్యాధిశోక
ములును నందుఁ బూరుషులు సువర్ణాకారు, లప్సరస్సమాన లబ్జముఖులు. 98

గీ. గంధమాదనశైలశృంగంబులందు, నాధిపత్యంబు వహియించి యధివసించు
గుహ్యకాధీశ్వరుఁడుగుహ్యకులు నున చ్చ,రలునుగంధర్వులునురాక్షసులునుగొలువ.

గీ. గంధమాదనపార్శ్వభాగమునఁ బదునొ,కొండువేలేఁడులాయుష్య ముండుజనుల
కందు నరులు గృష్ణాకృతి నందు రుత్ప,లాకృతులతోడ దీపింతు రబ్జముఖులు.

వ. అందు నీలంబును శ్వేతంబును నిలావృతంబును హైరణ్యకంబును నైరావతంబును ననునైదు వర్షంబులు గలవు. ఈ వర్షంబులందు చరాచరంబు లగు భూతంబు లన్నియును నుపనివిష్టంబులై యుండు. ఇందలి దేవమానుషాదివృద్ధి బహువిధంబుగా నుండు.

గీ. అందులోపల ధర్మకామార్థవిధుల, చేత నాయుఃప్రమాణంబుచే ననామ
యంబుచేతను సుగుణగణంబుచేత, నుత్తరోత్తరవర్ష మత్యుత్తమంబు. 102

వ. శశద్వీపపార్శ్వంబునందుఁ గర్ణద్వీపంబు గలదు. అందు నాగద్వీపకాశ్యపద్వీపంబులును గర్ణద్వీపశిలం బగుమలయపర్వతంబునుం గలవు. అచ్చటన హేమకూటంబును గైలాసంబును ననుమహాపర్వతంబులు గలవు. అందు వైశ్రవణుండు గుహ్యకులతోడ విరాజిల్లుచుండు. కైలాసంబునకును మైనాకంబునకును నుత్తరంబుగా మణిమయం బగుహిరణ్యశృంగపర్వతంబు గలదు. తత్పార్శ్వభాగంబునఁ గాంచనవాలుకంబును దివ్యంబును నగువిష్ణుసరస్సు గలదు. అచ్చట మున్ను భగీరథుండు గంగను సందర్శించుచు ననేకవత్సరంబులు నివసించె. అచ్చట స్వర్ణమయంబు లగుక్షేత్రంబులును మణిమయంబు లగుయూపంబులునుం గలవు. అందు సహస్రాక్షుండు యాగంబులు గావించి సిద్ధిం బడసె. మఱియు నందు నరనారాయణులును బ్రహ్మయును మనువును సదాశివుండును నాదిత్యుండును సర్వభూతంబులచే నుపాసింపంబడుచుందురు. అచ్చట సహస్రయుగసత్రంబు జరుగుచుండు. త్రిపథగ బ్రహ్మలోకంబునుండి బయలువెడలి

కొండట నచ్చోటఁ బ్రతిష్ఠితయై వటోదక నలిని పావని సరస్వతి జంబువు సీత సింధువు అను నేడురూపంబులు దాల్చి ప్రవహింపం దొడంగె. అవియే సప్త గంగ లని త్రిలోకవిశ్రుతిం గాంచె. అచ్చట నచ్చట సరస్వతి దృశ్యాదృశ్య రూపంబుగాఁ బ్రవహించుచుండు. హిమవంతంబునందు రాక్షసులును హేమ కూటంబునందు గుహ్యకులును నిషధంబున నాగులును గంధర్వులును శ్వేతంబున దేవాసురులును నీలంబున బ్రహ్మర్షులును శృంగవంతంబున దేవతలును నివసించు చుందురు. నిషధంబున గోకర్ణం బనుమహాతపోవనంబు గలదు. నీల పర్వతంబునకు దక్షిణపార్శ్వంబునందును మేరుపర్వతంబునకు నుత్తరపార్శ్వంబు నందును నుత్తరకురువు లనుపుణ్యదేశంబులు గలవు. 103

క. సతతమును బుష్పఫలసం, యుతములును మనోజ్ఞములును సద్వృత్తి రాం
చితములును నభీప్సితఫల, వితరణచణములును గలవు వృక్షము లచటన్. 104

క. కలధౌతవాలుకాంచిత, ములు మణిమయములును నైనభూములతోడన్
విలసిల్లెడునుత్తరకురు, వులమహిమము తరమె మానవులకున్ దెలియన్. 105

క. త్రిదివచ్యుతు లగువార లై, యుదయించుచు నుందు రచట నుత్తమవంశా
భ్యుదయములను నాకృతిసం, పదలను బదొకొండువేలపరమాయువునన్. 106

క. అనురూపం బనురూపం, బనామయత్వంబు సదృశ మగుగుణములు గ
లిగినవార లగుచుఁ బుట్టుచు, మనుచుందురు దంపతులు సమంబుగ నచటన్. 107

క. క్షీరులు నాఁబడుతరువుల, క్షీరము నమృతంబుపోలికిని ద్రావుటచే
నీరోగు లగుచు జను లొ, ప్పారుదు రచ్చోట నిత్యహర్షముతోడన్. 108

క. కలుషము నెఱుంగమిని ని, ర్మల మానసు లగుచు నధికమహిమముతోడన్
విలసిల్లుచుందు రచ్చటఁ, జలుపుచును దపంబు మౌనిసందోహంబుల్. 109

గీ. అచట మృతులైన ప్రాణుల నాక్షణంబ, మోచికొనిపోయి దరులను వైచుచుండు
నమితబలమును దీక్ష్ణతుండములు గలిగి, భాసిలుచు నుండు భారుండపక్షిగణము.

వ. ఉత్తరకురువులవృత్తాంతంబు సంగ్రహంబుగాఁ జెప్పంబడియె. మేరుపర్వత పూర్వపార్శ్వంబునందు భద్రాశ్వంబు గలదు. దానియందు భద్రశాలం బను మహావనంబు గలదు. 111

గీ. నిత్యఫలపుష్పయుతమును నిఖలసిద్ధ, చారణనిషేవితంబును సంస్తుతమును
యోజనోత్సేధమును నయియొప్పుచుండు, నందుఁగాలామ్రమనెడుమహాద్రుమంబు.

గీ. అచటఁ బురుషులు తేజోబలాన్వితులును, నమలమతులును శ్వేతవర్ణాంచితులును
జంచలాక్షులు కుముదవర్ణాంచితలును, జంద్రశీతలగాత్రలు చంద్రముఖులు. 113

గీ. వారి కెల్లను బదివేలవత్సరంబు, లాయురభ్యుదయంబు కాలామ్రరసము
గ్రోలుచుండుటఁ జేసి యేకాలమునను, వారు నవయౌవనమున నొప్పారుచుంద్రు.

వ. నీలంబునకు దక్షిణంబుగను నిషధంబునకు నుత్తరంబుగను సుదర్శనం బను గొప్పజంబూవృక్షంబు గలదు. 115

క. అది ప్రాక్తన మది పావన, మది కిన్నరసిద్ధచారణాదినిషేవ్యం
బది సర్వకామఫలదం, బదె జంబూద్వీపసంజ్ఞ కాధారంబుల్. 116

వ. జంబూద్వీపంబు లక్షయోజనపరిమాణంబు గలిగి యుండె. అచ్చటఁ బంచాశత్సహస్రయోజనపరిమితం బైనమాల్యవత్పర్వతంబు గలదు. దానిశిఖరంబునం దనేకపర్వతంబులు గలవు. 117

ఆ. అచట నుండెడివా రెల్ల హాటకాభు, లైనవా రూర్ధ్వరేతస్కు లైనవారు
బ్రహ్మలోకంబునుండి విభ్రంశ మొంది, నట్టిజనులు బ్రహ్మవాదు లైనట్టివారు. 118

వ. అమ్మహనీయులు భూతరక్షణార్థంబు మార్తాండమండలంబుం బ్రవేశించి యిరువదియాఱు వేలవత్సరంబులు భాస్కరునిఁ బరివేష్టించి యరుణునకు ముందుగా నరుగుచును నాదిత్యతాపతప్తులై యిరువదియాఱువేలవత్సరంబులు చంద్రమండలముం బ్రవేశించుచు నుందురు. మఱియును శ్వేతపర్వతంబునకు దక్షిణంబుగను నిషధపర్వతంబునకు నుత్తరంబుగను రమణకం బనువర్షంబు గలదు. అందుండుమానవులు నిస్సపత్నులును నతిప్రియదర్శనులును శుక్లాభిజనసంపన్నులును నిరంతరహర్షభరితులును నై పంచశతోత్తరైకాదశసహస్రవర్షాయుష్కు లగుచుందురు. నీలపర్వతంబునకు దక్షిణంబుగను నిషధపర్వతంబునకు నుత్తరంబుగను హిరణ్మయం బనువర్షంబు గలదు. అచ్చట హైరణ్వతి యనునదియును పక్షిరాజు గరుత్మంతుండును గలరు. అచ్చట నుండుజనులు మహాబలశాలులును నిరంతరహృష్టమానసులును నై పంచశతోత్తరద్వాదశసహస్రవర్షపరిమితాయుష్కు లగుచుందురు. మఱియు నచ్చట శృంగవంతం బను పర్వతంబు గలదు. దానికి మూఁడు శృంగంబులు గలవు. అందొక్కటి మణిమయంబును మఱియొకటి స్వర్ణమయంబును వేఱొకటి సర్వరత్నమయంబును గా నుండె. అచ్చట స్వయంప్రభ యనుశృంగిణీదేవి నిత్యంబును నివసించియుండు. శృంగవంతంబునకు నుత్తరంబుగా సముద్రాంతంబునం దైరావతం బను వర్షంబు గలదు. అందు 199

గీ. లేదు మార్తాండగమనంబు లేదు ముదిమి, మానవులకు సనక్షత్రుఁ డైనచంద్రుఁ
డుండు నావృతమైయున్న జ్యోతివోలె, వెలయు నాయువు పదుమూఁడువేలయేండ్లు.

ఆ. ఉండెదరు దేవలోకవిచ్యుతినిఁ గాంచి, నట్టివా రచ్చటను నిరాహారు లగుచుఁ
బద్మవర్ణప్రభాగంధభరితు లగుచు, శాంతు లగుచును వీతరజస్కు లగుచు. 121

వ. [illegible]శార్ఙ్గవంబునకు నుత్తరభాగంబున హరివర్షంబు గలదు. 122

సీ. అష్టచక్రము స్వర్ణమయంబు భూత, యుక్తము మనోజమువ పీతిహోత్రవర్ణ
మధిక తేజోవిరాజిత మైనశకట, మందు వసియించి వైకుంఠుం డచట నుండు.

గీ. అఖిలభూతంబులకుఁ బ్రభు వతఁ డతండె. భూతపంచకమును సర్వభువనములకుఁ
గర్తయు నతండె యాతఁడె కారయితయు, నతఁడె సృష్టియు నుక్రళయమును నతఁడె.

గీ. అతఁడు సకలాంతరాత్ముఁడు యజ్ఞమతఁడు, సర్వభూతంబులకుఁ దదాస్యంబు వహ్ని
యతఁడె నారాయణుండు నారాయణుండె, యతఁడు వారిద్ధమును నొండెయగుటఁ జేసి.

వ. వైవస్వతమనువును, బ్రియమిత్రుండును, బృథువును, వైన్యుండును, నిక్ష్వాకువును, నంబరీషుండును, మాంధాతయును, నహుషుండును, యయాతియును, ముచుకుందుండును, గుబేరోశీనరుండును, ఋషభుండును, నైలుండును, నృగుండును, గుశికుండును, గాధియును, సోముండును, దిలీపుండును మున్నగుమహాత్ములకును సర్వభూతంబులకును బ్రియంబును నుత్తమంబును నగు భారతవర్షంబునందు మహేంద్రంబును, మలయంబును, సహ్యంబును, శుక్తిమంతంబును, ఋక్షవంతంబును, వింధ్యంబును, పారియాత్రంబును ననుసప్తకులపర్వతంబులు గలవు. వానిసమీపదేశంబులందు సారవంతంబులును విపులంబులును నత్యద్భుతంబులును నవిజ్ఞాతంబులును నగుపర్వతసహస్రంబులు గలవు. మఱియును నిందు నార్యులును, మ్లేచ్ఛులును, మిశ్రులును నగుమానవులు గలరు. మఱియును గంగ, సింధువు, సరస్వతి, విపుల, గోదావరి, నర్మద, బహుద, శతద్రువు, చంద్రభాగ, యమున, దృషద్వతి, విపాశ, వేత్రవతి, కృష్ణవేణి, యిరావతి, వితస్త, పయోష్ణి, దేవిక, వేదస్మృతి, వేదశిర, త్రిదివ, సింధులాకృమి, కరీషిణి, చిత్రవహ, త్రిసేన, గోమతి, ధూతపాప, చందనకౌశికి, నాచిత, రోహితారణి, రహస్య, శతకుంభ, సరయువు, చర్మణ్వతి, వేత్రవతి, హస్తిసోమ, దిశ, శరావతి, భీమ, భీమరథి, కావేరి, వాలుక, వాపి, శతమలి, నీవార, మహిత, సుప్రయోగ, పవిత్ర, కృష్ణల, వాజిని, పురుమాలిని, పూర్వాభిరామ, వీర, మాలావతి, పలాశిని, పాపహర, మహేంద్ర, పాటలావతి, యసిక్ని, కుశవీర, మరుత్వ, ప్రవర, మేన, హేమార, ఘృతవతి, యనాకతి, యనుష్ణి, సేవ్య, కాపి, సదావీర, యధృష్య, కుశచీర, రథచిత్ర, జ్యోతిరథ, విశ్వామిత్ర, కపింజల, యుపేంద్ర, బహుల, కువీర, యంబువాహిని, వైనంది, పింజల, వేణ, తుంగవేగ, విదిశ, కృష్ణవేగ, తామ్ర, కపిల, ధేనువు, సకామ, దేవస్వ, హవిస్స్రావ, మహాపథ, శిప్ర, పిచ్ఛల, భారద్వాజి, కౌశికి, శోణ, బాహుద, చంద్రమ, దుర్గ, యంతశ్శిల, బ్రహ్మమేధ్య, పరోక్ష, రోహి, జంబువు, సునాస, తపస, దాసి, సామాన్య, వారణ, యసి, నీల, ధృతికరి, పర్ణాశ, మానవి, వృషభ, భాష, కృష్ణ, మందవాహిని, బ్రాహ్మణి, మహా

గాఁ; చిత్రోత్పల, చిత్రరథ, మంజుల, రోహిణి, మందాకిని, వైతరణి, కోశ;
శుక్తిమతి, అనంగ, వృషకాహ్వయ, కుమారి, ఋషికుల్య, మారిష, లౌహిత్య,
కరతోయ, సుపుణ్య మున్నగు పుణ్యనదు లసంఖ్యేయంబులుగాఁ గలవు. మఱి
యును గురువులు, పాంచాలములు, సాల్వములు, మాత్రేయములు, జాంగల
ములు, శూరసేనములు, పుళిందములు, బౌధములు, మాలములు, మత్స్య
ములు, కుసట్టములు, సౌగంధ్యములు, కాశ్యపరకాశికోసలంబులును, జేది
కరూశంబులు, భోజసింధువులును, నుత్తమములును, దశార్ణములును, మేకల
ములును, నుత్కలములును, నైకపృష్ఠయుగంధరములును, బోధములును,
మద్రములును, ఖరరములును, గుకురములును, గుంత్యవంత్యపరకుంతిగోమం
తంబులును, మల్లకములును, ఋంద్రకములును, విదర్భములును, నృపవాహిక
లును, నశ్మకంబులును, నుత్తరాశ్మకంబులును, గోపరాష్ట్రంబులును, నధి
రాజ్యంబులును, మల్లరాష్ట్రంబులును, గేరళంబులును, మాలవంబులును,
నుపవాస్యంబులును, వక్రావక్రాతపంబులును, శకములును, విదేహంబులును,
మాగధంబులును, సద్మంబులును, మలజంబులును, విజయంబులును, అంగ
వంగకళింగంబులును, యకృల్లోమంబులును, మల్లంబులును, సుదేష్ణంబులును,
బ్రహ్లోదంబులును, మహిషంబులును, శశకంబులును, బాహ్లికంబులును, వాటధా
నంబులును, నాభీరంబులును, గాలతోయకంబులును, బరాంతాపరాంతంబులును,
భంకలంబులును, జర్మచండకంబులును, నటవీశేఖరంబులును, మేరుభూతంబు
లును, నుపావృత్తానుపావృత్తంబులును, సురాష్ట్రంబులును, గేకయంబు
లును, గుట్టాపరాంతంబులును, మాహేయంబులును, గక్షంబులును, సాముద్ర
నిష్కుటంబులును, నంధంబులును, నంతర్గిరులును, బహిర్గిరులును, నంగమ
లదములును, మగధములును, సత్వోతరంబులును, ప్రావృషేయంబులును, భార్గ
వంబులును, భార్గములును, గిరాతంబులును, భానురంబులును, నిషాదములును,
నిషధములును, నానర్తనైరృతంబులును, బూర్ణలంబులును, బూతిమత్స్యంబు
లును, గుంతలంబులును, గుశకంబులును, దీరగ్రహంబులును, నీజికంబులును,
గల్పకారణంబులును, దిలభాగంబులును, మసారంబులును, మధుమత్తంబు
లును, గకుంధకంబులును, గాశ్మీరంబులును, సింధుసౌవీరంబులును, గాంధా
రంబులును, దర్శకంబులును, నభీసారంబులును, గలద్రుతంబులును, సౌరిలం
బులును, దర్వీబల రట్ట సుదామంబులును, సుమల్లికలును, బంధాకరీకషంబు
లును, గువిందంబులును, గంధికంబులును, వనాయుదశపార్శ్వరోమకుశబిందు
వులును, కాచ్ఛంబులును, గోపాలకచ్ఛంబులును, జాంగలంబులును, సిద్ధంబు
లును, దామ్రలిప్తికలును, నౌఢ్రమ్లేచ్ఛంబులును, సైరింధ్రంబులును, పార్వతీ

యంబులును, ద్రవిడంబులును, ప్రాచ్యంబులును, మూషికంబులును, బాల మూషికంబులును, గిష్కింధంబులును, ఘుల్లికంబులును, గర్ణాటకంబులును, మాహిషకంబులును, గుంతలంబులును, సౌహృదంబులును, నలకాననంబులును, గోకుట్టకంబులును, జోలంబులును, గోంకణంబులును, మణివాలుకంబులును, సమంగంబులును, గనకంబులును, నూరీషాంగారంబులును, ధ్వజిన్యుత్సవసంకేత మాల్యసేనిత్రిగర్భంబులును, వ్యాఢకంబులును, గోరకంబులును, బ్రోష్ఠంబులును, సంగవేగధరంబులును, వింధ్యపౌలీయంబులును, బులిందంబులును, వల్బలంబులును, మాలవంబులును, మలకంబులును, గురునర్ణకంబులును, బర్బరంబులును, నపరవర్తకంబులును, గాలదంబులును, ముసలంబులును, స్తనవాలుకంబులును, జండకంబులును, గురటంబులును, దోమరంబులును, హాన్యమానంబులును, సుతీర్థాప్రాతిసృంజయంబులును, ననిదాయంబులును, శివాటంబులును, దపానంబులును, సూతపంబులును, ఋషికంబులును, విదర్భంబులును, స్తంగనంబులును, బరతంగకంబులును, జవనంబులును, గంబోజంబులును, దారుణంబులును, గులట్యంబులును, హూణంబులును, బానసికంబులును, రమణంబులును, దరదంబులును, దశమాసికంబులును, శూరాభీరంబులును, ఖాండీకంబులును, దుపారంబులును, బద్మావంబులును, గిరిగహ్వరంబులును, నాత్రేయంబులును, భరద్వాజంబులును, స్తనపోషకంబులును, ద్రోషకంబులును, గరభంజకంబులును మున్నగు నసంఖ్యాకజనపదంబులు గలవు. మఱియును గృతయుగంబును, త్రేతాయుగంబును, ద్వాపరయుగంబును, గలియుగంబును ననునాలుగు యుగంబులు క్రమంబుగాఁ గలవు. కృతయుగంబునందు నాలుగు వేలును త్రేతాయుగంబునందు మూఁడువేలును, ద్వాపరయుగంబునందు రెండు వేలును నాయుర్వర్షప్రమాణంబు జనంబులకు విహితం బయ్యె. కలియుగంబున నాయుఃప్రమాణంబు లేమింజేసి గర్భస్థు లగుచుండఁగనే కొందఱును బుట్టినతరువాతఁ గొందఱును ననియతంబుగా మరణించుచుందురు. 126

క. కృతయుగమున బలసత్త్వ, ప్రతిభాగుణయుతులు ధర్మపరు లెల్లజనుల్
శ్రుతయుతులు రూపవంతులు, జితేంద్రియులు వీరు లమలశీలురు రాజుల్. 127

క. త్రేతాయుగమున నభిజన, జాతులు సత్యాభిరతులు జను లెల్లరు సం
ఖ్యాతీత గుణసమేతులు, స్వాతంత్ర్యాన్వితులు చక్రవర్తులు రాజుల్. 128

క. ద్వాపరయుగమున నుత్సా, హోపేతు లమేయవీర్యయుతు లన్యోన్య
వ్యాపాదనతత్పరులు ప్ర, తాపసమంచితులు జనవితానము లెల్లన్. 129

క. కలియుగమున గర్వులు లో, భు లసూయాపరులు దుష్టబుద్ధులు పాపా
త్ము లసత్యవాదులును గో, పులు మాయావులును నగుచుఁ బుట్టుదురు జనుల్.

వ. మఱియును జంబూద్వీపంబును శాకద్వీపంబును కుశద్వీపంబును శాల్మలి ద్వీపంబును క్రౌంచద్వీపంబును శరద్వీపంబును పుష్కరద్వీపంబును నను సప్త ద్వీపంబులు గలవు. జంబూద్వీపంబునందు షట్ఛతోత్తరాష్టాదశసహస్ర యోజనంబులవై శాల్యంబు గలజంబుపర్వతంబు గలదు. దానికంటె ద్విగుణ వైశాల్యంబు గలలవణసముద్రంబు గలదు. లవణసముద్రంబు నానాధాతుచిత్రి తంబు లగుపర్వతంబులచేతను నానాజనపదంబులచేతను వ్యాప్తంబై యుండె. శాకద్వీపంబు జంబూద్వీపంబుకంటె ద్విగుణాధికం బగుపరిమాణంబు గలదియై క్షీరసముద్రంబు నావరించి యుండె. 131

క. కల వచటఁ బుణ్యజనపద, ము లసంఖ్యాకములు మరణమును జెందక న
ర్థిలుచుందు రందుఁ దేజః, కలితు లగుచు జనము లెల్లఁ గలకాలంబున్. 132

వ. అందు మేరువు, మలయము, జలధారము, రైవతకము, శ్యామము, దుర్గము, కేసరి యనుసప్తమణిపర్వతంబులు గలవు. మేరుపర్వతంబు దేవర్షిగంధర్వాది సంయుతంబై యుండు. మలయపర్వతంబు ప్రాగాయతంబై యుండు. అచ్చట నుండి మేఘంబులు బయలువెడలుచుండు. జలధారపర్వతంబునుండి వాసవుండు నిత్యంబును జలంబు గ్రహియించుచు వర్షాకాలంబునందు వర్షంబు గురియించు చుండు. రైవతకంబునందు రేవతీనక్షత్రంబు ప్రతిష్ఠితం బయ్యె. శ్యామపర్వ తంబు నవమేఘప్రభాభాసమానంబై యున్నతంబై రైవతకంబునకు నుత్తరం బుగా నుండె. శ్యామగుణం బాపర్వతంబునుండి వచ్చుటం జేసి దానికి శ్యామ నామధేయంబు గలిగె. 133

క. ఆమహీధరము తెఱంగున, శ్యామాకృతి నెసఁగ నచటిజను లెల్లరు ని
త్యామోదభరితు లగుచును, క్షేమంబున నుందు రిష్టసిద్ధులు గలుగన్. 134

వ. దుర్గశైలంబు మహాహ్లాదయంబై యున్నయది. కేసరిపర్వతంబు కేసరయుతంబై యుండు. అప్పర్వతంబునుండియే వాయువు బయలువెడలుచుండు. అప్పర్వతం బుల కన్నింటికిని యోజనవిష్కంభంబు ప్రవిభాగంబువలన ద్విగుణంబుగా నుండు. మేరువునకు మహామేరువును మలయంబునకు మహాకాశంబును జల ధారంబునకు జలదంబును రైవతకంబునకుఁ గౌమారంబును శ్యామంబునకు మణికాననంబును దుర్గంబునకుఁ గుముదోత్తరంబును గేసరంబునకు మహాదాకి యును నను వర్షంబులు గలవు. మఱియును శాకద్వీపమధ్యంబునందు జంబూ ద్వీపపరిమితం బగుశాకవృక్షంబు గలదు. మఱియును. 135

. కల వచటఁ బుణ్యజనపద, ములు శంకరుఁ డచట నుండు మునులును గీర్వా
ణులుఁ జారణులును సిద్ధులుఁ, గొలుచుచు నుండంగఁ బ్రమథకోటులతోడన్. 136

క. కల రచట నాల్గువర్ణంబులవారు స్వధర్మరతులు ముదిమియు మృతియుఁ
గలుగక వర్షర్తువులో, పల స్రోతస్వినులు వోలెఁ బడయుచు వృద్ధిన్. 137

వ. గంగయును సుకుమారియును గుమారియును సీతయును శివోదకయును మణిజలయును నిక్షువర్ధనికయును మున్నగు నసంఖ్యేయమహాపుణ్యనదులు శతసహస్రంబులుగా నక్కడనుండి ప్రవహించుచుండు. అచ్ఛోటనుండి వాసవుండు వర్షించుచుండు. 138

క. ఆపరమమంగళము లగు, నాపగలమహత్త్వ మెన్న నలవియె నాకున్
దాపములను బాపములను, బాపం గల వవి నిజప్రభావముచేతన్. 139

వ. మఱియును నచ్చట మృగంబులు మశకంబులు మానసంబులు మల్లకంబులు ననునాలుగు పుణ్యజనపదంబులు గలవు. మృగంబులందు బ్రహ్మభూయిష్ఠులును విహితకర్మపరాయణులును నగు బ్రాహ్మణులును మశకంబులందు ధార్మికులును సర్వకామప్రదాయకులును నగు రాజన్యులును మానసంబులందు ధర్మోపజీవు లగు వైశ్యులును, మల్లకంబులందు ధర్మశీలు రగుశూద్రులును గలరు. 140

క. దండనము చేయుఱేఁడును, దండనమును నచట లేవు ధర్మముచే వా
రుండెదరు బద్ధు లగుచును, నొండొరువులు రక్షకులుగ నొండొరువులకున్. 140

వ. ఉత్తరద్వీపంబులును బర్వతంబులును దధిసురాదుగ్ధసముద్రంబులచే నావరింపంబడియె. మధ్యమద్వీపంబునందు గౌరవర్ణం బగుమనశ్శిలపర్వతంబును బశ్చిమద్వీపంబునందు నారాయణసఖం బగుకృష్ణపర్వతంబును గలవు. అచ్చట దివ్యంబు లగురత్నంబులను స్వయముగాఁ గేశవుండు రక్షించుచుఁ బ్రసన్నుండై ప్రజాసౌఖ్యంబు నాపాదించుచుండు. కుశద్వీపంబునందుఁ గుశస్తంభంబును శాల్మలిద్వీపంబున శాల్మలివృక్షంబును, క్రౌంచద్వీపంబున మహాక్రౌంచపర్వతంబును జనపదమధ్యంబునఁ జాతుర్వర్ణ్యంబుచేఁ బూజింపంబడుచుండు. మఱియును గోమంతం బను మహాపర్వతంబు గలదు. అచ్చట నారాయణుండు జ్ఞానిసంయుతుండై నిత్యంబును నివసించియుండు. శరద్వీపంబునందు విద్రుమచితంబగు సునామపర్వతంబును హేమపర్వతంబును గుముదపర్వతంబును బుష్పవత్పర్వతంబును గుశేశయపర్వతంబును హారిపర్వతంబును ననునాఱు మహాపర్వతంబులు గలవు. వాని కన్నింటికిని నంతరవిష్కంభము ద్విగుణంబు గా నుండు. మఱియును జౌద్భిదంబును రేణుమండలంబును సురథంబును లంబనంబును ధృతిమంతంబును ప్రభాకరంబును గాపిలంబును ననునేడు వర్షంబులు గలవు. 142

క. దేవులు గంధర్వులు ప్రజ, లావర్షములందు సంప్రహర్షముతోడన్
గావింతురు విహారణములు, లే వచ్చటిప్రజకు మృతియుఁ [illegible]. 143

క. చోరులును మ్లేచ్ఛజాతులు, లే రావర్షములలోన లే రవినీతుల్
గౌరాకారము గలసుకు, మారుల యెల్లరును నందు మసలెడివారల్. 144

వ. క్రౌంచపర్వతంబునకుఁ బిదప వామనపర్వతంబును వామనపర్వతంబునకుఁ బిమ్మట నంధకారపర్వతంబును నంధకారపర్వతంబునకుఁ బిదప మైనాకపర్వతంబును మైకనాపర్వతంబునకుఁ బిమ్మట గోవిందపర్వతంబును గోవిందపర్వతంబునకుఁ బిదపఁ బుండరీకపర్వతంబును బుండరీకపర్వతంబునకుఁ బిమ్మట దుందుభిస్వనపర్వతంబును గలవు. ఆపర్వతంబులకు ముందువిష్కంభము ద్విగుణంబై యుండు. క్రౌంచంబునకుఁ గుశలదేశంబును వామనంబునకు మనోనుగదేశంబును మనోనుగంబునకుఁ బిదప నుష్ణదేశంబును నుష్ణదేశంబునకుఁ బిమ్మట ప్రావరదేశంబును ప్రావరదేశంబునకుఁ బిదప నంధకారకదేశంబును నంధకారకదేశంబునకుఁ బిమ్మట మునిదేశంబును మునిదేశంబునకుఁ బిదప దుందుభిస్వనదేశంబునుం గలవు. 145

గీ. దేవగంధర్వచారణసేవితంబు, లగుచు నాదేశములు పొలుపారుచుండు
గౌరవర్ణాన్వితులు గ నక్కడను నుండు, జనులు విలసిల్లుచుందురు సంతతమును.

వ. పుష్కరద్వీపంబునందుఁ బుష్కరం బనుమహాపర్వతంబు గలదు. 147

క. సతతము మహర్షులును దే, వతలును సేవించుచుండ వైభవమున నా
క్షితిధరమున నుండుఁ బ్రజా, పతి సకలద్వీపములకుఁ బాలకుఁ డగుచున్. 148

వ. ఆద్వీపంబునం దుండుప్రజ లెల్లరును స్వయముగా నుపస్థితం బగుసిద్ధాన్నంబు భుజియించు చుందురు. అం దుండుబ్రాహ్మణులకు బ్రహ్మచర్యంబుచేతను సత్యంబుచేతను దమంబుచేతను నారోగ్యాయుఃప్రమాణంబులు ద్విగుణాధికంబులై యుండు. అటుపిమ్మటఁ జతురస్రం బగుమహాశైలం బొకండు గలదు. అం దష్టదిగ్గజంబులు గలవు. అమ్మహాపర్వతంబుతిర్యగూర్ధ్వాధోభాగంబుల పరిమాణంబు చెప్ప నలవి గాదు. సకలదిశలకును నక్కడనుండి వాయువులు ప్రవర్తిల్లుచుండు. అం దుండుదిగ్గజంబు లావాయువులను దొండంబులచేఁ బీల్చికొనుచు విడిచిపెట్టుచుండు. ఇంకను ననేకద్వీపంబులును ననేకవర్షంబులును ననేకపర్వతంబులునుం గలవు. వానిని లెక్కించుట కాదిశేషుం డైనను శక్తుండుగా నేరఁడు. 149

క. ఈపాద్మకల్పసృష్టిక, థాపీయూషంబు గ్రోలుధన్యుఁడు విగళ
త్పాపుఁ డయి యుండు దివిష, ద్రూపంబున దివిని మేను దొఱఁగినపిదపన్. 150

ఆ. పర్వమందు దీనిఁ బఠియించినను విన్నఁ, జాలు నరకబాధ సైఁప లేక
వెతలు గుడుచు చుండుపితరుల నెల్లను, నూర్ధ్వలోకమునకు నుద్ధరింప. 151

క. అని చెప్పుటయును భీష్ముఁ, డనవధికం బైనహర్ష మావహిలంగన్
మనమునఁ దదాజ్ఞ గైకొని, చనియె హరిద్వారమునకుఁ జలుపఁ దపంబున్. 152

క. అనవుడు మునీంద్రు లిట్లని, రనఘా నీచెప్పినట్టియంశంబుల నె
ల్లను వినుట నమృతపానం,బును జేసినయట్టితృప్తిఁ బొందితిమి సుమీ. 153

క, వినను నొకకోరికి మా,మానసముల నొదవెఁ దీర్థమహిమంబు వినం
గా ననుడు సూతుఁ డెంతయు, నానందము నొంది యంతరంగమునందున్. 154

క. మునులార నేఁడు మీరలు, ననుఁ గాంక్షించినవిధంబున నె మున్ను వసి
ష్ఠుని నడుగ దిలీపుం డ, మ్మునివరుఁ డిట్లనియె రాజమూర్ధన్యునకున్. 155

—: నా నా తీ ర్థ మా హా త్మ్య క థ న ము :—

గీ. ద్రవిణసాధ్యంబు లైనయధ్వరము లెన్ని, శతసహస్రంబు లేనియు సాటి గావు
గవ్వయును లేక భవవార్ధిగట్టుఁ జేర్చు, నట్టితీర్థాటనమునకు నవనినాథ. 156

గీ. అధిప యతిరాత్రపౌండరీకాదిమఖము, లాచరించిన ఫలము తీర్థాభిగమన
ఫలమునకుఁదక్కువని చెప్పఁబడియెగుహ్య,మైనఋషియజ్ఞమగుటఁదీర్థాటనంబు.

గీ. సర్వభూతంబులందాత్మసామ్య మెనయు,నాఁడును జితేంద్రియుండగు వాఁడు సత్య
నిష్ఠ గలవాఁ డహంకారనిర్గళితుఁడుఁ, దీర్థఫలపాత్రు లగుదురు పార్థివేంద్ర.158

గీ. అప్రతిగ్రహణం బనుహస్తశుద్ధి, చెడనిసంతుష్టి యనియెడుచిత్తశుద్ధి
కలిగి విద్యాతపఃకీర్తికలితుఁ డగుచు, వెలసిన దృఢవ్రతుఁడు తీర్థఫలము నొందు.

గీ. తీర్థములలోన నుత్తమతీర్థ మాది, తీర్థ మొక్కటి కలదు పృథ్వీకళత్ర
పుష్కరం బనుపేరను బొలుచు చుండు,నది వివిధతీర్థసాన్నిధ్య మొదవి యెపుడు.

క. వసియించుచు నుందురు స, ర్వసమయములయందుఁ దీర్థరాజంబునఁ దా
పసులును సిద్ధులు సాధ్యులు, వసురుద్రాదిత్యముఖులు వసుధాధీశా. 161

చ. తప మొనరించి దేవతలు దానవులున్ మును లాస్థలంబునన్
వ్యపగతపాపులై నిజనిజాభిమతంబులసిద్ధి నొంది రె
ల్లపుడును బద్మయోనియుఁ దదాశ్రయమున్ బెడఁబాయ కుండు నే
నెపుడును గూడ దాని స్మరియించుచు నుండుదుఁ బార్థివోత్తమా. 162

క. పితృదేవతార్చనాభ్యు, ద్యతమానసుఁ డగుచు నచట నభిషేకము నే
కృతబుద్ధి సలుపు నాతఁడు, శతాశ్వమేధములఫలము సంప్రాపించున్. 163

గీ. పుష్కరమునందు నొక్కవిప్రునకు నేని, భోజనము పెట్టునాతఁ డాపుణ్యమునను
శాశ్వతబ్రహ్మలోకవాసంబు వడసి, దివ్యరూపంబుతోడను దేజరిల్లు. 164

గీ. ఉభయసంధ్యలయందు నేయుత్తముండు,పుష్కరంబును మానసంబున స్మరించు
నతఁడఖిలతీర్థములఁ దానమాడినట్టి, ఫలము నొకత్రుటిలో నొందఁగలుగుఁజూవె.

క. జననము మొదలుగఁ గావిం, చినపాపము లన్నియును నశేషమ్ముగ నా
శన మొంది తీరుఁ బుష్కర, మున కేఁగినయంతమాత్రమున నెల్లరకున్. 166

గీ. సురల కెల్లరకును మధుసూదనుండు, ప్రథముఁడై యుండినట్లు తీర్థముల కెల్లఁ
బుష్కరం బాదిమం బనఁ బొల్చు జగతి, దానిమహిమం బమేయము ధరణినాథ.

గీ. అగ్నిహోత్రంబు నూఱేండ్లు నాచరించు
బ్రాహ్మణుఁడు చెందుఫలము పూర్ణముగఁ బడయు
నొక్కకార్తికపూర్ణిమ నుండె నేని
పుష్కరమునందు నెవఁ డేని భూవరేంద్ర. 168

క. పుష్కరగమనోద్యోగము, పుష్కరమునఁ జేయుదానములు ధర్మములున్
బుష్కరతీర్థనివాసము, దుష్కృతకోటులను దొలఁగఁ ద్రోయును భూపా. 169

వ. పుష్కరంబునుండి ప్రదక్షిణంబుగా నశ్వమేధఫలప్రదంబును వైకుంఠప్రాపకంబును నగుజంబూమార్గంబు ప్రవేశించి యచ్చట నైదురాత్రు లుండినవారు నరకమార్గముం గనుంగొనకుందురు. పిదప స్వర్గప్రదంబును దుర్గతిచ్ఛేదకంబును నగుతుండూలికాశ్రమంబు గలదు. అక్కడనుండి యగస్త్యాశ్రమంబుం బ్రాపించి యందుఁ ద్రిరాత్రోపవాసంబును బితృదేవతార్చనంబును గావించినజనుం డగ్నిష్టోమఫలంబు నొందు. పిమ్మటఁ గన్యాశ్రమంబున ఫలంబు లాహారంబుగాఁ గొని త్రిరాత్రంబులు వసియించినవాఁడు కౌమారంబు వడయు. పిమ్మటఁ బ్రవేశమాత్రంబున సర్వపాపహరం బగుధర్మారణ్యంబునకుం జేరి పితృదేవతల నర్చించి సర్వకామసమృద్ధయాగఫలంబు గాంచు. పిదప దానికిఁ బ్రదక్షిణముగా యయాతిపతనక్షేత్రమున కేఁగె నేని హయమేధయాగఫలంబు నొందు. తరువాత మహాకాలంబు గలదు. అందుఁ గోటితీర్థంబును స్పృశియించినమాత్రంబున శతాశ్వమేధఫలంబు గలుగు. పిదప భద్రవటం బనుప్రసిద్ధిం బడసినశివతీర్థంబు గలదు. అచ్చట మహాదేవదర్శనంబు గావించి తదనుగ్రహంబున గోసహస్రదానఫలంబు వడయు. దానంజేసి సర్వసంపత్సమృద్ధంబును నసపత్నంబును నగు గణాధిపత్యంబు నొందు. 170

చ. కలదు కళింగమం దమరకంటకభూధర మందు రేవ నాఁ
గలదు స్రవంతి యొం డఖిలకల్మషనాశని యందు స్నానముల్
సలుపుచు మూఁడుకాలములు సల్పి తపంబును సత్వరంబుగా
ఫలమును గాంచఁ గల్గిరి సుపర్వులు దానవులున్ నృపోత్తమా. 171

గీ. కనఖలాచలమందు గంగాస్రవంతి, యును గురుక్షేత్రరాజమందును సరస్వ
తియును బూతము లఖిలప్రదేశములను, నర్మదానది పూత యనంగఁ బొలుచు

గీ. త్రిదినపావనము సరస్వతీజలంబు, సప్తదినపావనము యమస్వసృజలంబు
స్నానమాత్రపావనము ద్యోనదిజలంబు, రేవజలము దర్శనమాత్రపావనంబు. 173

ఆ. నర్మదాజలంబునను మున్గి యమరకం, టకమునందు నిరశనవ్రతంబు
కలిమి నొక్కరాత్రి గడపినమానవుఁ, డుభయకులసహస్ర ముద్ధరించు. 174

గీ. శ్రాద్ధ మొనరించి నర్మదాజలమునందుఁ, బిండ మర్పించెనేని యాపిండ మొకఁడె
చాలుఁ బితరుల నాభూతసంప్లవంబు, తృప్తిపఱుపంగఁ భూతధాత్రీకళత్ర. 175

ఆ. అమరకంటకాద్రి కన్నిదిక్కుల రుద్ర, కోటి యుండునట్టిచోటఁ దీర్థ
మాడెనేని చాలు నది రుద్రకోటికి, సంఘటిల్లఁజేయు సమ్మదంబు. 176

గీ. పర్వతమునకుఁ బశ్చిమభాగమందు, శంకరుం డుండు నచ్చోట స్నానమాడి
శ్రద్ధతోడను బితృతృప్తి సలుపునాతఁ, డుభయవంశంబులను గూడ నుద్ధరించు.

గీ. అతనిపితృదేవతలు స్వర్గమందు నెల్ల, విధముల సుఖించి యఱువదివేలయేండ్లు
జననమరణప్రవాహఘట్టనము లేని, రుద్రలోకంబు నవలఁ జేరుదురు భూప. 178

గీ. యోజనంబులకొలఁదిగా నున్నతంబు, విస్తృతంబును నైనపృథ్వీధరంబు
పైని నఱువదికోటు లర్వుదిసహస్ర, ములును గలవు మహాతీర్థములు నరేంద్ర.

సీ. అప్సరస్త్రీయుక్తుఁ డయి నూఱువేలేఁడు, లమరపురీసౌఖ్య మనుభవించు
ననుభవించి వసుంధరాధిపాన్వయమందు, నవనినాథుండు గా నవతరించు
నవతరించి చిరాయురారోగ్యసంపద, లెల్లవేళల నొప్ప నుల్లసిల్లు
నుల్లసిల్లి యనన్యయోగ్య మైనప్రశస్తి, నెల్లదిక్కుల నల్లిబిల్లిగొలుపు

గీ. శౌచము నహింసయును బ్రహ్మచర్యమును జి
తేంద్రియత్వం బఖిలభూతహితముఁ బడయు
నమరకంటకపృథ్వీధరమునయందు
క్షేత్రపాలకసేవ చేసినజనుండు. 180

గీ. అగ్నిసలిలప్రవేశంబు లాచరించి, యైన ననశనవృత్తిచే నైన నసువు
లమరకంటకశైలమునందు విడుచు, నట్టివారికి లేదు జన్మాంతరంబు. 181

గీ. అమరకంటకగిరిశిఖరమునసుండి, పతనమును జెంది ప్రాణవిచ్యుతిని గన్న
యుత్తమునకుఁ బునర్జన్మ ముండెనేని, యతనిఁబోలెడిఘనుఁ డుండఁడవనియందు.

వ. ఆపర్వతంబునకుఁ బశ్చిమభాగంబునఁ గోటితీర్థంబు గలదు. అచ్చట రుద్రుండు జ్వాలేశ్వరుం డనుపేరఁ బరగుచుండు. ఆప్రదేశంబునఁ బిండప్రదానంబు గావించెనేని పితరులు పదివేలయేండ్లవఱకును సంతృప్తి నొందుదురు. నర్మదామహానదికి దక్షిణభాగంబునఁ గపిలానది గలదు. అన్నదియందు శతకోటితీర్థంబులు గలవు. అచ్చటఁ గావించినపుణ్యకార్యంబులు కోటిగుణంబుగా ఫలియించు. కాలవశంబునఁ దత్తీరంబునం బడినవృక్షంబులు సైతము నర్మదాజలస్పర్శ

భాగధేయంబునంజేసి సద్గతిం జెందుచుండు. విశల్య యనుమతియొక్క పుణ్యానది నర్మదాసంశ్రయంబున విరాజిల్లుచుండు. అందు స్నానంబు గావించిననరుండు విశల్యుం డగు. సర్వపాపప్రణాశిని యగునన్నదీమతల్లిక యమరకంటకపర్వతంబునకు విచ్చేసిన దేవర్షిగణంబుచే నుత్పాదింపంబడియె. తత్తోయంబున మునింగి యొక్కరాత్రి యుపవాసంబు గావించినజనుండు శతకులంబుల నుద్ధరించు. 183

గీ. నర్మదానది నెచట నైనను మునుంగ, లభ్యమగు నశ్వమేధఫలంబు భూప
నర్మదోత్తరకూలమునను వసించు, వారు త్రిదివంబునందున్నవారు చూవె. 184

వ. గంగాసరస్వతీనదులయందుఁ గావించినస్నానదానంబులు సమానఫలంబు లని మహేశ్వరుండు భాషించె. ఫేనోర్మిసహితం బగునర్మదాతోయంబు సర్వపాపహారంబు. నర్మదాతటంబున నహోరాత్రోపవాసంబు గావించిన బ్రహ్మహత్యావిముక్తి కలుగు. నర్మదామహానది లోకోపకారార్థంబు ధర్మకాంతు లగు మహర్షులచే యజ్ఞోపవీతపరిమితంబు లగుబహురూపంబులు గా విభజింపంబడియె. తత్తత్స్థానంబులందు స్నానంబు గావించిన మహాపాతకంబులు నయితము పటాపంచ లగు. 185

—: త్రి పు ర సం హా ర వృ త్తాం త క థ న ము :—

క. జ్వాలేశ్వర మనుతీర్థము, త్రైలోక్యప్రథిత మొండు తనరారెడు భూ
పాలక తద్వృత్తాంతము, నాలింపుము విస్మయంబు నాపాదించున్. 186

గీ. పూర్వమందు నింద్రాదిసుపర్వు లెల్ల, భయవికంపితులై 'పాహి పాహి' యనుచు
నార్తరవములతో నంధకారికడకు, నరిగి మొఱవెట్ట విని హరుఁ డనునయించి.

ఉ. ఏమి ప్రమాదమేర్పడియె నేమి భయంబు జనించె నింద్రము
ఖ్యామరులార మీముఖములందు వికాసము లేనికారణం
బేమియొ నాకుఁ జెప్పుఁ డన నెల్లసుపర్వులు మ్రొక్కి శూలికిన్
స్వామి కలం డొకం డసురనాథుఁడు బాణుఁడు నాఁగ నుర్వరన్. 188

క. ఆతఁడు బలదర్పితుఁడై, కాతరభావంబు లేక గగనమున మహా
భూతమువలెఁ ద్రిపురాధి, ష్ఠాత యగుచు విహరణంబు సలుపుచు నుండున్.

క. యాగములు చేయునిమ్నలు, భాగవతులు గలిగినట్టిపట్టులును మహా
యోగులు గలచోటులు భూ, భాగంబున వానికతనఁ బాడై పోయెన్. 190

గీ. స్వైరసంచారి యగువానిచర్యవలన, సంచలించుచు నున్నవి జగము లెల్ల
బ్రతుకఁ జాలము నీపాలఁ బడినవార, మిందఱముగూడను ననుగ్రహింపు మభవ.

శా. కావం గల్గినవాఁడ వార్తులను దుర్గర్వాంధులన్ రూపఱన్
గావింపఁ గలవాఁడ వార్తజనరక్షాదుష్టశిక్షార్థమై

యావిర్భావము గన్నదైవమవు మమ్మాపన్నులఁ బ్రోవఁగా
నీవే తప్పఁ బరం బెఱుంగము భవానీనాథ పాలింపవే. 192.

క. అని ప్రార్థించిన నీశ్వరుఁ, డనిమిషులకు సుప్రసన్నుఁ డయి సురలారా
చనుఁ డిఁక సుఖముండుఁడు మీ, పనిమీఁద నె యుందు నేను భయ మొందకుఁడీ.

క. అనవుడు దేవత లెల్లరు, మనమున మోదంబు గదుర మరలఁ ద్రిదివం
బున కేఁగుదెంచి యాదై, త్యనిసంహారంబు గోరు చుండఁగ నంతన్. 194

మ. నిటలాక్షుండు నిశాచరప్రమథనోన్నిద్రాత్ముఁడై నర్మదా
తటముం జేరి స్మరించె నారదుని నంతన్ దేవతామౌని య
చ్చటికిన్ దక్షిణమంద వచ్చి పరమేశా యానతి మ్మంచు ని
ల్చుటయున్ మ్రోలను నానతిచ్చెను గిరీశుం డిట్టు లవక్రమునికిన్. 195

క. నారద బాణుం డనెడుసు, రారాతి యొకండు లోక మంతకు వెత చే
కూరుచుచు నుండె దానికిఁ, గారణము తదీయకంబుకంధర లె సుమీ. 196

క. వారలు పరమపతివ్రత, లారామారత్నములమహాత్త్వముచేఁ జే
కూరెను ద్రిపురములకు సం, చారక్షమ మైనదివ్యశక్తి మునీంద్రా. 197

క. ఆత్రిపురములకు నాథుం, డై త్రిదశారాతి జగదపాయనిదానం
బై త్రిమ్మరుచున్నాఁ డది, మాత్రము సహియింప రాదు మాబోఁటులకున్.

క. కావున సతతము భర్తయె, దైవం బని యెంచుచుండు దైత్యసతులకున్
భావమ్మునఁ జాంచల్యం, బావిర్భావంబు నొందున ట్లొనరుపుమా. 199

క. ఆచలనమె దైత్యకుల, శ్రీచలనము నీకు వేయి చెప్పఁగ నేలా
వే చనుము దేవకార్యము, నీచాతుర్యంబుతోడ నెఱవేఱుపుమా. 200

చ. అనవుడు భక్తినమ్రవదనాంబుజుఁడై సురమౌని శంకరా
జ్ఞను గొని యాక్షణంబ దితిజప్రభు వేలుపురంబుఁ జేరి యా
దనుజకులావతంసము యథావిధిఁ జేసినగౌరవంబుఁ గై
కొని నుడువం దొడంగెఁ గడు గొప్పగ దానములన్ వ్రతంబులన్. 201

క. ఆసమయములందును బా, ణాసురునకుఁ బట్టమహిషి యైనయనౌప
మ్యాసతి దేవమునీంద్రుని, డాసి యిటులు పల్కఁగాఁ దొడంగెను భక్తిన్.202

గీ. అడుగఁ దలఁచితి నొకమాట యమరమౌని, కనికరము నీకు నామీఁదఁ గలిగెనేని
దానములలోన నుత్తమదానమేదొ, వ్రతములం దేది యుత్తమవ్రతమొ చెపుమ.

క. అనవుడు నారదుఁ డాయమ, కును నిట్లనె వేదపారగుం డగుభూదే
వునకుఁ దిలధేనుదానం, బొనరించుట యుర్వి యెల్ల నొసఁగుటె సుమ్మా. 204

గీ. అట్టిదానంబు గావించినట్టిధన్యు, లక్షయం బగుస్వర్గమునంద యుందు
రనుభవించుచు నింద్రాదు లనుభవించు, సకలభోగంబులను గూడ జలజగంధి.

వ. మఱియు నొకమాట వినుము. చతుర్థియును సప్తమియును ద్వాదశియును సంక్రాంతియును విషువంబును దినచ్ఛిద్రముఖంబును ననుదినంబులు పుణ్యావహంబులు. ఈదివసంబులయం దుపవాసవ్రతంబు గావించినపడంతులకు స్వర్గంబు కరతలామలకంబు సుమా. 206

క. ఉపవాసవ్రతమును నే, రుపుతో రక్షించుకొనుసరోజాక్షుల నొక్కపుడును గడగంటను నూ, రుపుతోఁ గనలేఁడు కలిపురుషుఁడు లతాంగీ. 207

క. కావింపఁ దగినదానము, గావింపఁగఁ దగినవ్రతము గావించితి నీకైవసము నింతి యెట్టులు, కావింపఁగఁ దగునొ యటులు కావింపు మిఁకన్. 208

గీ. పోయివచ్చెద ననవుడుఁ బూవుఁబోఁడి, స్వామి నీ చెప్పినట్టుల సలుపుదానదానము గ్రహింపు మీవె నే ధన్య నగుదు, నంతికం బెను బాత్రులింకెవరు నాకు.

క. ఇచ్చెద హిరణ్యరాసుల, నిచ్చెద భూములను గృహము లిచ్చెద నే మేమిచ్చిన సాఫల్యము నా, యిచ్చెడిదానమున కిత్తు నే నవి యెల్లన్. 210

చ. అనవుడు మౌని యిట్లనియె నాయమకున్ తరుణీమణీ తపోధనులము మేము మాకు ధనధాన్యము లేల గృహంబు లేల నిర్ధనుఁడు కుటుంబి యైనయొక బ్రాహ్మణవర్యున కిమ్ము సర్వమున్ గనియెద నీవు జన్మమును గాంచినదానికి సార్థకత్వమున్. 211

ఉ. మాయెడ నుంచుభక్తియె సమస్తము నిచ్చుట మాకు వేఱుగా నీయఁగఁ గైకొనంగ నెదియేనియు లే దిఁకఁ బోయివత్తు నంచాయతివల్లభుండు త్రిపురాసురకాంతలచిత్తవృత్తులన్ గాయముచేయకుండఁగ నెకైకొని నేర్పున నేఁగె నంతటన్. 212

క. త్రిపురములలోన నెన్నియొ, విపరీతముగాఁగ నుద్భవించె మహోత్పాతపరంపరలు జనంబుల, కపరిమితంబైనభీతి యాపాదిల్లన్. 213

క. ఇది యిటు లుండఁగ ధూర్జటి, యది నెఱిఁగినవాఁడు గాన నాక్షణమున నర్మదదరి మాహేశ్వరి మను, పదమునకున్ జేరి త్రిపురభంగోత్సుకుఁడై. 214

సీ. ధనువుగాఁ జేసి మందరధరిత్రీధరం, బును వాసుకిని గుణంబుగను జేసి
పంకజనేత్రుని బాణంబుగను జేసి, మాహేశ్వరమును ధామముగఁ జేసి
యశ్వంబులుగఁ జతురామ్నాయములఁ జేసి, బలముగాఁగను జేసి ప్రమథగణము
నాశ్వినేయులను రథాంగంబులుగఁ జేసి, చాపాంతముగ దివస్పతినిఁ జేసి

గీ. యాశుగమునఁ గుబేరుని నగ్ని నెదుట, వాయువును నోట దక్షిణవామకరములందు యమకాలులను రథాంగారకముల, యందు గంధర్వపతులను ననువుపఱిచి.

గీ. పద్మజుని సారథిగను నేర్పఱిచి తాను, సర్వసర్వంసహాతలస్యందనంబు నధివసించి తదేకలక్ష్యంబు గలిగి, స్థాణువుగను సహస్రవత్సరము లుండె. 216

వ. అంత నొక్కనాఁడు. 217

గీ. ఎపుడు త్రిపురంబులును గూడి యేఁగుదెంచి, యాఁడుచుండెనో యంతరిక్షాంగణమున
నపుడె విషమాంబకుఁడు త్రిశల్యమున వాని, నొక్కసారిగ భేదించె దిక్కు లదర.

క. భేదించి త్రిపురముల హరుఁ, డాదిత్యులగోడు మాన్ప నపమృత్యువు ను
త్పాదింప దానవులకున్, రోదసులను నిండి కాలరూపము దాల్చెన్. 219

గీ. అంతఁ బ్రళయాంతకుఁడు వోలె నవఘళించె, సప్తజిహ్వాలతోడ వైశ్వానరుండు
వానికిం దోడు సంవర్తకానిలుండు, తాను గూడ విజృంభించెఁ దత్క్షణంబ. 220

గీ. ఇరువురును గూడి భీకరాకృతులతోడ, దాడివెడలిరి త్రిపురవిధ్వంసమునకు
నగ్నియును వాయువును నేకమైనయపుడు, కాదగిన దేది యోయదె కాఁదొడంగె.

సీ. భగ్నంబు లయ్యెను బ్రాసాదతతు లెల్లఁ, దరువు లన్నియును దగ్ధంబు లయ్యె
సదనంబు లన్నియు జ్వాలాన్వితము లయ్యె, గోపురశిఖరముల్ కూలిపోయె
వ్యోమయానంబులు నామశేషము లాయెఁ, బ్రాకారములు పటాపంచలాయె
సలిలాశయంబులు సదమదంబై పోయె, రథ్యావితానముల్ రగులుకొనియెఁ

గీ. బ్రజలహాహారవంబులు పరువులిడియెఁ, బశుపతత్త్రివిరావముల్ ప్రబలమయ్యె
నంధకారంబువలె ధూమ మావరించె, నేమి చెప్పుదుఁ ద్రిపురదుష్కృతఫలంబు.

క. దానవశవకోటులతో, దీనారావములతోడఁ ద్రిపురమ్ములు దా
వానలఘోరజ్వాలా, లీనారణ్యములువలె జ్వలింపఁ దొడంగెన్. 223

గీ. అగ్నిపర్వతములచేత నాక్రమింపఁ బడియెఁ ద్రిపురంబు లాత్మీయబలము తఱఁగి
పాతకము హెచ్చినకొలందిఁ బాడుచేయు, జగములుజ్జూఁతలూఁగించుమగలనేని.

క. అప్పుడు బాణాసురుఁ డా, ముప్పును గనుఁగొని సమస్తమును ద్ర్యంబకుఁడే
యిప్పని చేసెను శూలికిఁ, దప్పు మఱొక్కనికిఁ జెనయఁ దరమే నన్నున్. 225

క. అని తలపోయుచుఁ దా న, ర్చనచేసెడి త్రిభువనేశ్వరం బనులింగం
బును దాలిచి మస్తకమునఁ, జనుదెంచె నొకండ నగరచత్వరమునకున్. 226

గీ. అటులు చనుదెంచి దైత్యేంద్రుఁ డార్తితోడ, మనమునఁ దలంచి శర్వుని ననియెనిట్లు
దేవ తప్పున్న దండింపు మీవు నన్నుఁ, గాని లింగంబు మాత్రము గాదు చెఱుప.

క. కాలుపుము నన్ను శంకర, కాలుపఁ దగినంతపాతకము చేసినచోఁ
గాలక తూలక వ్రేలక, నాలింగము మాత్ర మున్న నా కదె చాలున్. 228

క. సమయింపఁ దగినదోషము, సమకూడెన యేని నన్ను సమయింపఁ గదే
ప్రమథాధినాథ నాలిం,గము మాత్రము చెడక యుండుఁ గాక స్థిరముగాన్. 229

క. ననుమథియించిన నా కది, యనుమతమే కాని నాభవాంతరమందున్
మనసిజహర త్వల్లింగా, ర్చనభాగ్యము మాత్ర మొకఁడు సమకూర్పఁ గదే. 230

తోటకము. హరచంద్రకిరీట జోహారు సుధా, కరశేఖర జోతలు కామహరా
కరుణింపుము దుష్కృతకర్మనిరా, కరణాహితకంకణ కాలతనూ. 231

తోటకము. గిరిజాహృదయాబ్జనికేతన ని, ర్జరరక్షణదీక్షిత సర్వగుణా
కర శంకర సాధునికాయసము, ద్ధరణా త్రిపురాసురదర్పహరా. 232

తోటకము. తరుణీతనయావసథప్రభవ, స్మరణవ్యసనాహృతసత్త్వుఁడ నై
చరియించితి నాయపచారములన్, గిరిశా క్షమియింపుము కేల్మొగుతున్. 233

తోటకము. బహుజన్మము లెత్తితిఁ బాతకముల్, సహియింపఁగఁ రానివి సల్పితి నా
కిహముల్ బరముల్ గలదే త్వదను, గ్రహ మీశ్వర నాయెడఁ గల్గనిచోన్.

క. అని బహువిధములఁ బ్రార్థన, మొనరించిన శివుఁ డనుగ్రహాపేతుం డై
తనపరివారముతోడన్, గనఁబడి దైత్యాధినాథునకు ని ట్లనియెన్. 235

క. వత్సా నీయెడ నాకున్, వాత్సల్యము గలిగె భయము వల దుండుము నీ
వుత్సాహముతోడను బహు, వత్సరములు సురలకును నవధ్యుఁడ వగుచున్.

గీ. అని వరం బిచ్చి బాణున కంధకారి, గగనమున మండుపురములు గాంచె రెండు
కాంచినంతనమరకంటకముననొక్క, పురము శ్రీశైలముననొక్క పురముఁబడియె.

క. అప్పురములు పడినంతన, యుప్పురమున నెగసె జ్వాల యొక్కటి దెసలన్
గప్పిన తేజముతోడను, నుప్పతిలఁగ సాధ్వసము దివౌకస్కులకున్. 238

క. స్మరహరుఁ డది గనుఁగొని తన, శరమును మాహేశ్వరమున స్తంభించి శిఖన్
దరలించి యంత మూఁడవ, పురమును రక్షించె నసురపుంగవునకు నై. 239

క. అంతట నాపురముం గొని, సంతోషముతోడఁ దిరుగ సాగెను గగనం
బంతయును దైత్యనాథుఁడు, చింతాలేశమును లేక శివతేజమునన్. 240

క. జ్వాలలతోడఁ బురంబులు, కూలి పడినచోటు రుద్రకోటులచేతన్
గ్రాలుటయె కాక క్రాలెను, జ్వాలేశ్వర మనెడితీర్థవర్యం బగుచున్. 241

గీ. కావున నమరకంటకగ్రామమునకుఁ, బోయిననరుండు పదునాల్గుభువనములను
పాలనముచేసి తీఱు నబ్దములు వేయి, కోటులును బైని ముప్పదికోటు లధిప. 242

గీ. చంద్రసూర్యోపరాగముల్ సంభవించి, నపు డమరకంటకాద్రికి నరిగె నేని
యశ్వమేధంబు గావించినంతకంటె, దశగుణాధికఫలము నాతండు చెందు. 243

క. స్నానంబును గావించిన, మేనులు విడిచినను నచట మేదినిలోనన్
గానక జన్మము మరలన్, మానవు లుండెదరు విష్ణుమందిరమందున్. 244

క. అమరేశ్వరదేవునిశై, లమునందును దన్నదీజలంబునఁ దత్తీ
రమునందుఁ దపము చేయుచు, శమఘను లుండెదరు సర్వసమయములందున్. 245

వ. పిదప రేవాకావేరీసంగమతీర్థంబు గలదు. 246

క. ఘోరంబుగ రేవాకా, వేరీసంగమమునందు విషమేక్షణునిం
గూరిచి తపముం జేసెఁ గు, బేరుం డొకవర్షశతము పృథివీపాలా. 247

క. ఆతనితీవ్రతపమునకుఁ, జేతోమోదంబు గలుగ శితికంఠుఁడు దా
నే తెంచి వత్స వరమొకఁ, డేతత్క్షణమంద కోరు మిచ్చెద ననుడున్. 248

క. దాక్షాయణీమనోహర, వీక్షించితి వేని కరుణ వెలయఁగ నన్నున్
యక్షులకు నెల్లరకు న, ధ్యక్షుఁడ నగు నట్లు వరము దయచేయఁగదే. 149

క. అని వేఁడుటయును నట్లై, యని యీశ్వరుఁ డానతిచ్చి యంతర్హితుఁ డ
య్యెను నంత యక్షలోకం,బున కధిపతి యై ధనాధిపుఁడు విలసిల్లెన్. 250

క. కావున వలయును రేవా, కావేరీసంగమమునఁ గావింపఁగ నా,
ప్లావమును వంచితుల మై, పోవల దనునట్టిబుద్ధి పొడమినవారల్. 251

క. కావేరియు నర్మదయును, గావించును సకలపాతకప్రమథనమున్
భూవర తత్సంస్పర్శము, గావించుట దినము చూఱగ్గె కొనుటె సుమా. 252

ఉ. స్నానము చేసి తజ్జలమునన్ వృషభధ్వజునిన్ భజించినన్
గానక కాని కాంచియును గాని యొనర్చినపాతకౌఘముల్
తోన నశించుఁ బావకములోఁ బడవైచినదూది వోలె స
ద్ధానమె సంఘటిల్లు శివధామనివాసము మర్త్యకోటికిన్. 253

గీ. అచల నగ్నిప్రవేశంబు నాచరించి, కాని యనశనవృత్తిచేఁ గాని తనువు
విడిచిపెట్టినదేహి యావృత్తి లేని, గతికిఁ జేరు నటంచు శంకరుఁడు పలికె. 254

క. సమకూరితీఱు గంగా, యమునాసంగమమునందుఁ బ్రాప్తించుమహా
ర్థము రేవాకావేరీ, సమాగమమునందు మనుజసంతతి కెల్లన్. 255

వ. మఱియును నర్మదోత్తరకూలంబునందు యోజనవిస్తృతంబును సర్వపాపహారంబును నగుపత్త్రేశ్వరం బనుతీర్థంబు గలదు. అచ్చట స్నానంబు గావించిననరుండై దమవేలవత్సరంబులు కామరూపధరుండై దేవతలతోఁ గూడి విహరించుచుండు. మఱియును గర్జనం బనునొకానొకతీర్థంబు గలదు. తదీయప్రభావంబువలన దాని కింద్రజిత్తీర్థ మనునామంబు ప్రాప్తించె. అచ్చట మేఘుండు నిత్యసన్నిహితుండై యుండు. మేఘరావం బనుమఱియొకతీర్థంబు గలదు. అచ్చట నిత్యంబును మేఘంబులు గర్జించుచుండుటయే కాక మేఘనాదుండు వరప్రసాదంబు వడసి గణరూపంబున నివసించి యుండె. బ్రహావర్త మనుమఱియొకతీర్థంబు గలదు. అచ్చట బ్రహ్మ నిత్యమును సన్నిహితుం డై యుండు. బ్రహ్మావర్తంబున స్నానంబు గావించిననరుండు బ్రహ్మలోకంబున నిత్యనివాసంబు వడయు. అంగారేశ్వరం బను మఱియొండు తీర్థంబు గలదు. అచ్చటఁ గావించినస్నానంబు రుద్రలోకప్రాప్తికరంబు. అటుపిమ్మటఁ గపిలాతీర్థంబు గలదు.అందు స్నానంబు గావించిననరుండు

గోసహస్ర ప్రదానఫలంబు నొందు. పిమ్మటఁ గాంచీతీర్థం బనుమహాతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించిన జనుండు గోలోకనివాసభాగ్యంబు వడయు. ఆపైని గుండలేశ్వరతీర్థంబు గలదు. అచ్చట రుద్రుండు పార్వతీసమేతంబుగా సన్నిహితుఁడై యుండు. తత్తీర్థంబున స్నానంబు చేసిననరుండు దేవతలకును నవధ్యుండగు. తరువాతఁబిప్పలేశ్వరం బనుమహాతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించె నేని రుద్రలోకంబు ప్రాప్తించు. పిమ్మట విమలేశ్వరం బనుతీర్థంబు గలదు. అచ్చట నీశ్వరుండు దేవశిఖను బ్రతిష్ఠాపించె. అందుఁ బ్రాణత్యాగంబు గావించిన రుద్రలోకంబు ప్రాప్తించు. అనంతరంబ పుష్కరిణీతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించినంతమాత్రంబున దేవేంద్రునియర్ధాసనంబు నధిష్ఠింపం గలుగు. పిదప నర్మదాతీర్థంబు గలదు.

గీ. నదులలోపల నర్మదానదికి సాటి, యైననది గానరా దది యంధకారి
తనువినిస్సృతి యగుటను దరతరంబ, పావనముచేయు జంగమస్థావరముల.

దండకము. రేవా పవిత్రీకృతస్వాశ్రితా దేవసంఘాతసంస్తూయమానప్రభావా సమస్తాఘవిచ్ఛేదినీ పుణ్యశ్లోకయా భవాంభోధిసంతారిణీ కృత్తివాసోవపుర్నిస్సృతా సర్వజాడ్యాపహారీ యశేషప్రపంచార్చితా స్వప్రకాశా కృపాంభోనిధీ జ్ఞానదాత్రీ మహైశ్వర్యదా తాపసారాధితా భక్తకల్పద్రుమంబా సరిద్రత్నమా నీకుఁ గేల్మోడ్పు నిష్కల్మషా నీకు జోతల్ స్వమాహాత్మ్యసంశోభినీ నీకు దండంబు విశ్వాధికా నీకు సాష్టాంగముల్ తల్లి జోహారు సర్వాపదుద్ధారిణీ మ్రొక్కు నిత్యోత్సవా కర్ణసంస్పర్శముల్ లోకవంద్యా నమస్కారముల్ శోకహంత్రీ ప్రణామంబు దేవీ నమస్తే నమస్తే నమః.

క. అని యీ విధమున రేవను, ననిమిషులును దాపసులును నానందమునన్
వినుతించి పరమసుఖముం, గనుఁగొని రీ స్తవము వినినఁ గలుగు శుభంబుల్.

వ. పిదప శూలభేదాతీర్థంబు గలదు. శూలిచే నచ్చట శూలంబు నిపాతితం బగుటచే నాక్షేత్రంబు శూలభేదాతీర్థం బనునామంబునం బరగె. అచ్చట స్నానంబు గావించి మహాదేవుని నర్చించునరుండు గోసహస్రదానఫలంబు నొందు. మూఁడు దినంబు లావిధంబున నాచరించినవాఁడు జన్మరాహిత్యముం బడయు. అనంతరంబు నర్మదేశ్వరంబును నాదిత్యేశ్వరంబును వరుణేశ్వరంబును నీరాజేశ్వరంబును నను మహాపుణ్యతీర్థంబులు గలవు. తద్దర్శనంబున సర్వతీర్థసేవాఫలంబు లభించు. పిమ్మటఁ గోటితీర్థం బనుమహాతీర్థంబు గలదు. అచ్చట మున్ను దానవాసురులకు గొప్పయుద్ధంబు తటస్థించె. ఆయుద్ధంబున నసురులకోటి శిరంబులం దెగవ్రేసి బలదర్పితుం డగుదానవుఁడు శూలపాణి నచ్చటఁ బ్రతిష్ఠించి తల్లింగంబుపై నాకోటిశిరంబు లుపాయనంబుగా నుంచిరి. జానం జేసి శూలపాణి

కోటీశ్వరాఖ్యం బడసె. అమ్మహాతీర్థంబు దర్శించినవా రెల్లరును దేహంబు
తోడన స్వర్గంబున కేఁగఁ దొడంగిరి. అంత నింద్రుం డసూయావిష్టమానసుం డై
యాతీర్థరాజంబును వజ్రకీలయంత్రితముం జేసె. నది మొదలుగ లోకులకు
దేహంబుతోడిస్వర్గగమనం బుడిగె.

క. అది బహుమాహాత్మ్యము గల, యది దానను దీర్థమాడిన నైనను రాట్
పదము మహీతలమున శివ, పదము పరంబునను గలుగుఁ బ్రాణుల కెల్లన్.

వ. పిదప నగస్త్యేశ్వరం బనుదీర్థంబు గలదు. అందు స్నానంబు గావించిన బ్రహ్మ
హత్యామహాపాపవిముక్తుం డగు. మఱియు నచ్చోటఁ గార్తికకృష్ణచతుర్దశి
యందు నేకాగ్రమానసంబున నగస్త్యేశ్వరుని ఘృతంబుచే స్నానంబు
చేయించిననరుం డిరువదియొక్కతరంబులవఱకును దనవంశము నంతయును
నీశ్వరధామంబున నిలుపంగలండు. మఱియు నచ్చోటఁ గావించిన దానంబులు
కోటిగుణఫలదాయకంబు లగు. అనంతరంబు రవిస్తవతీర్థంబు గలదు. అందు
స్నాతుం డయ్యెనేని మహారాజసింహాసనస్థుం డగు. నర్మదాదక్షిణకూలం
బున శక్రతీర్థంబు గలదు. అందు స్నానంబు చేసి యొక్కరాత్రి యుపవాసంబు
గావించి జనార్దనుని నర్చించిన గోసహస్రదానఫలంబును వైకుంఠంబును
బ్రాప్తించు. పిదప ఋషితీర్థంబు గలదు. అందు స్నానంబు గావించెనేని
కైలాసవాసభాగ్యంబు చేకూరు. మఱియు నంద నారదతీర్థంబు గలదు.
అందలిస్నానంబు గోసహస్రదానఫలప్రదంబు. పిదప దేవతీర్థంబు గలదు.
అది మున్ను బ్రహ్మచే నిర్మింపంబడియె. నందలిస్నానంబు బ్రహ్మలోకప్రదంబు.
పిదప నమరస్థాపితం బగునమరకంటకతీర్థంబు గలదు. అందలిస్నానంబు గోసహస్ర
దానఫలం బొసంగు. పిమ్మట వామనేశ్వరతీర్థంబు గలదు. తత్తీర్థసందర్శన
మాత్రంబున బ్రహ్మహత్యావిముక్తుం డగు. పిదప నీశానేశతీర్థంబును వటేశ్వర
తీర్థంబును గలవు. తత్తీర్థదర్శనంబునం జేసి జన్మంబునకుఁ బర్యాప్తఫలంబు
చేకూరు. పిమ్మట భీమేశ్వరతీర్థంబు గలదు. తత్తీర్థస్నానమాత్రంబున సకల
వ్యాధిదుఃఖనిర్ముక్తుం డగు. పిమ్మట వారణేశ్వరతీర్థంబు గలదు. తత్స్నానం
బున సర్వాపద్విముక్తుం డగు. పిదపసోమతీర్థంబు గలదు. అందు భక్తిసమ
న్వితుం డయి స్నానంబు గావించి చంద్రదర్శనంబు చేసెనేని తత్క్షణంబ దివ్య
దేహంబు దాల్చి యరువదివేలవత్సరంబులు సదాశివుండువోలె శివలోకంబున
విరాజిల్లు. పిదపఁ బింగళేశ్వరతీర్థంబుఁ గలదు. తత్తీర్థంబునఁ గపిలాదానంబు
గావించెనేని తద్ధేనుతత్సంతతిరోమపరిమితంబు లగువర్షసహస్రంబులు రుద్ర
లోకమునందు వసియించు. ఆతీర్థంబునందుఁ బ్రాణత్యాగంబు గావించిన సూర్య
చంద్రు లుండునంతవఱకును స్వర్గసుఖంబు వడయు. నర్మదాతటంబు నాశ్ర

యించిన మానవులు మరణించినపిదప స్వర్గసుఖంబు సులభంబుగాఁ గైకొందురు. పిమ్మట సురభికేశ్వరంబును గోటికేశ్వరంబును నను తీర్థంబులు గలవు. తత్తీర్థస్నానంబునఁ గలుగుపుణ్యంబునకు మితి గానరాదు. పిదప నందితీర్థంబు గలదు. తత్స్నానంబున నందీశ్వరుండు తుష్టుండై సోమలోకనివాసంబు ననుగ్రహించు. పిదప ద్వీపేశ్వరం బనువ్యాసతీర్థంబు గలదు. అచ్చట నొకమహానది ప్రవహించి వ్యాసమహర్షి హుంకారంబు గావింప భయంపడి తత్తపోవనంబునకు దక్షిణపార్శ్వంబుగా నేఁగె. తత్తీర్థంబునకుఁ బ్రదక్షిణంబు గావించిన వ్యాసుండు సంప్రీతుండై వాంఛితఫలసిద్ధి నొసంగు. మఱియు నచ్చట వ్యాసేశ్వరుని వేదికాసహితంబుగా సూత్రపరివేష్టితుం గావించిన రుద్రుండువలె నక్షయకాలంబు క్రీడించు. పిదప నేరండీతీర్థంబు గలదు. దానికి నర్మదాసంగమంబు ప్రాప్తించుటం జేసి యాతీర్థంబు దుష్కృతనిబర్హణంబునందుఁ ద్రిలోకవిశ్రుతిం గాంచె. అచ్చట నాశ్వినశుక్లాష్టమినాఁడు స్నానంబు గావించి యుపవాసంబుచేసి యొక్కబ్రాహ్మణుని భుజియింపంజేసినఁ గోటిబ్రాహ్మణసమారాధనంబు గావించినఫలంబు ప్రాప్తించు. ఏరండీసంగమస్నానంబు సర్వపాపహరంబు. ఆతీర్థమునకుఁ బ్రదక్షిణంబు గావించెనేని సప్తద్వీపవతి యగుపృథివికిఁ బ్రదక్షిణంబు గావించినఫలంబు చేకూరు. పిదప సువర్ణతిలకతీర్థంబు గలదు. అందు స్నానంబుచేసి కాంచనదానంబు గావించిన సువర్ణవిమానంబుతోడ రుద్రలోకంబునం బ్రతిష్ఠితుం డగు. కాలవశంబున నెన్నఁడేని తల్లోకచ్యుతి సంభవించెనేని భూలోకంబున మహావీరుం డగురాజేంద్రుండుగా జన్మించు. పిదప నిక్షునదీసంగమతీర్థంబు గలదు. అచ్చట మహేశ్వరుండు సన్నిహితుండై యుండు. అందు స్నానంబు గావించిన గాణపత్యపదంబు ప్రాప్తించు. పిదప స్కందతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించిన జన్మించినది మొదలు చేసిన పాతకంబు లన్నియును దక్షిణంబ పటాపంచలగు. పిమ్మట నాంగిరసతీర్థంబు గలదు. అందు స్నానంబుచేసిన గోసహస్రదానఫలంబును రుద్రలోకనివాసభాగ్యంబును సమకూరు. పిదప లాంగలతీర్థంబు గలదు. అందు స్నానమాత్రంబున సప్తజన్మార్జితంబు లగునఘంబు లెల్ల భస్మీభూతంబు లగు. పిదప సంగమేశ్వరతీర్థంబు గలదు. తత్స్నానంబు రాజ్యప్రదంబు. పిదప భద్రతీర్థంబు గలదు. అందు గావించినదానంబు కోటిగుణం బగు. తత్తీర్థంబున స్నానంబు గావించినపడంతి కాళీరూపముం బడసి రుద్రపత్నియగు. పిదప నంగారేశ్వరతీర్థంబు గలదు. తత్స్నానమాత్రంబున రుద్రలోకావాసంబు లభించు. అందు నంగారకచతుర్థినాఁడు గావించినస్నానం బక్షయప్రమోదప్రదంబు. పిదప నయోనిసంగమతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించిన మరల జన్మంబు

లేదు. పిదపఁ బాండవేశ్వరతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించిన సురా
సురుల కవధ్యుండై యశేషకాలంబు ప్రమోదించుచు విష్ణులోకంబున కరిగి
యచ్చట మహాభోగంబు లనుభవించి కాలవశంబున మర్త్యలోకంబున మహా
రాజుగా నవతరించు. పిదపఁ గంభోతికేశ్వరతీర్థంబు గలదు. అందుత్తరాయణ
సంక్రమణకాలంబున స్నానంబు సలిపినం గోరినకోరికి యెల్ల సిద్ధించు. పిదపఁ
జంద్రభాగాతీర్థంబు గలదు. అందు స్నాతుం డగువాఁడు చంద్రలోకంబున వసి
యించు. అనంతరంబు శక్రతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించి సువర
దానంబు గాని నీలవృషోత్సర్జనంబు గాని కావించినఁ దద్వృషభతత్సంతతిరోమ
పరిమితంబు లగువర్షసహస్రంబులు కైలాసనివాసభాగ్యంబు గలుగు. కాల
వశంబునఁ దత్పరిచ్యుతి సంభవించెనేని భూతలంబున నేకచ్ఛత్త్రాధిపతిగా నవ
తరించు. పిదప బ్రహ్మావర్తతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించి పితృ
తర్పణంబు చేసి యొక్కరాత్రి యుపవసించి పిండప్రదానంబు గావించెనేని
సూర్యుండు కన్యాగతుం డగునప్పుడు గావించినపిండప్రదానంబుతో సమాన
మగుపుణ్యంబు నాపాదించు. పిదప నర్మదేశ్వరం బనుతీర్థంబు గలదు. అందుఁ
గావించినస్నానం బశ్వమేధఫలం బొసంగు. నర్మదోత్తరకూలంబునందు నాది
త్యాయతనతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించి చేసినదానం బక్షయ
పుణ్యఫలప్రదం బగు. దరిద్రులును వ్యాధిగ్రస్తులును బాపులును బవిత్రులై
సూర్యలోకంబు వడయుదురు. మాఘశుక్లసప్తమినాఁ డమ్మహాతీర్థంబునం
దుండువారలు పునర్జన్మంబున రూపసంపన్నులై స్త్రీవల్లభు లగుదు రని మా
ర్కండేయుండు తెలిపె. పిదప మాసేశ్వరం బనుతీర్థంబు గలదు. అందు స్నా
నంబు గావించిన స్వర్గలోకంబునందుఁ బదునలువు రింద్రులు నడచువఱకును
మహానందంబున నుండు. దానికి సమీపమంద నాగేశ్వరతీర్థంబు గలదు. అందు
స్నానంబు సలిపిన ననంతకాలంబు నాగకన్యకలతోఁ గ్రీడించుయోగంబు గలుగు.
పిదపఁ గుబేరభవనతీర్థంబు గలదు. అయ్యది కుబేరుఁడు తపంబు గావించినపుణ్య
స్థలంబు. పిదపఁ గాలేశ్వరతీర్థంబు గలదు. అందుఁ గుబేరుండు వరంబు వడసి
సంతోషితుం డయ్యె. అందు స్నానంబు గావించిన సంపత్సమృద్ధి గలుగు.
దానికిఁ బశ్చిమముగా మారుతాలయతీర్థంబు. గలదు. అందు స్నానంబు గావించి
కాంచనదానంబు చేసె నేని పుష్పకవిమానంబు నెక్కి వాయులోకంబునకుం
జను. అటుపిమ్మట యమతీర్థంబు గలదు. మాఘకృష్ణచతుర్దశినాఁ డందు
స్నానంబు గావించి నక్తభోజనం బొనరించె నేని యోనిసంకటంబు నొంద
కుండు. పిదప నహల్యాతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించిన నప్సరస్స
మాగమంబు చేకూరు. ఆతీర్థంబునంద యహల్య తపంబు చేసి మోక్షసామ్రా

జ్యముం బడసె. అందుఁ జైత్రశుక్లత్రయోదశినాఁడు కామదేవదినంబున నహా
ల్యను బూజించినవాఁడు సర్వజనప్రియుండును గామదేవుండువలె స్త్రీవల్లభుం
డును నగు. పిదప సోమతీర్థంబు గలదు. ఆతీర్థంబునందుఁ జంద్రగ్రహణంబు
ప్రాప్తించినప్పుడు స్నానంబు గావించిన సర్వపాపవిముక్తి గలుగు. మఱియు
నందుఁ జాంద్రాయణవ్రతంబు గావించె నేని చంద్రలోకంబు ప్రాప్తించు. మఱి
యును నంద యగ్నిజలానశనంబులచే మృతుం డయ్యె నేని వానికి జన్మాంత
రంబు లేదు. పిదప స్తంభతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించిన సోమ
లోకనివాసభాగ్యంబు చేకూరు. పిమ్మట విష్ణుతీర్థంబు గలదు. అచ్చట విష్ణువుచే
నసురసంహారంబుగావింపంబడియె. ఆతీర్థంబునఁ గావించినస్నానదానాదికంబులు
విష్ణుప్రీతికరంబులు. మఱియు నందు నహోరాత్రోపవాసంబు గావించె నేని
బ్రహ్మహత్యామహాపాతకంబు సైతముఁ దొలంగు. పిదప నమోహాకం బని
ప్రసిద్ధికెక్కిన తాపసేశ్వరతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించి పూర్ణి
మయందును నమావాస్యయందును యథావిధిగ శ్రాద్ధంబు గావించి తత్తీర్థ
తోయమధ్యంబున గజాకారములం దాల్చి యుండుశిలలపైని పిండప్రదానంబు
గావించె నేని పితరులు మేదిని యున్నంతకాలంబును దృప్తులై యుందురు. అందు
వైశాఖమాసంబునఁ జేయుపిండప్రదానంబు విశేషఫలప్రదంబు. పిదప సిద్ధేశ్వర
తీర్థంబు గలదు. అందు స్నానంబు సలిపిన గణపతిసామీప్యంబు సిద్ధించు. పిదప
భార్గవేశతీర్థంబు గలదు. అందు విష్ణుహుంకారంబున దానవులు నామశేషులైరి.
తత్తీర్థంబునందు స్నానంబు సలిపిన సమస్తపాపక్షయం బగు. పిదప శుక్లతీర్థంబు
గలదు. తత్తీర్థప్రభావం బనిర్వాచ్యంబు. మున్ను మార్కండేయుండు తీర్థము
లలో నుత్తమతీర్థం బెయ్యది యని వినయవినమితోత్తమాంగుండై మహేశ్వరు
నడుగుటయు. 258

గీ. ధరణిలోపల శుక్లతీర్థం బనంగఁ, దీర్థ మొక్కటి కలదు తత్తీర్థమహిమ
మే మని నచింతు నద్దానినామమునన, చూడ నయ్యెడిఁ దత్పారిశుద్ధ్య మెల్ల.

క. ఒనరించు శుక్లతీర్థం, బనిశమును నశేషపాపహరణము ధ్యాన
మ్మున దర్శనమున స్పర్శం, బున స్నానంబునను దానమున ధర్మమునన్. 260

క. విను పూర్వము చాణక్యుం, డనియెడిరాజర్షి సిద్ధి నందెను క్షణమా
త్రిన శుక్లతీర్థమునఁ దప, మును జేసినకారణమున మునులు నుతింపన్. 261

వ. నేను పార్వతితోడం గూడఁ గైలాసమునుండి బయలు దేఱి వైశాఖకృష్ణచతు
ర్దశినాఁడు శుక్లతీర్థంబునందు వసియింతు. దేవకిన్నరగంధర్వవిద్యాధరాదు లెల్ల
రును విమానస్థులై యంతరిక్షంబునం దవలోకించు చుందురు. ఆసమయంబున
శుక్లతీర్థంబునం గావించుస్నానదానంబు లాజన్మపాతకవిముక్తిం గావించు.

పూర్వవయస్సునం జేసినపాపంబు లన్నియును శుక్లతీర్థంబునం దొక్కయహో
రాత్రోపవాసంబునఁ బటాపంచ లగు. శుక్లతీర్థంబునం జేయుతపోదానయజ్ఞ
బ్రహ్మచర్యాదులకుఁ గ్రతుశతంబులేనియు సరి కానేరవు. కార్తికకృష్ణచతుర్దశి
నాఁడు శుక్లతీర్థంబునం దుపవాసంబు చేసి వృషభధ్వజలింగంబునకు ఘృతం
బున నభిషేకంబు గావించిన నిరువదియొక్కతరంబులవారితోఁ గూడఁ దాను
మద్ధామంబునం దుండు. శుక్లతీర్థంబునఁ గావించినస్నానంబు పునర్జన్మముం
దొలంగించు. శుక్లతీర్థంబునఁ బ్రభాతకాలంబున స్నానంబు గావించి వృషభ
ధ్వజుని నర్చించి నృత్యగీతాదిమంగళంబులచే రాత్రి జాగరంబుచేసి మఱు
నాఁడు కల్యకృత్యంబులు నిర్వర్తించికొని యాచార్యుని విత్తశాఠ్యంబు చేయక
భోజనతాంబూలాదులచే సత్కరించినవాఁడు దివ్యయానారూఢుం డై యప్స
రోగణంబులు స్తుతింపఁ గైలాసంబున నాభూతసంప్లవంబు నివసించు. శుక్లతీర్థం
బునఁ గనకదానంబు గావించి నాకు ఘృతాభిషేకంబు గావించినపడంతి చతు
ర్దశమహేంద్రులు గడచునంతవఱకును దేవలోకంబునం దుండు. అయనమందుఁ
గాని చతుర్దశియందుఁ గాని సంక్రాంతియందుఁ గాని విషువంబునందుఁ గాని శుక్ల
తీర్థంబున స్నానంబు గావించి యొక్కయుపవాసంబు చేసి యథాశక్తి దానంబు
గావించెనేని సర్వంబును నక్షయం బగు. శుక్లతీర్థంబునందు బ్రాహ్మణునకు
వివాహంబు చేసెనేని యనేకసహస్రవర్షంబులు మల్లోకంబున నివసించు. శుక్ల
తీర్థంబునకు సాటి యగుతీర్థంబు గానరా దని మహేశ్వరుండు వచియించె.
పిదప ననరకతీర్థంబు గలదు. అచ్చోట స్నానంబు గావించినమాత్రంబున నరక
లోకదర్శనంబు గానేరదు. మఱియు నత్తీర్థంబునం దుంచినయస్థులు తత్క్షణంబ
నశియించి దివ్యరూపంబు గలనరుండై యావిర్భవించు. పిదప గోతీర్థంబు గలదు.
తద్దర్శనమాత్రంబున సర్వపాపక్షయం బగు. పిదపఁ గపిలాతీర్థంబు గలదు. అందు
స్నానంబు గావించిన గోసహస్రదానఫలంబు లభియించు. జేష్ఠమాసంబునఁ జతు
ర్దశినాఁ డుపవాసంబు గావించి కపిలాదానంబు చేసెనేని శివతుల్యత్వంబు వడసి
పునర్జన్మంబు లేకుండు. అంగారకచతుర్థినాఁడు గాని యంగారకనవమినాఁడు
గాని యంగారకామావాస్యనాఁడు గాని యీశ్వరునకు ఘృతస్నానంబు
గావించి బ్రాహ్మణులను యథాశక్తిగా భుజియింపఁ జేసెనేని పుష్కరవిమా
నారూఢుం డై పరివారసహస్రసమేతుం డై రుద్రుండువలె నక్షయకాలంబు
కైలాసంబునందు వసియించు. కర్మయోగంబువలన నెప్పు డైనను బునర్జన్మంబు
ప్రాప్తించెనేని మర్త్యలోకంబున సర్వశక్తిసహితుండును రూపవంతుండును
నగుచక్రవర్తిగా నవతరించు. పిదప ఋషితీర్థంబు గలదు. శాపదగ్ధుం డగుతృణ
బిందు వనునొకఋషి యాతీర్థంబునందుఁ గొంతకాలంబు వసించి తత్తీర్థప్రభావం

బున శాపవిముక్తిం బడసె. పిదప గణేశ్వరతీర్థంబు గలదు. అందు శ్రావణ
కృష్ణచతుర్దశినాఁడు గావించినస్నానంబున రుద్రలోకప్రాప్తియును బితృతర్ప
ణంబున ఋణత్రయవిముక్తియుం గలుగు. గణేశ్వరతీర్థమున కనతిదూరంబున
గంగావదనతీర్థంబు గలదు. అకాముఁడైనను సకాముఁడైనను నాతీర్థంబునఁ
బర్వదినంబునందు స్నానంబు చేసెనేని సకలపాపవిముక్తియును బితృతర్పణంబు
గావించెనేని ఋణత్రయవిముక్తియునుం గలుగు. దానికిఁ బశ్చిమభాగంబున
దశాశ్వమేధికతీర్థంబు గలదు. తత్తీర్థంబునం దొకరాత్రి యుపవాసము
గావించి పర్వదినంబున స్నానంబు చేసి పితృతర్పణంబు గావించెనేని దశాశ్వ
మేధఫలంబు సిద్ధించు. దశాశ్వమేధికమునకుఁ బశ్చిమభాగంబున భృగు వను
నొకబ్రాహ్మణుండు మహేశ్వరునింగూర్చి వర్షసహస్రంబు తపంబు గావించు
టయు నాతనిపైఁ బుట్ట లేర్పడియె. 262

సీ. అది చూచి పార్వతి యాశ్చర్యమగ్నయై, యీతఁ డెవ్వం డని యీశు నడుగ
నీశ్వరుం డాయమ నీక్షించి యీశ్వరి, విను భృగు వనునొకముని యితండు
ననుఁ గూర్చి బహుకాలముననుండి తప మాచ, రించుచు నున్నవాఁ డంచుఁ బలుక
నాతల్లి హాసియించి భూతేశ నీ కను, గ్రహ మిప్పటికి నైనఁ గలుగ లేదె.

గీ. యనుటయును దేవి యతిఘోర మగుతపంబు, చేయుచున్నను వీనికిఁ జిత్తమందు
శాంతి యేర్పడకుండినకారణమునఁ, గలుగ దాయెను నా కనుగ్రహము గూడ.

క. దీనికి నిదర్శనంబును, గానఁబఱుతు ననుచు శివుఁడు గనుమూసి మదిన్
ధ్యానము సేయఁగ ధర్మము, తా నప్పుడె వృషభతనువు దాలిచి వచ్చెన్.

క. అరుదెంచిన వృషమున్ గని, హరుఁడు వృషభరాజ పుట్ట లాచ్ఛాదింపన్
ధరణి నొకద్విజుఁడు తప మా, చరించుచును నుండె వాని క్షమ గనుఁగొనుమా.

క. అనవుడు నీశ్వరునానతి, గొని వృషభము భూతలమునకుం దిగి భృగు వుం
డినచోటి కరిగి శృంగము, లను బుట్టలు చీల్చిపైకి లాగెను వానిన్. 266

క. అంతట నమ్ముని క్రోధా, క్రాంతుం డయి దానిఁ గరయుగంబునఁ ద్రోసెన్
గంతుగొని యది చనంగ న, నంతపథంబునకు నాతఁ డతిరోషమునన్. 267

క. ఎచ్చటి కేఁగెదు నిలువుము, చచ్చెదు నాచేత నిన్నుఁ జంపక విడువన్
మ్రుచ్చా యని యఱచుచుఁ గన్, బిచ్చు లురలఁ జూచుచుండె నిర్జరపథమున్.

గీ. అపుడు రుద్రుఁడు నవ్వఁగా నాతపస్వి, యాక్షణంబున శివునిసమక్షమునకు
వచ్చి నిలుచుండి యాతనిచిచ్చుకన్ను, చూచి నిశ్చేష్టుఁడగుచును క్షోణిఁ బడియె.

ఉ. అంతటఁ గొంతసేపటికి నాతఁడు తెల్వి యొకింత వచ్చి కా
మాంతకుఁ డాచరించినయహంకృతిభంగ మెఱింగి నిర్గళ

త్స్వాంతవికారుఁడై ప్రణతి సల్పి నుతింపఁ దొడంగె నిట్టు లా
ద్యంతవిహీనుఁడైన త్రిపురారిని భక్తిపురస్సరంబుగన్. 270

దండకము. నాథా భవానీసనాథా మరణాహతాత్ముండ దుర్మానభూతాభిభూతుండఁ గ్రోధాగ్నితప్తుండ దుర్గర్వశైలాధిరూఢుండ నీచాతినీచుండఁ బాపాత్ముఁడన్ మత్సరోపేతుఁడన్ శాసనీయేంద్రియాధీనుఁడన్ హీనుఁడన్ ద్వద్గుణస్తోత్రముం జేయ నే నెంతవాఁడన్ భుజంగేంద్రుఁడే వేయి శీర్షంబులున్ వంచె మృత్యుంజయా నిన్నె నే దిక్కుగా నెంచుకొన్నాఁడ నాపైని నీపూర్ణకారుణ్యధారాప్రసారంబు గావింపవే మామకీనాపచారంబు సైరింపవే ఘోరసంసారపాథోధితీరంబు నన్ జేర్పవే మోహపాశంబు ఛేదింపవే ధూర్జటీ తండ్రి నీ వేను బుత్రుండఁ బాలింపవే నన్ను దేవా యమేయప్రభావా ప్రసన్నస్వభావా భవద్భక్తికిన్ సాటి గానేర నష్టాంగయోగంబులున్ వేదమంత్రంబులున్ దానముల్ ధర్మముల్ యజ్ఞముల్ దేవతోపాసనల్ తండ్రి మూర్తిత్రయాత్ముండ వీవే ప్రపంచంబు లెల్లన్ సృజింపంగఁ బోషింపఁగన్ సంహరింపంగ నీకంటె నన్యుం డెవం డుండు దయుండు స్వామీ గిరీశా మహేశా నమస్తే నమస్తే నమస్తే నమః. 271

క. అని స్తోత్రము గావించుట, యును మృత్యుంజయుఁడు కరుణ యుద్భవిలంగన్
మనమున నాద్విజునిఁ గనుం, గొని యిచ్చెద వరము కోరుకొను మని పలికెన్.

గీ. అంత నాబ్రాహ్మణుఁడు మహాహ్లాద మొదవ, స్వామియిదిరుద్రవేదిగావలయుననుచు
నభిలషింపఁగ నట్టులే యగు నటంచు, నానతిచ్చి తిరోహితుం డయ్యె హరుఁడు.

వ. అది మొదలుకొని యీశ్వరుండు నివసించుటం జేసి బ్రహ్మాదిసకలదేవతలును భృగుతీర్థంబును సేవింపఁ జొచ్చిరి. తత్తీర్థదర్శనంబున సర్వపాపవిముక్తి యగు. అందలిస్నానం బశ్వమేధఫలప్రదంబు. తత్తీర్థంబున మరణంబు తటస్థించెనేని పునర్జన్మంబు లేదు. అచ్చటఁ జంద్రసూర్యోపరాగసమయంబులందుఁ గావించు దానధర్మంబు లక్షయఫలంబులు. ఆతీర్థంబునందుఁ గోటితీర్థంబులు గలవు. పిమ్మట గౌతమేశ్వరతీర్థంబు గలదు. అచ్చట స్నానంబు గావించి యుపవాసము చేసెనేని కాంచనవిమానారూఢుండై బ్రహ్మలోకమునకుం జను. పిదప ధౌతపాపతీర్థంబు గలదు. అచ్చటఁ గావించినస్నానంబు బ్రహ్మహత్యామహాపాపహరంబు. ఆతీర్థంబునందుఁ బ్రాణత్యాగంబు గావించెనేని చతుర్భుజుండును ద్రినేత్రుండును నగు. పిదప హిరణ్యద్వీపతీర్థంబు గలదు. అచ్చట స్నానంబు గావించెనేని యైశ్వర్యసంపన్నుండును రూపవంతుండును నగు. పిదపఁ గనఖలతీర్థంబు గలదు. మున్ను గరుత్మంతుఁ డాతీర్థంబునఁ దపంబు సలిపె. అచ్చట యోగిని యోగులతోడఁ గ్రీడించుచు నీశ్వరునితోడ నృత్యంబు గావించు

చుండు. తత్తీర్థస్నానంబు రుద్రలోకప్రదంబు. పిదప నీశతీర్థంబు గలదు. అయ్యాది యీశ్వరునకుం గూడ నూర్ధ్వగతిప్రదంబు. అనంతరంబు వారాహతీర్థంబు గలదు. అచ్చటవరాహరూపంబు దాల్చి పరమేశ్వరుం డర్చింపంబడియె. వారాహతీర్థంబున ద్వాదశినాఁడు స్నానంబు గావించెనేని విష్ణులోకప్రాప్తి చేకూరు. పిదప రుద్రకన్యాసంగమతీర్థంబు గలదు. తత్తీర్థంబునఁ గావించినస్నానంబున దేవీధామంబు లభించు. పిదప దేవతీర్థంబు గలదు. అందు స్నానంబు సలిపెనేని దేవతలతోడఁ గూడి ప్రమోదించు. పిదప శిఖితీర్థంబు గలదు. అచ్చటఁ జేయుదానంబు కోటిగుణం బగు. అమావాస్యనాఁ డచ్చట స్నానంబు గావించి యొక్కబ్రాహ్మణునకు భోజనంబు పెట్టెనేని కోటిబ్రాహ్మణసంతర్పణంబు గావించినఫలంబు చేకూరు. అనంతరంబు విహంగేశ్వరతీర్థంబు గలదు. తత్తీర్థదర్శనంబున సర్వపాపవిముక్తియగు. పిదప నశ్వతీర్థంబు గలదు. అచ్చట స్నానంబు సలిపెనేని సుభగుండును దర్శనీయుండును భోగవంతుండును నగు. పిదపఁ బితామహతీర్థంబు గలదు. అది బ్రహ్మనిర్మితంబు. అందు స్నానంబు గావించి పితరుల నుద్దేశించి తిలోదకపిండప్రదానంబులు సలిపెనేని సర్వంబును నక్షయం బగు. పిదప సావిత్రీతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించెనేని సర్వపాపవిముక్తుండై బ్రహ్మలోకనివాసభాగ్యముం బడయు. అందే మనోహరతీర్థంబు గలదు. తానం గావించినస్నానంబు పితృలోకప్రదంబు. పిదప మానసతీర్థంబు గలదు. అందు స్నానంబు చేసెనేని రుద్రలోకావాప్తి చేకూరు. పిదపఁ గ్రతుతీర్థంబు గలదు. అచ్చట స్నానంబు గావించెనేని పశుపుత్రధనాదిసర్వసంపదలును గలుగు. పిదపఁ ద్రిదశజ్యోతితీర్థంబు గలదు. 274

గీ. అందు ఋషికన్యకలు పదిమంది తపము, నాచరించిరి మున్నంధకారిఁ గూర్చి
వామదేవుఁడెభర్తకావలయుననెడి, కోర్కితమడెందములయందుఁగొనలుసాఁగ.

క. వారలతపమునకుం ద్రిపు, రారి ముదం బొంది భిక్షుకాకారముతోఁ
జేరి తదంతికముఁ జను, త్కారముగాఁ బెండ్లియాడెఁ దత్కన్యకలన్. 276

క. ఆతీర్థమునకు దశక, న్యాతీర్థం బనెడినామ మది మొదలుగ వి
ఖ్యాతం బయ్యెను దానన్, స్నాతుం డగునేని సమయు సకలాఘుంబుల్. 277

వ. పిదప స్వర్గబిందుతీర్థంబు గలదు, అందు స్నానంబు గావించెనేని నరకలోకంబును దర్శింపఁడు. పిదప నప్సరేశతీర్థంబు గలదు. అందు స్నానంబు సలిపెనేని నాకలోకంబున నచ్చరలతోడంగూడి సుఖియించు. పిదప భారభూతతీర్థంబు గలదు. అం దుపవాసంబు చేసి యీశ్వరు నారాధించెనేని రుద్రలోకావాప్తి చేకూరు. మఱియు నందు మృతుం డయ్యెనేని గణేశ్వరత్వంబు ప్రాప్తించు. మఱియును గార్తికమాసంబున నందు మహేశ్వరుం బూజించిన నశ్వమేధ

శతగుణఫలంబు ప్రాప్తించు. మఱియును నందు నూఱు దీపంబులు నేతితో వెలిఁగించె నేని సూర్యసన్నిభం బగువిమానము నధిష్ఠించి శివలోకంబునకుం జను. మఱియును నందు శ్వేతవృషభదానంబు గావించె నేని వృషభయానంబున రుద్రలోకంబునకుం జేరు. మఱియును నందు భక్ష్యభోజ్యపాయసాదులతోఁడ సదక్షిణంబుగా బ్రాహ్మణసంతర్పణంబు గావించె నేని సర్వంబును గోటిగుణం బగు. మఱియును నందు నర్మదాజలంబుచే వృషభధ్వజుని నభిషేకించె నేని దుర్గతిసంభవింప నేరదు. మఱియును నందుఁ బ్రాణత్యాగంబు గావించె నేని సకలపాపవిశుద్ధిం బడసి కైలాసనివాసభాగ్యంబుం జెందు. మఱియును నందు జలప్రవేశంబు గావించె నేని హంసయానంబున రుద్రలోకంబునకుం జేరి చంద్రసూర్యులును బర్వతంబులును సముద్రంబులును గంగాదిమహానదులును నుండునంతవఱకును నందు నివసించు. మఱియును నాతీర్థంబునం దనశన వ్రతంబు నెఱవేర్చిన నరుండు మరల గర్భవాసముం గాంచఁడు. పిదప నటవీతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించె నేని మహేంద్రునియర్ధాసనంబు లభియించు. పిదప శృంగతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించె నేని గణేశ్వరత్వంబు గలుగు. అవల నేరండీనర్మదాసంగమతీర్థంబు గలదు. అందుపవాసంబు చేసి స్నానంబు గావించె నేని బ్రహ్మహత్యాపాపవిముక్తుం డగు. పిదప నర్మదోధదిసంగమతీర్థంబు గలదు. అచ్చట నింద్రుండు బహుయజ్ఞంబులు చేసి స్వర్గాధిపత్యంబు నడసె. అందు స్నానంబు గావించె నేని త్రిగుణాశ్వమేధఫలంబు ప్రాప్తించు. పిదప విమలేశ్వరతీర్థంబు గలదు. అచట దేవగంధర్వసిద్ధచారణాదులును ఋషిసంఘంబులును త్రిసంధ్యంబును విమలేశ్వరుని నారాధింతురు. ఆతీర్థంబునం దుపవాసంబు గావించి విమలేశ్వరుని దర్శించినవారు సర్వపాపవిముక్తులై రుద్రలోకావాసభాగ్యంబు వడయుదురు. అనంతరంబు కేశినీతీర్థంబు గలదు. అం దొక్కరాత్రి యుపవసించె నేని బ్రహ్మహత్యాపాతక విముక్తి గలుగు. అచ్చటన యోజనాభ్యంతరంబున సాగరావర్తసితుం డగు సాగరేశ్వరుని దర్శించె నేని సర్వతీర్థదర్శనంబు గావించినవాఁ డయి సర్వపాప విముక్తిం బడసి రుద్రలోకనివాసభాగ్యంబు నొందు. అమరకంటకంబునందు నర్మదాసంగంబు గలిగి యున్నంతవఱకును దశకోటి తీర్థంబు లేర్పడియె. ఆతీర్థంబు లన్నియును సాగ్నిహోత్రులును దివ్యజ్ఞానసమేతులును నగు ఋషిపుంగవులచే సేవింపంబడు చుండు. యమున సూర్యలోకంబును సరస్వతి బ్రహ్మలోకంబును నర్మద విష్ణులోకంబును మోక్షంబును నొసంగు. సరయూ గండకీ సింధు చంద్రభాగా కౌశికీ తాపీగోదావరీభీమాపయోష్ణీ కృష్ణవేణీకావేరీ తుంగభద్రాదిమహానదులలో నర్మదామహానది యగ్రస్థానంబు నాసాదించె.

సీ. క్షణములోపల సప్తజన్మార్జితము లైన, పాపంబులను రూపుమాపు రేవ
యింద్రలోకావాస మీయఁగా మును బ్రహ్మ, పరులచే నిర్మింపఁబడియె రేవ
కోరువారలకు వైకుంఠంబు కరతలా, మలకంబుగాఁ జేయఁ గలుగు రేవ
సమకూర్చి యాత్మవిజ్ఞానంబు మోక్షుల, క్షేమసమాగమము గల్గించు రేవ
గీ. తనజలంబున మునిఁగిన జనుల కెల్ల, సర్వకామఫలంబు నీఁజాలు రేవ
నిరయములలోనఁ గూలిననరుల నెల్ల, నుద్ధరింపంగ నుద్భవం బొందె రేవ.
గీ. అట్టు లపునర్భవాధాత్రి యైన రేవ,యందు స్నానంబు సలుపుట యన్నఁ బూర్వ
జన్మశతపుణ్యరాశిచే సంఘటిల్ల, వలయునే కాని కలుగదు సులభముగను. 280
వ. పిదప దక్షిణసింధువునందు జితేంద్రియుండై బ్రహ్మచర్యవ్రతం బనుష్ఠించెనేని యగ్నిష్టోమఫలంబు వడసి విమానారూఢుం డయి స్వర్గంబు నధిష్ఠించు. పిదపఁ జర్మణ్వతీమహాతీర్థంబు గలదు. అందు నియతాశనుండై రంతిదేవాభ్యనుజ్ఞాతుం డయ్యెనేని యగ్నిష్టోమఫలంబు సిద్ధించు. అనంతరంబు హిమవత్ప్రభవం బగు నర్బుదతీర్థంబు గలదు. పూర్వము దానియందుఁ బృథివికి ఛిద్రం బేర్పడియె. తత్తీర్థంబునందు త్రిలోకవిశ్రుతం బగువసిష్ఠాశ్రమంబు గలదు.అచ్చట నొకరాత్రి గడపెనేని గోసహస్రదానఫలంబు లభియించు. పిదపఁ బింగాతీర్థంబు గలదు. బ్రహ్మచర్యంబునఁ దత్తీర్థంబు నుపస్పృశించినమాత్రంబునఁ గపిలాశతప్రదాన ఫలంబు చేకూరు. పిమ్మట లోకవిశ్రుతం బగుప్రభాసతీర్థంబు గలదు.
ఆ. అనిలసారథియును నమరులముఖమును, నైనవీతిహోత్రుఁ డధివసించు
నచట నెపుడుఁ గూడ నద్దానిమహిమము, చెప్ప నలవి గాదు క్షితితలేంద్ర.
వ. తత్తీర్థరాజంబునందుఁ బ్రయతమానసుండై స్నానంబు గావించెనేని యగ్నిష్టోమాతిరాత్రఫలంబు వడయు. అనంతరంబు సరస్వతీసాగరసంగమతీర్థంబు గలదు. అందుఁ ద్రిరాత్రంబులు స్నానంబు గావించి పితృతర్పణంబు చేసెనేని వైశ్వానరుండువలె దీప్యమానాకారుండై యమృతాంశుండువలె నాహ్లాదకరుండై గోసహస్రదానఫలంబును వాజిమేధఫలంబునుం గలిగి నాకలోకంబు వడయు. పిదప వరదానతీర్థంబు గలదు. అచ్చట మున్ను దుర్వాసుండు విష్ణువునకు వరం బొసంగె. తత్తీర్థంబున స్నానంబు గావించెనేని గోసహస్రదానఫలంబు ప్రాప్తించు. పిదప ద్వారవతి కేఁగి పిండారకతీర్థంబునందు స్నానంబు గావించెనేని యపరిమితం బగుసువర్ణంబు లభియించు. తత్తీర్థరాజంబునఁ బద్మలక్షణలక్షితంబు లగుముద్రాశతంబులును త్రిశూలాంకితంబు లగుపద్మంబులును నిప్పటికిని గానంబడుచుండు. అచ్చట మహాదేవుండు నిత్యసన్నిహితుండై యుండు. పిదప సింధుసాగరసంగమతీర్థంబు గలదు. అందు స్నాతుండై దేవర్షిపితృతర్పణంబు గావించెనేని దివ్యతేజోదీప్యమానుండై వరుణలోకంబు వడయు. అచ్చట శంకు

కర్ణేశ్వరుని నర్చించెనేని దశగుణం బగునశ్వమేధఫలంబు గలుగు. పిదపఁ దిమి
తీర్థంబు గలదు. అచ్చట బ్రహ్మాదిదేవతలు మహేశ్వరు నుపాసించి సిద్ధి వడ
సిరి. అందు స్నానంబు సలిపి దేవగణావృతుం డగురుద్రునిఁ బూజించెనేని
జన్మించినది మొదలుగాఁ జేసినపాపంబు లన్నియును బటాపంచ లగు. మున్ను
మహావిష్ణువు సకలదేవతలచేఁ బ్రార్థింపంబడి తత్తీర్థంబునందుఁ దిమిరూపంబునం
బ్రాదుర్భవించి సోమకాసురసంహారంబు గావించి త్రిదివంబు నిష్కంటకం
బొనరించె. పిదప వసుధారాతీర్థంబు గలదు. అచ్చోట గమనమాత్రంబున
హయమేధఫలంబు ప్రాప్తించు. అందు స్నానంబు గావించి పితృదేవతా
తర్పణంబు చేసెనేని విష్ణులోకావాప్తి కలుగు. దానియందె వసుతీర్థం బనుమఱి
యొకతీర్థంబు గలదు. అందు స్నానంబు సలిపి సలిలపానంబు గావించెనేని వసు
వుల కిష్టుం డగు. పిదప సింధుతమం బనుతీర్థంబు గలదు. అందు స్నానంబు
గావించెనేని బహుసువర్ణంబు లభియించు. పిదప బ్రహ్మతుంగం బనుతీర్థంబు
గలదు. దానికి దగ్గఱినంతమాత్రమున బ్రహ్మలోకనివాసభాగ్యంబు సిద్ధించు.
పిమ్మట సిద్ధనిషేవితం బగుశక్రకుమారికాతీర్థంబు గలదు. అందు స్నానంబు
గావించెనేని శక్రలోకంబు ప్రాప్తించు. పిదప దేవనిషేవితం బగురేణుకా
తీర్థంబు గలదు. అందు స్నానంబు గావించెనేని చంద్రుండువలె నిర్మలుం డగు.
పిమ్మటఁ బంచనదతీర్థంబు గలదు. అందు నియతాశనుం డయ్యెనేని పంచయజ్ఞ
ఫలంబు చేకూరు. పిదప భీమాస్థానం బనుతీర్థరాజంబు గలదు. అందు స్నాతుం
డయ్యెనేని మరల గర్భవాసదుఃఖంబు లేకుండు. పిదప గిరికుంజరతీర్థంబు గలదు.
అందుఁ బితామహుని నమస్కరించినమాత్రంబున గోసహస్రదానఫలంబు సమ
కూరు. అనంతరము విమలతీర్థంబు గలదు. అందు స్వర్ణరజతమత్స్యంబు లిప్పు
డును గానంబడుచుండు. తత్తీర్థంబున స్నానంబు గావించెనేని వాజపేయ
ఫలంబు వడసి సర్వపాపవిముక్తాత్ముండై సద్గతిం జెందు. పిదపఁ గాశ్మీరంబు
లందు వితస్తాఖ్యం బగుమహాతీర్థంబు గలదు. అది తక్షకునకు భవనంబుగా
నుండె. అందు స్నానంబు గావించెనేని సర్వపాపవిముక్తుండై వాజపేయఫలంబు
వడయు. పిదప మలవాం బనుపుణ్యతీర్థంబు గలదు. చరమసంధ్యాకాలంబునఁ
దత్తీర్థంబు నుపస్పృశించి శక్త్యనుసారంబుగా పీతిహోత్రునకుఁ జరువును నివే
దించెనేని యయ్యాది పితరుల కక్షయం బగు. వైశ్వానరునకు నివేదించినచరువు
గోశతసహస్రదానంబుతోడను రాజసూయశతంబుతోడను నశ్వమేధసహస్రంబు
తోడను సమానం బగు. అనంతరంబు రుద్రాస్పదతీర్థంబు గలదు. అందు మహా
దేవుని నారాధించెనేని యశ్వమేధఫలంబు ప్రాప్తించు. పిదప మణిమంత మను
తీర్థంబు గలదు. అందు బ్రహ్మచర్యంబున సమాహితమనస్కుండై యొక్కరాత్రి

గడపెనేని యగ్నిష్టోమఫలంబు లభియించు. పిమ్మట దేవికాతీర్థంబు గలదు. తత్తీర్థంబునందు విప్రు లుదయించి రని శాస్త్రజ్ఞులు వచియింతురు. అయ్యది త్రిశూలపాణికి స్థానంబు. అందు స్నానంబు గావించి మహేశ్వరు నారాధించెనేని సర్వకామసమృద్ధయాగఫలంబు సిద్ధించు. దానియంద రుద్రప్రియంబును దేవర్షిసంస్తుతంబును నగు కామతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించెనేని క్షిప్రంబ కాంక్షాసిద్ధి చేకూరు. దేవికాతీర్థం బర్ధయోజనవిస్తారంబును బంచయోజనాయతంబునుంగా నుండె నని విద్వాంసులు సెప్పుదురు. పిదప దీర్ఘసత్త్రింబు గలదు. అందు బ్రహ్మాదిదేవతలును సిద్ధులును మహర్షులును నియతవ్రతంబున దీక్షితులై యుందురు. దీర్ఘసత్త్రింబు గమనమాత్రంబున రాజసూయాశ్వమేధఫలంబు నొసంగు. అనంతరం బవినాశతీర్థంబు గలదు. మేరుపృష్ఠంబునం దంతర్హితయై ప్రవహించుసరస్వతి యాతీర్థంబునందుండి చమసోద్భేదశివోద్భేదనాగోద్భేదతీర్థంబులందుఁ గానంబడుచుండుం గావునఁ జమసోద్భేదంబునందు స్నానంబు గావించెనేని యగ్నిష్టోమఫలంబును శివోద్భేదంబునందు స్నానంబు సలిపెనేని గోసహస్రదానఫలంబును నాగోద్భేదంబునందు స్నానం బొనరించెనేని నాగలోకావాసభాగ్యంబునుం జేకూరు. పిదప శశయానతీర్థంబు గలదు. అనువత్సరంబును నచ్చట శశరూపప్రతిచ్ఛన్నంబులై పుష్కరంబులు సరస్వతియందుఁ గార్తికమాసమునందు స్నానంబు చేయుచుండు. తత్తీర్థంబునందు స్నానంబు గావించెనేని గోసహస్రదానఫలముం బొంది సదాశివుండువలె విద్యోతమానుం డగు. పిమ్మటఁ గుమారకోటితీర్థంబు గలదు. అచ్చటఁ బితరుల నర్చించెనేని యయుతగోదానఫలంబు వడసి కులంబు నుద్ధరించినవాఁ డగు. అనంతరము రుద్రకోటితీర్థంబు గలదు. 283

సీ. అందుఁ బూర్వము కోటిమంది తపోధనుల్, స్నానంబు సల్పి హర్షంబుతోడఁ
జని యీశ్వరాలయంబునకు రుద్రుని నేను, ముందుఁ జూతును నేను ముందుఁ జూతు
ననుచు నావేశంబునను గర్భగృహమున, కహమహమికతోడ నరుగుచుండ
హరుఁడు వారలభక్తి కానందమును జెంది, కోటిమందికి రుద్రకోటి యగుచు

గీ. సులభముగ దర్శనం బిచ్చెఁ జూచి యెల్ల, తాపసులును క్షణంబులో ధన్యులైరి
యది మొదలు గాఁగ నాక్షేత్ర మవనినాథ, రుద్రకోటి యనంగ నారూఢి కెక్కె.

వ. అందు స్నానంబు గావించెనేని యశ్వమేధఫలంబు వడసి వంశోద్ధారకుం డగు. పిదప సరస్వతీసంగమతీర్థంబు గలదు. బ్రహ్మాదిదేవతలును సిద్ధచారణులును ఋషులును జైత్రశుక్లచతుర్దశినాఁడు స్నానార్థ మచ్చటికి వచ్చుచుందురు. ఋషులసత్త్రియాగంబు లచ్చట సమాప్తము లగుచుండు. అందు స్నానంబు

గావించెనేని సకలపాపశుద్ధిం బడసి శివలోకావాసభాగ్యముం జెందు. పిదపఁ గురుక్షేత్రంబు గలదు. 285

క. చనియెదము కురుక్షేత్రం, బునకుం జని యచట వాసముం జేయుదు మం
చనిశమును బలుకుచుం డెడి, జనులకు దూరముగ నుండు సకలాఘంబుల్. 286

క. అనకున్నను నోటను మన, మునను గురుక్షేత్రశబ్దమునునైన స్మరిం
చినఁ జాలు నగ్నిలో వై, చినతూలమువోలె సమయుఁ జేసినయఘముల్.

క. అట్టికురుక్షేత్రమునకు, నెట్టులొ సుకృతమునఁ జేసి యేఁగనయేనిం
జుట్టుకొను మొట్టమొదటనె, చుట్టును హయమేధరాజసూయఫలంబుల్.

గీ. ఎపుడుచూచిన నచటికి నేఁగుచుంద్రు, హరిహరచతుర్ముఖులును నిర్జరులు ఋషులు
యక్షగంధర్వులును సిద్ధులచ్చరలును, జారణులుఁ బన్నగులును విశ్వంభరేంద్ర.

వ. అందు మత్తర్ణకుం డనుద్వారపాలునకు నమస్కరించెనేని గోసహస్రదానఫలంబు చేకూరు. పిదప విష్ణుస్థానంబు గలదు. అచ్చట ననవరతమును విష్ణువు సన్నిహితుండై యుండు. అందు స్నానంబు గావించి విష్ణుసందర్శనంబు చేసెనేని యశ్వమేధఫలంబును వైకుంతావాప్తియుం గలుగు. పిదపఁ బారిప్లవతీర్థంబు గలదు. అయ్యాది గమనమాత్రంబున నగ్నిష్టోమాతిరాత్రఫలంబు నొసంగు. పిదపఁ బృథివీతీర్థంబు గలదు. అందు స్నానంబు చేసెనేని గోసహస్రదానఫలంబు సిద్ధించు. పిదప శాల్వికినితీర్థంబు గలదు. అచ్చట దశాశ్వమేధికంబున స్నానంబు సలిపెనేని గోసహస్రదానఫలంబు గలుగు. పిదప నాగతీర్థంబు గలదు. అచ్చట సర్పిర్నదియందు స్నానంబు చేసెనేని యగ్నిష్టోమఫలంబును నాగలోకావాప్తియుం గలుగు. పిదప నతర్ణకుం డనుద్వారపాలుని దర్శించి యం దొక్కరాత్రి గడపెనేని గోసహస్రదానఫలంబు ప్రాప్తించు. పిమ్మటఁ బంచనదంబు గలదు. అందు నియతాశనుండై కోటితీర్థంబు నుపస్పృశించెనేని హయమేధఫలంబు గలుగు. పిదప నాశ్వనేయతీర్థంబు గలదు. అందు స్నానంబు చేసెనేని రూపవంతుం డగు. పిదప వారాహతీర్థంబు గలదు. మహావిష్ణువు మున్నచట వరాహరూపంబున నివసించె. తత్తీర్థంబున నొక్కదినం బుండెనేని యగ్నిష్టోమఫలంబు ప్రాప్తించు. పిదప జయినీక్షేత్రంబు గలదు. అచ్చట నొక్కదినంబు స్నానంబు చేసెనేని రాజసూయఫలంబును గోసహస్రదానఫలంబును సిద్ధించు. పిమ్మటఁ గృతశౌచతీర్థంబు గలదు. అందు స్నానంబు చేసెనేని పౌండరీకఫలంబును గృతశౌచత్వంబునుం గలుగు. పిమ్మట ముంజీవటతీర్థంబు గలదు. అం దొక్కరాత్రి నివసించెనేని గాణపత్యంబు సిద్ధించు. అచ్చట నేలోకవిశ్రుత యగుపంపానదియందు స్నానంబు సలిపెనేని సర్వకామసిద్ధి సమకూరు. అది కురుక్షేత్రంబునకు ద్వారంబు. పిదప రామహ్రదతీర్థంబు లైదు గలవు. మున్ను

పరశురాముండు కోపాతిశయంబున సర్వక్షత్త్రివధంబు గావించి తద్రుధిరప్రవాహంబుచేఁ బంచహ్రదంబులు నిండించి యారక్తంబునఁ బితృతర్పణంబు గావించె. దాని కాతనిపితరులు సంతృప్తులై వ్యోమంబునందుండి యాతని కి ట్లనిరి. 290

క. నీ వొనరించినపనికిఁ, భావంబున మాకు మిగులఁ బ్రమదం బొదవెన్
గావునఁ గోరుము నీకుఁ, గావలసినవరము లీయఁగలము కుమారా. 291

వ. అని పలుకుటయుం బ్రాంజలియై పరశురాముండు వారలకు సప్రశ్రయంబుగా ని ట్లనియె. 292

సీ. మహనీయులార కుమారునిమీఁదను, గలిగెనేనియు ననుగ్రహము మీకు
నేను జేసెడితపం బెపుడును నంతరా, యము లేక యభివృద్ధి నంద వలయు
క్షత్త్రియులను నెల్లసమయించుటను నాకుఁ, బ్రాప్తించినయఘంబుపాయవలయు
రక్తపూర్ణము లైనహ్రదము లీమైదును, బుణ్యతీర్థములుగాఁ బొసఁగ వలయు

గీ. ననుచుఁ బ్రార్థించుటయువారలతఁడుకోరి, నట్టికోర్కులుఫలియించునట్లువరము
లను బ్రసాదించి మఱియు ని ట్లనిరి రామ, యైదుహ్రదములు నీపేర నలరుఁగాక.

గీ. ఈహ్రదంబులలోపల నెవ్వఁడేని, స్నాన మొనరించి పితృతర్పణంబు సలిపె
నేని పితరులు వరముల నిత్తు రతని, కనుచుఁ బలికి యంతర్ధాన మైరి భూప. 294

వ. కావునఁ బుణ్యతీర్థంబు లగురామహ్రదంబులందు స్నానంబు గావించి పరశురాము నర్చించెనేని బహుసువర్ణావాప్తియును నీప్సితావాప్తియుం గలుగు. పిదప వంశమూలతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించెనేని వంశంబు నుద్ధరించినవాఁ డగు. పిదపఁ గాయశోధనతీర్థంబు గలదు. అచ్చట స్నానంబు సలిపెనేని కాయశుద్ధిం బడసి యుత్తమలోకంబులం జెందు. పిమ్మటఁ ద్రైలోక్యదుర్లభం బనుతీర్థంబు గలదు. అందుఁ బూర్వము విష్ణువుచే లోకంబు లుద్ధరింపంబడియె. ఆతీర్థంబునందు స్నానంబు చేసెనేని భగవంతునిచే నుద్ధరింపఁబడువాఁ డగు. పిమ్మట లోకోద్ధారం బనుతీర్థంబు గలదు. అందు స్నానంబు చేసెనేని నిజలోకోద్ధారకుం డగు. పిదప శ్రీతీర్థంబు గలదు. అందు స్నానంబుచేసెనేని లక్ష్మీప్రాప్తి సమకూరు. అనంతరము కపిలాతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించి పితృదేవతల నర్చించెనేని కపిలాసహస్రప్రదానఫలంబు చేకూరు. పిదప సూర్యతీర్థంబు గలదు. అందు స్నానంబు చేసి యుపవసించి పితృదేవతల నర్చించెనేని యగ్నిష్టోమఫలంబు వడసి సూర్యలోకావాప్తభాగ్యంబు నొందు. పిదప గోభవనతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించెనేని గోసహస్రదానఫలంబు లభించు. పిదప గంగాతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించెనేని యత్యుత్తమవీర్యోపేతుం డగు. పిదప ద్వారపాలకుం డగులవర్ణకునిపేర నొకతీర్థంబు గలదు. అది సరస్వతియం దుండు. ఆలవర్ణకతీర్థంబునందు స్నానంబు గావించె

నేని యగ్నిష్టోమఫలంబు గలుగు. పిమ్మట బ్రహ్మావర్తతీర్థంబు గలదు. అందు
స్నానంబు గావించెనేని బ్రహ్మలోకావాప్తి చేకూరు. పిమ్మట సుతీర్థంబు గలదు.
అచ్చటఁ బితరులు దేవతలతోఁగూడ సన్నిహితులై యుందురు. అందుఁ బితృదే
వతార్చనంబు గావించెనేని యశ్వమేధఫలంబును బితృలోకనివాసభాగ్యంబును
గలుగు. పిదపఁ గాశీశ్వరతీర్థంబులు గలవు, వానియందు స్నానంబు సలిపెనేని
సర్వవ్యాధివిముక్తియు బ్రహ్మలోకప్రాప్తియుం గలుగు. అచ్చటనె మాతృ
తీర్థంబు గలదు. అందు స్నాతుం డయ్యెనేని ప్రజావృద్ధియును స్వర్గప్రాప్తి
యును గలుగు. అనంతరము శీతవనతీర్థంబు గలదు. తద్దర్శనమాత్రంబునఁ
బావనత్వంబు గలుగు. అచ్చటనె స్నాతలోకార్తిహ మనుమఱియొక తీర్థంబు
గలదు. అందు స్నానంబు గావించెనేని సర్వార్తివిముక్తియు నుత్తమలోకంబును
బ్రాప్తించు. పిదప మానుషతీర్థంబు గలదు. 295

గీ. వ్యాధశరపీడితాంగములగుచుఁ గృష్ణ, హరిణములు పూర్వమా తీర్థమందు మునిఁగి
మానుషాకారములతోడఁ గానఁబడియె, ననఁగఁ దత్తీర్థమహిమ మేమనఁగవచ్చు.

వ. అందు స్నాతుం డయ్యెనేని సర్వపాపవిశుద్ధిం బడసి స్వర్లోకావాసముం జెందు.
తత్తీర్థంబునకుఁ బూర్వభాగంబునందుఁ గ్రోశమాత్రదూరంబున నాపగ యను
పుణ్యనది గలదు. తత్తటంబునఁ బితృదేవతల నుద్దేశించి విప్రునకు శ్యామాక
భోజనంబు పెట్టెనేని యనంతపుణ్యంబు గలుగు. మఱియు నచ్చట నొక్క బ్రా
హ్మణునకు భోజనంబు పెట్టెనేని కోటిబ్రాహ్మణసమారాధనంబు గావించిన
ఫలంబు ప్రాప్తించు. ఆతీర్థంబునం దొక్కరాత్రి నివసించెనేని యగ్నిష్టోమ
ఫలంబు చేకూరు. తరువాత బ్రహ్మస్థానతీర్థంబు గలదు. అచ్చట సప్తర్షి
కుండంబులందు స్నానంబు గావించి బ్రహ్మను బూజించెనేని సర్వపాపమోచనం
బును బ్రహ్మలోకప్రాప్తియుం గలుగు. మఱియును నందుఁ గేదారతీర్థమునందు
స్నానంబు సలిపెనేని నిర్దగ్ధాఖిలపాతకుఁడై యంతర్ధానంబుఁ జెందు. పిదప సేవక
తీర్థంబు గలదు. అందుఁ గృష్ణపక్షచతుర్దశినాఁడు వృషభధ్వజారాధనంబు చేసె
నేని సర్వకామసమృద్ధియును స్వర్గలోకప్రాప్తియుం గలుగు. సేవకతీర్థంబునందు
మూఁడుకోట్లతీర్థంబులు గలవు. అచ్చటన యుల్లాస్పదతీర్థంబు గలదు. అందు
స్నానంబు చేసి దేవపితృతర్పణంబు గావించెనేని వాజపేయఫలంబు ప్రాప్తించు.
మఱియును గంగాహ్రదయక్షతీర్థంబులందు స్నానంబు సలిపెనేని దానయజ్ఞ
ఫలంబుం బడయు. మఱియును గలశీతీర్థంబునందు జలోపస్పర్శంబు గావించెనేని
యగ్నిష్టోమఫలంబు చేకూరు. మఱియును [illegible] ప్రఖ్యాతిం బడసిన
నారదతీర్థంబు గలదు. అందు స్నానంబు చేసి ప్రాణోత్సర్జనంబు గావించెనేని
నారదప్రసాదంబున దుర్లభంబగు నుత్తమలోకంబులు ప్రాప్తించు. అచ్చటన

పుండరీకతీర్థంబు గలదు. శుక్లపక్షదశమినాఁ డందు స్నానంబు గావించెనేని పౌండరీకఫలంబు సమకూరు. పిదపఁ ద్రిలోకవిశ్రుతం బగు త్రివిష్టపతీర్థంబు గలదు. అచ్చటన వైతరణి యనుపుణ్యానది గలదు. అందు స్నానంబు గావించి శూలపాణి నర్చించెనేని సర్వపాపవిముక్తియును బరమపదంబునుం బ్రాప్తించు. పిదప ఫలకీవనంబు గలదు. అచ్చట దేవతలు సంతతంబును దపంబు గావించుచుందురు. అచ్చట దృషద్వతీమహానదియందు స్నానంబు సలిపి దేవతారాధనంబు గావించెనేని యగ్నిష్టోమాతిరాత్రఫలంబు లభియించు. అచ్చటన సర్వదేవతీర్థంబు గలదు. అందు స్నానంబు చేసెనేని గోసహస్రదానఫలంబు చేకూరు. అచ్చటన పాణిఖ్యాతతీర్థంబు గలదు. అందు స్నానంబు చేసి దేవతాతర్పణంబు గావించెనేని రాజసూయఫలంబును ఋషిలోకనివాసంబునుం గలుగు. పిదప మిశ్రకతీర్థంబు గలదు. అందు సకలతీర్థంబులును ద్విజస్నానార్థంబు వ్యాసమహర్షిచే మిశ్రితంబు లయ్యె నని పెద్దలు చెప్పుదురు. మిశ్రకతీర్థంబునందు స్నానంబు గావించినవాఁడు సర్వతీర్థావగాహనఫలంబు వడయు. పిదప వ్యాసవనంబు గలదు. అచ్చట మనోజవతీర్థంబునందు స్నానంబు సలిపెనేని గోసహస్రదానఫలంబు ప్రాప్తించు. పిదప దేవీస్థానం బగుమధువటీతీర్థంబు గలదు. అందు స్నానంబు సలిపి పితరులను దేవతలను నర్చించెనేని దేవీప్రసాదంబున గోసహస్రదానఫలంబు సమకూరు. పిదపఁ గౌశికీదృషద్వతీసంగమంబు గలదు. అందు స్నానంబు గావించెనేని సర్వపాపంబులును భస్మీభూతంబులగు. పిదప వ్యాసస్థలీతీర్థంబుగలదు.

ఉ. వ్యాసుఁడు పుత్రశోకమున నచ్చట దేహము వీడ యత్నముం
జేసినయంత దేవతలు చేరి యనేకవిధప్రబోధముల్
చేసి విషాదముం దొలఁగఁ జేసిరి మానికిమున్ను తత్స్థలిన్
డాసినఁ జాలు నెన్నఁడును డాయఁగఁ జాలవు పుత్రశోకముల్. 298

వ. పిదప ఋణాంతం బనుకూపంబు గలదు. అందుఁ దిలప్రస్థంబు సమర్పించెనేని ఋణవిమోచనంబును సద్గతియుఁ బ్రాప్తించు. అచ్చటన దేవీతీర్థంబునందు స్నానంబుచేసెనేని గోసహస్రదానఫలంబు లభియించు. పిదప నహస్తీర్థంబును సుదినతీర్థంబును ననురెండుపుణ్యతీర్థంబులు గలవు. వానియందు స్నానంబు చేసెనేని సూర్యలోకప్రాప్తి గలుగు. అనంతరంబు మృగధూమతీర్థంబు గలదు. అచ్చట రుద్రపదంబునందు స్నానంబు సలిపి శూలపాణి నర్చించెనేని యశ్వమేధఫలంబును గోటితీర్థంబునందు స్నానంబు సలిపెనేని గోసహస్రదానఫలంబును సమకూరు. పిదప వామనతీర్థంబు గలదు. అందు విష్ణుపదంబున స్నానంబు గావించి వామను నర్చించెనేని సర్వపాపవిముక్తియును విష్ణులోకావాప్తియుం గలుగు. పిదపఁ గులంపునతీర్థంబు గలదు. అందు స్నానంబు సలిపెనేని కులం

బంతయును బావనం బగు. పిదపఁ బవనహ్రదంబు గలదు. అందు స్నానంబు గావించెనేని వాయులోకావాసంబు చేకూరు. పిదప నమరహ్రదంబు గలదు. అందు స్నానంబు గావించి యమరాధిపు నర్చించెనేని దేవతాప్రసాదంబున స్వర్గలోకావాసభాగ్యంబు చేకూరు. పిదప శాలిసూర్యతీర్థంబు గలదు. అందు స్నానంబు చేసెనేని గోసహస్రదానఫలంబు గలుగు. పిదప సరస్వతియందు శ్రీకుంజతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించెనేని యగ్నిష్టోమఫలంబు ప్రాప్తించు. పిదప నైమిషకుంజం బనుతీర్థంబు గలదు. నైమిషారణ్యవాసు లగు తపోధనులు తీర్థయాత్ర గావించుకొనుచుఁ గురుక్షేత్రంబున కేఁగినప్పు డచ్చట సరస్వతీనదియందు ఋషులస్నానపానతపోధ్యానంబుల కనుకూలంబుగా నాతీర్థంబు నేర్పరించిరి. తత్తీర్థంబునందు స్నానంబు గావించెనేని గోసహస్రదానఫలంబు ప్రాప్తించు. పిదపఁ గన్యాతీర్థంబు గలదు. అందు స్నానంబు సలిపెనేని యగ్నిష్టోమఫలంబు సిద్ధించు. పిదప బ్రహ్మస్థానం బను తీర్థంబు గలదు. 299

గీ. అందు వర్ణావరుం డగునతఁడు స్నాన, మాచరించెనయేని బ్రాహ్మణ్య మొదవు
భూసురుం డందు స్నానంబు చేసెనేని, కలుగు నపునర్భవం బగుగతి నరేంద్ర.

వ. పిదప సోమతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించెనేని సోమలోకప్రాప్తి గలుగు. పిదప సప్తసారస్వతతీర్థంబు గలదు. 301

—: మంకణమహర్షి వృత్తాంతకథనము :—

సీ. మును మంకణుం డనుమునివరేణ్యుం డందుఁ, దపము గావించెడితరుణమందుఁ
దనహస్తము కుశాగ్రమున క్షతం బగుడు నా,క్షతమునుండి తొరంగె శాకరసము
తద్రసంబును జూచి తాపసుం డమితహ,ర్షముచేత నృత్యంబు సలుపఁ దొడఁగె
నతనిశక్తికి లోఁగి యటు లిటు లూఁగంగ, సాగెను స్థావరజంగమములు

గీ. సంతటమహాభయావిష్టు లగుచు బ్రహ్మ, మొదలుగాఁగల వేల్పులుమునులుఁగూడి
ప్రమథనాథునిసన్నిధానమున కేఁగి, విన్నవించిరి జరుగుచు నున్నవిధము. 302

గీ. అంత జగదవనార్థమై హరుఁడు భూమి, కరుగుదెంచి మునీంద్రునిదరికి నేఁగి
యనఘ నీ విట్లు దీర్ఘనృత్యంబు సలుప, నేమి కారణ మయ్యె నా కెఱుఁగ జెపుమ.

క. అని పలుకుటయును నీశ్వరుఁ, డని తెలిసియు నాతఁ డమితహర్షములోనన్
మునిఁగినకతమున నృత్యము, నొనరించుచు నిట్టు లనియె నుగ్రునితోడన్.

గీ. కాంచు మీశ్వర మత్కరక్షతమునుండి, జాఱుచున్నది శాకరసంబు దీని
కతన హర్షంబుగలిగె నుత్కటము గాఁగ, నిదియె హేతువు నాదీర్ఘనృత్యమునకు.

క. నాయొనరించినతపమున, కీయెడఁ గానంగఁబడియె నీసిద్ధి మహిన్
జేయంగఁ దగినకృత్యం, బేయదియును లేదు నాకు నింక గిరీశా. 306

క. అనవుడు మృత్యుంజయుఁడా, తనిఁ గనుఁగొని నవ్వి మునివతంసమ హర్షం
బున నాడ వలసినంతటి, పని యేమియు నిందు లేదు పరికింపంగన్. 307

క. కనుఁగొనుము నన్ను నీ విపు, డని తెలియఁగఁ బల్కి యొక్క స్వాంగుళ్యగ్రం
బున స్వాంగుష్ఠముఁ గొట్టుట, యును క్షతమునుండి భస్మ మురివ్ని రాలెన్.

క. అది చూచి మంకణుఁడు తన, మదిలోపల సిగ్గు పొడమి మన్నింపుము నా
మదచేష్టిత మని శర్వుని, పదములపైఁ బడియె గర్వభంగము గాఁగన్. 809

వ. అట్లు పదంబులపై ప్రాలి లేచి మంకణమహర్షి బద్ధాంజలియై కట్టెదుట నిలువంబడి.

సీ. సచరాచరము లగుసర్వజగంబులు, సృజియింపఁబడుట నీచేతఁ గాదె
యఖిలలోకములకు నాధార మగుచును, నిలుచు దేవుండవు నీవ కాదె
బ్రహ్మాదు లెల్లరు భయ మొకింతయు లేక, వర్తిల్లుచుంట నీవలనఁ గాదె
యొకవ్యక్తియును లేక యుగసంక్షయంబున, నడఁగియుండుటయు నీయంద కాదె

గీ. కర్మముల కెల్లఁ గర్తవు కారయితవు, నీవ సర్వేశ్వరుండవు నీవ సర్వ
శక్తిసంపన్నుఁడవు నీవ సర్వమీవ, తండ్రి నీప్రాభవ మెఱుంగఁ దరమె నాకు.

వ. అని నుతించుటయును. 312

గీ. చెడక వర్ధిల్లుఁ గాక నీచేయుతపము, నేను నీయాశ్రమమునందు నిలిచియుందు
నిందులోఁ గ్రుంకి నను భజియించునట్టి, ప్రాణి కిహపరములను దుర్లభము లేదు.

క. అని యానతిచ్చి వృషకేతనుఁ డంతర్ధాన మొందెఁ దత్కాలమునన్
జననాథ పుణ్యవంతులు, చని సేవించెదరు సప్తసారస్వతమున్. 314

వ. పిదప నౌశనసతీర్థంబు గలదు. అచ్చట భగవానుం డగుకార్తికేయుండు భార్గవప్రియచికీర్షం ద్రిసంధ్యంబును సాన్నిధ్యంబుచేసి యుండు. అందు స్నానంబు గావించెనేని కుమారప్రియుం డగు. పిదపఁ గపాలమోచనతీర్థంబు గలదు. అందు స్నానంబు సలిపెనేని సర్వపాపవిమోచనంబు గలుగు. పిదప నగ్నితీర్థంబు గలదు. అచ్చట స్నానంబు సలిపెనేని యగ్నిలోకప్రాప్తియును వంశోద్ధారకత్వంబునుం గలుగు. అచ్చటనె విశ్వామిత్రతీర్థంబు గలదు. అందు స్నానంబు చేసెనేని బ్రాహ్మణ్యంబు సమకూరు. అచ్చటనె బ్రహ్మయోనితీర్థంబు గలదు. అందు స్నానంబు గావించెనేని బ్రహ్మలోకనివాసభాగ్యంబు వడయుటయే కాక సప్తపురుషపర్యంతమును స్వకులంబును బావనంబుచేసినవాఁ డగు. పిదపఁ బృథూదకం బనుప్రఖ్యాతి గలకార్తికేయతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించి దేవర్షిపితృతర్పణంబు లొనరించి కార్తికేయున కభిషేకంబు చేసెనేని యశ్వమేధఫలంబును స్వర్గలోకావాప్తియును సమకూరు. 315

క. జ్ఞానముచే నైనను న, జ్ఞానముచే నైన జనులు సలిపినయఘసం
తానము దానిఁ జేసిన, స్నానముచేతన నశించు [illegible]నాథా. 316

గీ. ధరణిలోపల నుండుక్షేత్రములలోన, నుత్తమంబు కురుక్షేత్ర ముత్తమంబు
దానికంటె సరస్వతి దానికంటె, నుత్తమంబులు తీర్థము లుర్వరేంద్ర. 317

క. అత్తీర్థంబులకంటెను, నుత్తమము పృథూదకము నృపోత్తమ దానన్
బత్తిమెయిఁ దనువు దొరఁగిన, యుత్తములకు గర్భవాస మొదవదు మరలన్.

వ. పృథూదకతీర్థమాహాత్మ్యంబు వ్యాసమహర్షిచేతను సనత్కుమారునిచేతను మిగుల వర్ణింపంబడియె. పృథూదకతీర్థంబుఫంటెపరమపవిత్రతీర్థంబు మఱియొండు గానరాదు. అచ్చటన మధుపూరం బనుమఱియొకతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించెనేని గోసహస్రదానఫలంబు సమకూరు. పిదప సరస్వత్యరుణాసంగమతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించి త్రిరాత్రం బుపవసించెనేని బ్రహ్మహత్యాపాతకవిముక్తుం డగు. మఱియు నగ్నిష్టోమాతిరాత్రఫలంబు గలిగి యేడుతరంబులవంశస్థుల నుద్ధరించినవాఁ డగు. అచ్చటనే యవకీర్ణం బనుమఱియొకతీర్థంబు గలదు. అది బ్రాహ్మణోద్ధరణార్థంబు దర్భియనుమహర్షిచే నిర్మింపంబడియె. అందు వ్రతోపనయనంబులచేఁ గాని యుపవాసంబుచేఁ గాని బ్రాహ్మణుండు క్రియామంత్రసమేతుం డగు. క్రియామంత్రవిహీనుం డైనను విప్రుం డందు స్నానంబు గావించెనేని చీర్ణవ్రతుం డగు. మఱియును నందు దర్భిమహర్షిచే నాలుగుసముద్రములును నిర్మితంబు లయ్యె. అందు స్నానంబు గావించెనేని చతుస్సహస్రగోదానఫలంబు వడసి దుర్గతిం బొరయ కుండు. పిదప శతసహస్రకతీర్థంబును సాహస్రకతీర్థంబునుం గలవు. ఆరెండుతీర్థంబులందుఁ గావించినస్నానదానోపవాసంబులు సహస్రగుణఫలోపేతంబు లగు. పిదప రేణుకాతీర్థంబు గలదు. అచ్చట స్నానంబు సలిపి పితృదేవతార్చనంబు గావించెనేని సర్వపాపవిశుద్ధిం బడసి యగ్నిష్టోమఫలముం జెందు. పిదప విమోచనతీర్థంబు గలదు. దానిని స్పృశియించెనేని ప్రతిగ్రహకృతంబు లగుపాతకంబులు దొలంగు. పిదపఁ బంచవటంబు గలదు. అందు యోగేశ్వరుం డగువృషభధ్వజుండు నిత్యనివాసంబు గావించి యుండె. అమ్మహాదేవుని నర్చించెనేని క్షిప్రసిద్ధియును స్వర్లోకావాసఫలంబును జేకూరు. పిదపఁ దైజసతీర్థంబు గలదు. అయ్యది సతతంబును స్వతేజంబుచే దీప్యమానమై యుండు. అచ్చట మున్ను బ్రహ్మాదిదేవతలును మహర్షులును దేవసేనాధిపతి గాఁ గార్తికేయున కభిషేంబు గావించిరి. అది మిగులఁ బుణ్యస్థలంబు. దానికిఁ బూర్వభాగమందుఁ గురుతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించెనేని సర్వపాపవిముక్తిం బడసి రుద్రలోకముం జెందు. పిదప స్వర్గద్వారంబు గలదు. అయ్యది గమనమాత్రమున నగ్నిష్టోమఫలంబును బ్రహ్మలోకనివాసభాగ్యంబును జేకూర్చు. పిదప నస్థిపురంబునందుఁ బావనతీర్థంబు గలదు. అందుఁ బితృ

దేవతాతర్పణంబు గావించెనేని యగ్నిష్టోమఫలంబు చేకూరు. అచ్ఛోటన గంగా
హ్రదం బనుకూపంబు గలదు. అందు మూఁడుకోట్లతీర్థంబులు గలవు. అచ్చట
స్నానంబు చేసెనేని బ్రహ్మలోకనివాసంబు సిద్ధించు. పిదప స్థాణువటతీర్థంబు
గలదు. అచ్చట స్నాతుండై యొక్కరాత్రి నివసించెనేని రుద్రలోకంబు
చేకూరు. పిదప బదరీవనంబు గలదు. అందు వసిష్ఠాశ్రమంబు గలదు. అచ్చటఁ
ద్రిరాత్రం బుపవసించి బదరీఫలభక్షణంబు గావించెనేని సదాశివతుల్యుం
డగు. పిదప నింద్రమార్గతీర్థంబు గలదు. అచ్చట నహోరాత్రోపవాసంబున
స్వర్లోకావాసంబు గలుగు. పిదపఁ ద్రైలోక్యవిశ్రుతతీర్థంబు గలదు. అం దాది
త్యాశ్రమంబు గలదు. అందు స్నానంబు గావించి సహస్రాంశు నారాధించె
నేని సూర్యలోకప్రాప్తియును వంశోద్ధారకత్వంబును గలుగు. పిదప సోమతీర్థంబు
గలదు. అందు స్నానంబు గావించెనేని సోమలోకప్రాప్తి కలుగు. పిదప దధీచ
తీర్థంబు గలదు. అందుఁ దపోనిధి యగుసారస్వతుం డుదయించె. అచ్చట
స్నానంబు గావించెనేని వాజపేయఫలంబును సారస్వతగతియును జేకూడు.
పిదపఁ గన్యాతీర్థంబు గలదు. అచ్చట బ్రహ్మచర్యవ్రతంబునఁ ద్రిరాత్రోపవా
సంబు గావించెనేని దివ్యకన్యాశతప్రాప్తియును బ్రహ్మలోకావాప్తియునుం
గలుగు. పిదప సన్నిహితాతీర్థంబు గలదు. 319

గీ. అవనియం దుండుతీర్థము లాకసమునఁ, గానఁబడుతీర్థములు నుదపానములును
మునులు సురలును బుణ్యాయతనము లెల్ల, సన్నిహితమగుచుండునాసన్నిహితను.

వ. అందు గ్రహణకాలంబునను నమావాస్యనాఁడును బిత్రుద్దేశంబుగా శ్రాద్ధంబు
గావించెనేని యశ్వమేధసహస్రఫలంబు ప్రాప్తించు. 321

గీ. మానవులలోన నెటువంటిహీనుఁ డైన, సన్నిహితలోన స్నానంబు సలిపెనేని
పాతకము లన్నియును డుల్లి పద్మవర్ణ, యానమున బ్రహ్మలోకంబు నధిగమించు.

వ. పిదప ద్వారపాలకుం డగుమచక్రుకునకు నభివాదనంబు గావించి యచ్చటన
గంగాహ్రదతీర్థంబున స్నానంబు గావించెనేని రాజసూయాశ్వమేధఫలంబులు
సమకూరు. 323

గీ. ధరణిలో నైమిషంబు పూతంబు నాక, మునను బరమపవిత్రంబు పుష్కరంబు
క్ష్మాతలాధిప మూఁడులోకములయందుఁ, బూతతమము గురుక్షేత్రభూతలంబు.

గీ. ఏమి చెప్పుదుఁ గాలిచే నెగురఁగొట్టఁ, బడినయట్టికురుక్షేత్రపాంసు వొకఁడు
దనువునకు సోఁక నెట్టిపాతకము లేని, తత్క్షణంబ నశించి సద్గతి లభించు. 325

క. ఇలను గురుక్షేత్రంబున, నొలయుసరస్వతికి దక్షిణోత్తరభాగం
బులయందు వసించినధన్యులు, త్రిదశాలయమునందు నుండెడివారల్. 326

క. ధన్యంబు గురుక్షేత్రం, బన్యక్షేత్రంబు లేవి యైనను దత్సా
మాన్యంబు వడయఁ జాలవు, జన్యులను నశోచ్యులుగను జలుపుటయందుఁ.

వ. తరండకారండకంబులకును రామహ్రదంబులకును మచక్రుకునకును మధ్యంబున నుండుకురుక్షేత్రస్యమంతపంచకంబు పితామహున కుత్తరవేది యని పెద్దలు చెప్పుదురు. పిదప ధర్మతీర్థంబు గలదు. అచ్చట మున్ను యమధర్మరాజు గొప్ప తపంబు గావించి స్వనామాంకితంబుగా నాపుణ్యతీర్థంబు నేర్పఱిచె. అందు స్నానంబు చేసెనేని యేడుతరంబులవంశస్థుల నుద్ధరించినవాఁ డగు. పిదపఁ గలాప వనతీర్థంబు గలదు. అందు స్నానంబు సలిపెనేని యగ్నిష్టోమఫలంబును విష్ణు లోకప్రాప్తియునుం గలుగు. పిదప సౌగంధికవనంబు గలదు. అందు బ్రహ్మాది దేవతలును ఋషులును గిన్నరోరగసిద్ధచారణగంధర్వాదులును దపంబు గావించిరి. అయ్యది ప్రవేశమాత్రంబున సర్వపాపవిమోచనంబు గావించు. ఆవనంబు నందు సరస్వతి ప్రవహించుచుండు. వల్మీకనిస్రుతం బగుతజ్జలంబున స్నానంబు గావించి పితరుల నర్చించెనేని యశ్వమేధఫలంబు ప్రాప్తించు. పిదప నీశానాధ్యుషితతీర్థంబు గలదు. అది వల్మీకంబునుండి వచ్చుచుండు. అందు స్నాతుండయ్యెనేని కపిలాసహస్రదానఫలంబును వాజిమేధఫలంబునుం జేకూరు. పిదప సుగంధాశతకుంభాపంచయజ్ఞతీర్థంబుల నధిగమించెనేని స్వర్లోకావాససుఖంబు సమకూరు. అచ్చటన త్రిశూలపాతం బనుతీర్థంబు గలదు. అందు శూలి కభిషేకంబు గావించి పితరుల నర్చించెనేని గాణపత్యంబు లభించు. పిదప రాజగృహ తీర్థంబు గలదు. అయ్యది దేవీస్థానంబు. అమ్మహాదేవి దివ్యవర్షసహస్రంబు శాకాహారవ్రతంబు నవలంబించి తనసన్నిధికి వచ్చుచుండెడితపోధనులకు శాకంబున నాతిథ్య మిచ్చుచుండుటంజేసి శాకంభరి యనునామంబు వడసె. తత్తీర్థంబున బ్రహ్మచర్యంబు నవలంబించి త్రిరాత్రంబు శాకాహారంబుచేఁ గడపిన ద్వాదశవర్షంబులు శాకాహారంబు గావించినఫలంబు దేవీప్రసాదంబునం గలుగు. పిదప సువర్ణతీర్థంబు గలదు. 328

క. హరి యచ్చోటను బహువత్సరములు ధూర్జటిని గూర్చి తప మొనరింపఁ
బరితుష్టుండై గిరీశుఁడు, వరము లనేకము లొసంగె వైకుంఠునకున్. 329

వ. అందు స్నానంబు గావించి వృషధ్వజునిం బూజించెనేని యశ్వమేధఫలంబును గాణపత్యంబును లభియించు. పిదప ధూమవంతీతీర్థంబు గలదు. అచ్చట మూఁడు రాత్రు లుపవసించెనేని కోరినకోర్కు లన్నియును సిద్ధించు. పిదప దేవీతీర్థంబునకు దక్షిణభాగంబున రథావర్తతీర్థంబు గలదు. అచ్చట మహాదేవుని నర్చించెనేని తత్ప్రసాదంబున సద్గతి లభించు. పిమ్మట ధారాతీర్థంబు గలదు. అందు స్నానము చేసెనేని యెట్టిశోకమును గలుగ నేరదు. పిదప మహాగిరినమస్కా

రంబు గావించి స్వర్గద్వారతుల్యం బగుగంగాద్వారంబునఁ గోటితీర్థంబునందు స్నానంబు గావించెనేని పౌండరీకఫలంబును వంశోద్ధారకత్వముం గలుగు. అందొక్కరాత్రి యుండెనేని గోసహస్రదానఫలంబు గలుగు. మఱియును నందు సప్తగంగతీర్థంబునందును త్రిగంగతీర్థంబునందును శక్రావర్తతీర్థంబునందును దేవపితృతర్పణంబు గావించెనేని పుణ్యలోకావాప్తి కలుగు. పిదపఁ గనఖల తీర్థంబు గలదు. అందు స్నానంబు గావించి త్రిరాత్రంబు లుపవసించెనేని యశ్వమేధఫలంబును స్వర్గలోకావాసభాగ్యంబునుం గలుగు. పిదపఁ గపిలావటతీర్థంబు గలదు. అం దొక్కరాత్రి నివసించెనేని గోసహస్రదానఫలంబు చేకూరు. పిదపఁ గపిలుం డనునాగేంద్రునితీర్థంబు గలదు. ఆనాగతీర్థంబునందు స్నానంబు గావించెనేని కపిలాసహస్రదానఫలంబు చేకూరు. పిదప లలితక యని ప్రఖ్యాతిం బడసినశంతనుతీర్థంబు గలదు. అందు స్నానంబు సలిపెనేని దుర్గతి కలుగనేరదు. పిదపఁ గాళిందీతీర్థంబు గలదు. 330

—: యమునా మాహాత్మ్యము :—

గీ. పుష్కరమును బ్రహ్మావర్తమును సువర్ణ
మును గురుక్షేత్ర మవిముక్తమును బృథూద
కమును నను తీర్థములయందుఁ గలుగనట్టి
ఫలము గలుగును యమునలోపల మునుంగ. 331

సీ. ఆయురభ్యుదయంబు నభిలషించెడివారు, నారోగ్యభాగ్యంబు గోరువారు
యౌవనసంపద నర్థించువారును, మంచిరూపమును గాంక్షించువారు
దారిద్ర్యపాథోధి దాఁట నెంచెడివారు, పాపంబునకు భయపడెడివారు
వంశాభివృద్ధిని వాంఛించువారును, జింతితసిద్ధి నాసించువారు
గీ. నిహసుఖంబులు చెంద నూహించువారు, పరమున సుఖంబులకు నాసపడెడివారు
పరిహరింపఁగఁ గూడ దెప్పటికి నైన, దివ్యతమ మైనయామునతీర్థ మధిప. 332

క. కామముతోడను నైనను, గామము లేకుండ నైనఁ గావించినచో
యామునతీర్థస్నాన మి,హాముత్రవిపాదములను నందఁడు భూపా. 333

గీ. శ్రద్ధ లేకుండఁ గర్మముల్ సలిపెనేని, యర్ధఫల మిచ్చు నవి యెట్టి వైనఁ గాని
శ్రద్ధ లేకున్న యమునలోఁ జలిపినట్టి, స్నాన మిడుఁ బూర్ణఫలము విశ్వంభరేంద్ర.

గీ. యమునలో స్నాన మొనరించుప్రాణులకును
బాపము నశించుఁ బుణ్యంబు వడయు వృద్ధి
పక్షయుగమునఁ గువలయబాంధవునకు
క్షయము వృద్ధియు సంప్రాప్త మయినయట్లు. 335

గీ. వివిధరత్నంబులును సరిద్విభునివలన, సుఖముగాఁ బ్రాప్త మగునట్టు లఖిలసంప
దలును గాళిందిస్నానంబునలనఁగలుగుఁ,గలుగు నదిపూర్వపుణ్యంబువలననధిప.
క. కామగవి కామములు చిం,తామణి చింతితము లిటువిధంబున నొసఁగుఁగా
యామునతీర్థస్నానము, భూమీశ్వర వాంఛితార్థముల నన్నింటిన్. 337
గీ. కృతయుగంబునఁ దపమును త్రేతయందు
జ్ఞానమును ద్వాపరమున యజ్ఞంబుఁ గలియు
గమున దానము శ్లాఘనీయములు కాని
సర్వయుగములయందును శ్లాఘ్య యమున. 338
ఆ. కర్మభూమి యయి ప్రకాశించుభారత,వర్షమందు నుండువాఁ డెవండ
యేని యమునలోన స్నానంబు గావింపఁ,డేని నిష్ఫలంబు వానిజనువు. 339
ఆ. అంబరమునఁ జంద్రబింబ మమావాస్య;యందుఁ గాంతిహీన మైనయట్లు
యమునలోన స్నాన మాచరింపక చేయు,కర్మ మెల్ల నిష్ప్రకాశ మధిప. 340
క. యమునాస్నానమువోలెం,బ్రమదముఁ గలిగింప లేవు మాధవునకు దా
నములును వ్రతంబులును యా,గములును దపములును బుణ్యకర్మము లెల్లన్.
గీ. సకలవర్ణాశ్రమములవారికిని ధర్మ, మును సతంబు ధారావర్షముగను గురియు
నధిప యమునాస్రవంతిలో నాచరించు,మజ్జనంబున కెంతటిమహిమ గలదొ.
గీ. మనుజవల్లభ రవితేజమునకు సాటి, యైన తేజంబు వేఱొండు లేనియట్లు
యామునస్నానమునకు నీడైనయట్టి, క్రతువు లేవియుఁ గూడను గానరావు.
గీ. యమునలోపలఁగావించినట్టిస్నాన, మొనరుచును మూఁడుకార్యంబులనున రేంద్ర
యఖిలపాపక్షయంబును నచ్యుతునకు, సమ్మదంబును స్వర్లోకసంస్థితియును.
సీ. స్నాయుబద్ధంబును జర్మావృతంబును, మలమూత్రరక్తాస్థిమాంసయుతము
దుర్గంధపూర్ణంబు దోషాలయంబును, రోగమందిరమును రాగగృహము
నశ్వరంబును గృతఘ్నంబు క్రూరము జరా, శోకమృత్యువిపత్సమాకులంబు
నశుచియుఁ దాపత్రయావిష్టమును దురా, శాహతంబును బాపసంచితంబు
గీ. రౌరవద్వారమును నధర్మప్రియంబు, పరజనద్రోహసంతాపకరము దుర్భ
రమునుబిశునంబునగుశరీరమునకొక్క,యామునజలంబయఖిలదోషాపహంబు.
గీ. ఎంత బల ముండినను భోగ మెంత యున్న, నెంత రక్షణ మున్నను నేమి ఫలము
క్షణికమగు దేహమునకు శాశ్వతసుఖంబు,నొసఁగుయమునాజలస్పర్శ మొదవ దేని
గీ. తోయములలోన నుండుబుద్బుదములట్టు, లండజములందు నుండుప్రత్యండములవి
ధంబునను యామునస్నానంబు లేని,మానవులు పుట్టుచుందురు మరణమునకె.
సీ. విష్ణుభక్తుఁడు గానివిప్రుఁడు హతుఁడు పిం,డము వెట్టనట్టిశ్రాద్ధము హతంబు
శరణంబు వేఁడెడిక్షత్రియుండు హతుండు, హత మనాచార మున్నట్టికులము

హతము క్రోధసమేత మైనతపంబు దం, భమునఁ గావించుధర్మము హతంబు
హతము ప్రమాదసంయుత మైనశ్రుతము దా, ర్ఢ్యంబు లేకుండుజ్ఞానంబు హతము
గీ. హత మనభ్యాసదూషిత మైనవిద్య, హతముమాయాప్రకల్పిత మైనభక్తి
యమునఁ జూడనివానిజన్మముహతంబు, శ్రవణపట్కాగ మైనమంత్రము హతంబు.
సీ. పతిభక్తి లేనట్టిభామిని హత యహం, కార ముండెడిబ్రహ్మచారి హతుఁడు
హత యుపజీవ్య యైనట్టికన్య విరోధ, దాయకం బైనబోధంబు హతము
హతము శూద్రుఁడు చేయునట్టియోగము హతం, బాత్మార్థ మొనరించునట్టిపాక
మశ్రోత్రియున కిచ్చునట్టియీవి హతంబు, హతము సత్యము లేనియట్టివాణి
ఆ. శ్రద్ధ లేక చేయుసత్కర్మము హతంబు,హతము వ్యగ్రచిత్త మైనజపము
హతము జీవనార్థ మగువ్రతంబు హతము, యమునగాలి సోఁకనట్టిమేను. 349.
గీ. హత మకించను లగువారి కైహికంబు, హతము కృపణుల కుండెడునట్టిధనము
జీవననిమిత్త మగుతీర్థసేవ హతము, హతము గాళిందిలోఁ గ్రుంకనట్టితనువు.
గీ. యమునలోపలఁ జేయుస్నానమునఁ జేసి, భస్మమై పోవు వహ్నిలోఁ బడినతూల
రాశివలె నుపపాతకరాశితోడఁ,గలిసికొనుచు మహాపాతకములు భూప. 351
గీ. యమున కేఁగెడునపుడె కంపమును జెందు,చుండును సమస్తపాపము లుర్వరేంద్ర
దానిలోపలఁ గ్రుంకినతత్క్షణంబ,మాయమై పోవుఁ దత్తీర్థమహిమ యేమొ. 352
గీ. యమునలో స్నాన మొనరించి నంతమాత్ర,విడువఁబడి సర్వపాతకవితతివలన
దీప్యమానుండు గా నుండు దేహి మేఘ,పటలముక్తుం డయినశీతభానుఁ డట్లు.
క. దహనుఁడు సమిత్సమూహము,దహియించువితాన నఘవితానము నెల్లన్
దహియించును యమునాజల,మహిమము చెప్పంగఁ దరమె మాబోఁటులకున్.
క. ఏవాఁ డేనియు యమునా,పావనతోయమున మునిఁగి పైకిన్ మరలన్
దా వచ్చునపుడు జ్వలనుని, కైవడి నరుఁ డెంచు దీప్తకాయముతోడన్. 355
క. పాపిష్ఠు లైనవారలు, ప్రాపింతురు శుద్ధి పాపరహితులు దివమున్
బ్రాపింతు రొక్కపరి యము,నాపగలోపలను దీర్థమాడినయెడలన్. 356
క. కల దధికారము యమునా, సలిలస్నానంబునందు సకలజనులకున్
జలజాక్షునిభక్తియెడన్, బలె సర్వజనాఘనాశనక్షమ మగుటన్. 357
క. జ్ఞానముచే నైనను న,జ్ఞానముచే నైన భ్రమవశంబున నైనన్
మానుగఁ జేసినయఘసం, తానముఁ గాళిందిమజ్జనము దొలఁగించున్. 358
క. యమునాస్నానమె మంత్రము, యమునాస్నానంబె తపము యమునాస్నానం
బె మహాప్రాయశ్చిత్తము యమునాప్లవ మఖిలపాతకాపహ మగుటన్. 359
గీ. కలుగు నాధ్యాత్మికజ్ఞానకౌశలంబు, గలిగినట్టులు కాళిందిజలమునందు
స్నాన మొనరింపఁగను బుద్ధి మానవులకు, బహుళజన్మాంతరాభ్యాసపాటవమున.

క. భవకర్దమంబు గడుగఁగ, దవునదియును బరమపావనం బగునదియుఁ
భువనమ్ములోన యమునా, స్రవంతిజల మొకఁడె పాండురాజతనూజా. 361

చ. యమునజలంబు ద్రావెడి మహాత్ముల కేల యొసంగఁ బంచగ
వ్యములను భూరితీర్థముల నాడఁగ నేల సమస్తపుణ్యకా
ర్యములఫలంబు నీయఁ గలయట్టియమస్వసృతోయపానమే
సమకొనఁజేయుచుండఁగను సర్వశుభంబులు ప్రాణికోటికిఁ. 362

క. యమునకు మధురాసంగమ, మమరినచోటను నొనర్చునాప్లావముచే
సమకూరు నాత్మవిజ్ఞా, నముచే నొనగూడుముక్తి నరులకు భూపా. 363

గీ. మానవుఁడు భక్తిభావంబులోన నొలయ, యామునజలంబునను దీర్థమాడె నేని
కల్పకోటిసహస్రముల్ గైటభారి, సన్నిధానంబున నె నివాసంబు చేయు. 364

క. ఉందురు కల్పశతంబులు, బృందారకలోకమందుఁ బితరులు పూర్ణా
నందమున యమునలోపల, నందను లొనరించుమజ్జనంబున నధిపా. 365

వ. అనంతరంబు సుగంధతీర్థంబు గలదు. అచ్చట స్నానంబు గావించెనేని సర్వ
పాపవిముక్తుండై బ్రహ్మలోకంబు నాసాదించు. పిదప రుద్రావర్తతీర్థంబు గలదు.
అందు స్నాతుం డయ్యెనేని స్వర్లోకవాసి యగు. పిమ్మట గంగాసరస్వతీసంగమ
తీర్థంబు గలదు. అందు స్నానంబు సలిపెనేని యశ్వమేధఫలంబును నమరలోక
వాసంబుం జేకూరు. అచ్చటన కర్ణహ్రదంబున స్నానంబు గావించి శంకరుని
నారాధించెనేని దుర్గతివిజయంబును సద్గతిప్రాప్తియును సమకూరు. పిదపఁ
గుబ్జామ్రకతీర్థంబు గలదు. అందుఁ గావించినయాప్లావంబు గోసహస్రదాన
ఫలంబు నొసంగి యమరపురనివాసభాగ్యంబు చేకూర్చు. పిమ్మట నరుంధతీ
వటతీర్థంబు గలదు. అందు మూఁడురాత్రు లుపవసించి సాముద్రకజలంబు నుప
స్పృశించెనేని గోసహస్రదానఫలంబుతోడన త్రిదివంబు ప్రాప్తించు. పిదప
బ్రహ్మావర్తతీర్థంబు గలదు. అందు బ్రహ్మచర్యంబున సమాహితమనస్కుండై
స్నానంబు సలిపెనేని యశ్వమేధఫలంబు వడసి నాకంబు నధిష్ఠించు. పిదప
యమునాప్రభవతీర్థంబు గలదు. అందు యమునాజలంబు నుపస్పృశించెనేని
యశ్వమేధఫలంబు వడసి బ్రహ్మలోకనివాసి యగు. పిదప దర్వీసంక్రమణతీర్థంబు
గలదు. అయ్యది గమనమాత్రంబున వాజిమేధఫలంబు నొసంగి త్రిదివనివాస
భాగ్యంబు ప్రసాదించు. పిదప సింధుప్రభవతీర్థంబు గలదు. అందుఁ బంచ
రాత్రం బుండెనేని బహుసువర్ణప్రాప్తి గలుగు. పిదప దేవతీర్థంబు గలదు.
అయ్యదిప్రాప్తిమాత్రంబున నశ్వమేధఫలంబును నౌశనసగతియుం బ్రసాదించు.
పిదప ఋషికుల్యాతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించి వసిష్ఠదర్శనంబు
చేయుచు శాకాహారంబుతోడ నొకమాసంబు గడపెనేని ఋషిలోకవాస

భాగ్యంబు చేకూరు. పిదప భృగుతుంగతీర్థంబు గలదు. అచ్చటి కేఁగినంతన యశ్వమేధఫలంబు ప్రాప్తించు. పిమ్మట వీరప్రమోక్షతీర్థంబును డాసినంత సర్వపాపవిమోచనం బగు.పిదప విద్యాతీర్థంబు గలదు. తత్తీర్థంబు నుపస్పృశించె నేని సర్వవిద్యాలాభంబు సమకూరు. పిదప మహాశ్రమతీర్థంబు గలదు. అందు నిరాహారంబుగా నొక్కరాత్రి నివసించెనేని పుణ్యలోకంబుల నధివసించు. పిమ్మట మహాలయతీర్థంబు గలదు. తత్తీర్థంబునందు షష్ఠకాలోపవాసంబుచే నొక్కమాసంబు నివసించెనేని దశపూర్వదశాపరవంశస్థుల నుద్ధరించి తాను దరియించు. పిదప మహేశ్వరతీర్థంబు గలదు. తత్తీర్థంబును దర్శించెనేని సర్వ కార్యసిద్ధియును బహుసువర్ణప్రాప్తియుం గలుగు. పిదప వేతసికాతీర్థంబు గలదు. అయ్యది పితామహునిచే నిషేవింపంబడియె. తత్తీర్థంబు గమనమాత్రంబున నశ్వమేధఫలంబు చేకూర్చి సద్గతికిం జేర్చు. పిదప సుందరికాతీర్థంబు గలదు. అది సిద్ధనిషేవితంబు. అందు స్నానంబు గావించెనేని సురూపప్రాప్తి గలుగు. పిదప బ్రాహ్మణికాతీర్థంబు గలదు. తత్తీర్థంబునకుం బోవువాఁడు పద్మవర్ణయానం బున బ్రహ్మలోకంబునకుం జనువాఁడు. పిదప నైమిషంబు గలదు. అయ్యది ద్విజనిషేవితం బగుపవిత్రక్షేత్రంబు. అందు బ్రహ్మ దేవగణంబుతోడం గూడి నిత్యనివాసంబు గావించుచుండు. నైమిషంబును బ్రార్థించినమాత్రంబున సంచి తాఘరాశియం దర్ధంబుతఱఁగిపోవు. నైమిషంబునం బ్రవేశించెనేని సర్వపాపరాశి యును నిశ్శేషంబుగా నశియించు. పృథివిలో నున్నతీర్థంబు లెల్లను నైమిషం బున నుండు. అచ్చట నొక్కమాసంబు నివసించెనేని సప్తకులంబుల నుద్ధరిం చినవాఁ డగు. నైమిషంబున నియతాశనుండై స్నానంబు గావించెనేని రాజ సూయమహాక్రతుఫలంబు వడయు. నైమిషంబున నుపవసించి ప్రాణంబులు విడిచెనేని దేవలోకంబునందు దేదీప్యమానుండై యుండు. పిదప గంగోద్భేద తీర్థంబునందుఁ ద్రిరాత్రోపవాసంబు గావించెనేని వాజపేయఫలంబు వడసి యెల్లకాలంబును బ్రహ్మభూతుండై యుండు. పిమ్మట సరస్వతీతీర్థంబునందుఁ బితృదేవతాతర్పణంబు గావించెనేని సారస్వతలోకంబులందు వసియించు. పిదప బాహుదాతీర్థంబు గలదు. అం దొక్కరాత్రి నివసించెనేని దేవసత్రి యాగఫలంబు వడసి స్వర్లోకంబున నిత్యసంతోషంబు గలిగి యుండు. పిదప రజనీతీర్థంబు గలదు. అందుఁ బితృదేవతార్చనంబు గావించెనేని వాజపేయ ఫలంబు ప్రాప్తించు. పిదప విమలాశోకతీర్థంబు గలదు. అయ్యది యమృత కరుండువోలె నాహ్లాదంబు గలిగించుచుండు. అం దొక్కరాత్రి నివసించెనేని స్వర్గనివాసంబు చేకూరు. పిదప గోప్రతారం బనుసరయూతీర్థంబు గలదు. అచ్చట మున్ను రాముండు సభృత్యబలవాహనంబుగా స్వర్గంబున కరిగె.

త్తీర్థంబునందు స్నానంబు గావించెనేని సర్వపాపవినిర్ముక్తిం బడసి స్వర్లోకవాసభాగ్యంబు నొందు. పిమ్మట రామతీర్థంబున గోమతియందు స్నానంబు సలిపెనేని యశ్వమేధఫలంబు వడసి స్వకులంబు పావనంబు గావించు. అచ్చటన శతసాహస్రక మనుమణియొకతీర్థంబు గలదు. శుచియై దాని నుపస్పృశించెనేని గోసహస్రదానపుణ్యంబు వడయు. పిదప నూర్ధ్వస్థానం బనుపుణ్యక్షేత్రంబు గలదు. అందుఁ గోటితీర్థంబున స్నానంబు గావించి కుమారస్వామి నర్చించెనేని గోసహస్రదానఫలముం బడసి మిగులఁ దేజస్వి యగు. అనంతరంబు వారాణసీక్షేత్రంబు గలదు. 366

—: వారాణసీమాహాత్మ్యము :—

క. వినుము మును మేరుశిఖరం, బున ముదమున నున్ననునుయమున భర్తను గ
న్గొని యిట్టు లడిగె గిరిసం, దన లోకుల నుద్ధరించుతలఁపు గలిగినన్. 367

గీ. కర్మయోగంబు ధ్యానయోగంబు సాంఖ్య
యోగమును మున్నుగాఁ గలయోగములను
జేయుటకు శక్తి చాలనిచేతనులకు
దేవ నినుఁ గాంచువెర వెన్నఁ దెలియఁ జెపుము. 368

క. అనవుడు లోకానుగ్రహ, మున నడిగినయామెప్రశ్నమున కెదలోనన్
జనియింపఁగ సంతోషము, గని తద్వదనాంబుజంబుఁ గరుణాదృష్టిన్. 369

క. చానా నానిజరూపము, గానం గలత్రోవ జ్ఞానఘనులకు సులభం
బైనను నంతటికంటెను, గానఁ దగునుపాయ మొకటి కల దజ్ఞులకున్. 370

వ. అది యే దంటి వేని. 371

గీ. తీర్థములలోన నుత్తమతీర్థ మగుచు, క్షేత్రములలోన నుత్తమక్షేత్ర మగుచు
జ్ఞానములలోన నుత్తమజ్ఞాన మగుచు, నవనిలో నుండు నవిముక్త మంబుజాక్షి.

క. అది నాకుఁ బ్రియతమం బగు, సదనం బచ్చోట సర్వసమయములం దుం
డుదు నేను నన్నుఁ గనుచుం, డెద రెల్లరుఁ గూడ నందు నివసించినచోన్. 373

క. నాక్షేత్రము నేవేళను, వీక్షింప రముక్తు లెల్లవేళల ముక్తుల్
వీక్షించుచుందు రెవ్వరు,వీక్షింతురొ వారె నాకు వీక్షణపాత్రుల్. 374

ఆ. అది మహాశ్మశాన మం దుండుఁ బుణ్యతీ, ర్థంబు లెల్ల నాయతనము లెల్ల
సర్వభూతములను సంసారపాథోధి, తటముఁ జేర్పఁ దగినతరణి యదియ. 375

ఆ. అదియె వారణాసి యని కాశి యనియును, నామములను దాల్చె నళినగంధి
పరమగుహ్యమైనపదము నా కది యని, తెలిసికొనుటె యెల్లఁ దెలిసికొనుట.

క. అవిముక్తరబునఁ జేసిన, హవనము దానంబు ధ్యాన మధ్యయనంబున్
దపమును జపమును దపమును, నవినాశనములుగ నుండు నాకల్పంబున్. 377

గీ. కలికి జన్మాంతరసహస్రములను బేరఁగి, నట్టియఘరాసు లవిముక్తమందుఁ గాలు
పెట్టి పెట్టకమునుపె కన్పట్టకుండ, మాయ మై పోవుఁ దన్మహిమంబువలన. 378

సీ. బ్రాహ్మణు లైనను రాజన్యు లైనను, వైశ్యు లైనఁ జతుర్థవర్ణు లైనఁ
జాన లైనను మ్లేచ్ఛు లైనను సంకీర్ణు, లైనను ఘాతకయోను లైన
మృగము లైనను గడ్డి మేయుజంతువు లైన, ఖగము లైనను గీటకంబు లైనఁ
జీమ లైనను లేక దోమ లైనను మఱి, యితరంబు లగుజీవు లేవి యైన

ఆ. మరణ మొందెనేని మద్రాజధానిలో, వృషభవాహనముల నెక్కి చంద్ర
ఖండములను దాల్చి గరళకంఠములతోఁ, దిరుగుచుండు నచటి తెరువులందు. 379

క. మరణించెనేని కాశీ, పురమునయం దెట్టిపాపములు చేసినపా
మరుఁ డైనను గాంచం డొక, తరుణమునం దేని దండధరునిపురంబున్. 380

క. అతిదుర్లభ మగుమోక్షము, జతపడుటకు ఘోర మైనసంసారము సం
హత మగుటకు నవిముక్త,స్థితి యొక్కఁడె సులభ మైన తెరువు లతాంగీ. 381

క. అక్కఱలే దాచారము, లక్కఱలే దర్చనాదు లవిముక్తమునం
దొక్కనివాసమె చాలును, జక్కనిమార్గంబుఁ జూప సంసారులకున్. 382

క. కలికి యవిముక్తవాసము, వలనఁ గలుగునట్టిసుగతి వైదుష్యముచేఁ
గలుగదు జపతపములచేఁ, గలుగదు కలుగదు ప్రకృష్టకర్మంబులచేన్. 383

క. అవిముక్తమందు మరణము, చవిచూడనివాఁడు జన్మశతముల కైనన్
భవవార్ధి దాఁట నేరక, నివసించుచు నుండు గర్భనిరయములందున్. 384

క. దోషసహస్రంబులచే, దూషిత మగుమేని కఖిలదోషము లుడుపన్
భేషజ మవిముక్తమె యని, భాషించిరి పెద్దలెల్లఁ బంకజవదనా. 385

క. ఒనగూడెనేని యొకపరి, జనునకు నవిముక్తమందుఁ జావు మ ఱెన్నం
డును గలుగ నేర దెచ్చో, టను జన్మము లేకపోవుటను నాతనికిన్. 386

గీ. జన్మమృత్యుజరాశోకసంప్లవంబు, లేనిధామంబునకుఁ జేరు మానవుండు
కలిగెనేని యదృష్టంబువలన నెన్నఁ, డైన నవిముక్తనిధనభాగ్యము మృడాని.

క. అవిముక్తమె పరమపదం, బవిముక్తమె పరమతత్త్వ మవిముక్తంబే
శివరూపము శివరూపమె, యవిముక్తము దాఁపనేల యతివా నీకున్. 388

క. నాపురమున వసియించెడి,పాపాత్ములకేని పరమపద మొసఁగుదుఁ బ్రా
ణాపాయసమయమున నే, నాపద్బాంధవుఁడ నగుచు నంభోజాక్షీ. 389

క. వారాణసిలో నుండెడి, వారలె జాపకులు వారె వాయ్వాహారుల్
వారలె దాతలు హోతలు, వారలె సత్పురుషు లన్న వారలె తరుణీ. 390

వ. గయాప్రయాగ నైమిశారణ్య శ్రీశైల మహాబల కేదార భద్రకర్ణ పుష్కర కురు
క్షేత్ర భద్రకోటి నర్మదా మ్రాతకేశ్వరీ శాలగ్రామ కుబ్జామ్ర కోకాముఖ ప్రభాస

విజయేశానగోకర్ణ భద్రకర్ణంబు లనుత్రిలోకవిశ్రుతంబు లగుపుణ్యతీర్థంబు లందు నిధనంబు నొందువారలు వారాణసీక్షేత్రంబునఁ గాలధర్మంబు నొందిన జీవులు చెందినట్లు పరతత్త్వముం జెందఁ జాలరు. 391

క. సులభంబు లగును నితర, స్థలములలో గంగయును వ్రతంబులు శ్రాద్ధం
బులు దానజపతపంబులు, కలికి సులభములు గావు కాశీపురిలోన్. 392

క. సతి వినుమీ జన్మాంతర, శతములనుండియును బిగువు సడలనియఘసం
తతి నెల్ల నొక్కత్రుటిలో, హతమార్చును జహ్నుతనయ యవిముక్తమునన్.

వ. గంగను స్మరించుటచేఁ బాతకంబును గీర్తించుటచే నతిపాతకంబును దర్శించుటచే గురుపాతకంబును గంగాస్నానంబుచేతను గంగాజలపానంబుచేతను గంగాజలతర్పణంబుచేతను మహాపాతకంబును భస్మీభూతంబు లగు. గంగాతీరంబునం బెట్టినపిండంబును గంగాజలంబునం గలిపినపిండంబును నరకస్థులు గీటాదిజంతువులు స్థావరములు నైనపితరులను దక్షిణంబ స్వర్గంబున కెక్కించు.

గీ. స్వర్గసోపానమార్గంబు శార్ఙ్గిచరణ, నళినమధుధార సంసారజలధితరణి
ధర్మరసఝరి జాహ్నవి తల్లివోలెఁ, జలువు మలశుద్ధి నెట్టికళ్మలుల కేని. 395

క. నిలువఁబడి యొక్కపదమున, నలయిక లేకుండ యుగసహస్రము తపమున్
జలిపినవారును గంగా, సలిలస్నాతులకుఁ దగరు సామ్యము నొందన్. 396

క. ఒనరును గంగామజ్జన, మున సంతృప్తియును సర్వభూతసమత్వం
బును నిజధర్మపరత్వం, బును ననియెడిమూఁడుసుగుణములు మనుజులకున్.

గీ. సర్వవేదానుగతుఁ డగు స్నాతుఁ డయ్యె, నేని జాహ్నవిలోపల మానవుండు
సర్వవేదమయుం డౌటఁ జక్రపాణి, చక్రధరమయి యగుటను జహ్నుతనయ.

గీ. అన్యదేశంబున నొనర్చినట్టియఘము, దగ్ధమైపోవుఁ ద్రిపథగాతటమునందుఁ
ద్రిపథగాతీరముననొనర్చినయఘంబు,నాశమును జెందుఁ ద్రిపథగాస్నానమునను.

గీ. స్వర్గలోకంబునందు దేవతల మర్త్య, లోకమున మానవుల నధోలోకమందు
నురగముల నుద్ధరించుచు నుంటఁ ద్రిపథ, గాభిధానంబుఁ దాల్చె గంగాభవాని.

గీ. ఉద్ధరించును జాహ్నవి యొక్కసారి, స్నాన మొనరించునెడ నిజజలమునందు
సతిని విడిచినపతి నైనఁ బతిని విడిచి, నట్టిసతి నైనఁ బితృపరిత్యాగి నైన.

క. అవిముక్తమునందు సదా, శివుండ నగుననున్నఁ గొలుచుజీవులు సర్వా
ఘవిముక్తు లగుచుఁ గాంతురు, రవితేజమునన్ గణేశ్వరత్వము నబలా. 402

క. వనజాక్షి ధర్మ మొనరుచు, జను లొండొక్కట సహస్రజన్మంబులచేఁ
గనియెడిపరమార్థంబును, గనియెద రొకజన్మమున నె కాశీవాసుల్. 403

క. జ్ఞానము యోగము ముక్తియుఁ, గానఁ గలుగు నొక్కపుట్టుకనె యవిముక్త
స్థానమున దానికంటెను, గాననములు హెచ్చె తపము గావింపంగన్. 404

క. అవిముక్త మయ్యె నాచే, నవిముక్తం బగుటఁ గాశి యది యెల్లరకున్
జవిచూపు మోక్షసుఖమును, నివసించినఁ జాలు నొక్కనిమిషం బచటన్.
గీ. అధిక మగుతీర్థ మవిముక్త మవని నున్న, తీర్థములకంటె నచ్చటఁ దెలివి దప్పు
సమయమున నేనె చేయుదు జంతువులకుఁ, బ్రణవమంత్రోపదేశంబుఁ బద్మగంధి.
క. ఇనబింబమందు హృదయం, బున నాభీమధ్యమునను భ్రూమధ్యమునం
దును మూర్ధమునను నుండెడి, యనవద్యం బైన తేజె యవిముక్త మనన్. 407
క. వరణకు నసికిని నడుమన్, బరగెడిధామంబె వారణాసి యనంగన్
ధరలోన వెలయు నయ్యది, పరతత్త్వంబునకు ముఖ్యపదము భవానీ. 408
గీ. బ్రహ్మయును విష్ణువును దివస్పతియు సురలు, యక్షగంధర్వపన్నగరాక్షసులును
సతము నను గొల్చుచుందు రచ్చట నెకానఁ, గాశికెన యైన నెలవొండు గానరాదు.
క. అవిముక్తవాస మబ్బుట, కవకాశము గలుగనీయ వఘములు గానన్
త్రివిధము లగుకరణములను, నెవరును గావింపఁ గూడ దెపుడును నఘముల్.
క. ఇది దేవరహస్యం బి, య్యదియె పురాణములలోన నగపడుచుండున్
విదితము గా దందఱకును, విదితముగాఁ గానఁబడియు విశ్వమునందున్. 411
క. అని మధురమధురసూక్తుల, ననిమిషులును బరమఋషులు నందఱుఁ గూడన్
వినుచుండఁగఁ గాశీమహిమను శర్వుఁడు వినిచెఁ దుహినమహీధరసుతకున్.
గీ. వాసుదేవుఁడువోలె దేవతలలోనఁ, జంద్రమకుటుఁడువోలె నీశ్వరులలోన
ధామములలోన నవిముక్తధామ మొకఁడె, శ్రేష్ఠమైనది చూవె ధాత్రీకళత్ర.
క. పూర్వము శతజన్మంబుల, శర్వునియారాధనంబు సమకూరినచో
నుర్వీస్థలి నవిముక్తం, బుర్వీశ్వర దొరకు వాసముండుట కెపుడున్. 414
క. ఇలలో నున్నను నెపుడును, దెలియంగా లేరు వామదేవాలయమున్
గలికల్మషదగ్ధాత్ములు, తెలిసికొనెద రాత్మహితము దెలిసినవారల్. 415
క. అరుగుదు నవిముక్తమునకు, నరుగుదు శివరాజధాని కరుగుదుఁ గాశీ
పురమున కనుచును గాలము, జరిపినను నివాసఫలము సంప్రాప్తించున్. 416
క. హరరాజధానిమహిమను, పరమాద్భుత మనుచు వలదె పలుకఁగ మదిలో
స్మరియించినంతమాత్రన, హరియించుచు నుండు నది మహాపాపములన్. 417
క. అవిముక్తమునఁ గుటుంబము, నివేశములు గలిగి సతము నివసించెడివా
నవు లొనరించెడిపాతక, నివహములను శివుఁడు చేయు నిర్దగ్ధములన్. 418
క. లోకులు చెప్పినఁ బితరులు, వాక్రోసినను దేశమందు వల దనినను న
వ్యాకుల నాలింపక మో, క్షాకాంక్షులు వారణాసి కగు నేఁగంగన్. 419
ఆ. కాశి దప్ప వేఱె గతి లేదు పితృమాతృ, వర్జితులకు బంధువర్జితులకు
వ్యాధివికలులకు జరాభిభూతులకును, నాపదుపహతులకు నగతికులకు. 420

ఆ. కాశి దప్ప వేఱె గతి లేదు భవపాశ, బద్ధులకును గర్మబద్ధులకును
ఘోరపాతకులకు దారిద్ర్యహతులకు, ధ్యానదానమానహీనులకును. 421

ఆ. కాశి దప్ప వేఱె గతి లేదు యోగవి, భ్రష్టులకు విమోహనష్టులకును
బంధుజనులలోనఁ బడరానియిక్కట్లు, పడినవారలకును బతితులకును. 422

గీ. ఔర యానందకాననం బౌర కాశి, యౌర యవిముక్త మౌర మహాశ్మశాన
మౌర శివరాజధాని సంసారవహ్ని, తప్తులను గాచుపీయూషధార యౌర.

గీ. కాపిలంబుననేని సాంఖ్యముననేని, యోగముననేని చేకూర కుండునట్టి
సుగతి నొసగెడిక్షేత్రంబు జగతిలోన, నొక్క వారాణసియె తక్క నొండు లేదు.

ఆ. విశ్వనాథుఁ డనెడివిఖ్యాతిహోత్రుఁడు ప్రాణి, కర్మబీజములను గాల్చుచుండు
మరల మొలవకుండ మతిమంతు లుందు రా, కారణమునఁ జేసి కాశిలోన. 425

క. కాశియె యోగము భోగము, కాశియె యాగాదిపుణ్యకర్మము లెల్లన్
గాశియె స్వర్గము కాశియె, కాశియె మోక్షంబు ప్రాప్తి గలవారలకున్. 426

గీ. కామ మేడ మదం బేడఁ గాలుఁ డేడ, నేడఁ బాపంబు జర యేడ నేడ భీతి
యేడ జాడ్య మహంకార మేడ నేడ, వాసనాపీడ కాశీనివాసులకును. 427

—: ఓంకారలింగమాహాత్మ్యము :—

గీ. అచట నోంకార మనులింగ మతిరహస్య, మైనదియు ఋషిసేవిత మైనదియును
కలుషహారమైనదియునొండుగలదుదాని,స్మరణమునఁగల్గు మోక్షంబుమానవులకు.

గీ. ప్రణవనాదంబు సేయునాప్రణవలింగ,మందుఁ బంచాయతనవిగ్రహంబుతోడ
నుండి శితికంఠుఁ డానంద మొందుచుండు,నదియుఁబంచాయతనరూప మగుటఁజేసి.

గీ. పాశుపత మైనజ్ఞానంబె పలుకఁబడియె, మునులచేతను బంచాయతన మటంచు
నదియె యోంకారలింగ మయ్యదియె శివుఁడు,దానికిని శివునకును భేదంబు లేదు.

వ. పాశుపతజ్ఞానంబు శాంత్యతీత శాంతి యపరావరవిద్య ప్రతిష్ఠ నివృత్తి యని యైదువిధంబులుగా నుండుటంజేసి పంచాయతనం బని చెప్పంబడియె. పంచాయతనంబు లింగరూపముం జెంది యుండి యంతకాలంబున జీవుల కోంకారంబు నుపదేశించుచుండుటంజేసి యోంకారలింగం బనునామముం బడసె. 431

క. కనఁ జాలరు తత్స్నానం, బును మును లేనియును సతతమును ద్రిభువనపా
వన మగుభాగీరథితట,మున నది గోచర్మమాత్రముగ నుండు నృపా. 432

వ. కృత్తివాసేశ్వరలింగంబును మధ్యమేశ్వరలింగంబును విశ్వేశ్వరలింగంబును గపర్దీశ్వరలింగంబును నోంకారలింగంబును వారణాసియం దుండుగుహ్య లింగంబులు. 433

క. ఆయేనుగుహ్యలింగము, లేయోగియుఁ గూడఁ జాలఁ డీక్షింపంగన్
మాయాభిదుఁ డగునవిము, క్తాయతనాధిపునను గ్రహము లేకున్నన్, 434

—: కృత్తివాసేశ్వరలింగమాహాత్మ్యము :—

సీ. వచియించెదను గృత్తివాసేశ్వరమహత్త్వ, మొకయింత వినుము నీ వుర్వరేంద్ర
దంతిరూపము దాల్చి దైత్యుఁ డొక్కఁడు మున్ను, చని కృత్తివాసేశసవిధమునకు
నట జపించుచు నుండినట్టి బ్రాహ్మణులను, నొక్కపెట్టునఁ జంప నుద్యమింప
నాలింగముననుండి యాక్షణంబున నుగ్రుఁ, డావిర్భవించి ప్రత్యక్షముగను
గీ. శూలమునఁ జంపి యాగజాసురుని వాని, కృత్తి ధరియించి కృత్తివాసేశ్వరుండు
నాఁగ విలసిల్లె నాస్వామినామమున నె, వెలసె లింగము గూడఁ బృథ్వీకళత్ర. 435
గీ. అచటఁ దపము తపోధను లాచరించి, చనిరి తనువులతోడనె సద్గతులకు
గాన నాస్థాన మాదిత్యగణము లెల్ల, విడువక వసించుచుందు రేవేళ నేని. 436
క. కలుగునొ కలుగదొ మోక్షము, స్థలాంతరమునందు జన్మశతముల కైనన్
గలుగు నొకజన్మమునకే, వలనుగ సేవింపఁ గృత్తివాసేశ్వరునిన్. 437
గీ. యుగయుగంబున వేదపారగులు గూడి, కృత్తివాసేశ్వరమును గీర్తించుచుందు
రఖిలసిద్ధుల కాలయం బనుచు నెఱిఁగి, సముచితము లైన వేదమంత్రములచేత.
క. నందింపఁ జేయుచుందురు, కొందఱు ధ్యానములచేతఁ గొందఱు స్తుతులన్
గొందఱు క్రతువులఁ గొందఱు, వందనములచేతఁ గృత్తివాసేశ్వరునిన్. 439
క. కలియుగ మధర్మబహుళము, కలుషమయం బనెడు తెలివి గలిగినవారల్
నెలకొని యవిముక్తంబున, వలయును గొలువంగఁ గృత్తివాసేశ్వరునిన్. 440

—: కపర్దీశ్వరలింగమాహాత్మ్యము :—

వ. ఇంకఁ గపర్దీశ్వరమాహాత్మ్యంబు చెప్పెద నాలకింపుము. 441
సీ. ఆఁకటిపెల్లున నసురుఁ డొక్కఁడు మున్ను, ద్వీపియై యొకలేడివెంటఁ బడియె
హరిణి భయంబునఁ బరువువాఱుచుఁ బోయి, యలసి కపర్దీశ్వరాంతికమునఁ
జిక్కె వ్యాఘ్రమునకుఁ జీల్చి గోళ్లను దాని, ద్వీపి రక్తము ద్రావి వెడలిపోయె
నంత నాలేడి దేహమునుండి యొకమహో, జ్జ్వాల మండుచు నాకసమున కేఁగె
గీ. నేఁగి యది యుప్పరంబునం దిందుమౌళి, తోడ వృద్ధోక్షవాహంబుతోడ మూఁడు
కనులతోడను నల్లనిగళముతోడఁ, గానఁబడియె మహాశ్చర్యకరము గాఁగ. 442
ఆ. అపుడు పుష్పవర్ష మాకసమునుండి, కురిసె రమరు లమితకుతుక మొదవ
ననంతగణాక్షణంబునంద గణేశ్వరి, యగుచు జ్వాల మాయమయ్యె నధిప. 443
క. అది చూచి కపర్దీశ్వర, పదమాహాత్మ్యంబు నెఱిఁగి బ్రహ్మర్షులునున్
ద్రిదశర్షులు నాస్థానము, వదలక వసియించి రాత్మవాంఛలు దీరన్. 444
క. కావున నె కపర్దీశ్వర, సేవాభాగ్యంబు కార్యసిద్ధుల నెల్లన్
గావించి పరమపదమున్, గైవస మొనరించుఁ బాపకర్ముల కైనన్. 445

—: పిశాచమోచనతీర్థమాహాత్మ్యము :—

క. జననాథ యాప్రదేశం, బున నొకతీర్థము పిశాచమోచన మనుపే
రను నొప్పుచుండెఁ దన్మహి, మను జెప్పెద వినుము లేశమాత్రము నీకున్. 446

సీ. శంకుకర్ణుం డనుశూద్రాసురుం డొక్కఁడు, నైష్ఠికదీక్షాగరిష్ఠుఁ డగుచు
శివరూపమును నుపాసించుచు నధివసిం, చెను గపర్దీశ్వరక్షేత్రమందు
నటు లుండ నొక్కనాఁ డచటికి నొకప్రేత, మే తెంచి క్షుధచేత నేడ్వఁ దొడఁగె
నది చూచి కరుణాళు వగుచు నాద్విజుఁడు నీ, వెవఁడ వీ విటకు రా నేల చెపుమ

గీ. యని యడుగుటయుఁ బ్రేత మాతనికి మ్రొక్కి
స్వామి ప్రాగ్జన్మమున నేను శూద్రాసురుఁడను
నప్పు డిది పుణ్య మిది పాప మనుచు నైనఁ
దలఁపనైతిని ధనమదాంధ్యంబుచేత. 447

క. పూజింపనైతి గోవులఁ, బూజింపకపోతి సవనభుజులను ద్విజులన్
బూజింపనైతి నతిథులఁ, బూజింపకపోతి బుద్ధి బూడిదఁ గలిసెన్. 448

గీ. కాని దైవికముగ నొక్కకాలమందుఁ
గాశిలో విశ్వనాథలింగమును జూచు
టయును దాఁకుటయును మ్రొక్కుటయును నాకుఁ
గలిగె నద్దాన యమపురిం గాంచనైతి. 449

క. మును చేసినయఘములె నా, కొనరించెను బ్రేతజన్మ మొఱలుచు నుంటిన్
బెనుబూతమునకు నాఁకలి, పెనుబూతమువోలెఁ దవిలి పీలిచివైచెన్. 450

క. అనఘా నేను దరించుట, కను వైనయుపాయ మేది యైనను నున్నన్
గనుఁగొని నాహీనదశన్, గనికరమున నానతిమ్ము కా దనకుండన్. 451

క. అనవుడుఁ బ్రేతము నాతఁడు, గనుఁగొని యిట్లనియె నీవు కాశీశ్వరునిన్
గనుఁగొంటివి తాఁకితి వం, దన మొనరించితివి దాన ధన్యత యొదవెన్.

గీ. ఆమహాపుణ్యమునఁ జేసి యరుగుదెంచి, నాఁడ వీస్థానమునకు నీనాఁటితోడఁ
దీరె నీకర్మ మెల్ల నీతీర్థమందు, మునుఁగు మిపుడె కపర్దీశ్వరునిఁ దలంచి. 453

క. అనుడుఁ గపర్దీశ్వరునిం, దనమనమునఁ దలఁచికొనుచుఁ దక్షణమున సం
జనితానందముతోడను, మునిఁగెను బ్రేతము పిశాచమోచనమందున్. 454

ఆ. మునిఁగి లేచి చంద్రముకుటంబుతోడను, భోగిగణముతోడ యోగిగణము
తోడఁ బ్రమథగణముతోడను నాలింగ, మంద లీనమయ్యె నద్భుతముగ. 455

క. అది చూచి శంకుకర్ణుం, డెదలో విస్మయము గలుగ నీశ్వరశక్తిన్
మదిఁ దలఁచి తలఁచి కనులను, ముదశ్రువులు మేనఁ బులకమొలకలు వెలయన్.

క. శరణము వేఁడెద నొక్కనిఁ, బురాణపూరుషు నశేషభువనాధిపతిన్
హరిదశ్వునిఁ బావకునిం, బరాత్పరునిఁ బావనునిఁ గపర్దీశ్వరునిన్. 457

సీ. ఆద్యంతరూపుని నద్వయాకారునిఁ, గపిలాధిరూఢునిఁ గాలగళుని
సకలభూతాంతరసన్నివిష్టుని హిర, ణ్మయుని యోగీంద్రు నానందఘనుని
హరుని సహస్రపాదాక్షిశీర్షునిఁ బర, బ్రహ్మరూపునిఁ దమఃపరుని శివునిఁ
గాలాత్మకుని నిందుమౌళిఁ బినాకిని, విశ్వజన్మస్థితివిలయకరుని

గీ. నామరూపాదిరహితు నామ్నాయవిదితు, నచ్యుతుని వ్యాపకుని నఖిలావభాసి
మౌనిజనగోచరుని నవాఙ్మనసగమ్యు, నభినుతింతుఁ బ్రణమింతు నాశ్రయింతు.

క. అని యీవిధమున స్తోత్రం, బొనరిచి దండప్రణామ మొనరింపఁగ నా
తనియెదుటను నావిర్భవి, లెను నప్పుడె యొక్కవిమలలింగం బధిపా. 459

క. ఆవిమలలింగమును భూ, దేవుఁడు గుతుకంబుతోడఁ దిలకించుచు నే
భూవర యత్యాశ్చర్యం, బానహిలన్ దానిలోన నైక్యము నొందెన్. 460

క. ధరణీతలాధిప యీపర, మరహస్యం బగుకపర్దిమాహాత్మ్య మెఱుం
గరు పండితులును మోహము, దురతిక్రమ మెంతయూర్జితులకును నైనన్. 461

గీ. శంకుకర్ణుం డొనర్చిననసంస్తవంబు, ననుదినంబును జదివిన వినిన నఖిల
పాతకవిముక్తు లగుచును బరమపదము, చేరుదురు మర్త్యు లెవరేని క్షితితలేంద్ర.

—: మధ్యమేశ్వరలింగమాహాత్మ్యము :—

గీ. మధ్యమేశ్వరలింగంబుమహిమ యింక, నించుక వచించెదను విను మిందుమౌళి
నిరతమును దానియం దుండు గిరిజతోడ, రుద్రగణములతోడ నున్నిద్రుఁ డగుచు.

సీ. దేహ మంతటను భూతిని బూసికొని కంఠ, మందు ధరించి రుద్రాక్షమాల
తాలిచి పాశుపతవ్రతదీక్షను, జేయుచు రుద్రపారాయణంబు
శూలి నారాధించుచును నాస్థలంబున, నొకవత్సరము దాఁక నుండె శౌరి
యంతట నొకనాఁడు హరుఁడు ప్రత్యక్షమై, వైకుంఠున కభీష్టవర మొసంగి

గీ. వాసుదేవునిఁ బూజించువారె నన్నుఁ, దెలిసికొనియెడిజ్ఞానంబు గలుగువారు
హరిని విడనాడువారు నన్నరయ నేర, రని వచించి యంతర్ధానమయ్యె నధిప.

ఉ. కావున స్నానమున్ జలిపి గాంగజలంబున భక్తితో మహా
దేవుని మధ్యమేశ్వరుని దిక్కుగ నెంచి భజించినన్ జగ
త్పావనమూర్తులై సకలపాపవిముక్తిని జెంది మౌనిసం
సేవితమైనధామమును జెందుదు రంతమునందు భూవరా. 465

ఆ. అచటఁ బాపకర్ము లైనను దేహముల్, విడిచిరేని యొక్కగడియలోన
బ్రహ్మవిదులు చెందుపరమపదంబును, బడయుదురు విధూతపాపు లగుచు. 466

క. అచ్చటఁ గలిగినజ్ఞానం, బచ్చటితప మచటిదాన మచ్చటిశ్రాద్ధం
బచ్చటఁ బెట్టినపిండము, హెచ్చగు నొకటొకటె కులము లేదుఁ దరింపన్. 467

క. ఈమాహాత్మ్యము చదివిన, నీమాహాత్మ్యంబు వినిన నెవఁడేని పరం
ధామమున కేఁగు విగళ, త్కామక్రోధాదిషడ్వికారుం డగుచున్. 468

ఆ. కల వనేకతీర్థములు పావనంబులు, వారణాసిలోన వసుమతీంద్ర
వానిలోనఁ గొన్ని వచియింతుఁ బెద్దల, వలనఁ దెలిసికొనినవాని నీకు. 469

వ. విశ్వరూపతీర్థంబును దాళతీర్థంబును నాకాశతీర్థంబును ఋషభతీర్థంబును సునీల తీర్థంబును గౌరీతీర్థంబును ప్రాజాపత్యతీర్థంబును స్వర్గద్వారతీర్థంబును జంబు కేశ్వరతీర్థంబును ధర్మతీర్థంబును గయాతీర్థంబును మహానదీతీర్థంబును నారాయణ తీర్థంబును వాయుతీర్థంబును జ్ఞానతీర్థంబును వారాహతీర్థంబును యమతీర్థంబును సమ్మార్త్రికతీర్థంబును నగ్నితీర్థంబును గలశేశ్వరతీర్థంబును నాగతీర్థంబును సోమతీర్థంబును సూర్యతీర్థంబును బర్వతతీర్థంబును మణికర్ణికాతీర్థంబును ఘటోత్కచతీర్థంబును శ్రీతీర్థంబును బితామహతీర్థంబును గంగాతీర్థంబును దేవేశ తీర్థంబును యయాతితీర్థంబును గాపిలతీర్థంబును సోమేశతీర్థంబును బ్రహ్మ తీర్థంబునుం గలవు. 470

—: బ్రహ్మలింగమాహాత్మ్యము :—

సీ. బ్రహ్మ మున్నొకపురాణలింగము దెచ్చి, యచ్చోట నుంచి స్నానార్థ మరుగ
నంతలో గోవిందుఁ డాలింగమును దాను, స్థాపించె నచ్చోట సత్వరముగ
నజుఁడు స్నానము చేసి యరుదెంచి స్థాపితం, బైనలింగముఁ జూచి హరిని గాంచి
యేను స్థాపింపఁగా నెంచి తెచ్చినలింగ, మీవు స్థాపింపఁగా నేల చెపుమ

గీ. యనుటయును విష్ణు వజునితో ననియె నిట్లు, నాకు నీకంటె భక్తి పినాకిపైని
హెచ్చుగా నుంట నీకార్య మిట్టు లయ్యె, నైన నీలింగ ముందు నీయాఖ్య ననియె.

వ. అది మొదలుకొని యాలింగంబు బ్రహ్మలింగం బనుఖ్యాతి వడసె. మఱియును భూతేశ్వరతీర్థంబును ధర్మతీర్థంబును గంధర్వతీర్థంబును వాహ్నేయతీర్థంబును దౌర్వాసికతీర్థంబును వ్యోమతీర్థంబును జంద్రతీర్థంబును జింతాంగదేశ్వర తీర్థంబును విద్యాధరేశ్వరతీర్థంబును గేదారతీర్థంబును నుగ్రతీర్థంబును గాలంజర తీర్థంబును సారస్వతతీర్థంబును బ్రభాసతీర్థంబును రుద్రకర్ణహ్రదతీర్థంబును గోకిల తీర్థంబును మహాలయతీర్థంబును హిరణ్యగర్భతీర్థంబును గోప్రేక్షతీర్థంబును నుపశాంతతీర్థంబును శివతీర్థంబును వ్యాఘ్రేశ్వరతీర్థంబును ద్రిలోచనతీర్థంబును లోకార్కతీర్థంబును నుత్తరతీర్థంబును గపాలమోచనతీర్థంబును శుక్రేశ్వర తీర్థంబును నానందపురతీర్థంబును మున్నగుపుణ్యతీర్థంబులుం గలవు. 472

గీ. కాశిలో నుండుతీర్థముల్ గణనసేయఁ, గల్పకోటిశతంబులుఁ గడచిపోవు
లేదు వానికి మితి చెప్ప లేము గాన, నింకఁ దీర్థాంతరములు నీ కెఱుకపఱుతు.

—: గ యా తీ ర్థ మా హా త్మ్య ము :—

గీ. కలదు గయ యనుతీర్థ మొక్కటి నరేంద్ర, దానిలోఁ గాలువెట్టినతత్క్షణంబ
కలుగు హయమేధసవనంబు సలిపినట్టి, ఫలము తన్మహిమంబు చెప్పంగఁ దరమె.

గీ. అచ్చట మహానదీజలమందుఁ దీర్థ, మాడి పితృతర్పణము చేయునట్టివాఁడు
స్వకులమును నుద్ధరించి యక్షయము లైన, లోకములు చెందువాఁడు ధాత్రీకళత్ర

క. గయలోఁ బ్రాక్తన మగున, క్షయవట మొకఁ డుండె దానిసన్నిధి దత్తం
బయినది సమస్తమును న, క్షయముగఁ బితరులకుఁ దృప్తి గలిగించు నృపా.

వ. అందు బ్రహ్మరణ్యోపసేవితం బగుబ్రహ్మసరస్తీర్థంబు గలదు. అది గమన మాత్రంబునం బౌండరీకక్రతుఫలంబు ననుగ్రహించు. తత్తీర్థంబునందుఁ బరమేష్ఠిచేఁ బ్రతిష్ఠింపంబడినయూపంబునకుఁ బ్రదక్షిణంబు గావించెనేని వాజపేయఫలంబు గలుగు. మఱియును నందు ఫల్గుతీర్థంబు గలదు. అయ్యది దర్శన మాత్రంబున నశ్వమేధఫలంబు నొసంగు. పిమ్మట ధేనుకతీర్థంబు గలదు. అం దొక్కరాత్రి నివసించి తిలధేనుదానంబు చేసెనేని సర్వపాపవిముక్తిం బడసి సోమలోకనివాసభాగ్యంబు నొందు. అచ్చోటఁ బర్వతంబునందు మున్ను వత్సంబులతోడం గూడి కపిల సంచరించె. తత్ఖురన్యాసంబు లిప్పటికిని నచ్చటఁ గనుపట్టుచున్నయవి. తత్పాదంబు లుపస్పృశించెనేని సమస్తపాపంబులును దొలంగు. పిదప గృధ్రవటం బనుశివక్షేత్రంబు గలదు. అందు వృషభధ్వజుని సన్నిధానంబున భస్మస్నానంబు గావించెనేని బ్రాహ్మణుండు ద్వాదశవార్షిక వ్రతంబు నెఱవేర్చినవాఁ డగు. ఇతరవర్ణంబులు సర్వపాపవిముక్తు లగుదురు. పిదప నుదయపర్వతంబు గలదు. అందు సావిత్రపదంబు గానంబడుచుండు. అచ్చట బ్రాహ్మణుం డొకపరి సంధ్య నుపాసించెనేని ద్వాదశవర్షంబులు సంధ్య నుపాసించినవాఁ డగు. అచ్చటనె యోనిద్వారం బనుమఱియొకపుణ్యతీర్థంబు గలదు. దానం బ్రవేశించినమాత్రంబున యోనిసంకటంబునుండి విముక్తుం డగు.

క. ధరణీశ్వర గయలోపల, నిరయార్తుం డేని యొక్కనెల యుండినచోఁ
బరిశుద్ధుఁ డగుచుఁ బితరులఁ, దరియింపం జేయు నేడుతరములవారిన్. 478

గీ. గయకుఁ జని శ్రాద్ధ మొనరింపఁ గలిగినట్టి
పుత్త్రుఁ డొకఁడైనఁ దమవంశమున జనింప
వలయు నని కోరుచుందు రస్వామ నరక
భీతు లైనట్టిపితరులు భూతలేంద్ర.

క. కనవలయును బహుపుత్రులఁ, జను నం దొకఁడైన గయకుఁ జలుపు నొకండై
నను నీలవృషోత్సర్జన, మొనరించును వాజిమేధ మొక్కండైనన్. 480

—: నీలవృషలక్షణకథనము :—

వ. లోహితవర్ణంబును బాండురపుచ్ఛాగ్రంబును శ్వేతఖురవిషాణంబును నగువృష
భంబు నీలవృషం బనియును నీలవృషోత్సర్గం బశ్వమేధయాగసమానం బనియును
శాస్త్రంబులఁ జెప్పంబడియె. పిమ్మట ధర్మపృష్ఠతీర్థంబుగలదు. అచ్చట ధర్ముండు
నిత్యనివాసంబుగా నుండు. ధర్మసేవనంబువలన వాజిమేధఫలంబు లభియించు.
పిదప బ్రహ్మతీర్థంబు గలదు. అచ్చట నియమవ్రతుండై బ్రహ్మ నర్చించె నేని
రాజసూయాశ్వమేధఫలంబు ప్రాప్తించు. పిదప రాజగృహతీర్థంబుగలదు. తదుప
స్పర్శంబు గావించె నేని కక్షీవంతుం డనుతపోధనుండువలె నిత్యసంతుష్టుండై
యుండు. అచ్చట యక్షిణీప్రసాదంబున బ్రహ్మహత్యావిముక్తి కలుగు. పిదప
మణినాగతీర్థంబు గలదు. అచ్చట మణినాగనైత్యకంబును భుజియించె నేని
పాము కఱచినను విష మెక్కకుండు. తత్తీర్థంబునం దొక్కరాత్రి యుండెనేని
సర్వపాపవిముక్తుండగు. పిదప గౌతమవనంబుగలదు. అచ్చట నహల్యాహ్రదంబున
స్నానంబు సలిపె నేని పరమపదప్రాప్తి చేకూరు. పిదప శ్రీతీర్థంబు గలదు. తద్గమన
మాత్రంబున శ్రీయుతుండగు. అందుఁ ద్రిలోకవిశ్రుతం బనుకూపంబున స్నానంబు
గావించె నేని వాజిమేధఫలంబు చేకూరు. మఱియును నందు జనకరాజస్థికూపంబు
గలదు. అది ప్రాప్తిమాత్రంబున సర్వపాపవినాశనముం గావించి యశ్వమేధ
ఫలంబును సోమలోకంబును బ్రసాదించు. పిదప సర్వతీర్థజలోద్భవం బగుగండకీ
తీర్థంబుగలదు. దానిం బ్రాపించినమాత్రంబున వాజపేయఫలంబును సూర్యలోక
వాసముం గలుగు. పిదప ధ్రువతపోవనంబు గలదు. తత్ప్రవేశమాత్రంబున
గుహ్యకలోకంబు వడయు. పిదప విశాలానది కలదు. అం దవగాహంబు
గావించె నేని యగ్నిష్టోమఫలంబును స్వర్గలోకవాసంబునుం గలుగు. పిదప
మాహేశ్వరధారాతీర్థంబు గలదు. అందు స్నాతుం డయ్యె నేని యశ్వమేధ
ఫలంబు వడసి కులంబు నుద్ధరించినవాఁ డగు. పిదప దేవపుష్కరిణి గలదు.
దానిం బ్రాపించె నేని వాజపేయఫలంబు వడసి దుర్గతిం జెందకుండు. పిదప
మాహేశ్వరపదతీర్థంబు గలదు. అందు స్నానంబు చేసెనేని వాజిమేధఫలంబు
గలుగు. అచ్చటఁ గోటితీర్థంబులు గలవు. 481

క. మును రక్కసుఁ డొక్కనిచేఁ, గొనిపోవంబడినతీర్థకోటిని మరలన్
గొనివచ్చి యందె స్థాపిం, చెను గూర్మాకారుఁ డై నశ్రీపతి యధిపా. 482

వ. అందు స్నానంబు గావించె నేని పౌండరీకఫలంబును విష్ణులోకప్రాప్తియుం గలుగు.
పిదప సాలగ్రామక్షేత్రంబు గలదు. అందు నారాయణుండు నిత్యనివాసంబుగా

నుండు. అచ్చట గోవిందసందర్శనంబు గావించెనేని ఋణవిముక్తుండై యశ్వ
మేధఫలంబును వైకుంఠావాసభాగ్యంబునుం బడయు. సాలగ్రామక్షేత్రంబునందు
సర్వపాపవిమోచనం బనునొక్కకూపంబు గలదు. ఆకూపంబునందు నాల్గు
సముద్రంబులును సన్నిహితంబులై యుండు. అందు జలోపస్పర్శంబు గావించెనేని
దుర్గతిం బొరయకుండు. మఱియు నందు జాతిస్మరతీర్థంబు గలదు. అందు
స్నానంబు గావించెనేని జాతిస్మరత్వంబు గలుగు. పిదప వటేశ్వరపురంబు గలదు.
అం దుపవాసంబు గావించి కేశవు నర్చించెనేని యభీష్టలోకప్రాప్తి గలుగు.
పిదప వామనతీర్థంబు గలదు. అందుఁ బుండరీకాక్షుని నమస్కరించెనేని దుర్గతి
దూరుం డగు. పిదప భరతాశ్రమంబు గలదు. అందు మహాపాతకనాశని యగు
కౌశికియందు స్నానంబు గావించెనేని రాజసూయయాగఫలంబు సమకూరు.
పిదపఁ జంపకారణ్యంబు గలదు. అచ్చట నొక్కరాత్రి యుపవసించెనేని
గోసహస్రదానఫలంబు చేకూరు. పిదప గోవిందతీర్థంబు గలదు. అందు గౌరీ
సమేతుం డగువిశ్వేశ్వరుని నవలోకించెనేని మిత్రావరుణలోకంబులు ప్రాప్తించు.
మఱియు నందుఁ ద్రిరాత్రోపవాసంబు గావించెనేని యగ్నిష్టోమఫలంబు
ప్రాప్తించు. పిదపఁ గన్యాసంవేద్యతీర్థంబు గలదు. పరిశుద్ధుండై దానిం బ్రాపిం
చెనేని ప్రజాపతిమనులోకంబులు వడయు. కన్యాసంవేద్యతీర్థంబునం దేమాత్ర
మేనియు దానంబు గావించెనేని యది యక్షయం బని మహర్షులచేఁ జెప్పం
బడియె. పిదప నిష్ఠావాసతీర్థంబు గలదు. గమనమాత్రంబున నయ్యది యశ్వ
మేధఫలంబును విష్ణులోకంబునుం బ్రసాదించు. నిష్ఠాసంగమమునందు దానంబు
గావించువారు బ్రహ్మలోకంబునందు వసియింతురు. అచ్చట వసిష్ఠాశ్రమంబు
గలదు. అందు స్నానంబు గావించెనేని వాజపేయఫలంబు వడయు. పిదప
దేవర్షిగణసేవితం బగుదేవకూటంబు గలదు. దానిం బ్రాపించెనేని వాజిమేధ
ఫలంబు వడసి కులంబు నుద్ధరించినవాఁ డగు. పిదపఁ గౌశికహ్రదంబు గలదు.
అచ్చట విశ్వామిత్రుండు తపస్సిద్ధిం బడసె. అం దొక్కమాసంబు వసియించె
నేని యశ్వమేధఫలంబు వడయు. తత్సేవాభాగ్యంబున దుర్గతిదూరుండై బహు
సువర్ణంబు నొందు. పిదప వీరాశ్రమవాసి యగుకుమారుని సేవించెనేని యశ్వ
మేధ ఫలంబు వడసి యమరలోకనివాసభాగ్యంబు నొందు. పిదప నందినీతీర్థంబు
నం దుండుపుణ్యకూపంబు నధిగమించెనేని నరమేధయాగఫలంబు వడయు.
పిదపఁ గాళికాసంగమంబునం గౌశిక్యారుణాసదులలో స్నానంబు గావించి
త్రిరాత్రం బుపవసించెనేని సర్వపాప విముక్తుం డగు. పిదప నుర్వశీతీర్థంబు
నందును సోమాశ్రమమందును గుంభకర్ణాశ్రమమందును స్నానంబు గావించె
నేని జగత్పూజ్యత్వంబు గలుగు. పిదపఁ గోకాముఖతీర్థంబునందు స్నానంబు

గావించెనేని జాతిస్మరత్వంబు వడయు. పిదప ఋషభద్వీపంబునందుఁ గ్రౌంచ నిషూదనుని సేవించి సరస్వతీసలిలం బుపస్పృశించెనేని దేవతావిమానస్థుండై విరాజిల్లు. పిదప నౌద్యానకతీర్థంబునందు స్నాతుం డయ్యెనేని సర్వపాప విముక్తుం డగు. పిదప బ్రహ్మర్షి సేవితం బగుబ్రహ్మతీర్థంబుం బ్రాపించెనేని వాజపేయఫలంబు లభియించు. పిదపఁ జంపాభాగీరథీదండార్పణంబులయందు స్నానంబు గావించెనేని గోసహస్రదానఫలంబు ప్రాప్తించు. పిదప విద్యాతీర్థంబు నుపస్పృశించెనేని విద్వాంసుం డగు. పిదప రామప్రసాదంబుచేఁ దీర్థరాజంబుగాఁ జేయఁబడినలౌహిత్యతీర్థంబునందు స్నాతుం డయ్యెనేని బహుసువర్ణప్రాప్తి కలుగు. పిదపఁ గరతోయాతీర్థంబున స్నానంబు గావించి త్రిరాత్రోపవాసంబు చేసెనేని యశ్వమేధఫలంబును శక్రలోకంబునుం బడయు. పిదప గంగాసాగర సంగమంబునందు స్నానంబు గావించెనేని దశగుణాశ్వమేధఫలంబు ప్రాప్తించు. పిదప గంగాద్వీపంబునందు స్నానంబు సలిపి త్రిరాత్రోపవాసంబు గావించెనేని సర్వకామసిద్ధి చేకూరు. పిదప వైతరణీనదియందును విరాట్తీర్థంబునందును నవగాహనంబు గావించెనేని యమృతాంశుండువలె విరాజిల్లు. పిదప శోణ జ్యోతిరథీసంగమంబున స్నానంబు గావించి పితృదేవతాతర్పణంబు గావించెనేని యగ్నిష్టోమఫలంబు చేకూరు. పిదప శోణనర్మదాప్రభవంబునందు వంశ గుల్మంబు నుపస్పృశించెనేని వాజిమేధఫలంబు గలుగు. కోసలయందు ఋషభ తీర్థంబునఁ ద్రిరాత్రంబు లుపవసించెనేని వాజిమేధఫలంబు లభియించు. అచ్చట గాలతీర్థము నుపస్పృశించెనేని ఋషభతీర్థఫలంబుకంటె దశగుణాధికం బగు ఫలంబు వడయు. పిదపఁ బుష్పవతీతీర్థంబు నుపస్పృశించి త్రిరాత్రం బుపవ సించెనేని గోసహస్రదానఫలముం బడసి కులంబు నుద్ధరించినవాఁ డగు. పిదప బదరికాతీర్థంబునందు స్నానంబు సలిపెనేని దీర్ఘాయువును స్వర్లోకనివాసభాగ్యం బును జేకూరు. పిమ్మట జామదగ్న్యనిషేవితం బగుమహేంద్రక్షేత్రంబునందు రామతీర్థంబున స్నానంబు గావించెనేని వాజిమేధఫలంబు వడయు. అచ్చటన మతంగుని కేదారతీర్థంబు గలదు. అందు స్నానంబు గావించెనేని గోసహస్ర దానఫలంబు లభియించు. పిదప శ్రీపర్వతంబునందు నదీతీరంబు నుపస్పృశించి దేవహ్రదంబున స్నాతుం డయ్యెనేని యశ్వమేధఫలంబును బరమపదంబునుం బ్రాప్తించు. శ్రీపర్వతంబున మహాదేవుండు దేవీసమేతంబుగా బ్రహ్మాది త్రిదశులు భజింప నివసించి యుండె. పిదపఁ గావేరీతీర్థంబునందు స్నానంబు గావించెనేని గోసహస్రదానఫలంబు ప్రాప్తించు. పిదప గోకర్ణక్షేత్రంబునందు త్రిరాత్రంబు లుపవసించి బ్రహ్మాదిదేవతలచేతను దపోధనులచేతను సిద్ధచారణ గంధర్వకిన్నరోరగులచేతను భూతయక్షపిశాచపన్నగులచేతను మానవులచేతను

సరిత్సాగరశైలంబులచేతను నుపాసింపఁబడుచుండుసదాశివుని నర్చించెనేని దశాశ్వమేధఫలంబును గాణపత్యంబునుం బడయు. అచ్చట ద్వాదశరాత్రింబు లుపవసించెనేని కృతార్థుం డగు. మఱియు నచ్చటన గాయత్రీస్థానంబు గలదు. అందుఁ ద్రిరాత్రంబులు నివసించెనేని గోసహస్రదానఫలంబు లభియించు. మఱియును నచ్చట ద్విజుండు గాయత్రిని బఠించెనేని నిరుపమవాగ్విభవాన్వితుం డగు. పిదప సంవర్తుం డనుబ్రహ్మర్షివాపియందు స్నానంబు గావించెనేని మిగుల రూపవంతుం డగు. పిదప వర్ణోద్యతీర్థంబున స్నానంబు సలిపి పితృదేవతాతర్పణంబు గావించెనేని మయూరహంసయుక్తం బగువిమానంబు నధిష్ఠించు. పిదప గోదావరీ తోయంబున స్నానంబు గావించెనేని వాయులోకప్రాప్తి గలుగు. పిదప వేణాసంగమంబున స్నాతుం డయ్యెనేని వాజపేయఫలంబును వరదాసంగమంబున స్నాతుం డయ్యెనేని గోసహస్రదానఫలంబును జేకూరు. పిదప బ్రహ్మస్థూణాతీర్థంబునందు స్నానంబు గావించి త్రిరాత్రంబు లుపవసించెనేని గోసహస్రదానఫలంబును స్వర్లోకనివాసభాగ్యంబును గలుగు. పిదపఁ గుబ్జావనతీర్థంబునందు స్నానంబు గావించి త్రిరాత్రోపవాసంబు చేసెనేని గోసహస్రదానఫలంబు గలుగు. పిదప దేవహ్రదంబునందును జ్యోతిర్మాత్రిహ్రదంబునందును గన్యాశ్రమంబునందును మహేంద్రుండు గ్రతుశతంబు గావించి స్వర్గరాజ్యాధిపత్యంబు నడయుటం జేసి యచ్చట స్నానంబు గావించెనేని యగ్నిష్టోమశతఫలంబు ప్రాప్తించు. పిదప సర్వదేవహ్రదంబున స్నానంబు చేసెనేని గోసహస్రదానఫలంబును జాతిమాత్రహ్రదంబున స్నానంబు చేసెనేని జాతిస్మరత్వంబును లభియించు. పిదపఁ బయోష్ణీసరిత్తునందు స్నాతుండై పితృదేవతార్చనంబు గావించెనేని గోసహస్రదానఫలంబు గలుగు. పిదప దండకారణ్యంబునందు శరభంగాశ్రమంబును శుకాశ్రమంబును బ్రాపించెనేని దుర్గతిం జెందక స్వకులంబు నుద్ధరించినవాఁ డగు. పిదప జమదగ్నినిషేవితం బగుసూర్పారకతీర్థంబునందును రామతీర్థంబునందును స్నానంబు గావించెనేని బహుసువర్ణప్రాప్తి గలుగు. పిదప సప్తగోదావరంబున స్నాతుం డయ్యెనేని మహాపుణ్యంబు వడసి దేవలోకంబు నధిష్ఠించు. పిదప దేవపథంబును బ్రాపించెనేని దేవసత్రయాగపుణ్యంబు ప్రాప్తించు. పిదపఁ దుంగకారణ్యంబు గలదు.

సీ. వేదంబు లన్నియు విస్మృతంబులు గాఁగ, మున్నందుఁ గలయట్టిమునుల కెల్ల
నంగిరస్తనుజన్ముఁ డైనసారస్వతుం, డవ్వారియుత్తరీయములయందు
నునవిష్టుఁ డగుచును నోంకారమును విధి, యుక్తంబు గాఁగను నుచ్చరించె.
నంతఁ బూర్వాభ్యస్తమైనవేదము లెల్లఁ, దక్షణంబ యుపస్థితంబు లయ్యె

గీ. నపుడు హరిహరపరమేష్ఠు లఖిలదేవ, యుక్తు లగుచును భృగుని నియుక్తుఁ జేయ
నతఁడు మునులకు నధ్యయనార్హభావ, మొదవ సంస్కార మొనరించె యుక్తరీతి.

క. అంతట మును లెల్లరు న, త్యంతప్రమదంబుతోడ నామ్నాయములన్
జింతన మొనరించుచు నుప, శాంతిం గొని యుండి రఖిలజగములయందున్.

వ. తుంగకారణ్యంబుం బ్రవేశించినమాత్రంబున సకలపాపక్షయం బగు. అం దొక్కమాసం బుండెనేని బ్రహ్మలోకప్రాప్తియును వంశోద్ధారకత్వంబునుం గలుగు. పిదప మేధావనంబునందుఁ బితృదేవతాతర్పణంబు గావించెనేని యగ్నిష్టోమఫలంబును స్మృతిమేధాసంప్రాప్తియుం బడయు. పిదపఁ గాలంజరపర్వతంబుం బ్రాపించెనేని గోసహస్రదానఫలంబు చేకూరు. పిదపఁ జిత్రకూటపర్వతంబున మందాకినియందు స్నానంబు గావించి పితృదేవతార్చనంబు గావించెనేని యశ్వమేధఫలంబును సద్గతియుం జేకూరు. పిదప గుహస్థానంబు గలదు. అందు మహాసేనుండు నిత్యసన్నిహితుండై యుండు. అచ్చటఁ గోటితీర్థంబునందు స్నాతుండయ్యెనేని గోసహస్రదానఫలంబు ప్రాప్తించు. దానికిఁ బ్రదక్షిణంబుగా శివస్థానంబుం జేరి యందు మహాదేవుని నర్చించెనేని సుధాంశుండువలె విరాజిల్లు. అచ్చట నొకకూపంబు గలదు. అందు నాలుగుసముద్రములును నివసించియుండు. తత్కూపంబు నుపస్పృశించి ప్రదక్షిణంబు గావించెనేని పావనుండై సద్గతిం జెందు. పిదప శృంగబేరపురంబు గలదు. అచ్చట మున్ను దాశరథి యగు రామభద్రుండు గంగను దాఁటె. తద్గంగానదియందు స్నానంబు గావించెనేని విధూతపాతకుండై వాజపేయఫలంబు వడయు. పిదప ముంజవటం బనుసదాశివక్షేత్రంబు గలదు. అందు మహాదేవుని నర్చించి ప్రదక్షిణంబు గావించెనేని గాణాపత్యంబు వడయు. పిదపఁ బ్రయాగం బనుతీర్థరాజంబు గలదు.

—: ప్ర యా గ తీ ర్థ మా హా త్మ్య ము :—

క. మును ధార్తరాష్ట్రసంక్షయ, మొనరించినపిదప రాజ్య మొనగూడుటయున్
గనుఁగొని యుధిష్ఠిరుఁడు భ్రా, తృనిషూదనజనితశోక మేర్పడ మదిలోన్. 487

సీ. శమియించె నేకాదశచమూధవుం డైన, ధృతరాష్ట్రజుఁడు భ్రాతృసుతులతోడఁ
గూలెను శస్త్రాస్త్రగురు వైనద్రోణుండు, పండితుం డైనభీష్ముండు మడిసె
నీల్గె మహాబలాన్వితుఁ డైనకర్ణుండు, శ్లాఘ్యవర్తనుఁ డైన శల్యుఁ డడఁగె
సమసిపోయిరి దురాసదు లైనశూరులు, శాంతమయ్యెను బంధుజాల మెల్ల

గీ. వారితోఁ బోక జీవచ్ఛవములు వోలె, మిగిలి యున్నార మర్విలో మేముమాత్ర
మేగురము భోగభాగ్యంబు లెవరి కింక, నెట్లు లీరక్తసిక్తాన్న మిముడు మాకు.

క. చలుపుదునో యోగంబును, జలుపుదునో తీర్థసేన సలుపుదునొ వ్రతం
బులు నాచేసినపాతక, ములశాంతికి నేది గతియొ పొడవడ దాయెన్. 489

సీ. ఇంతకార్యంబు చేయించినకృష్ణుని, నడుగంగ నెట్లు నోరాడు నాకుఁ
బుత్రశతంబును బొలియించి యే మని, ధృతరాష్ట్రు నడుగంగ నేను బోదుఁ
గావించి గోత్రసంక్షయము నే మొగమున, వ్యాసుని నడుగ నే నభిలషింతు
ధర్మహాని యొనర్చి ధర్మజ్ఞు లగువారి, నడుగంగ నే నెట్టు లాసపడుదు
గీ. ననుచుఁ దలపోయుచును విహ్వలాత్ముఁ డగుచు
నాననము వంచికొని యుండ నతనిఁ జూచి
తల్లియును దొయ్యలియును సోదరులు గూడ
ఖిన్ను లయి బాష్పములు గార్చుచున్న నంత. 490

వ. వారణాసీనివాసి యగుమార్కండేయమహర్షి పాండవులు చెందువిషాదంబు యోగదృష్టిచేఁ దెలిసికొని శీఘ్రంబుగా హస్తినాపురంబున కేతెంచి వారలకు దర్శనం బిచ్చుటయు యుధిష్ఠిరుం డమ్మహనీయుని నర్ఘ్యపాద్యాదివిధులచే నాదరించి సప్రశ్రయంబుగా ని ట్లనియె. 491

క. అనఘా యస్మద్వృత్తము, గనుఁగొని యోగమున మమ్ముఁ గరుణించుటకై
చనుదెంచినదైవమ వని, యనుకొందును జూచినట్టు లరుదెంచుటచేన్. 492

క. అని యూరకున్న నమ్ముని, యనియె యుధిష్ఠిరున కిట్టు లధిపా రాజ
న్యునకు స్వధర్మము యుద్ధము, గనుక నె యద్దాన లేదు కలుషము నీకున్.

క. ఐనను నీమనమున లో, కానుగ్రహమునకుఁ బుట్టినట్టిభయంబున్
మానుచుట నాకు ధర్మము, గాన నుపాయంబు వినుము కలుషము లుడుగన్.

చ. ఇల నొకతీర్థరాజ ముదయించెఁ బ్రయాగసమాహ్వయంబునన్
గలుషము లెల్ల దానిఁ బొడగాంచినమాత్రమునన్ శమించుఁ ద
త్స్థలమహిమం బెఱుంగుటకు సాధ్యము గా దజరుద్రకేశవా
దులకును నస్మదాదులస్థితుల్ నచియింపఁగ నింక నేటికిన్. 495

చ. కలకలలాడుచున్ బహువికాసముతోడను బ్రహ్మవిష్ణురు
ద్రులును మునీంద్రులున్ జలనిధుల్ దిగధీశులు యక్షులున్ సువ
ర్ణులును సరిత్తులున్ విషధరుల్ సురకిన్నరసిద్ధసాధ్యులున్
నెలకొని యుందు రచ్చటను నిత్యనివాసము గాఁగ భూవరా. 496

క. ఏనఃపశువర్గమునకు, స్నానాస్థానముగఁ బద్మసూనుఁ డొనర్చెన్
మానవనాథ ప్రయాగ, స్థానమున సితాసితాంబుధారాఘురమున్. 497

గీ. ఆదినట మక్షయవటంబు శ్యామవటము
నాఁగఁ బేర్వడి ప్రళయంబునను క్షయంబు
నొందకుండుఁ బ్రయాగమునందు వటము
దానిమహిమంబు వర్ణింపఁ దరము గాదు. 498

గీ. చామరములు సితాసితసలిలనదులు, ఛత్త్రి మాదివటంబు గా జానుమీాఱఁ
దీర్థరాజం బనఁ బ్రయాగతీర్థ మొకఁడె, ధరణిలో నున్న పుణ్యతీర్థములలోన.

గీ. ఎక్కడంచు బ్రహ్మపదమున, కకడజముగ నొక్కడుణమునంద ప్రయాగ
మొక్కపరి వేణిలో నెక, సక్కంబున కేని మునుఁగ జాల్మల నేనిక. 500

సీ. వెలసెఁ బ్రయాగంబు విశ్రుతం బగుచును, దై త్రిలోక్యమునఁ దీర్థరాజ మనఁగ
నది స్మరించినను బుణ్యము లెల్ల వరియించు, నది పేరుకొనిన నభ్యుదయ మొదవు
నది కనుంగొనిన నాపద లాపదను జెందు, నచటి కేఁగినఁ బాయు నఘము లెల్లఁ
దన్మృత్తికావాప్తిఁ దనరుఁ బవిత్రత, యందు స్నానము చేయఁ జెందు దివము

గీ. నది ప్రజాపతి కాస్పద మైన క్షేత్ర, మక్కడ సమస్తతీర్థము లధివసించు
నందు మరణంబు సంప్రాప్త మయ్యె నేని, మరలఁ గలుగదు జన్మంబు మానవేంద్ర.

సీ. షష్టిధనుస్సహస్రములు ప్రోచుచు నుండు, జాగరూకతతోడ జహ్నుసుతను
నక్షయవటమును రక్షించు చుండును, జేత శూలముఁ బట్టి శితిగళుండు
కాచు చుండును బ్రయాగమును స్వయంబుగా, వజ్రహస్తుం డయి వాసవుండు
కాళింది నెపుడును బాలించు చుండును, సప్తవాహనుఁ డయి జలజహితుఁడు

గీ. మండలంబును నేలు నేమఱక శౌరి, స్థానమును నోముదు రశేషదైవతములు
గానఁ గల్మషదూషితు లైనవారు, చేరఁగాఁ జాల రామహాక్షేత్రమునకు.

క. సురలును సిద్ధులు విద్యా, ధరులును మొదలైన పుణ్యధను లచ్చోటన్
జరియించుటచేతన ని, ర్జరలోకమునన్ వసింపఁ జాలిరి భూపా. 503

క. అది యజ్ఞభూమి యమరుల, కది తీర్థము లన్నిటికిని నధిపతి యట న
ర్వదికోటులు పదివేలుం, బొదిగొనుచును నుండుఁ దీర్థములు నరనాథా. 504

క. గంగాయమునానదులకు, సంగమ మాతీర్థమందు సమకూరెను ద
త్సంగమ దేశమె పృథివికి, సంగెను జఘనంబు నాఁగ జూన్మతలనాథా. 505

గీ. నాల్గు వేదము లధ్యయనంబు చేసి, నట్టివానికిఁ గలపుణ్య మన్వృత మూాడ
నట్టివానికిఁ గలపుణ్య మబ్బితీరు, స్నాన మొనరించె నేని తత్సంగమమున.

క. గంగాయమునాతటినీ, సంగమమున దేహములను జాలించినయ
త్తుంగాత్ములు వసియింతురు, భంగము లేకుండఁ ద్రిదశభవనమునందున్. 507

సీ. త్రిదివంబునందు వర్తిల్లి యమ్మహానీయు, లనుపమభోగంబు లనుభవించి
పుణ్యంబు క్షీణించిపోయినపిమ్మట, భువిని జంబూద్వీపమున జనించి
తదధీశ్వరత్వంబుఁ దాలిచి పరలోక, సాధనంబు లగుకర్మములు చేసి
యంతకాలమునఁ బ్రయాగతీర్థంబును, స్మరియించి ప్రాణముల్ పరిహరించి

గీ. స్వర్ణమయమైనభూమియు సర్వకామ, ఫలము లొసఁగెడివృక్షముల్ గలిగియుండు
బ్రహ్మలోకంబునకుఁ జేరి పరమఋషుల, తోడనుసుఖంబులొందుచుందురు నరేంద్ర.
సీ. పాటలవర్ణయు భర్మశృంగయుఁ బయ, స్వినియు రౌప్యఖురయుఁ జేలగళయు
నగుకపిలను శాంతుఁడైన బ్రాహ్మణునకు, గంగాయమునసృసంగమమున
దాన మొసంగినఁ దద్ధేనుతనువునం, దున్నట్టిరోమంబు లెన్ని యన్ని
వర్షసహస్రముల్ స్వర్గమం దుండి పై, నుత్తరకురువులం దుద్భవించుఁ
గీ. గాన గోదానమునకు సమాన మైన, దాన మేదియు లేదు పాతకసముద్ర
ములను దాఁటించుటకు దిక్కు గల దొకండె, ధేను వనియెడితరణి ధాత్రీకళత్ర.
సీ. గంగాయమునసృసంగమంబునను బం, చాగ్నిసాధకుఁ డైనయట్టివాఁడు
తనదేహమందు నుండినరోమకూపంబు, లన్ని వే లేం డ్లుండి యమరపురిని
బిదప జంబూద్వీపపృథ్వీపతిగను వి, శ్వంభరాతలమందు సంభవించి
యఖిలభోగంబుల ననుభవించి భజించు, నాతీర్థరాజంబు నంతమందు
గీ. నచట సలిలప్రవేశంబు నాచరించు, నట్టిపుణ్యాత్ముఁ డఘవిముక్తాత్ముఁ డగుచు
సైంహికేయుండు విడిచినచంద్రమసుని, చందమునఁ దేజరిల్లు విశ్వంభరేంద్ర.
సీ. తత్సంగమంబునఁ దలక్రిందుగా నుండి, యూర్ధ్వపాదుం డయి యోగమునను
జ్వాలాశనంబును జలిపిన నివసించి, శతసహస్రాబ్దముల్ స్వర్గమందు
సురలు గంధర్వకిన్నరులును సేవింప, నఖిలభోగంబుల ననుభవించి
యగ్నిహోత్రిగఁ బుట్టి యటుమీఁద ధరణిలో, నాతీర్థమును జేరు నంతమందు
గీ. నచట ఖండించి తనదేహ మండజముల, కర్పణము చేయుపుణ్యాత్ముఁ డధివసించి
చంద్రలోకంబున సహస్రశతసమలును, నవల జన్మించు భువిని లోకాధిపతిగ.
క. గంగాయమునామధ్యము, నం గన్యాదాన మొసఁగినను నిహసుఖముల్
సాంగముగ ననుభవించి ప, యిం గనుఁ ద్రిదశాలయమున నెల్లసుఖంబుల్.
క. వినినను బ్రయాగనామము, ననినను నోటను బ్రయాగ మనుచుఁ బ్రణామం
బొనరించినను బ్రయాగం, బున కఖిలాఘములు సమసిపోవును ద్రుటిలోన్.
ఆ. అచటఁ జేయుదాన మణుమాత్ర మైనను, గొండవోలెఁ బెరుఁగుచుండు నధిప
కావున నె ప్రయాగగమనంబు దేవుఁడు, మాను మనినఁ గూడ మానఁ దగదు.
గీ. గంగ ప్రవహించుచుండు నక్కడఁ ద్రివహ్ని
కుండములమధ్యమున మహీమండలేంద్ర
యెన్ని దుష్కృతములు చేసియున్నఁ గాని
నాశనము నొందు నవి తత్ప్రవేశముననె. 515

క. గంగాసాగరసంగమ, గంగాద్వారప్రయాగగతులను మూఁటన్
గంగానది దుర్లభ నృప, పుంగవ యన్యప్రదేశముల సులభ సుమీ. 516

గీ. మంగళంబుల కెల్లను మంగళంబు, పావనంబుల కెల్లను బావనంబు
తీర్థముల కెల్ల నగ్రిమతీర్థ మఖిల, తటినులందును నుత్తమతటిని గంగ. 517
గీ. త్రిపథగానదియుత్తరతీరమందుఁ, గలదు మానసతీర్థ మొక్కటి నరేంద్ర
యచ్చటఁ ద్రిరాత్ర ముపవాస మాచరింపఁ, గలుగుఁ దక్షిణమున సర్వకామసిద్ధి.
గీ. కామ మున్నను లేకున్న గంగలోన, మరణ మొందినపుణ్యాత్ముఁ డరిగి దివికి
నందు మితి లేనిభోగంబు లనుభవించి, కడకు జన్మించుఁ బ్రభువుగాఁ బుడమిలోన.
గీ. ఎన్ని పాతకములు చేసియున్నఁ గాని, యన్నిటినిఁ గూడ నాతీర్థమందుఁ జేయు
భీష్మసుమజ్జనంబు గృపీటయోని,యింధనములనుబోలె దహించు నధిప. 520
గీ. కృతయుగంబునఁ బుణ్యంబు లెల్లతీర్థ
ములును త్రేతాయుగంబునఁ బుష్కరమును
ద్వాపరమునఁ గురుక్షేత్రధరయుఁ గలియు
గమున భాగీరథియును బుణ్యములు భూప. 521
గీ. అనశనము భృగుతుంగమునను మహాల
యమున దానము పుష్కరమందుఁ దపము
మలయమున నగ్నినిధనంబు గలియుగమునఁ
ద్రిపథగామజ్జనమును దరింపఁజేయు. 522
గీ. కిల్బిషము లెల్ల హరియించుఁ గీర్తనమున, దర్శనంబున సకలభద్రము లొసంగు
స్నానమునఁ బానమునను నొనర్చు సద్గ,తులను నేడుతరములవారలకు గంగ.
ఆ. ఎంతదాఁక నెవనియెముకలు గాంగతో, యంబునందు నుండు నంతదాఁక
నతఁడు స్వర్గలోకమం దుండు దేవతా, కోటు లెల్లఁ దన్నుఁ గొలుచుచుండ. 524
గీ. గంగ కీడైనతీర్థంబు గానరాదు
వాసుదేవునిఁ బోలుదైవంబు లేదు
బ్రాహ్మణునితోడ సామ్యంబు వడయఁ దగిన
మానవుఁడు లేఁ డనుచుఁ బితామహుఁడు వలికె. 525
క. అదె సిద్ధక్షేత్రం బ, య్యదియె తపోవనము నరవరాగ్రణి గంగా
నది యెచ్చట నుండునొ త, త్ప్రదేశమహిమంబు దరమె భాషింపంగన్. 526
గీ. ప్రళయకాలంబునందును బ్రజ్వరిల్లి, ద్వాదశాదిత్యులును జగత్సంక్షయంబు
సలిపినపుడును క్షతి లేక నిలిచియుండు,నచట వటమూలము వసుంధరాధినాథ.
ఆ. సూర్యచంద్రపవనశూన్యమై యేకార్ణ, వముగ భువన మున్నసమయమునందు
వనజలోచనుండు వటమూలమున నుండుఁ, బవ్వళించి రేయి పవలుఁ గూడ. 528
క. మేనుల నావటమూల, స్థానంబున విడుచునట్టి జనులు సమస్త
స్థానములు విడిచి బ్రహ్మ, స్థానమునం గలుగు శాశ్వతంబుగ నుండన్. 529

గీ. బ్రహ్మచర్యంబునను వటపాదపంబు, గలుగుచోటను యోగసంకలితుఁ డగుచు
నుపవసింప బ్రహ్మజ్ఞాన మొదవి మరల, గర్భవాసశ్రమంబును గనఁ డతండు.
గీ. జహ్నుతనయకుఁ బూర్వపార్శ్వంబునందు, గలదు కూపం బొకం డందుజలధు లెల్ల
సంవసించుట చేఁ బ్రతిష్ఠాన మనెడి, ఖ్యాతి గైకొనె నది త్రిలోకములలోన. 531
ఆ. అచట నియమయుక్తుఁ డగుచుఁ ద్రిరాత్రంబు, లధివసించెనేని యఘము లెల్లఁ
దొలఁగి యశ్వమేధఫలము సంప్రాప్తించు, నవనినాథ యెవనికైనఁ గాని. 532
గీ. జనవరేణ్య ప్రతిష్ఠానమునకు నుత్త, రముగ భాగీరథికిని బూర్వముగఁ దీర్థ
ముంకె హంసప్రపతనాఖ్య నొందు దాన, మునిఁగి దివమున నాకల్పమును వసించు.
సీ. హంసపాండురమును నాయతంబును రమ్యమును నైనయూర్వశీపులినమందుఁ
బితృతర్పణము చేయునతఁ డరువదివేల, యరువదినూఱులహాయనములు
పితృదేవతాసమన్వితుఁ డయి కొలువంగ, నమరు లెల్లను ద్రిదివమున నుండి
పుణ్యంబు క్షీణింపఁ బుడమిపైఁ బుట్టియై, శ్వర్యపూర్ణం బైనవంశమందు
గీ. నూర్వశీసమ లగుకన్య లొక్కశతము, తన్ను వరియింప వారితోఁ దాను గూడి
యనుపమము లైనభోగంబు లనుభవించు, స్వకృతపుణ్యంబునం జేసి తుమ్మెతలేంద్ర.
ఆ. అంతకాలమందు నాతీర్థమును స్మరి, యించి మరలఁ బుట్టి యిల నతండు
క్షితికి నెల్ల నేకపతి యయి కీర్తితో, నఖలభోగములను ననుభవించు. 535
ఆ. ప్రాణములను వీడనాడిన నచ్చోటఁ, గోటితీర్థమందుఁ గువలయేంద్ర
స్వర్గమందుఁ గోటివర్షసహస్రము, లఖిలభోగములను ననుభవించు. 536
వ. మఱియు నచ్చట వాసుకితీర్థమునకు నుత్తరభాగంబున భోగవతీతీర్థంబును దశాశ్వమేధికతీర్థంబునుం గలవు. అందు స్నానంబు గావించెనేని యశ్వమేధ ఫలంబు లభియించు. ప్రయాగతీర్థరాజంబునకు దక్షిణంబుగా యమునోత్తర కూలంబునందు ఋణప్రమోచనం బనునొకపుణ్యతీర్థంబు గలదు. తత్తీర్థంబున నొక్కరాత్రి నివసించెనేని సర్వఋణవిముక్తిం బడసి సూర్యలోకనివాస భాగ్యముం జెందు. 537
గీ. తీర్థరాజంబునందుఁ బృథ్వీకళత్ర, విన్ను మనాశక ఫలమును వినుతు నిప్డు
బద్ధపదంబున హయమేధఫలము గలిగి, నరుఁడు తరియింపఁ జేయు స్వాన్వయము నెల్ల.
గీ. పంచయోజనవిస్తారభరిత మగుచు, నలరెడి ప్రయాగమండలమందుఁ జొచ్చు
నాతఁ డడుగడుగున కశ్వమేధ, ఫలము గనునంచు మును చెప్పెఁ బద్మభవుఁడు.
క. కాళిందీమాహాత్మ్యము, నాలింపుము భూప వేయి యాముఖ లున్నన్
గాళింది యమునఁ జుఁ బలికినఁ, జాలు నశేషాఘములును శాంతింపంగన్. 540
సీ. యమునను గీర్తించునతఁడు పుణ్యము లెల్లఁ, గావించుకొనఁ గల్గుఁ గైవసముగ
నర్కపుత్రిని గాంచునతఁడు గాంచు నశేష, భద్రంబులను గొంకు పెడ్డి గాఁగ

గాళిందిలో నవగాహనం బొనరించి, సలిలపానంబును జలునపుతఁడు
తనవశంబున నేడు తరముల వారల, నొకత్రుటిలోపల నుద్ధరించుఁ

గీ. బితృపతిస్వస్రుజలమునఁ బ్రీతితోడఁ,
ప్రాణములు వాయువాఁ డొందుఁ బరమపదము
పావనత్వంబునందుఁ బ్రభావమందు
యమునయును గంగయును రెండు సమము లధిప. 541

ఆ. ఎచటనుండి గంగ యేతెంచియుండెనో, యచటనుండి యమున యరుగుదెంచె
గానఁ ద్రిపథగకును గాళిందికిని భేద, మెంచుకొనెడివాఁడు వంచితుండు. 542

వ. కాళిందికి దక్షిణతటంబునం దగ్నితీర్థంబును బశ్చిమతటంబునందు హరవరం బనుధర్మరాజతీర్థంబును నుండె. అందు స్నానంబు గావించెనేని త్రిదివంబును నిధనంబు నొందెనేని యపునర్భవత్వంబునుం బ్రాప్తించు. మఱియు న త్తీర్థంబులం దింకను దీర్ఘసహస్రంబులు గలవు. కాళిందికి నుత్తరభాగంబున విరజం బనునా దిత్యతీర్థంబు గలదు. అచ్చట నింద్రాద్యమరు లెల్లరునుం గూడి నిత్యంబును సంధ్య నుపాసించు చుందురు. మఱియును నచ్చటఁ బాపహారంబు లగుననేక తీర్థంబులు గలవు. త త్తీర్థంబులందు స్నానంబు గావించెనేని స్వర్గంబును మర ణించెనేని యపునరావృత్తియుం గలుగు. నైమిషంబును బుష్కరంబును గోతీర్థం బును సింధుసాగరంబును గురుక్షేత్రంబును గయయును గంగాసాగరంబును మున్నగుమహాపుణ్యతీర్థంబులు ముప్పదికోటులపదివేలు ప్రయాగతీర్థంబునం గలవు. మూఁడుకోటుల యేఁబదితీర్థంబులును బ్రయాగతీర్థషోడశాంశంబునకుం జాల వని వాయుదేవుండు పలికె. 543

గీ. వసుమతీశ్వర కంబలాశ్వతరయుగము, భోగవతియుఁ బ్రతిష్ఠానమును బ్రయాగ
మును బ్రజాపతికిని వేది యనుచు యోగ, సిద్ధి గలవారిచే మున్ను చెప్పఁబడియె.

గీ. మూర్తిమంతంబు లగు వేదములునధ్వరములును దపోధనులును నిర్జరులుఁగూడి
కొలుతురు ప్రయాగమును జగంబులను మూఁట, దానికం టెనుబుణ్యతీర్థంబు లేదు.

గీ. స్వర్గ్యమును బావనమును సేవ్యమును సుఖముఁ
బుణ్యమును ధర్మ్యమును శ్రేష్ఠమును మనోహ
రమును గుహ్యము నగుతీర్థరాజమహిమ
చెప్పినను విన్న సర్వార్థసిద్ధి గలుగు. 546

గీ. ఎవ్వఁడైశ్వర్యమదముననేని లేక, మోహముననేనియును మానముననుదీర్థ
యాత్ర గావించు నాతీర్థయాత్రవలన, నాతనికి లేదు ఫలము ధాత్రీతలేంద్ర. 547

గీ. అధిప పితృకార్యమునకైన నాత్మకార్య, మునకునైనను దేవతార్చనకునైన
దేని కైనను మతి గలమానవుండు, దీర్థమునఁ జేయ రాదు ప్రతిగ్రహంబు. 548

క. కావున బ్రాహ్మణుఁ డగువాఁ, డేవిధి నైనను బ్రమాద మేర్పడ కుండం
గా వలయు దీర్థములలో, భూవర లేకున్నఁ బతనమును వాఁ డొందున్. 549

ఆ. అశుచి దుర్మతియును నశ్రద్ధధానుఁడు, త్యక్తమంగళుఁడును ననునలువురు
పాపవంతులకును బ్రత్యక్ష మైనను, నేది యేని చెప్పరాదు భూప. 550

గీ. బ్రహ్మ మెట్టులు పూజింపఁబడునొ సర్వ, భూతములయందు నాచందమునను సకల
భువనములయందుఁగూడను బూజ్య మగుచుఁ, దీర్థరాజంబుపొలుచుఁ బృథ్వీకళత్ర.

గీ. తీర్థరాజప్రవేశ మొందిననరుండు, కొంచె మైనను నన్యంబుఁ గోరకొనఁడు
దేవతాత్వంబు వడసి యర్థించునొక్క-, మానుషత్వంబు నెవఁడేని మానవేంద్ర.

క. కావున విశ్వాసము గల, పావనుఁడ వటంచు నీకుఁ బరమరహస్యం
బీవిధమున నెఱిఁగించితి, భూవర కైకొని ప్రమాణముగ శాస్త్రంబున్. 553

చ. అనవుడు ధర్మరాజు సహజాన్వితుఁడై ధరణీసురాజ్ఞ గై
కొని వెసఁ దీర్థరాజమునఁ గ్రుంకి పయిన్ బితృదేవతర్పణం
బొనరిచె నంత నచ్చటికి నుత్సుకతన్ జనుదెంచెఁ గృష్ణుఁ డా
య్యన నభిషిక్తునిం జలిపి రందఱు ధర్మజు రాజ్య మేలఁగన్.

ఉ. అంతట ధర్మరాజు వసుధామరకోటి కనేకదానముల్
సంతస మేర్పడన్ జలిపె స్వర్గము గూడఁ బ్రతిధ్వనింపఁగా
నింతటి జేఁడు లేఁ డనుచు నెల్లరు స్తోత్రములం బొనర్ప న
త్యంతకుతూహలంబునను న త్తఱిఁ గృష్ణుఁడు వల్కె నీవిధిన్.

శా. బావా ధర్మతనూజ స్నేహమున నే భాషించుచున్నాఁడ వీ
భావంబందు స్మరించుచుండు మెపుడున్ భక్తిం బ్రయాగంబు స్వ
ర్గావాసంబు నొసంగు నశ్వ్యాది సమస్తాఘంబులన్ మాపుటన్
లే దద్దానిని బోలునట్టి క్రతువుల్ లే వెట్టిధర్మంబులున్. 556

క. ఇది పరమర్షి రహస్యం, బిది యామ్నాయములసార మిది త్రిదివౌకః
పదమునకు మూలమంత్రం, బిది సేవ్యము నీకు నాకు నెల్లరకు నృపా. 557

క. ఋతవాదియు శుచియు దృఢవ్రతుఁడుఁ బ్రతిగ్రహము లేనివాఁడును భూత
వ్రతతుల నాత్మోపమ్య, స్థితిఁ జూచునతండుఁ జెందుఁ దీర్థఫలంబున్. 558

క. అనవుడుఁ బ్రయాగతీర్థం, బును స్మరియించుచును ధర్మపుత్రుఁడు రాజ్యం
బును గైకొని పాలించెను, మనుజులు దేవతలు గూడ మానింపంగన్. 559

ఆ. విష్ణుదేహములుగ విలసిల్లుఁ దీర్థము, లెల్ల వానిలోన నేది యేని
యొక్కతీర్థము విధియుక్తంబుగా నుపా, స్తిం చెనేని ముక్తిఁ జెందు నరుఁడు.

క. తీర్థములు విష్ణుమయములు, తీర్థనిషేవణము వాసుదేవార్చన త
త్తీర్థములకంటెఁ బాపా, నర్థహరము లేదు వేఱుపాయము కలిలోన్. 561

ఉ. తీర్థములన్ భజించినను దీర్థనిమజ్జన మాచరించినన్
దీర్థములన్ స్పృశించినను దీర్థమహాత్త్వము నాలకించినన్
దీర్థములన్ వచించినను దీర్థములన్ నివసించినన్ భవా
నర్థముపాలు గాక చరితార్థులు గాఁగల రెల్లమానవుల్. 562

క. మనుజులకు సేవనీయము, లనవరతము బ్రాహ్మణుఁడును నశ్వత్థంబున్
వనజాక్షుఁడుఁ దీర్థచయం, బును దులసియు ననుచు వేదములు ఘోషించున్.

క. కావించె నేని తీర్థని, షేవణము దొలంగు నఘము చేకుఱు నట్టుల్
గావింపకున్న నరకము, పోవవు ధర్మమునఁ గాని పూర్వాఘంబుల్. 564

ఆ. కొన్ని గమ్యములును గొన్ని యగమ్యముల్, గలవు పుణ్యతీర్థములు నరేంద్ర
యాశ్రయింపఁబడియె నవి దేవతలచేత, మునులచేత సుకృతధనులచేత. 565

గీ. సర్వతీర్థావగాహంబు సలుపఁ దలఁచి, నట్టివాఁడు మనంబులో నైన వాని
యందు నాప్లావ మొనరించినట్లు తలఁచి, కొనినఁ దత్స్నానఫలము చేకూరు నధిప.

ఆ. పూర్వజన్మసుకృతమునఁ జేసి యాస్తిక్య, మొదవు దానివలన నొదవుఁ దీర్థ
సేవ యాస్తికత్వసిద్ధి సర్వపుమర్థ, సాధనంబు చూవె జనవరేణ్య. 567

గీ. స్వర్గమును జెందుఁ బుణ్యంబు సలుపువాఁడు
దురితమును జేయునాతఁడు నరక మొందుఁ
గాన రెండును గమనింపఁ గలుగువాఁడు
పుణ్య మగుతీర్థమును వీటిఁబుచ్చఁ దగదు. 568

—: తీర్థమాహాత్మ్యశ్రవణపఠనఫలకథనము :—

ఆ. ఎవఁడు తీర్థమహిమ నెపుడును జదువునో, యెవఁడు వినునొ శ్రద్ధ యేర్పడంగ
నతని కాచరింతు రభిషేకమును దీర్థ, దేవతలు స్వకీయతీర్థములను. 569

సీ. సంప్రీతు లగుదురు చంద్రశేఖరుఁడును, నర్మదయు మృకండునందనుఁడును
వంధ్యయు సంతానవతి యగు దుర్భగ, యగునితంబినియును నగును సుభగ
వేదసంపన్నుఁడై వెలయును విప్రుండు, జయశాలియై యుండు క్షత్త్రియుండు
వైశ్యుండు ధనధాన్యవైభవయుతుఁ డగుఁ, బడయును సద్గతిఁ బాదజుండు
గీ. నరకలోకంబును గనుంగొనఁడు కుయోని, యందుఁ బుట్టఁడు స్వాభిమతార్థములను
నెల్ల నీడేర్చుకొను నెవఁడేని తీర్థ, మహిమ చదివిన వినినను మానవేంద్ర. 570

గీ. సర్వపాపహరంబును శత్రుహరము, శాంతిదాయకమును మోక్షసాధనంబు
ధర్మ్యమును స్వర్గ్యమును బవిత్రమును సుఖము, కీర్తిదము దీర్థవంశానుకీర్తనంబు.

క. అకృతవ్రతులకుఁ జోరుల, కకృతాత్ములకశుచులకును ననృజుమతుల కా
స్తికభావశూన్యమానసు, లకుఁ దీర్థనిమజ్జనం బలభ్యము భూపా. 572

గీ. నేను జెప్పినరీతిని నీవు గూడ, నియమమును నాదరమును శ్రద్ధయును గలిగి
తీర్థసేవ యొనర్పుము పార్థివేంద్ర, పుణ్యమభివృద్ధి నొందును బుణ్యమున న. 573

గీ. రామునివిధంబునను బురూరవునిచంద, మున భగీరథుని తెఱంగునను యయాతి
వలె మహాభిషుఁడట్లు నిర్మలుఁడ వగుచు, వెలసెదవు తీర్థయాత్ర గావింతువేని.

క. జననాథ నేను నీకున్, వినిచినతీర్థములమహిమ విన్నను బఠియిం
చినను నెటువంటిపాతకి, యును బాపవిముక్తుఁ డగుచు నొందును సుగతిన్. 575

గీ. అనవుడుఁ దదుక్తులన్నియు విని దిలీపుఁ, డఖిలతీర్థాటనమునఁ గృతార్థుఁ డయ్యె
నశ్వమేధసహస్రము నాచరించి, నట్టిఫల మబ్బుఁ దీర్థపర్యటనమునను. 576

క. అనుటయు మహర్షు లెల్లరుఁ, గని సంతోషమును సూత కలుషహరముగాఁ
గను మంచివిశేషంబులు, వినిచితి విం కొకటి వినఁగ వేడుక యయ్యెన్. 577

ఆ. సకలతీర్థసేవ సలిపినఫల మొక్క, కర్మ మొనరుచుటనె కలుగ వలయు
నట్టికర్మ మేది యైనను గలదేని, తెలుపుమయ్య మాకుఁ దేటపడఁగ. 578

—: విష్ణుభక్తిమాహాత్మ్యకథనము :—

క. అని యడుగుటయును సూతుఁడు, కనుఁగొని వారలను గౌతుకం బొదవఁగ ని
ట్లనియె హరిభక్తి యొకటియె, యనువుగ నిడు నిఖిలతీర్థయాత్రాఫలమున్. 579

క. హరియె త్రిలోకారాధ్యుఁడు, హరియె సమస్తామరేశ్వరాధీశ్వరుఁడున్.
హరియె నిగమాగమాత్ముఁడు, హరికంటెను లేదు పర మిహపరంబులలోన్. 580

క. హరి హరి యని జపియించిన, సరగునను సమస్తమంత్రజపఫల మొదవున్
హరినామజపంబునకున్, సరి యైనజపంబు లేదు జగములయందున్. 581

క. హరినామమహామంత్రము, దురితపిశాచమును బాఱఁదోలును ద్రుటిలోఁ
బరమంత్రము లద్దానికి, సరి గా వేవియును నెంత సత్త్వంబున్నన్. 582

సీ. అఖిలతీర్థావగాహఫలంబు చేకొనుఁ, గేశవునకుఁ బ్రదక్షిణ మొనర్చి
గంగచందమున లోకము పావనము చేయు, నారాయణునిముందు నాట్య మాడి
తల్లిస్తన్యంబును ద్రావండు మరలను, మాధవునకుఁ బ్రణామంబు చేసి
వైవస్వతునిక్రూరవదనంబు గాంచఁడు, పుండరీకాక్షునిపూజ సలిపి

ఆ. చక్రపాణిదివ్యచరితంబు గీర్తించి, రూపుమాపు నఖిలపాపములను
శౌరిపదమునందు స్వాంతంబు నర్పించి, ముక్తుఁ డగు భవప్రసక్తినుండి. 583

క. హరిప్రతిమారూపంబును, దరిసించినవాఁడు మిగుల ధన్యుఁడు హరిపై
సరస మగునట్టికావ్యము, విరచించినవాఁడు జన్మవిరహితుఁడు సుండీ. 584

క. కరతాళము లొనరించుచు, హరియెదుటను బాటపాడునట్టినరుని దు
ర్భరపాతకౌఘ మెల్లను, గరతాడిత మైనరీతిఁ గడకున్ బోవున్. 585

ఆ. విష్ణుభక్తు లగుచు వెలసినవారలు, శ్వపచు లైన మ్లేచ్ఛజాతు లైన
నంద్యు లనిన నింక వసుధామరాదుల, మహిమ చెప్పఁ దరమె మాదృశులకు. 586

క. హరిగాథలు విని యెడుస, త్పురుషులసందర్శనమునఁ బూతాత్ముఁ డగున్
దురితౌఘము లొనరించిన, నరుఁడును నిఁక నేల తద్ఘనత్వము చెప్పన్. 587

క. తీర్థములలోన నుత్తమ, తీర్థము హరినామ మందు దిగుపుణ్యాత్మల్
తీర్థీకరింతు రఖిలముఁ, దీర్థము వేఱేల నామతీర్థముకంటెన్. 588

గీ. మస్తకమునందు విష్ణునిర్మాల్యతులసి, తాల్చినను దిన్న విష్ణుసాధర్మ్య మొదవు
నది హరిప్రీతిదాయక మది సమస్త,భువనపావన మది సాధుపూజితంబు. 589

క. హరిహరుల నభేదంబుగ, నరసెడిపుణ్యాత్ము లగుదు రపునర్భవు లా
పరమరహస్యము దెలియక, హరిహరులకు భేద మెంతు రజ్ఞులు జగతిన్. 590

క. హరికంటె హరుని వేఱుగఁ, బరికించెడివారు నరకపతితు లగుచు దు
ర్భరయాతనలను గుడుతురు, హరిహరులం దొకఁడు గూడ నరయఁడు వారిన్.

క. హరి తన్నుఁ గొలుచుచుండెడి, పురుషుం డజ్ఞాని యైన బుధుఁడైనను భూ
సురుఁ డైన శ్వపచుఁ డైనను, దరియింపఁగఁ జేయు భక్తతత్పరుఁ డగుటన్.

క. తనకంటెను దననామం, బున నధికం బైనశక్తి పురుషోత్తముఁ డుం
చినకతన విష్ణునామం, బునకు సమం బగుపదార్థములు లే వెందున్. 593

క. ఫలగౌరవమును నాయా, సలఘుత్వముఁ గానఁబడుటఁ జర్చింతురొ యే
కలుషాత్ములు హరికీర్తన, ఫలవిషయమునందు నరకపతితులు వారల్. 594

క. హరినామమహావజ్రము, దురితాద్రివిదారణము చతుర్భుజసేవా
చరణారుణప్రతాపము, పరితాపతమిస్రగర్వభంజనము సుఁడీ. 595

సీ. హరిపూజ గావించుకరములు కరములు, శ్రీపతికథ విను చెవులు చెవులు
బలివైరికడ కేఁగుపదములు పదములు, గరుడధ్వజునిఁ జూచుకనులు కనులు
నారాయణా యనునాలుక నాలుక, సరసిజాక్షుని మ్రొక్కుశిరము శిరము
కృష్ణా యనఁగ నిక్కుకేశముల్ కేశముల్, మాధవునిఁ దలంచుమనసు మనసు

గీ. నళిననాభునినిర్మాల్యతులసి మూరు, కొనెడినాసిక నాసిక కనకచేలు
పాదములపైని నెలకొనుప్రజ్ఞ ప్రజ్ఞ, దనుజహరునకు నర్పించుతనువు తనువు.

గీ. కృష్ణనామాక్షరము లాలకించినంతఁ, గనుల నశ్రులు పులకలు గాత్రములను
బొడమకుండెడిమనుజులు పుట్ట నేల, భువనచక్రంబునకు భారభూతులుగను. 597

క. నామోచ్చారణమాత్రము,చే మోక్షము నిచ్చుహరిని సేవింపంగన్
గామమ్ము లేనిమనుజ,స్తోమము వంచితము గాదె దుష్కర్మముచేన్. 598

ఆ. ఫలము లేనిచేయుపలుకులు పలుకుదు, రంతె కాని కృష్ణ యనెడునక్ష
రములు రెండు నోట రానీయ రెప్పుడును, బహుళపాపకర్మనిహతమతులు. 599

గీ. నాల్క యుండియుఁ గూడఁ గృష్ణా యటంచు
నొక్కపరి యైనఁ బిలువక యుండువారు
ముక్తిసోపానమున కెక్క మొనసి కూడఁ
బతన మొందెనభాగ్యవర్జితులు గారె. 600

సీ. హరిపాదపద్మంబు లంతరంగమునందుఁ, దాల్చిన వేళ యధ్వరము లేల
శిరముపై వైకుంఠచరణాంబుకణములు, చల్లుకొన్నను వేళ స్నాన మేల
సంకర్షణునినామసంకీర్తనంబును, జలుపుచుండిన వేళ జపము లేల
మధుసూదనునికథామహిమంబులను బ్రబో, ధము చేసినను వేళ దాన మేల
గీ. శౌరిగుణములు విని హర్షసాగరమున, మగ్నతను గన్న వేళ సమాధి యేల
యంబుజాక్షునిభక్తిరసంబు గ్రోల, మరగి యున్నను వేళ సామ్రాజ్య మేల. 601

క. హరిభక్తిసుధను గ్రోలెడి, నరులను గలిసర్పదంశనక్ష్వేళంబుల్
దురితహాలాహలమును నే, కరణి సమర్థంబు లగును గలఁగింపంగన్. 602

సీ. నరకంబులందు నానాక్లేశములు చెంది, యటుమీఁద నుత్థితుం డయ్యె నేని
స్థావరాద్యాకృతుల్ దాల్చి కర్మఫలంబు, ననుభవించి మనుష్యుఁ డయ్యె నేని
గర్భనివాస దుఃఖము దాఁటి శైశవ, బహుదోషనిర్ముక్తి నడసె నేని
యౌవనమందుఁ గామాంధ్యంబులోఁ జిక్కి, యెట్టకేలకును గట్టెక్కె నేని
గీ. వార్ధకంబున వ్యాధులు వ్యసనములును
బెరిఁగి మృతి చెంది మరలను నరక మొందు
నంతె కాని భవోన్ముక్తి నంద లేఁడు
హరిపదాంభోజములు గొల్వనట్టివాఁడు. 603

క. ఆయాసరహితజీవన, మాయాసము లేనిమరణ మచ్యుతచరణ
ధ్యాయికిఁ గాక తదన్యున, కాయత్తం బగునె యెంత యసురుసురైనన్. 604

క. బల మున్నయెడల వ్యర్థము, సలుపక మనుజుండు విష్ణుసాన్నిధ్యమునన్
జలుపంగ వలయు నృత్యం, బులు గానంబులును బంధమోచన మొదవన్. 605

క. ధన మున్నయెడల దుర్వ్యయ, మొనరింపక విష్ణుతృప్తి యొనరించుటకై
వినియోగపఱుపఁగాఁ దగు, ధనమున కదె ఫలము మోక్షదాయక మగుటన్. 606

క. దానము స్వర్గమునకు సో, పానం బగు విష్ణుభక్తిపరు లైనయనూ
చానులయెడ వినియుక్తం, బైనను నది ప్రీతిహేతు వగుటను హరికిన్. 607

గీ. మానసంబున స్మరియించుమాత్రమున నె, సకలదోషంబులను బాపి స్వపద మిచ్చు
నట్టిశౌరిని విడనాడునట్టివాఁడు, దీపముఁ ద్యజించి తమములోఁ దిరుగువాఁడు.

క. హరిపాదాంబువు గ్రోలిన, హరిగుణముల నెంచికొన్న హరికథ విన్నన్
హరినామము పేర్కొన్నను, హరిఁ గన్నను ముక్తి కరతలామలక మగున్. 609

క. హరిభక్తి కంతరాయము, తరుణీదృగ్జాల మందుఁ దగులుకొనక నే
ర్పరు లైనవార లగుదురు, చరితార్థులు హరిపదైకసంస్మరణమునన్. 610
క. మునులార కర్మయోగం, బున నారాధించుపుణ్యపురుషులను గనుం
గొనినట్లు హరి తదన్యులఁ, గనుంగొనఁ డహేతుకానుకంపాదృష్టిన్. 611
క. అనవుడుఁ దద్వాక్యంబులు, విని మానులు కర్మయోగవిషయము మాకున్
వినిపింపు మనుచు నర్థిం, చిన వారికి సూతుఁ డిట్లు చెప్పఁ దొడంగెన్. 612

—: కర్మయోగకథనము :—

క. మునులార మీరు నన్నడి, గినచందంబునను మున్ను కృష్ణద్వైపా
యనుని ఋషు లడుగుటయు నా, యనఘుఁడు వచియించె నిట్టు లమ్మానులకున్.
క. మునులకు మనుప్రజాపతి, వినిచెను మును కర్మయోగవిధ మదె మీకున్
వినిచెద నేను సమాహిత, మనస్కు లయి వినుఁడు లోకమంగళకాముల్. 614
ఆ. కర్మయోగ మనినఁ గాని సనాతన, ధర్మ మనినఁ గాని తత్త్వ మొకటె
యది శ్రుతిప్రసిద్ధ మది త్రికాలాబాధ్య, మది యభీప్సితము జనార్దనునకు. 615
సీ. ధాత్రిని బ్రాహ్మణక్షత్త్రియవైశ్యశూ, ద్రు లనంగ వర్ణముల్ గలవు నాల్గు
వానిలోఁ బూర్వపూర్వంబుగా నుండువ, ర్ణంబు శ్రేష్ఠంబు జన్మంబువలన
నుపనయనం బగ్నిహోత్ర మధ్యయనముఁ, గల వాదివర్ణత్రికంబునకును
నాల్గవవర్ణంబునకుఁ ద్రివర్ణంబుల, సేవ ధర్మంబుగాఁ జెప్పఁబడియె
గీ. వర్ణములు నాలుగింట నేవర్ణ మేని, స్వస్వధర్మాచరణమును వదల కుండె
నేని స్వర్గంబునకు నేఁగు మానె నేని, నిరయమున కేఁగు నిదె శాస్త్రనిర్ణయంబు.

—: బ్రహ్మచర్యాశ్రమధర్మకథనము :—

సీ. అవనిసురుండు గర్భాష్టమవర్షమం, దైన నష్టమవర్షమందు నైన
విహితోపనయనుఁడై వహియించి యజినవా, సోదండమేఖలాసూత్రములను
గావించుకొనుచు సంధ్యావందనంబును, నాచరించుచు నగ్న్యుపాసనంబు
భుజియించుచును భైక్షభోజనంబును శయ, నించుచు రేయి స్థండిలమునందు.
గీ. బ్రహ్మచర్యవ్రతంబు గాపాడుకొనుచు
నప్రమత్తతతోడ నహర్నిశంబు
గురునిసాన్నిధ్యమున భక్తి కుదురుకొనఁగఁ
జదువ వలయును వేదముల్ శాస్త్రములును. 617
గీ. బ్రహ్మచేతను నిర్మింపఁబడియెఁ బూర్వ
మందుఁ గార్పాసమునఁ ద్రిగుణాత్మకముగ
నొక్కసూత్ర మయ్యది కర్మయోగమునకుఁ
దాల్ప వలయును ద్విజులు ప్రధానముగను. 618

ఆ. బద్ధశిఖుఁడు గాక బ్రహ్మసూత్రము లేక, సలుపునట్టికర్మములు ఫలంబు
నీయఁజాలకునికి నెపుడును బ్రహ్మసూ, త్రమును శిఖయు ద్విజుఁడు తగదు విడువ.

గీ. దక్షిణభుజంబు నెత్తి యదక్షిణాంస
మందుఁ దాల్చిన నుపవీత మనియుఁ గంఠ
మునను వేరుగ ధరియించినను నివీత
మనియు నాసూత్రము సమాహ్వయముల నొందు. 620

క. మౌనీంద్రులార సవ్యం, బైనభుజం బెత్తి దక్షిణాంసంబున సం
ధానింపఁబడిన నది ప్రా, చీనావీతం బటంచుఁ జెప్పంగఁబడున్. 621

సీ. జపమును జలిపెడిసమయంబునను నధ్య, యనమును నొనరించునవసరమున
నగ్న్యగారమున నున్నప్పుడు హోమంబు, గావించుచుండెడికాలమందు
సాధుసంగమమందు సంధ్యలయందును, ధరణీసురులసన్నిధానమందు
గురువును సేవించుతరుణంబునందు భో, జనకాలమందు గోస్థానమందు

గీ. దైవకార్యంబు లొనరించుతరుణమందు, ద్విజుఁడు వర్తింప నగు నుపవీతి యగుచు
నగును నుండంగను నివీతి యయి మనుష్య, కార్యముల నొనరించెడికాలమందు.

క. మౌనీశ్వరులార ద్విజుం, డైనసరుం డెట్టిస్థానమం దున్నను బ్రా
చీనావీతిగ నుండం, గా నగుఁ బితృకార్యకరణకాలమునందున్. 623

గీ. లౌకికజ్ఞాన మైన నలౌకిక మగు, జ్ఞాన మైన నాధ్యాత్మికజ్ఞాన మైనఁ
గలుగఁ జేసినగురునకుఁ జలుప వలయు, నాదియందు ద్విజుం డభివాదనంబు.

గీ. సవ్యపాదంబు సవ్యహస్తమున దక్షి
ణాంఘ్రితలమును దక్షిణహస్తమునను
దాఁకుచును దేశికునకు వందనము చేయఁ
దగును బ్రాహ్మణుఁ డగువాఁడు తప్పకుండ. 625

గీ. అడుగ నగుఁ గుశలంబు బ్రాహ్మణుని నడుగ
నగును క్షత్త్రియుని ననామయంబు నడుగ
నగును వైశ్యుని క్షేమంబు నడుగ నగును
నవరవర్ణుని నారోగ్య మవనిసురుఁడు. 626

వ. జనకుండును జననియును నుపాధ్యాయుండును జ్యేష్ఠభ్రాతయును మహీపతియును
మాతులుండును శ్వశురుండును బితామహుండును మాతామహుండును వర్ణ
శ్రేష్ఠుండును బితృవ్యుండును మాతామహియును గురుపత్నియును బితృసోదరి
యును మాతృసోదరియును శ్వశ్రువును బితామహియును జ్యేష్ఠసోదరియును
ధాత్రియును గురువులుగాఁ జెప్పఁబడిరి. 627

ఆ. కూరుచుండు మనుచు గురువు చెప్పకమున్నె
కూరుచుండుటయును గురునియెదుట
నావలించుటయును హసియించుటయు నొడల్
విఱుచుకొనుటయును వివేకమడంచు. 632

గీ. గురువునకుఁ జెప్పకుండఁగా నరుగుటయును
జరణములు చాఁచుకొనుటయు గురునియెదుట
గురునియాసనశయ్యాదిపరికరముల
నాక్రమించుటయును దుష్కృతావహములు. 633

క. గురు వధ్యాపనమునకున్, బరాఙ్ముఖుఁడు గాక యుండుపర్యంతము త
త్పరిసరమున ననుదినమును, బరమోత్సాహంబుతోడఁ బఠియింపఁ దగున్.

క. గురునకుఁ గుశపుష్పాదులు, నిరతంబును దెచ్చియిచ్చి నియమంబునఁ ద
త్పరిచర్య చేయుచుండినఁ, జరితార్థత్వంబు బ్రహ్మచారికిఁ గలుగున్. 635

ఆ. గురుని పేరు పేరుకొనఁగూడదు పరోక్ష,మందుఁ గూడ గురుని ననుకరింపఁ
జనదు గమనమునను సంభాషణమునను, జేష్టితమున నెట్టిచేఁతనైన. 636

క. గురునియెడన్ వర్తించిన,వరుసను ఛాత్త్రుండు సతము వర్తింపనగున్
గురుపత్నీసుతబంధుని,కరమందును లోప మించుకయు లేకుండన్. 637

గీ. గురులలోపల మొదటియేగురు విశేష,ముగను బూజ్యులు వారిలో మొదటిముప్వు
రధికు లందును జనని యత్యంతపూజ్య, తన్ను గర్భంబునను మోసి కన్నకతన.

గీ. తల్లితోడ సమం బైనదైవతంబు, లేదు పితృతుల్యుఁ డగువాఁడు లేఁడు గురువు
కాన వారలపరిచర్యకంటె నధిక, మైనకార్యము లే దెందు నాత్మజునకు. 639

క. జననీజనకులు తనుజ, న్మనిగుణములచేత మోదమును జెందిన న
త్తనయుండు సకలధర్మం, బును బడసినవాఁడ తత్ప్రమోదముకతనన్. 640

క. త్రికరణములచేతను దం, డ్రికిఁ దల్లికిఁ బ్రియము గొలుపుకృత్యములను జే
యక యుండ రాదు తనయుం, డొకనాఁడును వారిఋణము నోపమిఁ దీర్పన్.

క. జననీజనకులవలనను, ననుజ్ఞ గొనకుండ నన్య మగుధర్మంబున్
బొనరింప రాదు తనయుఁడు, తనయుచ్చైర్గతికి నది నిదానం బగుటన్. 642

క. ఒనరించి గురునిపరిచ,ర్యను వానియనుజ్ఞ వడసి యరుదెంచినశి
ష్యునకున్ విద్యాఫల మిహ, మునఁ బరమున స్వర్గలాభమును బ్రాప్తించున్.

క. జనకసముని జ్యేష్ఠభ్రా, తను నవమానించినట్టి తమ్ముఁడు గూలున్
దనచేసినదుష్కర్మము,నను జేసి యపారఘోరనరకములందున్. 644

క. తనభుజమున భూభారం, బును దాలిచి సుతులఁ దండ్రివోలెన్ బ్రజలన్
మనిచెడిభూమీంద్రునకున్, జనుఁ గావింపంగఁ బూజ జనముల కెల్లన్. 645

గీ. జ్ఞానకర్మగుణోపేతు లైనఁ గూడ, క్షత్త్రియాదులు భూమినిర్జరులవలనఁ
గూడ దభివాదనంబును గొనఁగ విప్రు, లఖిలవర్ణంబులకుఁ బూజ్యు లగుటఁ జేసి.

గీ. బ్రాహ్మణుల కగ్ని గురువు వర్ణముల కెల్ల, గురువు విప్రుఁడు నాతికి గురువు భర్త
యందఱకుఁ గూడను గురు వభ్యాగతుండు, కాన నభ్యాగతునిపూజ గాదు విడువ.

గీ. అఖిలజనులకుఁ గూడ విద్యయును గర్మ, మును వయస్సును బాంధవ్యమును ధనంబు
పూజనీయంబు లగు నందుఁ బూర్వపూర్వ, ముత్తరోత్తరమునకంటె నుత్తమంబు.

గీ. మార్గ మీయంగ వలయు బ్రాహ్మణున కంధు, నకును రోగికి దుర్బలునకును భార
వాహునకు భూపతికి నతివకును వృద్ధు, నకును నెంతటివాఁడేని న్యాయ మదియ.

గీ. శిష్టగృహములనుండి తెచ్చికొని భిక్ష, దినదినంబును నది నివేదించి గురున
కతని యనుమతి గొని తిన నగును మఱాని, యగుచు వ్రతదీక్షితుం డైనయట్టివాఁడు.

గీ. గురుకులమునందు దాయాదకులమునందు
బంధుకులమందుఁ దగ దొనర్పంగ భిక్ష
పరగృహంబులు లేకున్నఁ బరిహరించి
పూర్వపూర్వంబు తగుఁ బరంబున గ్రహింప. 651

గీ. కూడ దేకాన్నమును దినఁ గూడ దేఁగ, నధరవర్ణాసవర్ణసంస్థాయములకు
భిక్ష యాచింపఁగా వ్రతదీక్షితుండు, వ్రతికి భిక్షాశనం బుపవాససమము. 652

గీ. భూసురుండు భవచ్ఛబ్దపూర్వకముగ, క్ష్మావరుండు భవచ్ఛబ్దమధ్యముగను
నూరుజుండు భవచ్ఛబ్ద ముత్తరముగ, నడుగ నగు భిక్ష బ్రహ్మచర్యంబునందు.

క. అన్నంబును బూజించిన, నన్నంబును జూచి హర్ష మందిన నపుడా
యన్నము ప్రసాదగుణసం, పన్నం బగు టొండె గాక ప్రతిహర్షించున్. 654

క. అన్నంబును నిందించిన, నన్నమె దుష్కృతము లెల్ల నాపాదించున్
దిన్నను నధికముగను నా, యన్నమె యుడిగించు నాయురారోగ్యములన్. 655

గీ. ప్రాఙ్ముఖుం డయి గాని యహస్కరునకు, నభిముఖుం డయి గాని నిత్యమును నన్న
మారగింపంగ వలయును నంతె కాని, యారగింపంగఁ గూడ దుదఙ్ముఖముగ.

వ. స్నానభోజనపానంబు లొనరించినప్పుడును నిద్దురించి లేచినప్పుడును రథ్యావ
సర్పణంబునందును నోష్ఠావలేహస్పర్శంబులందును వసనధారణంబునందును
రేతోమూత్రపురీషోత్సర్గంబులందును నవాచ్యభాషణంబునందును నిష్ఠీవనంబు
నను నధ్యయనారంభమందును గాసశ్వాసంబులందును జత్వరంబు గాని శ్మశా
నంబు గాని త్రొక్కినప్పుడును సంధ్యాకాలంబులందును చండాలమ్లేచ్ఛ సంభాష
ణంబునందును స్త్రీ శూద్రోచ్ఛిష్ట భాషణంబునందును ఉచ్ఛిష్టపురుష దర్శ
నంబునందును రక్తపాతంబునందును దుమ్మినప్పుడును నాసామలవిసర్జనంబు
గావించినప్పుడును నమేధ్యస్పర్శంబునందును నప్రయతజన స్పర్శంబునందును

జాఱినవస్త్రంబు స్పృశియించినప్పుడును గేశస్పర్శంబు గావించినప్పుడును శౌచార్థి
యగువాఁ డాచమింప వలయు. 657

సీ. క్షారము గాక యుష్ణము గాక ఫేనబు,ద్బుదములు లే కుండునుదకమునను
నాచమింపఁగఁ దగు నాసీనుఁడై ప్రాఙ్ముఖముగఁ గాని యుదఙ్ముఖముగఁ గాని
యాచమింపఁగఁ గూడ దాసనపాదుకా, స్థితుఁ డగుచును నన్యచిత్తుఁ డగుచుఁ
దల్పస్థుఁ డగుచును జల్పించుచును హసిం, చుచును బోవుచును జూచుచును దెసలు
గీ. కరము జానువునకు బహిర్గతము చేసి,నట్టిఁ డగుచును నుత్థితుఁ డగుచు సూత్ర
రహితుఁడగుచునునంగుళివిహితశబ్దుఁ,డగుచుసలిలస్థుఁడగుచునునశుచియగుచు.

గీ. శిరమునను గంఠమునను బ్రావరణ మెనయ
నుండఁగను ముక్తకేశశిఖుండు గాక
చేసికొని పాదశౌచంబు చేయ వలయు
నాచమనమును శుద్ధతోయంబుచేత. 659

గీ. ఆచమింపఁగ రాదు వర్షాంబువునను, నేకహస్తార్పితమును నుద్ధృతము నైన
జలమునను వీక్షితము గానిసలిలమునను, నావిలజలంబునను బ్రదరాంబువునను.

గీ. ఆచమనసలిలము హృదయమును జొచ్చె
నేని విప్రుఁడు కంఠము నెనసెనేని
క్షత్రియుఁడు ప్రాసితం బైనమాత్ర వైశ్యుఁ
డతివయును శూద్రుఁడు స్పృశించినంత శుచులు.

సీ. అంగుష్ఠమూలంబునం దుండు రేఖయం,దును బ్రాహ్మతీర్థంబు తనరుచుండు
స్థితిని గైకొనియుండుఁ బితృతీర్థ మంగుష్ఠ,తర్జనీయుగళమధ్యంబునందుఁ
దనరారుఁ గాయతీర్థంబు కనిష్ఠికా,నామికాయుగమూలధామమందు
నొనరు నంగుళ్యగ్రమున దైవతీర్థంబు, వెలయు నాగ్నేయ మంగుళులనడుమ
గీ. నదియె సౌమికతీర్థాహ్వయమును బడసెఁ, గానఁ దీర్థవిభేదంబు గాంచి మొదట
నాచమనహోమతర్పణార్ఘ్యాదివిధులు, సలుప నగు ధర్మమునబుద్ధిగలద్విజుండు.

వ. ఇంక నాచమనవిధానంబు వచియించెద.

—: ఆచమనవిధికథనము :—

సీ. ప్రయతుఁడై బ్రాహ్మతీర్థమున ముందుగ జల, ప్రాశనంబును ద్రివారంబు సలిపి
యోష్ఠముల్ తుడిచి యంగుష్ఠమూలంబున,స్పృశియించియంగుళిత్రితయమునను
దరువాత నంటి నేత్రములను రెంటిని, గూడ ననామికాంగుష్ఠమును
బిమ్మట నాసాపుటమ్ము నంగుష్ఠంబు, చేతను దర్జనిచేతఁ దాఁకి
గీ. యంతమీఁదను శ్రోత్రద్వయంబు ముట్టి, కొని కనిష్ఠికచేత నంగుష్ఠమునను
బైని హృదయంబు శిరమును నుపస్పృశింప, వలయుఁ గ్రమముగ నెల్లయంగుళులచేత.

సీ. హరిహరబ్రహ్మలు హర్షించెదరు త్రివా, రంబు చేసినజలప్రాశనమునఁ
బరిమార్జనమున నుపస్పర్శమునను హ, ర్షింతురు యమునయుఁ ద్రిపథగయును
నయనసంస్పర్శంబునను బ్రీతు లగుదురు, ద్వాదశాత్ముఁడును జైవాతృకుఁడును
నానంద మొందుదు రాశ్వినేయులు నాసి, కాపుటసంస్పర్శకరణమునను
గీ. శ్రవణసంస్పర్శమునఁ దృప్తు లవుదు రనలుఁ
డనిలుఁడును సంతసించెద రఖిలసురులు
హృదయసంస్పర్శనమున సంప్రీతి నొందుఁ
బరమపురుషుఁడు మస్తకస్పర్శనమున. 665

సీ. చైత్యంబునందు గోష్ఠమునందు నదియందు, గోమయంబునయందుఁ గూపమందు
వల్మీకమందు శాద్వలమందు బిలమందుఁ, గాష్ఠంబునందు మార్గంబునందు
నగ్నియందు జలంబునందు భస్మమునందు, దేవాలయమునందుఁ దీర్థమందు
గర్తంబునందు వృక్షమునందు గిరియందుఁ, దోయాంతికమునందు ఛాయయందు
గీ. నాకసమునందు నుద్యానమందు క్షేత్ర, మందు శృంగాటకంబునయందు నూష
రంబునందు శ్మశానదేశంబునందుఁ, జలుప రాదు విణ్మూత్రవిసర్జనంబు. 666

సీ. అగ్నికిఁ జంద్రున కాదిత్యునకు మహీ, సురుల కావులకును గురువులకును
దేవాలయములకు దైవతంబులకును, నంబువులకును నితంబినులకు
నభిముఖుం డగుచును నరుగుచు నుత్థితుం, డగుచును సద్రవ్యహస్తుఁ డగుచు
జోతియు దెసలుఁ జూచుచు నగ్నుఁ డగుచును, బాదుకాఛత్త్రోపపన్నుఁ డగుచు
గీ. విడువ రాదు విణ్మూత్రముల్ విడువ వలయు
దక్షిణశ్రవణమున సూత్రమును జేర్చి
యుత్తరాభిముఖంబుగా నుండి పగలు
దక్షిణాభిముఖంబుగాఁ దనరి రేయి. 667

వ. పాంసులంబును గర్దమంబును బరశౌచశిష్టంబును మార్గస్థంబును నూషరదేశస్థితంబును దేవాలయస్థితంబును గూపస్థితంబును జలస్థితంబును వల్మీకస్థితంబునుం గానిమృత్తికను గూలంబునుండి గ్రహియించి నిర్మలం బగునుద్ధృతోదకంబుచే లేపగంధంబులు వోవునట్లు శౌచంబు గావించుకొన వలయు. 668

సీ. ధరియింప రాదు గంధము మాల్యములు ఛత్త్రి, పాదుక లంజనాభ్యంజనములు
దర్శింప రాదు నృత్యంబును విన రాదు, గానవాదిత్రనిస్వానములను
కా రా దధీనుండు కామలోభక్రోధ, సంతోషనిద్రావిషాదములకు
భుజియింప రా దాజ్యమును క్షారలవణముల్, పర్యుషితంబును భక్ష్యములును
గీ. పరుల బాధింప రా దతిభాషణములు, పలుక రాదు కుచేష్టలు సలుప రాదు
దాంభికత్వంబు కల నైనఁ దాల్ప రాదు, బ్రహ్మచర్యవ్రతంబునఁ బరగుద్విజుఁడు.

సీ. ఋగ్వేదమును బఠియించిన సురలకు, క్షీరాహుతినిఁ బ్రీతి చేసినట్లు
యజురధ్యయనమున నమరుల దధ్యాహు,తిని సంతసంబు నొందించినట్లు
సామంబు చదివిన సర్పిరాహుతిచేత, బర్హిస్సుఖులఁ దృప్తిపఱచినట్లు
యాకలించిన నథర్వామ్నాయమును దేవ,తలను మధ్వాహుతిఁ దనిపినట్లు
గీ. యంగములును బురాణేతిహాసములును, దెలిసికొను నెడల వపాహుతులను జేసి
యాదితేయుల నతులితాహ్లాదవార్ధి,యందుఁ దేలించుచును నోలలార్చినట్లు.
గీ. వేదశాస్త్రపురాణాదివిద్య లెల్ల, విడిచి పరవిద్యలకుఁ బాలుపడుద్విజుండు
వేదబాహ్యుండు భాషింప రాదు కూడి, వానితోడను బ్రాహ్మణుఁ డైనవాఁడు.
గీ. వేదపాఠమాత్రంబు గావించి దాని, యర్థమును గుర్తెఱుంగక యంతతోడఁ
దృప్తుఁడై యుండునట్టిపృథ్వీసురుండు, పంకమునఁ బడ్డవృషభముపగిదిఁ గుందు.
ఆ. బ్రాహ్మణుఁడు సహస్రపరమయు శతమధ్య, యును దశావరయును ననఁగ వెలసి
నట్టి వేదమాత నహరహంబు జపింప, వలయు నెల్లవిద్దియలకు మొదట. 673
గీ. అదియె జపయజ్ఞ మదియె బ్రాహ్మణులశక్తి
యదియె మోక్షప్రదాయక మైనవిద్య
దానిఁ బోలంగ లేవు వేదములు గాని
శాస్త్రములు గాని యెట్టిశస్త్రములు గాని. 674
క. ఒకప్రక్కను గాయత్రిని, నొకప్రక్కను శ్రుతుల నెల్ల నుంచి తులను మీఁ
దికి నెత్త స్వయంభువు దే, లికగా వేదములసిబ్బి లేచెను బైకిన్. 675
క. గాయత్రి లోకపావని, గాయత్రియె వేదమాత గాన జగములన్
గాయత్రిజపముతో సరి, చేయం దగుజపము లేదు క్షితిదేవులకున్. 676
గీ. అర్థసంధాన మొదవ గాయత్రి జపము, నహరహంబును శ్రద్ధతో నాచరించు
నట్టిధాత్రీసురుండు దేహాంతమందు, నపునరావృత్తి యగుధామమందుఁ జేరు.
గీ. మొదటఁ బ్రణవంబుఁ జేరిచి పిదప మూఁడు
వ్యాహృతులు గూర్చి సావిత్రి నంతమందు
సంఘటించినమంత్రరాజంబుకంటెఁ
దారకము లేదు భూమిబృందారకులకు. 678
వ. శ్రావణపూర్ణిమయందుఁగాని యాషాఢపూర్ణిమయందుఁ గాని భాద్రపద పూర్ణిమయందుఁ గాని బ్రాహ్మణునకు వేదోపాకర్మంబును బుష్యమాసంబునఁ బూర్ణిమయందుఁ గాని రోహిణియందుఁ గాని వేదోత్సర్జనబును విధియింపం బడియె. శుక్లపక్షంబునందు వేదంబులును గృష్ణపక్షంబునందు వేదాంగపురాణాదులును నధ్యయనంబు గావింప వలయు. 679

గీ. శౌచమును నియమములును సద్గుణములు, గలిగి యున్నట్టిశిష్యునిఁ గడకుఁ జేర్చి
యనుదినంబును జెప్పఁగా నగును గురువు, శ్రద్ధతోడను వేదశాస్త్రముల నెల్ల.
క. దరినుండి సేవ చేయుచు, నిరతము శుశ్రూషుఁ డగుచు నియమము లెల్లన్
బరిపాలించెడిఛాత్త్రునిఁ, గరుణింపనిగురువు వానికలుషము నొందున్. 681
గీ. అన్నదాతయు గురుపుత్రుఁ డంబుదాత
శక్తుఁడును ధార్మికుండును జ్ఞానదాత
శుచియు శుశ్రూషుఁడును గృతజ్ఞుఁడును సాధు
వాప్తుఁడును ఛాత్రు లుచితవిద్యల నొసంగ. 682
వ. భూకంపంబును నశనిపాతంబును నుల్కాపాతంబును నగ్న్యుత్పాతంబును నుపల రుధిరపాంసువర్షంబులును నకాలమేఘప్రాదుర్భావంబును మున్నగువిప్లవంబు లందును మెఱపు మెఱసినప్పుడును మేఘంబు గర్జించునప్పుడును వర్షంబు గురియు నప్పుడును బ్రతిసూర్యుండును నింద్రధనువును దోఁకచుక్కయును నుద్భవించి నప్పుడును మహితాత్ములు గ్రామంబునకు వచ్చినప్పుడును సంధ్యాకాలంబులం దునుహస్త్యశ్వాదుల నధిష్ఠించినప్పుడును ఋతుసంధియందును రోదనసమయంబు నందును సలిలంబునం దుండునప్పుడును నర్ధరాత్రంబునందును విణ్మూత్రంబులు విసర్జించునప్పుడును నుచ్ఛిష్టుండు గా నుండునప్పుడును శ్రాద్ధభోజనంబు గావించి నప్పుడును శ్మశానంబునందును వృషలసన్నిధియందును మంచు గురియునప్పు డును గ్రామనగరంబులందు దుర్గంధము వ్యాపించినప్పుడును జంద్రపరివేషంబు నందును సూర్యపరివేషంబునందును సప్తమీచతుర్దశ్యమావాస్యాపూర్ణిమా ప్రతిపత్తులందును నష్టకలయందును గ్రామమున శవం బున్నప్పుడును జండా లుండు గనంబడుచుండునప్పుడును బతితసకాశంబునందును బ్రదోషంబునందును బాదప్రక్షాళనోత్సాదనానులేపనాదిస్వైరకర్మంబులందును శ్లేష్మాతక మధుకశాల్మలికోవిదారకపిత్థవృక్షచ్ఛాయలందును జాతాశౌచమృతా శౌచంబులు ప్రాప్తించినప్పుడును సంగ్రామోద్యానదేవతాసమీ పంబులందును గాళ్ళుచాఁచుకొనియును రెడ్డిగము వైచుకొనియును శయనించి యును వేదాధ్యయనంబు చేయ రాదు. మఱియును సబ్రహ్మచారియును నాచార్యుండును రాజును మరణించినప్పుడును గ్రహణసూతకంబునందును ద్విరాత్రంబు లధ్యయనంబు గావింప రాదు. తత్సమయంబులందు రాక్షసులు హింసింతురు గావున నయ్యవి యనధ్యాయంబులుగాఁ బరిగణింపంబడియె. సంధ్యో పాసనాబ్రహ్మయజ్ఞాదినిత్యకర్మంబుల కనధ్యాయంబులు లేవు. మఱియును గ్రహణంబును భూకంపంబును నశనిపాతంబును నుల్కాపాతంబును నగ్న్యుత్పా తంబును మున్నగువిప్లవంబులం దప్ప వేదాంగధర్మశాస్త్రపురాణేతిహాసాదు లకును ననధ్యాయంబులు లేవు. 683

—: గృహస్థాశ్రమధర్మకథనము :—

గీ. ఉక్తధర్మానుపాలనయుక్తుఁ డగుచు,శ్రద్ధతో వేదశాస్త్రముల్ చదివి ద్విజుఁడు
పిదప గురుదక్షిణ నొసంగి తదనుమతిని, నవల నభ్యంజనస్నాన మాచరించి.

సీ. యజ్ఞోపవీతద్వయంబును వైణవ, దండంబు సలిలకమండలువును
స్వర్ణకుండలములు ఛత్త్రి ముష్ణీషంబు, పాదుకల్ గంధ ముపానహములు
వసనయుగ్మంబును గుసుమమాల్యములును, మంగళవస్తుసంభారములును
ధరియించి లోకసందర్శనీయాకృతి, గలిగి యుత్సాహసంకలితుఁ డగుచు

గీ. మంగళాకారయును నసమానగోత్ర
జాతయు సవర్ణయును శీలశౌచయుతయు
నాత్మసదృశయు నైనకన్యను గ్రహింప
వలయు విధియుక్తముగ గృహ్యావహ్ని యెదుట. 685

గీ. ఆర్షపరిణయమందుఁ గన్యాప్రదాత, గోద్వయమ్మును దగును గైకొనఁగ నంతె
కాని యేపరిణయమునం దేని తగదు, కన్య నిచ్చినవాఁడు శుల్కము గొనంగ.

క. కన్యాశుల్కము గొన్నను, గన్యావిక్రయమువలనఁ గలిగెడియఘముల్
గన్యాప్రదాత చెందును, మాన్యులు గమియింప రాకుమార్గమునందున్. 687

క. ఋతుకాలగామి యగుచును, బ్రతిషిద్ధదినంబు లుడిగి ప్రమదామణితోఁ
గుతుకమున గృహ్యధర్మము, లతిక్రమింపక గృహస్థుఁ డగు వర్తింపన్. 688

గీ. శ్రాద్ధదినమునఁ గాని పర్వమునఁగాని, తరుణితోఁ గూడినను గల్గు ధర్మహాని
పగటిపూఁట రమించిన మగువతోడ, సంభవించు నాయుష్యనాశనము గృహికి.

గీ. పొందఁ దగు ఋతుకాలమునందు సతిని, నామె ప్రార్థించినను నపత్యాభిలాష
మాత్మలోఁ గల్గినను దన కంతె కాని,యన్యమార్గంబు గృహికి లే దతివ నెనయ.

క. ఋతుకాలగామియును నిజ, సతీరతుండును గృహస్థసంజ్ఞాశబ్దా
న్వితు లయ్యు బ్రహ్మచారుల, సతతంబును భూరిపుణ్యశాలులు వారల్. 691

గీ. ఋతువు షోడశరాత్రు లాఋతువునందుఁ, బ్రథమదినములు నాల్గును బాపవిధుని
మూలమఘలను వర్జించి ముదిత నెనయ, నగును శ్రేయోభిలాషి యైనట్టిగేస్తు.

గీ. సన్నిధానంబునను ఋతుస్నాత యైన, భార్య యుండంగఁ దద్భోగపరుఁడు గాక
యుండ రా దట్లు లుండిన నుందు రతని, పితరు లా నెల యాపెశోణితమునందు.

క. కావున ఋతుదివసంబులు, గావింపక వితగ సతిని గవయఁ దగు సుతుల్
కావలసిన సమరాత్రులఁ, గావలసిన సుత లయుగ్మకాలమునందున్. 694

వ. మఱియును సమానాధికులతో సఖ్యంబును ధర్మగోపనంబును బాపఖ్యాపనంబును గావించుచు సర్వభూతానుకంపాన్వితుం డగుచు భార్యాసంరక్షణంబు గావించుకొనుచు వయఃకర్మార్థశ్రుతాభిజనంబులకుం దగునట్లు ధర్మంబు నాచ

రించుచుఁ బరధర్మంబు నుజ్జగించుచు శ్రుతిస్మృత్యుదితంబును సాధుజనసేవితంబును నగునాచారంబును సేవించుచుఁ బితృపితామహాదు లేఁగినసన్మార్గంబున నేఁగుచు నిత్యస్వాధ్యాయశీలుండును నిత్యయజ్ఞోపవీతియును సత్యవాదియును జితక్రోధుండును లోభమోహావర్జితుండును సావిత్రీజపపరాయణుండును మాతాపితృసేవాపరుండును బ్రాహ్మణహితకరుండును దాతయును యజ్వయును శ్రాద్ధకర్తయును దేవతారాధననిరతుండును నగుచు గృహస్థుండు వర్తించెనేని బ్రహ్మలోకంబున నిత్యనివాసంబు వడయు. 695

గీ. ఆశ్రయించుచు ధర్మకామార్థములను
నాచరించుచు నతిథిదేవార్చనలను
క్షమయు దయయును గలిగినజనుఁడు పాత్రుఁ
డగు గృహస్థాహ్వయమున కనర్హుఁ డొరుఁడు. 696

గీ. శమము దమమును విజ్ఞానసత్యములును
క్షమయు నధ్యాత్మతత్త్వనిష్ఠయును దయయు
క్ష్మాసురునిలక్షణంబులు గా నెఱింగి
యప్రమత్తుఁడు గా నుండ నగు ద్విజుండు. 697

సీ. ధర్మార్థకామసంతతిసేవయందు నె, వ్వఁడును బ్రమాదంబు వొంద రాదు
ధర్మంబు లేనియర్థము గాని కామంబు, గాని కాదు విముక్తికారణంబు
ధర్మసాధన మైనతనువును రక్షించు, కొన నగు నేవిధంబునను నైన
దేహంబు లేకున్న దేవదేవుం డైన, వాసుదేవునిఁ జెంద వశము గాదు

గీ. ధర్మ మన్నను హరి యన్నఁ దత్త్వ మొకఁడె
ధర్మశూన్యుండు హరిని జెందంగ లేఁడు
గాన ధర్మంబు సేవించుమానవుండె
శ్రీపతిపదాంబుజాతసంసేవకుండు. 698

సీ. ఏభూతమున కేని హింస చేయఁగ రాదు, తృష్ణకు లోఁగి వర్తింప రాదు
ధర్మవర్జితులును దుర్మతులును వ్యాధు, లుండుగ్రామంబునం దుండ రాదు
పరులమర్మంబులు బయలు పెట్టఁగ రాదు, పరులచిత్తము నొవ్వఁ బలుక రాదు
వసియింప రాదు పుల్కసమూర్ఖగర్హిత, చండాలపతితసూచకులతోడ

గీ. నన్నృతమును నహితంబును నప్రియమును, బలుక రాదు వివాదంబు సలుప రాదు
సాధువులతోడ గురులతో సతులతోడ, వశుఁడు గా రాదు షడ్వైరివర్గమునకు.

క. గురువునకు దేవునకు భూ, సురునకు దానంబుసేయఁ జూచెడిదాతన్
బురికొల్పక వారించిన, నరునకు గతి లేదు వేఱె నరకము దక్కన్. 700

గీ. విషము విషము గాదు విషము బ్రహ్మస్వము, దాని నపహరించువానికింక
లేదు పాతకంబు లే దపమృత్యువు, లేదు శాంతనంబు లేదు కీడు. 701

క. దేవస్వ మపహరించినఁ, గావించు నరోగితోలను గావున వసుధన్
పోవునపుడని కూడదు, దేవస్వము నపహరింప దేవుండోపఁడు. 702

క. అనవరతంబును యాచన, యనుపాపము చేయుచుండునఘనూధమయా
చనకుని యాచించెనేని, ద్యునకున్ దత్ప్రాణహరణదోషము వచ్చున్. 703

గీ. ఫలము గాని పత్త్రిము గాని జలము గాని
తృణముసుం గాని తుదకు మృత్తికయుఁ గాని
పరుల ద్రవ్యంబు కొనఁ రాదు సరికి మొదవు
దానఁ బత్త్రాపహారమనుమతి లేనియెడల. 704

క. ఫలమూలకాష్ఠతృణములు, సలిలములును బుష్పములును శాకములును దొం
గిల వచ్చు ధర్మమునకై, కలుగదు చౌర్యమున నొదవుకలుషము దానన్. 705

క. జపతపములు ధర్మములును, గపటంబునఁ జేయఁ దగదు కావించినచో
నుపయోగవిరహితములై, విపరీతఫలంబు ననుభవింపఁగఁ జేయున్. 706

ఉ. ఒక్కనిసేవ పెట్టుకొని యొక్కనివేషము దాల్చి వృత్తికై
యక్కడ నక్కడన్ దిరుగునట్టియభాగ్యులు వారిపాపముల్
పిక్కటిలంగఁ బెట్టికొని పెంచినదేహములందుఁ జచ్చి పైఁ
బొక్కుచుఁ బాపయోనులను బుట్టుదు రంతె ఫలంబు దానికిన్. 707

గీ. యోనిసంబంధమును యాజ్ఞయును బరస్ప,రాభిభాషణములును స్నేహమునునాల్గు
పతనహేతువు లని చెప్పఁబడియెఁ గాన,నవి యనర్హులయెడలఁ జేయంగఁ దగదు.

సీ. అశ్రోత్రియునకును నవరవర్ణునకును, విహితవర్ణాచారవిరహితునకు
నొనరించుదానంబునను గువిచారముల్, పొనరించుటను గర్మలోపమునను
గులధర్మములు మానుకొనుట నసత్యముల్, పలుకుటను నభక్ష్యభక్షణమునఁ
బరదారసంసర్గకరణంబునను రాజ,సేవను బతితసంసేవనమున

గీ. గోవులకు బ్రాహ్మణులకును దేవతలకు, నాగ్రహము గలిగించుట నవిహితముల
నాచరించుటవలనను నన్వయంబు, లంకురంబులు లేకుండ నస్తమించు. 709

గీ. హిమమహీధరవింధ్యశైలములమధ్య, మునను గృష్ణమృగంబును బుణ్యనదియుఁ
గలుగుదేశంబునను నాస్తికులు వసింప, నట్టిదేశంబునను నుండ నగు ద్విజుండు.

వ. ఏకశయ్యయును నేకాసనంబును నేకపంక్తియును నేకభాండపక్వాన్నమిశ్ర
ణంబులును సహమజ్జనంబును సహాధ్యయనంబును సహభోజనంబును సహ
యాజనంబును యోనిసంబంధంబును నధ్యాపనంబును ననుపదునొకండుదోషం

బులు సంకరంబు లనంబడును. సంకరంబు పావనత్వంబుఁ బోవడంచి నరకంబు
నాపాదించు. 711

క. కావున సాంకర్యమునకుఁ, దా వొసఁగనిపద్ధతులను దగు వర్తింపన్
బావనధర్మము తప్పకుం, గావలయు నటన్న కోర్కె గలిగినవారల్. 712

గీ. పంక్తిభేదంబు గలుగును భస్మమునను, ద్వారమున నగ్నివలనను స్తంభమునను
సలిలమున మార్గమునను శాస్త్రంబు దెలిసి, సంచరించినఁ గలుగదు సంకరంబు.

క. మునులను గురులను దేవత, లను వేదంబులను విప్రులను నిందింపన్
జన దట్టులు నిందించిన, జనులకు నిష్కృతులు లేవు శాస్త్రములందున్. 714

ఆ. అన్యదూషణమును నాత్మస్తవంబును, నింద్యములుగఁ బరిగణింపఁబడియెఁ
గాన నట్టిపనులు గావించువారికిఁ, గలుగు నింద్యకార్యకరణఫలము. 715

గీ. పరులు నిందించుచుండినఁ బలుకకుండఁ, గర్ణములు మూసికొనఁ దగుఁ గానియెడల
నావలకు నేఁగఁగాఁ దగు నంతె కాని, యెదురుగా నిల్చి దూఱుట హితము గాదు.

గీ. తగదు బహుబంధుజనవిరోధంబు తగదు, దేవతల వేదములను భూదేవతలను
దూషణము చేయువారలతోడ నునికి, పరులయౌన్నత్యమున కీసుపాటు తగదు.

గీ. పాపవంతులపాపముల్ బయలుపఱుపఁ, దగదు తత్తుల్యపాతకుం డగునుగాన
బాపరహితులయెడలఁ బాపములు పలుకఁ, దగదు మిథ్యాభిశంసకుం డగును గాన.

గీ. పాపరహితులకంట బాష్పములు గాఱు, నవి హరించును బశుకళత్రాత్మజులను
గాన మిథ్యాభిశంసకుఁ డైనవాని, కెందునను లేదు నిష్కృతి యెంచి చూడ.

సీ. ఉదయాస్తమయముల నొందునప్పుడు మేఘ,సంఛన్నులై యున్నసమయమందు
నాకాశమధ్యమునం దున్న వేళను, నాదర్శజలగతు లైనతఱిని
దగదు సందర్శింపఁ దపనసుధాంశుల, గ్రహముల నశుచివై కాంచ రాదు
తైలోదకములందుఁ దనరూపు గాంచ రా, దొప్ప దుచ్ఛిష్ట మన్యులకు నొసఁగ

ఆ. నాసనస్థ యైనయపుడు తుమ్మెడునప్పు, డావలించునప్పు డారగించు
నపుడు నగ్న యైనయపుడు భార్యను జూడఁ, దగదు కీడు గలుగు దానివలన. 720

ఆ. మావటీఁడు లేనిమత్తగజంబును, గ్రోధయుక్తుఁ డైనగురునిముఖము
మైథునప్రవిష్టు మలమూత్రములు విస, ర్జించుచుండువానిఁ గాంచ రాదు. 721

గీ. పరులతోడను భాషించుపట్ల నుండఁ, గూడ దుచ్ఛిష్టుఁడుగ నవగుంఠితుఁడుగఁ
దగదు హీనుల సేవింప దైన్య మొందఁ, దగదు నిందించుకొనుటయుఁ దగదు తన్ను.

ఆ. కాంచనము గాని చంద్రునిఁగాని చండ, హేళిపరివేషమును గాని యింద్రధనువు
గాని శరవహ్నిఁ గాని నక్షత్రములను, గాని వచియింపఁ గూడ దెవ్వానికేని.

క. గోవులు మేసెడిమేఁతకుఁ, ద్రావెడుతోయమున కంతరాయము నెపుడున్
గావింప రాదు ఖేదము, గోవులు చెందినను గీడు కులమున కొదవున్. 724

గీ. ఆస్తికుఁడు కాసవానితో నశుచితోడ, దగ్ధహస్తునితోడ సుదక్యతోడ
మాటలాడంగఁదగదు బ్రాహ్మణుఁడు వారి, కలుషములు తన్ను నంటెడి కారణమున.

గీ. భ్రూణహత్యాఘమును దాను బొందు భక్తి, మఱియు గుణశీలయు దోషవర్జితయు నైన
భార్య నుద్యజించు గృహమేధి పడయు వాఁడు, చెందు ఫలము నె తన్మైత్రి చేయువాఁడు.

సీ. ఆహారమునఁ గాని యావాసమునఁ గాని, సహచరుం డగువానిఁ జనదు విడువఁ
దల యంట మిగిలిన తైలంబు ముఖభుజా, ద్యవయవంబులకు రాయంగ రాదు
నగ్నుఁడై యవగాహనము చేయఁగా రాదు, దహనంబుపైనుండి దాఁట రాదు
గోటితో భూమిని గోఁకంగఁ గూడదు, బంధింప రాదు గోబ్రాహ్మణులను

గీ. సతతమును నింద్రియములను జనదు తాఁకఁ, దగదు క్రీడింప సర్వశస్త్రములతోడ
నంగనఖవాద్యముల నొనర్పంగ రాదు, సలిల మంజలితోడను జనదు త్రాగ. 727

సీ. కదలింపఁ గూడదు కరపాదవాఙ్నేత్ర, కర్ణమేహనకుక్షికాయములను
గూడదు జలమును గొట్టంగఁ గుక్షితోఁ, గరములతోడను గాళ్ళతోడఁ
బాషాణములచేతఁ బ్రహరింపఁ గూడదు, మూలముల్ ఫలములు సాలములును
గుహ్యప్రదేశంబు కూడదు ముట్టంగఁ, జనదు పీఠము లాఁగఁ జరణమునను

ఆ. పనికిరాదు మ్లేచ్ఛభాషణంబు మునుంగఁ, జన దగాధమైన సలిలమందుఁ
దగదు పరువులెత్తఁ దగినంతపని లేక, కడుగ రాదు కాళ్లు కాంస్యమందు. 728

సీ. నఖభేదనాస్ఫోటనచ్ఛేదనవిలేఖ, నము లనుపనుల నొనర్ప రాదు
తగదు పాదమునఁ బాదక్షాళనము చేయఁ, గాదు చిచ్చునఁ గాళ్లు కాఁచికొనఁగ
నుచ్ఛిష్టుఁ డగుచును నుండ రాదు సతంబుఁ, జనుచు మార్గమునందుఁ జదువ రాదు
నృత్య మాడఁగ రాదు రెండుచేతులతోడఁ, గూడదు శిరమును గోఁకికొనఁగ

గీ. లౌకికస్తోత్రములను నుల్లాసపఱుప, రాదు సురలను వాదిత్రవాదనములు
గానములు చేయ రాదు నిష్కారణముగఁ, దగదు నఖరోమములను దంతములఁ ద్రుంప.

సీ. తల్పంబునందు నుత్సంగంబునందు నుం, చికొని భక్ష్యములు భక్షింప రాదు
జలమందు విణ్మూత్రములు విడువఁగ రాదు, కూడ దక్షములతోఁ గ్రీడ సేయ
నిష్కారణంబుగ నిష్ఠీవనము చేయఁ, దగదు బాహుల దాఁట దగదు నదిని
శూన్యగృహంబున సుప్తుఁడు గా రాదు, చెప్పులు కూడదు చేతఁ బట్ట

గీ. గోవులకు బ్రాహ్మణులకును దేవతలకు, శ్వసనునకు నగ్నికిని రవిచంద్రులకును
నృపతికిని నభిముఖముగా నెపుడు గాని, చనదు పాదములను బాఱఁజాఁచికొనఁగ.

గీ. ఒసఁగు నెడలను గేస్తు విధ్యుక్తముగను, బాత్రునకు నన్నమును గాని పాలు గాని
కందమూలఫలంబులు గాని కడకు, సలిలమును గాని గోదానఫలముఁ జెందు. 731

గీ. అతిథి యగువాఁడు గేస్తుగేహంబునుండి, యరుగవలసిన యెడల భగ్నాశుఁ డగుచు
నతనియాజన్మసంచితంబైన పుణ్య, మంతయును గొని పోవుఁ దా నరుగునపుడు.

గీ. పిదప భుజియింపఁ దగు నేస్తు మొదట దేవ, పితృమనుష్యుల కర్పించి ప్రీతితోడ
నట్లు గాకుండఁ గేవల మాత్మకొఱకెఁ, దినిన నాతండు పాపంబు దినినవాఁడ.

గీ. అఘము షష్ఠ్యష్టమీతిథులందు నుండు, సంతతంబును తైలమాంసములలోనఁ
గానఁ దగ దుపయోగింప వాని నపుడు, తనకు శ్రేయసము గోరుకొనెడివాఁడు.

గీ. తగ దమావాస్యయును జతుర్దశియుఁ గూడ, క్షౌరమునకును సంగనాసంగతికిని
దగదు పరభుక్తములగు వస్త్రములు దాల్పఁ, దగదు తొడుగంగఁ బరులపాదత్రములను.

సీ. భుజియింప రా దొకపుట్టంబుతోడను, దినఁగూడ దుత్కటాసనముమీఁదఁ
దగ దారగింపంగఁ దనపత్నితోఁ గూడ, ఋతుమతి యగుకాంత నెనయ రాదు
భుజియించుచుండెడిపొలఁతిని గనరాదు, గానఁ గూడదు నగ్న యైనదానిఁ
జూపింపరా దింద్రచాపంబు ధేనువు, చేఁపెడిక్షీరంబు చెప్ప రాదు

గీ. తగదు భుజియింప సంధ్యాద్వితయమునందు, నన్యపరిభుక్తపాత్రమునందు భిన్న
భాజనమునను దినరాదు పగటియందుఁ, దక్రమును రేయిఁ బెరుఁగును ద్రావరాదు.

సీ. అశుచివస్తువు దగ దగ్నిలో వైవంగఁ, బ్రాణిహింసను నొనర్పంగ రాదు
తగదు వక్త్రమున నూఁదంగ నగ్నిని జిచ్చు, నను గాళ్లు గాఁచుకొనంగ రాదు
తగదు మ్రొక్కఁగ ముట్టుదానికిఁ గూడదు, కాంస్యపాత్రమునందుఁ గాళ్లు గడుగఁ
దార్యత్రికాసక్తి తగ దారగింపంగ, రాదు సంతృప్తిగా రాత్రులందు

గీ. పండుకొని తినరా దార్ద్రపాదుఁ డగుచుఁ, బండుకొన రాదు తగ దొనర్పంగ గమన
శీర్షసంస్పర్శనముల నుచ్ఛిష్టుఁ డగుచుఁ, జలుపఁ గూడదు మనుజులసంస్తవంబు.

గీ. కూడ దాత్మను దూషించుకొనఁగ నొరుల, మర్మములు ప్రకటీకరింపంగ రాదు
చండరశ్మికి నుదయించుచుండునట్టి, సమయమందుఁ బ్రణామంబు సలుప రాదు.

గీ. అపరిశుద్ధుండుగా నుండినపుడు శయన, యానభోజనవానాధ్యయనజపంబు
లొనరుపఁగ రాదు నిదురించుచున్నవానిఁ, గూడదు తటాలునను మేలుకొల్పుటయును.

గీ. స్నాన ముద్వర్తనమును భోజనము గతియు, స్వాప మధ్యయనంబును జలుప రాదు
సంధ్యలందును మధ్యాహ్నసమయమందుఁ, దగదు చైత్యంబునందుండు తరువునరుక.

గీ. అగ్నిపరిచర్య చేయరా దనిమిషులను, యతులను నుతింపఁగాఁ దగ దశుచి యగుచుఁ
దగదు స్పృశియింప నుచ్ఛిష్టుఁడగుచు ద్విజుల, గోవులను వీతిహోత్రుని దేవతలను.

సీ. తగదు పాదంబు చేతను దాఁక దేవతా, ప్రతిమాకృశానుగోబ్రాహ్మణులను
బాదపంబుల నెక్క రా దుండఁగా రాదు, ప్రేతధూమమున బాలాతపమున
స్వయముగా వినిపింపఁ జనదు మరణవార్త, యగ్నిలోపలఁ గూడ దగ్ని నుంపఁ
జన దనలంబును జల్లార్చుటయు నీట, మండించుటయు నాస్యమారుతమునఁ

గీ. దగదు సలిలంబునం దమేధ్యమును విషము
రక్తమును వైచుటయును వీర్యమును విడుచు

టయును నిష్ఠీవనము చేయుటయును మైథు
నమును జలువ్రుటయును నెట్టినదున కేని. 742

సీ. ఆర్ద్రవస్త్రునకుఁ దైలాభ్యక్తునకు రోగి, కశుచి కుచ్ఛిష్టున కాచరింపఁ
దగదు ప్రణామంబు తగదు చేయఁగ నర్క, భౌమవారముల నభ్యంగవిధిని
బనికిరా దుపవేశ మొనరింపఁగను గలి, ఘ్మారుహాదిపికాచ్ఛాయలందుఁ
గూడ దస్పృశ్యునితోడఁ గ్రుద్ధునితోడఁ, బతితునితోడ సంభాషణంబు

గీ. తగదు సమ్మార్జనీధూళి తనువునందు, సోఁకుటయు హీనజాతులఁ దాఁకుటయును
భస్మకంటక కేశకపాలకుల్య, సహిత దేశనివాసంబు సలుపుటయును. 743

వ. మలమూత్రవిసర్జనమైథునకాలంబులం దుపయుక్తంబగువస్త్రంబును బిత్రృదేవతా
కార్యంబులం దుపయోగింపం దగదు. 744

గీ. గొంతుకూర్చుండుటయు గొంతుకూరుచుండి
శిరముపైఁ బెట్టికొనుటయుఁ గరయుగంబు
తగదు భుజియింప భార్యతోఁ దగదు మొదట
సమ్మతించినసమయంబు చనదు విశువ. 745

గీ. మాటలాడుచు నప్పాట మాటినాంటి, కారగించుచు నుంటయు ననుచితంబు
నీట జిరకాల ముంటయు నిప్పుకలను, హస్తమున ముట్టుకొనుటయు ననుచితంబు.

సీ. ఏకాకిగాఁ జరియింప రా దెపుడును, మెలఁగంగ రా దధార్మికులతోడ
గమనించునపుడు మార్గమునందుఁ బాదుకల్, దండంబు జలము లేకుండ రాదు
గోవున కగ్నికి దేవాలయమునకు, నప్రదక్షిణముగా నరుగ రాదు
చన దయాజ్యునిచేత సవనంబు చేయింప, దేవాలయమున నిద్రింపఁ దగదు

గీ. పశువులకు మృగములకును బక్షులకును, గలహములు పెట్ట రా దన్యకాంతతోడఁ
జలుప రాదు ప్రసంగముల్ తెలుప రాదు, దాను జేసినదానముల్ ధర్మములును.

వ. దేవాలయచ్ఛాయయును దేవచ్ఛాయయును సిద్ధచ్ఛాయయును గోచ్ఛాయ
యును బ్రాహ్మణచ్ఛాయయును యతిచ్ఛాయయును యోగిచ్ఛాయయును
దాఁట రాదు. తననీడ చండాలులును బతితులును రోగులును నవరజాతులును
దాఁట రాదు. 748

గీ. బ్రహ్మహత్యాకరుఁడు సురాపానకరుఁడు, స్వర్ణచోరుండు గురుసతీసంగతుండు
వారితో నుండువాఁడును వార లైదు, గురు ను బంచమహాపాతకులుగ నైరి.

క. పంచమహాపాతకు లా, ర్జించినపాపమున నరకశిఖిలోపల దుః
ఖించుచు నాకల్పము వసి, యించెద రాపనులు గూడ దెవరును జేయఁగ. 750

వ. నర్తకాన్నంబును జండాలచర్మకారాన్నంబును గణాన్నంబును గణికాన్నం
బును షండాన్నంబును లోహకారాన్నంబును మృతికాన్నంబును సూతకా

న్నంబును నయాజ్యయాజకాన్నంబును విశ్వాసఘాతుకాన్నంబును రజకకులాల నాపితాన్నంబును దస్కరాన్నంబును ఛత్రకారాన్నంబును వార్ధుషికాన్నంబును పతితాన్నంబును పౌనర్భవాన్నంబును నభిశస్తాన్నంబును స్వర్ణకారాన్నంబును శైలూషాన్నంబును వ్యాధాన్నంబును వంధ్యాన్నంబును నాతురాన్నంబును చికిత్సకాన్నంబును నన్నవిక్రయికాన్నంబును కులటాన్నంబును నాస్తికాన్నంబును దేవతాగోబ్రాహ్మణదూషకాన్నంబును శ్వపచాన్నంబును సోమవిక్రయికాన్నంబును భృతకాధ్యాపకాన్నంబును నుచ్ఛిష్టభోక్త్రన్నంబును గణాన్నంబును శస్త్రజీవాన్నంబును ఫితరుదితాన్నంబును శిల్పకారాన్నంబును జారాన్నంబును శ్రాద్ధాన్నంబును శావాన్నంబును వృథాపాకాన్నంబును గృతఘ్నాన్నంబును దీక్షాపత్న్యాన్నంబును పరివేత్రన్నంబును సంస్కారవర్జితంబును కోపదత్తంబును నవమానితంబును క్రిమిదుష్టంబును భావదుష్టంబును నసత్సంస్పృష్టంబును శునకాఘ్రాతంబును చండాలపతిత రజస్వలావీక్షితంబును పశుమనుష్యాఘ్రాతంబును గుక్షిస్పృష్టంబును కాకకుక్కుటసంస్పృష్టంబును పర్యుషితంబును నగునన్నంబును భుజియింప రాదు.

గీ. అన్నమున నుండు మనుజుని యఘము లెల్లఁ, గానఁ బాతకియన్నంబు గాదు తినఁగ
నట్లు గాకుండ భుజియించినట్టులైన, వానిపాపంబులనె తిన్నవాఁడు వాఁడు. 752

గీ. భూసురుఁడు జున్నుపాలును బుట్టగొడుగు, లశుననిర్యాసమాంసపలాండువులును
జనము భుజియింపఁగా దూడ చచ్చినట్టి, యావుపాలును నవిదూస మాన రాదు.

గీ. తైలసంబంధ మగుపదార్థములు దధియు, రాత్రి భుజియింప రాదు తక్రమునఁ గలిసి
నట్టిక్షీరంబుఁ ద్రాగ రా దాన రాదు, దేవతల కేదియును నివేదింపకుండ. 754

గీ. తిగిచి వీక్షింప స్పృశియింపఁ దగదు త్రావఁ, దగదు పశులకు నీయంగఁ దగదు కాన
నట్టిమద్యంబు త్రావిన నవనిసురుఁడు, కర్మవిభ్రష్టుఁ డగు వానిఁ గాంచ రాదు.

గీ. అవరవర్ణులయన్నంబు నగ్రవర్ణు, లారగించుటవలనను నఘము గలుగు
నగ్రవర్ణులయన్నంబు నవరవర్ణు, లారగించుటవలనఁ బుణ్యంబు గలుగు. 756

గీ. చచ్చునప్పుడు నాలుగుజాతులందు, నెవనియన్నంబు గుక్షిలో నెవని కుండు
వానివర్ణంబులోపల వాఁడు పుట్టుఁ, గాన నవరాన్నములు హైన్యకారణములు.

వ. ఏకభుక్తంబు దేవాన్నంబు. ద్విభుక్తంబు నరాన్నంబు. త్రిభుక్తంబు ప్రేతాన్నంబు. చతుర్భుక్తంబు శోణపాన్నంబు. 758

సీ. ఆచారమున నొందు నాయువు నారోగ్య, మును ధనంబును స్వర్గమోక్షములను
నాచారహీనుఁ డల్పాయువు రోగియు, దుఃఖియు సజ్జనదూషితుఁడును
నిర్ధనుండును ఘోరనిరయగామియు నగు, నాచారవర్జితుం డైనవానిఁ
ప్రోవంగఁ జాల వామ్నాయముల్ పూతుని, నిశ్శరణ్యుఁడు వాఁడు నిశ్చయముగఁ

గీ. నానా నాచారమును నరుఁ డెఱుఁగవలెను, తెలిసికొని యాచరింపంగ వలయు నెపుడు
వినుము నాచారవిషయంబు విశదముగను, నఖిలపురుషార్థసాధనం బనియె మహాత్మ.
సీ. అనుదినంబును గృహంబును గోమయంబున, నుపలేపనము చేయ నొప్పు మొదటఁ
బాత్రపీఠాదులఁ బ్రక్షాళనము చేయ, వలయును బరిశుద్ధి గలుగఁ బిదప
భస్మంబుచేఁ గాంస్యపాత్రంబుఁ దామ్రపా, త్రం బమ్లమున శిల దైలమునను
లోహపాత్రం బగ్నిదాహంబుచే స్వర్ణ, రౌప్యపాత్రములు నీరంబువలను
గీ. మృత్తికాభస్మముల మణి పృథ్వి మేఘ
వర్షణంబున ఖననంబువలన దాహ
నమున నుపలేపనమున శౌచమును జెందుఁ
దెలిసికొని పారిశుద్ధ్యంబు సలుప వలయు. 760

—: నానాదానమాహాత్మ్యకథనము :—

వ. దానంబు నిత్యం బనియు నైమిత్తికం బనియుఁ గామ్యం బనియు విమలం బనియు
నాలుగువిధంబులు గాఁ జెప్పంబడియె. 761
ఆ. అనుపకారి యైనయవనినిర్జరునకు, ఫలము గోరకుండఁ బ్రతిదినంబు
భావశుద్ధితోడఁ గావించుదానంబు, తనరుచుండు నిత్యదాన మనఁగ. 762
క. తా నొనరించినయఘసం, తానము శాంతించుకొఱకు ధాత్రీసురసం
తానమునకు నర్పించెడి, దానమె నైమిత్తికాభిధానం బయ్యెన్. 763
క. మానిను లైశ్వర్యము సం, తానము మొద లైన వెల్లఁ దన కొనగూడన్
జ్ఞానినిర్జరుల కొసంగెడి, దానమె పేర్వడియెఁ గామ్యదానము నాఁగన్. 764
గీ. ధర్మనిష్ఠిత మైనచిత్తంబుతోడ, బ్రహ్మవిదు లైనబ్రాహ్మణప్రవరులకును
నీశ్వరప్రీతికరముగా నిచ్చునట్టి, దానము తనర్చు విమలాభిధానమునను. 765
గీ. దానములలోన నుత్తమదాన మనఁగ, విమలదానంబ మాటలు వేయి యేల
దారుణం బైనసంసారవారిరాశి, గట్టు చేర్చెడినావ యైనట్టికతన. 766
గీ. పాత్రుఁ డగుబ్రాహ్మణుండు సంప్రాప్తమైన
యపుడె యర్జింప వలయు నర్థార్థి యైన
పురుషుఁ డొకటికిఁ బదిరెట్లు దొరక దంత
కంటె లాభకరం బైనకాల మొండు. 767
గీ. దాఁచుకొనినది దక్కదు దక్కుఁ గొట్ట, కొనకుఁ బాత్రునియం దుంచుకొనిన దొకటి
యీరహస్యము తెలిసినవార లెవరొ, స్వర్గసోపానముల నెక్కువారు వారె. 768
గీ. పాత్రుఁ డని చెప్పఁబడియెను శ్రోత్రియుండు
వ్రతి తపస్వి కుటుంబి నిర్ధనుఁడు శిష్టుఁ

నర్మదాగంగాదినదులలోపలను శ్రోత్రియున కిచ్చునది యక్షయఫలంబ
దండకాద్యుత్తమోత్తమకాననముల శ్రోత్రియున కిచ్చునది యక్షయఫలంబ

గీ. యచట నిచటను నన నేల యెచట నైన, నాత్మలోనఁ దలంచి కృష్ణార్పణముగ
శుద్ధ మగుబుద్ధితోడను శ్రోత్రియునకుఁ, గా నొసంగిన దెల్ల నక్షయఫలంబ. 784

గీ. ప్రాణులకు లేదు దానధర్మంబుకంటె, నధికధర్మంబు గాన స్వర్గార్థి యైన
వాఁడు మోక్షార్థి యైనట్టివాఁడు గూడ, దాన మొనరింపవలయుఁ బాత్రము నెఱింగి.

గీ. సన్నిహితు లైన శ్రోత్రియభూసురులను, వదలి తగ దన్యులకు నీయ వారికంటె
నన్యుఁ డధికగుణాన్వితుఁ డయ్యె నేని, యీయఁ దగు నాతనికి సన్నిహితుల విడిచి.

గీ. ద్రవ్య మార్జించి యెవ్వఁడు బ్రాహ్మణులను, దేవతలను స్మరింపక తినుచు నుండు
నతనిఁ దనరాష్ట్రమున నుండి క్షితివరుండు, వెడల నడువంగఁ దగుఁ గొని విత్తమెల్ల.

గీ. ఈయఁ గూడదు జలబిందు వేని తుదకుఁ, బాతకికి నాస్తికునకు నపండితునకు
భస్మ మగు నగ్నిలో నుంపఁబడినకట్టె, లఱఁగున నపాత్రదత్త మేదియును గాని.

గీ. పొట్ట నిండను దిన్నను బెట్ట వలయుఁ, దగును దగ దనకుండను ధార్మికునకె
పోవుచున్నను బ్రాణముల్ భుక్తి లేక, తగదు పెట్టంగ నెపుడు నధార్మికునకు.

ఆ. తగుఁ బ్రతిగ్రహింప ధార్మికు లైన బ్రా, హ్మణులవలన విప్రుఁ డంతతోడఁ
గడవ దేని వృత్తి క్షత్త్రియవైశ్యుల, వలన సంగ్రహంబు సలుప వలయు. 790

గీ. సలిపె నేని మంత్రోపదేశంబు ద్విజున, కవరవర్ణుఁడు ద్విజుఁడును నతఁడు గూడ
నధమగతి నొందుదురు సందియంబు లేదు, కానఁ దదుభయకృత్యముల్ కాదు చేయ

గీ. భూసురుండును శూద్రుఁడుఁ గలిసి చేయఁ, జనదు వ్యాపారమును నట్లు సలిపి రేని
విప్రుఁ డగు వేదబాహ్యుఁడు వృషలుఁ డధమ, గతిని జెందెడివాఁ డగుఁ గట్టకడకు.

గీ. బ్రాహ్మణుండు దురాశకుఁ బాలుపడక, వృత్తిసంకోచమును నొనరింప వలయు
లోభగుణమున కించుక లొంగు నేని, పతన మొనగూడు బ్రాహ్మణ్యపథమునుండి.

క. సిరి గలిగి బ్రాహ్మణుం డయి, దరిద్రు లగు బ్రాహ్మణులను దరిఁ జేర్పనిము
ష్కరునకు నిహలోకమునను, బరలోకంబునను శృంగభంగము గలుగున్. 794

క. వేదాధ్యయనమువలనన్, గాదు సవనకర్మములను గాదు తపమునన్
గా దొకసంతోషముచే, భూదేవుఁడు చెందునట్టిపుణ్యము చెందన్. 795

క. సంతోషింపని బ్రాహ్మణుఁ, డంతంబున నేఁగు నంతకాలయమునకున్
సంతతమును భూతంబుల, స్వాంతములను గలఁత వెట్టుచోరుఁడు వోలెన్. 796

క. అతిథుల నభ్యాగతులను, వ్రతుల సతీసుతుల హితుల రక్షించుచు దే
వతలను గొలుచుచు వ్రతములు, క్రతువులు గావించుచుండఁగా వలయు గృహుల్.

వ. గృహస్థుం డగువానికి దినప్రథమభాగంబున దంతధావనస్నానసంధ్యా
హోమాదులును దినద్వితీయభాగంబున వేదాభ్యాసంబును సమిత్పుష్పకుశాది

సంపాదనంబును దినతృతీయభాగంబున న్యాయార్జనంబును యదృచ్ఛాలాభ
సంతోషంబును యాజనాధ్యాపనవిశుద్ధద్రవ్యప్రతిగ్రహంబులును దినచతుర్థ
భాగంబున స్నానసంధ్యాబ్రహ్మయజ్ఞపితృతర్పణాదులును బంచాయతనదేవతా
ర్చనంబును బంచమహాయజ్ఞభూతబలికాకశ్వానబలులును సర్వభూతబలియును
నతిథికొఱకు గోదోహనకర్మమాత్రకాలంబు ద్వారనిరీక్షణంబును నతిథిపూజ
యును భిక్షువునకును బ్రహ్మచారికిని భిక్షాదానంబును బితృమాతృగురుబంధు
గర్భిణీవృద్ధబాలాతిథిభోజనానంతరము భుజించుటయును విహితంబులు. ప్రాణా
హుతులను జిహ్వచే గ్రహింప వలయుం గాని దంతములచే నమలం దగదు.
మొదట ద్రవరూపం బగుమధురరసంబును నడుమఁ గఠినరూపంబు లగులవణా
మ్లంబులును దుదిని ద్రవరూపంబు లగుకటుతిక్తంబులును భుజియింపం దగు.
ముని కష్టగ్రాసంబులును వనవాసికి షోడశగ్రాసంబులును గృహస్థునకు ద్వాత్రిం
శద్గ్రాసంబులును బ్రహ్మచారి కమితభోజనంబును విహితంబు లయ్యె. శాస్త్ర
విరుద్ధభక్ష్యభోజ్యాదులు భోజనానర్హంబులు. కాంస్యపాత్రభోజనం బాయుః
ప్రజ్ఞాయశోబలప్రదంబు. భోజ్యాన్నంబునుండి ధర్మరాజచిత్రగుప్తసర్వభూతబలి
యవశ్యకార్యంబు. దినషష్ఠసప్తమభాగంబులందు సన్మార్గాపరోధి యగునితి
హాసపురాణాదివినోదంబును దినాష్టమభాగంబున లోకయాత్రయు బహిస్సం
ధ్యయును గావించి యగ్ని నుపాసించి భుజియింపం దగు. సాయంప్రాతఃకాలంబు
లందుఁ దాను భుజింపకున్నను వైశ్వదేవబలికర్మంబు లొనర్ప వలయు. భోజ
నానంతరంబు భగవచ్చింతనంబు గావించి శయనింపం జను. స్వగృహంబునందుఁ
బ్రాక్ఛిరశ్శయనంబును శ్వశురగృహంబున దక్షిణాశిరశ్శయనంబును బ్రవాసం
బునఁ బశ్చిమశిరశ్శయనంబును విహితంబులు. ఉదక్ఛిరశ్శయనంబు నిషిద్ధంబు.
అగస్త్యమాధవముచుకుందకపిలాస్తీకు లేగురును సుఖశాయు లగుటం జేసి వార
లను శయనకాలంబున స్మరియింపం దగు. శయ్యాశిరస్సమీపంబున జలపూర్ణ
కుంభంబు నుంచి గారుడాదిమంత్రంబులచే నాత్మరక్ష ప్రతిదినంబును గావించు
కొనం దగు. యామద్వయశయనంబు బ్రహ్మత్వప్రదంబు. 798

గీ. ప్రతిదినంబును నుక్తధర్మముల నెల్ల, జాగరూకతతోడను శక్తికొలఁది
నాచరించుచునుండుగృహస్థుఁ డఖిల, సిద్ధులను జెంది చివరకుఁ జెందు ముక్తి.

క. జరుపంగ స్వధర్మంబులు, పరిపాలింపంగ నాత్మపరివారంబుల్
సిరి లేనియగ్రజన్ముఁడు, పరిగ్రహింపంగ నొప్పుఁ బలువురవలనన్. 800

—: వానప్రస్థాశ్రమధర్మకథనము: —

క. ఈవిధమున గార్హస్థ్యము, సేవించి సగంబు వయసు చెల్లినపిదపన్
గావింప వలయు వనమున, నావాసము సుతుల కొసఁగి యఖిలార్థములన్. 801

వ. పత్నితోడం గాని పత్నిని దనయులకడ నుంచి కాని వానప్రస్థుండు వనంబున కేఁగి చీరవసనుండును జటాధారియును త్రిషవణస్నాతుండును బంచయజ్ఞపరాయణుండును నిత్యకర్మానుష్ఠాతయును నిత్యస్వాధ్యాయనిరతుండును నిష్పరిగ్రహుండును సర్వభూతానుకంపాన్వితుండును వాగ్యతుండును ననుత్సృష్టరోమనఖుండును ఋత్విష్ట్యాగ్రయణచాతుర్మాస్యకరుండును నిర్ద్వంద్వుండును నిర్భయుండును జితేంద్రియుండును బ్రహ్మచారియును నగుచు ఫాలకృష్టంబుల వర్జించి ఫలమూలాదిపవిత్రాహారంబులు పగలుమాత్రమ భుజియించుచుఁ బరివాదమృషావాదనిద్రాలస్యంబులు వర్జించి శిలయందుఁ గాని ప్రోక్షితభూమియందుఁ గాని శయనించుచు యమనియమాసనప్రాణాయామప్రత్యాహారధ్యానధారణాసమాధ్యష్టాంగయోగంబు లభ్యసించుచు వేదాంతజ్ఞానం బార్జించుచు.

క. ఏయాహారము దినుఁ దా, నాయాహారమునఁ బితృసురాతిథితృప్తిం
జేయుచు హరిచింతనముం, జేయుచు ననిశంబు తపము చేయఁగ వలయున్.

వ. అట్లు గాకున్న నాత్మయం దగ్న్యారోపణంబు గావించుకొని మునివృత్తి నవలంబించి యాత్మసంసిద్ధికొఱకు నుపనిషన్మంత్రజపంబు గావించుచు భగవద్ధ్యానపరుండై ఫలమూలాదివన్యాహారంబులచేఁ గాని యంతికగ్రామంబున కేఁగి తెచ్చుకొనినయష్టగ్రాసభిక్షాన్నంబుచేఁ గాని జీవయాత్ర గావింప వలయు. 804

గీ. కడపి యాయుస్తృతీయభాగంబు నట్లు, లడవిలోపలఁ బైఁ దురీయాశ్రమంబు
నొంద నగుఁ దీవ్రవైరాగ్య మొదవెనేని, లేనియెడల సన్న్యాసంబు హానికరము.

—: సన్న్యాసాశ్రమధర్మకథనము :—

వ. ప్రాజాపత్యేష్టి గాని యాగ్నేయేష్టి గాని కావించి బ్రహ్మాశ్రమస్వీకారంబు గావించి యాయుశ్చతుర్థభాగంబు గడప వలయు. జ్ఞానసన్న్యాసంబు వేదసన్న్యాసంబు గర్మసన్న్యాసంబును నని మూఁడువిధంబులుగా సన్న్యాసంబు చెప్పంబడియె. ద్వంద్వరహితుండును నిర్భయుండును బ్రహ్మభూతుండును నగువాఁడు జ్ఞానసన్న్యాసి యనియును జితేంద్రియత్వంబును ముముక్షుత్వంబును నిష్పరిగ్రహత్వంబునుం గలిగి సంతతవేదాధ్యయనంబు గావించువాఁడు వేదసన్న్యాసి యనియును బ్రహ్మార్పణంబుగా మహాయజ్ఞాదిసత్కర్మంబు లొనరించుచు వశీకృతేంద్రియుండై యుండువాఁడు కర్మసన్న్యాసి యనియును జెప్పంబడియె. 806

గీ. ఉక్తసన్న్యాసములలోన నుత్తమంబు, జ్ఞానసన్న్యాస మది గలవాని కెందు
నేదియును జేయఁదగినది లేదు వాఁడు, ధూతకలుషుఁడు కర్మబద్ధుండు గాఁడు.

క. శ్రోతవ్యంబును లే ద, ధ్యేతవ్యము లేదు వాని కెందును నేక
జ్ఞాతృత్వము చేతనె వి, జ్ఞాత మగుటఁ జేసి జ్ఞేయ మైనది యెల్లన్. 808

సీ. ప్రాప్త మైనప్పుడు భైక్షంబు గొనఁ దగు, నప్రాప్తమునకుఁ గా దాశపడఁగ
సమదృష్టి గాఁ దగు శత్రుమిత్త్రులయందు, మానంబునను నవమానమునను
నాత్మసహాయుఁడై యనిశంబుఁ జరియింపఁ, దగు నేకవాసంబు తగదు చేయ
జీవితం బన్నను జెంద రాదు ముదంబు, దురపిల్లఁగా రాదు మరణ మన్న
గీ. నొంద రాదు భయంబు శీతోష్ణములకు, నభిలషింపఁగ రా దేపదార్థ మేని
తనకు భూతంబులకును భేదంబు నెంచు, కొనఁగ రాదుసన్న్యాసంబుగొనినద్విజుఁడు
సీ. తనయెత్తు స్వర్ణంబు ధారవోసినఁ గూడఁ, జను విలోకింప లోష్టంబురీతి
నచ్చరల్ తనయొద్ద నాడుచుండినఁ గూడ, లక్షింపఁ దగు విపలతలమాడ్కి
మృష్టాన్నమును సమర్పించి వేఁడినఁ గూడఁ, దగు గరళాన్నంబుపగిదిఁ జూడ
శయనింపఁ దల్పముల్ సమకూర్చిననుగూడఁ, గాంచంగఁదగుఁ గంటకములఁబోలె
గీ. నగును నుండంగ దృక్పూత మైనచోట, నగును బటపూత మైనతోయంబు ద్రావ
నగును ఋతపూత మైనవాక్యంబుపలుక, నగునుహృత్పూత మైనకార్యంబుసలుప
గీ. తన్ను హింసించుటకుఁ బూనుకొన్నవాని, యెడల నైనను దాల్ప రా దీరసంబు
ముండియగుచునుగాని త్రిదండియగుచుఁ, గాని తగునుండ సన్న్యాసియైనద్విజుఁడు.
వ. అట్లు సన్న్యాసంబు గావింపం దగువైరాగ్యం బుదయింప దేని సుతులయందు గృహభారం బంతయును బెట్టి తాను నిర్లేపుఁడై గృహమునంద యుండి శిఖాయజ్ఞోపవీతంబు లుజ్జగింపక గృహస్థవిధుల ననుష్ఠించుచు నాత్మవిచారంబు గావించుచు భిక్షాశనంబున దేహయాత్ర వెడలించుచుఁ గామక్రోధాదివర్జితుండై బ్రహ్మచర్యంబు నవలంబించి పరమేశ్వరధ్యానం బొనరించుచుండం దగు. అది మోక్షసాధనం బగుమార్గంబు. 812

గీ. సత్య మస్తేయమును నహింసయును దపము
క్షమము ముదమును బ్రహ్మచర్యమును దయయు
ననునవి వ్రతంబులుగఁ జేసికొనినవాఁడు
నిలయమున నున్న నడవి నుండినను నొకటె. 813

వ. ఆశ్రమనిష్ఠుఁ డగుసన్న్యాసికిఁ గాషాయవస్త్రకౌపీనంబులు ధరియించుటయు సప్తాగారంబులందుమాత్రమ భిక్షించుటయు నేకకాలమంద భుజించుటయు నలాబూదారుమృణ్మయవైణవపాత్రంబులలో నేదేని పాత్రంబుగాఁ జేసికొనుటయు గృహంబులకడ భిక్ష యని యొక్కపరి కేక వైచి యధోముఖుండై గోదోహమాత్రకాలంబు నిరీక్షించుటయుఁ బ్రాప్తం బైనభిక్షాన్నంబు నాదిత్యునకుం జూపి ప్రాఙ్ముఖుండై కూరుచుండి పంచప్రాణాహుతులును గ్రహించి యష్టగ్రాసంబులు భుజియించి కరపాదప్రక్షాళనంబు గావించుకొని యాచమించుటయును విహితధర్మంబులు. 814

సీ. అఖిలభూతములకు నాత్మ యైనదియును, నాది యైనదియును సకలమునకు
సత్య మైనదియును జ్ఞాన మైనదియును, నాద్యంతవిరహితం బైనదియును
సణువుకంటెను గూడ సణు వైనదియును మ, హత్తుకంటెను మహా త్తైనదియును
నిది యని యది యని యెంచ రానిదియును, నపరోక్షముగ నుండునట్టిదియును
ఆ. వెలుఁగులకును నెల్ల వెలుఁగైనదియుఁ దమః, పార మైనదియును బరమగుహ్య
మైనదియును నేక మైనదియును నగు, బ్రహ్మ మనఁగ నేన పరము లేదు. 815

క. నేనె సకలాంతరాత్ముఁడ, నేనె సమస్తమును ననుచు నెపుడును ననుసం
ధానము సేయుచు నుందురు, జ్ఞాను లయినయతులు శాస్త్రసమ్మతరీతిన్. 816

క. హరి యన్నను శివుఁ డన్నను, బరమాత్ముం డన్న నొకటె భావం బది య
క్షర మద్వైతంబును నా, పరతత్త్వమె తాను నిజము పరికింపంగన్. 817

గీ. తన్ను దేవునికంటెను భిన్నునిఁగను, నెంచుకొనువాఁడు దేవునిఁ గాంచ లేఁడు
వానిశ్రమ మెల్ల బూదిలో వైచినట్టి, నేతిధార తెఱంగున నిష్ఫలంబు. 818

క. తానె పరాత్పరుఁ డనియును, దానె మహాదేవుఁ డనియుఁ దలఁపున ననుసం
ధానము చేసెడిబ్రహ్మ, జ్ఞానికి మృతి లేదు లేదు జననము గూడన్. 819

క. అటు లనుసంధానముచే, యుటకున్ దగుశక్తి గలుగకుండిన నది సం
ఘటన మగువఱకు హృత్సం, పుటమునధ్యానింప వలయుఁ బురుషోత్తమునిన్.

గీ. అట్లు ధ్యానంబు చేయుచు నాశ్రమమున,కుచిత మగువిధు లాచరించుచును నుండ
వలయు నటు గాక విచ్యుతి గలిగెనేని,సలిపికొనఁ దగు నిష్కృతుల్ శాస్త్రమెఱఁగి.

గీ. ధర్మమున కైన యతి యనృతంబు దగదు, పలుక దైవికముగ నట్లు పలికెనేని
సలుప వలయుఁ బ్రాణాయామశతము నేక,దివస ముపవాసమును నిష్కృతిగ నతండు

వ. భిక్షుండు హింస నెన్నఁ డైనను దైవికంబుగా నొక్కసారి కావించెనేని కృచ్ఛ్రాతికృచ్ఛ్రప్రాయశ్చిత్తమునం గాని చాంద్రాయణప్రాయశ్చిత్తమునం గాని శుద్ధుండును నభ్యాసంబునం బతితుండును నగు. మఱియును యాచనయును జౌర్యంబును నెన్నఁడేని దైవికంబుగా నొక్కసారి కావించెనేని నిర్వేదంబున శుద్ధుండును నభ్యాసంబునం బతితుండును నగు. రేయి స్త్రీదర్శనంబున వీర్యస్ఖలనం బొదవెనేని షోడశప్రాణాయామంబులచేతను బగలు ప్రాణాయామశతంబుచేతను శుద్ధుం డగు. ఏకాన్నశ్రాద్ధాన్నప్రత్యక్షలవణభోజనంబులందుఁ బ్రాజాపత్యంబున విశుద్ధుం డగు. బ్రహ్మచారిగృహస్థవానప్రస్థయతిధర్మంబులు సంగ్రహంబుగాఁ జెప్పంబడియె. 823

క. ఈధర్మంబులు సుతులకు, సాధువులకు శిష్యులకును జను బోధింపన్
బోధింపఁ జనదు ధార్మిక, బాధకులకు నాస్తికులకుఁ బాపాత్ములకున్. 824

క. అని చెప్పి యదృశ్యత్వం, బును జెందె సవిస్మయముగ మును లెల్లఁ గనుం
గొనుచుండ మీకుఁ జివరకు, వినఁ దగినరహస్య మొకటి విజ్ఞాపింతున్.

గీ. కలియుగంబున హరిభక్తికంటె వేఱె, ధర్మములు లేవు భవవార్ధితరణమునకు
నెట్టిధర్మంబులును హృషీకేశభక్తి, షోడశాంశాంశమునకును నీడు గావు. 826

—: పురాణాత్మకవిష్ణుస్వరూపకథనము :—

క. ఒకదేహంబు పురాణా, త్మక మైనది గల దనేకతనుధరుఁ డగుశౌ
రికి నది సేవించినచోఁ, సకలఫలంబులును గూడ సంప్రాప్తించున్. 827

సీ. పాద్మము హృదయంబు బ్రాహ్మము మూర్ధంబు, మజ్జగారుడము వామనము త్వచము
భాగవతము దొడల్ బ్రహ్మాండ మస్థులు, మాత్స్యము మెదడు కౌర్మంబు వెన్ను
లైంగవారాహముల్ దక్షిణవామగు, ల్ఫంబులు నారదీయంబు నాభి
లోమముల్ స్కాందము వామదక్షిణభుజ, ద్వంద్వంబు శైవంబు వైష్ణవంబు

గీ. వామపాద మాగ్నేయంబు వామజాను, తలము బ్రహ్మవైవర్తంబు దక్షిణోరు
పర్వము భవిష్య మపసవ్యభావ మొంది, నట్టిపదము మార్కండేయ మచ్యుతునకు.

—: పద్మపురాణప్రాశస్త్యకథనము :—

గీ. అందులోపలఁ బాద్మ మత్యంతముఖ్య, మగుపురాణము వినఁగ నారాయణునకు
హృదయ మగుటను నద్దాన నొదవినట్టి, సకలభావంబులును నిందు సమకూఱుటను.

గీ. ఈపురాణము సకలసంతాపహరము, పాపహరము సమస్తసంపత్కరంబు
వినిన వినిపించినను జదివినను దీని, జన్మసాఫల్య మొదవు నిస్సంశయముగ. 830

క. జనుఁ డఖిలపురాణములను, వినినఫలముఁ బాద్మ మొకటి విన్నను జెందున్
వినిన నొకయాదిఖండము, గనుఁ బాద్మము నెల్ల వినినఁ గనియెడిఫలమున్. 831

సీ. విద్వాంసులను గౌరవించినవాఁ డగు, నొసఁగినవాఁ డగు నుర్వి యెల్ల
సకలవేదములును జదివినవాఁ డగు, నగు స్వర్ణతుల నిచ్చినట్టివాఁడు
సవనంబు లన్నియుఁ జలిపినవాఁ డగుఁ, జెందినవాఁ డగు సిద్ధు లెల్ల
బీదల కన్నంబు పెట్టినవాఁ డగుఁ, దీర్చినవాఁ డగుఁ దృషితతృష్ణ

గీ. బ్రాహ్మణుల గోవులను గావఁ బ్రాణములను, విడిచిపెట్టినవాఁ డగు వివిధపాప
ములను దాఁటినవాఁ డగు ముక్తుఁ డగును, వేడ్కతో నాదిఖండంబు వినినవాఁడు.

సీ. చలుపఁగా వలయును సత్ప్రసంగములను, నుంచ వలయును సజ్జను లుండుచోట
వలయు సత్తీర్థమున నాప్లవంబు సేయ, సత్పురాణశ్రవణమును జలుప వలయు.

క. మునివర్యులార పాద్మం, బున కెల్లను సారరూపమును బ్రాథమికం
బును నైనయాదిఖండం, బును వినిచినవాఁడఁ బూర్ణముగ మీ కనిమెూ. 834

క. దేవాదిదేవ మునిగణ, భావితపాదారవింద పరిపాలితసం
సేవకజన విశ్వేశ్వర, భావుకగుణభరిత భువనపావనచరితా. 835

స్రగ్విణీవృత్తము

దారుణాఘవ్రజధ్వాంతమార్తండ సం
సారతూలానలజ్వాలలోకత్రయా
ధారభూతా శ్రితోద్ధారబద్ధాదరా
వారణాసీపురావాస విశ్వేశ్వరా.

:గద్యము:

చిదంబరకవీంద్రప్రణీతం బైన శ్రీమదాంధ్రపద్మపురాణంబున
నాదిఖండము
సమాప్తము.



శ్రీ మదాంధ్రపద్మపురాణము

భూమిఖండము



కంఠ కృపాపూర్ణా
లోకనపాలితసమస్తలోకా విబుధా
నీకశ్లోకితబృహద
ప్రాకృతగుణ విశ్వనాథ ప్రమథసనాథా. 1

వ. అవధరింపుము. 2

క. జనియించినతోడనె యే, యనువున నొనగూడె భక్తి హరియెడఁ బ్రహ్లా
దున కది వినిపింపుము మా, కని సూతుని నడుగ మునుల కతఁ డిట్లనియెన్. 3

—: ప్రహ్లాదపూర్వజన్మవృత్తాంతకథనము :—

క. మును మాదేశికుఁ డగువ్యా, సునకున్ వచియించెఁ బద్మజుం డాప్రహ్లా
దునివృత్తాంతము వ్యాసుఁడు, వినిపించెను నాకు నదియె వినిచెద మీకున్. 4

గీ. పూర్వకల్పంబుననుబశ్చిమోర్వరాంబ, రాంతముననయందుద్వారకయనెడిపురము
భాసిలుచునుండె సర్వసంపదలతోడఁ, గాంచువారల కాశ్చర్యకరము గాఁగ. 5

—: శివశర్మ తనపుత్రులపితృభక్తిని బరీక్షించుట :—

సీ. ఆపురంబున నుండె నఖిలవేదవిదుండు, శివశర్మ యనునొక్క క్షితిసురుండు
పంచాగ్ను లట్టి లాబ్రాహ్మణోత్తమునకుఁ, బ్రభవమొందిరి నిజపత్నియందుఁ
గ్రమముగా యజ్ఞశర్మయు వేదశర్మయు, ధర్మశర్మయు విష్ణుశర్మయు మఱి
సోమశర్మయు నాఁగ సూను లేగురు పితృ, భక్తిపరాయణుల్ భవ్యమతులు

గీ. వారిభక్తి పరీక్షింపఁ గోరి విష్ణు,సంప్రసాదసమాగతసర్వసిద్ధి
యైనశివశర్మ యొక్కనాఁ డాత్మమాయ,కతనఁ దనపత్ని మృతనుగాఁగానఁబఱిచె.

క. మరణించినతమతల్లిని, బరిగొని సుతు లెల్లఁ గనుల బాష్పము లురలన్
బరితాప మొందఁ దొడఁగిరి, పరిపరివిధములను దుఃఖపరవశు లగుచున్. 7

గీ. అపుడు జ్యేష్ఠసుతుం డైనయజ్ఞశర్మ, కానతిచ్చెను శివశర్మ యామె యవయ
వముల నెల్లను ఖండింపవలయు ననుచు, నతఁడు మఱుమాట వలుకక యట్ల చలిపె,

క. ఆతనిపితృభక్తికిఁ గడుఁ, జేతోమోదంబుఁ గాంచి శివశర్మ తనూ
జాతులలోపల రెండవ, యాతనిఁ దనకడకుఁ బిలిచి యానతియిచ్చెన్. 9

క. కనుఁగొంటి నిపుడె వీథిం, జనుచుండఁగ నొక్కపూర్ణచంద్రాస్యను దా
నిని నా కొనగూరిచి నా, యనంగతాపమును మాన్పుమయ్య కుమారా. 10

చ. అనవుడు వేదశర్మ జనకాజ్ఞను మూర్ధమునందుఁ దాల్చి చ
య్యనఁ జని దారి నేఁగెడిలతాంగిని గాంచి నమస్కరించి నా
జనకుఁడు నిన్నుఁ గోరెడిని జాన మనోజశరాభితప్తుఁడై
ననుఁ గరుణించి రమ్ము తరుణం బిదె నీకు శుభంబు గల్గెడిన్. 11

చ. అనుటయు నాలతాంగి ద్రవిణాంగన నైనను నేను ముట్ట నొ
ల్లను ముదివాని వ్యాధిశిథిలం బగుగాత్రమువాని నేటి కీ
పని తలఁ దాల్చి వచ్చితివి పంచశరోపమరూప నిన్నుఁ గాం
చిన నిది యేమొ నామనసు స్నేహరసాంబుధి నోలలాడెడిన్. 12

క. ఆముదిమివానితోడను, నేమి ప్రయోజనము నీకు నేతద్గాత్ర
స్వామి వయి యనుభవింపుము, కామసుఖంబులను నితరగాథలు చాలున్. 13

క. నీసుకుమారశరీరము, నీసౌందర్యాతిశయము నీయౌవనమున్
భూసురవంశలలామమ, చేసేతను నడవిపాలు చేసికొనకుమా. 14

చ. అనుటయు నాతఁ డి ట్లనియె నమ్మ యధర్మవచఃప్రసక్తులన్
ననుఁ గలఁగింప నేమిటికి నామత మట్టిది గాదు నీవు నా
జనకునికోర్కి దీర్చునెడ సర్వజగంబులు నీకుఁ గైవసం
బొనరుచువాఁడ నాపలుకు లొక్కపుడున్ విత గావు నమ్ముమా. 15

చ. అనవుడు నాపడంతి వసుధామరనందన యట్టిశక్తి యుం
డినయెడ నీకుఁ జూపు మిపుడే సకలామరకోటి నాకుఁ గ
న్గొనియెద నంచుఁ బల్కుటయుఁ గొంకును జంకును లేక విప్రనం
దనుఁడు నిజాంతరంగమున ధ్యానముచేసె సుపర్వకోటులన్. 16

ఉ. ధ్యానముచేసినంత నఖిలామరవర్గము వచ్చి యాపయో
జాననకున్ ద్విజన్మునకు నయ్యెడ దర్శనమిచ్చి యేఁగ న
మ్మానిని విస్మయాకలితమానసయై భవదీయశక్తి య
న్యూనమ కాని దీనను ద్విజోత్తమ కల్గదు తృప్తి నామదిన్. 17

చ. అనుటయు వేదశర్మ మనమందు విషాదము చెంది తల్లి నీ
పనిచినకార్యముం జలుపుభారము నాయది నీకుఁ దృప్తి యే
యనువునఁ గల్గునో యటుల యానతియిమ్ము మ తేదియేని నా
జనకునకై కళేబరము సెతము కోరిన ధారవోసెదన్. 18

క. నావుడు నా కామిని భూ, దేవో త్తమ తలఁచితేని తృప్తిని నాకున్
గావింప నిమ్ము కృత్తము, గావించి భవచ్ఛిరంబు కొన్కఁగ నాకున్. 19

క. అని పలుకుటయును మనమున, నెన లేనిప్రహర్ష మొంది పృథ్వీసురనం
దనుఁ డప్పుడె ఖడ్గముచేఁ, దనతల తెగఁ గోసి యిచ్చెఁ దరుణీమణికిన్. 20

ఉ. అంతట నాశిరంబు గొని యానవలా శివశర్మయొద్ద క
త్యంతరయంబునన్ జని సుతాన్వితుఁడై యతఁ డుండ భూతవృ
త్తాంతము నెల్లఁ జెప్పుటయు నాతఁడు తచ్ఛిరమున్ గ్రహించి లోఁ
జింతిలి దాని నిచ్చెఁ దనచెంతన యుండినధర్మశర్మకున్. 21

శా. దానిం గైకొని ధర్మశర్మ పితృచింతన్ మాన్పఁగా నెంచి లో
ధ్యానించెన్ సమవర్తి నాతఁడు ప్రశస్తం బైనతద్భక్తికిన్
లోనై నిల్చెను వచ్చి కట్టెదుట నాలోకించి యాధర్మునిం
దా నిట్టుల్ వచియించె నాతనికిఁ జేతఃప్రీతి సంధిల్లఁగన్. 22

గీ. నేను బితృభక్తి గలవాఁడ నేని నాదు, భక్తికిని నీవు సంతసపడితి వేని
యిపుడ బ్రతికింపుమయ్య నీ వితని ననుచుఁ, దనకరంబున నున్నమస్తకముఁజూపె.

క. తిలకించి తచ్ఛిరంబును, బలికెను వైవస్వతుండు పరమప్రీతిన్
గొలిపెడుమీపితృభక్తియె, సలుపఁగలదు వీనిఁ బ్రాణసంయుక్తునిఁ గాన్. 24

చ. అని వచియించి యేఁగుటయు నాశిర మప్పుడె నిద్రనుండి మే
ల్కనినవిధంబునన్ దెలివి గాంచి ప్రభాంచిత మైనమేనితో
డను గను లెత్తి చూచె నికటంబున నుండినతండ్రి మానసం
బున నమితప్రమోదమును బొందుచు నుండఁగఁ బుత్రభక్తికిన్. 25

వ. అంతట శివశర్మ విష్ణుశర్మం దిలకించి యి ట్లనియె. 26

ఉ. ఈనళినాక్షిమీఁద నుదయించెను భావము నాకు వత్స య
ద్దానికి నంతరాయముగ దాపురమయ్యె జరాదిదుఃఖముల్
గాన దివంబునుండి వడిగా నమృతంబును దెచ్చి యిమ్ము త
త్పానముచేత నాసకలబాధలు దీఱి సుఖింతు నింతితోన్. 27

చ. అనుటయు విష్ణుశర్మ ముదితాంతరుఁడై ప్రణమిల్లి తండ్రికిన్
ఘనపితృభక్తి రక్షకము గాఁ ద్రిదివంబున కేఁగుచుండఁగాఁ
గనుఁగొని వజ్రి తద్గతివిఘాత మొనర్పఁ దలంచి మేనకా
వనరుహలోచనన్ బనిచె వాఁ డరుదెంచెడిత్రోవ కడ్డుగన్. 28

క. ఆనలినాక్షి పురందరు, నానతి గొని యేఁగి నందనారామమునన్
దేనెలసోనలు గురియఁగ, గానము గావించుచును బికస్వానముతోన్. 29

క. ఊఁగుచును దీవయుర్యొల, నాఁగుచు భూసురుఁడు వచ్చె ననుకొని నడుమన్
లోఁగునొ లోఁగడొ ద్విజుఁ డని, వ్రేఁగుచు లోలోన మిగుల వెనుబడు చుండెన్.

ఉ. ఆసమయంబునందు వసుధామరసూనుఁడు వచ్చుత్రోవలో
డాసియుఁ గూడ నందనము డాయనియట్టులె యందుఁ జంచలా
భాసురగాత్రియై వెలయుభామను జూచియుఁ జూడనట్టులే
యోసరనీసిపాట వినియున్ విననట్టులె యేఁగు చుండఁగన్. 31

క. అత్తరుణి యతనిచేతో, వృత్తిం గని విస్మయాపహృతమానసయై
తత్తటిలియు రాజాజ్ఞా, యత్త యగుటఁ జేసి చివర కాతనిఁ బిలిచెన్. 32

క. పిలుచుటయు నతఁడు మీఁదనె, నిలిచి సతీ యేల నన్ను నిలిపితి వనినన్
గలకంఠకంఠి కన్నీ, రొలుకఁగ ని ట్లనియె నాద్విజోత్తముతోడన్. 33

క. హరిణాక్షి యొంటిపాటునఁ, జరియించుచుఁ బంచబాణశరహతిచేతన్
దురపిల్లుచుండఁ జూచుచుఁ, బురుషుఁ డయినవాఁడు విడిచి పోవం దగునే. 34

చ. అనుటయు నాతఁ డి ట్లనియె నంగన నే శివశర్మనందనుం
డను విజితేంద్రియుండను దృఢవ్రతుఁడన్ బితృభక్తిదీక్షితుం
డను గుశికాత్మజాతులకడంకను లోఁగెడువాఁడఁ గాను గా
మినులకు నేల నాపయి భ్రమించెద వన్యులు లేరె కాముకుల్. 35

క. అని పలికి యచట నొకత్రుటి, యును నిలువక పోవుచుండ నుర్వీసురనం
దనుఁ డాకసమున విఘ్నము, లొనరింపఁ దొడంగె నింద్రుఁ డుక్కుమ్మడిగన్.

గీ. ఎన్ని విఘ్నంబు లొనరించుచున్నఁ గాని, కలఁత చెందక పితృభక్తిబలమువలన
నన్నిటిని గూడ సమిధల నగ్నివోలె, భస్మమొనరించు చుండె నాబ్రాహ్మణుండు.

ఉ. అంతట నింద్రుఁ డుగ్రుఁ డయి యాతనిపైఁ గురియింపఁ జొచ్చె న
త్యంతనిశాతబాణనిచయంబును దానికి విప్రుఁ డల్గి నే
నెంత సహించు చున్నఁ దల కెక్కుచు నుండినవాఁడు వజ్రి శా
సింతును వీని వే యొకనిఁ జేయుదు నింద్రుని దేవకోటికిన్. 38

క. పితృభక్తిరతునితోనా, యితనికిఁ జెల్లాట మీఁతఁ డే మనుకొనెనో
బ్రతుకునె ఫణిపై నడుగిడి, నతఁ డిదె కనఁబఱుతు నాసమర్థత ననుచున్. 39

క. కను లెఱ్ఱచేసి యాకస, మును జూచుచు నున్నసమయమున 'దాసోఽహం'
మ్మనుచుఁ జనుదెంచి యింద్రుఁడు, వినయాంజలితోడ నిలిచె విప్రునియెదుటన్.

క. నిలిచి మహాత్మా నీయెడఁ, జలిపిననాతప్పు లెల్ల సైరింపుము నీ
వలిగిన బ్రహ్మాండంబులు, నిలుచునె నే ననఁగ నెంత నిలువఁబడంగన్. 41

క. నీపితృభక్తికి మెచ్చితిఁ, గోపము చాలించి కోరుకొను మే దేనిన్
బ్రాపింపఁ జేయుదును నీ, దాపున కదియెల్ల నెంతదప్పుల నున్నన్. 42

క. అని ప్రార్థించుటయును ద్విజ, తనయుఁడు శాంతించి దేవతావల్లభ నీ
కనుతాపము గలిగినయెడ, ననుగ్రహింపుము బిరాన నమృతము నాకున్. 43

చ. అనుటయు వజ్రహస్తుఁడు ప్రహర్షము నొంది మనంబులోపలన్
జనకహితార్థమై సుతుఁడు సల్పిన చేఁతకు మెచ్చి కొంచు నా
య్యన నమృతప్రపూర్ణ మయినట్టిఘటంబు నొసంగె విప్రనం
దనునకు దుస్సహాం బయినతన్మహిమంబు దలంకు గొల్పఁగన్. 44

క. ఆయమృతకుంభముం గొని, వాయుజవంబునను మరల వచ్చినత్రోవన్
బోయి ద్విజనందనుఁడు తన, నాయన కర్పించె దాని నయభయములతోన్.

—: శివశర్మ పితృభక్తిపరితుష్టుఁడై పుత్రులకు వరం బిచ్చుట :—

క. అంతట శివశర్మ మన, స్సంతోషముఁ జెంది యాత్మజన్ములఁ గని మీ
యంతర్విశుద్ధభక్తికి, నెంతయు మెచ్చితిని గోరుఁ డిచ్చెద వరమున్. 46

చ. అనవుడు నాతనూజులు మహాత్మ ప్రసన్నుఁడ వైతి వేని మా
జనని సజీవయై మరల సమ్మదమున్ గలిగించుఁగాక మా
కనుటయు నట్ల యయ్యెడు మటం చనియెన్ శివశర్మ యంతలో
నన చనుదెంచె నాయమ ప్రణష్టధనం బుపలబ్ధ మైనటుల్. 47

క. అరుదెంచి యామె తనపతి, చరణములకు మ్రొక్కి మొదట జలజల కంటన్
దొరలఁగ బాష్పజలంబులు, పరిరంభణ మాచరించెఁ బరిగొనుసుతులన్. 48

గీ. అట్లు పరిరంభణ మొనర్చి యామె యిట్టు, లనియె నానందవివశాంతరంగయగుచుఁ
గోరుకొందురు సుతులు చేకూరవలయు, ననుచు నరు లిట్టిసాహాయ్యమునకె కాదె.

ఆ. పుణ్యవంతు లైనపుత్రులు గలిగిన, సతులు గాక భాగ్యవతులు గలరె
యువిదలకును గర్భ ముండినదానికి, ఫలము సత్సుతులను బడయు టొకటె. 50

ఉ. పుట్టితి నుత్తమం బయినభూసురవంశమునందు మీఁదఁ జే
పట్టితి దేవతుల్యుఁ డగుభర్తను గర్భమునుండి కంటి మీ
యట్టితనూజరత్నముల సార్థకమయ్యెను జన్మ మెల్ల నే
నెట్టితపంబు చేసి జనియించినదాననొ భూతలంబునన్. 51

క. నావుడు నామెకుఁ బ్రణతులు, గావించి భవత్పవిత్రగర్భంబున మే
మావిర్భవించుటనె పితృ, సేవాభాగ్యంబు జనని చేకుఱె మాకున్. 52

క. మీమాహాత్మ్యమె మూలము, మామహిమకుఁ దల్లి యల్పమానవులము మా
సామర్థ్య మెంత పితరులు, క్షేమంకర మైనతలఁపు చేయక యున్నన్. 53

క. అని పుత్రులు పలుకుటయును, గనుఁగొని శివశర్మ యేమి కావలయునొ యిం
కను మీకుఁ గోరుకొనుఁ డని, కనికరమున ననుడు వారు కౌతుక మొదవన్.

ఆ. తండ్రి మాకు విష్ణుధామంబు దయచేయు, మంతకంటె వేఱె యాస లేదు
కరుణ గలిగి నీవు వర మీయ నెంచిన, వాఁడ వగుట నిట్టివాంఛ పొడమె.

క. అనుటయు శివశర్మ ముదం,బును జెంది సుతాభిలాషమున కట్టులె యా
ననుటయును నపుడె వేంచే,సెను గరుడారూఢుఁ డగుచు శ్రీపతి యటకున్.

క. హరి ప్రత్యక్షం బగుటయుఁ, బరీక్షితాత్ము లగునాత్మభవులు నలువురున్
హరిరూపు లగుచు నేఁగిరి, హరివెంటనె గరుడి నెక్కి హరిపదమునకున్. 57

వ. అంతట శివశర్మ కనిష్ఠపుత్రుం డగుసోమశర్మం జూచి. 58

ఆ. తలఁపు గలిగె నోయి తనయ యీనాఁడు నా, కతివతోడఁ దీర్థయాత్ర కేఁగ
నుండి యింటఁ బ్రోచుచుండుము నీవు మే, మరుగుదెంచుదాఁక నమృతఘటము.

క. అని యానతిచ్చి సుతునకుఁ, జనియెను శివశర్మ యాత్ర సలుపఁగ సతితో
డను సోమశర్మ పితృశా, సనమును బాలించు చుండె సదనమునందున్. 60

క. పదియేండ్లు గడచువఱకును, బదిలముగను జేసి తీర్థపర్యటనంబున్
దుదకు శివశర్మ మదిలో, సదనమునకు వచ్చుతలఁపు సమకూరంగన్. 61

క. తనమాయావిలసనమునఁ, దనువునఁ గుష్ఠంబు గలుగఁ దరుణికిఁ దనకున్
జనుదెంచె నొకదినంబునఁ, దనసద్మమునకు విషాదతప్తుం డగుచున్. 62

క. అరుదెంచినతలిదండ్రుల, చరణములకు మ్రొక్కి సోమశర్మ సభక్త్యా
దరమునను వారిదుస్థితి, పరికించి సహింపలేనిపరితాపమునన్. 63

ఆ. ఇట్టు లనియెఁ దండ్రి యేమిపాపంబునఁ, గలిగె నీయవస్థ కలుషరహితు
లైనమీకుఁ జెప్పుఁ డనుటయు శివశర్మ, పలికె నిట్టు లాత్మభవునితోడ. 64

క. చేసితి మేజన్మముననొ, గాసిం బడఁగలిగినట్టికర్మము దానం
జేసి యొనగూడె మా కీ, దోసము పూర్వార్జితములు దొలఁగవు వత్సా. 65

క. మాకొఱకు నీవు తండ్రీ, శోకింపకు మేమి ఫలము శోకించినచోఁ
గా కుండదు కాఁ దగినది, చేకూరదు కాని దెంతచీకాకైనన్. 66

వ. అనుటయు సోమశర్మ కర్మఫలం బనుభవింపక తప్ప దని తలంచి తత్పరిచర్యా
పరాయణుండై. 67

సీ. తానయి శ్లేష్మమూత్రపురీషముల నెత్తుఁ, గాంచె మేనియును జుగుప్స గొనక
స్నానంబు చేయించుఁ జక్కఁగా వాసన, పోవునట్టులు మేనిపుండ్లు కడిగి
పుట్టముల్ స్వయముగాఁ గట్టును నిజహస్త, ములతోడఁ బరిశుద్ధముగను నుదికి
పాకంబు గావించి పరిశుభ్రముగ నుండ, షడ్రసోపేతభోజనము వెట్టు

గీ. బహుళపరిమళవస్తుసంభరిత మగుచు, శోభిలఁగఁ దమ్ములమ్ములు చుట్టి యిచ్చు
నింపయినతల్పమున శయనింపఁజేసి, పాదముల నొత్తు నిద్దురపట్టువఱకు. 68

క. తనమాఁపులపై నిడికొని, చని తీర్థస్నానములను జలిపించును ద
జ్జననీజనకుల నాతఁడు, తనయుఁ డనఁగ నతఁడె కాక తదితరుఁ డగునే. 69

క. జననీజనకులు నిత్యం, బును జేయం దగినకర్మముల నెల్లను దా
నొనరించును దత్ప్రతినిధి, గను వారికిఁ దత్ఫలంబు గలిగెడిభంగిన్. 70

క. ఈ విధమున మాతాపితృ, సేవాపరుఁ డగుచు వారు చిత్తములోనన్
భావించినపను లెల్లన్, గావించుచు నుండె న త్తనయుఁ డనుదినమున్. 71

క. అటులేన్ శివశర్మ సము, త్కటకోపముతోడ నొక్కతఱిఁ జెడఁ దిట్టున్
బటపట రదములు గొఱుకుచుఁ, దటాలునను దన్ను నొక్కతఱిఁ బాదమునన్. 72

ఆ. తండ్రికోపమునకుఁ దనమదిలోపల, నించు కేని తాప మెనయకుండఁ
బ్రతిపదంబుఁ దత్సపర్యాక్రియలయంద, చూడ్కి నిలిపి యుండె సోమశర్మ. 73

క. తిట్టినను గొట్టినను దన, పట్టు విడువకుండఁ బరమభక్తి మెయిం గ
న్పట్టెడితనయుని వేఱొక, పట్టున శివశర్మ దలఁచి పరిశోధింపన్. 74

క. అమృతఘటంబున నుండిన, యమృతము తనమాయచేత హరియించి సుతో
త్తమ నీకడ మున్నుంచిన, యమృతమిపుడు ద్రావ వలయు నది యిమ్మనియెన్.

వ. అనుటయు సోమశర్మ జనకాజ్ఞ నౌదలం దాల్చి రేఁబవలుం దాను గంటిని
ఱెప్పవోలె భద్రముగఁ గాచుచుండినయమృతఘటంబుం గాంచి దానిపైని
గీలితం బొనరించినమూఁత దీసి చూచి యందు నమృతబిందువు గూడ లేమిం
జింతించి యున్నది యున్నయట్లు చెప్పిన జనకునకు మనఃక్లేశంబు గలుగు నని
తలంచి ఎట్టకేలకు ధైర్యంబు దెచ్చికొని. 76

గీ. శమము దమమును సత్యశౌచములు గలిగి, ధర్మపరిపాలనైకతత్పరుఁడ నగుచు
నేను బితృసేవ చేసితినేని యిపుడె, యమృతపరిపూర్ణమగుఁగాక యమృతఘటము.

క. అని పలుకుటయును దత్క్షణ, మున నె యమృతకుంభ మమృతపూర్ణం బయ్యెన్
గని యాతం డది గైకొని, చని వినయముతోడ నుంచె జనకునియెదుటన్. 78

క. ఉనిచినయమృతఘటంబున్, గనుఁగొని సుతభక్తి కమితకౌతుక మొదవం
గను వారు పూర్వరూపం, బును దాలిచి కానఁబడిరి పుత్రున కంతన్. 79

ఆ. సోమశర్మ వారిఁ జూచి నీరోగుల, సూర్యబింబకాంతిశోభితులను
మదిని విస్మయంబు ముదము నేపారంగ, నాక్షణంబ యడుగులందు వ్రాలె. 80

క. అంతట శివశర్మ మదిన్, సంతోషము నొంది దీవనలచేత సుతున్
సంతోషపఱిచి యేఁగెన్, గాంతామణితోడ విష్ణునగరంబునకున్. 81

వ. అంతట సోమశర్మ సాలగ్రామక్షేత్రంబునకుం జేరి. 82

ఆ. విషయవిముఖుఁ డగుచు విజనప్రదేశంబు, నాశ్రయించి తపము నాచరించెఁ
గొంతకాల మచట నంతలో నతనికా, సన్నమయ్యె మరణసమయ మపుడు.

గీ. దానవులు గొంద ఱేతెంచి వానిదరికిఁ, జలుపఁ దొడఁగిరి భీషణస్వానములను
నేమి పాపమొ కాని యాసోమశర్మ, యంతరంగము సాధ్వసాక్రాంత మయ్యె.
క. ఆసాధ్వసంబుతోడనె, భూసురుఁ డసువులను విడిచిపుచ్చెను దానం
జేసి యొనగూడె నతనికి, నాసురదేహంబు విధిని నగునే గడవన్. 85
సీ. అంత నాతఁడు హిరణ్యకశిపుం డనియెడి, నామంబు గలదైత్యనాయకునకుఁ
గమలాఖ్య యైనతత్కాంతయం దుదయించి, ప్రహ్లాదుఁ డనెడిపేరను జెలంగి
దేవాసురులకుఁ బ్రాప్తించినయనిలోన, నఖిలాత్మకుం డైనహరిని గాంచి
పూర్వజన్మజ్ఞానమును బొంది తనవృత్త,మంతయు నెఱింగించి యచ్యుతునకు
గీ. స్వామియీదైత్యకాయంబుసంహరించి,ననుఁగృతార్థునిఁ జేయుమీయనుచు వేఁడ
నపుడు కరుణాళు వగుటను నతనిశిరము, చక్రధారను ఛేదించెఁ జక్రపాణి.
ఆ. అటులు చక్రనిహతుఁ డగుటయుఁ బ్రహ్లాదుఁ, డతనికన్నతల్లి యైనకమల
పుత్రశోకభారమున వచ్చుకన్నీళు, లేఱు లగుచుఁ బాఱ నేడ్వఁ దొడఁగె. 87
క. రేలును బవళులు శోక, జ్వాలావృత యగుచు నామె శమియింపఁగ లో
మూలుకొనుచుండ సురముని, యాలోపల నరుగుదెంచె నాయమకడకున్. 88

—: సోమశర్మ ప్రహ్లాదుఁడుగాఁ బుట్టుట :—

సీ. అరుదెంచి నారదుం డాసాధ్వి నీక్షించి, సాహసం బొనరింపఁ జనదు నీకు
హరిభక్తుఁడై పుట్టి యతఁడు నీకడుపునఁ, బ్రహ్లాదుఁ డనెడుపేర నె యొసంగి
దానవకృత్యముల్ లేనివాఁడుగ నుండి, దేవభావంబునఁ దేజరిల్లి
సకలలోకప్రశంసాభాజనం బయి, యింద్రసింహాసనం బెక్కఁ గలఁడు
గీ. కాన యీమాట వెలిపుచ్చఁ జన దటంచుఁ,జెప్పి ధైర్యంబు గొలిపి యాశీలవతికిఁ
గానఁ బడకుండ రెండవకంటి కేఁగె, మరలఁ దా నేఁగుదెంచినమార్గమున నె.
క. తరువాతఁ గొన్నిదివసము, లరుగుటయును గర్భ మొదవి యామెకుఁ బుట్టెన్
హరిభక్తుఁ డైనకొమరుఁడు, సురలు దివమునుండి కురియ సుమవర్షంబుల్. 90
క. అమితాహ్లాదకుఁ డగుచును, నమితాహ్లాదమునఁ బుట్టినట్టికతన నా
కొమరునకుఁ బేరు వెట్టిరి, ప్రమాణవిదు లెల్లఁ గూడి ప్రహ్లాదుఁ డనన్. 91

—: ప్రహ్లాదుఁ డింద్రపదంబు నొందుట :—

క. జనియించిన దాదిగ నా, తనయుఁడు హరిపాదభజనతత్పరుఁ డగుచున్
గొనియె నృసింహానుగ్రహ, మున సకలసురాధిపత్యమును త్రిదివమునన్. 92
క. శక్తుం డయ్యును నాతఁడు, సక్తుఁడు గాకుండ స్వర్గసామ్రాజ్యరమా
భోక్తయయి యుండె నన నిఁక, ముక్తిం గను టెంత యావిమోహాత్మునకున్.
క. అనుటయు మఱి యెవ్వరికై, నను నింద్రపదంబు గలిగెనా యనుచును న
మ్మునను లడుగుటయును సూతుఁడు, వినిపింపఁ దొడంగె నిట్లు వేడుకతోడన్. 94

వ. దైత్యదానవు లెల్లరును జక్రపాణిచే వధియింపంబడుటయు దేవత లందఱుం గూడి బద్ధాంజలులై యచ్యుతుని మ్రోల నిలువంబడి. 95

క. దేవా మహానుభావా, నీవలనను శత్రుభీతి నేఁడు దొలంగెన్
దేవతలకు నీకంటెన్, దైవ మెవఁడు గలఁడు త్రిభువనంబులయందున్. 96

క. త్రైలోక్యము నేలుటకున్, జాలినపుణ్యాత్ము నొకని స్వారాజ్యరమా
పాలకునిఁగ దయచేసి కృ, పాళూ మాయాపదలను బాపంగదవే. 97

క. అని యభ్యర్థించుటయును, జనార్దనుం డిట్టు లనియె సాధ్వస మొందన్
బనిలేదు మీకు సువ్రతుఁ, డనునొకవిప్రుం డధీశుఁ డగు దివమునకున్. 98

గీ. అతఁడు వైష్ణవతేజస్సమన్వితుండు, మత్పదాంభోజపరతంత్రమానసుండు
చిరము వైకుంఠమున నివసించినట్టి, పుణ్యవంతుఁడు త్రైలోక్యపూజితుండు. 99

క. సురలార నిర్భయంబుగ, నరుగుం డిఁక మీర లనుచు నావిబుధులకున్
వర మిచ్చి చూచె నదితిని, బరిసరమున నున్నలోకపావనచరితన్. 100

క. కనుఁగొనుటయు మాధవుఁ డా, వనజాయతనేత్ర భక్తవత్సల నానం
దనులకు లోపము గలుగునె, నెన రొప్పఁగ నీవు తోడునీడగ నుండన్. 101

గీ. కాని నామది నొకకోర్కి గలిగె నీవు, దాని నెఱవేర్పఁ దలఁచితి వేని నాకు
గర్భమున నిన్ను సుతునిఁగాఁ గాంచఁగలుగు, నట్టిభాగ్యంబు దయచేయు మంబుజాక్ష

—: విష్ణు వదితికి జన్మించునట్లు వర మిచ్చుట :—

క. అని యడుగుటయును హరి యి, ట్లనియెను నాఁడుమకు దేవి యమరులకార్యం
బున కీవు మర్త్యదేహం, బును దాల్చెద వపుడు నేను బుట్టెద నీకున్. 103

వ. అది యెట్లంటివేని ద్వాదశత్రేతాయుగంబునందు నిర్వక్రపరాక్రమంబున సర్వక్షత్రియవధంబు గావించి భూభారంబు నుద్ధరింప జమదగ్నిమహర్షివలన నీగర్భంబునందుఁ బరశురాముఁ డను పేరను జతుర్వింశత్రేతాయుగంబునందు సర్వదైత్యసంహారంబు గావించి ధర్మస్థాపనం బొనరింప రామభద్రుం డను పేరను నష్టావింశద్వాపరయుగాంతంబునందు భూభారహరణార్థంబు వాసుదేవుం డను పేరను నీయుదరంబున జన్మింతు. 104

గీ. కాని యిప్పుడు దేవి నీగర్భమందుఁ, బుట్టఁగలఁ డింద్రుఁడుగ నొక్కభూసురుండు
దాని కంగీకరింపు మద్దాన నీకుఁ, గలుగుఁ గీరితి మూఁడులోకంబులందు. 105

క. అనవుడు సంతోషంబున, వనజాక్షున కెఱఁగి యదితి వచ్చినత్రోవన్
జనుదెంచి యింటి కి ట్లని, యెను బతి యగుకశ్యపునకు బుతుకాలమునన్. 106

ఆ. ప్రాణనాథ యింద్రపదపాత్రుఁ డైనత, నూజు నొకని నా కనుగ్రహింపు
మనుచు వేడికొనఁగ నామె మస్తకమున, హస్త ముంచి యిట్టు లనియె నతఁడు.

క. చానా నీవు దలంచిన, సూనుఁడు నీగర్భమందుఁ జొచ్చును దీవ్రం
బై నతపం బొనరింపం, గా నగు ననుటయును నదితి గౌతుక మొదవన్. 108

—: సువ్రతుం డింద్రుండుగాఁ బుట్టుట :—

క. వనవాసము గావించుచుఁ, దనువు కృశింపంగ ధ్యానతత్పర యగుచున్
బొనరింపఁ దొడఁగెఁ దపమున్, దనగర్భము వర్ధిలుచుఁ గనంబడు చుండన్. 109

గీ. అటులువర్షశతంబునిండుటయునొక్క, శుభముహూర్తంబుననుబుట్టెసుతుఁడొకండు
దివ్యకాయము భానుదీప్తియును విష్ణు, తేజము చతుర్భుజములును దేజరిల్ల. 110

సీ. కుసుమవర్షంబులు కురిసిరి దేవత, లమలంబు లయ్యె సంద్రములు నదులు
చెలరేఁగి మ్రోఁగె మంగళతూర్యనాదముల్, దీప్యమానము లయ్యె దిక్తటములు
పాటలు పాడి రబ్రముగను గంధర్వు, లాడిరి నాట్యము లప్సరసలు
సలిపి రాశీర్వాదములు సప్తఋషులును, గ్రహము లుచ్చైస్థ్సానగతము లయ్యె

గీ. బ్రాహ్మణులు గూడి వేదమంత్రములచేతఁ, జక్కఁగా నొనరించిరి సంస్తవములు
ముజ్జగములును నాహ్లాదమున మునింగె, నవతరింపంగ సువ్రతుం డమరపతిగ. 111

వ. బ్రహ్మవిష్ణుమహేశ్వరులును దేవతలును బృహస్పతియును గశ్యపుండునుం గూడి యక్కుమారునకు వసుదత్తుం డనియును వసుదుం డనియును నాఖండలుం డనియును బిడౌజుం డనియును పాకశాసనుం డనియును శక్రుం డనియును నింద్రుం డనియును నామకరణంబులు గావించి విధ్యుక్తంబు లగుసంస్కారంబు లెల్ల నొనరించి యొక్కసుముహూర్తంబున స్వర్గరాజ్యాభిషేకంబు గావించిరి. 112

గీ. అంత నాసూనుఁ డింద్రత్వ మంది విష్ణు, సంప్రసాదాగతాఖిలశక్తి యగుచు
వీర్యమునను దపంబున వీనికంటె, నధికుఁ డన్యుండు లేఁ డనుఖ్యాతి నొందె. 113

క. అనుటయును సువ్రతునిప్రా, గ్జనికథ నాలింపఁ బారికాంక్షలు గోరం
గను సూతుఁ డమితహర్షం, బెనయఁగ వారలకుఁ జెప్ప నిట్లు దొడంగెన్. 114

—: సువ్రతుని పూర్వజన్మవృత్తాంతము :—

క. మునులార పూర్వకల్పం, బున రేవాతీరదేశమునయందును వా
మనతీర్థ మనెడిక్షేత్రం, బునఁ గౌశికకులజుఁ డొక్కభూసురుఁ డుండెన్. 115

ఆ. అతఁడు సోమశర్మ యనునామమును దాల్చి, తనకుఁ గలిగినట్టిధనవిహీన
తకును బుత్రహీనతకును లోలోపలఁ, బరితపించు చుండెఁ బ్రతిదినంబు. 116

ఆ. అతనిభార్య సుమన యనుసాధ్వి యొకనాఁడు, కాంతి లేనితన్ముఖంబుఁ జూచి
యార్య పాపహేతు వైనవిషాదంబు, గలుగ నీకు నేమి కతమొ చెపుమ. 117

క. అని యడుగుటయును గాంతా, మును మన మే మేమి పాపములు చేసితిమో
తనయులు లేమియు లేమియు, వినిహేతుల నొనర్చె మనల వే తెమిటికిన్. 118

క. అని సోమశర్మ పలుకుట యును సుమన వచించె నిట్టు లోకమాటను నే
వినిచెదను వినుము నాయెడ, ననుగ్రహం బొదవెనేని యనఘా నీవున్. 119

వ. లోభబీజంబును మోహామూలంబును నసత్యస్కంధంబును మాయాశాఖా సమూహంబును దంభకౌటిల్యపత్రంబును గుబుద్ధిపుష్పంబును నృశంసతాగంధం బును నజ్ఞానఫలంబును ఛద్మపాషండతాచౌర్యేర్ష్యాదిపక్షిగణంబును నధర్మఫల రసంబును నశ్రద్ధాఋతుయుతంబును భావోదకసంవర్ధితంబును నగుసంసార వృక్షంబునీడ నాశ్రయించి సంతసించుచుం బక్వంబు లగుతత్ఫలంబు లారగించుచు నుత్కటం బగుతత్ఫలరసంబుం ద్రావుచు సంతృప్తుండై యుండునరుం డధోగతి పాలగు. కావున. 120

క. ధనపుత్రకళత్రాదుల, ననిశంబును గోరుకొనుచు నాదుఃఖముతో
మునుఁగుచుఁ దేలుచు నుండెడి, మనుజునకు సుఖంబు లేశమాత్రముఁ గలదే.

వ. పితృమాతృపుత్రమిత్రకళత్రబాంధవధనంబులు దత్సంసారసంబంధంబు గల వగుటం జేసి తద్వ్యామోహంబు విద్వాంసునకుం జెల్ల దని పలుకుటయు సోమ శర్మ యామెతోడ ని ట్లనియె. 122

క. కలికీ సంసారమునకుఁ, గలిమికిఁ బుత్రాదులకును గలసంబంధం
బులు దెలుపు మెట్టివో యవి, తెలిసికొనం గోర్కి యుప్పతిల్లెడు నాకున్. 123

క. అనవుడు నాయమ యి ట్లని, యెను నీ కెఱుఁగంగ రాని దే మున్నది యై
నను నీయానతిచొప్పున, వినిచెద నా తెలిసినంత వినుము మహాత్మా. 124

—: నానావిధసుపుత్రస్వరూపనిరూపణము :—

వ. పుత్రులు ఋణానుబంధు లనియు న్యాసాపహారకు లనియు శత్రువు లనియుఁ బ్రియు లనియు నుదాసీను లనియు ననేకభేదంబులు గా జనియించుచుందురు. క్రమంబున నాపుత్రులసంసారధనసంబంధంబులు వివరించెద. 125

క. కొని ఋణము నెవఁడు తీర్పక, చనిపోవునో వాని కపరజన్మమునందున్
జనియించు నుత్తమర్ణుఁడు, తనయుఁడుగాఁ బూర్వదత్తధనము గ్రహింపన్. 126

సీ. పుత్రరూపంబునఁ బుట్టి వాని కతండు, బాల్యంబునం దాటపాటలకును
జవ్వనంబున సురాశాలలకును జార, కాంతలకును ద్యూతకారులకును
ధన మంతయును గూడ వినియోగ మొనరించి, వేశ్మభూముల నెల్ల విక్రయించి
యన్న మోరామచంద్రా యంచుఁ దలిదండ్రు, లేడ్చుచుఁ దిరుగంగ నేడిపించి

గీ. చచ్చిపోయిన వారికి శ్రాద్ధ మైనఁ, జలుపకుండఁగ నాస్తికాచారుఁ డగుచుఁ
బిదపఁ జను నప్పు డైకొని పెట్టినట్టి, కష్టము లనుభవింపక గడవఁ దరమె. 127

గీ. మఱియు ఋణమును దీర్పక మరణ మొందె, నట్టియధమర్ణులు ప్రదాత కపరజన్మ
మందు సుతులుగ జన్మించి యతనిఋణము, దీర్చికొని పోవుచుందురు తీఱినంత.

వ. ఇంక న్యాసాపహారకులవృత్తాంతంబు వివరించెద. 129

సీ. న్యాసంబు హరియించినట్టిమానవునకుఁ, బుట్టు న్యాసస్వామి పుత్రుఁ డగుచు
జనియించి దినదినంబును వృద్ధి నొందుచు, నల్లాఁడుముద్దుగా నాడుకొనుచుఁ
జలుపుచు మధురభాషణములు చెవులలో, నమృతంబు చిలికించినట్టిపగిదిఁ
బరమభక్తిని గనంబఱుచుచుఁ బ్రేమంబు, వర్ధిల్లునట్టులు వర్తిలుచును

గీ. క్రమముగా న్యాస మెల్లఁ బ్రాణములు గొనిన
చాయను హరించి చచ్చు నల్పాయు వగుచుఁ
బుట్టు మరలను మరలను గిట్టు నట్లె
తాను గన్నదుఃఖము తలిదండ్రు లొంద. 130

సీ. నాతండ్రి పోతివే నాయయ్య పోతివే, యని తల్లిదండ్రులు వనరుచుండ
వారల వీక్షించి వాఁడు పక్కున నవ్వి, తలిదండ్రు లెవ్వరు తనయు లెవరు
మున్ను నాన్యాసార్థమును హరియించి నా, ప్రాణంబులను దీసినట్లు గాదె
యనుభవింపక తీఱునట్టిది గాదు గా, వించినకర్మ మేవేళ కైన

గీ. నొకరికి సుతుండఁ గాను నే నొకరు నాకుఁ, దల్లిదండ్రులు గారు నాధనము మీరు
మున్ను హరియించుటను నేను గొన్నవాఁడ, మరల నేఁ డని పల్కి క్రమ్మఱక పోవు.

వ. ఇంక శత్రుపుత్రులవృత్తాంతంబు వివరించెద. 132

గీ. వైరము వహించి బహువిధవ్యథలు పెట్టి, నట్టివారికి బాధితుం డాత్మజుఁడు గఁ
బుట్టి తలిదండ్రులను దిట్టి కొట్టి చంపి, తుదకుఁ జనుఁ బూర్వవైరంబు తొలఁగిపోవ.

వ. ఇంకఁ బ్రియపుత్రులవృత్తాంతంబు వివరించెద. 134

క. అనిశంబును నుపకారము, లొనరించుచు స్నేహభావ మొదవంగఁ గనుం
గొనువారికిఁ బ్రియసుతుఁడు గ, జనియించును నుపకృతుండు చచ్చినపిదపన్.

గీ. అట్లు సుతుఁడుగ నుదయించి యతఁడు దల్లి, దండ్రులను బ్రీతితోడ నాదరముతోడఁ
గొలుచుచును వారు మృతులైనఁ జలిపి తృప్తి, గలుగ వారికి శ్రాద్ధముల్ కడకుఁ బోవు.

వ. ఇంక నుదాసీనపుత్రులవృత్తాంతంబు వివరించెద. 137

గీ. మంచిపనిలోనఁ జేరక మాన్పకుండఁ, జెడ్డపని నూర కుండినచేతనులకుఁ
బుట్టుచుందు రుదాసీనపుత్రులుగను, మంచిపనివారుఁ గీడ్పాటు గాంచువారు.

గీ. అట్లు వారలు పుట్టి పూర్వానుబంధ, మునను దలిదండ్రులకుఁ గష్టములను మాన్పఁ
గను సుఖంబులు చేకూర్పఁగను నొకింత, యేనియును దోడుపడ రుదాసీను లగుట.

క. తలిదండ్రులు సతులును మి, త్రులు భృత్యులు బాంధవులును దురగంబులు నే
న్గులును బశువులును బుత్రుల, వలెనె నిజనిజానుబంధవర్తుల చూవే. 140

గీ. న్యాసము హరింప లేదు ఋణంబు చేయ
లే దొకనియొద్ద నొకని కీ లేదు ఋణము

స్నేహమును ద్వేషమును నుదాసీనతయును
లేదు మును మన కందుచే లేరు సుతులు. 141

గీ. మఱియు నొకమాట పూర్వజన్మంబునందు, నెవ్వనికిఁ గూడ నణుమాత్ర మేనిద్రవ్య
మీయ మైతిమి మన మదె హేతు వయ్యె, నాథ మనసాంప్రతికనిర్ధనత్వమునకు.

క. దత్త మగునెడల వచ్చును, దత్తము గాకున్న నెట్లు దాపురమగు 'నా
దత్త ముపతిష్ఠతే' యని, వేత్తలు వచియించుమాట వితథం బగునే. 143

క. ప్రాప్తవ్యం బగునెడలను, బ్రాప్తం బై తీఱు నది యనాయాసముగన్
బ్రాప్తవ్యము గానియెడన్, బ్రాప్తముగా దెదియు నెన్నిపాటులు పడినన్. 144

క. కావున దుఃఖము నుడుగుము, భావములోపలను శాంతి పాదుకొలుపుమీ
కేవలసాంసారికమో, హావిష్టులువోలె తగునె యగడుపడంగన్. 145

చ. అనుటయు నాతఁ డి ట్లనియె నాయమకున్ దరుణీమతల్లి నీ
వనినది యెల్లఁ దప్పక యథార్థమ యైనను వంశవృద్ధి కా
సను వహియించుచుండెదరు సాధువు లేమి కతంబొ దానికిన్
వినిచెదవేని నాకు విన వేడుక య య్యెడు నంచుఁ బల్కఁగన్. 146

—: సుపుత్రప్రాప్తిప్రకారకథనము :—

ఉ. ఆయమ చెప్పఁగాఁ దొడఁగె నాతని కిట్లు మహానుభావ నీ
శ్రేయము గోరి నేను వివరించెద నన్వయమున్ దరింపఁగాఁ
జేయుటకున్ సమర్థులు సుశీలుర శాశ్వత మైనపుణ్యమున్
జేయక యున్నచోఁ గలుగ నేరరు దుర్లభు లట్టిపుత్రకుల్. 147

గీ. సత్యధర్మరతుండును శాస్త్రవిదుఁడుఁ
బ్రాజ్ఞుఁడును జ్ఞానియును బితృభక్తిపరుఁడు
దాంతుఁడును శాంతుఁడును హరిధ్యానరతుఁడుఁ
దపసియును నగుపుత్రుఁ డుత్తముఁడు చూవె. 148

ఉ. చాలు సుశీలుఁ డైనతనుజన్ముఁ డొకండె ఋణానుబంధజుల్
వేలకువేలు పుట్టినను లేదు ఫలం బిసుమంత యేనియున్
దాలిచి వాని గర్భమునఁ దల్లి కృతార్థతఁ జెందుఁ దండ్రికిన్
మేలిమి గల్గు నట్టిగుణసీరధి పుత్రుఁడుగాఁ జనించుటన్. 149

గీ. పుణ్యమున నుదయించు సుపుత్రుఁ డొదవుఁ, బుణ్యమున శుద్ధవంశంబు పుణ్యమున నె
మంచిచావును మంచిజన్మమును గలుగుఁ, గానఁ బుణ్యంబె సౌఖ్యనిదాన మనఘ.

గీ. అనుటయును సోమశర్మ యాయమను గాంచి
పుణ్య మన నెట్టిదితెయు వచింపుము లతాంగి

వినఁగ వేడుక గలిగెడు ననుడు నామె
యేరుపడునట్టు లతనితో నిట్టు లనియె. 151

—: పుణ్యావిర్భావప్రకార కథనము :—

గీ. బ్రహ్మచర్యతపోయజ్ఞపంచకములు, శౌచ మస్తేయమును నహింసయును శక్తి
మర్థ మనుదానమునునియమమునున నెడి,యంగముల చేతధర్మోదయంబుగలుగు.

క. తనయభ్యుదయమునకు సా, ధన మగునాతని గొంసంగు ధర్మము పుణ్యం
బును బుణ్యముచేతను నై, గొనుచుండు నతండు దాను గోరిన దెల్లన్. 153

క. అనుటయు ధర్మము నెవ రై, నను జూచినవారు గలరె నళినాయతలో
చన చెప్పు మనుచు వాంఛిం, చిన నాయమ వాని కిట్లు చెప్పఁ దొడంగెన్.

—: ధర్ముఁ డత్రిపుత్రులకు సపరివారముగాఁ బ్రత్యక్ష మగుట :—

సీ. అత్రినందనులు దత్తాత్రేయుఁ డనియును, దుర్వాసుఁ డనియును దొల్లి గలరు
ధర్మస్వరూపంబు దర్శింపఁగా నెంచి, వా రిద్దఱును నిరాహారు లగుచుఁ
బదివేలవర్షముల్ పంచాగ్నిమధ్యంబు, నను జలమధ్యంబునను వసించి
యతిఘోరముగఁ దపం బాచరించినను బ్ర, త్యక్షంబు గాదయ్యె ధర్మమూర్తి

గీ. యంత దుర్వాసుఁ డధికకోపారుణాక్షుఁ, డగుచు శపియింపనుండ నయ్యవసరమున
ధర్మము మహీసురాకృతి దాల్చి వచ్చె, సపరివారంబు గాఁగఁ దత్సవిధమునకు.

క. చనుదెంచి యత్రిపుత్రునిఁ, గనుఁగొని మునివర్య తపము గావించుచుఁ జె
ల్లునె యాగ్రహంబు చెందఁగఁ, గొన నగునె తపఃఫలంబు క్రోధాంధులకున్.

క. అనుటయు దుర్వాసుం డి, ట్లనియెను నీ వెవఁడ విచటి కరుదేరంగాఁ
బని యేమి వీర లెవ్వరు, వినిపింపుము క్రోధగాథ వినిచెదఁ బిదపన్. 157

వ. అనుటయు ధర్మం డాతని కి ట్లనియె. 158

సీ. బ్రహ్మచర్యం బీధరాసురుం డీబ్రాహ్మ, ణుండు సత్యం బీద్విజుండు దపము
దాన మీబాపఁడు దమ మీద్విజన్ముఁ డీ, సర్వంసహాసుధాశనుఁడు నియతి
యీబాడబుఁడు శౌచ మీసాధ్వి శుశ్రూష,క్షమ యీలతాంగి యీకాంత శాంతి
ప్రజ్ఞ యీతల్లి యీపంకజాక్షి యహింస, శ్రద్ధ యీతన్వి యీచాన మేధ

గీ. యీమె దయ నాకు జనయిత్రి యేను ధర్ముఁ
డనెడివాఁడను నీక్రోధ మపనయింప
నరుగుదెంచినవార మే మందఱమును
మానికులదీప నీసన్నిధానమునకు. 159

—: దుర్వాసుఁడు ధర్మునకు శాపం బిచ్చుట :—

క. అనవుడు దుర్వాసుం డి, ట్లనియెను నాక్రోధ మార్ప నగునే నీకున్
జను మిప్పుడు కనఁబడితిమె, కనులకుఁ బదివేలయేండ్లు గడచినపిదపన్. 160

క. ఇప్పటి కైనను గోపం, బుప్పతిలినమీఁదఁ గాదె యొదవెను మాపైఁ
దప్పునిపనిగ ననుగ్రహ, మప్పా మోఘము లె బ్రాహ్మణామర్షంబుల్. 161

క. అని పలికి నీవు దాసీ, తనయుఁడవు గ సుఖము లేనిధరణిపతివి గాఁ
గను జండాలుండవు గను, జనియింపు మ టంచు మూఁడు శాపము లిచ్చెన్.

వ. అనుటయు సోమశర్మ యాశ్చర్యంబు నొంది తన్వీ యాపయిని ధర్ముఁ డేమయ్యెఁ దద్వృత్తాంతం బెఱింగింపు మని యడుగుటయు నాయమ యాతని కి ట్లనియె.

గీ. పుట్టెను యుధిష్ఠిరుం డనుభూపతిగను, భరతవంశంబునను వీరబాహుఁ డనెడి
శ్వపచుఁడుగను హరిశ్చంద్రనృపతి సేవ, దాసికిని విదురుఁడుగను ధర్ముఁ డనఘ.

గీ. అనుటయును సోమశర్మ యి ట్లనియె దేవి, బ్రహ్మచర్యాదు లెల్ల ధర్మమున కుదయ
సాధనము లంటి వానిలక్షణము లేవొ, తెలుపుమా నాకు నీ కవి తెలిసె నేని.

వ. అని యడుగుటయు నప్పతివ్రతామణి యాతని కి ట్లనియె. 166

—: బ్రహ్మచర్యాదిస్వరూపనిరూపణము :—

సీ. వదల కుంటయు నిజవంశసదాచార, మును నిత్యమును సత్యముననె రతియు
ఋతువేళలనెయాత్మసతిఁగూడుటయు నన్య, కాంతపైఁగామంబు గలుగమియును
బ్రహ్మచర్యంబు నాఁబడు గృహమేధికి, నుంఛవృత్తియును బరోపకృతియుఁ
గామకోపంబులు లేమియు నాచార, మును బ్రహ్మచర్యంబు వనగతునకు

గీ. ధ్యాననిష్ఠయు జ్ఞానవర్తనముఁ బాప, విముఖతయును సతీసంగవిముఖతయును
సత్యదమవృత్తియునుబ్రహ్మచర్యముగను, యతికిఁ జెప్పంగఁబడియెమహానుభావ.

క. పరకాంతాలోల్యంబును, బరధనకాంక్షయును లేక పలికిన దెల్లన్
బరమార్థంబు గ నుండుటె, పరగును సత్యంబు నాఁగఁ బావనచరితా. 168

గీ. అన్నము జలంబు వసనంబు నాసనంబు
ఛాయయును శయ్యయును బ్రదేశమును దుదకుఁ
దృణము నేనియు నాదర మెనయఁ బ్రతిది
నమును బాత్రుల కిడుటె దానము మహాత్మ. 169

గీ. అన్వహము దేవతాబ్రాహ్మణార్చలందు, దానధర్మంబులందు వ్రతంబులందు
నఖిలలోకోపకారకార్యంబులందు, నిలుకడను దాల్చి యుండుటె నియతి యనఘ.

గీ. పరులు నిందించినను గోపపడక యుంట, కొట్టినను గొట్టుటకుఁ బూనుకొనక యుంట
తొక్కటము లెన్ని వచ్చినఁదొణఁకకుంట, క్షమయటంచువచింతురుశాస్త్రవిదులు.

క. చలిపెడిస్నానాచమనం, బులవలన విరాగభావమున లోపలనున్
వెలుపలను గలుగుశుద్ధియె, యలరారును శౌచ మనెడియభిధానమునన్. 172

క. తన కుండినట్లె యన్యుల, కును గల దని బాధ యెంచికొని తృణమున కై
నను గ్లేశము గలిగింపని, యనువున నుండుటె యహింస యనఁబడు ననఘా.

క. భూతములకుఁ దనవలనన్, గాతర్యం బించుకేని కలుగనిభంగిన్
రాతిరియును బవలును సం, ప్రీతిని మెలఁగుటయె శాంతిపేరను బరగున్. 174

క. పరకాంతాపరధనముల, హరియింపక యుండు టొకఁడె యస్తేయ మనం
బరగును దమ మనఁ బరఁగును, జరియించెడియింద్రియములజన మడఁచుటయే.

క. తనయెడలను దేశికునకు, ననుగ్రహము గల్గునట్టు లతఁడు నియోగిం
చినపను లెల్లను జేయుచు, నునికియె శుశ్రూష యనఁగ నొప్పు మహాత్మా.

గీ, సాంగముగ నున్నధర్మంబు నాశ్రయించి, నట్టినరునకు ధర్మమే యఖిలసౌఖ్య
ములను నిహపరములలోనఁ గలుగఁజేసి, కట్టకడకు భవాంభోధిగట్టుఁ జేర్చు.

చ. అనుటయు సోమశర్మ ముదితాననుఁడై సతి నీకు నీకథన్
వినిచినవార లెవ్వ రని వేడుకతో నడుగంగ నామె యి
ట్లనియెను ప్రాణనాథ చ్యవనర్షి యనన్ విని యుందు తండ్రి యా
యనఘుఁడు నాకు బాల్యమున నాతఁడు నన్నెడఁబాయ కుండెడిన్. 178

గీ. అట్లు లెడఁబాయకుండ నన్నతఁడు పోవు, నాశ్రమములకు దేవతాయతనములకుఁ
గూడఁ దోడ్కొనిపోవు నాకును వివేక, మొదవున ట్లట్టు లుండంగ నొక్కనాఁడు.

గీ. కాశికాన్వయజాతుఁ డొక్కండు వేద
శర్మ యనుబ్రాహ్మణుండు విషాదతప్తుఁ
డగుచు నొకచోట నుండఁగా నతనిఁ గాంచి
యడిగె మాతండ్రి యిది యేమి యయ్య యనుచు. 180

గీ. అడుగుటయు వేదశర్మ యి ట్లనియెఁ దండ్రి, యేమి చెప్పుదు నావంశ మింతతోడ
నంతరించుచు నుండె లేఁ డర్భకుండు, పితరులకు దుర్గతులను దప్పించువాఁడు.

క. అని చెప్పుచుండ నచటికిఁ, జనుదెంచెను సిద్ధుఁ డొకఁడు చనుదెంచినయా
తనికి సభక్త్యుపచారము, లొనరించిరి వేదశర్మయును మాపితయున్. 182

ఆ. అట్లు లుపచరించి యార్తికారణమును, వినిచి రాతనికిని విని యతండు
ధర్మసేవనంబె తగుమందు దీనికి, ననుచు ధర్మగాథయును వచించె. 183

క. ఆకథను వింటి సిద్ధుని, వాకున నాఁ డిపుడు చెప్పవలసినకతనన్
నీకు వచించితి నింతియ, కాక మఱొక్కరికిఁ జెప్పఁగా లేదు సుమీ. 184

ఉ. అంతట వేదశర్మ స్వగృహంబునకుం జని ధర్మసేవ న
త్యంతము శ్రద్ధతోఁ జలిపి యాత్మజులన్ ధనధాన్యసంపదల్
వింతగఁ జెందె నట్టులె ఫలింపవె నీకును నీప్సితార్థముల్
చింతిల నేల ధర్మము భజింపు మనుద్యమమున్ ద్యజింపుమీ. 185

—: ధార్మికులజన్మమరణములు :—

గీ. అనుటయును సోమశర్మ యిట్లనియె సాధ్వి, ధర్మసేవ యొనర్చినధార్మికులకు
జన్మమృత్యువు లెట్టివి సంఘటిలునొ, తెలుపుమీ నాకు విన(గుతూహలముగలిగె.

చ. అనుటయు నామె యిట్లనియె నాతనితోడను ధర్మసేవనం
బొనరిచినట్టివారలకు నుత్క్రమణం బగుకాలమందు మే
కొనదు శ్రమంబు తాప మొనగూడదు కల్గదు తృష్ణ సంభ్రమం
బెనయదు స్వేదకంపనము లేర్పడ వుండదు క్లేశ మేదియున్. 187

—: పుణ్యమరణస్థానములు :—

వ. అగ్నిగృహంబునను గోష్ఠంబునను దేవాలయంబునను నారామంబునను నశ్వస్థానంబునను గజస్థానంబునను నశ్వత్థవటాశోకబ్రహ్మవృక్షశ్రీవృక్షచూతవృక్షసాన్నిధ్యంబునను దేవబ్రాహ్మణసన్నిధానంబునను రాజగృహంబునను రణభూమియందును మరణంబు ప్రాప్తించెనేని పుణ్యలోకంబులు గలుగుం గావున నట్టి పుణ్యస్థలం బేదేని యవసానకాలంబున ధర్మాత్ములకు(దటస్థం బగు. ఆప్రదేశమున నెలకొని. 188

గీ. చేయుచును బరమేశ్వరచింతనంబు, ననుభవించుచు నానంద మాత్మలోన
నామహాపుణ్యధను లనాయాసముగను, గదలుదురు బ్రహ్మరంధ్రమార్గంబునుండి.

గీ. అంత సురదూత లరుదెంచి యమృతమునను, దీర్థమాడించి వారిని దేవయాన
మునను గూర్చుండ(గా(బెట్టికొని స్తవంబు, లాచరించుచు(గొనిపోదు రమరపురికి.

క. చనుదెంచువారి కెదురుగ(, జని ధర్మసమేతు(డగుచు శక్రుండు కావిం
చినకర్మమునకు(బ్రతిఫల, మనునట్టు లొసంగు దేవతాకారములన్. 191

క. దేవత లయి వారలు సం, భావింపంబడుచు(ద్రిదశపరివారముచే(
గావించినపుణ్యము సరి, పోవువఱకు నుందు రమరపురమున నంతన్. 192

క. జనియింతురు వారలు భువి, ననవద్యము లైనయన్వయములందు(బురా
తననిజధర్మానుగ్రహ, మున మరలను గూడ ధర్మమునె సేవింపన్. 193

—: పాపిష్ఠులజన్మమరణములు :—

గీ. అనుటయును సోమశర్మ యిట్లనియె(దన్వి, పాపములు చేయువారలు పడయునట్టి
జన్మమరణంబు లెట్టిలక్షణము గలవొ, తెలుపుము సవిస్తరంబుగా(దెలిసెనేని.

వ. అని యడుగుటయు నావివేకవతీమతల్లి యాతని కిట్లనియె. నాథా మలమూత్రదూషితం బగుదేశంబునను జంబాలవాటికయందును గర్దభాదు లుండెడిప్రదేశంబునను వేశ్యాగృహంబునను నస్థిచర్మనఖకేశావృతం బగుస్థానంబునను బాపవంతు లాక్రమించినచోటను నాస్తికపూరితం బగు స్థలంబునను బాపిష్ఠులకు మరణంబు ప్రాప్తించు. అట్టిసమయంబున. 195

గీ. భీమరూపాకారులును క్రూరభాషణులును, సర్పహస్తులు వికృతలోచనులు దీర్ఘ
జిహ్వలును నీలవర్ణులు సింహముఖులు, కుటిలగాత్రులు నగుయమభటులు రాఁగ.

క. వారలను గనుంగొని హా, హారావము లెసఁగ నేడ్తు రాపాపులు చే
కూర నెడ భయము మేనుల, నూరఁగఁ జెమ్మటలు గనుల నోడియఁగ ధారల్.

వ. మఱియును.

క. చలిపినపూర్వాఘంబులు, పిలపిల నేతెంచి కంఠబిలమున కడ్డై
నిలిచి కఫాకారంబున, నలయిక గలిగించి నొంచు నాపాతకులన్. 199

క. ధనగృహకాంతాదులపై, నెనసినమోహంబు విడిచి యేఁగఁగ లేమిన్
జనకుండ నిలువ లేమిని, వనరుదు రరిఁ బద్ధకపులవలె నాపాపుల్. 200

గీ. తెలివి వచ్చినయపు డెల్లఁ దలఁచికొనుచు, నాత్మపరివారమును దమయార్జనమును
దెలివి దప్పినయట్టివేళలను నెల్ల, విస్మరించుచుఁ గుడుతురు వెతలు వారు. 201

గీ. అట్టు లాపాతకులు బాధ లనుభవించు, చును శరీరాభిమానంబు చననికతన
బ్రతికియుండినయట్టివారలును జచ్చి, నట్టివారును గాక యల్లాడు చుండ. 202

గీ. అట్టిదుర్భరసమయమునందు రేఁగి, యమభటులు గాలములను దేహములనుండి
వారలను బైకి లాగి దుర్వారముగను, బాఱిపోకుండ బిగియించి పాశములను.

వ. నోటఁ బట్టరానితిట్టులం దిట్టుచుఁ గశాగదాదండంబులఁ గొట్టుచుఁ బరశువుల
నఱుకుచుఁ గుంతంబులఁ బొడుచుచు ముష్టిజానువులఁ గ్రుమ్ముచుఁ బాదంబుల
మట్టుచుఁ గంటకప్రదేశంబులందును ద్వాదశాదిత్యసంతప్తమార్గంబులందును
బర్వతశిఖరంబులందును నీహారస్థానంబులందును బడ వైచి యీడ్చికొనిపోయి
యంతకునియంతికంబున నిలుపుదురు. 204

గీ. గాసివడి ష్పూర్ణముగఁ గశాకాంతు లుడిగి
నిలువఁబడియున్న యాపాతకులకు నెదుటఁ
గానఁబడు నంతకుఁడు మృత్యుకల్పుఁ డగుచుఁ
బ్రళయకాలానలోజ్జ్వలత్ప్రభలతోడ. 205

క. ఆతనిఁ గనుఁగొని భయమునఁ, జేతంబులు చెదరి విగతచేతను లగునా
పాతకుల నపుడె నారక, యాతనలం గుడుప శమనుఁ డాజ్ఞాపింపన్. 206

వ. యమకింకరులు తదాజ్ఞ శిరంబులం దాల్చి నానావిధాయుధపాణులై కట్టెదుట
నిలువంబడి కటికవారలం జూచి బిట్టఱచుగొఱ్ఱియలచందంబున హాహారావం
బులం జేయుచుండునాపాతకుల నీడ్చికొనిపోయి తత్తత్పాతకానుగుణంబు లగు
నానావిధనరకయాతనలం బడ వైచి సహస్రయుగంబులు గడచువఱకును వేఁచు
చుండుదురు. పిదప నాపాపులు భూలోకంబున స్థావరజన్మంబులం దాల్చి క్రమం
బుగాఁ గీటకమక్షికాదిజన్మంబులును శునకరాసభమార్జాలసూకరసర్పవ్యాఘ్రము

పతత్త్రిముఖజన్మంబులును జంబాలభిల్లపుళిందాదిజన్మంబులును బడయుదురు. 207

చ. అనుటయు సోమశర్మ వనజానన నీవు వచించినట్టి దె
ల్లను వినినాఁడ నాకు సుతలాభము గల్గకయున్న మానసం
బునకు సుఖంబు లే దెటులు పుత్రుఁడు గల్గునో సత్వరంబుగా
వినిచెదవేని నాహృదయవేదన యాఱు నటంచుఁ బల్కుడున్. 208

వ. ఆయమ యాతని కి ట్లనియె. 209

క. అనఘా సుతకాంక్ష భవ, న్మనమునఁ దీవ్రముగ నుండినను శీఘ్రమునన్
జనుము వసిష్ఠునియంతిక, మున కాయనఘుం డుపాయమును బోధించున్. 210

చ. అనుటయు సోమశర్మ సరయంబున జాహ్నవి కేఁగి తత్తటం
బునఁ దప మాచరించుచును బొల్చువసిష్ఠునకున్ బ్రణామముల్
పొనరిచి నిర్ధనత్వమును బుత్రవిహీనతయున్ ఘటిల్లఁగాఁ
దనకు నిదాన మేమొ ప్రణిధానమునన్ వచియింప వేఁడినన్. 211

—: దారిద్ర్యపుత్రానుత్పత్తిహేతుకథనము :—

వ. అమ్మహాముని యాతని కి ట్లనియె. 212

సీ. బ్రాహ్మణోత్తమ పూర్వజన్మంబునను నీవు, జన్మించితివి శూద్రజాతియందు
కలిగిరి నీకు లక్షణయుక్తు లగుపుత్రు, లనుకూల యైనయర్ధాంగియందు
కృషిపశుపాలనాకృత్యంబులను దప్ప, నితరధర్మముల నీ వెఱుఁగ వైతి
ధాన్యంబు దధిపయస్తక్రాజ్యములు విక్ర,యించి యార్జించితి వెంతో ధనము

గీ. కట్టితివి చిన్నిపోయినపుట్టములను, బెట్టితివి భూమిలో లంకెబిందియలను
నడిగినను గొడుకుల కేని పడఁతి కేని, చివర కైనను నీగుట్టు చెప్ప వైతి. 213

క. హరి యని యొకనాఁ డేనియుఁ, బొరపాటున నైన ననకపోతివి నోటన్
విరచింపవైతి వెపుడును, నొరులకు నొక్కించు కేని యుపకారంబున్. 214

గీ. ఒరుల కొకగవ్వ యైన మున్నొసఁగ కున్న, కతన నీనాఁడు ద్రవ్యంబు గలుగదయ్యె
లేమి ననుబంధములు పుణ్యమామతిలమిఁ, గలుగరు కుపుత్రులునుసుపుత్రులునునీకు.

గీ. అనుటయును సోమశర్మ యి ట్లనియె ననఘ, పూర్వజన్మంబునను నెట్టిపుణ్యమేని
యేను గావింప కుండిన నెట్లు గలిగె, నీభవంబున బ్రాహ్మణ్య మీవె చెపుమ. 216

క. అనుటయు వసిష్ఠుఁ డి ట్లని, యెను వానికి నొక్కపుణ్య మీవు పరేచ్ఛన్
బొనరించితి పూర్వము దా, నను బ్రాహ్మణ్యంబు నీకు నాయన కలిగెన్. 217

గీ. అనుటయును సోమశర్మ మహాత్మ నేను, బూర్వమున నొనరించినపుణ్య మేమొ
దాని నొనరింపఁ జేసినధన్యు లెవరో, తెలుపు మని దోసిలొగ్గి ప్రార్థించుటయును.

వ. వసిష్ఠమహర్షి యాతని కి ట్లనియె. 219

—: బ్రాహ్మణ్యోత్పాదకపుణ్యకథనము :—

సీ. హరిభక్తుఁడైన బ్రాహ్మణుఁ డొక్కరుఁడు మున్ను, గావించుచును దీర్థసేవ లెల్లఁ
జేయుచు భూప్రదక్షిణము దైవికముగా, నీ వున్నయూరికి నేఁగుదెంచె
నది విని నీపుత్రు లర్థాంగియును ద్వాద, దృష్టవశమునఁ బ్రేరేప నిన్ను
నీ వేఁగి యతనిసన్నిధికిఁ బ్రార్థించి తో, డ్కొనివచ్చి వాని నీగోష్ఠమందు
గీ. నునిచి సకలపదార్థము లొసఁగి చేసి, నాఁడ వుపచారములు మఱునాఁడు విష్ణు
శయనదిన మయ్యె నీచేతి సముచితముగ, నతఁడు చేయించె హరిదినవ్రతము నాఁడు.
క. కావించితివి వ్రతంబును, గావించితి ద్వాదశిని సఖండముగా భూ
దేవసమారాధనమును, గావున బ్రాహ్మణ్య మిపుడు గలిగెను నీకున్. 221
క. ఆరాధింపుము హరిని ద. దారాధనమునను దొలఁగు నఘ మెల్లను జే
కూరును సకలార్థములును, నారాయణుఁ డొకఁడె దిక్కు నాకును నీకున్. 222
చ. అనుటయు సోమశర్మ చరితార్థుఁడ నైతిని నీయనుగ్రహం
బున ననుచున్ వసిష్ఠునకు మ్రొక్కి గృహంబున కేఁగుదెంచి మా
నిని కెఱిఁగించి సర్వమును నేను దపం బొనరింపఁ బోదు నా
కనుమతి యిమ్ము సాధ్వి యన నాయమ నేనును వత్తు నం చనన్. 223
సీ. ఆయమతోఁ గూడి యతఁ డేఁగి నర్మదా, కపిలానదీసమాగమమునందు
స్నానసంధ్యాద్యనుష్ఠానంబు లొనరించి, కూరుచుండి తదీయతీరమందు
జపియింపఁ దొడఁగె నిశ్చలమనంబున ద్వాద, శాక్షరమంత్రంబు హరిని గూర్చి
యటు జపించుచు నుండునవసరంబున వాని, కంబుజాక్షుండు ప్రత్యక్షమయ్యె
గీ. నంత నాతఁడు పెన్నిధి యబ్బినట్లు, సంతసము చెందుచును మహాస్తన మొనర్చె
దానికి జనార్దనుండు ముదంబు నొంది, కోరుకొనుమయ్య తీర్తు నీకోర్కు లనియె.
గీ. అనుటయును సోమశర్మయాహ్లాద మెనయఁ, ద్వత్పదాంభోజభక్తిచిత్తమున నెపుడుఁ
బాయకుండఁగ దారిద్ర్యబాధ దొలఁగ, సత్సుతుఁడు గల్గఁ గరుణింపు జలజనయన.
వ. అని వేఁడుటయు. 226
గీ. అటులె యగుఁగాక యని మీఁద నచ్యుతుండు, వాని కిహమున దుఃఖంబు లేనియట్లు
కొనకు వైకుంఠపదము చేకూరునట్లు, వరము లిచ్చి యగోచరత్వంబు నొందె.
ఉ. అంతట సోమశర్మ సఫలాశయుఁడై తనకాంత కెల్లవృ
త్తాంతముఁ జెప్పుచున్ నిజగృహంబునకున్ జనుదెంచె నంతలో
వింతగ ధాన్యరాసులును వెండియు రత్నములున్ సువర్ణమున్
గాంతులు మిన్ను ముట్టఁగను గ్రాలుచు నుండె గృహాంగణంబునన్. 228
క. అది చూచి మహాశ్చర్యము, గదురఁగ నాద్విజుఁడు విష్ణుకారుణ్యముచే
నొదవినఫల మిది యనుకొని, ముదమున ధర్మపథములు [illegible] మొనసెను [illegible].

క. నెలకొల్పెను దేవాలయ, ములు నిల్పెను ధర్మసత్త్రముల విద్యాశా
లల నేర్పఱించెఁ బుణ్యం, బలవడి యెడిపనుల నెల్ల నాతఁ డొనర్చెన్. 230

ఉ. అంతట సోమశర్మ ముద మందఁగ గర్భము దాల్చెఁ దన్మనః
కాంత క్రమంబునన్ గడవఁగా దినముల్ నెలలున్ జనించె భా
స్వంతుఁడువోలె నొక్కతనుజన్ముఁడు దీప్తులు దిక్తటంబులన్
గంతులు వైచుచున్ ద్రిభువనంబులఁ గూడను మేలుకొల్పఁగన్. 231

గీ. ఆముహూర్తంబునను చతురాననుండు, సురలతోఁ గూడి మేదిని కరుగుదెంచి
యక్కుమారునకు సువ్రతుఁ డనెడిపేరు, వెట్టి వేంచేసె సంతోష ముట్టిపడఁగ.

వ. తదనంతరంబు సోమశర్మ యక్కుమారుని భగవదంశసంభూతునిఁగా భావించి
తదావిర్భావంబునఁ దనవంశం బంతయుం బావనం బయ్యె నని మిగుల నానం
దించుచుఁ దజ్జన్మోత్సవప్రయుక్తంబు లగుదానధర్మంబు లనేకంబు లొనరించెనంత.

క. ప్రతిపచ్చంద్రుఁడువలె నా, సుతుఁ డభ్యుదయంబు నొందుచును హరిపై నిన్
మతి నిలిపి పూర్వజన్మా, గతవాసనచేత ముదము గాంచుచు నుండెన్.

క. అనిశముఁ దదేకచింతన, మును గావించుచును లోకమును గనుగొనుచుం
టను వానికిఁ గానంబడు, జనార్దనుం డఖిలవస్తుసంఘములందున్. 235

క. అరుదెమ్ము కృష్ణ పోదమొ, గరుడధ్వజ పలుక వేమి కమలాక్ష హరీ
పరువెత్తు మనుచు నాడును, బరమానందమున నతఁడు బాలురతోడన్. 236

క. చదువక యె సువ్రతునకున్, విదితము లైపోయె నఖిలవిద్యలు గూడన్
జదువుల కెల్లను నెల వగు, చదు వనఁబడువిష్ణుభక్తి సమకూరుటచేన్. 237

వ. అంత నాసువ్రతునకు గర్భాష్టమవర్షంబు చేకూడుటయు సోమశర్మ యుపనయ
నంబు గావించి క్రమంబున వివాహంబు చేసె. 238

క. అంతట సువ్రతునకు స, త్సంతానము గలిగెఁ గలిగె సంతానము ద
త్సంతతికిఁ గలిగె దానికి, సంతతి యతిముద్ధము సోమశర్మకుఁ గలిగెన్. 239

వ. అట్లు బహుకాలంబు సుఖంబుగా గతించుటయు నారాయణుండు వారలకుఁ
బరలోకసుఖంబు ప్రసాదింప నెంచి నిజధ్యానపరాయణచిత్తవృత్తియై తీవ్ర
సమాధి నున్నసువ్రతునకుఁ బ్రత్యక్షంబై మహానందంబు గలిగించి మాతాపితృ
కళత్రసహితంబుగా నాతని వ్యోమయానం బెక్కించుకొని నిజధామంబునకుం
జనియె. అంత. 240

ఆ. వార లెల్లఁ గూడి వైకుంఠమున నుండి, విపులసౌఖ్య మనుభవించు చుండఁ
గశ్యపునకుఁ బుట్టి కాంచె నింద్రత్వము, సువ్రతుండు విష్ణుచోదనమున. 241

వ. అని వచించుటయు మహర్షులు సూతునితో ని ట్లనిరి. 242

ఆ. అకట పూర్వజన్మమున వాసనను జేసి, ప్రాప్తమయ్యె విష్ణుభక్తి మత్ర

తునకు నంటి సువ్రతునిపూర్వజన్మవృ, త్తాంత మెఱుకపఱుపుమయ్య మాకు.

వ. అనవుడు సూతుఁడు వారల కి ట్లనియె. 244

క. మునులార మీరు ప్రశ్నిం, చినవిధమున వ్యాసుఁ డడుగ సృష్టికరుని న
మ్మునికిఁ బితామహుఁడు వచిం, చినమాటలె మీకు నేను జెప్పెద వినుఁడీ.

సీ. వైదిశం బనెడియాహ్వయము గల్గినయట్టి, పుర మొకం డుండెను భూతలమున
దానికి ధర్మాంగదక్షితీంద్రుఁడు ఋత, ధ్వజునిపౌత్రుం డుండె వల్లభుఁడుగఁ
గల దావసుంధరాతలవల్లభునకు సం, ధ్యావళి యనియెడిధర్మపత్ని
యాదేవియందు ధర్మాంగదుఁ డనియెడు, కొడు కుద్భవించె నాక్షోణిపతికి

గీ. తండ్రియభిలాషమునుదీర్పఁదలఁచియతఁడు, తనశిరంబిచ్చె మోహినియనెడిచెలికి
శ్రీనివాసుఁడు మెచ్చి తచ్ఛీలమునకు, వాని వైకుంఠమున నుంచె మేనితోడ.

గీ. అటులు ధర్మాంగదుండు సహస్రసమలు, నిండువఱకును నుండి యానెలవునండ
క్షీణ మగుటయుఁ బుణ్యంబు క్షోణియందు, సోమశర్మకు జనియించె సువ్రతుఁడుగ.

మ. అనుచున్ వ్యాసుఁడు బ్రహ్మ కి ట్లనియె దేవా మున్ను ధర్మాంగదుం
డనుతేఁ డొక్కరుఁ డింద్రుఁడై కృతయుగంబం దుండె సృష్ట్యాదిలో
నని పెద్దల్ వచియింతు రీనృపుఁడు వాఁడా కానిచో నన్యుఁడా
వినిపింపంగదె నామనంబు విన నువ్విళ్ళూరెడున్ నావుడున్. 248

వ. అమ్మునీంద్రునకుఁ బద్మోద్భవుం డి ట్లనియె. నాయనా దినంబులును వారంబు
లును బక్షంబులును మాసంబులును ఋతువులును సంవత్సరంబులును యుగం
బులును మన్వంతరంబులును గల్పంబులును బోవుచు వచ్చుచు నుండునట్లు
కల్పాంతంబులందు వేదంబులును స్మృతులును బురాణంబులును దేవతలును
బ్రాహ్మణులును మున్నగుచరాచరప్రపంచంబు లన్నియును నేనును నారా
యణునియందు లయంబు నొందుచుఁ గల్పాంతరంబులందు నారాయణునివలన
యథాపూర్వంబుగా మరల నావిర్భవించు చుందుము. ఆసమయంబున రామా
ద్యవతారపురుషులును ధర్మోత్తరు లగుయయాతినహుషాదిమహీపాలురును
మహాత్ము లగుమన్వాదులును నింద్రపదంబు నధిష్ఠించు చుందురు. తత్ప్రకారం
బునఁ బూర్వకల్పంబునం దింద్రపదంబు నధిష్ఠించినధర్మాంగదుండ యీకల్పంబు
నందు సువ్రతుండుగా నవతరించినధర్మాంగదుం డని యెఱుంగునది. 249

క. అనుటయు వ్యాసుఁడు సంతస, మును జెంది విరించిబోధమునకున్ దదను
జ్ఞను బడసి నిజనివాసం, బున కేఁగె నటంచుఁ జెప్పి ముగియించుటయున్.

వ. అమ్మహర్షులు సూతునితో ని ట్లనిరి. 251

గీ. సృష్టివిషయంబుఁ జెప్పితి చిత్రముగను, ననఘ సృష్టము లైనపదార్థములకు
నాధిపత్యంబు వహియించినట్టివార, లెవ్వ రెవ్వరో వచియింపు మెఱుకపడఁగ.

—: ప్రాపంచికాధిపత్యనిరూపణము :—

క. అనుటయు సూతుండు తపో, ధనులకు ని ట్లనియె సర్వతనుబట్టి వీరిం
చనుఁ డీయఁ దొడఁగె రాజ్యము, లను దాపసులార వారలకు వారలకున్.

వ. మానవులకుఁ బృథువును వృక్షంబులకును బ్రాహ్మణులకును గ్రహంబులకును నక్షత్రంబులకును యజ్ఞంబులకును దపంబులకును ధర్మంబులకును జంద్రుండును దీర్థంబులకును దోయంబులకును రత్నంబులకును వరుణుండును యక్షులకుఁ గుబేరుండును నాదిత్యులకు విష్ణువును బుణ్యాంబులకు దక్షప్రజాపతియును దైత్య దానవులకుఁ బ్రహ్లాదుండును బితృలోకంబునకు యముండును యక్షరాక్షస పిశాచోరగకంకాళకూశ్మాండాదిభూతంబులకును బేతాళాదిభూతాధిపతులకును మృత్యుంజయుండును బర్వతంబులకు హిమవంతుండును నదులకును దటాకంబులకును గూపంబులకును బుష్కరతీర్థంబును గంధర్వులకుఁ జిత్రరథుండును నాగములకు వాసుకియును సర్పములకుఁ దక్షకుండును వారణంబుల కైరావతంబును నశ్వంబుల కుచ్చైశ్శ్రవంబును బక్షులకు గరుత్మంతుండును మృగంబులకు సింహంబును గోవులకు గోవృషంబును వనస్పతులకుఁ బ్లక్షంబును బూర్వదిక్కునకు వైరాజపుత్రుం డగుసుధన్వుండును దక్షిణదిక్కునకుఁ గర్దమప్రజాపతి పుత్రుం డగుశంఖపదుండును బశ్చిమదిక్కునకు వరుణప్రజాపతిపుత్రుం డగుపుష్కరుండును నుత్తరదిక్కునకు నలకూబరుండును బితామహాదేశంబున నాధిపత్యంబులు వడసి సప్తద్వీపముద్రితం బగుపృథివీచక్రంబు నిప్పటికిని ధర్మంబునం బాలించు చుండిరి. 254

—: దనువు దితికిఁ బుత్రనాశముం దెలుపుట :—

వ. అది యట్లు లుండఁ గశ్యపునిభార్యలలో నొక్కతె యగుదనువు పుత్రశోకాభితప్తమానసయై తనసపత్ని యగుదితికడ కరిగి కంట జలజలఁ గన్నీరు గార్చుచు నేడ్చుచుండ దితి యామెం జూచి. 255

గీ. చెలియలా యేల యేడ్చెదు చెప్పుమమ్మ, యొక్కపుత్రుఁడు గలిగినయువిద లెల్ల
భాగ్యవతులుగ నుండ నీపాప మేమి, సుతశతంబును గాంచినసుదతి వీవు.

గీ. అధికబలవీర్యధైర్యసమన్వితాత్మ, లైనదానవవరు లసంఖ్యాకు లాత్మ
జన్ములయి నీకు రెండుపార్శ్వముల నుండ, నేమి లోపంబు గలదు నీ వేడ్వ నతివ.

చ. అనుటయు నామె యిట్లనియె నాదితికిన్ జలజాక్షి యేమి చె
ప్పును విధియోగమున్ మనసపత్ని మనోరథ మెల్లఁ దీరెఁ ద
త్తనయుఁడు స్వర్గరాజ్యమును దాల్చె భవత్సుతులున్ మదీయనం
దనులును జక్రిచేత నిధనంబును జెందిరి యుద్ధభూమిలోన్. 258

క. తన వేఁడిమిచేఁ దృణముల, నన లము దహించినట్టు లస్మత్సుతులన్

వనజాక్షుఁడు చక్రముచే, వినిహతులను జేసె మనము విధిహతులము గాన్.

క. సమరము దేవాసురులకు, సమకొనఁగా నేల యందు శౌరికి నాక్రో
శము గలుగ నేల యసురులె, సమయంగా నేల యెట్టిశాపమొ యకటా. 260

క. అని విలపించుటయును దితి, విని వెంటనె పుత్రశోకవిహ్వలమతియై
తనయులఁ జేర్కొనుచును గొ, ల్లున నేడ్వఁ దొడఁగె గుండెలో దడ పుట్టన్.

—: సుతశోకసంతప్తయగు దితికిఁ గశ్యపుఁడు జ్ఞానోపదేశముం జేయుట :—

సీ. అటు లేడ్చుచున్నయర్ధాంగి వీక్షించి ధై, ర్యమున ని ట్లనియెఁ గశ్యపమహర్షి
సుదతి యీవిధమున శోకింపఁ జెల్లునె, సర్వంబు దెలిసినసతివి నీవు
సంసార మనునింద్రజాలంబునను నేమి, సంబంధ మున్నది జంతువులకుఁ
దలిదండ్రు లెవ్వరు తనుజన్ము లెవ్వరు, భర్త లెవ్వరు చూడ భార్య లెవరు

గీ. తనయు లైతిరి మీరలు దక్షునకును, భార్య లైతిరి నాకు నీభవమునందు
మేముమున్నెవ్వర మొమున్ను మీర లెవరొ, యింక మీఁదట నెవ్వరి కెవరొ యేమొ.

క. నీతనుజన్ము లధర్మము, చేతను హతులైరి చింత సేయకు మదిలో
నాతీ పుణ్యము శోకము, చేతను నశియించు దానఁ జేడ్పు టొదవున్. 263

క. తమ కావించినదుష్క, ర్మమె నాశనహేతు వయ్యె మనతనయులకున్
రమణీమణి గోవిందుఁడు, నమరులును నిమిత్తమాత్ర మంతియ సుమ్మా.

క. తన నాఁటినబీజమునకు, ననువుగఁ గర్షకుఁడు ఫలము నందునటులె నీ
తనయులు చేసినకర్మం, బునకుం దగినట్టిఫలముఁ బొందిరి కలికీ. 265

క. దురపిల్లరు పరులకునై, పరమార్థజ్ఞాన మున్నపండితులు కృశో
దరి చెఱుపక యుండునె యె, వ్వరిపాపము వారి నేల వగచెదు చెపుమా.

—: పరమాత్మ జీవభావము నొందుట :—

సీ. వనజాక్షి పరమార్థమును నీకు నెఱిఁగింతు, విను మొకనిమిషంబు వీను లొగ్గి
కలఁ డాత్మ యనఁగ నొక్కండు సర్వమయుండు, సర్వశక్తియుతుండు సాత్త్వికుండు
కలిసి జ్ఞానధ్యానములతోడ నాతండు, తిరుగుచుండె వివిక్తదేశమందు
నటు లుండ నొక్కనాఁ డతని కేగురు దైవికముగఁ బ్రజ్ఞానిధుల్ గానఁబడిరి

గీ. యంతటను వారిఁ గనుగొని యాతఁ డిట్టు, లనియె జ్ఞానంబుతోడ నీ వరిగి వారి
చెంతకుఁ దదీయ మైనవృత్తాంత మెల్ల, నెఱిఁగికొని రమ్ము నా జ్ఞాన మిట్టు లనియె.

క. స్వామీ నీ వతిశుద్ధుఁడ, వేమాత్రము గూడ మచ్చ యెనయనివిద్వ
ద్గ్రామణివి వారితోడను, నేమి ప్రయోజనము నీకు నెఱుఁగం జెపుమా. 268

క. అనుటయును నాత్మ యి ట్లని, యెను జ్ఞానమ వారితోడ నేను సఖిత్వం
బును నెరపఁ దలఁచినాఁడను, గనుఁగొన వారలను గౌతుకం బేర్పడఁగన్.

చ. అనుటయు జ్ఞాన మి ట్లనియె నాత్మకు దేవర వారు దుష్టవ
వర్తనులు తదీయసంగమము తప్పక చేటొనగూర్చుఁ గాన నీ
వనుకొనినట్టియాశయ మపాయకరం బనుచున్ ప్రబోధముం
గని మది నాత్మ యుండె నవికారుఁడు గాఁగను జాగరూకతన్. 270

ఉ. అప్పుడు వార లేగురును నాత్మను గన్గొని వీఁడు చూడఁగా
గొప్పగుణంబు లేర్పడినకోవిదుఁ డంచును దోఁచె వీనితో
నిప్పుడు మైత్రి మాకు ఘటియిల్లఁగఁ జేయు మటంచు బుద్ధితోఁ
జెప్పిన నామె యాత్మదరిఁ జేరి వచింపఁ దొడంగె నీవిధిన్. 271

క. దేవా నీసుగుణములకు, భావంబున మెచ్చి నిన్నుఁ బరమాప్తునిఁగాఁ
గావించుకొనెడితలఁపున, నీవేళను నేఁగుదెంచి రేగురు మూర్తుల్. 272

ఉ. వారలు తత్త్వరూపు లనివార్యమహామహిమాన్వితుల్ జగ
ద్ధారకు లూర్జితాశయులు త్వద్విమలాకృతి నేఁడు గాంచుటన్
గోరిరి నీసఖిత్వమును గూర్చుటకున్ నను మీకు మీకుఁ జే
కూరినచెల్మి లోకములకున్ శుభదం బగు నంచు వచ్చితిన్. 273

క. నను బుద్ధి యని వచింతురు, జను లెల్లరు మీకు మీకు సఖ్యము చేకూ
రిన స్వర్ణమునకుఁ బరిమళ, మొనగూడుటె యనుచుఁ జెప్ప నొప్పదె యనఘా.

క. ధ్యానము నిన్నుం జెఱుచును, జ్ఞానము నీకంతరంగశత్రువు వీనిన్
మానినయెడ ని న్నపరిమి,తానందాంబుధిని నోలలార్తురు వారల్. 275

చ. అనుటయు జ్ఞాన మి ట్లనియె నాతనితోడను దీనిమాటలన్
వినకుము వారిస్నేహము వివేకము నంతను రూపుమాపి ని
న్ననిశము గర్భవాసనిరయంబునఁ ద్రోయును దేవ లోకమం
దును నెటువంటివారికిని దుస్సహవాసము మేలు గూర్చునే. 276

క. ధ్యానమును నేనుఁ బోదుము, కానంబడకుండ నీమకనులకు నాయ
జ్ఞానులు నీకడఁ జేరిన, హీనులు గలచోట నిలుతురే మతిమంతుల్. 277

క. అని పలుకుటయును బుద్ధిని, గనుఁగొని యి ట్లనియె నాత్మ కల్యాణి చిరం
తనమిత్రము లగుజ్ఞానం,బును ధ్యానము నిపుడు విడిచిపుచ్చుట తగునే. 278

క. జ్ఞానధ్యానము లనఁగా, హానిం బడనీక నన్ను ననుపదమును బ్ర
హ్మానందవార్ధిఁ దేల్చుచు, ధానసుహృన్మణులు వానిఁ దగునే విడువన్. 279

క. కావున వారలతోడం, గావింపఁగ మైత్రి మనసు గలుగదు నాకున్
నావుడు మతి తనవచ్చిన, త్రోవం జని తెలిపె వారితో నావిధమున్. 280

క. ఆవృత్తాంతము విని యా, యేవురుఁ జని యాత్మకడకు నీశ్వర విని నీ
పావనగుణములు చెలిమిన్, గావింపఁ దలంచి వచ్చినారము నీతోన్. 281

ఆ. మ మ్మెఱింగి యెఱిఁగి మామహిమంబుల, నొసఁగనలయు మాకు నుత్తరంబు
నని వచించుటయును నాత్మ దన్మహిమము, తెలుఁగఁ దలఁచి వారి కిట్టు లనియె.
క. మీ కున్నశక్తి గుణములు, నాకడ వచియింపుఁ డిపుడు నాహృదయంబున్
గైకొనియెనేని యవి మిముఁ, జేకొందును నేను మైత్రి చేకూరంగన్. 283
గీ. అనుటయును నాకసం బిట్టు లనియె నపుడు, స్వామి బాహ్యాంతరావకాశముల నెల్ల
నావరించి వసింతుఁ గాయమున నేను, నేను లేకున్న లోకముల్ నిలువ లేవు.
క. నాకుఁ గలగుణము శబ్దం, బాకర్ణించుటకు శ్రుతుల నాత్మభటులఁ గాఁ
జేకొంటిఁ బేరుకొనియెద, రాకాశ మటంచు నన్ను నామ్నాయవిదుల్. 285
గీ. అనుటయును వాయు వి ట్లనియెను మహాత్మ, భువనముల నెల్ల నేన నిల్పుదును నన్ను
వాయు వని పిల్చెదరు నాప్రవర్తనంబు, సర్వలోకప్రవర్తనసాధనంబు. 286
క. నేను శుభాశుభకర్మని, దానంబుగ స్పర్శగుణముఁ దాలిచి ప్రాణా
పానవ్యానోదానస, మానాఖ్యల నొంది మేన మసలుచు నుందున్. 287
గీ. అనుటయును వహ్ని యి ట్లనియెను మహాత్మ, నేను దీపించుచును మేనిలోన నుండి
నడుపుదును దేహయంత్రంబు నాదుభటులు, నయనములు రూపమంతయు నాగుణంబు.
క. వెలుపల లోపలఁ గూడను, గలిగిన ద్రవ్యములు గాంచఁగాఁ గలుగుట నా
వలనను గాక మదన్యుల, వలనను ఘటియిల్ల దేను వైశ్వానరుఁడన్. 289
క. అనుటయును సలిల మి ట్లని, యెను దేవ శరీరమందు నేను నివాసం
బొనరింతు నమృతరూపము, నను బుష్టి ఘటిల్ల సలిలనామముదానన్. 290
క. నావలన నిలుచు భువనము, లేవేళను నేను లేనియెడల నశించున్
గావున నె నాకు రసమును, గావించె నజుండు గుణము గాఁగ మహాత్మా. 291
గీ. అనుటయును భూమి యి ట్లను నాత్మతోడ, నయ్య నఖలోమచర్మమాంసాస్థిరూప
మునను నే నుందుఁ దనువునఁ దనువు నిలుచు, నావలన నాగుణంబు గంధంబు రావె.
క. భూమి యని పేరు వడసితి, స్వామీ నే నఖిలలోకజాలంబునకున్
ధామ మయి యుండెదను నా, సామర్థ్యము గూడ దేనె చాటుకొనంగన్. 293
క. అనుటయుఁ దోడనె యచటికిఁ, జనుదెంచి వచించె నాస స్వామి సుగంధం
బును నొసఁగుచు దుర్గంధం, బును దొలఁగించుచును గాయమున నే నుందున్.
క. స్వామీ నాసిక యనియెడు, నామము గలదాన నేను నాకుం బ్రభు వీ
భూమి యురుపురము గూడన్, స్వామిహితంబునకె కాంచినారము భవమున్.
క. అనుటయును నరుగుదెంచి ర, సన యి ట్లనియెను బ్రభూ రసజ్ఞ యనెడిదా
నను నేను జలము నాదొర, తనువున కర్పింతు షడ్విధం బగు రసమున్. 296
క. అనుటయు నేతెంచి విలో, చనంబు లి ట్లనియె మేము చక్షువులము మే
ననె యుండి జ్వాలనభటులము, గను రూపంబులను నెల్లఁ గనియెద మనఘా.

క. అనుటయును వచ్చి త్వచ మి, ట్లనియెను స్పర్శంబువలన నరయుచు నెల్లన్
దనువున కావరకము గాఁ,గను నే నుండెదను స్వామికార్యంబునకై. 298

క. శీతాతపవర్షాద్యు, త్పాతభయం బుడిపి మేను పాలింతును నే
వాతమునకుఁ జెలి యనువి, ఖ్యాతిం గయికొంటిఁ జర్మ మనియెడిదానన్. 299

క. అనుటయును వచ్చి శ్రుతు లి, ట్లనియెను దేవా వసింతు మనిశము దేహం
బున మేము స్వామికార్యం, బునకు గ్రహించుచును శబ్దపుంజము లెల్లన్. 300

క. మేము శ్రవణంబు లనియెడి, నామమునను గీర్తికెక్కి నానావిశ్వ
క్షేమమునకు మాప్రభు వగు, వ్యోమముతోఁ గూడి వెలయుచుంధుము దేవా.

క. అనుటయును వచ్చి మతి యి, ట్లనియెను నానిర్ణయమున నన్నియుఁ గాయం
బును నడపు నేను బుద్ధిని, నను విడనాడినను సర్వనాశనము ప్రభూ. 302

క. అనుటయును గర్మ మే తెం, చినదై యి ట్లనియె నేనె చేటునకును మే
లునకును బ్రేరణకర్తను, ననుఁ బిలుతురు దేవ కర్మనామముతోడన్. 303

క. అనుటయును నాత్మ యి ట్లని, యెను వింటిని మీప్రభావ మెల్లను నామై
త్రిని మీర లేప్రయోజన, మున కాసించితిరో వినఁగ మోదము గలిగెన్.

చ. అనుటయు వార లిట్టు లని రందఱు మే మొకఁ డైనచో జనిం
చును నొకపిండ మందుఁ బరిశుద్ధుఁడ వీవు ప్రభుండవై వసిం
చినఁ ద్వదనుగ్రహంబున వసింతుము మేమును నందె స్వామి నీ
కనిశముఁ బాదసేవకులమై భవదీయహితంబు గోరుచున్. 305

క. అనుటయు జ్ఞానధ్యానము, లనఘా నీబోఁటివాని కర్మము గా దీ
పని యనుచు నెంత వారిం,చినను వినక యాత్మ పరవశీకృతుఁ డగుచున్.

క. వారలచెలిమికి నంగీ,కారం బొనరింప నపుడె గర్భస్థితి చే
కూరెను రాగద్వేషా, ద్యారంభంబునను నాత్మ కాశ్చర్యముగన్. 307

ఆ. పూతిగంధయుక్తమును మలమూత్రాది, కలుషితమును నైనగర్భమందు
నుండ లేక చెంత నున్నభూతములను, జూచి యాత్మ యేడ్వఁ జొచ్చె నిటులు.

క. అకటా మీమాటలు విని, వికలాత్ముఁడ నైతి నెంత వెఱ్ఱినో పంచా
త్మకులార మీకు న్యాయమె, యకపటమతి నైన నన్ను నల్లాడింపన్. 309

క. నిస్సంగుఁడ నగునను మీ, దుస్సంగము గూల్చె గర్భదుర్గతిలోనన్
డస్సితిఁ గ్రుస్సితి వ్రస్సితి, నిస్సీ యీయిడుమ దాఁట నెట్టులు నేర్తున్. 310

క. అని విలపించుచు నుంటయుఁ, గనుఁగొని తత్త్వంబు లాత్మగతిని మహాత్మా
మనెదవు చిరకాలము నై, కొనెదవు రాజ్యంబు నోర్చుకొనుమీ యార్తిన్,

క. నీవు మహాప్రభుఁడవు నిను, సేవించెద ముండి మేము సేవకులము గా
దేవా గర్భనివాసము, గావించెడికాల మల్పకాలమ నీకున్, 312

క. గర్భము పూర్ణము గాఁగనె, నిర్భయముగ బయటఁ బడెదు నీ వేడ్కంగా
నర్భకుఁడవె నిలుచునె నీ, యార్భాటముక్రింద జగము లటుపైని ప్రభూ. 313

క. అనుటయును నాత్మ క్లేశం, బును సైఁపఁగ లేక గర్భముననుండి పలా
యన మొనరించెడియత్నం, బొనరింపఁగ నయ్యె గర్భ ముచ్చ్వానము గాన్.

గీ. అంత నాత్మ యధోముఖుఁ డగుచు మోహ
జాలమునఁ జిక్కి గదలఁగాఁ జాల కునికి
గర్భమునయంద యుండి యిక్కట్లు పడుచు
మూర్ఛిలుచుఁ దెప్పిఱిలుచును మొత్తుకొనుచు. 315

శా. అమ్మా జ్ఞానమ నీనుడుల్ వినమి నే నల్లాడుచున్నాఁడ గ
ర్భమ్మందుం బడి దిక్కు లేదు దరిఁ జేర్పన్ నన్ను నీకంటె రా
వమ్మా నాయపరాధముల్ సయిఁపుమమ్మా తాళలేనమ్మ భూ
తమ్ముల్ చేసినబోధముల్ వినుటచేతన్ హాని నా కేర్పడెన్. 316

క. అని మొఱవెట్టుటయును గనుఁ, గొని జ్ఞానము దరికిఁ జేరికొని యిట్లనియెన్
మును నే నెంత వచించిన, వినవైతివి స్వామి దైవవిధి యిటు లుంటన్. 317

గీ. ఐనదానికి వగచి కార్యంబు లేదు, ధ్యానమును వేడికొను మిట్టితరుణమందు
గర్భనరకవిముక్తి సౌఖ్యము గ నీకుఁ, గలుగుటకు నింతకంటె మార్గంబు లేదు.

వ. అని వచించుటయు. 319

గీ. ఆత్మ దానను గొంత ధైర్యము వహించి, ధ్యానమును వేడుకొనియె నాధ్యానమప్పు
డరుగుదెంచి తదంతికమందు నిలిచె, నతనిచిత్తంబునకు సౌఖ్య మావహిల్ల. 320

క. తదనంతర మాతఁడు తన, యెద జ్ఞానము ధ్యానమును వహించి విరాగం
బొదవఁ దనుస్మృతి లేమిని, గదలక వసియించె సుఖముగా గర్భమునన్. 321

ఆ. అట్టు లుండి గర్భమందు సుఖంబుగా, నెదను దలఁచికొనియె నిట్టు లతఁడు
కలిగె నాకు నిట్టికష్ట మీపాడుదే, హంబునందుఁ జొచ్చినట్టికతన. 322

క. జ్ఞానధ్యానంబులు నా, కానందము గొలిపె నిట్టియవసరమున నే
వీని విడనాడువాఁడను, గా నింకను నెట్టిప్రళయకాలమునందున్. 323

ఆ. గర్భనిరయముక్తి గలిగినతోడనే, యీనికృష్టతనువు నేను విడిచి
నశ్వరంబు గానినాయాత్మసుఖమున, ననుదినమును నోలలాడుచుందు. 324

క. అని యీవిధమునఁ జింతన, మొనరించుచు నుండఁ బ్రసవ మొనరుటకు జనిం
చినప్రాజాపత్యానిల, మున వేదన యొదవె గర్భమున నొకనాఁటన్. 325

క. ఆవేదన సంక్షోభము, గావింపఁగ నాత్మ కతఁడు గ్లానిం బడి మూ
ర్ఛావివశుఁ డగుచు నెట్టులొ, దైవవశంబునను భూమితలమునఁ బడియెన్. 326

వ. అట్లు భూస్పర్శంబు గలిగినమాత్రంబున నయ్యాత్మను బ్రాజాపత్యానిలంబు జ్ఞానధ్యానంబులతోడ వేఱుపఱిచె. 327

గీ. అంతటనుబంచభూతసహాయుఁడగుచు, ధ్యానమునుజ్ఞానమునుగూడనతఁడుమఱచి
తగులువడియెను మోహబంధంబునందు, జాలమున మీను చిక్కిన చందమునను.

గీ. అంత దినదినమును మోహ మాక్రమింపఁ
గార్యము నకార్యమును గూడఁ గాంచ లేమిఁ
గుడుచుచును మలమూత్రముల్ గొన్ని నాళ్లు
గ్రుమ్మరుచు నాటపాటలఁ గొన్ని నాళ్లు. 329

గీ. ఒప్పిదము గానిపనులు చేయుచును దుదకుఁ
గడపి బాల్యంబు నెట్లో యిక్కట్లతోడ
నతఁడు యౌవనమును జెంది యతివ యనుచు
సుతు లనుచు గేహ మనుచును వెతలఁ బడుచు. 330

క. కామక్రోధాదిమహా, వ్యామోహములందుఁ జిక్కి యటు నిటుఁ గదలం
గామిని బంకనిమగ్నత, యామతిలినవృషభమట్టు లారట మొందెన్. 331

గీ. అంత వార్ధకమును జెంది యాత్మ వ్యాధు,లకును నాధులకును వికలత్వ మొంది
మానభంగదురాశాభిమానములను,నిహతుఁ డగుచును నేడ్చుచు నహరహంబు.

గీ. కాంచె నొకనాఁడు దైవయోగమున నొకని,నంబరము లేక తిరుగుచున్నట్టివాని
సంగవర్జితుఁ డగువాని శాంతుఁ డైన, వాని దేహాభిమానంబు లేనివాని. 333

క. కని యతని నాత్మ గతమతి, నినుఁ జూడఁగ నాకుఁ దోఁచె నిర్లజ్జుఁడ వం
చును లేనియెడల నెవఁ డై,నను నీవలె నున్నవాఁడె నరుఁ డీపుడమిన్. 334

క. జనులు వృద్ధులు యువతీ, జనులును వర్తించుచోట సందేహము నీ
మనమున నుంతయుఁ గలుగక, యనావృతుఁడ వగుచు నుండ నగునే నీకున్.

గీ. అనుటయును వీతరాగుఁడిట్లనియెనతని,కెవ్వరమునగ్నులముచూడనెఱుఁగఁబడదె
జ్ఞానవసనంబు దాల్చిన నేనొ లేక,పురుషమర్యాద నెఱుఁగనినరుఁడ వీవొ. 336

గీ. అనుటయును నాత్మ వీతరాగునకు నిట్టు, లనియె సర్వజ్ఞ పురుషమర్యాద యనఁగ
నేమొ వచియింపు మనుటయు నిట్టు లనియె, నాతనికి వీతరాగుఁ డాహ్లాద మొదవ.

గీ. ఎన్ని సుఖదుఃఖములు లభియించుచున్నఁ, గలఁగకుండఁగఁజిత్తంబునిలిపికొనుచు
నుండవలయును విషయవశుండు గాక,యాస్థితియ చూవె పురుషమర్యాదయనఁగ.

క. ఉండెడివాఁ డొక్కఁడ యయి, యుండఁగ వేఱొండు గలుగ నుండెడిత్రప కె
వ్వం డగు లక్ష్యము మతిమం, తుండవు నీ కేదియేని తోఁచినఁ జెపుమా. 339

క. ఉండు ననసంఖ్యాకములుగ, నుండెడు దేహములలోన నొకజీవుఁడె చం
ద్రుం డొకఁడె వివిధజలఘట, మండంబులలోన నుండుచాయను జగతిన్. 340

క. సతిదేహము నజ్ఞానుల,పతనమునకు సృష్టిచేసె బ్రహ్మ కచకుచా
కృతివిభవంబులతోడను, నతని కది వినోద మెఱుఁగఁ డజ్ఞుఁడు దానిన్. 341

క. తెలిసినపురుషుఁడు కచకుచ, ములకున్ లోఁబడఁడు ప్రకృతిపురుషులలోనన్
గలుగమి భేద ముపాధుల, వలనఁ గలుగుభేద మరయ వాస్తవ మగునే. 342

క. దానను బురుషుం డనినను, జాన యనిన నొకటె లజ్జ జనియించునొకో
చానవలనఁ బురుషునకున్, జానకుఁ బూరుషునివలన సత్యము గనినన్. 343

క. కుమ్మరి మృత్పిండము చ, క్రమ్మున నిడి చేసినట్లు ఘటముల విధి లో
కమ్ముల సృజించె నవి క్షణి, కమ్ములు నిత్యములె లజ్జ గలుగఁగ వానన్. 344

క. అటు గానియెడల భూతము, లెటుఁ జూచిన నుంట లజ్జ నెవఁడైనను జెం
దుట గలిగెనె జగమున నె, చ్చటనేనియు వానివలనఁ జర్చించితివే. 345

క. బలహీనలును జరావ్యా, కులలును వళియుతలు నైనగోతుల మూఢుల్
పిలిచెదరు వృద్ధ లని వృ, ద్ధలె వారలు వారివలనఁ ద్రప యేమిటికిన్. 346

గీ. జ్ఞానమున సంతతము వర్ధమాన యగుచు, జీవునిఁ ద్యజింపకుండ వసించునట్టి
యొకసుమతి గాక యువతి యింకొకతె యగునె,కలుగునే తోలుబొమ్మలవలనలజ్జ.

క. మేనులనె చెంది యాత్మ, స్థానములుగ జ్ఞానమును నొసంగుచు నెపుడున్
మానవుల నోము చేతన, యా ననియెడిమాత గాక యన్యలె మాతల్. 348

క. కరుణావిరహితహృదయాం,తర లగుచును నరుల గర్భనరకములోనన్
దొరలుచుమాతలు మాతలె, పరార్థవిదుఁ డేల సిగ్గుపడు వారలకున్. 349

చ. అనుటయు నాత్మ యి ట్లనియె నాతనితోడను స్వామి నామనం
బునఁ గలతాప మంతయును బోయె భవద్వచనామృతంబు నా
నినత్రుటిలోన నన్ను భవనీరధిమగ్నుని నుద్ధరింప వ
చ్చినవిధి వీ వెవండవు వచింపుము నాఁగను నాతఁ డి ట్లనున్. 350

క. కామక్రోధాదులు నా, సామీప్యంబునకు రావు స్వచ్ఛుఁడఁ గర్మ
వ్యామోహము నన్నంట ద,నామయుఁడను వీతరాగుఁ డనియెడివాఁడన్. 351

క. నాకుఁ గలఁ డొక్కభ్రాత వి,వేకుం డనువాఁడు వానివిధముం దెలియం
గాక భువనంబు లన్నియుఁ, జీకా కగుచుండె నేమి చెప్పఁగ వలయున్. 352

క. అనుటయును నతని కిట్లని,యెను నాత్మ మహాత్మ నా కొకించుక నీ వా
తనిలక్షణంబు చెప్పుము, కనికరము జనించెనేని కరుణార్ద్రునిపై. 353

క. అనుటయును వీతరాగుఁడు, తనమనమున నొక్కక్షణము ధ్యానించి వివే
కునిఁ బిలిచె నాత్మయెడఁ దన, కొనరినయుద్ధరణబుద్ధి యుద్రేకింపన్. 354

వ. అంత,

సీ. క్షమ శాంతి యనియెడిసహధర్మచారిణు, లుభయపార్శ్వంబులం దొప్పుచుండ
ధీధారణ లనుపుత్రికలు మహోత్సాహ, మనువారిధిని నోలలార్చుచుండ
సత్యధర్మము లనుసచివులు జాగరూ, కతతోడ నెడ లేక కాచుచుండ
యోగం బనెడితనయుండు మోక్షం బను, గురువును సౌఖ్యంబు గొలుపుచుండ
ఆ. నిష్పరిగ్రహుఁడును నిరహంకృతియు నిరా, శుఁడును ద్వంద్వవిరహితుఁడును నిర్మ
లుఁడును సుగుణభూషణుఁడును నైనవివేక, చక్రవర్తి వచ్చె సత్వరంబ. 355
క. చనుదెంచి వీతరాగునిఁ, గనుఁగొని యిట్లనియె నేమికతమున రావిం
చినవాఁడవో నను సోదర, యనుటయును వివేకునకును నతఁ డిట్లనియెన్. 356
క. కనుము పురస్థితుఁ డగుని,తని నాత్మ యితండు పంచతత్త్వములవశం
బునఁ జిక్కి దిక్కు గానక, వనరుచు నున్నాఁడు దీనవత్సల వింటే. 357
క. అనుటయు వివేకుఁ డాత్మను, గనుఁగొని యిట్లనియె నేమి కంటివి సౌఖ్యం
బును సంసారంబున నీ, వనఘా వచియింపు మనుడు నతఁ డిట్లనియెన్. 358
ఆ. స్వామి మొదట గర్భవాసంబునను మహా, దుఃఖ మనుభవించి తుదకు నెట్లొ
పడితి భూమిమీఁదఁ బడ్డది మొదలుగాఁ, గాంచినాఁడ నష్టకష్టములను. 359
క. ఒకనాఁ డైనను నాకున్, సుక మనియెడిమాట లేదు సొలసితి సాంసా
రికనానావిధదుఃఖ,ప్రకరంబులలోనఁ జిక్కువడి మిక్కిలిగన్. 360
క. జననీజనకులమరణం,బును నర్ధాంగులవియోగమును సుతులలయం
బును నర్థనాశమును గ, ల్గెను జిత్తము చెడియె మేను క్షీణం బయ్యెన్. 361
గీ. చచ్చిపోవుద మన్నను జావు రాదు, పాడుసంసారవార్ధిలోపల మునింగి
యుడ్డుగుడుచుచు నున్ననాకొక్కఁ డైనఁ, గానరాఁ డుద్ధరించెడిమానవుండు. 362
క. అనుటయు వివేకుఁ డిట్లని, యెను శుద్ధుఁడ వీవు నీకు నేర్పడినయవ
స్థను బాపి సౌఖ్యమును గొ, ల్పును జ్ఞానము దాని శరణుపొందుము వత్సా. 363
గీ. అనుటయును నాత్మకొంత ధైర్యమువహించి, జ్ఞానమును వేఁడుకొనియె నాక్షణమునందె
జ్ఞాన మరుదెంచి తత్సన్నిధానమునకు, వానితో నిట్టు లనియె సమ్మాన మొదవ.
క. స్వామీ నను మఱచితివో, యేమో నాపేరు జ్ఞాన మేను ద్వదీయ
క్షేమము గోరినభృత్య, గ్రామణి నని తెలిసికొనుము కడ కిపు డైనన్. 365
క. మును నే నెంతగ వారిం, చినను వినక దుష్టమతులస్నేహము గావిం
చినకతన నిట్టియాపద, లోనగూడెను జూవె యుత్తమోత్తమ నీకున్. 366
గీ. ఐనదానికి వగచి కార్యంబు లేదు, ధ్యానమును వేఁడికొనుము సత్వరమ నీవు
చెందెదవు సౌఖ్యమును దానిపొందువలన, ధ్యానమును నేనుఁ గలుగ నీ కన్య మేల.
క. అని పలుకుటయును ధ్యానం, బును నుద్దేశించి యాత్మ మొఱపెట్టఁగ వెం
టనె తద్దీనారవమున్, విని ధ్యానము వచ్చి యాతనికి ని ట్లనియెన్. 368

క. అనఘా నివాత దేశం, బునఁ గలదీపంబు ధూమమును విడిచి వెలిం
గినరీతి వెల్గెదవు నినుఁ, గనుఁగొనునెడ నీవు తొలఁగి కలుషము లెల్లన్. 369

క. నను విడనాడక యుండిన, నిను నీ వెఱుఁగంగఁగలవు నిర్ద్వంద్వుఁడ వై
తనరెదునీకు విషాదం, బనునది యెక్కడిది తత్త్వ మవలోకింపన్. 370

క. భూతంబులసాంగత్యము, చేతను లభియించె నిట్టిచేడ్పాటు లజా
తాతంకుఁడ వగునీ కు, త్పాతము లెక్కడివి నిజము పరికింపంగన్. 371

గీ. నిశ్చలోపాసనంబున నిలిచి సర్వ, కాలములయందు నేకాంతగతుఁడ వగుచు
ధ్యాన మొనరించునెడనాత్మ నాత్మచేత, నొందెదవు శోకరహితమై యుండుపదము.

క. అని బోధించుటయును నిజ, మును నాత్మ యెఱింగి జ్ఞానమును ధ్యానంబున్
మనమందు నిలిపికొని తన, తనువును విడనాడి సౌఖ్యధామముఁ జెందెన్. 373

క. కాన శరీరికి మేనికె, కానము సంబంధ మెట్లు కలుగును జాయా
సూనులు ధనమును మున్నగు, వానికిఁ బ్రాణికిని నింక వనజదళాక్షీ. 374

సీ. పంకజాక్షుఁడె పరబ్రహ్మంబు తిలకింప, నతఁడె సనాతనుం డతఁడె సాక్షి
యతఁడె విశ్వములను నజుఁ డయి సృజియించుఁ, బాలించు విష్ణువై ప్రజల నతఁడె
హరుఁ డయియాతండె హరియించు నఖిలంబు, నాత్మయై యుండు దేహమున నతఁడె
యతనికంటెను భిన్న మగునది వే ఱొండు, కానంగ రాదు లోకంబులందు

గీ. వాని హృదయంబు సత్యంబు వానితనువు, ధర్మ మాసత్యధర్మముల్ తగదు విడువ
నవి త్యజించిరి నీసుతు లంబుజాక్షి, దాన వారల కాపద దాపరించె. 375

గీ. అదినేను వచించినయాత్మ యనఁగఁ, దెలిసికొంటివె యెవఁడో యిందీవరాక్షి
యతఁడె విష్ణువు వాఁడె పాపాత్ము లైన, యట్టిదైత్యుల వధియించినట్టివాఁడు.

క. పుట్టించెనో యెవఁ డాతఁడె, గిట్టించెను దీని కేల ఖేదము నొందన్
నెట్టన చేసినకర్మము, కట్టి కుడుప కున్నె యెంత కాఱియపడినన్. 377

గీ. కర్మ ముండునుద్వివిధంబుగాఁగఁ బుణ్య, మనియుఁ బాపంబనియును బుణ్యంబువలనఁ
గలుగు సద్గతి పాపంబువలనఁ గలుగుఁ, బతన మివి జంతువులకుఁ దప్పవు లతాంగి.

క. బల మున్నను బరివారము, గలిగిన నన్వయవిశుద్ధి గలిగిన నవి ని
ష్ఫలము లిహపరసుఖంబున్, గలిగింపఁగఁ బుణ్యహీనునకుఁ గమలాక్షీ. 379

గీ. గిరులయం దున్నతంబుగాఁ బెరిఁగినట్టి, భూరుహంబులు వాయువేగంబువలన
మూలములతోడ ధరణిపైఁ గూలినట్లు, పతితు లగుదురు ధర్మవర్జితులు తన్వి.

గీ. పుణ్యమును ధర్మమును దపంబును ఋతంబుఁ, గలిగియుండినచోటను నిలుచుఁ జక్రి
చక్రి నిలిచినచోటను జయము గలుగు, నట్టిభాగ్యంబు లేదు నీయాత్మజులకు. 381

గీ. సత్యధర్మపరాయణస్వాంతు లగుచు, నాదితేయులు వర్తిల్లి రదియె హేతు
వమ్మహాత్ముల కభ్యుదయంబు గలుగఁ, దెలిసికొని నిశ్చయంబు శాంతింపు మతివ.

క. అని బోధించుటయును దితి,వనజాక్షి గ్రహించి యున్నవా స్తవ మెల్లన్
మనమునఁ జొచ్చినదుఃఖం,బును మరలుచుకొనియె మౌనిపుంగవులారా. 383

క. అనవుడు మౌనులు సూతునిఁ, గనుఁగొని యి ట్లనిరి చావఁగా మిగిలినయ
ట్టినిశాచరవీరులు చే,సినపని యే మైన నున్నఁ జెప్పుము మాకున్. 384

—: సూతుఁడు హతశేషు లగురాక్షసులవృత్తాంతముం జెప్పుట :—

క. అనవుడు సూతుం డి ట్లని;యెను హతశేషు లగుదైత్యు లెల్లరు శీఘ్రం
బునఁ జని కశ్యపమౌనీం,ద్రునికడ కి ట్లనిరి ఖేదరోషము లెసయన్. 385

క. దేవతలును రాక్షసులును, గావించుచు నుండ యుద్ధకర్మముఁ దంద్రీ
గోవిందుఁ డేఁగుదెంచి క,కావిక లొనరించె నసురగణముల నెల్లన్. 386

గీ. అంతతోఁ బోక చంపెఁ జక్రాయుధమున, దైత్యదానవులను నెల్లఁ దప్పి బ్రతికి
వచ్చినారము మేము నీవలన మాకు, జయము చేకూరు న నెడినిశ్చయము [illegible] 387

ఆ. మేము సంఖ్యలోన మిగులుగా నున్నను, బలపరాక్రమములు గలిగి యున్న
నల్పు లైన త్రిదశు లాహవవిజయంబు, గాంచుటకును నేమి కారణంబు. 388

క. అని యడుగుటయును గశ్యప. మునివరుఁ డి ట్లనియెఁ బుణ్యమును దపము [illegible] వా
రొనరించి హరికటాక్షం, బునకున్ గుఱి యగుటచేతఁ బొందిరి జయమున్. 389

క. కావున ధర్మముఁ దపమును, గావింపఁగ వలయు జయము గావలె నంచున్
భావింతు రేని కర్మము, గావింపక ఫలము చెందఁ గలుగునె యెందున్. 390

క. అని సెప్పుటయును జనకుని, యనుమతి గొని తప మొనర్ప నరిగి రరణ్యం
బునకు మునుముందు గోవిం, దునిసాధించెదతలంపుతోడను వారల్. 391

క. చని యట్లు హిరణ్యాక్షుం,డును మఱియు హిరణ్యకశిపుఁడును మున్నగున
ట్టినిశాచరు లతిఘోరము,గను జేసిరి తపము ముజ్జగంబులు వడఁకన్. 392

గీ. అంతటను వారు కోరినయట్టివరము, లన్నియును నిచ్చి త త్తప మాఁపె బ్రహ్మ
యావరంబులచే వార లాక్రమించి, రఖిలలోకంబులను గూడ నడ్డు లేక. 393

క. వారలు పెట్టెడిబాధల, కోరువఁగా లేక సురలు యోగులు సిద్ధుల్
చారణులు మున్నగాఁ గల, వారలు చని చెప్పి రసురవార్తలు విధికిన్. 394

క. పరమేష్ఠి విని సమస్తము, హరికడకున్ సురసమేతుఁ డయి యేఁగి తదా
శరవృత్తాంతము దెలిపిన, తరువాతను శౌరి క్రోధతామ్రాక్షుండై. 395

క. హరియించి హిరణ్యాక్షుని, వరాహరూపమున నమరవర్గము పొగడన్
నరసింహాకారంబున, హరియించె హిరణ్యకశిపు నటు తరువాతన్. 396

ఉ. అంతట సర్వలోకముల కార్తి తొలంగెను ధర్మముల్ నిర
త్యంతరవృత్తితోడఁ దనరారెను సాధువు లెల్లవారలున్

సంతసమొంద రాత్మజులచావు విషాదముగొల్పుటన్ మనః
కాంతునిగుండె తల్లడిలఁగా దితి యేడ్చెఁ దదంతికంబునన్. 397

—: కశ్యపుఁడు దితికి వరం బిచ్చుట :—

క. ఆయేడుపు విని కశ్యపుఁ, డాయమ నోదార్చి యింతి యనుతాపంబున్
జేయకుము గతమునకు నిపు, డేయది వాంఛితమొ కోరు మిచ్చెద వరమున్.

క. అనుటయుఁ దేజోయుక్తుం, డును జగదేకప్రవీరుఁడును నగునొకనం
దనుని దయచేయు మేటికిఁ, దనయులు పదివేగు రప్రధానులు దేవా. 399

క. అని దితి ప్రార్థించుటయును, గనికరమునఁ గశ్యపుండు కాంతా నీకో
రినసుతుఁడు గలుగు శీఘ్రమ, యని తనహస్తంబు నుంచె నాయమతలపై.

క. అంతట శతవర్షంబులు, సంతోషముతోడ మేరుశైలంబున నా
యింతి యొనరించెఁ దపము ని, రంతరముగ గర్భ మంతకంతకుఁ బెరుఁగన్. 401

క. నిండుటయు గర్భ మామె క, ఖండబలపరాక్రమప్రకాశసమేతా
త్ముం డగునాత్మభవుం డొ, క్కం డొకనాఁ డుద్భవించెఁ గడలు వెలుంగన్.

వ. అంతఁ గశ్యపమహర్షి యాకుమారునకు విధ్యుక్తసంస్కారంబు లొనరించి బలుం
డని నామకరణంబు గావించి క్రమంబుగ బ్రహ్మచర్యానుష్ఠానంబున నియోగించె.

—: బలాసురుఁడు మహేంద్రహతుం డగుట :—

క. బలుఁ డది మొదలుగఁ దపమున్, జలిపి మహాఘోరముగను శతవర్షము లా
వల నొకదినమునఁ దల్లిని, దిలకింపఁగ వచ్చి మ్రొక్కె దితిపదములకున్. 404

క. మ్రొక్కుటయు నతని నాయమ, యక్కునఁ జేర్చుకొని నేఁటి కగపడియెనె నీ
దృక్కులకుఁ బరిభవాగ్నిని, జిక్కి పరితపించుతల్లి చిన్నికుమారా. 405

క. మీయన్నలఁ బెక్కురఁ జ, క్రాయుధుఁడు వధించె నతిబలాన్వితుల సురల్
సాయపడఁగ నాపగ పెడఁ,బాయక నను గాల్చుచుండుఁ బావకమువలెన్.

క. పురుహూతుని సురలను ద,త్పరిరక్షకుఁ డైనచక్రధరునిం ద్వరలో
బరిమార్చి నామనంబును, నెరియించెడుశోక మార్ప నెంచుము పుత్రా. 407

క. అనవుడు బలాసురుఁడు దితి, జననికి నిట్లనియెఁ దల్లి శాంతింపుము నే
నొనరించి తపము శాత్రవ,హననం బొనరింతు నీకు హర్షము గలుగన్. 408

క. అనుటయు శుభ మగుఁగావుతఁ, జను మని దితి పలికె నంతఁ జని జలధితటం
బున బలుఁడు తపము సేయం, గను గడఁగుచు నుండ నట్టికాలమునందున్.

ఆ. అదితివలన వానియతిసాహసంబును, విని పురందరుండు వెఱ జనింప
వైచె నతనిమీఁద వజ్రాయుధము నంత, నతఁడు పడియెఁ బుడమి నసువు లుడిగి.

క. అంతట దేవత లెల్లరు, సంతోషముఁ జెంది రాత్మజక్షయము దితి
స్వాంతంబున శల్యంతమ్ము, చింతావహ మగుట నామె చింతిలి మిగులన్. 114

క. తనభర్తచెంతకుం జని, కనులను బాష్పంబు లొడికిలుగాఁ గాఢం
గను వెక్కి వెక్కి యేడిచె, మనబలునిం బిలుకుమార్చె మఘవుం డనుచున్.

—: కశ్యపుఁ డగ్నికుండమున వృత్రాసురునిఁ బుట్టించుట :—

గీ. ఆవిలాపంబు విని కశ్యపర్షిమౌళి, మండిపడుచును దనతలనుండి పెఱికి
జ్వలనకుండంబునం దొక్క జటను వేల్చె, వాసవాంతకుఁడుదయింపవలయు ననుచు.
క. ఆక్షణమునఁ బుట్టెను బిం, గాక్షుఁడు దంష్ట్రావిశంకటాస్యుఁడు క్రూరా
వేక్షణుఁడు భీషణుఁడు ఘన, కుక్షియుతుం డొకఁడు వహ్నికుండమునందున్.
క. పుట్టి యతఁడు కశ్యపముని, కట్టెదుటను నిలిచి యేమి కార్యమునకు నన్
బుట్టించితో యాపని యు, ట్టిట్టనక యొనర్తు నానతీయుము తండ్రీ. 415
క. అనవుడుఁ గశ్యపుఁ డి ట్లని, యెను వృత్రుం డనెడిపేర నెసఁగి సునాసీ
రుని గెలిచి స్వర్గరాజ్యము, గొని నీవు యథేచ్ఛ నేలుకొనుము కుమారా. 416
క. అని పలుకుటయును వృత్రుఁడు, ధనురామ్నాయంబు నేర్చి ధైర్యము శౌర్యం
బును గలిగి క్షాత్త్ర తేజం, బున నానాఁటికిని వృద్ధిఁ బొందుచు నుండెన్. 417

—: ఇంద్రుఁడు వృత్రాసురుని వధించుట :—

గీ. ఇంద్రుఁ డాతనివలన నూహించి భయము, వాని నెటులేని వధియింపవలయు ననుచు
నెంచికొని యాత్మలోన రావించి సప్త, ఋషులఁ దనకడ కవ్వారి కిట్టు లనియె.
క. అనఘాత్ములార వృత్రుం, డనియెడిదైత్యుండు బహుబలాన్వితుం డా
తనితోడ నాకు సఖ్యము, నొనగూర్పుం డర్ధరాజ్య మొసఁగెద ననుచున్.
క. అనవుడు సప్తర్షులు వృ, త్రునికడకుం జని పురందరునితో సఖ్యం
బొనరింపు మర్ధరాజ్యం, బును నాతఁ డొసంగు దైత్యపుంగవ నీకున్. 420
గీ. అనుభవింపుము స్వర్గరాజ్యమును విబుధు, లెల్లఁ గొలువంగ రాత్రించరేంద్ర నీవు
వాసవునితోడఁ గూడి సింహాసనమునఁ, గూరుచుండెడిమేలు చేకూరె నీకు.
గీ. పూర్వవిద్వేషములుదూరముగను జేసి, యసురులును దేవతలును స్నేహముననుండ
నంతకంటెను లోకకల్యాణ మింకఁ, గాఁదగిన దేది యున్నది కర్బురేంద్ర. 422
క. అనవుడు వృత్రాసురుఁ డి, ట్లనియెను మునులార నాకు నభిమతమ మహేం
ద్రునితోడ మైత్రి ద్రోహం, బొనరింపనిశపథ మాతఁ డొనరించినచోన్.
క. అనుటయు నింద్రునికడకున్, జని ముని లెఱిఁగింప వృత్రసంభాషణమున్
విని పాకశాసనుం డి, ట్లనియెను వారలకు విస్మయము గలుగంగన్. 424
క. మునులార నేను ద్రోహము, నొనరించితినేని రాక్షసోత్తముఁ డగువృ
త్రునియెడల బ్రహ్మహత్యను, నొనరించినయట్టిపాప మొందుదు ననుడున్.
క. ఆసప్తర్షులు చని వృ, త్రాసురునకుఁ దెలిపి రింద్రునాశయమును వి
శ్వాసము గలుగుటచే వృ, త్రాసురుఁ డరుదెంచె నింద్రునంతికమునకున్.

ఉ. వచ్చినవృత్రునిం గని దివస్పతి లేచి సగౌరవంబుగా
వచ్చి కవుంగిలించికొని వచ్చితె తమ్ముఁడ రమ్మటంచు వా
క్రుచ్చి స్వకీయహర్మ్యమునకుం గొనిపోయి భలోపచారముల్
హెచ్చుగఁ జేసి వాని వసియింపఁగఁ జేసె నిజార్ధపీఠికన్. 427

చ. అటులు వసింపఁ జేసి యనుజా సురరాజ్యము నేలుకొంద మె
ప్పటికిని నేకమై మనము భద్రముగా నిటు లున్న విద్విష
[illegible]ట్టలము తేటచూడఁ గలదా మనలన్ గనుఁగొ మ్మటంచు ను
త్కట మగుస్నేహ మప్పటికిఁ గన్పడ నింద్రుఁడు వల్కె వానితోన్. 428

క. ఆమాటలు విని దైత్య, గ్రామణి మదిలోన నమ్మకము హెచ్చఁగ సు
త్రాముని తోఁ గలసి సుర, స్వామి యగుచు నేలుకొనఁగ సాగె దివంబున్.

క. అది యటులుండఁగ నింద్రుఁడు, వెదకి యుపాయం బొకండు వృత్రాసురునిన్
సదమద మొనర్ప రంభా, మదవతికిం జెప్పె నాత్మమంత్రార్థంబున్. 430

క. అంతట రంభ మరుత్వ, చ్చింతితకార్యంబు దలఁచి చేయంగను నే
కాంతముగ నందనవనా, భ్యంతరమునఁ జెలులతోడ నాడుచు నుండెన్. 431

వ. అప్పుడు వృత్రాసురుండు దానవకతిపయసమేతుండై నందనారామంబున కరిగి యచ్చట విహరించుచు నొక్కచోటఁ జందనద్రుమంబునీడ సఖులతోడ నాడుచుండునమ్మచ్చకంటిం గనుంగొని తద్విలాసాకృష్టమానసుండై తదంతికంబున కరిగి.

ఉ. ఎవ్వతె వీవు పంకరుహలోచన నిన్ గనుఁగొన్న మానసం
బువ్విళులూరుచున్నయది యోపఁగ నాకు వశంబు గాదు నా
నవ్వనజాక్షి యిట్లనియె నాతనితోడను నేను రంభ నీ
వెవ్వఁడ విట్లు వల్కఁ దగునే మగవారల కాఁడువారలన్. 433

చ. అనవుడు వృత్రుఁ డిట్లనియె నంబుజలోచన నేను గశ్యపుం
డనియెడుబ్రహ్మకున్ సుతుఁడ నగ్నిభవుండను వజ్రికిన్ సఖుం
డను త్రిదివార్ధ మేలుకొనునాయకుఁడన్ త్రిజగంబులన్ వశం
బొనరుచుకొన్నశూరుఁడను నూర్జితవీర్యుఁడ వృత్రనాముఁడన్. 434

క. నను నీ వెఱుఁగవు గావున, వనజాయతనేత్ర యిట్లు వచియించితి వై
నను నివు డేమాయెను నీ, పనుపున న న్నుంచికొనుము బద్ధుఁడ నైతిన్. 435

చ. అనుటయు రంభ యిట్లనియె నాతనితోడ మహాత్మ నేను గో
రినపని నీవు చేయ నొనరించెదవేని ప్రతిజ్ఞ తీర్చుదా
నను భవదీప్సితార్థమును నావుడు దైవము సాక్షి గాఁగ నీ
వనిచినకార్య మేను సలుపంగలవాఁడను విశ్వసింపుమా. 436

క. అని వృత్రుఁ డాడుటయు న, వ్వనితామణి లాస్యగాన వైశారద్యం
బున శృంగారవిలాసం, బున నాదానవుని డెందమును గరఁగించెన్. 437

గీ. అట్లు కరఁగించి డెందంబు నంబుజాక్షి, తనముఖాసవ మిచ్చె నాతనికి నతఁడు
దానిఁ దిలకించి తగునె మద్యంబు నీయ, వేదవేదాంగవిదుఁ డైనద్విజున కతివ.

క. జనియించితిఁ గశ్యపునకు, నొనరించితి ఘోరతపము నుఱ్ఱూతలు గాఁ
గను జగము లెల్ల నర్హామె, కనకాంగి యొనర్ప నీయకార్యము నాకున్. 439

క. సుర ద్రావిన బ్రాహ్మణునకు, నరకము ప్రాప్తించు దండనము చేకూరున్
దొరవలన నేల నన్నీ, దురితములోఁపలను గూలఁ ద్రోయుదు వబలా. 440

చ. అనుటయు రంభ యిట్లనియె నాతని కింతకు మున్ను నీ వొన
ర్చినసుదృఢప్రతిజ్ఞను స్మరించినచో నొకసారి యిట్లు నీ
వన వని నొక్కి చెప్పఁగల నార్యుఁడ వీవె తలంచి చూడుమీ
యనృతమె మేలొ మద్యమును నానుటె మేలొ సురాసురేశ్వరా. 441

క. అనవుడుఁ జేసినప్రతినను, వినిహాత మొనరింప లేక వృత్రాసురుఁ డా
ననమునఁ జిఱునవ్వొలయఁగ, వనజేక్షణ యిడినయాసవంబును ద్రావెన్.

క. త్రావిన వెంటనె యజ్ఞా, నావిష్టుం డయ్యె వృత్రుఁ డదె సమయముగా
భావించి యింద్రుఁ డాతనిఁ, గావించె నికృత్తగళునిఁగా వజ్రమునన్. 443

గీ. ధర్మకంటకుఁ డైనయాదానవుండు, చచ్చుటయు లోక మంతయు సంతసించెఁ
గాని వజ్రికి మాత్రము మానదయ్యె, బ్రహ్మహత్య యొనర్చినపాతకంబు. 444

క. అంతట వృత్రునినిధనము, సంతాపము గొలుప నేఁగి చయ్యనఁ దద్వృ
త్తాంత మెఱిఁగించి నాథున, కంతయు దితి యేడ్చెఁ గనుల నశ్రువు లురలన్.

క. ఆయేడుపు విని కశ్యపుఁ, డాయమ నోదార్చి కేల నంటి తపంబున్
జేయుము వజ్రివధంబున్, జేయంగలకొడుకు పుట్టు శీఘ్రము నీకున్. 446

క. అని యాశీర్వాదంబుం, బొనరిచి మఱి యిట్టులనియెఁ బూఁబోఁడి కరం
బున నేను దాఁకఁగనె నీ, కొనగూడెను గర్భ మెట్టు లోమెదో దీనిన్. 447

సీ. ఒకతపోవనమునయందె యుండవలయు, వత్సరశతంబు నిండెడివఱకు నీవు
తపము నొనరించుచును బ్రమాదం బొకింత, చెందితివ యేని సర్వంబుఁ జెడును జూవె

—: గర్భిణీధర్మకథనము :—

సీ. తగదు భుజింప సంధ్యాకాలములయందు, వృక్షమూలంబుల కేఁగ రాదు
కావింపరాదు జలావగాహము శూన్య, మందిరంబున వసింపంగ రాదు
వర్తింపఁగా రాదు వల్మీకభూముల, నుద్విగ్నచిత్తవై యుండ రాదు
విలిఖింపరాదు పృథ్విని నఖరంబులచేతఁ, గాలు ద్రెవ్వఁగ రాదు కలహమున

గీ. తగదు వ్యాయామ మొనరింపఁ దగదు విరియఁ
బోసికొనియుండ మూర్ధజంబులను దగదు
హాస్య మాడంగఁ దగ దుండ నశుచి యగుచు
గర్భమును దాల్చియున్నట్టికలుపకంటి. 449

సీ. అస్థికపాలభస్మాంగారతుషయుక్త, మైనచోటను దగ దడుగు వెట్ట
గాత్రభంగ మొనర్పఁగా రా దమంగళం, బైనభాషణముల నాడ రాదు
ముసలంబులును రోళ్లు మొదలుగాఁ గలగట్టి,యురువులమీఁదఁ గూర్చుండఁదగదు
తగ దుండ నలసయై తగ దుండ నగ్నయై, తగవు లాడెడిచోటఁ దగదు నిలువ

గీ. తగదు పండుకొనంగ నధోతపాద, ముగను నపరోత్తరశిరస్కముగను దన్నుఁ
దెగడుకొన రాదు భర్తను దిట్ట రాదు, గర్భవతి యైనతొయ్యలి కంబుకంఠ.

క. వలయును బెద్దలఁ బూజం, బలుపంగను మంచినీట స్నానము వలయుం
జలుపఁగఁ బ్రసన్న లగుచును, వలయును నుండంగ గర్భవతు లగుకాంతల్.

గీ. వినవలయు మంచిమాటలు వీను లొగ్గి, పలుకవలయును మంచిపల్కులను నోట
నుండవలయును సంతృప్తి యొదవ మదికి, గర్భధారిణి యగుబోటి కమలవదన.

క. అనవుడు దితి మేరుతపో, వనమునకుం బోయి నియమవతియై తపముం
బొనరింపఁ దొడఁగె నింద్రుని, హననము గావింపఁదగినయాత్మజునకునై. 453

సీ. ఆరహస్యమును బలారాతి గ్రహియించి, బ్రాహ్మణరూప మేర్పడఁగఁ దాల్చి
దితిసన్నిధికిఁ జేరి నతి సేసి తల్లి నే, క్షితిసురుండను భవత్సుతనిభుండఁ
దపము చేసెడివారిదరి నుండి పరిచర్య, లాచరించుటయె నా కభిమతంబు
కాన నీశుశ్రూష గావించుచుండుట, కనుమతింపుము చాలు నదియ నాకు

గీ. ననుచుఁ బ్రార్థించుటయు నామె యనుమతించె
నంత నాతఁడు నయవినయంబు లెసఁగఁ
బ్రతిదినంబును జాగరూకత వహించి
చేయవలసినసేవలు చేయుచుండె. 454

వ. అంత శతవర్షంబులు పూర్ణం బగుటయు నామె గర్భంబు గూడఁ బూర్ణం బయ్యె. అప్పు డొక్కనాఁడు దితి పాదశౌచంబు గావించుకొనక ముక్తకేశ యగుచుఁ బశ్చిమశీర్షంబుగా శయనంబుపై శయనించి నిదురించె. 455

క. అది యవకాశముగాఁ గొని, త్రిదశాధీశ్వరుఁడు చొచ్చి దితిగర్భంబుం
భిదురమున సప్తశకలము, లొదవఁగ గర్భస్థశిశువు నుచ్ఛేదించెన్. 456

సీ. ఖండించుటయును నాఖండంబు లేడును, నేకకంఠంబుగా నేడ్వఁ దొడఁగె
నారోదనధ్వని నాలించి 'మా రుద, మా రుద' యంచును మరల మరల

ఖండించె నొక్కొక్కఖండంబు నే డేడు, ఖండంబులుగను నాఖండలుండు
తత్ఖండములు సముద్దండగాంభీర్యప్ర,తాపవిక్రాంతియుక్తంబు లగుచుఁ
గీ. దనరి నలువదితొమ్మిది తనువులుగను, దాల్చి మరుదాఖ్యలను సమస్తప్రపంచ
ములను నడపెడిదివ్యశక్తులను బడసి, యాశ్రయించెను జంభాసురారి నపుడు.

—: జ్యేష్ఠపూర్ణిమావ్రతకథనము :—

క. అని చెప్పుటయును మానులు, మనమున విస్మయముఁ జెంది మహనీయ యెటుల్
మనిరి మరుత్తులు భిదురం, బున ఖండితు లయ్యుఁ జిత్రముగఁ గన్పడెడిన్.
క. అమరప్రియత్వ మేవిధి, సమకుఱె మరుదాఖ్య లెట్లు సంప్రాప్తించెన్
సుమనోద్వేషణు లగుదితి, కుమారులకుఁ జెపుమ వినఁగఁ గుతుకం బయ్యెన్.
క. అనవుడు సూతుం డి ట్లని, యెను దాపసులార కలదు హేతువు మును భీ
ష్మున కీవృత్తాంతంబును, వినిచెఁ బులస్త్యుండు దాని వినుఁడు వచింతున్. 460
సీ. పుత్రు లందఱుఁ గూడఁ బొలియుచుండఁగ దితి, యేడ్చుచుఁ గన్నీరు లేర్లు వాఱ
నరిగి వసిష్ఠునిదరి కొక్కనాఁడు త, చ్చరణపద్మములకుఁ జాఁగి మ్రొక్కి
మునివర పుత్రనాశనము గల్గనివ్రతం, బే దేని దయతోడ నెఱుఁగఁ జెపుమ
యని వేఁడుకొనుటయు నమ్మునీంద్రుఁడు కరు, ణార్ద్రదృష్టులను నాయమను జూచి
గీ. తల్లి చింతిల్లకుము నీకు నుల్లమందు, దృఢముగను సట్టితలఁపు సంధిల్లెనేని
యున్న యదిచూవెయవిరతాయుష్యయోగ, వర్ధకము జ్యేష్ఠపూర్ణిమావ్రత మొకండు.
క. అని చెప్పుటయును దితి తన, మనమునఁ గలచింత కొంత మాని ధృతిన్ గై
కొని తాపసేంద్ర తద్వ్రత, మొనరించువిధాన మంతయును జెప్పు మనెన్. 462
వ. అంతట వసిష్ఠుం డాయమం జూచి సాధ్వి జ్యేష్ఠమాసపూర్ణిమాదినంబున నొక్కవేదికపైని మండలం బేర్పఱిచి యందు శ్వేతతండులపూరితంబును శ్వేత చందనచర్చితంబును శ్వేతవస్త్రయుగచ్ఛన్నంబును నిక్షుదండఫలయుతంబును సగుడంబును సహిరణ్యంబును నగునొక్కనూతనతామ్రకలశంబు నుంచి దాని పైని స్వర్ణబ్రహ్మప్రతిమను దద్వామభాగంబున రజతసావిత్రీప్రతిమను నుంచి ప్రాణప్రతిష్ఠ గావించి శుక్లపుష్పాక్షతతిలలచే నర్చించి యాదినం బెల్ల నుపవసించి స్థండిలంబున శయనించి పరదినప్రభాతకాలంబున నాకలశంబు బ్రాహ్మణునకు సమర్పించి బ్రాహ్మణుల భుజింపం జేసి దక్షిణాతాంబూలము లొసంగి సర్వంబును బ్రహ్మార్పణము గావించి లవణవర్జితంబుగాఁ దాను భుజింప వలయు. ఈవిధం బునఁ బ్రతిమాసంబును వ్రతంబు గావించుచుఁ ద్రయోదశమాసంబున బ్రహ్మ నామంబు లుచ్చరించుచు శుక్లతిలలచేతను గోఘృతపాయసంబులచేతను హోమంబు గావించి సపత్నీకుం డగుబ్రాహ్మణునకుఁ బూజాపూర్వకంబుగా స్వర్ణ బ్రహ్మప్రతిమయును రజతసావిత్రీప్రతిమయును ఘృతధేనువును సర్వోపస్కర

సమేతం బగు శయ్యయు నిక్షుదండంబులును బుష్పమాల్యంబులును దక్షిణా
తాంబూలంబులును సమర్పించి బ్రాహ్మణుల భోజనసంతృప్తులం జేయవలయు.

క. ఈవిధమున నెవ రేనియు, గావించిన యెడల వ్రతము గతపాతకు లై
జీవత్పుత్రులఁ బడసి శు, భావహ మైనట్టిపదము నందుదురు తుదిన్. 464

క. అని వచియించుటయును దితి, విని సంతోషమున వ్రతము విధియుక్తము గా
నొనరించె దాన మృత్యువు, గన నైరి మరుత్తు లెన్ని ఖండము లైనన్. 465

—: మరుత్తులవృత్తాంతము :—

గీ. గర్భగత మైనశిశువు లుత్కటముగాఁగ, రోదనము చేయుచుండ 'మా రుద' యటంచు
నమరపతి పల్కె వర్ణలోపాగమములఁ, గలిగె మరుదాహ్వయంబు వారలకు నాఁడె.

సీ. కావించినను నెన్ని ఖండంబులుగఁ దాను, బ్రాణముల్ గల్గి యావ్రక్క లుండఁ
బురుహూతుఁ డాశ్చర్యమును జెంది వీ రేదొ, యధికపుణ్యా మొనర్చి రని తలంచి
దితికాళ్లపైఁ బడి దేవి ప్రాణాశ చేఁ, జేసితి ఘోరదుష్కృతము నేను
క్షమియింపు మని వేఁడి సైఁపంగ నాయమ, సంతోషమును జెంది స్వాంతమందు

గీ. నామరుత్తుల దేవతలందుఁ జేర్చి, వారలకు యజ్ఞభాగాధికార మొసఁగి
చనియె నావల వారలు సంభవించి, తిరుగఁ జొచ్చిరి ప్రియు లయి సురల కెల్ల.

క. అనుటయును ఋషులు సూతునిఁ, గనుగొని యిట్లనిరి పృథునిగాథను మాకున్
వినిపింపు మతఁడు చేసిన, పను లెన్నియొ కల వటంచుఁ బలుకుదు రార్యుల్.

—: పృథుచరిత్రము :—

క. నావుడు సూతుఁడు వారల, కీవిధమునఁ జెప్పఁదొడఁగెఁ బృథుచరితంబున్
శ్రావకులకు శ్రోతలకును, బావనత ఘటిల్లు ననుచుఁ బ్రమదంపడుచున్. 469

సీ. అత్రివంశంబున నంగుఁ డంచుఁ బ్రసిద్ధి, గన్న ప్రజాపతి మున్ను వెలసె
నతఁడు మృత్యువునకు నాత్మజ యగుసునీ, థను స్వీకరించెను ధర్మసతిగ
నామెకు జనియించె నంగునివలనను, వేనాహ్వయుం డైనసూనుఁ డొక్కఁ
డతఁడు ధర్మవిహీనుఁ డై రాజ్య మేలంగఁ, దొడఁగె మాతామహదోషమునను

గీ. దత్ప్రభుత్వంబునందు వేదములు పోయె, జన్నములు శాంతి లెను సదాచార ముడిగె
నాస్తికత్వము ప్రబలె దేవాలయములు, పాడువడియెను బ్రాహ్మణుల్ భ్రష్టు లైరి.

క. ననుఁ దప్ప నితర దైవము, లను గొలిచెడివారిశిరములను దీయుదు నే
నని శాసనమును గావిం, చెను వేనుం డంత దుష్టశీలుఁడొ తలఁపన్. 471

ఆ. అటులు దుష్కృతముల కాతఁడు పాల్పడి, ప్రజల నెల్లఁ గుందువఱచుచుండ
సైఁప లేక వానిచండశాసనమున, కఖిలసంయములును నాగ్రహించి. 472

ఆ. వానికడకు నేఁగి వేనమహారాజ, తలఁచినార మేము సలుపుటకును
ద్వాదశాబ్దమఖము దానికి భంగంబు, గలుగకుండఁ జేయవలయు నీవు. 473

ఆ. రాజు ధర్మములను రక్షించుచును రాజ్య, మేలుకొనుట భగవదీప్సితంబు
కాన మానరానికార్యంబు ధర్మసం, రక్షణంబు నీవు రాజవగుట. 474

క. అనుటయును నగ్నికణములు, గనులను నురలంగఁ బ్రళయకాలునిచందం
బున మండిపడుచు వేనుఁడు, మునులను హింసింపఁదలఁచు మొనయుచు నుండన్.

క. మును లాతనియుద్యమమును, గనుఁగొని యిఁక నూరకున్నఁ గలుగు నపాయం
బని యెంచి నిలువు మని ప, ల్కినతోడనె వాఁడు నిలిచెఁ గీల్బొమ్మవలెన్.

వ. అంత నమ్మహర్షు లాతనిసవ్యోరువును మథింప నీలవర్ణుండును వక్రహస్వాండును దీర్ఘాస్యుండును విరూపాక్షుండును లంబోదరుండును విశాలకర్ణుండును బృథు భుజుండును నగునొక్కపురుషుండు ప్రభవించె. వానిం జూచి యత్తపోధనులు 'నిషీద' యని గంభీరంబుగాఁ బలుక నాపురుషుండు భీతుండై గడగడ వడఁకుచుఁ గూర్చుండె. వానివంశంబ నిషాదులును గిరాతులును భిల్లులును భ్రమరులును బుళిందులును ననునసేకమ్లేచ్ఛజాతులచే వృద్ధి నొంది నానావిధపాప వ్యాకీర్ణం బయి పర్వతంబులందును నరణ్యంబులందును వ్యాపించె.

క. తరువాత మునులు మథియిం, చిరి తద్దక్షిణకరంబు స్వేదము దానన్
గురియుటను మరల మథియిం, చిరి దానినె బిగియఁబట్టి చేతులతోడన్. 478

సీ. అంత నాతనిపాప మంతరించుటయును, బ్రాదుర్భవించెఁ దత్పాణినుండి
ఖడ్గధనుర్బాణకవచకుండలకిరీ, టాలంకృతుఁడు ద్వాదశార్కనిభుఁడు
రాజలక్షణపరిభ్రాజమానుఁడు జగ, త్పూజార్హుఁడును నగుపురుషుఁ డొకఁడు
సర్వభూతములును సంతోష మందెను, గురిసె వ్యోమమునుండి కుసుమవృష్టి

గీ. యట్టితఱిని జతుర్ముఖుం డరుగుదెంచి, తన్మహాప్రభుశక్తికిఁ దగినయట్లు
పృథు వనెడిపేరు పెట్టి ధరిత్రి కెల్ల, నధిపతిగఁ జేసి దీవించి యరిగె నంత.479

క. అది మొదలు పృథు వధర్మము, మొదలంటఁగ నణఁచి ధర్మమును నెలకొల్పన్
మొదలిడెను సజ్జనులకు, ముదమును దుష్టులకు ఖేదమును సమకూరన్. 480

ఆ. అంత వానికడకు నరుదెంచి ప్రజలెల్ల, మ్రొక్కి తత్పదాబ్జములకు దేవ
చిత్తగింపు మనుచుఁ జేతులు జోడించి, పలికి రిట్లు దీనభావ మొదవ. 481

క. ఫలములు జలములు పత్రం, బులు మూలంబులును నెన్ని భుజియించిన నాఁ
కలి దీఱదాయె భూవర, నిలిపినఁ జంపినను దిక్కు నీవే మాకున్. 482

క. మును చల్లినట్టిబీజము, లను నెల్లను మ్రింగి యీ యిలాదేవి చలిం
పనునైనఁ జలింపదు మ, మ్మనఘా పాలింప నెట్టు లగునో నీకున్. 483

చ. అనవుడు నాప్రభుం డభయహస్తము వారి కొసంగి బాణముల్
ఘనువునఁ గూర్చి కోపమున ధాత్రిని జూచుచు నుండ ధాత్రి వెం

టను గ్రయించి యాతనికి శంకను గుంజనిగూడ మూని పో
యెను గిరికాననంబులకు నెవ్వరికిన్ గనరాక యుండఁగన్. 484

క. కనుఁగొని యోగబలంబున, జననాయకుఁ డది చరించుజాడను నటకున్
జని యేసెఁ దచ్ఛరీరము, తునియలు తునియలు గఁ దోఁడుతోడనె శరముల్.

గీ. అంత వసుమతి సాధ్వసాక్రాంత యగుచు, సింగ మయి పాఱిపోవుచుండంగ నేఁడు
తెలిసికొని వెంటఁబడి వాఁడిములుకు లేసి, వ్రయ్యలు గఁ జేసెఁ దచ్ఛరీరంబు నెల్ల.

క. ఆయెడ వసుమతి మహిషీ, కాయము ధరియింప నదియుఁ గనుఁగొని క్షోణీ
నాయకుఁడు దానిమేనను, సాయకములు నించె నడుగు సాగక యుండన్. 487

గీ. అపుడు గత్యంతరము లేమి నాధరిత్రి, తాల్చి గోరూపమును మింటిదారిఁ బట్టె
నది గ్రహించి మహీపాలుఁ డాగ్రహమునఁ, దగిలిచెను నూఱుకోలలు దానిమేన.

వ. అంత నాధేనువు దత్సాయకప్రచండాభిఘాతబాధావివశాంగి యయ్యును నాత్మ
రక్షణపరవశాంతరంగ యగుటం జేసి క్రమ్మఱిక యొక్కపూఁపున వ్యోమమార్గం
బునం జని చని. 489

సీ. స్వర్గంబునకు నేఁగి శక్రున కెఱిఁగింప, నతఁ డబ్జజుని చెంత కరుగు మనియె
సత్యలోకమునకుఁ జని విరించికిఁ జెప్ప, నతఁడు రుద్రునికడ కరుగు మనియె
కైలాసమున కేఁగి శూలిని బ్రార్థింప, నతఁ డచ్యుతునిదరి కరుగు మనియె
వైకుంఠమున కేఁగి వనమాలిఁ బ్రార్థింప, నతఁడు పృథునియొద్ద కరుగు మనియె

ఆ. కడకుఁ బృథువె తనకు గతి గాఁగ భూదేవి, యరుగుదెంచి వాని శరణుచొచ్చి
నేను ధాత్రి నాఁడుదానిని వధియింప, రాదు నీకు రాజరాజ యనియె. 490

చ. అనుటయు నాతఁ డిట్లనియె నాయమతోడను ధాత్రి లోకనా
శనకర మైనపాతకము సల్పిన నిన్నొకదాని సంహరిం
చినయెడ సర్వలోకములు చెందు సుఖం బదె మేలొ నిన్నుఁ గా
చిన నొకదాని నెల్లరు నశించెద రయ్యదె మేలొ చెప్పుమా. 491

క. పెక్కండ్రు సాధుజనులకు, నొక్కనివలనను బ్రమాద మొనగూడిన నా
యొక్కనిఁ గెడపుటె ప్రోచుట, తక్కిన పెక్కండ్ర నండ్రు తజ్జ్ఞులు వినవే. 492

చ. అనవుడు ధాత్రి యిట్లనియె నాతనితోడను దేవ ధర్మముల్
జనులను గావ నీవు జననం బయినాఁడవు నే నెఱుంగుదున్
మనిచెదవేని నన్ను నణుమాత్రము గూడను దాఁటకుండ నీ
పనిచినకార్యముం జలువుభారము దాల్చెద నాశిరంబునన్. 493

క. అనవుడుఁ బ్రజలకుఁ గావల, సినజీవన మిచ్చుచును వసించెదవేనిన్
నిను మనుచువాఁడ నెపుడును, నని పృథుభూపాలుఁ డిలకు నభయ మొసంగెన్.

క. అంతట మేదిని క్షోణీ, కాంతునితో నిట్టు లనియెఁ గాయం బెల్లన్
దంతురిత మయ్యెఁ ద్వచ్ఛర, కృంతనములచే ననుగ్రహింపుము నన్నున్. 495

క. అనుటయు నాభూకాంతుఁడు, కనికర మొదవంగ దానికాయంబున నాఁ
టినయమ్ము లెల్ల లాగెను, మునుపటికంటెను సమత్వమును నది యొందన్.

వ. అప్పుడు తదీయానుగ్రహంబునం జేసి ప్రాక్తనమన్వంతరంబులనుండియు విష మంబుగా నున్నభూప్రదేశంబు లన్నింటికిని సమత్వంబు గలిగి మర్యాదా శూన్యంబులు గా నున్న దేశంబులకును బురంబులకును గ్రామంబులకును హద్దు లేర్పడి నదీసాగరతీరంబులందును గిరికుంజంబులందును నరణ్యంబులందును దీర్ఘంబులందును గర్తంబులందును నతికృచ్ఛ్రంబుగా నివసించుచు లోభంబును నభిమానంబును మత్సరంబును నసత్యంబును బాపంబును నెఱుంగక ప్రవర్తిల్లు చుండుప్రజల కందఱకును నివాససౌఖ్యంబు సమకూరె. అంతటఁ బృథుమహీ పాలుండు. 497

క. ఫలపుష్పపర్ణమధుజల,ములు జీవనములు గఁ గ్లేశముల నొందుచు నాఁ
కలి దీఱ కుండుప్రజలను, దిలకింపఁగ లేక యామతిల్లినకృపతోన్. 498

వ. స్వాయంభువమనువును వత్సంబుగా నొనరించి తనహస్తంబు పాత్రంబుగాఁ జేసికొని యశేషసస్యక్షీరంబుధారావర్షంబుగాఁగురియవసుంధరా ధేనువునుబిదికె.

ఆ. అమృతకల్ప మైనయాయన్నమునఁ దృప్తి, పితరులకును సురల కతిథులకును
జలుపుచును నఖండసౌఖ్యంబులను గాంచు, చుండి రెల్లజనము లుర్విలోన. 500

క. రేవాతీరమ్మునఁ బృథు,భూవరుఁ డొకకొన్ని నగరములు తనపేరన్
గావింపఁ జేసి ధాత్రీ,దేవుల నం దునిచె శాశ్వతికవృత్తులతోన్. 501

క. అనురంజన మొనరించుచు, జనులకు ననిశమును యుక్తశాసనుఁ డగుచున్
గొనియెను నలువురిలోఁ గో, రనిఫలముగఁ బృథువు రాజరా జనుయశమున్.

సీ. కావించుచుండిరి క్రతువులు బ్రాహ్మణుల్, వర్షించుచుండెను వారిదములు
చేయుచుండిరి దుష్టశిక్షలు క్షత్త్రియుల్, ఫలపూరితము లయ్యెఁ బాదపములు
నుర్వి దున్నక పండుచుండె నయ్యె నశేష, ధేనువులును గామధేనువులు గ
గిటిలోన నిలు చుండె గిరులు సముద్రముల్, ధర్మమార్గముఁ బ్రజల్ దాఁటకుండిరి

ఆ. లేదు వాయుభీతి లే దగ్నిభీతియు, లే వకాలమృతులు లేవు రుజలు
దుష్కృతంబు లేదు దుర్భిక్షమును లేదు, రాజ్య మేలుచుండ రాజరాజు. 503

వ. ఆసమయంబున మహర్షిప్రేరణంబునఁ జతుర్ముఖ యాగోద్భవు లగుసూతమా గధవందిచారణు లరుదెంచి యమ్మహారాజుగుణంబులు మనోజ్ఞంబుగా స్తుతి యించుటయుఁ బృథుండు సంతసించి వారలకు సూతమగధకళింగహైహయాది దేశంబులు బహుమానంబుగా నొసంగె. 504

క. అది మొదలుగ సూతాదులు, పదుగురికిన్ ముదము స్తోత్రపాఠంబులచే
నొదవింపఁ బూనుకొని ర, య్యదియె తదన్వయములకును నాశ్రయ మయ్యెన్.

—: బృహస్పతి మున్నగువారు భూదేవినిఁ బిదుకుట :—

వ. మఱియును బృథుండువోలె మున్ను దేవతాజీవనార్థంబు సోముని వత్సంబుగా నొనర్చి స్వర్ణపాత్రంబున నమృతరూపం బగుక్షీరంబు గురియునట్లు దేవగురుండును బితృదేవతాజీవనార్థంబు యముని వత్సంబుగా నొనర్చి రజతపాత్రంబున స్వధాక్షీరంబు గురియునట్లు లంతకుండును సర్పజీవనార్థంబు తక్షకుని వత్సంబుగా నొనర్చి యలాబూపాత్రంబున విషక్షీరంబు కురియునట్లు ధృతరాష్ట్రుండనుసర్పాధిపతియును దైత్యదానవజీవనార్థంబు విరోచనుని వత్సంబుగా నొనర్చి యాయసపాత్రంబున మాయామయక్షీరంబు కురియునట్లు మధుదైత్యాధినాథుండును యక్షజీవనార్థంబు వైశ్రవణుని వత్సంబుగా నొనర్చి యయస్పాత్రంబునందు నంతర్ధానమయక్షీరంబు కురియునట్లు మణిధరునితండ్రి యగు రజతనాభుండును రాక్షసపిశాచజీవనార్థంబు సుమాలిని వత్సంబుగా నొనర్చి శవకపాలపాత్రంబున శోణితక్షీరంబు కురియునట్లు మహాబలుం డగురజతనాభుండును గంధర్వాప్సరోజీవనార్థంబు చిత్రరథుని వత్సంబుగా నొనర్చి పద్మపాత్రంబున గాంధర్వక్షీరంబు గురియునట్లు సురుచి యనుగంధర్వపతియును బర్వతజీవనార్థంబు హిమవంతుని వత్సంబుగాఁ జేసి సానుపాత్రంబున నానావిధరత్నౌషధిక్షీరంబు గురియునట్లు మేరుపర్వతరాజంబును సకలపాదపజీవనార్థంబు ప్లక్షంబును వత్సంబుగా నొనర్చి పాలాశపాత్రంబున సలిలక్షీరంబు గురియునట్లు సాలవృక్షరాజంబును నావిధంబునన సిద్ధవిద్యాధరగుహ్యకచారణాదులును దత్తద్వత్సపాత్రవిశేషంబులచే స్వస్వవాంఛానుకూలం బగుక్షీరంబు వర్షించునట్లు సర్వకామదాయిని యగుమేదినీధేనువును బితికిరి. సర్వలోకశ్రేయోజననయిత్రి యగునీమహాలక్ష్మి క్రమంబుగా మధుకైటభమేదఃక్లప్త యగుటంజేసి మేదిని యనియును బృథువుచేఁ బాలింపఁబడుటంజేసి పృథివి యనియును బ్రసిద్ధిం బడసె.

క. కావున ముప్పురు మూర్తులు, దేవతలకు నెట్లొ యట్లె ధ్యేయుఁడు పృథుధాత్రీవరుఁడు ప్రజల కెల్లను, బావనచరితులు ప్రణామపాత్రులు గారే. 507

ఆ. ఆదిరాజచరిత మత్యద్భుతము చది, వినను విన్న జాహ్నవీస్రవంతి
ననుదినమును దీర్థమాడినఫల మొంది, కడకు విష్ణుపదము గాంచు నరుఁడు. 508

క. అనుటయు నత్యానందం, బును జెంది యఖండపాపములు చేసినవే
నున కెట్లు శుద్ధి గలిగెను, వినిపింపుము సూత మాకు విశదము గాఁగన్. 509

వ. అని మహాత్ము లడుగుటయు వారికి సూతుం డి ట్లనియె. 510

—: వేనునిచరిత్రము :—

ఆ. పాపములు తొలంగుఁ బాపాత్ములకుఁ దీర్థ, సంగమునను సుజనసంగమునను
నటులె పాతకములు ఘటియిల్లుఁ బాపుల, సంగమునను జేసి జంతువులకు. 511

ఆ. కాన వేనునకును గలిగెఁ బుణ్యాత్ముల, దర్శనంబు మఱియు స్పర్శనంబు
దానఁ జేసి యతఁడు ధర్మాత్ముఁ డయ్యెను, సకలపాపములును సమసిపోయి.

క. సత్పురుషులదర్శనమును, సత్పురుషులస్పర్శనంబు సంభాషణముల్
సత్పురుషులతోఁ గలిగిన, సత్పురుషులె యగుదు రెట్టిసంకరులైనన్. 513

వ. అనుటయు నమ్మహర్షులు తీర్థసంగసంజాతపుణ్యంబునకు దృష్టాంతంబుగా నొక్క
గాథ వచియింపు మని యడుగ సూతుం డి ట్లనియె. 514

—: తీర్థసంగమునఁ గలుగుపుణ్యమును నిరూపించుట :—

క. కలఁడు మృగవ్యాధుం డొకఁ, డిలాతలంబునను నాతఁ డెప్పుడును మృగం
బులఁ జంపుచుఁ దన్మాంసా, దుల మెక్కుచు నుండు మిగుల దుష్టాత్ముండై.

క. అటు లుండఁగ నొకనాఁ డతఁ, డటవీస్థలి కేఁగి యచట నరిగెడిమృగి యొ
క్కటి గనఁబడ దానిని జం, పుటకై చాపమున బాణమును సంధించెన్. 516

గీ. అది కనుంగొని యాలేడి బెదరి బెదరి, పరువులెత్తుచు నొకకొండపైకిఁ బోయెఁ
దఱుముచును దానివెంటన తగిలి వాఁడు, కడకు నెటులేని యది యున్నకడకుఁ జేరె.

వ. అప్పుడు రేవాజలంబునందు మత్స్యములఁ బట్టుచున్నకైవర్తుఁ డొక్కఁ డాలేడిం
జూచి తన్మాంసగృధ్నుఁడై తత్ప్రాంతప్రదేశంబునకుం జని గుఱి చూచి దాని
మేన నొక్కసాయకంబు ప్రయోగించె. దైవికంబుగా నాసమయంబునంద
మృగవ్యాధుండును దానిపైని నారసంబు విడిచె. 518

క. ఆయమ్ములు రెండును జని, యాయమ్ములు నాఁటుకొనఁగ నప్పుడె రేవా
తోయమునఁ బడియె నామృగి, కాయము గిరినుండి యసునికాయము తొలఁగన్.

వ. అంత నాశబరమృగఘాతుకు లిరువురును 'నాలక్ష్యంబు నీ వేల కొట్టితి. నాలక్ష్యంబు
నీ వేల కొట్టితి' వని యన్యోన్యంబు గలహించుకొని దురాగ్రహంబున బాహు
దండంబుల నెట్టుకొనుచు నటనుండి నర్మదాసలిలంబునం బడి ప్రాణంబులు విడిచిరి.

గీ. అమ్మహానదిలోనఁ బర్వమ్మునందుఁ, బడినకతమున మృగికి నాపాపులకును
నూర్ధ్వగతి గల్గెఁ దీర్థసంయోగశక్తి, యఘముల దహించు సమిధల నగ్నివోలె.

క. అనుటయుఁ దపోధనులు సూ, తునితో ని ట్లనిరి మృత్యుదోషంబున వే
నున కొదవె దోష మంటివి, మునిపుంగవ చెపుము దానిమూలము మాకున్.

—: మృత్యుదోషనిరూపణము :—

చ. అనుటయు సూతుఁ డి ట్లనియె నమ్మహనీయులతోడ మృత్యు వ
న్నను యముఁ డన్న ధర్ముఁ డనినన్ సమవర్తి యొకండ వాఁడు చే

సిసపని పాప మైనయెడ శిక్ష యొనర్చును నెట్టివాని కై
నను దగినట్లు పుణ్య మయినన్ సమకూరుచు స్వర్గసౌఖ్యమున్. 523

క. కామక్రోధాదులకతఁ, డేమాత్రము గూడ లొంగనీయక మనమున్
నేమంబున వర్తిల్లెడి, సామర్థ్యముతోడ లోకశాసకుఁ డయ్యెన్. 524

ఆ. సర్వసమతచేత సమవర్తి యనియును, ధర్మవర్తనమున ధర్ముఁ డనియు
నతఁడు చెందఁగలిగె నన్వర్థనామము, లతనిఘనతఁ జెప్ప నవియె చాలు. 525

—: సునీథాచరిత్రము :—

గీ. అతనికి సునీథ యనునొకయాత్మజాత, కలిగి వర్ధిల్లుచును జంద్రకళ యనంగ
నొకదినంబునఁ జనియెను సకులతోడఁ, గలిసి విహరింపఁగా నొకగహనమునకు.

వ. అట్లు చని యాయమ సఖులతోడం గూడి విహరించుచుండుసమయంబున.

క. ఆవనమున నొక్కెడ దీ, క్షావిధిని సుశంఖుఁ డనెడిగంధర్వుఁడు వా
గ్దేవినిగూర్చి తపంబున్, గావించుచు నుండి యామెకంటన్ బడియెన్. 528

ఉ. ఆతనిఁ జూచి యాయమ రయంబున నచ్చటి కేఁగి తజ్జటా
వ్రాతముఁ బట్టి లాగుటయు వాఁడు కనుంగవ విచ్చి చూచి య
మ్మా తగ దీయకార్య మన నంతటితోడను బోక కొట్టె నా
పాతకురాలు దండమునఁ బాపము తత్తను వెల్లువాఱఁగన్. 529

క. కొట్టుటయు నాతఁ డాయమ, కిట్టు లనియెఁ బుత్రి కోప మేటికి నాపైఁ
దిట్టినను దిట్ట రార్యులు, కొట్టరు కొట్టినను దెలిసికొని వర్తిలుమీ. 530

క. అనుటయు సునీథ తనజన, కునికడ కరుదెంచి కానకున్ జని యటఁ దా
నొనరిచినపాప మంతయు, వినిచిన నతఁ డూరకుండె విననివిధమునన్. 531

ఆ. అంత మరల నామె యరిగి కాననమున, కత్తపస్వి నాగ్రహమునఁ గొట్టెఁ
గశలతోడ మేను గాదలు గట్టంగ, నప్పు డతఁడు కనుల నిప్పు లురల. 532

గీ. ఓసి పాపాత్మురాల నీచేసినట్టి, పాపకర్మంబునకుఁ దగుఫలము గాఁగఁ
బ్రథమగర్భంబుననె మహాపాపి నీకుఁ, బుట్టఁగలఁ డంచు శాపమువెట్టి చనియె.

ఉ. అంతట నాసునీథ తనయావసథంబున కేఁగి యెల్లవృ
త్తాంతము తండ్రికిన్ వినుప నాతఁడు పుత్రిని జేర్చి కౌఁగిటన్
సంతతి లేక లేక కనినారము తల్లి నటంచు నాత్మలో
సంతస మొందుచుండఁ గనఁ జాలకపోయెను దైవ మక్కటా. 534

ఆ. అమ్మ యేల పోతివమ్మ ఘోరారణ్య, మునకు నచట నెటనొ ముక్కుమూసి
కొని వసించియున్నముని నేల కొట్టితి, వమ్మ యెంత కెంత యయ్యె నకట.

క. అని కొంతతడవు చింతి, ల్లినవాఁ డయి దాన లబ్ధి లేశంబును లే
దని పొంచి వెదక సాగెను, ననుకూలుం డైనవరుని నాకన్నియకున్. 536

క. మునిశాపకారణంబున, ననిమిషులం దెవఁడుఁ గూడఁ డాకన్యను నై
కొన నొప్పుకొనమి లజ్జా, వనతాననుఁ డగుచు యముఁడు వగచుచు నుండన్.

ఆ. ఆసునీథ యతనియంతికమున కేఁగి, తండ్రి యెప్పుడుఁ గూడ దైన్య మెఱుఁగ
నట్టినీకుఁ గాననయ్యె నాననమున, నింతదీనభావ మేల చెప్పుమ. 538

క. అని యడుగుటయును యముఁడి, ట్లనియెను మాతల్లి సురలయం దొకఁ డైనన్
నినుఁ జేసికొనఁగ నొల్లఁడు, మునిశాపమె దీని కెల్ల మూలం బయ్యెన్. 539

క. సాధు వగువాని నెవ్వఁడు, బాధించునొ వాఁడు పాపపరిలిప్తుఁ డగున్
బాధించువాని మరలను, బాధించెడివాఁడు వానిపాపముఁ జెందున్. 540

క. కావున నెవ్వని కైనను, గావింపఁగ రాదు బాధ కావించితి వా
పావనున కీవు ద్రోహము, కావించెను నీకు నది యఘంబు కుమారీ. 541

ఆ. నీకతమున మాకు శోకంబు ప్రాప్తించెఁ, గన్నకడుపుగానఁ గన్నతల్లి
యేమి చేయువార మింకమీఁద నాకొల, తొలఁగునట్లు తపము సలుపుమమ్మ.

క. అనుటయు సునీథ జనకుని, యనుజ్ఞ గొని కాననమున కరిగి తపంబున్
బొనరింపఁ బోవునవసర, మున రంభాద్యప్సరస్సమూహము రాఁగన్. 543

గీ. వారి కెఱిఁగించె నిజతపఃకారణంబు, సర్వమును నామె యంత నాచంద్రముఖులు
కఠినతప మేడ నీమృదుకాయ మేడఁ, దగునె యీసాహసము నీకుఁ దన్వి చెప్పుమ.

క. మృదు వగుశిరీషసుమమును, బదను గలకుశాగ్రమునను బఱియలు సేయం
గదలెడునీయుద్యోగము, మదికి విషాదంబు గొలిపె మానిని మాకున్. 545

గీ. కాయశోషణకర మగుకార్య మీవు, విడిచిపెట్టుము మామాట వినుము తల్లి
బ్రహ్మవిష్ణుమహేశ్వరప్రభృతులకును, గలవు దోషంబు లిఁక నీకుఁ గలుగు టెంత.

సీ. ఖండించె విధిమస్తకంబు నీశానుండు, పలికె నసత్యంబు పద్మయోని
భార్గవశాపంబు పడసెను విష్ణుండు, పాకారి గావించె బ్రహ్మహత్య
చంద్రుండు గురుదారసాంగత్య మొనరించె, గుహ్యకాధీశుఁడు కుష్ఠి యయ్యె
నుద్భవించెను నగస్త్యుండు కుంభమునందు, భానుతనూజుండు పంగు వయ్యె

గీ. నట్టిమహనీయులచరిత్ర లిట్టు లుండ, నింక నన్యులచరితంబు లెన్న నేల
చంచలేక్షణ వా రొనరించినట్టి, దోషములలోన నీ కున్నదోష మెంత. 547

—: ఉత్తమస్త్రీగుణకథనము :—

వ. కన్యామణీ యుత్తమాంగనల కుండవలసినరూపంబును శీలంబును సత్యంబును నార్యత్వంబును ధర్మంబును సతీత్వంబును దార్ఢ్యంబును సాహసంబును గానంబును వ్యవసాయంబును గామంబును మధురవాక్యంబును ననుద్వాదశగుణంబులును నీయెడఁ గనంబడుచున్నయవి. 548

ఉ. నీవు భయంబు చెందకుము నీరజలోచన సర్వలోకసం
భావితకీర్తిశాలి యగుభర్త లభించెడియొక్కవిద్దియన్
గావలె నన్న నీకు నొసఁగంగలవారము మేము నావుడున్
భావమునందు నాయమ యపారకుతూహల ముద్భవిల్లఁగన్. 549

ఆ. అక్కలార మీకు ననుజపైని ననుగ్రహంబు గలిగెనేని యనినమాట
సార్థకంబు గాఁగ నామహావిద్యను, నొసఁగి సుకృతఫలము నొందరమ్మ. 550

క. అనుటయును బురుషసమ్మో, హనవిద్య నొసంగి వార లామెకుఁ దన్వీ
కనుఁగొనియెద వేతన్మహి, మను రమ్మిఁక బయలుదేఱి మాతో ననుచున్.

గీ. వారిపైఁ గల్గినట్టివిశ్వాసమునను, నావధూమణి వారల ననుసరించి
చనియె భాగీరథీతీరమునకు నందుఁ, గానఁబడియెను నామెకు మౌని యొకఁడు.

క. తిలకించి రూపరేఖా, దులవలన నవీనమన్మథుం డనుబుద్ధిం
గలిగించుచుండునాతని, నలివేణి వచించె నిట్లు లాచానలతోన్. 553

ఆ. సకియలార యీప్రసన్నమూర్తి యెవండొ, తెలుపరమ్మ నాకుఁ దేటపడఁగఁ
గన్నుఁగవకు శీతకరునిచాయ నితండు, కలుగఁజేయు చుండెఁ గౌతుకంబు.

వ. అనుటయును నాయమకు రంభ యిట్లనియె. 555

సీ. అవ్యక్తసంభూతుఁ డైనబ్రహ్మకుఁ బుట్టె, నత్రిప్రజాపతి యనఘమూర్తి
యతని కంగుం డనునాత్మజుం డుదయించె, నాయంగుఁ డొకసమయంబునందు
నందనోద్యానంబునకుఁ బోయి కని మహా, విభవంబుతో నున్నవిబుధపతిని
నాహ్లాదమును జెంది యతనిఁ బోలినపుత్ర, రత్నంబుపై మనోరథము గలుగ

గీ. నదియె మొదలుగ దీక్షతో నాచరించెఁ, దపము నారాయణుండు ప్రత్యక్షమయ్యెఁ
గోరె నతఁ డింద్రనిభుఁ డైనకొమరు నొకని, నట్లెయగు నని వర మిచ్చి యరిగె శార్ఙ్గి

గీ. యంతనంగుఁడు మంచికన్యను వరింప, నెంచుచున్నాఁడు మదిరాక్షి యితఁ డెయతఁడు
నీవు గూడను మంచివానిని వరింప, నెంచుచున్నావు విధియోగ మెట్లు కలదొ.

క. అనుటయు సునీథ మనమున, జనియించినయాసతోడ సకియా యిపుడే
నొనరింపఁదగిన దేమియొ, వినిపింపఁగదమ్మ నీవు వేగమె నాకున్. 558

క. అని వేడుటయును రంభా, వనజేక్షణ యిట్టు లనియె వైవస్వతనం
దనతోడఁ గలికి గానం, బొనరింపుము వీనిహృదయ మువ్విళ్లూరన్. 559

గీ. అనుటయును నాసునీథ యత్యద్భుతముగ, గానమొనరించుచును మేరుకందరమున
కరిగె నాభామినులతోడ నరుగుదేర, నంత నంగుఁడు తద్గానమాలకించి. 560

గీ. పరవశీకృతుఁ డగుచు సత్వరమ లేచి, యరిగి గానంబు వినవచ్చునట్టికడకుఁ
గనియె నచ్చోట నప్సరఃకమలముఖుల, నడుమ రతివోలె రాజిల్లునాతి నొకతె.

క. కనుఁగొని యామెను దన్మో, హనవిద్యామోహితాత్ముఁ డయి యంగుం డి
ట్లని యడిగెఁ దన్వి నీ వె, వ్వనిపుత్త్రివొ యేటికిటకు వచ్చితొ చెప్పుమా. 562

క. అనుటయు నాయమ లజ్జా, వనతానన యగుచు సఖులవంకను గ్రేఁగం
టను జూచుచుండ రంభా, వనజేక్షణ దొడఁగె నిట్లు వానికిఁ జెప్పన్. 563

క. అనఘా యీయమ ధర్మని, తనయ సునీథాభిధాన తనకుఁ దగిననా
థునికొఱ కన్వేషించుచుఁ, జనుదెంచిన దిటకు మాదుసాహాయ్యమునన్. 564

క. అనుటయుఁ దనవృత్తాంతం, బును నంగుఁడు వినిచి సర్వమును మానిని మీ
యనుగుంజెలి నను వరియిం, చినయెడ నావిష్ణువరము నెందు ఫలంబున్. 565

చ. అనుటయు రంభ యి ట్లనియె నాతనితోడ మహాత్మ నీవు కో
రినయటు లీవధూమణి వరించును గాని పరిత్యజింప నీ
వనితను నెట్టికష్టములు వచ్చినఁ గూడ నటంచు నీమెచే
తను జెయి యుంచి పల్కుము ముదం బగు మాకును నీకు నీమెకున్. 566

క. నావుడు నట్టులె యంగుఁడు, కావించి సునీథ నపుడె గాంధర్వవిధిన్
గావించుకొనియెఁ బత్నిగ, దేవాంగన లంతఁ జనిరి త్రిదివంబునకున్. 567

గీ. అంగునకు నంతట సునీథయందుఁ గలిగె, నమరపతిసన్నిభుం డైనయాత్మజుండు
వాని కొనరించె నంగుఁడు వేనుఁ డనెడి, నామకరణంబు సంతోష మామతిల్ల.

క. వేనుం డుదయం బొందిన, భానుఁడువలెఁ బ్రభలతోడ భాసిల్లుచు వి
జ్ఞాని యయి సకలవిద్యల, లోనన్ దినదినము వర్ధిలుచు నలరారెన్. 569

క. అంతట వైవస్వతమ, న్వంతర మేతెంచుటయును నధిపతి లేమిన్
జింతించి ఋషులు ధరణీ, కాంతునిఁగ నొనర్చి రఖిలగణ్యుని నతనిన్. 570

ఆ. అంత నాధిపత్య మతఁ డొంది క్షత్త్రియ, సంప్రదాయమునను సర్వజనుల
నేలఁ దొడఁగె సురల నింద్రుఁడువలె ధర్మ, మార్గ మించుకేని మాయకుండ.

—: వేనుఁడు జైనమతప్రవిష్టుఁ డగుట :—

గీ. అట్టు లేలుచు నుండ రాజ్యంబు నతఁడు, ధర్మసంరక్షణైకతాత్పర్యమునను
గానికాలంబు వచ్చినకరణి నొక్క, ముండి యరుదెంచె నా వేనుఁ డుండుకడకు.

గీ. కరమునను నారికేళవికార మైన, పానపాత్రంబు గక్షను బర్హిపింఛ
మార్జనియుఁ దాల్చినగ్నుఁడై మానివోలెఁ, గానఁబడువానిఁ గనుఁగొని వేనుఁ డంత.

క. స్వామీ యీవేషంబున, నేమి కతంబునను నిచటి కేతెంచితి నీ
నామస్వరూపమహిమము, లేమియొ తెలియంగ నాకు నిచ్చ జనించెన్. 574

చ. అనుటయు ముండి యి ట్లనియె నాతనితోడను నాస్వరూప మే
మని వచియింతు నేను సకలాత్ముఁడ జ్ఞానమయుండ బ్రహ్మనం

దనుఁడను సత్యసంధుఁడ సనాతనుఁడన్ జినుఁ డంచు నన్నుఁ జే
ర్కొనెదరు నేను యోగులకు గోచరమయ్యెద ధ్యానవీథిలోన్. 575

చ. అనవుడు వేనుఁ డి ట్లనియె నాతనితోడను జైనధర్మమున్
వినిచెదవేని నాకు విన వేడుక యయ్యెడు దేవ నావుడున్
జినుఁడు హసన్ముఖుం డగుచుఁ జెప్పఁగ నిట్లు దొడంగె భూవరా
వినుము యథార్థమున్ వినఁగ వేఁడుక నీ కొనఁగూడె నేనియున్. 576

క. ధర్మము ధర్మం బందురు, ధర్మంబు నెఱింగినట్టితత్త్వజ్ఞులె యీ
కర్మఠులు నిజము చెప్పెద, ధర్మ మనఁగ సర్వభూతదయ యొకటె సుమీ. 577

క. అర్హుఁ డగుదేవుఁ డన్నను, నర్హంతుఁ డొకండె యని తదాఖ్యయె తెలుపున్
బర్హిర్ముఖు లగువారి క, నర్హంబులు దేవు లనెడియభిధానంబుల్. 578

క. పరమసుఖం బాసించెడి, పురుషుల కర్హంతుఁ డొకఁడె పూజింపఁ దగున్
గురువులె గ్రంథాపేక్షులు, గురు వన నిర్గ్రంథుఁ డొకఁడె కువలయనాథా. 579

గీ. యజనమును యాజనమును సంధ్యయును నగ్ని
హోత్రమును స్వాహయును స్వధయును దపంబు
దానమును నధ్యయనమును దర్పణమును
నతిథిపూజయు వ్యర్థము లవనినాథ. 580

గీ. పంచభూతాత్మకము గళేబరము మారు, తాత్మకుం డాత్మ సంప్రాప్తమయ్యెనేని
యంతకాలంబు కసరాక యాత్మ పోవుఁ, దనువు చేరును బంచభూతములలోన.

గీ. భూతసంయోగ మవనీంద్ర బుద్బుదముల, కరణి నిమిషంబులోపలఁ గలుగుచుండు
మాటలోఁబోవుచుండునీమాత్రమునకె, మోహసంబద్ధు లగుదురు మూఢమతులు.

క. జననాథ యిది యిటుండఁగఁ, జనిపోయినజంతువులకు శ్రాద్ధాదులతోఁ
బని యేమి ఛాందసులు చె, ప్పినమాటలె చెఱచె జనులఁ బెద్దలె వారల్. 583

గీ. శ్రద్ధతోడను శ్రాద్ధంబు సలిపెనేని, తృప్తిపడుదురు పితరు లాతృప్తివలన
శ్రేయములు గల్గు నని చెప్పి చిత్రముగను, భూసురులు తిని పోదురు పొట్ట నిండ.

క. వేదంబులలోఁ గలయను, పాదేయంబులను విన్నపక్షంబునఁ జీ
కా దనుచుఁ దగులఁబెట్టవె, వేదంబుల నెల్ల నొక్కవ్రేల్మిడి నధిపా. 585

సీ. అశ్వంబుఁ జంపిన నశ్వమేధమునందు, దేవలోకంబు ప్రాప్తించునట్టె
నరమేధమునయందు నరునిఁ గాఁజేసినఁ, గడ లేనిపుణ్యంబు గలుగునట్టె
యజమును వాజపేయమున ముగించినఁ, బాపంబు లన్నియుఁ బాయునట్టె
గోమేధమునయందు గోహింస చేసిన, గోలోకసుఖము చేకూరునట్టె

గీ. మఱియు నానావిధము లైనమఖము లెన్నొ, నెలకొలిపి మీఁదవానికన్నిటికి నెన్నొ
ఫలములను జెప్పి లోభంబు గలుగఁ జేసె, వేదదౌర్భాగ్య మెంతని విశదపఱుతు.

గీ. దోషరహితము లైనజంతువులహింస, ధర్మ మెట్లగు ఫల మెట్లు దానఁ గలుగు
జీవహింసను ధర్మంబు చేసినట్టి, వేదములు వేదములె యెంత వెఱ్ఱితనము. 587

క. దయ లేనివాఁడు బ్రాహ్మణుఁ, డయినను శూద్రుండ సదయుఁ డగునెడ శూద్రుం
డయినను విప్రుఁడ ధర్మము, దయకంటెను లేదు మోక్షదాయక మధిపా. 588

గీ. అనుటయును వేనుఁ డాతనిఁ గని మహాత్మ, స్నానదానంబు లొనరించనేని పుణ్య
తీర్థములలోన ముక్తి ప్రాప్తించుననుచుఁ, బలుకుదురు దానితత్త్వంబు దెలుపుమనియె.

చ. అనుటయు వానికి ట్లనియె నాతఁడు భూప పయోదముల్ జలం
బును గురియించు నాజలమె భూమిధరంబులమీఁద భూమిమీఁ
దను బడి పాఱుతెంచుచు హ్రదంబులు గూపములుం దటాకముల్
వనధులు దీర్థముల్ నదులు వాఁకలు నాఁగను బేర్కొనం బడుం. 590

క. ఒకజలమె పుణ్యతీర్థం, బొకచోటను నైనఁ గాకయుండునె యొకచో
నొకచోటఁ గాకయుండిన, నొకచోటను నగునె యేల యుత్ప్రేక్షణముల్. 591

క. సలిలమున మునిఁగినంతనె, కలిగినయెడ ముక్తి యేల కలుగక యుండుం
జలమునన సంతతంబును, మెలఁగెడుకుంభీరకమఠమీనాదులకుం. 592

క. ఇప్పు డొసంగినదానికిఁ, దప్పక పదిరెట్లు గాఁగ దాత మృతుండై
నప్పుడు ఫలముం గొను నని, చెప్పుదు రామాట విశ్వసింపం దగునే. 593

క. జీవుం డుండినచోటనె, భూవర తీర్థమును ధర్మమును బుణ్యంబుం
దైవమును నుండు జీవుఁడు, పోవునెడల వానివెంటఁ బో దొక్కటియుం. 594

గీ. అనుటయును ముండి పాదంబు లంటి మ్రొక్కి, వేదధర్మంబు వేనుఁడు విడిచిపెట్టె
మృత్యువునకు స్వపుత్రిపై నెనసినట్టి, లోభమె నిదాన మయ్యె నీలోపమునకు.

క. అనుటయుఁ బృథువు జనించిన, యనంతరము వేనుఁ డేమి యయ్యెనొ మాకుం
వినిపింపు మనుచు వాంఛిం, చిన మునులకు సూతుఁ డిట్లు చెప్పఁ దొడంగెం.

క. సూనుం డుదయం బగుటయు, వేనుఁడు తనచెందినట్టివిషమస్థితికిం
మానసమున దురపిల్లుచుఁ, గాననమున కేఁగెఁ దపము గావింపంగం. 597

ఆ. అటులు కాననమున కరిగి వేనుఁడు మహా, ఘోరతపము హరినిగూర్చి చేయఁ
బద్మలోచనుండు ప్రత్యక్షమై యేమి, కోరుకొనెదొ వత్స కోరుకొనుము. 598

చ. అనుటయు వేనుఁ డిట్లనియె నంబుజనేత్రునకుం బ్రణామముం
బొనరిచి దేవ నాదురితముల్ హరియించి భవత్పదంబునం
దనుపుము నన్ను నం చనుటయుం శమియించెను వత్స నీతపం
బుననె సమస్తపాపములుఁ బొందినవాఁడవు పారిశుద్ధ్యముం. 599

క. ననుఁగూరిచి నీజనకుం, డొనరించి తపంబు వరము నొందెను నాచే
తను దాన నీకు నాపథ, మొనఁగూడును గోరు మింక నొక్కవరంబుం. 600

క. అని శార్ఙ్గి పలుకుటయు ని, ట్లనియెను వేనుండు దేవ యవ్యక్తంబై
యెనసినసనీత త్త్వంబును, వినిపింపుము నాకు వరము వే జేమిటికిన్. 601
వ. అని ప్రార్థించుటయు నారాయణుండు సానుగ్రహంబుగా వేనునితో ని ట్లనియె.

—: విష్ణువు నిజస్వరూపము నిరూపించుట :—

సీ. విష్ణునామంబున వెలసితి నవ్యక్త, రూపంబునను జగద్వ్యాపి నగుట
భూతముల్ నాయందు భూతంబులందు నే, నుండుట వాసుదేవుండ నైతి
సంకర్షణుండ నైతి జనుల నందఱ నంత, మున నాకడకు లాగికొనుటఁ జేసి
ప్రద్యుమ్నుఁ డని పేరువడితి సర్వము నేన, యగుదు నం చెంచి య ట్లగుటవలన
గీ. యోగబలమునఁ జేసి యొం డొకనిచేత, నెన్నఁడు నిరుద్ధుఁడను గాక యున్న కతన
నైతి ననిరుద్ధుఁడను హరి యనిన నేనె, హరుఁ డనిన నేనె పరమేష్ఠి యనిన నేనె.
సీ. జాగ్రదవస్థలో జగదభిమానయు, క్తుం డయి యుండువిశ్వుండు నేన
యింద్రియాకారంబు నెనసి స్వప్నమునందుఁ, జరియించుచుండు తైజసుఁడు నేన
యధిదైవరూపంబు నంది సుషుప్తిగ, తుం డయి యుండు ప్రాజ్ఞుండు నేన
నిర్వికారుండును నిర్లిప్తుఁడును నిర్గు, ణుండును నగుతురీయుండు నేన
గీ. సచ్చిదానందరూపంబు సర్వసాక్షి, యక్షరంబును నైనబ్రహ్మంబు నేన
నాస్వరూపంబుఁ దెలిసికొనంగ లేఁడు, మత్పదాంభోజభక్తి యేమఱినవాఁడు.
క. అనుటయు వేనుం డి ట్లని, యెను దేవ జినుం డనంగ నెవ్వఁడొ పాపం
బును నాకు నేల బోధిం, చెనొ చెప్పుము నాఁగ హరి వచింపఁ దొడంగెన్.
క. జననాథ మును సుశంఖుం, డనుముని బాల్యమునఁ దనకు నపచారంబుల్
బొనరించినకతమున నీ, జననికి దుష్టుఁడు జనింప శాపం బిచ్చెన్. 606
క. నీతండ్రి కఖిలసుగుణో, పేతుం డగుసుతుఁడు గలుగ నిచ్చితి వర మే
నాతఁ డతిఘోరనియమము, చేతను ననుఁగూర్చి తపము చేసినకతనన్. 607
గీ. ఈవరద్వితయమునకు నేరుపడిన, యట్టివైరుధ్యమును మాన్ప నాత్మ నెంచి
ధర్మమున రాజ్య మేలునీదరికి నేన, జినుఁడనై వచ్చి నీబుద్ధి చెఱచినాఁడ. 608
క. జినుఁ డన సునీథ గావిం, చినపాపమ వాఁడె నేను జేసినకర్మం
బును ననుభవింపఁ జేసెడి, పని నాయది పుణ్యమైన బాపం బైనన్. 609
గీ. కాన విధియు నిషేధంబు నేన యనుచుఁ, దెలిసికొనియూర్ధ్వగతినీకుఁ గలుగుటకును
గాలము నెఱింగి తీర్థంబు గని గ్రహించి, పాత్రమును దానముల నొసర్పంగవలయు.
క. చేయుము దశదానంబులు, చేయుము గృహదానములును జేయుము క్రతువుల్
చేయుము సురలకుఁ దృప్తిం, జేయుము భూదేవతలకుఁ జేతఃప్రీతిన్. 611

—: దానకాలపాత్రతీర్థస్వరూపనిరూపణము :—

వ. అనుటయు వేనుఁడు చేతులు జోడించి స్వామీ నాయం దనుగ్రహంబు గలిగె

నేని కాలలక్షణంబును బాత్రలక్షణంబును దీర్ఘలక్షణంబును దానవిధానంబును బోధింపు మని ప్రార్థించుటయు నారాయణుం డాతని కి ట్లనియె. వత్సా దాన కాలంబు నిత్యం బనియును నైమిత్తికం బనియును గామ్యం బనియును నాభ్యుద యికం బనియును నంత్యం బనియును నైదువిధంబులుగాఁ జెప్పంబడియె. కాల ముంబట్టి దానంబుగూడఁ బూర్వోక్తప్రకారంబునఁ బంచవిధంబుగా నయ్యె. అందు నిత్యకాలంబు ప్రాతర్మధ్యాహ్నపరాహ్ణరూపంబునఁ ద్రివిధం బయ్యె. ఆ త్రివిధకాలంబులందును న న్నుద్దేశించి శ్రద్ధాభక్తిపురస్సరంబుగా స్నానంబు గావించి సాయంశంబున నుదయం బైనసూర్యునకు జలం బొసంగుటయు బ్రాహ్మ ణులకు నన్నోదకఫలపుష్పవస్త్రతాంబూలభూషణస్వర్ణరత్నాదిదానంబు గావిం చుటయును బితృదేవతలకుఁ దర్పణాదు లొసంగుటయును ననంతపుణ్యఫల ప్రదంబు. ప్రతిదినంబును ద్రికాలంబుఁ గావింపందగినదానంబులు గావించుచుం డుట ముఖ్యంబు. శక్తి చాలదేని యుక్తకాలంబులం దొక్కకాలంబునం దేని కావించినదానంబు సమస్తకిల్బిషంబుల హరియించి మహాప్రభావంబు గలిగించు. కావున హితార్థి యగువాఁడు నిత్యదానంబు విడువం దగదు. 612

క. దేవతలకు నతిథులకుం, గావింపక తృప్తి భుక్తి గావించెడిదు
ర్భావులకు వ్యాధు లశనా, భావమ్మును గలుగు స్వీయపాపముకతనన్. 613

వ. అమావాస్యయుఁ బౌర్ణమాసియు సంక్రాంతియు వ్యతీపాతంబును వైధృతియు నేకాదశియు నమాసోమవాసరసమాయోగమును గజచ్ఛాయయును బితృక్షయ తిథియును మన్వాదులును యుగాదులును నైమిత్తికకాలంబుగాఁ జెప్పంబడియె నాకాలంబునందు. 614

క. ననుఁగూర్చి పాత్రులకు ని, చ్చినదానము స్వర్గమోక్షసిద్ధి నొసంగున్
గనుకను నైమిత్తికమున్, జనదు సుమీ విడువ నాత్మసౌఖ్యార్థులకున్. 615

వ. మఱియును గజరథాశ్వదానంబు చేయువాఁడు సర్వభూతంబులకును నజేయుం డును ధర్మాత్ముండును జ్ఞానవంతుండును నగుమహారాజుగా జన్మించు. భూ దానంబును గోదానంబును జేయువాఁడు సర్వభోగపతి యగు. గుప్తదానంబు గావించువాఁడు నిధిపతి యగు. చీనాంబరదానంబు గావించువాఁడు గుణవంతు లును నాయుష్మంతులును బ్రజావంతులును గీర్తిమంతులును యజ్వలును దత్త్వ జ్ఞానులును నధ్యయనసంపన్నులును నగుబహుపుత్రులచే సౌఖ్యంబు నొందు. సువర్ణభూషణంబులచే నలంకరించి కపిలను దానంబు చేయువాఁడు బ్రహ్మ యుండునంతవఱకును బ్రహ్మలోకంబునందు నివసించి మహాసౌఖ్యంబు వడయు. గోదానంబు గావించువాఁడు సర్వవిద్యాసంపన్నుండును నైశ్వర్యసమేతుండును విష్ణుభక్తుండును నై మేదిని యుండువంతవఱకును వైకుంఠంబునందు వసియించు.

భూషణదానంబు చేయువాఁడు స్వర్గంబునం దింద్రునితో సమానంబుగా దివ్య భోగంబు లనుభవించు. అన్నదానంబును సువర్ణదానంబును గావించువాఁడు నాకుఁ బ్రియుండై నాధామంబునందు నివసించు. వస్త్రహారాలంకృతంబును రౌప్యపిధానంబును బ్రహ్మసూత్రశోభితంబును ఘృతపూర్ణంబును నగుసువర్ణ కుంభమును వేదమంత్రంబులచేఁ బ్రతిష్ఠాపించి షోడశోపచారంబులచేఁ బూజించి పదియాఱుగోవులతోఁ గూడ సదక్షిణంబుగా దానంబు చేసినవాఁడు నశ్వరంబు గానిపుణ్యంబుం బడయు. 616

క. దేవతలఁగూర్చి వ్రతములు, గావించెడికాల మగును గామ్యము దానన్
గావించెడిదానము పు, ణ్యావహ మది సకలకామితార్థము లిచ్చున్. 617

వ. సుతునకు జాతకర్మనామకరణచౌలమౌంజీబంధవివాహాదికార్యంబు లొనరించు కాలంబును బ్రాసాదనిర్మాణకాలంబును ధ్వజదేవతాప్రతిష్ఠాకాలంబును వాపీ కూపతటాకగృహారామస్థాపనకాలంబును మాతాపితృపూజాకాలంబును యజ్ఞ కాలంబును నాభ్యుదయికం బని చెప్పంబడియె. అట్టితరుణంబునం జేయుదానంబు సర్వసిద్ధిప్రదాయకంబు. దానం జేసి ప్రజ్ఞావృద్ధియును ననేకభోగంబులును గలిగి దుఃఖలేశంబును లేక యిహంబున సుఖంబులు వడసి దివంబున మహేంద్రవిభ వంబుల ననుభవించుచుఁ గల్పసహస్రంబువఱకును దనవంశంబు నెల్లను స్వర్గంబు నందుఁ బ్రతిష్ఠాపించు. 618

గీ. మరణ మాసన్న మైనట్టితరుణ మంత్య, కాల మని చెప్పఁబడియె నాకాలమందుఁ
జేయుదానంబు గలుగంగఁ జేయు సర్వ, పాపములు మాపి పరలోకపథసుఖంబు.

గీ. భార్యయును బుత్రపౌత్రులు బాంధవులును, దనకు సద్గతి గలిగింతు రనుచు నెంచి
కొని యుపేక్షించి దానంబు చనినవాఁడు, నమ్మిచెడిపోయినట్టిమానవుఁ డెచూవె.

వ. ఇంకఁ దీర్థస్వరూపంబు నెఱింగించెద. గంగాసరస్వతీరేవాయమునాతాపీ చర్మణ్వతీసరయూఘర్ఘరావేణాకావేరీకపిలావిశాలాగోదావరీతుంగభద్రా భీమ రథీకృష్ణవేణీవేదికాదిమహానదులును సప్తసముద్రంబులును మానసాది సరస్సులును మేర్వాదిపర్వతంబులును యజ్ఞభూమియును శ్రాద్ధభూమియును దేవతామందిరంబును హోమశాలయును వేదాధ్యయనగృహంబును గోష్ఠంబును సోమయాజి నివసించుప్రదేశంబును నారామప్రదేశంబును నశ్వత్థబ్రహ్మవృక్షవట వృక్షాదిపుణ్యవృక్షంబులు గలచోటును దల్లిదండ్రులును గురువును బతివ్రతయగు భార్యయును సుపుత్రుండును బురాణపఠనప్రదేశంబును రాజభవనంబును దీర్థం బులు గాఁ జెప్పంబడియె. తీర్థంబులు గ్రామంబులం దుండినను నరణ్యంబులం దుండినను బావనంబు లగు. తీర్థనామం బజ్ఞాతం బయ్యెనేని విష్ణుతీర్థం బని సంక ల్పించి నన్ను స్మరించునెడలఁ దత్పుణ్యఫలంబు ప్రాప్తించు. 621

క. తీర్థములు నేన మఱియును, దీర్థములం దెల్ల నేన దేవుఁడఁ గానన్
దీర్థఫలం బొసంగెడి, తీర్థాటనపరుల కేనె దిక్కు నృపాలా. 622

వ. ఇంకఁ బాత్రలక్షణంబు నెఱింగించెద.

గీ. శాంతియును దాంతియును దయాశౌచములును
వేదమును జ్ఞానమును దపోవృత్తములును
బ్రజ్ఞయును ధర్మమును బాపభయము విష్ణు
భక్తియును గలవిప్రుఁడు పాత్రుఁ డధిప. 624

వ. కితవుండును గాణుండును నతికృష్ణుండును గపిలవర్ణుండును గర్కటాక్షుండును శ్యావదంతుండును నీలదంతుండును బీతదంతుండును గోదంతుండును బర్బరుండును వాతరోగియును హీనాంగుండును నధికాంగుండును గుష్ఠియును గునఖుండును దుశ్చర్ముండును స్త్రీజితుండును శోకార్తుండును ఖల్వాటుండును నధర్మరత భార్యుండును వ్యాధిగ్రస్తుండును మృతాన్నభోజియును జోరుండును నతిస్తబ్ధుండును శఠుండును సదాచారవర్జితుండును నగుబ్రాహ్మణుండు బ్రహ్మసముండైనను బాత్రుండు గాఁడు. 625

ఆ. పాత్రకాలతీర్థభాగ్యంబు సమకూరు, నొక్కశ్రద్ధవలన నుర్వరేంద్ర
శ్రద్ధతోడఁ బోలఁ జాలినతీర్థంబు, గాని పుణ్యయంబు గాని లేదు. 626

చ. అనుటయు వేనుఁ డిట్లనియె నంబుజలోచన దేశికుండు నం
దనుఁడును దల్లిదండ్రులును దారయుఁ దీర్థము లెట్లు లైరొ నా
కనువుపడంగఁ జెప్పు మన నాతని కిట్లు వచింపఁజొచ్చె న
వ్వనరుహలోచనుండు జనవల్లభ చెప్పెద నాలకింపుమా. 627

—: భార్యాతీర్థమాహాత్మ్యము :—

సీ. కృకలుం డనెడివైశ్యుఁ డొకఁడు ధర్మాత్ముఁడు, కాశీపురంబునఁ గలిగియుండె
వానికి సుకలాభిధానంబు గలిగిన, భార్య యొక్కతె యుండెఁ బరమసాధ్వి
యొకనాఁడు తీర్థయాత్రకుఁ బోవఁ గృకలుండు,సమకట్టుకొనియున్నసమయమందు
సుకల యి ట్లనియె విశుద్ధాత్మ నీతోడఁ, జనుదెంతుఁ దోడ్కొని చనుము నన్ను

గీ. ననుటయునుగృకలుండుతన్వంగియేమి,యంచు భావించితివొ తీర్థయాత్ర యనఁగఁ
గఠినభూములలోఁ దిరుగంగ వలయు, సైఁప వలయును క్షుత్పిపాసాశ్రమంబు.

క. కల వింక నెన్నొ కష్టం, బులు సైఁపఁగ లేవు నీవు పూఁబోఁడి మదిన్
నిలిపికొని నన్ను నింటనె, నిలువుము చని శీఘ్రముగనె నే నరుదెంతున్. 629

గీ. అనుటయును బ్రాణనాథ యిట్లాడఁ దగునె,ధర్మమునసాయమొనరింపఁదగినసతిని
భర్తృసాన్నిధ్యమునకంటెఁ బద్మముఖికిఁ, గలదె సౌఖ్యకరం బైననెల వొకండు.

గీ. ధవునిసవ్యాపసవ్యపాదములు రెండు, వెలసెను బ్రయాగపుష్కరములుగ సతికిఁ
దజ్జలస్నానపానముల్ తప్ప వేఱె, సాధనము లేదు స్వర్గమోక్షములు వడయ.

ఆ. సర్వపుణ్యములును సర్వతీర్థములును, సర్వదేవతలును సతికిఁ బతియ
భర్తృసేవకంటెఁ బర మైనధర్మంబు, గానరాదు పుణ్యకాంతలకును. 632

క. కావున నీనీడను నే, నేవేళనుగూడ నాశ్రయించి భవన్మో
దావహ మగుశుశ్రూషను, గావించుచు నుందు నన్నుఁ గడఁద్రోయకుమీ. 633

క. అని సుకలాసతి పలుకుట, యును గృకలుఁడు సమ్మతించియును బాపాశం
కను గొలుపునతిస్నేహం, బునను జనియె నామె నిద్రవోయెడువేళన్. 634

క. అంతట నాయమ మేల్కని, కాంతుఁడు తనయొద్ద లేమిఁ గాంచి విషాదా
క్రాంత యయి భర్త విడిచిన, యింతి నయితి ననుచు మిగుల నేవంపడుచున్.

వ. దధిక్షీరఘృతతైలంబులును మధురలవణంబులును దాంబూలంబును వర్జించి
యేకాహారయును నేకవేణియు నేకకంచుకయును నగుచు స్థండిలంబున శయ
నించుచుఁ గ్రమక్రమంబునఁ గృశించుచు సంతతపతినివిష్టమానస యగుచు
రేఁబవలును విలపించుచుండఁ దత్సఖీజను లామె నూరడించుచు. 636

గీ. కలికి సంసారవిధమును దెలిసికూడ, నేల విలపింతు వీరీతి బేల వగుచుఁ
బతికి సతికిని నేమి సంబంధ మున్న,యొకనిమేషమె చిత్రనాటకము గాక. 637

క. అన్నము దినమిఁ గృశం బగు, చున్నది దేహంబు నిద్ర యుండనికతనన్
గన్నులలోఁ గలతేజము, సన్నగిలుచు నుండె నెంతసాహస మబలా. 638

క. అనుటయును సుకల యిట్లని, యెను వారలతోడ సతికి నిహపరములు రెం
డును బతియె యనుట కొకగా, థను జెప్పెద వినుఁడు సావధానుల రగుచున్.

—: సుదేవా చరిత్రము :—

సీ. కలఁడు మహారాజొకండు మున్నిక్ష్వాకు, వనుమనుసుతుఁ డయోధ్యాపురమున
దేవరాజనెడుకాశీవిభునితనూజ, యగుసుదేవను బెండ్లియాడి యతఁడు
కావించి యామెతోఁ గలసి సద్గతిదాయ, కము లైనపుణ్యకార్యముల నెల్ల
నొకనాఁ డరణ్యమునకుఁ బ్రియాసహితుఁడై, యరిగి జంతువుల వేటాడుచుండ

గీ. నొక్కకుంజంబునను యూథయుక్తముగను
నున్నయొకసూకరము వాని తెన్ను గాంచి
భార్యతో నిట్టు లనియె నోపడఁతి తేఁడు
వచ్చుచున్నాఁడు నీ విందు వలదు నిలువ. 640

క. అరుగుము శీఘ్రంబ వనాం, తరమునకున్ బుత్రపౌత్రతతితోఁ గూడన్
నరపతిచూడ్కిని బడినను, మరణము సంప్రాప్తమగును మన కెల్లరకున్. 641

క. అనుటయు సూకరి యి ట్లని, మెను నాథ పతిం ద్యజించి యేఁగుట సతికిఁ
జన దెట్టికాలమున నై, నను నీవును రమ్ము వేగ నాతో ననుడున్. 642

ఉ. భామిని పుణ్యమూర్తి యగుపార్థివచంద్రునితోడ నేను సం
గ్రామము సేసితుచ్ఛమగుకాయముఁ బాయఁ దలంచికొంటి నీ
వీమెయి నుండరా దిచట నేఁగుము వేగమ యంచు సూకర
స్వామి వచింప సూకరి విషాదకషాయితచిత్తవృత్తియై.

గీ. ఎంద జొత్స్నయు లున్నను నిందుముఖికి, లేనియెడ నొక్కపతి శోభ లేకయుండు
నెన్ని నక్షత్రములు గల్గియున్న నొక్క, రాజు లేకున్న రాత్రికిఁ దేజు గలదె.

సీ. ఆచారహీనుఁ డైనట్టిమర్త్యునిభాతి, జ్ఞానశూన్యుం డైనమానిమాడ్కి
నాత్మజవర్జితం బైనవంశముచాయ, సేనాధిపతి లేనిసేనపోల్కి
దీపంబు లేనిమందిరముచందంబున, మంత్రంబు లేనిసామ్రాజ్యమట్లు
నావికుం డోదవనినావ తెఱంగున, వేదహీనుం డైనద్విజునిరీతి

గీ. నీవు లేనట్టియూథంబు నిష్ప్రకాశ, మేల సాహస మొనరింప నెచటి కైన
నందఱము గూడి పోవుద మంతె కాని, ప్రాణవల్లభ యితరమార్గంబు వలదు.

క. అనుటయు సూకర మి ట్లని, మెను భామిని యుద్ధమునకు నేతెంచినవీ
రునితోడఁ బోరకుండఁగఁ, జనినభటుఁడు నరకమునకె చను నాత్రోవన్. 646

గీ. అంబుజేక్షణ రెండుసింహములనడుమ, నిలువఁబడియుండి కోలము నీరు ద్రావుఁ
గోలములు రెంటినడుమను గ్రోల లేదు, జలము హార్యక్షు మనియెడిపలుకు వినవె.

క. చేకొని నీవాక్యంబును, వ్యాకులమతినై తొలంగిన క్లైబ్యమెడన్
సూకరజాతికి నంతకు, నాకతమునఁ గలుగుఁ గీర్తినాశన మబలా. 648

గీ. భయమువలనను గాని లోభమునఁ గాని, కామమునఁ గాని యుద్ధరంగమును విడిచి
పాఱిపోవుటకంటెఁ బాపంబు లేదు, పాపమున నన్ను సాధ్వి కూల్పంగఁ దగునె.

క. కనుఁగొని యుద్ధపరాఙ్ముఖు, లను శపియింతురు నభస్థలంబున గుంపుల్
గొని యుండుసిద్ధచారణు, లును గంధర్వులును మానులును దేవతలున్. 650

క. మాతకుఁ గలదోషము ప్ర, ఖ్యాతం బొనరించుచును గ్రియాజాతుఁడు నా
నాతఁడు పేర్వడు సమర, క్ష్మాతలమును విడిచి యెవఁడు చనునో భీతిన్. 651

క. వీరుల కానందము చే, కూరుచు యుద్ధంబు సేయఁ గుతుకంపడునా
శూరుఁడు ప్రతిపదమును భా, గీరథిలోఁ గ్రుంకినట్లు కృతకృత్యుఁ డగున్. 652

ఆ. కలవు తీర్థములును గలవు యాగములును, గలవు మూఁడులోకములును నందె
కాన వీరలోకకాంతు లర్థింతురు, రమణి సతము సంగరస్థలంబు. 653

క. సమరమున నిజశిరోర, క్తము పానము చేసినట్టిధన్యుఁడు హయమే
ధము చేసినట్టిఫలమును, నిమిషములోపలను జెందు నీరజనేత్రా. 654

క. చనుదెమ్మని వీరుఁడు మా, ర్కొనుచుండఁగ వాని కెదురుకొని యసువులు వా
సినప్రాణి దేవలోకం, బున నుండి యనేకవర్షములు దీపించున్. 655

క. కావున నానిర్ణయమును, దైవమునకు నైనఁ గాదు తప్పింపంగన్
నీ వేఁగు మింక యూథప, మావృతవై పంకజాక్షి యవిలంబముగన్. 656

క. అనవుడు సూకరి యిట్లని, యెను సూకరమునకు నాథ యేటికి నాకీ
తను వీవు లేనియెడలను, మన నేటికి నేను బనికిమాలినమేనన్. 657

క. నీ వేఁగెడిలోకమునకె, నే వచ్చెద నంతె కాని నిను విడఁజాలన్
నావుడు సూకరము స్వయూ, థావళి నీక్షించి యిట్టు లనియెన్ బ్రీతిన్. 658

ఆ. బిడ్డలార ప్రాణభీతి యేర్పడియె నేఁ, డెల్లరకును మీర లిచటు విడిచి
పొండు వేఱుగహనమునకు శీఘ్రముగను, బ్రతికి యున్న సుఖము పడయవచ్చు.

క. అనుటయు యూథం బిట్లని, యెను దలిదండ్రులను విడిచి యేఁగుట ధర్మం
బనఁబడునె విపత్సమయం, బున నెంతటిహీనజాతిపుత్రుల కైనన్. 660

క. కలదే మఱియొకనరకము, దలిదండ్రులు మరణ మొందుతరుణంబున వా
రల విడిచి చనుటకంటెను, గలిగినసంతతికిఁ జక్కఁగాఁ గనుఁగొన్నన్. 661

క: మిము విడిచి పోము మే మీ, సమయమునఁ గళేబరములు శాశ్వతములె యం
తమునందు ధర్మ మొక్కటె, తమవెంటను వచ్చు దేహధారుల కెల్లన్. 662

క. అనవుడు వానివినిశ్చయ,మునకున్ సూకరము ప్రమదమును జెంది నృపా
లునితోడఁ బోర గర్జన, మొనరించుచు నిల్చె యూథయుక్తంబగుచున్. 663

క. అంతట నిక్ష్వాకుమహీ, కాంతుం డాసూకరమును గనుఁగొని ధీర
స్వాంతు లగులుబ్ధకుల న, త్యంతరయంబునను బనిచె దానిని దునుమన్. 664

క. పనుచుటయు వాయువేగం, బున వనచరు లేఁగి శునకములతోడను న
వ్వనసూకరమును ముట్టిరి, సునిశితబాణములు గురియుచును సోసలుగాన్.

శా. అంతన్ భీషణఘోష మేర్పడఁగ రౌద్రాకారముం దాల్చి య
త్యంతావేశముతోడ నావనవరాహం బాభటశ్రేణిపై
గంతుల్ వైచుచు దూఁకి చీలిచి తదంగంబుల్ విభిన్నంబులై
కాంతారంబున నెల్లెడం బరవఁగా గగ్గోలు గావించుచున్. 666

ఉ. దానిపరాక్రమంబు వసుధాపతి కన్గొని విస్మయోచ్ఛల
న్మానసుఁడై గజాశ్వరథనాయకులన్ బనిచెన్ దదుద్ధతిన్
మానుప నంత వారు చని మార్కొన నక్కిటి రేఁగి కూల్చె నా
సేనల నన్నిటిన్ నిరవశేషముగా నసహాయశూరతన్. 667

క. అప్పుడు కన్నుల నిప్పుక, లుప్పతిలఁగ నాగ్రహమున నుగ్రుం డగుచున్
దెప్పతెరలంగ భూపతి, కుప్పించి హయంబు నెక్కి కోలము నేసెన్. 668

క. ఏసినబాణముతోడను, డాసి పరాహము మహాకుఠారముతోలన్
జేసె నికృత్తపదంబుగ, నాసమయంబునను నృపతిహయరత్నంబున్. 669
క. చరణంబులు తెగి తురగము, ధరపైఁ బడుటయును దుమికి ధరణీంద్రుఁడు స
త్వరముగను గదాదండము, గిరగిరఁ ద్రిప్పుచును ద్రేసెఁ గిటితలమీఁదన్. 670
క. దిమ్మరవోయి గదాఘా, తమ్మున సూకరము ధరణితలమునఁ బడి ప్రా
ణమ్ములు విడిచెను సుమవ, ర్షమ్ములు గురియంగ దేవసంఘం బంతన్. 671
గీ. దాని దేహంబునుండి గంధర్వుఁ డొకఁడు, భానుబింబంబు తెఱఁగున బయలువెడలి
యంతరిక్షంబునకుఁ బోయె నద్భుతముగ, దెసలు నిజదేహకాంతులఁ దేజరిల్ల.
క. అంతటఁ బతిశోకాసల, సంతాపితహృదయ యగుచుఁ జయ్యన ధరణీ
కాంతునిమీఁదికి సూకర, కాంతామణి గవిసె దెసలు గజగజ వడఁకన్. 673
క. అప్పుడు దానికి నెదురుగ, గుప్పునఁ జని యొక్కలుబ్ధకుఁడు పొడువంగన్
ముప్పిడితోడను నది స్మృతి, దప్పి గభీలునను బడియె ధరణీస్థలిపై. 674
క. అంతట సుదేవ కరుణా, క్రాంతహృదయ యగుచు దానికడకుం జని యొ
క్కింతజలంబును దత్తను, సంతాపము శాంతి నొందఁ జల్లెను గేలన్. 675
క. ఆపావనోదకముచే, నాపాదిల్లినప్రబోధ మంది శుభంబుల్
చేపడును గాక నీ కని, యాపోత్రిలతాంగి పలికె నద్భుత మొదవన్. 676
వ. అది యొనర్చినమనుష్యభాషణంబునకు సుదేవ విస్మయము నొంది. 677
సీ. సూకరి నీవాగ్విశుద్ధి చూడఁగ నీవు, పుణ్యమూర్తి వటన్నబుద్ధి పుట్టె
బహుపరాక్రమమును బ్రకటించి దివి కేఁగి, నట్టిపోత్రి మహాత్ముఁ డనుచుఁ దోఁచె
మీచరిత్రములు సమీచీనములు గాన, నాలించుటకుఁ గాంక్ష యంకురించె
సావధానంబుగా నఖిలంబు దెలుపుము, పుణ్యగాథలు విన్నఁ బుణ్య మొదవు
గీ. ననుటయును బోత్రిసతి యిట్టు లనియె సాధ్వి, నీకరంబునఁ జల్లిననీటివలనఁ
బాతకము లెల్ల నన్నెడఁబాసిపోయి, పూర్వకాలప్రబోధము వొడమె నాకు.
క. ఆకారణమున మానవ, వాకును లభియించె నింక వారిజనయనా
సూకరనాథునిచరితము, నాకర్ణింపుము వచింతు నంతయు మొదటన్. 679

—: సూకరపూర్వజన్మవృత్తాంతము :—

సీ. వెలఁది పూర్వము రంగవిద్యాధరుండు నాఁ, గలఁ డొక్కగంధర్వగాయకుండు
మేరుశైలమునకుఁ జేరి యాతఁడు పాడు, చుండె శ్రావ్యంబుగా నొక్కనాఁట
నా దేవతాగాన మాచ్చోటఁ దప మొన, ర్చెడిపులస్త్యమహర్షి చెవిని బడియెఁ
దానిచేతను దనధ్యానంబు చెడుటను, ఋషివరుం డాతని కిట్టు లనియె
గీ. గాయకోత్తమ నీదివ్యగానమునను, నిలువకున్నది మది తపోనిష్ఠలోనఁ
గావునను నీవు వేఱొండుకడకుఁ బొమ్ము, తపమునకు సాయ మొనరింపఁ దలఁచితేని.

క. అనుటయు గంధర్వుం డి, ట్లనియెను నీమనము నిలువ నట్లైనయెడన్
జను మీరావె వేఱుచోటికి, ననుఁ బొమ్మన నేల నీవు నా కధిపతివే. 681

గీ. అనుటయును మాఱుమాటాడ కమ్మహర్షి
విడిచి యచ్చోటు చని యొండువిపినమునకుఁ
దపము గావింపఁదొడఁగె శాంతముగ నచటఁ
గాలు ద్రవ్వనె ప్రాజ్ఞుఁడు కలహమునకు. 682

గీ. అచటు విడనాడి యమ్ముని యరిగినంత, గానము ననాదరించినవానితపము
చెఱుపఁగావలె ననియెడిచెడుతలంపు, గలిగె గంధర్వునకుఁ గాలగతిని జేసి. 683

గీ. అంతట నతండు వెదకుచు నరిగి యరిగి, కట్టకడ కెట్లొ యప్పారికాంక్షి యున్న
కాననముఁ జేరి సూకరాకారమునను, ద్రవ్వఁ దొడఁగెఁ దదాశ్రమస్థలము నెల్ల.

ఆ. అటులు త్రవ్వుచుండ ననుదినంబును బశు, వనెడిభావమునను నమ్మహర్షి
యోర్చుకొనుచు నుండె నోర్చినకొలఁదిని, భయము విడిచివాఁడు ప్రబలుఁడగుచు.

క. ఎదుటనె మలమూత్రంబులు, వదలుచు నమ్మునిమీఁద వాలముతోడన్
విదిలించుచు గొంద్రించుచుఁ, గదలక తోలినను గుర్వకరిగొను చుండెన్. 686

ఆ. అమ్మహర్షి చూచి యది యంతయును నిది, పంది గాదు తపము భంగపఱుప
నరుగుదెంచె నేదొ యని సంశయించుచుఁ, దెలిసికొనియె యోగదృష్టివలన. 687

క. తెలిసికొని యంత నాగ్రహ, ములయఁగ నోతులువ యెంత యొనరించితిరా
సలిపినదుష్కర్మమునకు, ఫలముగఁ గిటి వగు మటంచు బాపఁడు తిట్టెన్. 688

క. అంతట నాగంధర్వుఁడు, సంతాపం బొదవ వానిచరణంబులపైఁ
జింతిలుచుఁ జేర్చి తల శా, పాంతంబు ననుగ్రహింపు మని ప్రార్థించెన్. 689

గీ. అపుడు హృదయంబు గరఁగి మహర్షి వానిఁ, గాంచి కరుణాకటాక్షవీక్షణముచేత
నీకు సమకూరు నిక్ష్వాకునృపతివలన, నంత మొదవినయపుడు శాపాంత మనియె.

గీ. అంత గంధర్వుఁ డొకవరాహాంగనకును, బుట్టి యీసూకరముగఁ జేపట్టి నన్ను
నిపుడు నీపతిచే వధియింపఁబడుటఁ, జనియె నిజరూప మొంది స్వస్థానమునకు. 691

—: సూకరీపూర్వజన్మవృత్తాంతము :—

వ. ఇంక నావృత్తాంతంబు చెప్పెద నవధరింపుము. 692

సీ. కలదు ధాత్రిని గళింగం బనునొకదేశ, మం దుండె శ్రీపురం బనెడిపురము
కాఁపురం బుండె నక్కడ వసుదత్త నా, మము గల్గినట్టి బ్రాహ్మణుఁ డొకండు
సుత నయి నేను బుట్టితి నాతనికిఁ బెట్టె, నతఁడు నాకు సుదేవ యనెడిపేరు
దినదినంబును బ్రవర్ధిలుచు నుంటిని శుక్ల, పక్షచంద్రునికళపగిది నేను

గీ. నన్నుఁగనుఁగొని మోహసంపన్నులగుచు, నెందఱెందఱొ మహనీయు లేఁగుదెంచి
యడిగినను బెండ్లి చేయుట కనుమతింపఁ, డయ్యొ నాతండ్రి నను వీడనాడ లేక.

క. నాకున్ యుక్తప్రాయము, చేకుఱ మాయమ్మ భర్తచెంతకుఁ జని నీ
వీకరణి నున్న లోకులు, చీకొట్టుదు రనుచు బుద్ధి చెప్పఁ దొడంగెన్. 694

క. ఆయమమాటలు విని మా, నాయన యి ట్లనియె ధాత నందనను బెడం
బాయఁగఁజాలనిప్రేమము, నాయెడఁదను బాదుకొలిపె నళినదళాక్షీ. 695

క. కావున నిల్లడ ముండెడి, పావనునకు నెవనికేని బాలిక నీయన్
భావమున నెంచికొంటిని, దైవము తా నేమి చేయఁ దలఁచెనొ యెఱుఁగన్. 696

క. అనుటయు నాయమ కేమియు, ననఁగను నో రాడకున్న నాసమయమునన్
జనుదెంచెను మాసదనం, బునకున్ భిక్షార్థ మొక్కభూసురుఁ డంతన్. 697

క. మాతండ్రి బ్రహ్మవర్చస, పూతం బగుతన్ముఖంబు పొడగని యంతః
ప్రీతి జనించుటయును సా, కూతంబుగ నడిగె నతనికులగోత్రాదుల్. 698

గీ. అడుగుటయు నాద్విజుం డిట్టు లనియె నేను, బ్రహ్మచర్యపరుండను బ్రాహ్మణుఁడను
గౌశికసగోత్రుఁడను లేరు కన్నవారు, పేరు శివశర్మ నిజకులాచారధనుఁడ. 699

క. అనుటయుఁ బరమానందం, బున మాజనకుండు మంచి మూర్తమునం దా
తని కిచ్చి నన్నుఁ బెండిలి, యొనరించెను విధివిధానయుక్తము గాఁగన్. 700

క. అది మొదలుగ మాయింటనె, కదలక యతఁ డున్నయట్టికారణమున నా
కొదవె ననాదర మాశ్రుత, విదునిపయిన్ దానిచే వివేకము పోయెన్. 701

క. అవివేకముచేఁ బాప, వ్యవసాయంబునను నేను వర్తిల్లుచు నా
ధవునకు నొకనాఁ డైనను, శివ శివ యించుకయు సేవ సేయకపోతిన్. 702

సీ. అటులు నే నున్నను నామహాత్ముండు నా, జనకుఁ డేమని తలంచునొ యటంచు
నోరుచుకొనుచు నానేరంబులకు నెట్టి, వేళ నైనను నోరు విప్పఁడయ్యె
నాకారణంబున నంతకంతకు స్వేచ్ఛ, యధికమై చరియింపనయ్యె నాకుఁ
గ్రమముగా నాచర్య గలిగించెఁ జిత్తసం, తాపంబు నాతల్లిదండ్రులకును

గీ. జెప్పికొన సాగి రెచటఁ జూచినను జనులు
రచ్చలుగ గుంపుగూడి నాముచ్చటలనె
యప్పు డది యంతయును నసహ్యముగఁ దోఁచి
చెప్పకుండఁగఁ బోయె నాచెలువుఁ డెటకొ. 703

క. అంతట మాతండ్రి మహా, చింతాకులుఁ డగుచు నేమి చేయుటకును గ
త్యంతరము లేమి రోగా, క్రాంతుఁడువలె దినదినంబు గాసిలఁ దొడఁగెన్. 704

గీ. అట్టు లుండంగ నొకసమయమున నిట్టు, లనియె మాతండ్రికడకు మాయమ్మ చేరి
ప్రాణవల్లభ నిన్నన రాదు గాని, యీయనర్థమునకు మూల మీవె కాదె.

గీ. కానిపని చేయుచున్నప్పు డైనఁ గాని, పలుకనీ వైతి పల్లెత్తి బాల యనుచు
లేఁతతనమున నె చికిత్స లేనివ్రణము, ముదిరిపోయినమీఁదటఁ గుదురఁ గలదె.

గీ. గజము నాధోరణుఁడు తురగమును సాది, ప్రభువు మంత్రిని భార్యను భర్త యత్త
కోడలిని శిష్యుని గురుండు కూఁతుఁ దల్లి, శిక్ష యొనరింపకుండినఁ జెడుట యరుదె.
గీ. పంచమాబ్దంబువఱకును బాలకులను, లాలనము చేయవలయు నాకాల మరుగ
గుణములును విద్యలును నేర్చికొనెడి శ్రద్ధ, పొడమ శిక్షింపవలయుఁ దత్పోషకుండు.
క. గుణము లనేకము లున్నను, గుణవంతుఁ డటంచుఁ దండ్రి కొమరుని నెపుడున్
గణియింపరాదు దాననె, గుణనిధియై సుతుఁడు పేరుకొనఁబడు జగతిన్. 709
గీ. అష్టమాబ్దంబువఱకుఁ గన్యకను నింట, నుంచుకొనుటయుఁ బిదప నర్పించి యెవని
కైన నాతనితోడనె యనుపుటయును, దల్లిదండ్రులు చేయఁగాఁ దగినవిధులు. 710
గీ. కన్య యెవ్వనియింట నకార్యములను, జలుపుచుండునో వాఁడు తత్ఫలము గుడుచుఁ
గాన ధర్మజ్ఞుఁ డగువాఁడు కన్య నింట, నుంచుకొన నొల్లఁ డెవ్వండు నుర్విలోన.
క. ఎవఁడు గ్రహించెనో కన్యను, దవు నాతం డామెయొప్పుతప్పులఫలముల్
జవదాఁటకుండఁ గుడువఁగ, నవి మన కేమిటికొ చెప్పుమయ్యా నాకున్. 712
క. మనయింట భర్తృమతి యగు, తనయను మన ముంచికొనుట తగ దే మైనన్
విను మింకను నీవిషయము, నను నీ కితిహాస మొకఁడు నాథా వినుతున్. 713

—: పద్మావతీచరిత్రము :—

వ. కడచినపదునెనిమిదవద్వాపరయుగంబునందు మాథురదేశంబున మధురాపురంబునం దుగ్రసేనుం డనుయాదవప్రభుం డొకండు గలండు. 714
క. దాతయును సకలధర్మో, పేతుండును సుగుణగణసమేతుండును నై
నీతియు భూతియుఁ జెదరక, యాతఁడు పాలించుచుండె నచ్చటిప్రజలన్. 715
క. అతనికిఁ గలదు విదర్భ, క్షితిపాలుం డైనసత్యకేతునిసుత వి
శ్రుతచరిత సాధ్వి పద్మా, వతి యనియెడికాంత సుగుణవారిధి వింటే. 716
క. ఒకవేళ నైన నెడఁబా, యక వా రిరువురును సంతతానందముతో
సుకములను ననుభవించుచు, నొకక్షణముగ యుగము గడపుచుండిరి దినముల్.
గీ. అట్టు లుండంగ నొకసమయంబునందుఁ, గొమరితను జూడ వలె ననుకోర్కి గలిగి
సత్యకేతువసుంధరాజాని మధుర, కాయమను దోడుకొనిరాఁగ నంపె భటుల.
క. చని వార లుగ్రసేనున, కొనరించి ప్రణామములను నొయ్యనఁ దమవ
చ్చినకార్యము నెఱిఁగించుట, యును నాతఁడు సతిని విడిచి యుండఁగ లేమిన్.
ఆ. కొంతతడవు లోనఁ జింతిల్లి చింతిల్లి, మామమాట కడ్డుమాట సెప్పఁ
దగ దటంచు నెంచి తనప్రాణకాంతను, బనిచె నెట్లొ ప్రాణ మనిచినట్లు. 720
గీ. అంతఁ బద్మావతీదేవి యరిగి తొలుత, వందనము చేసి యానందవార్ధిఁ దేల్చెఁ
దల్లిదండ్రుల నటుమీఁదఁ దత్తదర్హ, విధులచే బంధువుల కెల్ల వేడ్క గొలిపె.
ఆ. అమ్మ వచ్చె ననుచు నానందమునఁ జూడ, వచ్చినట్టియూరివారి కెల్ల

నోసఁగె రాజపుత్రి యుత్సాహమునఁ బండ్లు, వస్త్రములును మంచివస్తువులును.
క. ఆమీఁద సఖులతోడను, సామానిని గూడి క్రీడ లాడుచు వివిధా
రామవిహారవిలాస, వ్యామోహములందుఁ జిక్కి వర్తిలఁ దొడఁగెన్. 723
ఆ. అట్లు కొంత కాల మరుగుటయును నామె, చెప్పికొనుచుఁ జిత్రచిత్రకథలు
సఖులతోడఁ గూడి సవిలాసముగఁ బోయె, నొక్కపుష్పవనికి నొక్కనాఁడు.
గీ. ఏఁగి యచ్చోటఁ బరిమళాన్వితము లైన, వృక్షములచాయలను విహరింపఁదొడఁగె
మలయమారుతపోతసంస్పర్శమునకుఁ, బారవశ్యంబు గొనుచు నాపద్మగంధి. 725
గీ. అట్లువిహరించుచును వనాభ్యంతరమునఁ, గాంచె నొకచోటనొకతటాకంబునామె
యందులోఁ గలయొకతోయబిందువునకు, దేవతలు ద్రావునమృతంబు దీటు గాదు.
క. కనుఁగొని తటాకమును నా, వనజాయతనేత్ర హర్షవశ యగుచు సఖీ
జనయుతముగఁ జని తజ్జల, మున దిగి క్రీడింపఁ దొడఁగె ముచ్చట దీరన్. 727
క. చెలులార పట్టుకొనుఁ డని, సలిలంబున మునిఁగి వెనుకజాడను జని క
న్నులు మూసి యామె వారలు, కలవరపా టొంది పడఁ బకాపక నవ్వున్.
క. ఆనళినగంధి తోయము, పై నిన్ శయనించి చాఁచి పదములు కరముల్
గానము గావించుచు శ్రవ, ణానందము గొలుపు సకియ లబ్బురపడఁగన్. 729
గీ. అంతమీఁదను సకియ లాయమయుఁ గూడి, చల్లుకొనుచు వసంతము చల్లుకొనిన
కరణి నానీరమును దటాకంబునందుఁ, గలయ నీఁదుచు నుండినకాలమందు. 730
క. ధనదునిభటుఁ డగుగోభిలుఁ, డనునొకదైత్యుఁడు విమానమం దెక్కి నభం
బున నేఁగుచు నాకామినుఁ, లను గనుఁగొని దిగఁ గుతూహలము గలుగంగన్.
క. దిగి కొంత దగ్గఱగ నా, మగువలలోపలను దివ్యమాణిక్యమె నా
నగపడియెడువైదర్భిని, నగురా యనుకొనుచు తెప్ప లార్పక చూచెన్. 732
క. కనుఁగొని యతఁ డాశ్చర్యం, బును జెందుచు నామెరూపమున కీపద్మా
నన రతియొ శచియొ యెవతెయొ, యనుకొనుచును జూచె నాంతరంగికదృష్టిన్.

—: కాలనేమి కంసుఁడుగాఁ బుట్టుట :—

గీ. చూచినక్షణంబులోననె గోచరించె, నామెచరితంబు సర్వ మాయాశరునకు
నంత నాతఁడు కామాంధుఁ డగుచు నామె, నెట్టు లైనను గవయఁగా నెంచి మదిని.
ఉ. తాలిచి యుగ్రసేనవసుధాపతివేషముఁ దద్వనస్థలీ
శైలముపై నశోకమహిజాతమునీడ శిలాతలంబునన్
దాళలయస్వరాదిసహితంబుగఁ బాడుచుఁ గూరుచుండె నా
గాలి విదర్భరాజసుతకర్ణపథంబును సోఁకునట్లుగన్. 735
గీ. అంత వైదర్భి యాగాన మాలకించి, విభ్రమాయత్తచిత్తయై విడిచిపెట్టి
సలిలసంక్రీడనము సఖీసహితముగను, నరిగె గానంబు గావించునట్టికడకు. 736

క. అరిగి కనుంగొని కాదని, మరలం గని సంశయించి మరలం గని లో
నారయుఁగ హర్షము లజ్జయు, నరగంటను జూచుచుండె నాయమ యంతన్.

గీ. గోభిలుఁడు పాఱఁ జూచి యాశోభనాంగి, నాత్మపత్నిని గాంచిన ట్లభినయించి
రాజముఖి నీవు లేకున్న రాజ్య మేల, యంచగతిపాన్పు లేల వాహనము లేల.

క. తనువుపయి గోఁత గలిగి వి, జనదేశంబునకు వచ్చి చరమావస్థన్
గనఁబోవుచు బ్రహ్మైక్యం, బొనగూడఁగ దివ్యగాన మొనరుచు చుంటిన్. 739

గీ. ఇంతలోపల సాధ్వి ని న్నిటకుఁ దెచ్చె, దైవమాయావిధానంబు తరమె తెలియ
రమ్ము నా కొకసారి ము ద్దిమ్ము వచ్చి, బ్రతికె ననుకొమ్ము నేఁడు నీప్రాణవిభుఁడు.

క. అనుటయును జెలులు వైద, ర్భిని గని సఖి హారములను బెట్టితిమి తటం
బున స్మృతికి వచ్చె నవి కొని, చనుదెంచెద మిపుడె యనుచుఁ జని రావలకున్.

క. అంతట వైదర్భి మనః, కాంతునియీప్సితము దీర్చుకౌతుకమును బ్రా
ణాంతక మగుపని చేసిన, చింతయు న ట్టిట్టు లూఁప సిగ్గిలుచుండన్. 742

క. ఆదైత్యుఁడు లేచి మహా, హ్లాదంబున నేఁగి యామెయంతికమునకున్
వైదర్భి మనల నిచ్చటఁ, గా దనువా రెవ్వ రనుచుఁ గౌఁగిటఁ జేర్చెన్. 743

వ. ఆసమయంబున సుఖస్పర్శపారవశ్యంబునం జేసి యాకాంతామణికిఁ దత్సం
కేతంబు స్ఫురింప దయ్యె. 744

ఉ. అంతట వార లిద్దరును నాత్మమనోరథముల్ ఫలింపఁగా
నెంతయు వేడ్కతోడ రమియించిరి సౌఖ్యరసాబ్ధిమగ్నులై
వింతగ మేనులన్ మఱచి వీతవివేకములై ద్రవింపఁగన్
గంతునిపంచబాణములకాఁకలధాకకు వేఁగి చిత్తముల్. 745

ఆ. కొంతకాల మట్లు గూడి మనోరథ, పూర్తి యగుడు దైత్యపుంగవుండు
వదలిపెట్టుటయును మదిరాక్షి గ్రహియించె, నంతఁ జూచుకొని నిజాంశుకంబు.

క. గ్రహియించి యామె భీతిలి, కుహనాకారమున వంచకుం డెవ్వఁడొ న
న్నిహమునకును బరమునకును, బహిష్కృతను జేసె నేను బాడైపోతిన్. 747

క. అని లోలోపల నేడ్చుచు, నొనరింపఁగఁ దగిన దేమియును లేమిఁ గనుం
గొని వాని నాగ్రహంబునఁ, గనులను నిప్పుకలు రాలఁగా ని ట్లనియెన్. 748

క. పాపాత్మ నీ వెవండవు, నాపతివేషంబు దాల్చి నావ్రత మెల్లన్
నీపాలఁ బెట్టికొంటివి, శాపంబున నిన్నుఁ దగదె సమయింపంగన్. 749

క. అనుటయు నాదైత్యుం డి, ట్లనియెను నాపయిని నేల యాగ్రహ ముదయిం
చెనొ నీకుఁ గలికి చెప్పుము, ననుఁ బాపాత్మునిఁగ నెంచ న్యాయం బగునే. 750

క, ధనదునిభటుఁడను గోభిలుఁ, డనుపుణ్యజనుండ నేను హరిణాయతలో
చన వినుము దైత్యధర్మం, బును వినిచెద నీకు సర్వమును సూక్ష్మముగన్. 751

క. పరకాంతల భుజియించుట, పరధనమును గొనుట భంగపఱచుట తపమ
ధ్వరములు చెఱచుట ధార్మిక, నరులను బీడించుటయును నాధర్మంబుల్. 752

క. పురుషోత్తమసంకీర్తన, పరుఁ డగువానికిని సత్ప్రభావుం డగుభూ
సురునకును బతివ్రతకును, దరుణీ జంకుదురు యాతుధానులు వింటే. 753

గీ. చదివినాఁడను వేదశాస్త్రములు సర్వ, ధర్మము లెఱుంగుదును గాని దానవుండ
నగుట నాచరణంబు లేదయ్యె నాకు, ధాత సృజియించె నట్లు మాజాతి నెల్ల.

క. కలవాణి భాషణముననె, కలదు సతీత్వంబు నీకుఁ గా దనఁ గ్రియలో
పలఁ గానరాదు సుంతయుఁ, బలుకుము నిన్నెటులు పిలువఁ బాడిరో మాకున్.

క. సతి యగుట కెన్నో ధర్మము, లతివకు నుండంగ వలయు నన్యునితో సం
గతి లేక యున్నమాత్రనె, పతివ్రత నటంచు గర్వపడఁ దగదు సుమీ. 756

గీ. ధర్మచారిణి వైన భర్తను ద్యజించి, యుండవచ్చునె క్షణమేని యొక్కచోట
మానవతి నీపతివ్రతామహిమ మేమొ, చూపఁగలవేని నాయొద్దఁ జూపు మిపుడె.

క. కమలాక్షి నేను నాథ, ర్మముచొప్పున నిన్నుఁ గూడిమాడితి నేదో
షముచేసినాఁడ ననుచును, సమయింపఁగఁగలవు నన్ను శాపమువలనన్. 758

క. అనుటయు నాభామిని యి, ట్లనియెను దుష్టాత్మ సాధ్వి నగుననుఁ గవగూ
డినయట్టిపాతకముకం, టెను వేఱొకదోష మేల నిను శపియింపన్. 759

వ. అనుటయు నాపద్మాపతికి గోభిలుం డి ట్లనియె. 760

సీ. వదలకుండఁగ నగ్నిసదనంబు హోమంబు, నాచరించెడివాఁడె యగ్నిహోత్రి
యాదేశమును మీఱ కనుపదంబును స్వామి, ననుసరించెడివాఁడె యనుచరుండు
తల్లిదండ్రుల సంతతమును బోషించుచు, నాదరించెడివాఁడె యాత్మజుండు
శుశ్రూష గావించుచును నన్వహము భర్త, యంతికంబున నుండునదియె సాధ్వి
గీ. యమ్మహాత్ములమహిమంబు లద్భుతములు, వారిశాపంబులకు జంకవలయుఁ గాత
నాథు నెడఁబాసి పుట్టినింటను వసించు, పుంశ్చలివి నీవు నన్నేమి పొడువఁ గలవు.

క. నీవు పతివ్రత వగునెడ, నీవిధమున భర్త లేనియెడను జలక్రీ
డావశ వగుదువె వత్తువె, కావరమున శైలములకు గానము వినఁగన్. 762

క. కయిసేసికొని హారంగుగ, భయమును భక్తియును లేక పతి లేనియెడన్
దయితక్కలాడుచుందురె, మయి మఱచి వనంబులందు మగువా సాధ్వుల్.

క. పతి నెడసి పృథక్ఛయ్యా, స్థిత యగుభామినికె చెడు సతీత్వం బనినన్
బతికి శతయోజనాంతర, గత వగునీ వెట్లు సతివి గాఁగల వబలా. 764

గీ. స్వామి గ్రామాంతరమునకుఁ జనినయపుడు, తన కలంకారమును జేసికొనినయట్టి
వనిత జారిణి యనఁబడు ననిన నింకఁ, దెలుపవలయునె నీకథ కులుకులాఁడి. 765

వ. ముగ్ధ వగునీకుం గొన్ని పతివ్రతాధర్మంబు లెఱింగించెద వినుము. 766

—: పతివ్రతాధర్మ కథనము :—

సీ. అంధుఁ డైనను ఖంజుఁ డైనను బధిరుఁ డై, నను మూకుఁ డైన నున్మత్తుఁ డైన
నిష్ప్రయోజనుఁ డైన నిర్ధనుం డైనను, నిర్గుణుం డైనను నింద్యుఁ డైనఁ
బాపి యైనను మద్యపాయి యైనను ద్యూత, కారుఁ డైనను నిరాకారుఁ డైనఁ
గ్రోధనుం డైనను గుప్రవర్తనుఁ డైన, వీతరాగుం డైన వృద్ధుఁ డైన

గీ. లోభి యైనను గామినీలోలుఁ డైన, సాధ్వసోపేతుఁ డైనను షండుఁ డైన
నెట్టివాఁ డైన సాధ్వి యైనట్టికాంత, పతిని సేవింపవలయు దేవతనుబోలె. 767

గీ. అమరుఁ డైనను గంధర్వుఁ డైన లోక, ధారకుం డైన మన్మథాకారుఁ డైన
నెట్టివాఁ డైన సాధ్వి యైనట్టిసతికి, నన్యపురుషుని సేవించు టనుచితంబు. 768

సీ. పరపురుషునిఁ జూచి భ్రమను జెందుటయును, దలపోయుచుంటయుఁ దద్గుణములు
వీక్షించు నెడలను వీక్షించుటయును భా, షించినయెడల భాషించుటయును
నవ్వినయెడలను నవ్వుటయును ప్రేమ, పత్త్రికలను వ్రాసి పంపుటయును
భర్తపైని నలక్ష్యభావ ముంచుటయును, జడుపును సిగ్గును విడుచుటయును

గీ. నేస్తుటయుఁ బెద్దపెట్టున నిల్లువిడిచి, యేఁగుటయుఁ దిట్టుటయు నన్యగృహమునందుఁ
దూఱుటయు బావిలోపలదూఁకుటయును, విషముఁదినుటయుఁ గాదుసాధ్వీగుణంబు.

సీ. గృహకర్మములు నిర్వహించుటయును శిశు, సంరక్షణంబును జలుపుటయును
ధవునకు ననుకూల యవుటయు ధర్మకా, ర్యములందు నర్థకార్యంబులందు
మాన మూనుటయు గ్రామ్యక్రియలోపలఁ, బ్రాగల్భ్యమునుగానఁబఱచుటయును
సల్పికొంటయుఁ గాయశౌచంబు భర్తకు, జీవితవృద్ధి నాసించుటయును

గీ. నన్నతోయాదరంబుల నతిథితృప్తి, చేయుటయు భర్తృశుశ్రూష చేయుటయును
గురుజనంబుల భక్తితోఁ గొలుచుటయును, ధర్మములుగ వచించి రుత్తములు సతికి.

క. తిట్టినను భర్త దయితుఁడు, కొట్టినను రవంత యేని కోపము లోనం
బెట్టికొనమి వల్లభునకుఁ, జెట్ట యొనర్పంగ సాహసింపరు సాధ్వుల్. 771

సీ. దుఃఖించినను భర్త దుఃఖించుటయు సంత, సించినఁ బతి సంతసించుటయును
భుజియించిన ధవుండు భుజియించుటయును ని, ద్రించిన భర్త నిద్రించుటయును
మగఁడు మేల్కొనకముందుగ మేలుకొనుటయు, భర్తకు నాప్తయై వర్తిలుటయుఁ
బత్యాజ్ఞ లేక స్వబంధుజనంబున, కెట్టిద్రవ్యము గూడ నీయమియును

గీ. భుక్తి పెట్టుటయు సకాలమునను బతికి, ననుచరించుటయును భర్త కనుగుణముగ
మృతినిఁజెందిన ధవుఁడుతచ్చితినిమేను, పాయుటయు ధర్మములుచూవె భర్తృమతికి.

క. తినమియును భర్త భుజియిం, పనివస్తువు భర్తృగానభాషణసంద
ర్శనరక్తియుఁ గలహింపమి, యును దయితునితోడ సతికి నుత్తమగుణముల్.

వ. ప్రియవాక్యధనాభరణవస్త్రాదిప్రలోభిత యైనను సకామవీక్షిత యైనను జన
సమ్మర్దసంస్పృష్ట యైనను దాత్యప్రార్థిత యైనను బలాత్కారగృహీత యైనను
సాధ్వి యగు కాంత పరపురుషుని నంగీకరింపం జనదు. 774

సీ. నఖకేశసంస్కారణమును శుభ్రాంబర, ధారణంబును మాల్యధారణమును
దాంబూలచర్వణదంతమార్జనతిల, కాంజనధారణాభ్యంగములును
నాలస్యమును గలహాసక్తియును నట్ట, హాసంబు పరపురుషాశ్రయమును
నిశ్శంకతయు బహునిద్రయు స్వైరవి, హారంబు నేకవస్త్రాటనమును
గీ. బరునితోడను నర్మసంభాషణములు, చేయుటయుఁ గుట్టినీమైత్రిఁ జేయుటయును
నర్హములు గావు సాధ్వికి నన్యదేశ, వాసియై యుండఁగను నిజవల్లభుండు. 775

క. పతి ప్రోషితుఁ డగునెడ సతి, పతి వచ్చెడునంతవఱకుఁ బతిదేవత యై
పతియంద నిలిపి చిత్తము, పతికల్పితవృత్తితోడ బ్రతుకఁగ నొప్పున్. 776

క. పతి కాహ్లాదము గొలిపిన, సతీమణికి నుభయలోకసౌఖ్యము లొదవున్
బతికి విషాదము గొలిపిన, యతివ కొదవు సర్వనాశ మందును నిందున్. 777

క. అనుటయుఁ బద్మావతి యి, ట్లనియెను బాపాత్మ భర్తయనుమతిచేతన్
జనకునియింటికి వచ్చిన, నను నిందించెదవు నీకు నాలుక పడదే. 778

గీ. కామమునఁ గాని లోభంబుకతనఁ గాని, మోహమదమత్సరక్రోధములను గాని
పతిని విడనాడి జనకునిపంచఁ జేరి, నట్టిహీనను గానురా యధమ నేను. 779

క. పతిరూపంబున వంచిం, చితి వసురుఁడ వగుట దానిచేతం జెడునే
సతి నగునామాహాత్మ్యము, దితిజాధమ దాని నిపుడె తెలిపెద నీకున్. 780

క. అనుటయును గోభిలుం డి, ట్లనియెను ధర్మప్రహీణ వగుటనె నన్నున్
గనుఁగొన లే వైతివి దై, త్యునిఁగను లేకున్న భంగ మొదవునె సతికిన్. 781

ఆ. సతికి భర్తకంటె స్వజనంబు లెవ్వరు, తల్లిదండ్రు లెవరు దైవ మెవఁడు
వెఱ్ఱిదాన నీవివేకంబు చెడిపోయె, ధవునిఁ బాసినట్టితరుణమంద. 782

క. అని పలికి మందహాసం, బును గావించుచును గడచిపోయినపని కే
మనుకొనిన నేమి లాభము, ననుఁ గూడి సుఖింపు మింక నళినదళాక్షీ. 783

క. అనవుడు నాయమ క్రోధం, బున నాతనిఁ జూచి నోటఁ బురుగులు పడవే
యనరానిమాట లాడెదు, దనుజాధమ సాధ్వి నింత దౌష్ట్యమె నీకున్. 784

క. అని పలికి శపించుటకున్, మునుకొను చున్నట్టిసమయమున నొకలికీ
వినుము భవద్గర్భంబునఁ, దనయుఁడు గలఁ డనుచుఁ దెలిపి దైత్యుఁడు చనియెన్.

క. అంతట నాసుందరి వి, భ్రాంతిం గొని నేలమీఁదఁ బడి మూర్ఛిలి పైఁ
గొంతతడవునకు స్మృతి యొ, క్కింతగ రా నపుడు లేచి యేడ్చుచు నుండెన్.

క. ఆయేడుపు విని నెచ్చెలు, లాయమదరి కేఁగుదెంచి యతిశీఘ్రముగన్
మాయమ్మ యేమి జరిగెనె, పోయెనె నిను విడిచి వల్లభుం డెట కేనిన్. 787

క. అని యడుగుటయును నాయమ, కనులను బాష్పములు జాఱ కాల్వలువాఱం
గనుఁగొని సఖులను జరిగిన, పని యంతయుఁ జెప్పి డిల్లపాటును జెందెన్. 788

క. అది విని చెలు లావేగము, గదురగ నెదలందు క్షణము గతచేష్టితలై
పదపడి యించుక ధైర్యం, బొదవఁగ ని ట్లనిరి భయము నొందకుము సఖీ. 789

ఉ. ఎంతటివారి కేని జనియింపక పోదు ప్రమాద మంతతో
నంతము నొందునే సలిపినట్టి వ్రతం బఖిలంబు దీని కీ
వింతగ నేడ్వ నేల సతి కెందును లోపము గల్గ నేర దా
వంతయు నింటి కేఁగి తదుపాయము చూడఁగవచ్చు ర మ్మిఁకన్. 790

క. అని పలికి కొంత ధైర్యము, జనియింపఁగఁ జేసి మదికి సఖు లామెను దో
డ్కొని పోయి గృహమునకుఁ ద, జ్జననికి నెఱిఁగించి రచట జరిగినగాథన్. 791

క. విని తనయావృత్తాంతం, బును నాయమ మిగుల ఖేదమును జెంది మనం
బునఁ దనకు నేమి చేయుట, కును దోఁపక పతికిఁ దెలిపెఁ గొమరితచరితన్. 792

క. ఆలించి సత్యకేతువు, బాలాచరితమును సిగ్గుపడుచును శిరమున్
వ్రేలాడవైచికొని క్షణ, కాలము చిత్తరువుపోలెఁ గదలక యుండెన్. 793

ఆ. అట్లు కదలకుండి యామీఁద నాత్మలో, నడరుచున్న క్రోధ మడఁచికొనుచు
నోరు తెఱవకుండ నారాజు పుత్రిని, బంపె నాక్షణంబ భర్తకడకు. 794

క. పరివారముతో వచ్చిన, తరుణీమణి నుగ్రసేనధరణీంద్రుఁడు సా
దరముగను జేర్చికొని తన, పరిసరమున మునిఁగిపోయెఁ బ్రమదాంభోధిన్. 795

ఆ. అంత మున్నుపోలె నతఁ డామెతోఁ గూడి, విషయసుఖము లనుభవించుచుండ
మీఁటి పెరుఁగుచుండె మీనాక్షి కుదరంబు, భీతి గలుగునట్లు ప్రేక్షకులకు. 796

క. అనుదినమును దనగర్భముఁ, గనుఁగొనుచును నావధూటి కనలుచుఁ బిండం
బును నెట్టు లేనినాశన, మొనరింపఁ దలంచి మ్రింగుచుండెను మందుల్. 797

ఆ. అటులు గర్భపాత మగుటకు నాతన్వి, చేయవలసినట్టి చేఁత లెల్లఁ
జేయుచుండ లోనిశిశు వొక్కదినమున, నెట్టకేని యామె కిట్టు లనియె. 798

సీ. జనని నీలో నున్న ననుఁ జంపుటకు నేల, పడరానిపాటులు పడెదవమ్మ
పుణ్యంబుచే వృద్ధిఁ బొందు నాయుష్యంబు, క్షయము నొందును బాతకంబుచేత
నంతరించును గర్భమంద యొక్కఁడు పుట్టి, శమియించు నొక్కఁ డాక్షణమునందె
పోవునొక్కఁడు బాల్యమునఁజచ్చునొకఁడుయౌ, వనమున నొకఁ డేఁగువార్ధకమునఁ

గీ. గర్మపాకంబునను జావు గలుగవలసి, నట్టికాలంబుననె ప్రాణి గిట్టుచుండు
మందులోషధులునుమణిమంత్రములును, దైవములునునిమిత్తమాత్రములు సూవె.

క. కావున నను నీ వేమియుఁ, గావింపఁగ లేవు పాపకార్యము లింకం
గావింప నేల చెప్పెద, నావృత్తాంతంబు వినుము నళినదళాక్షీ. 800

క. ననుఁ గాలనేమి యనియెడి, దనుజునిఁగా నెఱుఁగు మేను దద్గర్భముఁ జొ
చ్చినవాఁడ నేఁడు మును హరి, పనివడి ననుఁ జంపినట్టిపగ దీర్చికొనన్. 801

క. అని విరమించుటయును నా, వనితామణి గర్భపాతవాంఛ విడిచి చే
సినకర్మ మనుభవింపక, చన దని పొగులుచును గడపసాగెను దినముల్. 802

ఆ. అట్లు కొంతకాల మరుగుటయును బూర్ణ, మయ్యె గర్భ మాసుధాంశుముఖికి
నుద్భవించె నంత నొకదుర్దినంబున, నసురకాలమందు నసురుఁ డొకఁడు. 803

క. జనియించి వాఁడు కంసుం, డనియెడినామంబు వడసి హతుఁ డయ్యెను గృ
ష్ణునిచేత మున్ను క్షోభం, బును గావించుటను లోకముల కన్నిటికిన్. 804

క. అని వింటి సకలధర్మము, లును దెలిసినయట్టిప్రాజ్ఞలోకమువలనన్
గనుకను బితృగృహమున నుం, డినకన్య నశించు నెంతనిర్మల యైనన్. 805

క. నీ కింకఁ జెప్ప నేటికిఁ, బ్రాకృతుఁడవు గావు బహుపురాణజ్ఞుఁడ వా
లోకించి మంచిచెడ్డలు, చేకొనఁ దగినట్టిపథము చేకొను మనఘా. 806

క. అనుటయుఁ బ్రాజ్ఞుం డగునా, జనకుఁడు ననుఁ బిలిచి క్రోధసంరక్తవిలో
చనుఁ డగుచు వంశనాశని, కనుఁగొన రా దింక నీముఖంబును మాకున్. 807

గీ. చనియె నల్లుఁడు తలయెత్తికొనఁగ లేక, పలువురును నవ్వుచుండ నే బ్రతికియుంటిఁ
జచ్చినట్టులె యుభయవంశములు గూడఁ, బాడు సేసితి వోసి నిర్భాగ్యురాల.

ఆ. ఎంతప్రీతితోడ నెత్తి పెంచితినొ నాఁ, డంతరోఁత గలుగ నయ్యె నేఁడు
కాలు పెట్ట వలదు గడపలో నైనను, నిపుడె లేచి వెడలు మెచటికేని. 809

క. అని తిట్టుచుండఁగను నా, జననియుఁ దనచేత నున్నసమ్మార్జనితో
డను గొట్టి కొట్టి క్రోధం, బెనయంగను నీడ్చి నన్ను నిలు వెడలించెన్. 810

సీ. అంతట నూరూరి కరుగుచుఁ బదిమంది, అంకుటా లనుచు దూఱంగ వినుచు
జారులు నాచుట్టుఁ జేరి గుంపులుగూడి, యగడు చేయుచునుండ బెగడుపడుచు
నుండఁ జోటును దినఁ దిండియు దొరకక, యతిదైన్యమునను నాయాసపడుచు
నొడలిలో జీర్ణించియున్నరోగము లెల్లఁ, బైకిఁ బొంగుచు నుండ బాధపడుచు

గీ. నెట్టు లెట్టులొ చేరితిఁ దుట్టతుదకు, దివ్యతమ మైనగుర్జరదేశమందు
బహుళధనధాన్యసంపత్ప్రభావములను, నెగడుచున్న వనస్థలానగరమునకు.

గీ. అచ్చటికిఁ జేరి యాఁకలి కాఁగలేక, కర్పరంబును దాలిచి కరమునందుఁ
దిరుగఁ జొచ్చితి నిల్లిల్లు తిరిపమునకు, నొక్కతల్లియు భిక్ష నా కొసఁగదయ్యె.

క. అది నాపాపమె యనుకొని, యెదలోపల దుఃఖపడుచు నిఁక నెట్లును నే
బ్రదుక ననితలఁచికొనుచును, తుద కొకగృహమునకుఁ బోతిఁ దుదిప్రాణముతోన్,

క. అచ్చటి కరిగినతోడనె, యచ్చెరియము దోఁపఁ జనినయసువులు మరలన్
వచ్చి కళేబరమందున్, జొచ్చినక్రియ మదికిఁ గొంతసొమ్మ తొలంగెన్. 814

సీ. అప్పుడు గొంతెత్తి యమ్మా పిడికెఁడన్న, మని కేక వైచితి నాక్షణంబ
బిచ్చకత్తెకుఁ దిండి పెట్టుము మంగళా, యనుమాట లోనుండి వినఁగనయ్యె
వినఁబడినంత నావీనుల కది తోఁచె, నాభర్త మధురకంఠస్వరముగ
నంతట లోనుండి యరుదెంచి యొకతల్లి, నాకుఁ దృప్తిగ భోజనంబు వెట్టె

గీ. భోజనము చేసి నా కిట్టిభుక్తి దైవ, మెంతకాలమ్మునకు లభియింపఁ జేసె
ననుచుసంతోషపడుచుండునవసరమున, హర్మ్యముననుండినానాథుఁడరుగుదెంచె.

గీ. వచ్చి ననుఁ బాఱఁజూచి యోపిచ్చిదాన, యెవ్వతెవు నీవు నీకథ యేమొ నాకుఁ
జెప్పు మనుటయు నేమియుఁ జెప్పలేక, యొరగిలఁ బెట్టుకొని మోము నూరకుంటి.

గీ. అప్పు డామంగళాదేవి యతనిఁ జూచి, యీమె నినుఁ గాంచిఁ సిగ్గిల నేల నాథ
చెప్పు మనుటయు ననుఁ దాను జెట్టవట్టి, నట్టికథ యెల్ల వినిచె నాయమ కతంబు.

గీ. వినిచి నాగాథ యంతయు వెలఁది నీకుఁ, బూజ్యురాలైనయక్క యీపుణ్యచరిత
యీయమను నీవు సేవింపు మింట నునిచి, నాకు నాఅవప్రాణ మీనళినగంధి.

క. అనుటయు నాయమ పతియా, జ్ఞను శిరమునఁ దాల్చి నాకుఁ జలిపినసమ్మా
ననమునను జేసి విస్మయ, మును లజ్జయుఁ గలిసి చిత్తమున నొరయంగన్. 819

క. పలుకుచుఁ బలుకకయును నె, ట్టులొ వెడలించితిని బగలు డొంకుచు నంతన్
జలజాప్తుఁడు గ్రుంకెను నా, కొలసెడిసౌఖ్యంబు చూడ నొల్లనికరణిన్. 820

వ. అంత నాసాధ్వీమణి మహానందంబున స్వయముగాఁ బాకంబు చేసి భక్ష్య భోజ్యంబులతోడ భోజనంబు వెట్టి తనభూషణాంబరములచే నలంకరించి భర్త శయనించియున్నహంసతూలికాతల్పంబుకడకు నన్నుఁ బనిచె. అంత నాయంతరంగంబున దుఃఖప్రవాహం బావరించుటయు. 821

సీ. ఒకవేళ నైన నీయోగ్యవర్తనునిపై, ననురక్తి గలదృష్టి నునుప నైతి
నొకక్షణం బేని యీయకలంకమూర్తితో, ననుకూలముగ మాటలాడ నైతి
నొకనాఁడు గూడ నీసుకుమారదేహుని, యడుగుఁదమ్ములు ముట్టి కడుగ నైతి
నొకరాత్రి యేని యీయుత్తమోత్తమునకు, నేకాంతసౌఖ్యంబు నీయ నైతి

గీ. భర్తయెడఁ జేసినట్టిపాపంబు లెల్లఁ, గట్టికుడిపినవిధమునఁ గట్టకడకు
భ్రష్టనై పాడుమేనితో బ్రతికియుంటి, నకట నావంటిపాపాత్మురాలు గలదె.

గీ. అనుచు వగచుచునుండ నా కంతకంత
కధికమై శోకనిర్ఝర మాఁపలేని
పగిది నుబుకంగ హృదయంబు పగిలిపోయెఁ
బగులుటయుఁ బ్రాణములు మేను వాసి పోయె. 823

గీ. అంతటను యమదూత లత్యంతభీష,ణాకృతులతోడ నాయుధహస్తు లగుచు
వచ్చి నను ద్రాళ్ళతోఁ గట్టి వదరుచుండ, నీడ్చికొనిపోయి శమనునియెదుట నిలిపి.

వ. సాష్టాంగప్రణామంబులు గావించుటయు యముండు నాదిక్కు చూచి కటంబు లదరఁ బండ్లు పటపటం గొఱుకుచుఁ దటాలున లేచి పాపాత్మురాలా చేసిన దుష్కర్మంబులకుఁ దగినఫలంబు లనుభవింపు మని భయంకరంబుగాఁ బలికి యెఱ్ఱగాఁ గ్రాఁగుచున్నలోహపురుషపిండంబు నురంబునం బెట్టించియుఁ దప్త తైలద్రోణియందుఁ బడవైచియు నసిపత్త్రంబులచే గాత్త్రంబులు ఛేదించియు గ్రీష్మచండాంశుకరనికరసంతప్తవాలుకారాశిలోఁ బొరలించియు వహ్నికుం డంబునందుఁ ద్రోసియు జలయంత్రంబునం ద్రిప్పియుఁ బూయశోణితవిష్ఠాకృమి సంకులం బగుకూపంబునందు ముంచియుఁ గరపత్త్రంబులచే బ్రద్దలు చేసియు శక్తిముద్గరంబులచేఁ గొట్టియు యోనివక్త్రంబునందు డించియు బహువిధంబు లగుబాధలం బెట్టి విడిచిపెట్టుటయు నే నాదుఃఖంబు లన్నియు ననుభవించి పిదప జంబుకశునకభుజంగకుక్కుటమార్జాలాదినానావిధపాపయోనులం బుట్టి నానావిధంబు లగుదారుణక్లేశంబు లనుభవించి తుదకు సూకరినై జన్మించితి.

గీ. తల్లి నీచేతఁ బుణ్యతీర్థంబు లెల్లఁ, గలవు న న్నుద్ధరింపఁగాఁ గలవు నీవు
కావున నను గ్రహింపు మీకాలమంద, సైఁపలే నింక నీనీచజన్మములను. 826

క. అనుటయు సుదేవ యి ట్లని, యెను సూకరి ని న్ననుగ్రహింపంగను జా
లినయంతసుకృత మెయ్యది, యొనరిచితినో నేను దెలిసియుండినఁ జెపుమా.

క. అనవుడు సూకరి యి ట్లని, యెను లక్ష్మివి నీవు విష్ణు వీజనపతి పా
వనచరిత నీమహత్త్వం, బనితరసాధ్యంబు చెప్ప నలవియె నాకున్. 828

సీ. పతియె దేవం బనుభావంబు చెడకుండ, ధవునిమాటకు జవదాఁటకుండ
నాథుఁడు వగచుచుండఁగ సంతసిలకుండ, మగఁడు పొంగుచునుండ వగవకుండఁ
బెనిమిటి కప్రతిష్ఠను జేకుఱుపకుండఁ, బ్రాణేశ్వరుని నెడఁబాయకుండఁ
గాంతునియుపచారకార్య మేమఱకుండ, భర్త డెందము కుందువఱుపకుండ

గీ. సతులు చనుమార్గముననుండి జాఱకుండ, నాత్మనిగ్రహమును విడనాడకుండ
మంచియిల్లా లనుప్రశస్తి గాంచినావు, త్రిభువనములను నీవు సాధ్వీమతల్లి. 829

క. ఆవడవడిచేఁ గలిగెను, మానిని నీ కధిక మైనమాహాత్మ్యం బ
ద్దానికి సరిపడుమహిమము, కానంగా రాదు ముజ్జగంబులలోనన్. 830

క. సతి నాకు భవత్సంపా, దిత మంతయు నేల యొక్కదివసమునఁ ద్వదా
ర్జిత మగుపాతివ్రత్య, వ్రతసుకృతమె చాలుఁ బాపవార్ధులు దాఁటన్. 831

వ. అనుటయును సుదేవ భర్తను గనుంగొని నాథా యిందు నాకుఁ గర్తవ్యంబు బోధింపవలయు నని యర్థించుటయు సకలధర్మజ్ఞుం డగునిక్ష్వాకుమహీపాలుండు

దేవీ దీనోద్ధరణం బవశ్యకర్తవ్యంబు గాన నీ విగతిహీన నుద్ధరింపు మనియె. 832

క. అనుటయు సుదేవ యొకదిన, మునఁ దా నొనరించినట్టిపుణ్యము నెల్లన్
గొను మనుచు ధారవోసెను, గనికర మెదలోన నొదవఁగను సూకరికిన్. 833

గీ. ఆక్షణంబునఁ దుచ్ఛదేహంబు విడిచి, దివ్యరూపంబుతోడను దేజరిలుచుఁ
దల్లి నీపుణ్యమున నేను ధన్య నైతి, నని నుతించుచు సూకరి యరిగె దివికి. 834

క. చెలులార భర్త ననిశముఁ, గొలిచిన హేతువునఁ గాదె కొనియె సుదేవా
జలజాక్షి యట్టిమహిమం, బలవడు నే భర్తృసేవ హతభాగ్యలకున్. 835

క. అని పలికి సుకల భర్తను, మనమున ధ్యానించుకొనుచు మఱియొకమార్గం
బునకుం దిరుగనిధైర్యం, బున దివసంబులను వెడలఁబుచ్చుచు నుండెన్. 836

—: సుకలాపాతివ్రత్యమాహాత్మ్యము :—

గీ. అప్పు డాయమతపము జంభారి చూచి, విఘ్న మొనరింపఁ దలఁచి రావించి మరుని
నతనితోడను జెప్పె వృత్తాంత మెల్ల, నాలకించి మరుం డిట్టు లతని కనియె. 837

గీ. పాకశాసన యీమూఁడులోకములను, నల్లకల్లోల మొనరించునట్టినాకు
వనిత లన నెంత తదవయవములలోన, వర్తిలెడునే నెఱుంగనె వారిశక్తి. 838

గీ. నాగృహము కాంత తదధరనయనఫాల, వదనదృక్కచకుచపృష్ఠరదననాభి
జఘనకట్యూరుయోనికక్షులను జేరి, మారణము చేయుదును నేను బూరుషులను.

క. వనజాక్షి స్వభావముచే, తనె యబల మదీయబాణతాడిత యైనన్
వినుము పురందర ధైర్యం, బున నిలువంగలదె కలఁక పుట్టక మదిలోన్. . 840

వ. కాని యొక్కసాహాయ్యంబు నీవలన నా కీకార్యంబునం గావలసి యున్నయది. మున్ను నాయంగంబు మహేశ్వరునిచే దగ్ధం బగుటం జేసి నే ననంగుండనై యుంటిఁ గావున నీవు జగన్మోహనం బగురూపంబు దాల్చి నాతోడ వచ్చితివేని నేను నీశరీరంబునం బ్రవేశించి యామచ్చెకంటిం బ్రహరించి నీకు వశంబు గావించెద. 841

క. తరుణులను జేరి పురుషులఁ, బురుషులలోఁ జేరి పూవుఁబోఁడులను మదుల్
గరఁగఁ బ్రహరింతు దానను, బరస్పరము గూడ డిల్లపడుదురు వారల్. 842

క. అనవుడు వజ్రి జగన్మో, హన మగురూపంబు దాల్చి యాతనితోడం
జనియెను సుకలామహిమం, బును బరిశీలింపఁ గాంక్ష పుట్టినకతనన్. 843

వ. అంతటఁ బంచబాణుండు మహేంద్రసహితంబుగా నొకవనంబున విడిసి నిజసఖి యగుక్రీడను బిలిచి యాత్మోద్యమముం దెలిపి సఖీ నీచమత్కారప్రయోగంబుచే సుకల నెట్లైన యివ్వనంబునకుం దోడ్కొని రమ్మని యాజ్ఞాపించుటయుఁ గ్రీడ స్వామియాజ్ఞాప్రకారంబునఁ బతివ్రతావేషంబు దాల్చి సుకలామందిరంబున కేఁగి తద్ద్వారంబున ఖిన్నవదనంబుతోడ నిలువఁబడియుండె. 844

ఆ. అపుడు సుకల ద్వారమం దున్నయామెను, జూచి యెవతె వీవు శోభనాంగి
నిన్నుఁ జూడ నాకు ఖిన్నవుగాఁ దోఁచె, నిట్టు లుండ నేమి హేతు వనియె.

చ. అనవుడుఁ గ్రీడ యి ట్లనియె నమ్మ యనాథను నాచరిత్రముల్
వినియెడివారికిం గలుగు వేదన మైనను జెప్పు మంటి వే
మని వచియింతు నే ననుచు నశ్రులు బోరనఁ గాఱ నేడ్చుచున్
జనియెను దన్వి నామగఁడు న న్నెడఁబాసి విదేశభూమికిన్.

గీ. ఎన్నఁ డైనను నపచార మింతయేని, నే నొనర్చి యెఱుంగఁ బ్రాణేశ్వరునకుఁ
బతియె యిహమును బరమును సతికి ననుచుఁ, జిత్త మలరంగ సేవ చేసితిని గాని.

క. ఐనను నాప్రారబ్ధము, చే నాతని కట్టిబుద్ధి చేకూరెను గా
దేని విడనాడి పోవునె, నానాథుఁడు తన్నె గతిగ నమ్మిననన్నున్. 848

క. అనుటయును సుకల తనకథ, యును నామెకుఁ జెప్పి సాధ్వి యొకతీరున నే
మనయిరువురనుదుటను వ్రా, సెను విధి మన మెవరిమేలు చెడఁగొట్టితిమో.

గీ. ఐనదానికి వగచి కార్యంబు లేదు, సాధ్వి నీజీవితేశుని చరణములను
నిత్యమును నెదలోన ధ్యానించుకొనుచు, శేషకాలంబు గడపుము చెప్ప నేల.

చ. అనుటయు సాధ్వి నీపలుకు లాత్మకు శాంతి నొసంగ నీవె నా
జననివి నీకు నేను దనుజాతను జ్ఞాన మనుగ్రహించి నా
మనమునఁ గల్గుదుఃఖమును మాన్పుము నీకడ నుందు లేరు నా
జను లనువార లెవ్వరును సత్యముగా నని క్రీడ పల్కెడున్. 851

క. ఆమాటలు విని సుకలా, సీమంతిని జాలి పొడమఁ జిత్తములో నా
లేమను దరిఁ జేరిచికొని, నేమములను బ్రతిదినంబు నేర్పుచు నుండెన్. 852

ఆ. అట్లు కొంతకాల మరుగుటయును గ్రీడ, యొక్కనాఁడు సుకలయొద్దఁ జేరి
తల్లి స్మృతికి వచ్చె దైవయోగంబున, దివ్య మైనపుణ్యతీర్థ మొకటి. 853

గీ. దానిమహిమంబు చెప్ప నాతరము గాదు, భర్తృవిరహంబు గల్గినపడఁతులకును
బాలఁతుకల నెడఁబాసినపురుషులకును, బ్రాణబంధువు దత్తీర్థరాజ మతివ. 854

ఆ. అందు మునిఁగి లేచినంతమాత్రముననె, భర్త వచ్చితీరు భార్యకడకు
భార్య వచ్చితీరు భర్తసన్నిధికిని, దూరముగను నున్నవార లేని. 855

క. అనుటయు సుకలాసతి యి, ట్లనియెను సతి భర్త వచ్చు ననుటను జిత్తం
బున నొదవెను దత్తీర్థం, బున కేఁగెదు కాంక్ష మనము పోదమె యటకున్.

క. అనుటయును నట్లె పోవుద, మని సుకలను దోడుకొని రయంబునఁ గ్రీడా
వనజాక్షి మదనుఁ డుండిన, వనమునకుం జనియె స్మేరవదనముతోడన్. 857

వ. అట్లు చని. . 858

సీ. పుంస్కోకిలకదంబములు గంఠముల నెత్తి, పంచమస్వరమునఁ బాడుచుండ
సుమగుచ్ఛములు గుమగుమ గుబుల్కొనుసువా, సనల నల్గడ వెదచల్లుచుండ
చల్లనిదక్షిణశ్వాసనపోతంబులు, తిన్నతిన్నగను వీతెంచుచుండ
మకరందరసకుల్యలకు జుమ్ము జు మ్మని, మొకరితుమ్మెదపిండు మూఁగుచుండ
గీ. మనమునకు హాయి గొల్పు నవ్వనములోనఁ, గ్రీడ సుకలాసతీమణితోడఁ గూడి
యరుగుచును నామె కాశ్చర్యకరము లైన, గాథలను జెప్పుచుండినకాలమందు.
క. ఒకప్రక్కనుండి సురనా, యకుఁ డరుదెంచుటయు నదియె యద నని సుమసా
యకుఁ డేయఁ దొడఁగె సుకలా, వికచాంబుజనేత్రపైని వివిధాస్త్రములన్. 860
గీ. అప్పు డాసుకలాబ్జాక్షి యది యనంగ, వన మగునటంచు నూహించి మనమునందు
ధైర్య మించుక యేనియుఁ దప్పనీక, భర్తృపాదనివేశితభావ యగుచు. 861
క. ఆనందింపదు కోకిల, గానమునకు వాయువునకుఁ గలఁగదు గంధం
బానదు సుమములవంకం, గానదు కనుఁగొనదు మధువు కాంచదు తేంట్లన్.
ఆ. అపుడు మలయపవనుఁ డానతముఖుఁ డయ్యె, మాధవుండు లజ్జమానుఁ డయ్యెఁ
గోకిలస్వరంబు గాకస్వరం బయ్యె, మీనకేతనుండు దీనుఁ డయ్యె. 863
క. అంతట నాథున కొదవిన, సంతాపము నెఱిఁగి రతి వెసన్ జని సుకలా
కాంతాసమీపమున కా, యింతికి దీవనల నొసఁగి యి ట్లని పలికెన్. 864
ఆ. కలికి నిన్నుఁ జూడఁగాఁ దోఁచె మదిలోన, నెదియొ నీకుఁ జింత యొదవినట్లు
చింతిలంగ నేల సంతోషమున నుండఁ, దగినచోట నెట్టిదాన చెపుమ. 865
సీ. విను మెట్లు గండుఁగోవెలలు గానరసంబు, చిలికించుచున్నవో చెవులలోన
మూర్కొను మేచందమున వచ్చుచున్నవో, ప్రసవసంతతినుండి పరిమళములు
కనుఁగొను మేవిధంబున మూఁగుచున్నవో, మకరందఝుఱులకు మొకరితేంట్లు
గ్రహియింపు మేప్రకారము వీచుచున్నవో, మలయశైలజమందమారుతంబు
ఆ. లాస్వదింపు మెట్టియానంద మాత్మకుఁ, గొలుపుచున్నయదియొ ఫలరసంబు
కాంచు మెంతచక్కఁగా నొప్పుచున్నదో, భాసమానవనవిలాసలక్ష్మి. 866
క. అనుటయు సుకలాసతి యి, ట్లనియెను నాథవునివెంట నరిగెను సతి నా
మనసు మనోవిరహిత మగు, తనువున నేమైనఁ జేయఁదగినది కలదే. 867
క. అనుటయు నిరాశ యగుచును, జని రతి పతికడకు నాథ సాహసమును నీ
వొనరింపవలవ దాసా, ధ్విని లోఁగొనఁ గాదు బ్రహ్మదేవున కైనన్. 868
క. అనుటయును నభినివేశం, బును వదలక పంచశరుఁడు పురుహూతుని నా
వనజాక్షికడకుఁ బొ మ్మని, యనిపి శరంబులను నేసె నతితీక్ష్ణముగన్. 869
క. సురనాయకుఁ డాసుకలా, తరుణీమణికడకుఁ బోయి దరహాసాలం
కరణావాప్తవిలాస, స్ఫురితాపాంగావలోకమునఁ గనుఁగొనుచున్. 870

క. హరిణాక్షి నిస్సహాయవు, తరుణివి నీ నీవనంబు దారుణము భవ
త్పరిరక్షణమునకై నీ, పరిసరమున నుంచుకొనుము భటునింగ నన్నున్. 871

క. అని పలుకుటయును సుకలా, వనజాయతనేత్ర వానివదనమును గనుం
గొనకుండం గ్రిందం జూచుచు, ననియెను ధైర్యమున నిట్టు లాయింద్రునితోన్.

చ. ఎవండవో నీవు భీతి యొకయింతయు లేక భటుండ నీకు నే
నవుదు నటంచుం బల్కెద వనన్యశరణ్యను గాను నేను నీ
పావ రడంపంగం జాలుభటపుంగవు లిప్పుడె యున్నవారు మ
త్సవిధమునందుం బొమ్ము త్వరితంబుగ జీవితతృష్ణ యుండినన్. 873

వ. అనుటయును మహేంద్రుం డించుక జంకి సగౌరవంబుగా ని ట్లనియె. 874

క. సతి యాభటు లెవ్వరో నా, హితమును గోరినను దెలుపుమీ యనవుడు నా
సుతులే వారలు నావుడు, నతివా తెలుపుము తదాహ్వాయంబులు నాకున్.

వ. అనవుడు సుకలాసతి యాతని కి ట్లనియె.

సీ. చూడుము నాముందు శోభిల్లుచున్నాండు, శమదమాన్వితుం డైనసత్యమూర్తి
నాకుడిప్రక్క నున్నాండు వీక్షింపుము, సర్వాత్మకుం డైనజ్ఞానమూర్తి
కనుము నా యెడమప్రక్కను గ్రాలుచున్నాండు, ధైర్యధీయుతుం డైనధర్మమూర్తి
నా వెన్క వెల్గుచున్నాండు దర్శింపుము, భువనపావనుం డైనపుణ్యమూర్తి

గీ. సకలశక్తులు గల్గి విశ్వముల నెల్ల, నడపంజాలినధీరు లున్నారు నాకు
రక్షకులు గాంగ నాలుగుప్రక్కలందుం, జూడంగలశక్తి గలదేని చూచికొనుము.

గీ. చెప్పుచున్నాను వెడలుము శీఘ్రముగను, నుండకుము నాసమక్షమం దుంటివేని
భస్మమయ్యెద వాశచీభర్త వైన, దవశిఖిజ్వాల లంటినతరువువోలె. 878

గీ. స్మరుండు నామీందం గురియించుమార్గణములు
నన్ను స్పృశియింపంజాల వెన్నండును గాని
చిచ్చునకుం జెద లంటునె చెప్ప నేల
వాండు తుద కేమి కా నున్నవాండొ యింక.

క. మును హరునిమీంది కేంగిన, యనయంబునం జేసి ప్రాప్త మైనయవస్థన్
గనుంగొనక తనస్వభావం, బు నెచూపుచునుండు మరుండు మూర్ఖుండువోలెన్.

వ. మాండవ్యశాపమృతుం డగుకౌండికుని బ్రదికింప నెంచి సూర్యోదయంబు నిరోధించినసైవ్యమాహాత్మ్యంబును బ్రహ్మవిష్ణుమహేశ్వరులను శిశువులను గావించినయనసూయప్రభావంబును మృత్యుగృహీతుం డగుసత్యవంతుని మరలం బ్రాణంబులతోడం దోడ్కొని వచ్చినసావిత్రిసామర్థ్యంబును వినినవాండు సతు లకు దూరంబుగా నుండు, 881

గీ. కంఠమునఁ గట్టికొని మోయఁగానిశిలను, గడలిలోపలఁ బడి యీఁదఁ గడఁగువాఁడ
యగ్నికుండంబునను దూఁకునట్టివాఁడ, యిలను సతులను గలఁగింప నెంచువాఁడు.

క. అనుటయు గజగజ వడఁకుచు, ననిమిషనాథుఁడును శంబరారాతియుఁ గ్ర
క్కునఁ జనిరి తమనివాసం, బునకుఁ వెలవెలనవోవుమోములతోడన్. 883

క. అంతటను గ్రీడ గూడను, నంతర్హిత యగుడు విషయ మవగత మగుటన్
స్వాంతమున కపుడు సుకలా, కాంతామణి వచ్చెఁ దననికాయ్యంబునకున్.

ఆ. అంతఁ గొన్నిదినము లరుగుటయును దీర్థ,యాత్ర పూర్ణముగను నాచరించి
యరుగుదెంచెఁ గృకలుఁ డాత్మగేహమునకు,సంతసించుకొనుచు స్వాంతమందు.

వ. అప్పుడు ధర్ముండు తత్పితృపితామహప్రపితామహుల జాక్కులు విడిచికట్టి
తీసికొని వచ్చి ప్రత్యక్షంబుగా నాతనియెదుటం బెట్టుటయుఁ గృకలుండు విలో
కించి యయ్యా నీ వెవ్వండవు. నాయార్జించినతీర్థయాత్రాఫలంబున స్వర్గస్థాపితు
లైననాపితరుల నేల బంధించితి వని యడుగుటయు ధర్ముం డాతని కి ట్లనియె.

గీ. ఏను ధర్ముఁడ నీయాత్ర కించు కేని, ఫలము లేదయ్యె నద్దానఁ గలుగదయ్యె
నూర్ధ్వలోకనివాసభాగ్యోదయంబు, దైవహతు లైననీపితృదేవతలకు. 887

క. అనుటయుఁ గృకలుఁడు నమ్రా, ననుఁ డై యి ట్లనియె స్వామి నాయాత్రకుఁ గ
ల్గినవైఫల్యం బేమియొ, వినిపింపుము సకలధర్మవిదుఁడవు నాకున్. 888

—: భార్యను విడిచి కావించినతీర్థయాత్ర నిష్ఫల మని ధర్ముఁడు గృకలునకుఁ జెప్పుట :—

చ. అనుటయు ధర్ముఁ డి ట్లనియె నాతని కర్యకులీన ధర్మవ
ర్తనయు సుశీలయున్ బతిపరాయణచిత్తయు సన్నిధానవా
సినియును నైనభార్యను ద్యజించి యొనర్చినతీర్థయాత్రకున్
గనఁబడ దెందునున్ ఫలము గాయపరిశ్రమ మొండు దక్కఁగన్. 889

గీ. సాధ్వి యగుసతి యుండినసదనమందుఁ, దావుకొని యుండు నబ్ధులు దాపసులును
యజ్ఞములు పితరులును గంగాదినదులు, దేవతలు గోవులును సర్వతీర్థములును.

ఆ. అఖిలజీవులును గృహస్థాశ్రమము నాశ్ర, యించి బ్రదుకుచుండు నెపుడుఁ గూడ
నట్టియాశ్రమమున కాధార మైనది, సచ్చరిత్ర యైనసతియ చూవె. 891

గీ. అగ్నిహోత్రంబులును దేవతార్చనలును, దానధర్మంబులును సప్తతంతువులును
నాచరించును గాక భార్యాయుతుండు, కానియెడ నవి సిద్ధియుక్తములు గావు.

గీ. పుణ్యసంపాదనమునకుఁ బూనుకొనిన, దైవమును దృప్తిపఱుపంగఁ దలఁచికొనిన
భువనములలోన గార్హస్థ్యమునకు సాటి, యైనధర్మంబు వేఱొండు గాన రాదు.

గీ. ఎప్పుడును దులఁదూఁగుచు నొప్పఁ గాక, సంపదలతోడఁ దామరతంపరగను
బంధువులు చేరుదురు గాక భార్య యొకతె, లేనియెడ నిల్లు గా దది కాన గాని.

ఆ. భార్య యొకతె యున్నపక్షంబునను గ్రామ, మైనఁ గాని గహన మైనఁ గాని
యదియె గృహము గేస్తుఁ డైనవానికి నదె, సకలధర్మములకు సాధనంబు. 895

గీ. అతివతో సమ మైనపుణ్యంబు లేదు, కాంతతో సాటి యైనసౌఖ్యంబు లేదు
దారతోఁ దుల్య మైనతీర్థంబు లేదు, ధర్మపరుఁ డైనగృహపరిత్రాయకునకు. 896

క. తనసతి యిచ్చినపిండం, బున శ్రాద్ధము పెట్టునెడ సుపుత్రుఁడు దానిన్
గొని పితరు లమృతముంబలెఁ, గని తృప్తినిఁ జెందెద రూర్ధ్వగతులకు వింటే.

క. చోరుఁడవు నీవు సతి యగు, దారకుఁ దెలియక యె పిండదానం బిడుటన్
వీరలు నీకంటెను గడుఁ, జోరులు దత్పిండ మాసచోప్పునఁ గొనుటన్. 898

క. కావున వీరల కిట్టులు, గావింపఁగ వలసె శిక్ష గార్హస్థ్యవిధిన్
బోవిడిచి నీవు శ్రాద్ధము, గావించినకతన నిట్టిగతి యేర్పడియెన్. 899

క. అనుటయుఁ గృకలుఁడు స్వాంతం, బున ఖేదము నొంది కడచిపోయినకార్యం
బున కెంత వగచినను ఫల, మనునది లే దనుచు నెంచి యంతంబునకున్. 900

గీ. యమునితో నిట్టు లనియె మహాత్మ నేను, జ్ఞానహీనుండ నై చేయ రానిపనిని
జేసితిని దప్పు క్షమియించి చెప్పు మింకఁ, బితృవిమోచనమున కేది గతియొ నాకు.

గీ. అనుటయును ధర్మరా జిట్టు లనియె వత్స, తలఁచికొని పుణ్యతీర్థముల్ తలఁపులోన
నొనరుపుము సహధర్మిణి యొసఁగినట్టి, పిండమున శ్రాద్ధ మింట నీపితరులకును.

గీ. దానిచేతను సకలతీర్థములలోన, జాయతోఁ గూడి శ్రాద్ధము సలిపినట్టి
ఫలము చేకూరు నది పితరులకు నూర్ధ్వ,గతులు గలిగించు నని చెప్పి కాలుఁ డరిగె.

క. అంతటఁ గృకలుఁడు సుకలా, కాంతామణి కేల నీయఁగాఁ బిండంబున్
జెంతను నివసించి మహా, సంతోషముతోడఁ జలిపె శ్రాద్ధము నింటన్. 904

వ. అప్పుడు నేనును బరమేష్ఠియును మహేశ్వరుండును దేవగంధర్వసిద్ధవిద్యాధరా
దులతోడం గూడి కృకలునకుఁ బ్రత్యక్షం బయి వర మిచ్చెదము కోరు మనుట
యును గృకలుండు సవినయంబుగాఁ బ్రణమిల్లి మహాత్ములారా యెవ్వరిపుణ్యం
బునం జేసి నాకు వర మీయ వచ్చితిరో యానతిం డని యడుగుటయు నంతట
మే మెల్లరమును నేకగ్రీవంబుగా సుకలావృత్తాంతంబు నాతని కెఱింగించి
వత్సా నీసహధర్మిణిపాతివ్రత్యమహిమంబునం జేసి నీకు వర మీయ వచ్చి యు
న్నార మని పలుకుటయు నాతండు మహానందపరవశుండై. 905

గీ. నాపితరు లూర్ధ్వలోకంబునను వసించు, నట్లు నాబుద్ధి ధర్మంబునందు నిలిచి
యుండునట్టు లనుగ్రహింపుం డటంచుఁ, బలుకుటయు నట్లె యగు నని పలికి మేము.

గీ. కుసుమవర్షంబు దివినుండి కురియుచుండ, నచ్చరలు వ్యోమమున నాట్యమాడుచుండ
విస్మయావహ మైనయా వెలఁదికతను, వాకొనుచు నేఁగితిమి స్వస్వలోకములకు,

క. ఈకథ నాకర్ణించిన, లోకుల కిహసౌఖ్య మూర్ధ్వలోకసుఖంబుల్
జేకూరు ననిన నేటికి, వాకొన నిఁక నిదియు నదియు వచ్చు నటంచున్. 908

—: విష్ణువు వేనునకుఁ బితృతీర్థమాహాత్మ్యముం జెప్పుట :—

వ. ఇంకఁ బితృతీర్థమాహాత్మ్యంబు నెఱింగించెద. 909
క. ఇలను దశారణ్యము నాఁ, గల దొక్కయరణ్య మం దఖండముగను బి
ప్పలుఁ డనెడిఋషి తపంబుల్, జలుపంగాఁ దొడఁగె మున్ను శాంతాత్ముం డై.
గీ. ఆతపం బగ్నిశిఖవోలె నన్నిదెసల, వలగొనుచు లోకులకు భీతి గలుగఁజేయ
నపుడు సుర లెల్ల దయచేసి యతనికడకు, నీప్సితార్థంబు కోరుకొ మ్మిత్తు మనిరి.
గీ. అంతఁ బిప్పలముని వారి కందఱకును, వందనము లొనరించి గీర్వాణులార
భువన మంతయు నావశంబుగను నుండ, వరము దయచేయుఁడీ పెక్కువాంఛ లేల.
క. అనుటయు నట్టులె యగు నని, యనిమిషు లెల్లరును బలికి యంతర్ధానం
బును జెంది రంతఁ బిప్పలుఁ, డనుకొనినది యెల్ల వశ్య మగు చుండంగన్. 913
గీ. పడయరానివిద్యాధరపదము వడసి, కామగమనంబునను ముజ్జగంబులందుఁ
దిరుగుచునునంకుశము లేనిద్విపమువోలె, సర్వమునునాదెయనుచునుగర్వపడుచు.
క. ఒకనాఁడు కుతూహలమున, నొకహ్రదమున కేఁగి చూచుచుండఁగ నచ్చో
నొకసారస మి ట్లనియెను, నకలంకస్వరముతోడ నాతఁడు వినఁగన్. 915
ఆ. ఏల గర్వపడెద వింతమాత్రమునకె, యెఱుఁగఁదగిన దేదొ యెఱుఁగ వైతి
మూఁడువేలయబ్దములు చేసినతపంబు, మూఢభావమునకు మూల మయ్యె. 916
క. అనుటయుఁ బిప్పలుఁడు మనం, బున విస్మయ మొంది పతగపుంగవ నాకున్
వినిపింపు మీ వెవండవొ, కనుఁగొనఁ దగినదియు నేదొ కారుణ్యమునన్. 917
గీ. అనుటయును సారసం బిట్టు లనియె నపుడు, మునివరేణ్య కురుక్షేత్రమునఁ గలండు
కుండలుం డనువిప్రుఁ డొకండు గలఁడు, వానికి సుకర్ముఁ డనియెడిసూనుఁ డొకఁడు.
గీ. ఆసుకర్మునికడకు నీ వరిగితేని, యే నెవండనొ నీ వేది యెఱుఁగవలెనొ
యంతయునునీకు బోధించునతఁడె యనుచు, మాటలాడుచునుండియే మాయమయ్యె.
క. చనుటయును సారసం బా, ముని నిజయోగప్రభావమున శీఘ్రముగన్
జని కుండలాత్మజుం డుం, డినచోటికి నతనియెదుట నిలువంబడియెన్. 920
చ. నిలుచుటయున్ సుకర్ముఁ డతనిం దిలకించి యొనర్పఁదగ్గపూ
జల నొనరించి స్వామి నిను సారస మంపెనె మూఁడువేలయేఁ
డులు తపముం బొనర్చితె కఠోరముగన్ వర మిచ్చిరే సురల్
గలిగెనె లోకముల్ వశముగాఁ గొనుశక్తి యహంత వుట్టెనే. 921
ఆ. అజుఁడు సారసముగ నరుదెంచి నాకడ, కనిపె నిన్ను గర్వ మడఁపఁ దలఁచి
యెఱుఁగఁదగిన దేదొ యెఱిఁగింతు నాపయి; నీమహత్త్వ మెంతొ నీకె తెలియు.

వ. అర్వాచీనం బనియుఁ బరాచీనం బనియును రూపంబు ద్వివిధంబు. సచరా చరంబు లగుప్రపంచంబు లన్నియు నర్వాచీనరూపంబు. ఇయ్యది యసత్యంబును గల్పితంబును దుచ్ఛంబును నగురూపంబు. దీనిం దెలిసికొనుట గాని వశీకరించు కొనుట గాని విశేషంబు గాదు. పాదంబులు లేకుండియు నడచునదియును హస్తంబులు లేకుండియుఁ జేయునదియును ఘ్రాణంబు లేకుండియు నాఘ్రాణించు నదియును శ్రోత్రంబులు లేకుండియు వినునదియును ముఖంబు లేకుండియు భాషించునదియును నేత్రంబులు లేకుండియుఁ జూచునదియును సర్వవ్యాపకంబును సర్వప్రవర్తకంబును నద్వితీయంబును జ్ఞానాకారంబును విశ్వాధారంబును విశ్వ మూలంబును నగురూపంబు పరాచీనంబు. ఆరూపంబు సాధారణంబుగా గోచ రించునది కాదు. అదియె యెఱుంగవలసినపరమార్థరూపంబు. మున్ను మహో దకంబునందు శేషపర్యంకంబు నధిష్ఠించి కోటిసూర్యప్రకాశమానంబై యోగ నిద్రం జెంది యున్నతద్రూపంబు గాంచి స్థానంబు లభింపక తిరుగుచుండు మార్కండేయుండు విస్మయావిష్టమానసుండై వెలవెలఁబోవుచుండ నారూపంబు నుండి దంష్ట్రాకరాళవదనయును నంజనపర్వతాభయును నగునొక్కయింతి యావి ర్భవించి తాపసేంద్రా భయపడకుము. శేషశయ్యాధిగతం బగునారూపంబు జనార్దనుండు. నన్నుఁ దచ్ఛక్తి యగుకాళరాత్రిఁ గా నెఱుంగుము. నేను జగ న్మోహంబుకొఱ కావిర్భవించినమహామాయ నని చెప్పి పంచయోజనాయతం బగునొక్కపద్మపత్రంబు నాతనికిం జూపి నీ విందు నిర్భయంబుగా వసింపు మని యంతర్హితం బయ్యె. 923

క. అప్పుడు మార్కండేయుం, డప్పురుషోత్తమునినాభియందుం గాంచెన్
గొప్పసువర్ణాంభోజము, నప్పువ్వె జననమూల మజునకు నయ్యెన్. 924

క. ఆయజునివలన నుద్భవ, మాయెను లోకములు పాలకాన్వితములు గా
శ్రేయఃప్రదములు గా వవి, మాయారూపములు ముక్తిమార్గము నిడునే. 925

వ. అర్వాచీనపరాచీనంబులు రెండును నాకు వశంబులై యున్నయవి యనుటయుఁ బిప్పలుం డాతని కిట్లనియె. 926

క. అనఘా నీశక్తిని గ, ల్గొన నా కుదయించె నొక్కకోరికి తీర్పం
జనునేని నాయభీష్టము, కనంబఱుపుము దేవతానికాయము నిచటన్. 927

క. అనుటయును సుకర్ముఁడు తన, కనులను మూసికొని సురనికాయము నెల్లన్
మనమున స్మరియించుటయును, ననిమిషు లెల్లరును వచ్చి రాతనికడకున్. 928

క. అరుదెంచినవారలకున్, గరములు జోడించుకొని సుకర్ముఁడు పూజా
చరణంబు జరిపి యిమ్మునిఁ, వరునకు దర్శన మొసంగవలె నని కోరెన్. 929

క. కోరుటయుఁ బిప్పలునకుఁ, వారలు దర్శన మొసంగ నైనశ్యము చే
కూరిచి తద్గర్వపరీ, హారం బొదవంగ నేఁగి రాలయములకుఁ. 930

క. అటుపిమ్మటఁ బిప్పలుఁ డు, త్కటహర్షముతోడఁ గని సుకర్ముని స్వామీ
యిటువంటిశక్తి నీకుఁ, ఘటిల్లుట కేది కారణంబో చెపుమా. 931

క. అని యడుగుటయు సుకర్ముం, డనియెను బిప్పలున కిట్టు లయ్యా నే నే
పనియు నెఱుంగను బితృపూ, జన మొక్కఁడు దక్క నిట్టిశక్తి ఘటిల్లఁ. 932

క. అనుదినమును జలుపుదు నా, జననీజనకులకు నంగసంవాహనముం
బొనరించి తత్పదక్షా, ళనమును దద్వారికణములను దాల్తు మెయిఁ. 933

క. ఎందుందురో మాతాపిత, లందుండును దీర్థకోటు లాత్మజునకు నం
చందురు పెద్దలు గావున, నుందును సతతంబు వార లుండినచోటఁ. 934

క. ఎక్కడ కేఁగఁ దలంతురొ, యక్కడ కేఁగుదును వారి ననుదినమును నే
నెక్కించుకొని భుజంబుల, నక్కార్యముకంటె నాకు నధికము లేమిఁ. 935

క. ఒనరింపఁ జేసి స్నానము, జననీజనకులను మొదటఁ జలుపుదు నాపై
ననుదినము నేనుస్నానము, దనయుఁడు గావింపఁ దగినధర్మం బగుటఁ. 936

క. మొదటను నాగురువుల నొ, ప్పిదముగ భుజియింపఁ జేసి పిదప భుజింతుఁ
నిదురింపఁ జేసి వారిని, నిదురింతు ననంతరంబు నేను మునీంద్రా. 937

గీ. ఆచరింతుఁ ద్రికాలంబులందుఁ బూజ, దల్లిదండ్రుల కది పుత్రధర్మ మగుట
వారికంటెను నాకు దేవతలు లేరు, జపతపంబులు లేవు యజ్ఞములు లేవు. 938

ఆ. కాయశోషణంబు గావింపఁగా లేదు, చదువ లేదు వేదశాస్త్రములను
దానధర్మములను దలఁప నైనను లేదు, తిరుగ లేదు పుణ్యతీర్థములకు. 939

గీ. ఎట్టిధర్మంబులను జేసి యెఱుఁగకున్న, నఖిలమహిమంబులును బ్రాప్తమయ్యె నాకుఁ
గాన ఘన మైనధర్మంబు గాన రాదు, కొమరులకుఁ దల్లిదండ్రులకొలువుకంటె.

క. తలిదండ్రులశుశ్రూషను, జలుపనియాత్మజుని వేదశాస్త్రములు తపం
బులు యజ్ఞంబులు దానం, బులు ధర్మంబులును వ్యర్థములు మహీంద్రా. 941

క. పితృకరుణకుఁ బాత్రుం డగు, సుతునకు నతులితము లైనసుఖములు గలుగుఁ
బితృకోపమునకు గుఱి యగు, సుతునకు నంతంబు లేనిశోకము గలుగుఁ.

వ. ఈవిషయంబునం దొక్కపుణ్యచరిత్రంబు వచియించెద నాకర్ణింపుము. 943

—: యయాతి చరిత్రము :—

సీ. నహుషుం డను నా నొక్కనరపతి జనియించె, వసుధపై మును సోమవంశమందు
జనియించి యతఁడు చేసెను నూఱు వాజపే, యములును నశ్వమేధములు నూఱు
చేసి కాలంబు సంసిద్ధంబు గా శరీ, రము వీడనాడి స్వర్గమున కరిగె
నరిగి తా నొనరించినట్టియుపారధ, ర్మంబుచే నింద్రపదంబు వడసె.

గీ. నంత నాతనితనుజన్ముఁ డగుయయాతి, యింద్రసకంటకంబున మిన్నగా ధర్మములను
జలుపుచును ముజ్జగంబులు సన్నుతింప, నేలె రాజ్యంబు నెనుబది వేలయేండ్లు.

గీ. అంతనాతని కుదయించి రాత్మభవులు, తుఁడుపు పురువును గుఁడుపు యదువునునాఁగఁ
బుట్టి వా రెల్ల నభివృద్ధి పొందుచుండి, రనుదినంబును ధర్మానుయాయు లగుచు.

గీ. అట్టు లుండంగ నొక్కనాఁ డమరవరుని, మార్గవశమున వజ్రిసమక్షమునకు
నరుగుదెంచుటయును నాతఁ డమ్మహర్షి, నర్ఘ్యపాద్యాదివిధులచే నాదరించి.

క. ఎచ్చటనుండి మహాత్ములు, వచ్చుచు నున్నారొ తెలుపవలయును నాఁగన్
వచ్చితిమి ధాత్రినుండి వి, యచ్చరవల్లభ యటంచు నమ్మౌని పలికెన్. 947

ఉ. అంతట నింద్రుఁ డి ట్లనియె నాతనితో మహనీయ యోమహీ
కాంతుఁడు నేఁడు రక్షకుఁడుగా వసుధాస్థలి కున్నవాఁడొ త
త్క్షాంతిపరాక్రమాదులప్రకారము లెట్టివొ నాకుఁ దెల్పు మ
త్యంతకుతూహలంబు హృదయంబునఁ గల్గెడి నాలకింపఁగన్. 948

క. నావుడుఁ గలహాశనుఁ డా, దేవేంద్రున కిట్టు లనియె దేవా దినమున్
నీ వేలునట్లు నహుష, త్క్ష్మావరసుతుఁ డేలుచుండు క్ష్మామండలమున్. 949

గీ. వాజపేయశతంబును వాజిమేధ, శతము నొనరించి ధర్మనిష్ఠాగరిష్ఠుఁ
డగుచు నహుషునికంటెను నధికుఁ డనెడి, యశమును యయాతి నలుదెసలందు నిలిపె.

క. అని చెప్పి బ్రహ్మపుత్రుఁడు, చనుటయు నహుషుండు మున్ను స్వస్థానంబున్
గొనినట్లు తత్సుతుండును, గొను ననుభయ మమరనాయకున కుదయించెన్.

గీ. భీతి గలుగుట వజ్రి యయాతితోడ, మైత్త్రి నొనరింపఁగా నెంచి మానసమున
నతనిఁ దోడ్కొని దివికి ర మ్మనుచు భువికి, మాతలిని బంచెఁ బుష్పకోపేతముగను.

క. పనుచుటయును మాతలి యా, తనిసన్నిధి కరిగి భూతధాత్రీశ్వర నే
ననిమిషనాథుఁడు పంపఁగఁ, జనుదెంచినయట్టియింద్రసారథిని జుమీ. 953

క. నను మాతలి యని యందురు, జనవర మాస్వామి నీవు సలిపినధర్మం
బును విని యమితానందము, గొని నిను దివమునకుఁ దోడుకొని ర మ్మనియెన్.

గీ. సగరుఁడును విప్రచిత్తియు శంతనుఁడును, మనువు శిబియును నిక్ష్వాకువును నిలుండు
భరతుఁడు పురూరవుఁడును నిప్పటికిఁ గూడ, స్వర్గమున నున్నవారు నాశంబులేక.

గీ. ఇంకను ననేకనృపు లకలంకయశులు, కలరు త్రిదివంబున నె మహీతలమునుండి
యరుగుదెంచినయట్టివా రాత్మసుకృత, మహిమమునఁ జేసి దివ్యవస్త్రములతోడ.

క. జనవల్లభ పార్థివ మగు, తనువును విడనాడి నీవు దయచేయుము నా
వెనువెంట దివ్యదేహం, బున నినుఁ బుష్పకవిమానమునఁ గొనిపోదున్. 957

క. అనుటయు యయాతి యి ట్లని, యెను మాతలితోడ దేవ యేదేహముచే
నొనరింపఁబడెనొ ధర్మా, ర్జన మాదేహమునఁ దగదె చన దివమునకున్. 958

సీ. అనుచు మాతలి వాసి కట్లనియె దేవ, ధర్మసాధన మైన దేనువు గాని
పంచభూతాత్మకము గాన భంగురంబు, తగదు పరలోకయాత్రావిధానమునకు.
క. అనుటయు యయాతి యిట్లని, యెను దేవ శరీరవిషయ మెట్టిదొ సర్వం
బును నాకు సవిస్తరముగ, వినిపింపుము కాంక్ష యుద్భవించెను వినఁగన్. 960
క. అని యడుగుటయును మాతలి; జననాథున కిట్లు లనియె స్వామీ దేహం
బును గూరిచి నీకును దెలి; యని దున్నదె మైన వినుతు నడిగితి కానన్. 961

—: శరీర విచారము :—

వ. శరీరంబు త్రివిధంబు. అది కేవలపాపకర్మంబునం జేసి ప్రాప్తించుటవలనఁ బాప శరీరం బనియును గేవలపుణ్యకర్మంబునం జేసి లభించుటవలన దివ్యశరీరం బనియును మిశ్రకర్మంబునం జేసి యావిర్భవించుటవలన మిశ్రశరీరం బనియును జెప్పంబడు. పాపశరీరంబు నరకగాములకును దివ్యశరీరంబు దేవతలకును మిశ్రశరీరంబు మనుష్యాదిప్రాణిసంతానంబునకును నేర్పడు. అందు మిశ్రశరీరంబు లుద్భిజ్జంబు లనియును స్వేదజంబు లనియును నండజంబు లనియును జరాయుజంబు లనియును నాలుగువిధంబులుగా నుండు. తృణగుల్మాదిరూపంబు లగుస్థావరశరీరంబు లుద్భిజ్జంబులు. కృమికీటమశకాదిశరీరంబులు స్వేదజంబులు. పక్షినక్రమత్స్యాదిశరీరంబు లండజంబులు. మానవపశు శరీరంబులు జరాయుజంబులు. జలసిక్తం బగు క్షేత్రంబునందు నిక్షిప్తం బగు బీజంబువలన నంకురంబును నంకురంబువలనఁ బర్ణంబును బర్ణంబువలన నాళంబును నాళంబువలనఁ గాండంబును గాండంబువలనఁ బ్రభవంబును బ్రభవంబువలన క్షీరంబును క్షీరంబువలనఁ దండులంబును బక్వం బైనతండులంబువలన నోషధులును నోషధులవలన నన్నంబును నన్నంబువలన శుక్రంబును శుక్రంబువలన దేహంబునుం బుట్టు. శుక్రవిసర్గకాలంబున జీవుండు స్వకర్మప్రేరితుండై శుక్రంబునం జేరి స్త్రీగర్భంబునం బ్రవేశించు. పురుషశుక్రంబును స్త్రీరక్తంబును నేకత్వముం జెంది యొక్కదినంబునం గలలం బగు. కలలం బైదుదినంబులకు బుద్బుదాకారముం బడయు. బుద్బుదం బొకమాసంబునకు శిరోగ్రీవాస్కంధపృష్ఠవంశోదరరూపంబున నైదువిధంబులుగాఁ బరిణమించు. మాసద్వయంబునకుఁ బాణిపాదపార్శ్వకటిగాత్రంబులును మూఁడుమాసంబుల కంకురంబులును నాలుగుమాసంబుల కంగుళ్యాదులును నైదుమాసంబులకు ముఖనాసికాకర్ణంబులును నాఱుమాసంబులకు దంతజిహ్వాకర్ణచ్ఛిద్రంబులును బాయూపస్థశిశ్నంబులును నేడుమాసంబులకు గాత్రసంధులును గలిగి యెనిమిదిమాసంబులకు నంగప్రత్యంగంబులు సంపూర్ణంబుగా నేర్పడి దేహంబు విభక్తావయవంబై పంచభూతాత్మకం బగుచు నాభిసూత్రనిబద్ధంబై తల్లి భుజియించుషడ్విధరసోపేతాహారంబున దినదినంబును వర్ధి నొందుచుండు.

సీ. అప్పు డా దేహంబుసం దుండుజీవుండు, పూర్వజన్మస్మృతి వొడముం దనకుం
బరితపించుచుం జేయంబడినపాపములకు, నీరీతి నాత్మలో నేడ్వం దొడంగు
నెన్నిసారులో చచ్చి యెన్నిసారులో పుట్టి, పడితి గర్భనరకబాధ లెల్లం
గుక్కబుద్ధియె కాని యొక్కజన్మమునను, గలిగినజ్ఞానంబు నిలువదాయెం
గీ. గడచి యీగండ మెట్లాలో పుడమిమీందం, బడినయెడలను నింక నెప్పటికిం గూడ
గర్భవాసంబు గలిగించుకార్యములను, జేయకుండంగం గడపుదు జీవితంబు. 963
క. నిరతంబును హరినామ, స్మరణము సేయుచును గళితసంసారుండ నై
తరియింతు నింక మీందను, హరి హరి పడంజాల నిట్టియాయాసంబుల్. 964
క. కలలో నైనను బరకాం, తలం గోరను బరధనంబు దాంకను జేయన్
ఖలజనసహవాసంబును, దొలంగినయెడ నీదురంతదుఃఖము నాకున్. 965
వ. అని సంసారవిరక్తుండై మోక్షంబు నపేక్షించుచు దిక్కు దోంపక నానాప్రకారంబుల విలపించుచుండు. 966
క. గిరిగుహలోపలం జిక్కిన, నరుని తెఱంగునను ఘోరనానావ్యథలన్
బరితాప మొందుచుండును, జరాయువునం జుట్టంబడినజంతువు భూపా. 967
క. జలనిధిమధ్యంబున విధి, బలమునం బడిపోయినట్టిప్రాణిగతిని వ్యా
కులచిత్తుం డగుచుం గడుం జిం, తిలు గర్భోదకనిషిక్తదేహుం డధిపా. 968
ఆ. ఉనిచి లోహకుంభమున వహ్నిచేతను, బచ్యమానుం డైనప్రాణిపోలె
గర్భకోశమధ్యగతుం డైనజీవుండు, తప్తుం డగును జఠరదహనమునను. 969
గీ. అగ్నిసూచీవిభిన్నాంగుం డైనదేహి, యెంత దుఃఖంబు నొందునో యంతకంటె
నధిప యష్టగుణాధికం బైనదుఃఖ, మనుభవించును గర్భస్థుం డైనవాండు. 970
క. పలునుడువులు నుడువంగ నెం, దుల కింకను గర్భవాసదుఃఖముకంటెన్
బలవంత మైనదుఃఖం, బిలలోపల లేదు మానవేశ్వర వింటే. 971
గీ. గర్భవాసవిషాద మేకరణి నైన, జ్ఞాన ముదయించువఱకును మానవ దధిప
యది చరాచరములకును నన్నిటికిని, దాపరించును గర్భానురూపముగను. 972
గీ. మఱియొకరహస్యమును విను మానవేంద్ర, తెలియ దండఱకును నిది తెల్లముగను
గర్భవాసవిషాదంబుకంటె జనన, మగువిషాదంబు కోటిగుణాధికంబు. 973
సీ. యంత్రనిష్పీడితం బయినట్టిచెఱకు, చందమున యోనిసమ్మర్దజనిత మైన
బాధచేం బిప్పిపిప్పియై పడు ధరిత్రిం, జివర కెట్టులో దేహంబు పవనహతిని. 974
వ. ఆ దేహంబు మూండునూఱులయఱువది యెముకలును పేశీశతపంచకంబును స్థూలసూక్ష్మంబులును దృశ్యాదృశ్యంబులును నగుమూండుకోటులయేంబదిలక్షల రోమంబులును నన్ని నాడులును ద్వాత్రింశద్దశనంబులును వింశతి నఖంబులును భిత్తకుడపంబును నర్ధాఢకకఫంబును ముప్పదిపలములవసయును నర్ధ్బుదపలంబుల

వాతంబును బదిపలంబులమేదస్సును మహారక్తపలత్రయంబును రక్తచతుర్గుణమజ్జ
యును శుక్రార్ధకుడపంబును దదర్ధబలంబును నూఱుపలములరక్తంబును మాంస
పలసహస్రంబును బరిమాణంబు లేనివిణ్మూత్రంబులును గలిగి యుండు. 975

ఆ. అపరిశుద్ధ మైనయాశరీరము శుద్ధుఁ, డైనయాత్మ కాలయంబు గాఁగఁ
గర్మవశముచేత నిర్మితం బయ్యెను, గడవరాదు కర్మగతి నరేంద్ర. 976

ఆ. పావనంబు లైనపంచగవ్యాదుల, నశుచిభావ మొందునట్లు చేయు
మేనికంటె నశుచి యైనపదార్థంబు, గలదె యెచట నేని తెలిసికొనిన. 977

గీ. దేనినవరంధ్రములనుండి దినదినంబు, వచ్చుచుండునో సకలదుర్వాసనలును
దానికి శుచిత్వ మేరీతి నైనఁ గాని, కలుగ నేరదు బొగ్గ గాఁగలదె తెలుపు. 978

గీ. కప్పురపుఁదావి గలమంచిగంధమునను,నగురుధూపములనునెంతబుగులుకొనఁగఁ
జేసినను మేను విడువదు స్వీయగుణము, శ్వానపుచ్ఛంబు వంచినఁ జక్కఁబడునె.

క. తనమేనిమలములను మూ, ర్కొనఁ జాలక ముక్కు మూసికొనుచును నెవ్వం
డును దేహమున విరక్తిని, నెనయఁడు నృప మోహమహిమ మే మని చెప్పన్.

గీ. తనువు జన్మంబుననె యశుద్ధంబు గానఁ, దద్విశుద్ధికిఁ గడఁగరు తత్త్వవిదులు
సర్వకర్మంబులందును జంతువులకు, భావశుద్ధియె ముఖ్యము పార్థివేంద్ర. 981

ఆ. భావదుష్టుఁ డైనప్రాణి తీర్థములందు, మునిఁగినను దపంబు లొనరిచినను
సాహసమునఁ దుదకు జ్వలనప్రవేశంబు, చేసినను విశుద్ధి చెందలేఁడు. 982

ఆ. కౌఁగిలించుకొనును గాంతను బుత్రిని, బతిని సుతుని నందు భావభేద
మున్నకతనఁ గాదె యొదవదు పాపంబు, కాయ మొకటి యైనఁ గాని భూప.

గీ. అఖిలభోగంబులను దేల్చినట్టిభార్య, యైనఁ గాని పరిత్యక్త యయ్యెనేని
ధవుని మో మైనఁ జూడదు దాని కెల్లఁ, గారణము భావభేద మొక్కటియ కాదె.

క. ఒకసమయమున రుచించిన, వొకసమయంబున రుచింపకుంటకు భావం
బొకఁడె నిదానము గావున, సకలము సిద్ధించు భావశౌచం బున్నన్. 985

గీ. కానఁ జిత్తంబు శోధింపఁ గడఁగవలయుఁ, బనికిమాలినబాహ్యశోధనము లేల
భావశౌచంబు గలిగినపావనుండు, గాంచఁగలుగును స్వర్గమోక్షముల నధిప.

గీ. జ్ఞాన మనియెడినిర్మలసలిలమునను, దీవ్రవైరాగ్య మనెడిమృత్తికను గాక
తొలఁగునె యవిద్య యనియెడిమలవిలేప, మన్యశోధనములు వేయి యైనఁ గాని.

గీ. అట్లు దేహంబు భూతలమందుఁ బడిన,మాత్రమున బాహ్యవాయుసంస్పర్శ మొదవు
దానిచే జ్వర ముదయించు దానఁ గలుగు, విస్మృతి నశించు దాన వివేక మెల్ల.

గీ. ఆవివేకవినాశన మైనపిదపఁ, బూర్వకర్మానుగుణముగాఁ బుట్టుఁ గాంక్ష
కాంక్షచేఁ గల్గు స్తన్యంబు గైకొనంగఁ, గౌశలము గౌశలంబుచేఁ గలుగు వృద్ధి.

క. ఆనిషమున వర్ధిల్లుచు, జీవుఁడు బాల్యమున దుఃఖశిథిలుండై వా
పోవుచు నెట్టులొ కౌమా, రావస్థను జెంది దుఃఖమందును జెందున్. 990

క. పిమ్మట యౌవనమునఁ గా, మమ్మువలనఁ గలబహుప్రమాదముల ననే
కమ్ము లగుదుఃఖములు వడు, సమ్మోదము గలదె తుచ్ఛసంసారమునన్. 991

క. ఆపైని వార్ధకమ్మున, నాపాదిల్లినజరామయంబున గళిత
వ్యాపారుఁ డగుచు ననిశము, వాపోవుచు నుండుఁ జిత్తవైకల్యమునన్. 992

గీ. మేన నాగంతువులు నూఱు మృత్యువులును
గాలమృత్యు వొకండును గలిగియుండుఁ
గలుగు జపహోమదానాదికర్మములను
శాంతి యాగంతువులకు విశ్వంభరేంద్ర. 993

ఆ. కలుగ దట్టిశాంతి కాలమృత్యువునకుఁ, బ్రాప్తకాలుఁ డైనప్రాణి నెంత
తారసిలినఁగాని ధన్వంతరియుఁ గూడ, నిమిషమాత్రమేని నిలుపలేఁడు. 994

ఆ. అంతఁ గాలమృత్యు వాసన్న మగుటయుఁ, బాపరానిమరణబాధతోడ
మేను దొఱఁగి పుట్టు యోనికోటులయందుఁ, గర్మబద్ధుఁ డైనకతన దేహి. 995

క. దేహికి లేదు వినాశము, దేహమునకుఁ దక్క దాన దేహవిరహమే
దేహికి మరణం బనుచును, వ్యాహరించెద రభిజ్ఞు లగువా రెల్లన్. 996

గీ. దేహసంబంధమునఁ జేసి దేహి కొదవు, నెల్లదుఃఖంబులును దాని నెఱిఁగినట్టి
చేతనులు జన్మరాహిత్యసిద్ధికొఱకుఁ, జలుపుచుండెద రాత్మవిచార మధిప. 997

క. ధనసంపాదనమందున్, ధనసంరక్షణమునన్ ధనవ్యయమందున్
ధననాశమునను దుఃఖమె, ధనమున సౌఖ్యంబు గలదె తనుధారులకున్. 998

క. కలిమి గలయట్టి వారికి, సలిలాగ్నిస్వజనచోరజననాథులచేఁ
గలుగును భయంబు మృత్యువు, వలనను బ్రాణులకుఁబోలె వసుధాధీశా. 999

క. జను లెల్లరు భక్షింతురు, ధనవంతుని వ్యోమమునఁ బతంగములు జలం
బున మత్స్యంబులు భూతల, మున శ్వాపదములును మాంసమును దినుభంగిన్.

ఆ. సంధివిగ్రహాదిసంధానచింతయుఁ, బుత్రభయము మఱియు శత్రుభయము
రవులుకొనుచు నుండు రాజ్యంబునను మాత్ర, మేమి సుఖము గలదు భూమిపాల.

గీ. క్ష్మాతలాధిప నహుషాదిజనవరేణ్యు, లెందఱెందఱొ స్వర్గము నొంది కూడఁ
బతితు లైరి ధనావలేపమునఁ జేసి, కాన ద్రవ్యంబువలన సౌఖ్యంబు లేదు. 1002

క. క్షితివర కుటుంబచింతా, హతుఁ డగునాతనిశ్రుతాదు లన్నియు దేహ
చ్యుతి గలుగ దానితోడనె, గతము లగు నపక్వకుంభగతజలమువలెన్. 1003

క. హిమవర్షాతపబాధలు, సమకొనుచుండంగ నెట్లు సమకుఱును సౌ
ఖ్యము కాలమందు మాత్రము, సమస్తమును దుఃఖహేతువు చర్చించిన నొకన్,

వ. ప్రచండవాయుఘాతంబుచేఁ గలుగుపర్ణశాఖాఫలపతనంబులవలనను గుఠారచ్ఛేదనంబులవలనను గజాదిమత్తజంతువులచేఁ గావింపంబడుమూలనాశంబులవలనను దావాగ్నిహిమపాతంబులవలనను ననవరతంబును స్థావరంబులకు దుఃఖంబు సంభవించుచుండు. నాసావేధదండప్రతోదతాడననిగళబంధనాంకుశఘాతాదులవలనఁ గలుగుదుఃఖంబు పశువుల కేర్పడియె. వర్షశీతాతపంబులవలనను బంజరబంధంబువలనను గిరాతబాణపాతంబువలనను గలుగువిషాదంబు పక్షులకు సమకూరె. పరశురాముండు మహావీర్యుం డగు కార్తవీర్యార్జునునిబాహుసహస్రంబు ఖండించె. దశరథాత్మజుం డగు రాముండు పరశురాముని నోడించె. జరాసంధుఁడు నిజప్రతాపంబుచే బలరామునికీర్తి భంగపఱిచె. జరాసంధుని భీముఁడు సమయించె. భీముని నాంజనేయుండు జయించె. నివాతకవచు లనుదానవులను నర్జునుండు రూపుమాపె. అర్జునుండు గోపాలకులచే జితుండయ్యె. లోకప్రకాశకుం డగుసూర్యుండు మేఘాచ్ఛాదితుం డగు. మేఘంబులు వాయువిఘాతంబు లగు. వాయువు నగనిర్జితుం డగు. నగంబులు వహ్నిదగ్ధంబు లగు. వహ్ని జలంబుచే శమియించు. జలంబు సూర్యకరంబులచే శోషింపఁ జేయంబడు. ఆదిత్యలోకాదిసకలలోకంబులును బ్రహ్మదేవునియొక్కదినంబునందు ప్రళయంబు నొందు. బ్రహ్మదేవుండు పరమాత్ముం డగుశివునిచేఁ బరార్ధద్వయకాలాంతంబునం దుపసంహరింపంబడు. ఇట్లు పరికింప సంసారంబున సర్వోత్తమపదం బెవ్వరికినిం గానంబడదు. 1005

గీ. భిన్నమూలంబు లైనట్టిక్షితిరుహముల,పోల్కిఁ బడుదురు వివశులై పుడమిమీఁదఁ
గర్మఫలభోగ మైనతత్క్షణమునంద, లోకులకు నేమి సౌఖ్యంబు నాకమునను.

వ. మఱియును యజ్ఞపురుషునకు శిరోరోగంబును మార్తండులకుఁ గుష్ఠరోగంబును వరుణునకు జలోదరంబును సూర్యునకు దంతవైకల్యంబును సోమునకును క్షయరోగంబును నింద్రునకు భుజస్తంభనంబును దక్షప్రజాపతికి మహాజ్వరంబును వైశ్వానరునకు సర్వభక్షకత్వంబును గృష్ణునకుఁ బాండవసారథ్యంబును స్కందునకు శరజన్మంబును సకలదేవతలకును బ్రతికల్పంబునందును సంక్షయంబును దప్పనయ్యె. బ్రహ్మదేవుండు దక్షపుత్రికను గామించె. రుద్రునకుఁ జండికను శపియించుటయును దక్షయజ్ఞధ్వంసంబు గావించుటయును జేకూరె. ఇట్లు బ్రహ్మాదిదేవతలకును గామక్రోధాదిదోషంబులు సంక్రమించి యుండె. కామక్రోధాదులు దుఃఖకారణంబులుగాఁ జెప్పంబడియె. 1007

క. జగదేకనాయకుం డగు, భగవంతుం డొకఁడు దప్పఁ బర మఖిలంబున్
వికళిత మగునదె కావున, జగములలోఁ బ్రాజ్ఞుఁ డెవఁడొ జడుఁ డెవ్వాఁడో.

క. ఏవిషయము నెవఁ డెఱుఁగునొ, యావిషయంబున నభిజ్ఞుఁ డతఁ డని చెప్పం
గా వలయుఁ గాని సర్వజ్ఞు, నేవాఁడును గూడ నెఱుఁగఁ డీప్రాణులలోన్, 1009

గీ. మాసపాధిప తెలిసినదానిలోనఁ, గొలది యధికము తెలిసినజంతువునకుఁ
గలుగుచుండుఁ బ్రభావ మొక్కనికొకంట, దానఁ దనికి నొదవు సమ్మానసంబు.

క. కాన విషాదాకలితం, బైనభవంబున విరక్తు లగుచును నాత్మ
జ్ఞానంబు వడసి దానను, గానందగు ముక్తి బుద్ధి గలవారలకున్. 1011

క. అనుటయు యయాతి సంతస, మును జెంది తదీయబోధమునకు మహాత్మా
మనుజులకర్మవిపాకం, బును జెప్పుము నాకు బుద్ధి పుట్టెను వినఁగన్. 1012

క. అని యడుగుటయును మాతలి, తనమదిలోపలను సతనిధర్మప్రశ్నం
బున కెంతయును బ్రమోదము, జనియింపఁగ నిట్టు లనియె క్ష్మాపాలునకున్.

—: కర్మ విపాకము :—

వ. బ్రహ్మఘ్నుండును స్వర్ణస్తేయియును గోఘ్నుండును గురుతల్పగుండును యోగ
నాశనుండును బంచమహాపాతకు లని చెప్పంబడుదురు. 1014

గీ. భయమువలనను గాని కోపమునఁ గాని, వైరమునఁ గాని లోభంబువలనఁ గాని
బ్రాహ్మణుని వధియించినపాపి చెప్పఁ,బడును బ్రహ్మఘ్నుఁడనుచును బార్థివేంద్ర.

వ. మఱియును దారిద్ర్యభారంబున యాచించినబ్రాహ్మణునకు మొదట నాశ గొలిపి
పిదప విత యొనర్చువాఁడును నుదాసీను లగుబ్రాహ్మణులను సభామధ్యంబున
విద్యాగర్వంబుచే నిస్తేజస్కులం గావించువాఁడును మిథ్యాగుణంబులచేఁ దన
కుత్కర్షము నాపాదించుకొని గురువును నిరోధించువాఁడును క్షుత్పిపాసాపీడితు
లగుప్రాణులు భుజించుటకు సిద్ధపఱుచుకొనినయన్నంబును బడఁగొట్టువాఁడును
సర్వజనరంధ్రాన్వేషణతత్పరుం డగువాఁడును బూర్వదత్తంబై కాలక్రమంబున
నశియించినదేవబ్రాహ్మణభూమి నపహరించువాఁడును బ్రహ్మఘ్నుం డని చెప్పం
బడు. ద్విజవిత్తాపహరణంబును నగ్నిహోత్రపంచయజ్ఞమాతాపితృపూజాపరి
త్యాగంబును గూటసాక్ష్యంబును నభక్ష్యభక్షణంబును శివభక్తద్రోహంబును
నిరపరాధజంతుమారణంబును గోష్ఠదేవాలయపురగ్రామదహనంబును బ్రహ్మ
హత్యాసమపాతకంబులు. సువర్ణచౌర్యంబు స్వర్ణస్తేయం బనం బరగు. దీనజన
సర్వస్వాపహరణంబును బరన్యాసాపహరణంబును బరస్త్రీగజవాజిగోభూరజత
రత్నౌషధిరసచందనాగురుకర్పూరకస్తూరీపట్టవస్త్రాద్యపహరణంబును స్వర్ణస్తేయ
సమపాతకంబులు. గురుభార్యాగమనంబు గురుతల్పగమనం బనంబడు. వివాహ
యోగ్య యగుకన్యకను సదృశుం డగువరున కీయకుండుటయును బుత్రమిత్త్రుల
కళత్రంబులం బొందుటయును భగినీగమనంబును గుమారీగమనంబును జండాల
స్త్రీగమనంబునునగమ్యాగమనంబును గురుతల్పగమనసదృశంబులు. గోవధంబు
గోహత్య యని చెప్పంబడు. క్షుత్పిపాసారోగపీడితంబు లగుగోవులను రక్షింప
కుండుటయును మర్యాదావ్యతిక్రమంబును నతిమానంబును నతికోపంబును

దాంభికత్వంబును గృతఘ్నత్వంబును నత్యంతవిషయలౌల్యంబును గార్పణ్యం
బును శాఠ్యంబును మాత్సర్యంబును బతివ్రతాదూషణంబును గన్యాదూషణం
బును బరివిత్తిపరివేత్తలకుఁ గన్య నొసంగుటయును వారికి యాజకత్వంబు నపహిం
చుటయును బుత్రమిత్త్రులు లేనియప్పుడు వారికళత్రంబులఁ బోషింపకుండుట
యును సద్భార్యాపరిత్యాగంబును సాధువులను దాపసులను బ్రాహ్మణులను
గోవులను గొట్టుటయును దేవాలయవృక్షంబులను బుష్పారామంబులను నశింపఁ
జేయుటయును నాశ్రమస్థు లగుద్విజుల బాధించుటయును యాచింపఁదగనివానిని
యాచించుటయును యజ్ఞారామతటాకవిక్రయంబును దారాపత్యవిక్రయంబును
దీర్ఘయాత్రోపవాసవ్రతాదిపుణ్యవిక్రయంబును స్త్రీధనోపజీవనంబును నధర్మ
ప్రబోధంబును నధర్మవర్ణనంబును బరదోషోద్ఘాటనంబును బరద్రవ్యాభిలాషంబును
బరదారాలోకనంబును సాధుమార్గంబుననుండుచానను బ్రహరించుటయును సోమరి
తనంబున నెప్పుడును నిద్రించుటయును దుర్బలంబు లగుజంతువులపై నతిభారంబు
వైచి వానిని బాధించుటయును శక్తిలేనివారిని గార్యంబులందు బలాత్కారంబున
నియోగించుటయును వ్రణాదిపీడితంబు లగుజంతువులచే బరువు మోయించుట
యును వృషభంబులవృషణంబులు చితుకఁగొట్టుటయును గోవధతుల్యంబులు.
మహాపాతకిసాంగత్యంబు యోగనాశనంబు. మహాపాతకతుల్యంబు లని చెప్పం
బడిన వన్నియును బాతకంబులు గా నెఱుంగునది. దిక్కు లేనివాఁడును విక
లాంగుండును దీనుండును బాలుండును వృద్ధుండును క్షుధాతురుండును నగు
వానిని గరుణింపకుండుటయును ద్విజుండు శూద్రాచారంబున నుండుటయును
శూద్రుండు ద్విజాచారంబున నుండుటయును శిల్పవృత్తియును గారువృత్తి
యును వైద్యవృత్తియును దేవలకవృత్తియును భృతకవృత్తియును దూత్య
వృత్తియును నదండ్యులను దండించుటయును దండ్యులను దండింపకుండుటయును
బన్నులు హెచ్చుచేసి రాష్ట్రప్రజలను బీడించుటయును రాష్ట్రమునందు లంచ
గొండు లగునధికారులును దస్కరులును లేకుండఁ జేయకుండుటయును నన్యాయ
వర్తి యగువానివలనఁ బ్రతిగ్రహించుటయును ఘృతంబును దైలంబును మధు
వును మాంసంబును నాసవంబును మూలంబులును ఫలంబులును గుడేక్షుక్షీర
దధిశాకాదులును దృణకాష్ఠంబులును బుష్పపత్త్రంబులును నాతపత్రంబులును
బాదరక్షలును శకటంబులును శిబికలును రజతతామ్రసీసత్రపుకాంస్యంబులును
శంఖాదులును వాదిత్రవేణువంశాదులును గృహోపకరణంబులును నూర్ణా
కార్పాసకౌశేయాదివస్త్రంబులును దొంగిలించుటయును వేదనిందయును బ్రాహ్మ
ణాచారకుత్సనంబును సాధుజనపీడనంబును వంశాచారంబు విడిచి యన్యా
చారంబు నాశ్రయించుటయును మాతాపితృభగినీస్వసృనిందాతాడనంబులును

దాన కాలంబునం దరుదెంచిన బ్రాహ్మణులలోఁ గొందఱకు మాత్రము దాన
మిచ్చి యితరుల కీయకుండుటయును సదాచారసంపన్నుండును నాశ్రితుండును
నగు బ్రాహ్మణుని విడిచి యితర బ్రాహ్మణునకు దాన మిచ్చుటయును స్వగృహం
బునకు వచ్చిన బ్రాహ్మణులను ద్యజించి వారు వెడలిపోయినపిదపఁ జేయుదానం
బును నజ్ఞాతకులగోత్రుండును నపరీక్షితుండును నగు బ్రాహ్మణుని శ్రాద్ధమం
దును దానమందును నియమించుటయును ద్రిమూర్తులను ద్వేషించుటయును
భగవద్భక్తులను నిందించుటయును బాద్మభాగవతమాత్స్యకూర్మహరివంశాది
పురాణగ్రంథంబులను బూజింపకుండఁ బఠించుటయును వినుటయును లోభంబున
నాగ్రంథములను విక్రయించుటయును నపరిశుద్ధప్రదేశంబులం దాపురాణంబు
లను జెప్పుటయును వినుటయును గురునమస్కారంబు గావింపక పురాణంబు
పఠించుటయును వినుటయును బురాణజ్ఞానదాయకుం డగుగురువు నుపేక్షించుట
యును భార్యాపుత్రమిత్త్రాదుల నవమానించుటయును విప్రవర్జితంబుగా శ్రాద్ధంబు
గావించుటయును మఱియును నితరపాపకర్మంబులును నుపపాతకంబులుగాఁ
జెప్పంబడియె. మహాపాతకపాతకోపపాతకత్రివిధపాపంబులును జేయువారలకుఁ
దత్తత్పాపానుగుణంబుగాఁ బ్రాయశ్చిత్తంబులును రాజశాసనంబులును యమ
దండనంబులును విధియింపంబడియె. ప్రమాదకృతంబు లగుపాపంబులకు గురు
వును గామక్రోధలోభాదులచేఁ జేయంబడుపాపంబులకు నృపతియును నకృత
ప్రాయశ్చిత్తరాజదండనంబులును బ్రచ్ఛన్నంబులును నగుపాపంబులకు యముం
డును శాసకులుగా నుందురు. 1016

గీ. మనసుచేతను గాని వాక్కునను గాని, కాయమునఁ గాని చేసినకల్మషములు
శాసనము లేనియెడలను బాసిపోవు, కల్పకోటుల కైనను గాశ్యపీంద్ర. 1017

గీ. క్షమయు విద్యయు నింద్రియసంయమమును
శ్రద్ధయును సత్యమును నహింసయును దపయుఁ
దపము ధ్యానము దానము ధర్మమునకు
సాధనంబులు పది చూవె జనవరేణ్య. 1018

గీ. వ్యస్తములుగను గాని సమస్తములుగఁ, గాని వానిని సేవించుమానవునకుఁ
గలుగు సుకృతైకఫలభోగనిలయ మైన, శివపురంబున వాసంబు క్షితితలేంద్ర.

క. కావున నాధర్మంబులు, సేవింపఁగ నొప్పుఁ దనకు క్షేమము నెపుడున్
గావించుకొనఁ దలంచిన, జీవున కిఁక నీకు వేఱె చెప్పఁగ నేలా. 1020

వ. మఱియును విష్ణుభక్తులకు వైకుంఠంబును బ్రహ్మోపాసకులకు బ్రహ్మలోకంబును
శివభక్తులకుఁ గైలాసంబును యజ్వలకును యుద్ధనిహతు లగుక్షత్త్రియులకును బుణ్య

కార్యకరులకును స్వర్గంబును వాసస్థానంబులై యుండు. వారలందఱును దత్తత్పుణ్యస్థానంబులందు దుఃఖరహితం బగుమహానందంబు ననుభవించుచుందురు.

గీ. సుకృతవంతులు గాని పాతకులు గాని, యందఱును గూడ యమపురి కరుగువార
కాని మార్గమునందు సౌఖ్యంబు గలుగు, సుకృతులకుఁ బాపులకుఁ గల్గు శోకమధిప.

వ. అన్నోదకదానంబు చేయువారు మృష్టాన్నోదకసంతర్పితు లగుచును వస్త్రదానంబు చేయువారు దివ్యవస్త్రాలంకృతు లగుచును శిబికాదానంబు చేయువారు విమానాధిష్ఠితు లగుచును దివ్యాసనప్రదాతలు సుఖాసనస్థు లగుచును నారామస్థాపకులు మహావృక్షచ్ఛాయాశ్రితు లగుచును ఛత్త్రదానంబు చేయువారు ఛాయామార్గాశ్రితు లగుచును పుష్పప్రదాతలు పుష్పకయానాధిష్ఠితు లగుచును దేవాలయంబులును యతిమఠంబులును నాశ్రమంబులును వైద్యశాలలును ననాథశరణాలయంబులును బ్రాహ్మణవాసగృహంబులును నెలకొల్పువార లుత్తమగృహస్థితు లగుచును దేవాగ్నిగురువిప్రమాతాపితృసపర్య గావించువారలు మహాభోగంబు లనుభవించుచును నితరపుణ్యకార్యంబులు గావించువారలు తత్తత్కర్మానుగుణభోగంబు లనుభవించుచును సుఖంబుగా యమపురంబున కరిగి యచ్చటనుండి స్వకృతపుణ్యానుగుణంబు లగులోకంబులకు యమునిచే సాదరంబుగాఁ బంపంబడుదురు. పాపు లగువారలు యాతనాశరీరంబులు ధరియించి దారుణాకారు లగుయమభటులపాశంబులచేఁ గట్టంబడి మార్గమధ్యంబునఁ గ్రూరంబు లగుసింహవ్యాఘ్రవృకంబులచేతను దారుణంబు లగు దంశకీటమక్షికాజలూకాగణంబులచేతను మత్తమాతంగయూథంబుచేతను నిశితశృంగంబు లగుమహోక్షంబులచేతను మహాశృంగంబు లగుమహిషంబులచేతను విషోల్బణంబు లగువ్యాళంబులచేతను వికటాక్షు లగురాక్షసులచేతను భయంకరంబు లగుడాకినీగణంబులచేతను దుర్వారంబు లగువ్యాధులచేతను బ్రచండంబు లగుఝంఝామారుతంబులచేతను ఘోరంబు లగుపాషాణవర్షంబులచేతను హృదయనిర్భేదకంబు లగువజ్రనిర్ఘోషంబులచేతను బ్రదీప్తాంగారవర్షంబులచేతను భీకరోల్కాపాతంబులచేతను మహాపాంసువర్షంబులచేతను బీడింపంబడుచును క్షుత్పిపాసావివశు లగుచును హాహాకారంబులతో నేడ్చుచు నెట్టకేలకు మహాదుఃఖంబుతో యమపురంబున కేఁగి యచ్చటఁ జండశాసనుం డగుదండధరునిచేఁ దత్తత్పాపానురూపంబు లగునరకంబులలోఁ ద్రోయంబడుదురు. 1023

క. అనుటయు యయాతి యిట్లని, యెను మాతలి విభువ నొల్ల నే నీకాయం
బును దీనివలనఁ బుణ్యం, బును సంపాదించి మహిమమును బొందుటచేఁ.

క. కలుగును జరాదిదోషం, బాలు బాధ్యంబులును బాపములు చేసినవా
రల కేను బాపరహితుఁడఁ, గలుగదు నామేని కట్టిగతి యెన్నటికిన్. 1025

గీ. ఇప్పటికి నాకుఁ గడచిపోయినవి లక్ష, వర్షములు మేను నూత్నయౌవనవికాస
భాసమానం బగుచుఁ గానఁబడుచునుండె, నాయొనర్చినయట్టిపుణ్యమునఁ జేసి.

గీ. అమృతమయ మగుకృష్ణనామౌషధంబు, పాన మొనరించుటను జేసి పాతకములు
లేవు దాసను మేనికి లేదు హాని, యాతంకంబును మరణంబు నాకు లేదు. 1027

గీ. కృష్ణనామరసాయనం బెల్లకడల
దొరకుచుండంగ భవమునఁ దొరఁగి దాని
మునుఁగుచుందురు సతతంబు మూఢమతులు
జననమరణప్రవాహోర్మిచయమునందు. 1028

క. హరికృపచే బాహ్యాభ్యం, తరశౌచంబునను సత్యధర్మాభిరతిన్
బరమపవిత్రం బగుచును, బరగెడినామేని కేల భంగం బొదవున్. 1029

గీ. పాపములచేత నామయప్రాప్తి గలుగు, నామయంబులచే మృత్యు వావహిల్లు
బాపములు లేనినాకళేబరమువంకఁ, గాంచ నేరదు మృత్యు వేకాలమునను.

గీ. కావున యయాతి స్వర్గముగా నొనర్చె, భూతలంబునె నిజధర్మహేతువునను
స్వర్గపురమున కేల రావలయు నింకఁ, జనుము మాతలి మామహేంద్రునకుఁ దెలుప.

క. అనుటయు మాతలి తనవ, చ్చినత్రోవనె స్వర్గమునకుఁ జేరి వినమ్రా
ననుఁ డగుచు మనవి గావిం, చెను వజ్రికి నహుషసుతుఁడు చెప్పినమాటల్.

క. ఆమాట లెల్ల విని సు, త్రాముఁడు చింతించుచుండుతరుణంబునఁ ద
త్సామీప్యమునకు సాధ్వస, మామతిలఁగ వచ్చి నిలిచి యముఁ డిట్లనియెన్.

క. సురలోకాధీశ వసుం, ధరలోన యయాతి యనెడుధాత్రీశ్వరుఁ డొ
క్కరుఁ డున్నవాఁడు తద్గుణ, గరిమంబును విన్న భీతి గలిగెడి నెదలోన్. 1034

గీ. అతఁడు వ్యాధియు జరయును మృతియు లేక
సతతమును బంచవింశతిసముఁడు వోలె
వెలయుచుండెను వంశాభివృద్ధి గలిగి
హరికృపాసంహృతాఖిలదురితుఁ డగుట. 1035

క. ధరణీతలమున నుండిన, నరు లెల్లరు నతనిశాసనమువలన నిరం
తరమును హరిసంకీర్తన, పరు లగుచుండిరి సమస్తపాపము లుడుగన్. 1036

సీ. త్యజియింపకుందురు నిజధర్మములను బ్రా, ణములు గోల్పోవుసందర్భమునను
చలియింపకుందురు సత్యమార్గమునుండి, కంఠంబు తెగఁబోవుకాలమునను
విడనాడకుందురు విష్ణుభక్తిని స్మృతి, తప్పిపోవుచు నుండుతరుణమునను
తలపెట్టకుందురు కలుషకృత్యములను, సామ్రాజ్య మొసఁగూడుసమయమునను

గీ. నెనయుచుండెద రిరువదేనేండ్లవార, వీర లనుకొనునట్లు లనారతంబుఁ
బరగుచుందురు నిర్జరామరణు లగుచు, నహుషసుతుఁ డేలుజనులు బృందారకేంద్ర.

క. భూలోకముగా దది సుర, పాలక స్వర్గంబ యచటిప్రజలను నే నే
వేళను నైనను నిజముగ, నాలోకించుటకుఁ గూడ నడలుచు నుందున్. 1038

చ. నహుషసుతుండె యింద్రుఁడు జనంబులె దేవత లేమి చెప్ప నా
మహిమము వాగతీతము క్షమాప్రజ లెల్లరు నన్యలోకని
స్పృహు లయి యున్నవారలు పరిచ్యుతి వారికి లేదు కాన మీ
వహి యిలలోన నెన్నఁడును వాస్తవరీతిని దాఁప నేటికిన్. 1039

క. అనిమిషవల్లభ దీనికి, నను వైనచికిత్స చేయ నగు నతిశీఘ్రం
బున నీక నుపేక్ష చేసినఁ, బని లేక జగంబు లెల్లఁ బాడైపోవున్. 1040

క. అని తెలుపుటయును నింద్రుఁడు, మనమున స్మరియించె నపుడు మదనుని నంతన్
జనుదెంచి మన్మథుండా, యనయెదుటను నిలిచె విరచితాంజలి యగుచున్.

క. నిలుచుటయు నతని కింద్రుఁడు, సలుపందగుగౌరవంబు సలిపి ధరిత్రీ
తలనాథునిమహిమంబునఁ, గలిగినలోకప్రమాదగతి నెఱిఁగించెన్. 1042

క. తెలుపుటయు మదనుఁ డాతని, పలుకులలోఁ గలిగినట్టిభావం బెల్లన్
దెలిసికొని లోకములకున్, గలుగునె నాశంబు నేను గలుగ సురేంద్రా. 1043

క. అని పలికి యతనియాజ్ఞను, గొని పరివారంబు నెల్లఁ గొని వెంటను నా
మనసిజుఁడు నటుఁడువోలెను, జనుదెంచె యయాతిరాజసవిధంబునకున్. 1044

క. చనుదెంచి ప్రణామంబుల, నొనరించి యయాతిభూవరోత్తమునకు ని
ట్లని పలికె స్వామిసంద, ర్శనభాగ్యమువలనఁ గలిగె సఫలత మాకున్. 1045

క. భూమీంద్ర నాటకములను, మేము ప్రదర్శింపఁగలము మే ల్మే లనఁగా
శ్రీమంతులు మీరలు మా, సామర్థ్యము చూచి మెచ్చఁ జాలును మాకున్.

మ. అని యర్థించుటయున్ నృపుం డఖిలవిద్యాపోషణాసక్తి గ
ల్గినవాఁ డైనకతంబునన్ సభకు నంగీకారమున్ దెల్పి యం
తన వాక్రుచ్చెను నేడు వామనచరిత్రంబున్ బ్రదర్శింపుఁడీ
యనుచుం జాతక మబ్దతోయమును గా కన్యంబు నాశించునే. 1047

వ. అంతట మన్మథుండు సూత్రధారవేషంబు దాల్చి నటీ వేషధారిణి యగురతి
దేవితోడం గూడి పారిపార్శ్వక వేషధరుం డగుమాధవుండు వెంట రాఁ బండిత
మండలభూయిష్ఠం బగురాజసభామండపంబునం బ్రవేశించి. 1048

గీ. గాన మొనరింప రతి రాలు గరఁగునట్లు, హాస్యమును జూప మాధవుఁ డద్భుతముగఁ
దాను నిరుపమ మైననృత్యంబు సలిపి, మోహవార్ధిని సభ్యుల ముంచివైచె.

వ. తదనంతరంబ నేపథ్యంబు తొలంగింపంబడుటయు స్త్రీవేషధారిణియై జరి ప్రవే
శించి జగన్మోహనం బగుగానంబు గావించుచు లీలానాట్యంబు సలుపందొడంగె.
ఆసమయంబునంద యయాతినృపాలుండు లఘుశంకం దీర్చికొని తద్గానపరవశీ
కృతమానసుం డగుటం జేసి పాదశౌచంబు మఱచి నిజాసనంబునం దుపవిష్టుం
డయ్యె. 1050

క. ఎప్పు డశౌచుం డయ్యెనొ, యప్పుడె జర యావరించె నాతనిమేనం
దప్పునె ప్రమాదకృత మగు, తప్పున కేనియును శిక్ష యనఘాదులకున్. 1051

గీ. అదియె యద నని మదనుఁడు మది నెఱింగి, బద్ధు నొనరించె నానరపాలమౌళి
నాత్మసమ్మోహనకళామహత్త్వమునను, బలిని నొగి వామనుఁడు బద్ధుఁజేసినట్లు.

ఉ. అంతట గార్యసిద్ధి యయినందున శ్లాఘ్యతమప్రయోగుఁడై
కంతుఁడు నాటకంబు లఘుకాలములోనె ముగించి మేదినీ
కాంతునిచే బహూకృతులు గాంచి వెసన్ బరివారయుక్తుఁడై
సంతస మేర్పడంగఁ జని సర్వముఁ దెల్పె నమర్త్యభర్తకున్. 1053

వ. అంత యయాతిమహీపతి యొక్కనాఁ డొకయరణ్యంబున కేఁగి మృగయా
పరవశుండై యున్నసమయంబున సత్వరదేవకార్యసిద్ధికొఱకు మహేంద్ర
కల్పనాచాతుర్యంబునం జేసి. 1054

గీ. కానఁబడియెను నెదుట మృగం బొకండు, కనకవర్ణతనూరుహకాంతియుతము
రత్నయుక్తచతుశ్శృంగరాజితంబు, సుందరాంగంబు లోచనానందకరము.

గీ. అమ్మృగంబును గని విస్మయమ్ము గదురఁ, బట్టుటకు నేఁగెఁ జేఁ డది పట్టువడక
పరువువెట్టుటయును వెంటఁబడి విభుండు, చనియె నది పోవుమార్గము ననుసరించి.

ఆ. పరువులెత్తికొనుచుఁ బఱతెంచి పఱతెంచి, హరిణ మొక్కవనమునందుఁ జొచ్చి
మాయమయ్యె నంత మానవాధీశుఁడు, విపిన మెల్లఁ దిరిగి విసువు చెంది. 1057

ఆ. అచట నుండు నొక్కహ్రదము గనుంగొని, దాన జలము గ్రోలి దాహ మాఱఁ
దత్తటప్రరూఢతరుశీతలచ్ఛాయ, యందు విశ్రమించె హాయి గదుర. 1058

ఉ. ఆసమయంబునందు శ్రుతి కద్భుతమైనలయస్వరాదివి
న్యాసకళావిలాస మలరారెడిగీతరవంబు సోఁకుటం
జేసి శరీరమున్ మఱచి చిత్తరుబొమ్మయొ నాఁగ నానృపా
గ్రేసరుఁ డుండి యొక్కత్రుటిఁ గేవల మావల లబ్ధసంజ్ఞుఁడై. 1059

క. గీతప్రియుఁ డగుటను నా, గీతధ్వని వచ్చుచోటికిన్ జన నెవలోఁ
గౌతుకము గలుగ వెడలెను, నాతరుణంబుననె విడిచి యాస్థానంబున్. 1060

గీ. వెడలి హ్రదమున కానలికడను నొక్క, కనకసదనంబునను జంద్రకాంతవేది
పైని గూర్చుండి వీణియపాటఁ బాడు, కమలపత్త్రాయతాక్షి నొక్కతను గనియె.

ఉ. కాంచినతోడనే కుసుమకాండుఁడు మేన శిలీముఖంబులన్
నించుటయున్ యయాతి మది నిల్పికొనంగలశక్తి లేమి నా
చంచలనేత్ర చెంతకు వెసన్ జన నాచెలి లేచి సిగ్గుచే
వంచికొనంగ మోము జనవల్లభుఁ డిట్టులు పల్కె నామెతోన్. 1062

ఉ. ఎవ్వరిదాన వీవు హరిణేక్షణ కారణ మేమి కానలో
నివ్విధి నుండఁగా ననుడు నింతి సఖిన్ గడగంటఁ జూడఁగా
నవ్వల గుఱ్ఱెఱింగి చెలియాశయ మాచెలికత్తె రేనితో
నవ్వనితాచరిత్రము రవంతయు దాఁపక చెప్పె నిద్ధతన్. 1063

గీ. మనసిజుఁడు మున్ను విషమలోచనుని చేత
దగ్ధుఁ డగుటయు రతి యాహ్రాదంబుదరిని
జేరి యేడువఁదొడఁగె నపారముగను
చక్షువులనుండి యశ్రువర్షంబు గురియ. 1064

వ. ఆరోదనాశ్రువులే తత్సరోవరంబునం బడుటయు వానివలన మహాశోకంబును వియోగంబును మూర్ఛయును గామజ్వరంబును విభ్రమంబును బ్రలాపంబును నున్మాదంబును మృత్యువును నావిర్భవించి యామెం జుట్టుకొని బాధించుచుండె.

ఆ. ఆయవస్థఁ జూచి యనుకంపతో గౌరి, మనసిజారిపార్శ్వమునకుఁ జేరి
ప్రాణనాథ రతికిఁ బతిభిక్ష దయచేయు, మనుచు వేఁడుటయును నామృడుండు.

క. బ్రతికించెఁ బరమకరుణా, న్వితుఁ డగుచును మదని వెంటనే సుర లెల్లన్
స్తుతియించుచు నాపని న, ద్భుతముగ దివినుండి గురియఁ బూవులవానల్.

గీ. అంతఁ గాముఁడు విచ్చేసె నద్భుతముగ
దివ్యదేహంబుతో రతిదేవికడను
నదియె మొదలుగఁ గలిగె నీహ్రదమునకును
బ్రథితి జగమందుఁ గామసరస్సు నాఁగ. 1068

గీ. అపుడు రతిదేవి కత్యంతహర్ష మొదవి, దుఃఖసంతాప మంతయుఁ దొలఁగిపోవ
నామెకన్నులనుండియాహ్లాదమునందుఁ, బడియెఁ బ్రమదాశ్రుబిందువు లెడములేక

వ. ఆ హర్షాశ్రుబిందువులనుండి ప్రీతియును ఖ్యాతియును లజ్జయును మహానందంబును శాంతియును లీలయును క్రీడయును నావిర్భవించె. అటుమీఁద నాయమవామలోచనంబునుండి యానందబాష్పంబు లమితంబుగాఁ గురియుటయు నాయశ్రుబిందువులనుండి యొక్కపద్మం బుదయించె. ఆపద్మంబునందు మాసఖీరత్నంబు జనియించుటం జేసి మాసఖీమణి కశ్రుబిందుమతి యనునామం బేర్పడియె. 1070

క. ఈకన్యామణి భర్తను, జేకొనఁగా నిచటఁ దపము సేయుచు నుండెన్
లోకమ్మున నీవొకరవును, గ్రేకొనఁ దగుధన్యుఁ డెవఁడు గలఁడో యెఱుఁగన్,

క. నే నీయమునకుఁ బ్రాణస్నేహము, చే సంగను సతియుఁ గూర్మిచెలి సఖుఁడు విశా
లానామము గలదానను, ఘనానందము సఖునకుఁ జేల మాకు క్షంతికర్. 1072

క. అని విరమించుటయును నా, జననాథుం డిట్లు లనియె సఖితోడను మా
నిని నేను జంద్రవంశజుఁ, డను నహుషనృపాలపుత్రుఁడను భూవరుఁడన్. 1073

గీ. చంద్రవదన యయాతిరాజేంద్రుఁ డనుచు, నను వచింతు రిల జను లెల్లరను ధరిత్రి
త్రిదశలోకంబు గా నొనర్చినఘనుండఁ, జెప్పికొనరాదు సుమి నాప్రసిద్ధి నేను.

క. మీచెలిమీఁదను సోఁకెను, నాచిత్తం బవ్విఁ జెవఁడు నాకంటెను ధా
త్రీచక్రంబున నీయుష, లోచనను గ్రహించుటకు విలోకించినచోన్. 1075

క. అనుటయు విశాల యి ట్లని, యెను రాజవరేణ్య వింపు మిలలోపల నీ
కెన యైనమానవుఁడు లేఁ, డని దానిని గా దనంగ నగునే మాకున్. 1076

క. ఐనను నీదేహంబునఁ, గానంబడుచుంటె నిపు డొకానొకదోషం
బానైల్యమె లేకుండిన, మ్మానాయిక మాలతాంగి మానును నిన్నున్. 1077

చ. అనుటయు విస్మయంపడి యయాతినృపాలుఁడు తన్వి యేమి నా
తనువున దోష మున్నదియొ తప్పక చెప్పుము నాఁగ నామె యి
ట్లనియెను మేదినీంద్ర తెలియంబడకున్నదె నీకు నీమెయిం
గనఁబడుచున్నవార్ధకవికారము మే మవచింప నేటికిన్. 1078

క. అనుటయు నేమియుఁ దోఁపక, జననాథుం డేమి కతమొ జర నామేనం
గనఁబడుట కీ వెఱింగిన, వనజాయతనేత్ర తెలుపవలయును నాకున్. 1079

చ. అనుటయు నామె యి ట్లను జనాధిప నీ వొకనాఁడు నాటకం
బును గనువేళలో మఱచిపోయినవాఁడవు పాదశౌచముం
బొనరిచికొంట గానరసముగ్ధుఁడవై జర యావరించె నీ
తనువునఁ దద్విలోపజనితం బగుదోషముచేత నత్తఱిన్. 1080

ఉ. నావుడు తేఁడు తా నపు డొనర్చినదోషము సంస్మృతంబు గా
భావమునందుఁ గొంత వెతపాటును జెంది గతంబుఁ గూర్చి వా
పోవుట నిష్ఫలం బనుచు బుద్ధి నెఱింగి సహింపలేక తా
పావహ మైనమన్మథశరాహతి నాసఖితోడ ని ట్లనున్. 1081

చ. కలికి శిలీముఖంబులను గాఁడఁగ నేయుచు నుండె నాయెదన్
నిలువఁగఁ జాల మన్మథుఁడు నిర్దయుఁ డేమి యొనర్చువాఁడొ మీ
చెలి కరుణించెనేని ననుఁ జేసెద రాణిగ నీమె నీధరా
తలమున కెల్ల నేను బదదాసుఁడనై పరిచర్య సల్పుచున్. 1082

క. అనవుడు వరుణాత్మజ యి, ట్లనియెను రాజేంద్ర నీజరావస్థను నీ
తనయులకు నొసఁగి తద్యా, వనమును ధరియించి రమ్ము వాంఛ ఫలించున్.

చ. అనవుడు నాస్పృహాలుఁ డసహాస్యముతోడను నాకుఁజాంబునన్
జని నిజమందిరంబునకు నందనులన్ బిలిపించి ముర్వురన్
దనకుఁ గలట్టిభావమును దండ్రియెడన్ సుతు లుండఁదగ్గన
ర్తనమును దానిచేఁ దమకు రాఁగలలబ్ధియుఁ దెల్పె నేర్పునన్. 1084

గీ. అంతటఁ దురుంపు పల్కె నాయనను జూచి, పెద్దవాఁడవు నీ కిది బుద్ధి గాదు
తనయు లొనరింపఁ జనుఁగాక తండ్రిసేవ, కనము జనకుని ముదుసలితనము గొనుట.

గీ. అఖిలసౌఖ్యంబులను గూడ ననుభవింపఁ, దగినప్రాయంబు విడిచి వార్ధకము గొనుట
హస్తమున నున్నస్వర్ణము నవల వైచి, మృత్తికను జేతఁ బట్టినరీతి గాదె. 1086

ఆ. తండ్రి యగును గాక దైవంబె యగుఁ గాక, చెప్పఁ దగనిమాట చెప్పెనేని
మంచిచెడ్డలను విమర్శింపకుండంగ, వినుట కీతుదుంపు వెఱ్ఱివాఁడె. 1087

క. అనుటయు యయాతి వానిం, గనుగొని కన్నులను నగ్నికణములు రాలం
గను నిట్టు లనియె నాకున్, దనయుండవు గావు నీవు ధర్మవిహీనా. 1088

సీ. బ్రహ్మఘ్నుఁడవు సురాపాయివి కుష్ఠివి, వైదికాచారవివర్జితుఁడవు
పరదారగామివి బ్రాహ్మణద్వేషివి, దోషివి దేవతాదూషకుఁడవు
వేదవేదాంగవివేకశూన్యుండవు, సత్యహీనుఁడ వప్రశస్తమతివి
క్రూరకర్ముఁడవు గోఘ్నుఁడ వమంగళుఁడవు, పాపాత్ముఁడవు సర్వభక్షకుఁడవు

గీ. కుత్సితుఁడవు సగోత్రాభికుఁడవు ముక్త, కచ్ఛుఁడవు గమ్ము మఱి నీకుఁ గలుగునట్టి
వారలకు వారలకుఁ గల్గువారలకును, సంఘటిలు నీగతియె యంచు శాపమిచ్చె.

గీ. పిదప యదు వి ట్లనియె నమ్రవదనుఁ డగుచు
దాఁపఱిక మేల సుతునకుఁ దండ్రియొద్దఁ
జెప్పెదను మదిలో నున్న చివరమాట
మోయఁజాలను దాత నీ ముదిమి నేను. 1090

క. అనుటయును గ్రోధతామ్రా, ననుఁ డగుచు యయాతి రాజ్యనాశయశోనా
శనములును పుత్త్రనాశన, మును గలుగ నొసంగె శాపమును యదువునకున్.

క. శాపము నొసంగుటయుఁ బరి, తాపంబును జెంది యదువు తండ్రీ తగునే
కోపింపఁగ నెఱుఁగను నే, నేపాపంబును ననుగ్రహింపుము నన్నున్. 1092

క. అని వేఁడికొనుటయును నా, జననాథుం డిట్టు లనియె సర్వవినాశం
బును గలిగి దుష్టసంతతి, జనియించును నీకుఁ బితృవిషాదమువలనన్. 1093

క. నినుఁ జూడరాదు నాయెదు, టను నిలకుము క్రోధ ముత్కటం బయ్యెడి నీ
జనకాజ్ఞాపాలనమున, కనుకూలం బగు ననుగ్రహం బిదె చనుమా. 1094

క. అనుటయును యదువు కోపం, బున ని ట్లని పలికె నాకుఁ బుట్టినవా రె
ల్లను దుష్టులైనయెడ నీ, జనులను బాధించి కొనరె సర్వస్వంబున్. 1095

క. అనుటయు యయాతి వానిం, గనుఁగొని నిజజనులు విగతకలుషుల గాఁగాం
చిన నారకలోకమునకుం, జనుచుండెద రనుచు మరల శాపం బిచ్చెన్. 1096

క. తరువాతఁ బురువు జనకుని, చరణములకు మ్రొక్కి తండ్రి సంతాపంబుం
బొరయకుము నేను నీదగు, జర గైకొని నీకు నాదుజవ్వన మిత్తున్. 1097

క. అనుటయు సత్యానందం, బును జెంది యయాతి గాంచి పురువును వత్సా
తనయుండన నీ వొకఁడవె, తనయుండవు తండ్రియాజ్ఞ దాఁటనికతనన్. 1098

గీ. పుట్టుదురు గాక పెక్కుఁడు పుసుగులట్లు, వ్యర్థులైనకుపుత్రులవార్త లేల
దల్లిదండ్రులయాజ్ఞను దాఁటనట్టి, పుత్రుఁ డొక్కఁడె త్రైలోక్యపూజితుండు.

క. అని పలుకుచుండఁగనె తన, తనువున జవ్వనము పురునితనువున జరయున్
గనఁబడుటయును స్వారాజ్యం, బును బురున కొసంగి సర్వమును జేఁ డంతన్.

క. మదనవశుం డగుచును స, మ్మదమునఁ జని యశ్రుబిందుమతియొద్దకు నో
మదవతి తారుణ్యము నా, కొదవెను నిఁక నేమి కోర్కి యున్నదొ చెపుమా.

క. అనుటయుఁ దత్సఖి యిట్లని, యెను జందనవృక్ష మైన నేమి భుజగవే
ష్టన మున్నకతన సాధ్వస, మును గలుగం జేయుఁ గాదె ముట్టుట కధిపా. 1102

క. గిరిశిఖరపతన మైనను, వర మగ్నినివేశ మైన వరము సపత్నీ
గరళవిలిప్తాంగుం డగు, పురుషునిఁ గవగూడుకంటెఁ బొలఁతికి భూపా. 1103

చ. అనుటయు నానృపాలుఁడు తదాశయమున్ గమనించి రాజ్యముం
దనువును గూడ నర్పణమొనర్చితి మీచెలి కేమి చేసికొ
న్నను సరె యింక వీనిపయి నాకు స్వతంత్రత లేదు కేలఁ గే
లునిచెద విశ్వసించుటకు నుగ్మలి సాక్షులు పంచభూతముల్ 1104

చ. అనవుడు నశ్రుబిందుమతి హస్తము చాఁచుటయున్ యయాతి చ
య్యనఁ దనహస్త మామెకరమం దునిచెన్ దివి దేవదుందుభి
ధ్వనులు చెలంగ నంతటను వారలు ప్రేమరసాబ్ధిమగ్నులై
యనఁగిపెనంగి వింశతిసహస్రసమల్ విహరించి రిచ్ఛమై. 1105

వ. ఆసమయంబునందు జేని కామెపైఁ గలయనురాగముం జూచి సైఁపంజాలక దేవయానియును శర్మిష్ఠయును సాపత్న్యద్వేషంబు వహియించి యకార్యకరణంబునకుం గడంగుటయు నశ్రుబిందుమతి తదుద్యమంబును బ్రియున కెఱింగింప నమ్మహీపాలుండు యదుకుమారునిం బిలిచి వత్సా యకార్యకరణపరాయణచిత్తవృత్తు లగు దేవయానీశర్మిష్ఠలశిరంబులు ఖండింపు మని యాజ్ఞాపించె. 1106

క. అప్పుడు యదు వాతనిఁ గని, యప్పా జననుల వధింప ననుచిత మనుచుం
జెప్పుదురు పెద్ద లెల్లను, దప్పుఁబనిని నాకుఁ జెప్పఁ దగునే నీకున్. 1107

క. అని పలుకుటయును భూపతి, కనులను నిప్పుకలు రాలఁ గని వానిని నో
తనయాధమ మాత్రంశం, బున బ్రతుకు మటంచు శాపమును దగిలించెన్.

ఉ: అంతట నొక్కనాఁడు మదనాత్మజ యిట్లనియెన్ యయాతిభూ
కాంతునితోడ నాథ కనఁగా శివవిష్ణుమహేంద్రలోకముల్
స్వాంతమునందు నా కొదవె వాంఛ సమర్థుఁడ వీవు తీర్చి మ
చ్చింతితమున్ గృతార్థముగఁ జేయుము నాజననంబు నావుడున్. 1109

క: మనుజేశ్వరుఁ డాకాంతను; గనుఁగొని యిట్లనియె నేను గామిని లేకు
న్నను ధర్మహీను లగుదురు, జను లెల్లను దానఁ జేటు సంప్రాప్తించున్. 1100

గీ: దాని కెల్లను నీవె నిదాన మగుదు, వాకతంబున విడిచి యీయాశయంబు
కోరుకొను మన్య మేదేని కువలయాక్షి, తెగువతోడను నీకోర్కి దీర్చువాఁడ.

చ. అనవుడు నశ్రుబిందుమతి యాతనిఁ గన్గొని మానవేంద్ర యే
పనికయి నిన్ గ్రహించితివొ పల్కినపల్కును నమ్మి నాఁడు దా
నిని వితచేసి యన్యమును నీ విడినన్ ఫల మేమి చంద్రవం
శ్యునకు యయాతికిన్ నహుషసూనున కిట్లు వచింప నర్హమే. 1112

ఉ. నావుడుఁ దన్వి చెప్పఁదగున్యాయము చెప్పితి నంతె కాని నీ
వేవిధి నైనఁ గావలయు నీపని యన్నను రాజ్య మంతయున్
బోవునుగాక భూజనులు పోదురుగాక యొనర్చితీరెదన్
నావచనం బొకండె సుమి నాఁడును నేఁడును నుర్వి క్రుంగినన్. 1113

చ. అని నహుషాత్మజుం డనుడు నాలలితాంగి నరేంద్ర నామనం
బునఁ గలకోర్కి తీర్చుటయె ముఖ్యము నా కని పల్క నాయశో
ధనుఁడు నిరుత్తరుం డగుచుఁ దత్త్వవిదుం డయినట్టికారణం
బునఁ దనలోనఁ దానె తలపోయఁదొడంగెను నీవిధంబునన్. 1114

సీ. సలిలంబులోపల సంచరించుచునుండు,మీనంబు జాలంబులోనఁ జిక్కుఁ
బవనవేగముతోడఁ బరువులెత్తుచునుండు,మృగము బంధంబులోఁ దగులువడును
శతయోజనవిదూరగత మైనయామిషం, బండజంబులకు భక్ష్యముగ నుండుఁ
బాదలగ్నం బైనపాశంబు గూడను, భాగ్యహీనునకుఁ గన్పట్టకుండు

గీ. నంతయును గూడఁ గాలమాహాత్మ్యమున నె,సంభవించుచునుండు సంశయము లేదు
కాలమె సమస్తమునకును గారణంబు, కాలమును దాఁటు పురుషుఁడు గానరాఁడు.

గీ. తపములును దానములు మంత్రతంత్రములును
భేషజములును మణులును నోషధులును
బరిజనంబులు మిత్త్రులు బంధువులును
గాలకబళితుఁ డగువానిఁ గావలేవు. 1116

క. జననము మరణము పరిణయ, మును ననియెడిమూఁడు పాశములు కాలముచే
నొనరింపంబడుటను నె, వ్వనికిని శక్యంబు గాదు వానిని ద్రుంపన్. 1117

గీ. కాలమునఁ బ్రేరితం బయి కర్మ మెపుడు, ననుభవింపఁగఁ జేయు శుభాశుభములఁ
గర్మబంధంబు నెంత దక్షత గలట్టి, దేహియును నిల్వఁజాలఁడు ద్రెంచికొనఁగ.

క. దేవత్వము మానుష్యము, స్థావరభావము పశుత్వశకునత్వాదుల్
జీవునకుఁ గలుగఁజేయును, గావున నెంతటిదొ కర్మగతి రా దెఱుఁగన్. 1119

గీ. ప్రాణినుదుటను వ్రాయంగఁబడియె నైన
గర్భకోశంబులోఁ బద్ధకాలముననె
యాయువును సంపదయును విద్యయును మృతియుఁ
గర్మమును నెట్లు వ్రాసెనో కలుగు నట్లె. 1120

క. కుమ్మరి మర్దితమృత్పిం, డమ్మున వస్తువుల నెట్లొనర్చునొ యాచం
దమ్మున జీవుఁడు వ్యవహా, రమ్ములు గావించుచుండుఁ బ్రాక్కర్మమునన్. 1121

గీ. ధేనువులు వేయి యుండఁగా వాని విడిచి, తల్లియొద్దకుఁ జేరువత్సంబువోలెఁ
బొందుచుండును గర్తను బుణ్య మేని, పాప మేనియు సుఖదుఃఖరూపమునను.

ఆ. పరువులెత్తుచున్నఁ బరువులెత్తుచునుండు, నిలిచియున్నయెడల నిలిచియుండుఁ
గడకుఁ గర్మ మొక్కక్షణమేని కర్తను, వీడనాడి పోదు నీడవోలె. 1123

గీ. కలిసి ఛాయాతపంబులకరణి నుండుఁ, గర్మమును గర్తయును దానఁ గర్మఫలము
ననుభవింపఁగవలయు నిత్యమును గర్త, కానరాదు వినాశంబు కర్మమునకు.

గీ. నాయొనర్చినకర్మమునకు ఫలంబు, ప్రాప్తమయ్యె జరాస్వరూపమున నాఁడు
నేఁడు స్త్రీరూపమునను సంధిల్లె నెవఁడు, కర్మవేగంబునకు లోను గానివాఁడు.

ఆ. ఈలతాంగికోర్కి యీడేర్పకుండిన, నగుదు సత్యధర్మవిగళితుఁడను
దానివలన భ్రష్టదశ నొంది చివరకుఁ, గాకపోదు నుభయలోకములకు. 1126

చ. అని తలపోసి కొంతవడి కానరపాలకమౌళి యాత్మజ
న్మునిఁ బురునిం గనుంగొని తనూభవ ధర్మమునంద చిత్తవృ
త్తిని నెలకొల్పి కొంటివి ప్రతిష్ఠను నాసుఖవాంఛ లెల్ల దీ
రినవి భవన్నిమిత్తమునఁ బ్రీతుఁడ నైతిని నేను నీయెడన్. 1127

గీ. కామసౌఖ్యంబులకు లోను గాక యింకఁ, బోవఁ దలపెట్టితిని దేవభూములకును
నేను బాలించినట్టులె నీవు గూడఁ, బాలనము చేయుమయ్య భూప్రజల నెల్ల.

సీ. పాలించుచుండుము భగవదాశ్రితులను, శరణన్నవారిని సజ్జనులను
దండించుచుండుము ధర్మనాశకులను, హరిభక్తివిముఖుల నరిజనులను
నెలకొల్పుచుండుము నిగమధర్మములను, బరమార్థపరులను బ్రాహ్మణులను
గావించుచుండుము కవిస్తుతులను యజ్ఞ, కర్మంబులను దానధర్మములను

గీ. శీలవంతుల నొద్దకుఁ జేర్చికొనుము, భ్రష్టులను జేర్చికొనకు మభ్యాశమునకుఁ
జానలనుశత్రువులనుగోశమునుబలము, నమ్మికొనియుండకుముప్రమాదమ్ముగలుగు.

సీ. పరదారపరధనపరుఁడవు గాకుము, కావింపకుము పాపకార్యములను
విడనాడకుండుము వేదశాస్త్రాసక్తి, త్యాజియింపకుము స్వాశయ్యాతలంబు
సర్వకాలములందు సంతుష్టుఁడవు గమ్ము, తలఁపులోఁ గృష్ణుని నిలిపికొనుము
చారచక్షువులచే సకలంబు గనుఁగొను, మింద్రియంబుల నిగ్రహించుకొనుము

గీ. దినదినంబుఁ బ్రజాసౌఖ్యమునకుఁ గాను, జేయుచుండుము వలసిన చేఁత లెల్లఁ
దనివితీరక చెప్పితిఁ దండ్రి నగుట, నిఖలధర్మజ్ఞుఁడవు నీకు నేర్ప నేల. 1130

క. అని చెప్పి తనజరాభర, మును గైకొని తా నొసంగి పురున కతనిజ
వ్యసనమును నాశీర్వాదము, నొనరిచి కొమరునకు నేఁగ నుద్యోగింపన్. 1131

క. ప్రజ లెల్ల నానరేంద్రునిఁ, ద్యజియింపఁగ లేక వెంటఁ దరలుటయును నా
ప్రజలను దోడ్కొని నహుషా, త్మజుఁ డరిగెను నశ్రుబిందుమతితో దివికిన్.

ఉ. అంతట లేఖనాథుఁ డఖిలామరులున్ దనవెంట రాఁగ న
త్యంతకుతూహలంబున యయాతిమహీంద్రుని చెంత కేఁగి నీ
యంతటివాఁడు నేఁ డతిథి యయ్యెడిభాగ్యము గల్గె మాకు నీ
యింతికతంబునన్ వసుమతీశ్వర రమ్మని వేఁడుకొంటయున్. 1133

క. ఆవేఁడికోలునకు ధా, త్రీవిభుఁ డంగీకరించి త్రిదివౌకస్సం
సేవితుఁ డగుచును దేవేం, ద్రావసథంబునకు నరిగె నాదర మొదవన్. 1134

క. అమరాధీశ్వరుఁ డాతని, నమృతాతిథ్యమునఁ దనుప నప్పుడు చేతః
ప్రమదము గదురఁగ ధాత్రీ, రమణుఁడు గీలించి తత్కరంబునఁ గరమున్.

గీ. సంతసం బయ్యె నాకు నీసలిపినట్టి, గౌరవంబున నమరేంద్ర కలుగుఁ గాక
మనకుఁ జ్యుతి లేనిసౌహార్ద మనుచుఁ బలికి, పరిజనోపేతముగ నేఁగి బ్రహ్మపురికి.

క. సాష్టాంగవందనములను, స్రష్టకుఁ గావించి తత్ప్రసారితకరసం
స్పృష్టోత్తమాంగుఁ డయి శివి, విష్ణపురంబునకుఁ జేరె విధియనుమతిచేన్. 1137

గీ. చేరి గౌరీసమేతుఁడై కూరుచుండి, వృషభరాజంబుపైఁ దేజరిల్ల దెసలు
నిజతనూదీప్తులను దర్శనీయమూర్తి, యగుచుఁ జెలువారుప్రమథనాయకునిఁ గాంచి.

ఆ. పులకితాంగుఁ డగుచు నిలిచి కట్టెదుటను, గనులనుండి బాష్పకణము లురల
నుతు లొనర్చె నంత శితికంఠుఁ డాతని, భక్తిభావమునకుఁ బ్రమద మొంది.

క. భూవర నీహరిభక్తికి, భావంబున నేను దృప్తిపడినాఁడ నిఁకన్
నీ వుండు మిందె భేదం, బావంతయుఁ గూడ లేదు హరికిని నాకున్. 1140

ఆ. హరియె హరుఁడు హరుఁడె హరిసంశయము లేదు, కోవిదుం డెఱుంగు మావిధంబు
కాని మందమతులు కల్పించుచుండెద, రచ్యుతునకు నాకు నంతరంబు. 1141

చ. అనుటయు వేఁడు ధూర్జటికి నంజలిచేసి మహానుభావ నీ
వనినది యెల్ల సత్యమ మురారికి నీకును వాస్తవంబులోఁ
గనఁబడ దించుకేనియును గాని విభేదము నీకడన్ వసిం
చినను మురారిచెంతను వసించిన నొక్కటె మమ్ముబోంట్లకున్. 1142

గీ. కాని వైకుంఠమును జూడఁ గాంక్ష వొడమె, నంతరంగంబునను బ్రమథాధినాథ
సెలవొసంగుమటంచుఁగాంక్షించుటయును, నట్లెయగుఁగాక యనిశివుఁడనుమతించె.

క. అంతట యయాతిధరణీ, కాంతుఁడు వైకుంఠమునకుఁ గ్రక్కునఁ జని య
త్యంతకుతూహలమున నై, త్యాంతకునిమహావిభూతి నవలోకించెన్. 1144

మ. అవలోకించి మహావిభూతి నెదలో నాశ్చర్యముం జెంది భూ
ధవుఁ డానందముచే మురారిచరణద్వంద్వంబునన్ వ్రాలె నా
యవనీనాథునిఁ జూచి మాధవుఁడు వత్సా లెమ్ము నీభక్తికిన్
మివులన్ హర్షము గల్గెఁ గోరుకొనుమీ నీ వేవరం బేనియున్. 1145

క. అని పలుకుటయును భూపతి, మనమున సంతోషపడుచు మాధవ నాపైఁ
గనికర మొదవిన ననిశం, బును దావకపాదదాస్యమునె యాసింతున్. 1146

క. అని వేఁడుటయును నతనికి, జనార్దనుఁడు వర మొసంగె జనపతి యంతిన్
వనజాక్షునిఁ గొలుచుచుఁ దన, జనములతోఁ గూడి విష్ణుసన్నిధి నుండెన్.

క. అంతటఁ బురుఁ డిల నేలుచు, సంతోషమునన్ బితౄప్రసాదప్రాప్తా
భ్యంతరదర్శనుఁ డగుట న, నంతపదంబునకుఁ జేరె నంతంబునకున్. 1148

గీ. కానఁ బితౄతీర్థమునకు నీ దైనతీర్థ, మెందునను గానఁగా రాదు నందనులకుఁ
గలుగు దానను జెడ్డవారలకుఁ జెడ్డ, మంచివారిక మంచియు మానివర్య. 1149

క. అని వాక్రుచ్చుటయును విని, తనమదిలోఁ బిప్పలుండు తృప నొందుచు వ
చ్చినత్రోవఁ బట్టుకొని పో, యెను బితౄతీర్థప్రభావ మే మందు నృపా. 1150

—: గు రు తీ ర్థ మా హా త్మ్య ము :—

వ. ఇంక గురుతీర్థప్రభావంబు నాకర్ణింపుము. 1151

క. గోచరము గానివస్తువు, గోచర మగునట్లు చేసికొనుటకుఁ బ్రజ్ఞా
లోచనముఁ బ్రసాదించెడి, యాచార్యునిఁ బోలుతీర్థ మన్యము గలదే. 1152

క. అంతర్గత మగుతమమును, నంతం బొందించు దేశికాగ్రణికి బహి
ర్ధ్వాంతనివారకు లగుభా, స్వంతుఁడును శుపాకరుఁడును సరి గారు సుమీ.

గీ. త్రిభువనంబులు గూడను దెలిసికొనెడి, జ్ఞానమును గీర్తియును ధర్మసంగ్రహమును
మోక్షమును గల్గఁజేయుఁ బ్రత్యక్షముగను, దేవుఁ డన్నను గురు వన్న దేశికుండ.

గీ. దినమును దివాకరుండు రాత్రిని విధుండు, భవనమునుదీపిక యుఁదమఃపటలమడఁచి
ప్రజ్వలింపంగఁ జేసెడిపగిది గురువు, ఛాత్త్రుని జ్వలింపఁ జేయు నజ్ఞాన ముడిపి.

క. కావునఁ ద్రికరణములచే, సేవింపఁగవలయు నెపుడు శిష్యుఁడు గురువున్
భూవర చెప్పెద నొకకథ, యీవిషయమునందు నీకు దృష్టాంతముగన్. 1156

—: చ్యవనుఁడను విప్రుని చరిత్రము :—

సీ. భార్గవకులమందుఁ బ్రభవమొందెను మున్ను, చ్యవనుండు నా నొక్క-తాపసపరుఁ
డతనికి నొక్కనాఁ డాకస్మికంబుగా, బుద్ధి పుట్టెను జ్ఞానమును గడింప
నపుడు సంసారంబు నాతఁడు విడనాడి, ధరణీతలం బెల్లఁ దిరిగి తిరిగి
సేవించి తీర్థముల్ క్షేత్రంబులును బెక్కు, కొనకు రేవాతీరమునకుఁ జేరి
గీ. యచట నొక్కవటతరూరుహంబు గాంచి, శీతవాతాంకురంబులు చిత్తమునకు
సౌఖ్యమొనరించుచుండఁ దచ్ఛాయయందు, విశ్రమించెనుదొలఁగ మార్గశ్రమంబు.
వ. ఆవటవృక్షంబుపైని వార్ధకావస్థ ననుభవించుచు బహుకాలంబునుండి చిరకాల
జీవి యగుకుంజలుం డనునొక్కశుకం బుజ్జ్వలసముజ్జ్వలవిజ్వలకపింజలనామ
ధేయంబులు గలిగి పితృభక్తిపరాయణులై యుండుతననలువురుకొడుకులును
దెచ్చి యర్పించెడియాహారంబుచే జీవించుచు సకళత్రంబుగా నివసించియుండు
టయు నానాఁడు చ్యవనుండు విలోకించుచుండ నలుదెసలనుండి నలువురు పుత్రు
లును నచ్చటికి వచ్చి తాము దెచ్చినయమృతోపమానంబు లగుఫలంబులును
బుణ్యతోయంబులును జననీజనకులకు భక్తిపూర్వకంబుగా సమర్పించి తమ
ఱెక్కలచే విసరుచుండినంతఁ గుంజలుండు పత్నితోడం గూడి పుత్రప్రదత్తం
బగునాహారంబు నారగించి యానందించుచు నుజ్జ్వలుం డనుజ్యేష్ఠపుత్రునిం
జూచి యి ట్లనియె. 1158

క. ఈనాఁడు తండ్రి యుజ్జ్వల, యేనాటికిఁ బోతి వచట నేదేని వినం
గా నైనవిశేషము గల, దేని వచింపంగఁగలవె యించుక నాకున్. 1159

—: దివ్యాదేవీచరిత్రము :—

గీ. అనుటయును నుజ్జ్వలుం డిట్టు లనియెఁ దండ్రి, చనినవాఁడఁ బ్లక్షద్వీపమునకు నేఁడు
చూడవలయు నె కాని చక్షువులతోడ, దానివైభవ మెన్న నాతరము గాదు.
గీ. అచటఁ గలఁడు దివోదాసుఁ డనెడిఱేఁడు, ధర్మమార్గానుపాలనతత్పరుండు
వాని కుదయించె సౌందర్యవతుల కెల్ల, నాజ్ఞ యనఁగ దివ్యాదేవి యనెడికన్య.
వ. దివోదాసుం డాయమను రూపదేశాధిపతి యగుచిత్రసేనమహీపాలున కిచ్చి
వివాహంబు సేయఁ దలంచి యాతనికిఁ దనమనోరథం బెఱింగించుటయుఁ జిత్ర
సేనుండు బంధుమిత్త్రపరిజనంబులతోడం గూడి వచ్చి సుముహూర్తకాలంబునందు
వధూసమేతంబుగా భద్రపీఠంబు నలంకరించె. 1162

గీ. అప్పు డది యేమి దైవమాయయొ సమస్త
జనములును జూచుచుండ నాశ్చర్యముగను

చిత్రసేననరేంద్రుఁడు చేష్ట లుడిగి
క్షోణిపైఁ బడి విడిచెను బ్రాణములను. 1163

వ. అంతట దివోదాసుండు ఖిన్నవదనుండై ధర్మాత్ముఁ డగుటం జేసి యింకమీఁద నాకన్నియకుఁ గావలసినగతి యేమి యని సప్రశ్రయంబుగా బ్రాహ్మణుల నడుగ వార లెల్ల నాతనిం జూచి రాజా యిట్టిసమయంబునం దుద్దిష్టుం డైన భర్త మృతుం డైనను దేశాంతరగతుం డైనను మహారోగాభిభూతుం డైనను వధూత్యాగి యైనను క్లీబుం డైనను బతితుం డైనను గన్యను మఱియొకవరున కిచ్చి వివాహంబు గావింపవచ్చు నని ధర్మశాస్త్రప్రమాణంబు గలదు. కావున నీకన్నియను మఱియొక్కవరున కిచ్చి నిస్సంశయంబుగాఁ బరిణయంబు గావింపు మని వచియించుటయు దివోదాసుండు బ్రాహ్మణాదేశంబున రూపసేనుం డను రాజకుమారున కాయువ నీయ నిశ్చయించి తదుద్యమంబు గావించుటయు రూపసేనుండును జిత్రసేనుండువోలె లగ్నకాలంబునందె కాలధర్మంబు నొందె. పిదప నావిధంబునన యేకవింశతిసంఖ్యాకు లగువరులు మరణించుటయు దివోదాసుం డత్యంతచింతావ్యాకులమానసుం డై మంత్రులతోడ నాలోచించి స్వయంవరంబునకుఁ జాటింపం జేసె. 1164

క. అంతటఁ దద్రూపశ్రవ, ణాంతరితవివేకు లగుట నరుదెంచి మహీ
కాంతు లనేకులు చెందిరి, యంతముఁ గలహించికొని స్వయంవరభూమిన్.

గీ. అప్పు డాకన్య చేయఁగా నైన దేది, యేనియును లేమి లోలోన నేడ్చికొనుచుఁ
గడపసాగెను దినము లక్కరణి నగుట, కేమి హేతువో తండ్రి నా కెఱుఁగఁ జెపుమ.

వ. అనుటయును గుంజలుండు పుత్రున కిట్లనియె. 1167

సీ. మున్ను గాశీపురంబున సువీరుండు నా, నొకవైశ్యజనుఁ డుండె నుత్తముండు
వానికిఁ జిత్రాభిధానంబు గలిగిన, భార్య యొక్కరిత సంప్రాప్తమయ్యె
నాభార్య విడనాడి యాత్మధర్మము లెల్లఁ, జరియింపఁదొడఁగెను స్వైరముగను
నంతట నావైశ్యుఁ డామెను ద్యజియించి, పెండ్లాడె వేఱొకబేరిసుతను

గీ. నప్పు డాచిత్ర తెగియించి యవని నెల్లఁ, దిరుగుచును సాధువనితల దురితములకుఁ
జొనుపుచును జారు లిచ్చెడిధనము గొనుచుఁ, బాడుచేసెనసంఖ్యాకభవనములను.

క. కలహములు పెట్టి పతిప, త్నులకును బితృపుత్రులకును దోషం బనుచుం
దలఁపక యనేకకంఠం, బులు బలివెట్టించె నాపె భూదేవతకున్. 1169

ఆ. అట్లు కొంతకాల మరుగుటయును నాపె, కర్మఫలముఁ గుడుపఁ గలిగినట్టి
కాల మరుగుదేరఁ గాలధర్మము నొందె, దిక్కు లేనిచోట నొక్కనాఁడు. 1170

క. అంతట యమభటు లాయమ, నంతకపురమునకుఁ జేర్చి రతిశీఘ్రముగన్
గుంతములతోడఁ బొడుచుచు, గొంతుకకు బిగించి త్రాళ్లు గొని యీడుచుచున్.

గీ. అప్పుడు యముఁ డగ్నికుండంబులందు నిలిపి, ఖండఖండంబులుగఁ గోసి కాలదండ
ఘాతములపాలు చేసి యాకలుషవతిని, ఘోరనరకాంబునిధిలోనఁ గూలఁద్రోసె.

క. చిరకాలం బాయమ యా, నరకంబుల ననుభవించి నానావ్యథలన్
ధరణి జనించెను గడ కి, క్కరణి దివోదాసునకును గన్యక యగుచున్.

ఆ. ఆమె పూర్వజన్మమం దెన్ని గృహములు, గూల్చినదియొ పతులు గూలి రంత
మంది నేఁడు తనకు మాయనిదుఃఖంబు, గలుగఁ బూర్వకృతము గడవఁదరమె.

క. అనుటయు నుజ్జ్వలుఁ డిట్లని, యెను నాయన యట్టిపాఁగ యేసుకృతముచే
జననాథుఁ డగుదివోదా, సునకున్ జనియించినదియొ సుతయై చెప్పుమా. 1175

వ. అని యడుగుటయుఁ గుంజలుండు వానిం జూచి వత్సా మున్నొకసిద్ధపురుషుండు మహీమండలం బెల్లఁ గ్రుమ్మరుచు మార్గవశంబున నొక్కనాఁడు వారణాసీ పురంబునకుం జేరి యాతపబాధాపనోదార్థంబు దైవికంబుగా శీతలచ్ఛాయా వృతం బగునుపీరునిగృహద్వారంబునందు నిలువంబడుటయుఁ జిత్ర లోపలనుండి యరుదెంచి యమ్మహానీయుని భక్తిప్రణామపూర్వకంబుగా లోనికిం దోడ్కొని చని సముచితసపర్యం గావించి యన్నోదకంబు లర్పించె. సిద్ధుం డామెయుపచారంబులకు సంతుష్టమానసుండై యించుకకాల మచ్చట విశ్రమించి పిదప యథేచ్ఛం జనియె. 1176

క. ఆపుణ్యవిశేషముచే, నామెకు సమకూరె జన్మ మన్నోదకసౌ
ఖ్యోపేత మైనచోటను, బాపంబులు సేయ బుద్ధి పాఱనిచోటన్. 1177

గీ. అనుటయును నుజ్జ్వలుం డిట్టు లనియెఁ దండ్రి, పాపమాకన్య కిపుడు సంప్రాప్తమైన
శోకము తొలంగి సద్గతి చేకుఱంగఁ, గలయుపాయంబు సెప్పుము తెలిసెనేని.

వ. అని యడుగుటయును గుంజలుండు క్షణకాలం బాలోచించి వత్సా పూర్వజన్మ కృతపాపంబునం జేసి తిర్యక్త్వంబు ప్రాప్తించుటవలన నాజ్ఞానంబు నష్టంబయ్యె నైనను బావనం బగునీపాదపంబుసంసర్గంబువలనను దేవాప్రసాదంబువలనను నారాయణానుగ్రహంబువలనను నుపలబ్ధవిజ్ఞానుండ నగుటం జేసి నీయడిగిన ప్రశ్నంబునకుఁ బ్రత్యుత్తరంబు చెప్పంగలశక్తి యేర్పడియె. వినుము. 1179

క. మానును విష్ణుజ్ఞాన, ధ్యానవ్రతసంస్తవముల నఖిలాఘములున్
దానను గలుగును మోక్షము, కానంబడ దింతకంటె గతి తరియింపన్. 1180

వ. అని చెప్పుటయు నుజ్జ్వలుండు పరమాహ్లాదంబు నొంది తండ్రీ విష్ణుజ్ఞానధ్యానవ్రతస్తోత్రంబులస్వరూపంబు నిరూపింపు మని ప్రార్థించె. 1181

—: విష్ణుజ్ఞానధ్యానవ్రతస్తోత్రస్వరూపనిరూపణము :—

సీ. అంతటఁ గుంజలుం డానందమును జెంది, యతనిప్రశ్నమునకు నాత్మలోఁ
వత్స విష్ణుజ్ఞానవైభవంబునకు నీ, డైనవిజ్ఞాన మన్యంబు లేదు

దానిలో శోకంబు గాని హర్షము గాని, కామాదివికృతులు గాని లేక
నిస్పృహత్వంబును నిశ్చలత్వంబును, నిరహంకృతియును సంధిల్లు దానఁ
గీ. దైలము హరించి ధూమసంతతిని విడుచు, దీపము కొలంకనను నది పాపములను
నడఁచివిషయాభిలాషంబునవలఁద్రోయుఁ,దుదకువిష్ణుత్వమునునిచ్చునదియెచూవె.
క. హరియె సమస్తం బనియును, హరికంటెను లేదు చూడ నన్యం బనియుక్
హరి యనిన నేనె యనియును,నరసికొనుటె జ్ఞాన మదియె యభయము నొసఁగుక్.
వ. ఇంక ధ్యానంబు నిరాకారం బనియును సాకారం బనియును ద్వివిధంబు. 1184
సీ. హస్తవివర్జితుం డయ్యును గ్రహియించుఁ, బాదశూన్యుం డయ్యుఁ బరిచరించుఁ
గానంగఁబడు రూపు లేనివాఁ డయ్యును, నాస్యహీనుం డయ్యు నారగించు
నఘ్రాణుఁ డయ్యును నాఘ్రాణ మొనరించు,నయనముల్ లేకయుండియును జూచు
నాల్క లేకుండియుఁ బల్కుఁ గర్ణములు లే, నట్టివాఁ డయ్యును నాలకించు
ఆ. నగుణుఁ డయ్యు సగుణుఁ డగు నవశ్యుం డయ్యు,వశ్యుఁ డగును గోప్యవస్తు వయ్యు
సర్వ మగు నటంచు శార్ఙ్గి నెంచుటె నిరా, కార మైనధ్యాన మారయంగ.

సీ. పుండరీకంబులఁ బోలుకన్నులవాఁడు, రత్నసన్నిభదంతరాజివాఁడు
కరధృతశంఖచక్రగదాబ్జములవాఁడు, కంబుసమానకంఠంబువాఁడు
కేయూరకటకమౌక్తికహారములవాఁడు, బింబారుణాధరోష్ఠంబువాఁడు
శ్రీవత్సకౌస్తుభశ్రీవనమాలాప్ర, సాధితవిపులవక్షంబువాఁడు
గీ. కనకచేలుఁడు గరుడవాహనుఁడు దివ్య,కుండలకిరీటధరుఁడు మార్తండరుచియు
నైనహరిని భావించుటె యాత్మలోన, నగును సాకార మగుధ్యాన మాత్మజన్మ.
వ. ఇంక జయావ్రతంబును విజయావ్రతంబును జయంతీవ్రతంబును త్రిస్పృశావ్ర
తంబును వంజులీవ్రతంబును నఖండావ్రతంబును ద్వాదశీవ్రతంబును మనోరథా
వ్రతంబును నశూన్యశయనవ్రతంబును జన్మాష్టమీ అవ్రతంబును దిలగంధా
వ్రతంబును మున్నగు ననేకవిష్ణువ్రతంబులు సద్గతిదాయకంబులు గలవు. 1187
క. నామశతం బనెడిపరం, ధాముని స్తోత్రంబు వినిచెదను వినుము జగత్
క్షేమార్థ మది పఠించినఁ, గామితసిద్ధియును మోక్షగతియును గలుగుక్. 1188
వ. నామశతస్తోత్రంబునకు బ్రహ్మ ఋషి. అనుష్టుప్పు ఛందస్సు. ప్రణవంబు దేవత.
సర్వకామసంసిద్ధియందును మోక్షప్రాప్తియందును వినియోగంబు. 1189
సీ. కేశవునకు హృషీకేశునకును మధు, సూదనునకు దైత్యసూదనునకు
నారాయణునకును నారసింహునకును, విశ్వేశ్వరునకును విష్ణువునకు
మాధవునకు ననామయునకు విజయున, కనఘున కఘహర్త కచ్యుతునకు
శ్రీరామునకు సురార్చితునకు బ్రాహ్మణ, ప్రియునకు ధ్రువునకుఁ గృష్ణునకును

గీ. శ్రీపతికి శ్రీప్రియునకును శ్రీధరునకు, శ్రీమంతకు వామనునకు మహోదయునకు
హరికి యోగేశ్వరునకు జనార్దనునకు, యజ్ఞభోక్తకుఁ గలికి బ్రహ్మణ్యునకును.

సీ. విశ్వాత్మునకు సర్వవేత్త కనంతున, కేకరూపునకు మహేశ్వరునకు
సత్యంబునకు జ్ఞానసంపన్నునకు జ్ఞాన, దాయకునకు సర్వదాయకునకు
నానందమునకు విజ్ఞానంబునకుఁ బుణ్య, మునకు సాంఖ్యమునకు మోక్షమునకు
బ్రహ్మరూపునకు వ్యాప్తపరాపరునకును, బుష్కరాక్షునకును బుష్కరునకుఁ

గీ. బ్రియునకు జయంతునకు మురారికిని బద్మ, హస్తునకుఁ జంద్రవక్త్రున కజితునకును
యోగరూపునకును బురుషోత్తమునకు, వాసుదేవునకును శ్రీనివాసునకును. 1191

సీ. సర్వసౌఖ్యునకు వ్యాసధ్యాతునకు మహా, సౌఖ్యంబునకు మహాజ్ఞానమునకు
యజ్ఞంబునకును యజ్ఞాంగంబునకు యజ్ఞ, వర్ధనునకుఁ బుణ్యవాసునకును
వేదరూపునకును నాదిత్యునకు గుహా, వాసునకును సర్వవాసునకును
సర్వేశునకును శాశ్వతునకు సబలున, కసురారికిని మహాహంసమునకుఁ

గీ. బద్మనాభునకును బ్రజాపతికిఁ గామ, పాలునకు వేదవేదాంగపారగునకు
గోప్రియునకు ముకుందునకును గదాధ, రునకు గోవిందునకు క్షమారూపునకును.

సీ. వైకుంఠునకును ద్రిలోకనాథునకును, గోహితునకును వారాహునకును
ధరణీధరునకు విద్యావాసునకును సు, రేశ్వరునకును యోగీశునకును
శంఖపాణికి మహాజనునకుఁ బ్రత్యక్ష, దేవునకును మహాదేవునకును
బ్రద్యుమ్నునకును జగద్యోనికిని బురా, తనునకు మ్రొక్కెద ననుపదంబు

గీ. ననుచుఁ ద్రికరణశుద్ధితో ననుదినంబు, నామశతమును జపియించినను సమస్త
పాపములు భస్మమైపోయి పరమపదము, సంఘటిల్లును దేహావసానమందు.

వ. మఱియును నామశతంబును సమాహితమనస్కుండై త్రికాలంబులందును జపియించెనేని యశ్వమేధఫలంబును నేకాదశియం దుపవాసంబు గావించి జాగరంబున విష్ణుసాన్నిధ్యంబున జపియించెనేని పౌండరీకక్రతుఫలంబును దులసీసన్నిధానంబునం దుండి మానసికంబుగా జపించెనేని రాజసూయఫలంబును సాలగ్రామశిలయును ద్వారవతీశిలయును గలచోట జపియించెనేని మహాసౌఖ్యంబును నేకోత్తరశతకులోత్తారణంబును గార్తికమాసంబున వాసుదేవునిఁ బూజించి తత్సన్నిధానంబునఁ బఠియించెనేని విష్ణుసాయుజ్యంబును మాఘమాసంబున మాఘస్నానంబు చేసి మాధవుని నర్చించి తత్సన్నిధానంబునఁ బఠించినను జపించినను వినినను సురాపానాదిసర్వపాపనివృత్తియును విష్ణులోకప్రాప్తియును శ్రాద్ధకాలంబునందు బ్రాహ్మణభోజనసమయంబున వినిచెనేని పితృదేవతాసంతృప్తియుం జేకూరు. 1194

గీ. భూసురుఁడు వేదవిదుఁ డగు భూవరుండు
విజయి యగు వైశ్యుఁ డైశ్వర్యవృద్ధిఁ గాంచు
నవరజుఁడు సుఖి యగుచు జన్మాంతరమున
విప్రుఁడై పుట్టు స్తోత్రంబు వినియెనేని. 1195

గీ. అనుటయునునుజ్జ్వలుఁడుతండ్రియడుగులకును, నెఱఁగివచ్చినత్రోవ నెయేఁగి మరల
సర్వతోభద్రపర్వతసానులందుఁ, గుతిలపడుచున్న యారాజసుతను గాంచి. 1196

గీ. అంబుజేక్షణ నీకు సంప్రాప్త మైన, యాపదను విని గుండె నీరయ్యె నాకుఁ
గావలయునేని యొకయుపకార మేను, జేసెదను నీకు నిచింత వాసిపోవ. 1197

చ. అనుటయు నామె విస్మయము నంది శుకం బిది గాదు నన్నుఁ గా
వను దయచేసినట్టిభగవంతుఁడె యంచుఁ దలంచి యాత్మ ని
ట్లనియెను బక్షిరాజ శరణాగత నై తిని దిక్కులేనిదా
నను నను నుద్ధరించిన ననాథను బ్రోచినపుణ్య మబ్బెడిన్. 1198

చ. అనవుడు నుజ్జ్వలుండు తనయయ్య వచించినసూక్తు లామెకున్
వినిచి యథాక్రమంబుగను విష్ణుసపర్య లొనర్ప నంతకం
తెను భవదార్తిభారమును డించునుపాయము లేదు నాఁగ నా
వనజదళాయతాక్షి శుకవాక్యము నమ్మి మనంబులోపలన్. 1199

క. హరిసంస్తవవ్రతాద్యుప, కరణంబులచేత సేవ గావించుటయున్
బురుషోత్తమునకు నాతఁడు, పరమానుగ్రహముతోడఁ బ్రత్యక్షము గాన్.

క. ధరణీంద్రపుత్రి విస్మయ, భరితాంతర యగుచు నిలువఁబడుటయు దామో
దరుఁ డామెను గని కోరుము, వర మిచ్చెద నేను భక్తివశ్యుఁడ ననియెన్.

ఉ. అంతట నావధూమణి జనార్దన నిన్ గనినంతలోన నా
స్వాంతమునందు నున్నభవవాంఛ సమస్తము దీఱె దాన నీ
చెంత వసించి త్వచ్చరణసేవ యొనర్చెడిభాగ్య మిమ్ము నా
కంతటికంటెఁ గోరఁ దగినట్టివరంబులు లేవు నావుడున్. 1202

గీ. అట్లె యగుఁ గాక యని పల్కి యచ్యుతుండు
పొందుటయును నంతర్ధానమును సమస్త
జనులు చూచుచునుండఁగాఁ దనువుతోడఁ
జనియె నాకన్యయును విష్ణుసదనమునకు. 1203

గీ. అరుగుటయును దివ్యాదేవి యద్భుతముగ, హరిపురంబున కుజ్జ్వలుఁ డరుగుదెంచి
యచట జరిగినయట్టివృత్తాంత మెల్ల, వినయమునఁ గుంజలునియొద్ద విన్నవించె.

వ. అంతఁ గుంజలుండు ద్వితీయపుత్రుం డగుసముజ్జ్వలునిం గాంచి వత్సా నీ వేఁగిన
చోట నెచ్చటనేని యదృష్టచరంబును నశ్రుతచరంబును నగువిశేషంబు గోచ
రించెనేని వచియింపు మని పలుకుటయు సముజ్జ్వలుం డి ట్లనియె. 1205

—:హంసచరిత్రము:—

క. అరిగితిని దండ్రి హిమవ, ద్గిరి కే నీనాఁడు దానిదివ్యాకార
స్ఫురణంబు చూడఁ జూడఁగఁ, బరమాశ్చర్యంబు గలిగె భావములోనన్.

క. కనఁబడియె నందు మానస, మనియెడిహ్రద మొకటి యచట నత్యద్భుతమున్
గనుఁగొంటి నేమి చెప్పుదుఁ, గనవలయును గాని తృప్తి గలుగదు వినినన్.

వ. అచ్చటి కరువదినాలుగు కృష్ణహంసంబులతోడం గూడికొని నాలుగు మహా కృష్ణహంసంబులు సంభ్రమంబున నేతెంచి తత్సరోవరజలంబున మునుంగు చుండ రౌద్రాకారంబులును నూర్ధ్వకేశంబులును గృష్ణవర్ణంబులును నగు నాలుగు పెంటియంచలు వాని వెంటనంటి వచ్చి తత్తటంబునందు నిలిచి వానిం జూచి పరిహాసించుచుండె. అంతట నమ్మానసతీర్థంబులోనుండి ఖిన్నవదనంబు తోడ నొక్కకృష్ణహంసంబు పైకిం జనుదెంచుటయు దానివెంటన యాయష్ట షష్టిహంసంబులును జనుదెంచె.

ఆ. అప్పు డొక్కభిల్లుఁ డచటికిఁ జనుదెంచి, భానుబింబ మనెడిపగిది నొప్పు
దివ్యతనువుతోడఁ దేజరిల్లుచు నుండె, నంచ లెల్లఁ జూడ నద్భుతముగ. 1209

ఆ. అంత నతనిభార్య యన్నంబు గైకొని, వచ్చి చూచి వాని నచ్చెరువుగఁ
గాఁడు వీఁడు నామగం డెవ్వఁడో దివ్య, పురుషుఁ డనుచు నెంచి పోవుచుండ.

క. కనుఁగొని యామె నతం డి, ట్లనియెను సతి యేల పోయె దవలకు నీభ
ర్తను నేను నీనిమిత్తము, కనుచుంటిని రమ్ము క్షుధను గడవఁగఁ జాలన్. 1211

సీ. అనుటయు నాభిల్లి యతనియొద్దకు వచ్చి, యీవె నాపతి వైన నిట్టిరూపు
నీ కేరుపడుటకు నేకారణమొ చెప్పు, మని యడుగుటయు ని ట్లనియె నతఁడు
మానిని మృగయాశ్రమంబుచే నత్యంత, తాపంబు గలిగె నాతనువునకును
దానిచేతను నర్మదాసంగమమునందు, మునిఁగితి దైవికంబుగను నేను

గీ. దానిచే నాకురూపంబు మానిపోయి, ప్రాప్తమయ్యెను దివ్యరూపంబు నాకు
నమ్మహానదిసంగమమందు నింక, నెంతటిప్రభావ మున్నదో యెఱుఁగ రాదు.

చ. అనుటయు భిల్లి సాధ్వి యయినట్టికతంబున వానితోడ ని
ట్లనియెను నీప్రసంగము యథార్థమొ కాదో యెఱుంగ నాస్థలం
బున కరుదెమ్ము తోడుగను బోవుద మిప్పుడె తత్ప్రభావముం
గనుఁగొనుదాఁక నామదికిఁ గల్గదు నమ్మక మెంత చెప్పినన్. 1213

గీ. అనుటయును మంచి దని భిల్లుఁ డామెతోడ
బయలుదేఱుటయును వెంట బయలుదేఱె
నంచ లెల్ల నాచిత్రము గాంచ నెంచి
యేఁగితిని వానితోడనె యేను గూడ. 1214

గీ. సత్వరముగను మే మెల్ల సాఁగుచుండఁ, బెంటిచుంచలు నాల్గును భీతితోడఁ
దడఁబడుచునుండఁ గాళులుదడలుపుట్ట, నడఁకుచును నెట్లొ మా వెన్క వచ్చుచుండె.
ఆ. అంతఁ గొంత దూర మరుగుటయును గానఁ, బడియె రేవ నేత్రపర్వముగను
దక్షిణంబునందు తత్సంగమస్థలం, బునకు భిల్లుఁ డేఁగెఁ బోలఁతితోడ. 1216
ఆ. ఏఁగి యింతి మునుఁగు మీతీర్థమందు నా, చెప్పినట్టిమాట తప్పొ యొప్పొ
తెలియఁగలదటంచుఁ బలుకుటయును నామె, యాపుగూడ మునుఁగు మిచట ననియె.
గీ. అంత నాయిద్దరును గూడ నచట మునిఁగి, దివ్యతనువులతో లేచి దేవయాన
మునునధిష్ఠించి యాకాశమునకుఁ జనిరి, గనులు మిఱుమిట్లుగొన మేము గాంచుచుండ.
గీ. అప్పు డేకోనసప్తతిహంసములును, నందులో మున్గి దివ్యదేహములతోడ
నాల్గుదెసలకుఁ జనుటయు నీల్గి పడియె, నొక్కపరిఁ బెంటిచుంచ లాయెక్షణంబు.
గీ. తండ్రి హంసలపూర్వవృత్తముల నెల్ల, వినఁగ నామదిలోపల వేడ్క గలిగెఁ
దెలుపఁదగు నేని తెలుపుము తెలిసికొందు, ననుటయును గుంజలుండిట్టులనియె నపుడు.
క. వినుమయ్య వత్స విదురుం, డనఁగను బాంచాలదేశమం దొకఁ డుం
డెను మున్ను ద్రవ్యలోభం, బున నాతఁడు సంహరించె భూసురు నొకనిన్.
సీ. సమయించి యాపాతకమును మాపికొనంగ, నర్జించి తిలకము వదనమందుఁ
ద్యజియించి శిఖయు సూత్రమును బ్రహ్మఘ్నుఁడ, నని చాటుకొనుచును ననుదినంబు
ప్రతిగృహంబున కేఁగి భైక్షంబు గొనుచును, దీర్ఘంబు లన్నియుఁ దిరిగి తిరిగి
విసు వొంది తుద నొకవృక్షంబుకడఁ జేరి, యేదిక్కుఁ గానక యేడ్చుచుండె
గీ. నచ్చటికి వచ్చె నొకవిప్రుఁ డాత్మచిహ్న, వర్జితుఁడు దగ్ధదేహుఁ డవ్వానిఁ గాంచి
విదురుఁ డిట్లని పలికె నీవిధముఁ జూడ, నెవ్వఁడవొ పాపి వని తోఁచె నెఱుఁగఁ జెపుమ.
గీ. అనుటయును నేను జంద్రశర్మాభిధుండ, బ్రాహ్మణుండను గురుఘాతపాతకమున
నిట్టిగతి పట్టె నాకు నే నేడ్చుచుంటి, నేల నీ వేడ్చుచుంటివో యెఱుఁగఁ జెపుమ.
క. అనవుడు విదురుఁడు తనగా, థను జెప్పుచు నేడ్చుచుండు తరుణంబున వ
చ్చెను వేఱొకపాపాత్ముఁడు, వనరుచు నచ్చటికిఁ బ్రేతవదనముతోడన్. 1224
క. ఆపాపు లిరువురును నపు, డాపాపిని జూచి యిట్టు లని రెవఁడవు నీ
వీపగిది వనరుచుంటకు, నేపాపము చేసినాఁడ వెఱుఁగం జెపుమా. 1225
ఆ. అనుడు నాతఁ డిట్టు లనియెను నను వేద, శర్మ యందు రగ్రజాతివాఁడఁ
గలిగె నిట్టిగతి యుగమ్యాగమనమహా, పాతకమున నాకుఁ బాపులార. 1226
గీ. తిన్న చోటను దిననీయ దున్న చోట, నుండనీయదు నాపాప ముర్వి యెల్లఁ
దిరుగుచున్నాఁడ మతి లేక దేవుఁ డెఱుఁగు, నాయవస్థను జావైన నాకు రాదు.
ఆ. అనుచుఁ జెప్పుచుండ నరుదెంచె వేఱొక, పాపి యటకు ఖిన్నభావమునను
నతనిఁ జూచి వార లడిగిరి నీకథ, చెప్పు మేమి చేసి చెడితొ యనుచు, 1228

గీ. అంతటను నామహాపాపి యశ్రుధార, గాఱుచుండఁగ బోరనఁ గనులనుండి
నైశ్యుఁడను నేను నాపేరు వంజులుండు, చెప్పఁగూడనిపాపముల్ చేసినాఁడ.

క. త్రావితిని సురను జంపితి, గోవుల నాపాతకములు గూడుకొని మహా
దావానలంబు గాల్చిన, కైవడి నిలువునను నన్నుఁ గాల్చుచు నుండెన్. 1230

గీ. ఏమిచేయుదు నే నింక నెటకుఁ బోదు, బాధ పడఁజాలఁ బ్రాణముల్ వాసిపోవు
కర్త్రి కుడుపును చేసినకర్మ మనెడి, పలుకులోఁ గలయర్థ మిప్పటికిఁ దెలిసె.

క. అని పలికి యేడ్చుచుండుట, యును నామువ్వురును వాని నూరార్చిరి మే
మును ఘాతకులమె తీఱదు, మనదుఃఖం బేడ్చినంతమాత్రన యనుచున్. 1232

గీ. అంతటను నల్వురను గూడి యఘవిముక్తి
యగునుపాయంబు నరయుచు నడవులందుఁ
గొండలందును దిరుగుచుఁ గొట్టకొనకుఁ
జనిరి కాలంజరం బను శైలమునకు. 1233

క. చని యచట నొక్కసిద్ధునిఁ, గనుఁగొని ప్రణమిల్లి పాతకంబులు తొలఁగం
గను గలమార్గము మాకున్, వినిపింపుము తండ్రి యనుచు వేఁడుకొనంగన్.

గీ. అతఁడు దయతోడ వారి కిట్లనియెఁ బుష్క, రము ప్రయాగము సర్వతీర్థంబు వార
ణాసి యనునాల్గు దక్క నన్యంబు లేదు, రూపుమాపంగ మీమహాపాపములను.

వ. మున్ను సహస్రాక్షుం డగమ్యాగమనబ్రహ్మహత్యామహాపాతకదూషితుండై
తీర్థముల నెల్ల రావించి మత్పాపపరిహారంబు గావింపఁగలతీర్థం బెయ్యది యని
యడుగుటయు నాతీర్థంబు లెల్ల నాతనిం జూచి దేవా బ్రహ్మహత్యాదిమహా
పాతకంబులు రూపుమాప వారాణసీప్రయాగపుష్కరసర్వతీర్థంబులు దక్క నే
మెవ్వరమును సమర్థులము గాము. భగవంతుం డుపపాతకవినాశనంబునందు
సామర్థ్యంబు మా కొసంగె నని పలుకుటయు దేవేంద్రుండు నానాలుగుతీర్థంబు
లందు విధియుక్తంబుగా స్నానంబు సలిపి మహాపాతకవిముక్తుండై యాతీర్థంబు
లకుఁ దీర్థరాజత్వంబుఁ బ్రసాదించె. 1236

గీ. కావునను మీర లేఁగి యక్కడను సోమ, వారసంయుక్త మగునమావాస్యనాఁడు
గంగలో స్నాన మొనరింపఁ గలిగెనేని, పాయు నాక్షణమంద మీపాతకములు.

గీ. అనుటయును వారు కొండంతయాసతోడ, నరిగి సిద్ధుఁడు చెప్పిన ట్లాచరింప
దుష్కృతములన్నియునుగూడఁదొలఁగివారి, కద్భుతముగనుదివ్యదేహములుగలిగె.

వ. అంతట బ్రహ్మహత్యాదిమహాపాపంబు లాతీర్థంబులకు సంక్రమించుటయు
నాతీర్థంబులు నాలుగును దత్పాపవశంబున మహాకృష్ణహంసాకారంబులం
బడసె. నీవు చూచిననాలుగుమహాకృష్ణహంసంబు లమ్మహాతీర్థంబులుగా నెఱుం
గుము. అంతట నమ్మహాకృష్ణహంసంబులు దత్పాపభారంబు సైఁపం జాలక

పాపవిముక్తి కై యఱువదినాలుగుతీర్థంబులలోఁ గ్రుంకుటయుఁ దత్ప్రకసం క్రాంతివశంబున నాతీర్థంబులు నీవు చూచినయఱువదినాలుగుకృష్ణహంసంబులుగా నయ్యె నని యెఱుంగుము. ఆహంసంబు లన్నియును మానససరస్సునం గ్రుంకుటయు నందుండి ముందు ఖిన్నవదనంబుతోడం జనుదెంచినకృష్ణహంసంబు మానసతీర్థంబుగా నెఱుంగునది. నీవు కాంచినదివ్యరూపంబులు నర్మదోత్తర కూలంబునందు నర్మదాకుబ్జాసంగమంబునం గ్రుంకుటం జేసి కృష్ణహంసాకారంబులు తొలఁగి స్వస్వరూపంబులం దాల్చినతీర్థంబులుగా నెఱుంగునది. తీర్థంబులందు మునింగెడియంచలం జూచి యింతమాత్రమునకె మహాపాపంబులు తొలంగునా యని పరిహసించుచు నచ్చి వచ్చి తుదకు రేవాతీరంబునం బడి చచ్చిన కృష్ణహంసంబులు బ్రహ్మహత్యాదిమహాపాతకంబులుగా నెఱుంగునది. 1239

గీ. నర్మదాకూలములు రెంటినడుమ నెచట, నైన నొకసారి మునిఁగిన నదియె చాలు నఘములను నెల్ల మాయించి యశ్వమేధ, ఫలము నీయంగ నిఁక వేయిపలుకులేల.

ఆ. ఎంతవఱకు రేవ దృగ్గోచరము గాదొ, యంతవఱకె క్రాలు నన్నినదులు గౌరవంబు గలిగి గర్జించుచుండును, నన్నితీర్థములును నంతవఱకె. 1241

వ. అని తెలిపి కుంజలుండు తృతీయపుత్రుం డగువిజ్వలునిం గాంచి వత్సా నీ వేఁగిన దేశంబులందు నీకు గోచరించినయపూర్వం బేదియేని కలదేని వచియింపు మని పలుకుటయు విజ్వలుం డి ట్లనియె. 1242

ఆ. తండ్రి మేరుపర్వతముమీఁద నానంద, వనము నాఁగ నొక్కవనము గలదు దానినడుమఁ జూడఁ దగినరూపముతోడ, నలరుచుండు నొక్కహ్రదము గలదు.

క. రతిమదనులఁ బోలెడిదం, పతు లిరువురు చనుచు వ్యోమమార్గంబున నే కతముననొ దిగి విమానము, నతిశీఘ్రుంబుగను వచ్చి రాహ్రదమునకున్. 1244

గీ. వచ్చి స్నానము చేసి తద్వారియందుఁ, దటమునకుఁ జేరి చూచి యచ్చటను దమకు సాటి యగురూపమున నున్నశవయుగంబు, దాల్చి ఖడ్గంబులను వానిదరికిఁ జేరి.

ఆ. ఆఁడుదానిశవము నాఁడుది పురుషుని, శవముఁ బురుషుఁడును నశంకముగను గోసి తినుచు నుండ నాసమయంబున, నరుగుదెంచి యిరువు రాఁడువాండ్రు.

క. వారలను జూచి నవ్వుచు, సారెకు నేమేమొ నుడువసాగిరి నడుమం జేరి మఱియొక్కయిరువురు, మూరులువలెఁ దొడఁగి రఱవ మూకిడు మనుచున్.

గీ. అంత నాదంపతులు దిని యాశవంబుఁ, దృప్తిదీర విమానము నెక్కి మరల నేఁగి రొకనాఁడు మున్నట్లె యింతవఱకు, జరుగుచున్నది ప్రతిదివసమును దండ్రి.

ఆ. అచటి కేఁగుచుంట నాహారమున కేను, గనులఁ గాంచుచుంటి ననుదినంబు వార లార్వు రెవరొ యారీతి వాదంట, కేమి కారణంబొ యెఱుఁగఁ జెపుమ.

గీ. అనుటయును గుంజలుం జిట్టు లనియె వత్స, కర్మ మన్నిటికిని గూడఁ గారణంబు
పుణ్యకర్మంబునను దేహి పొందుసుఖము, గాంచును విషాదమును పాపకర్మమునను.

సీ. కనుఁగొని స్థూలసూక్ష్మము లైనధర్మముల్, శాస్త్రవిజ్ఞానలోచనముచేత
గర్మంబు నొనరింపఁగాఁ దగు జంతువు, సలుపఁగా రా దవిచారముగను
నెట్టివిత్తనమును బెట్టునో భూమిలోఁ, గాంచు నట్టిఫలంబె కర్షకుండు
కావించునో యెట్టికర్మ మట్టిఫలంబె, యనుభవించును దేహి యైనవాఁడు

గీ. కాన బంధు వైనఁ గర్మమె కర్మమె, శత్రు వైన సకలజంతువులును
గర్మచోదనమునఁ గాంచుచుందురు సుఖ, మైనఁ గాని దుఃఖ మైనఁ గాని. 1251

గీ. కర్షకుఁడు కృషిఫలమును గాంచునట్లు, కర్త కర్మఫలంబును గాంచుచుండుఁ
దాను గల్పించుకొనినదె కాని దుఃఖ, మేని సుఖమేనియును నన్యకృతము గాదు.

గీ. కరువునను బద్ధ మగుకనకద్రవంబు, పగిదిఁ గర్మంబునను దేహి బద్ధుఁ డగును
గర్మవశులము మన మెల్లఁ గర్మముననె, కలుగుచుండును సృష్టులు ప్రళయములును.

—: సుబాహురాజచరిత్రము :—

గీ. క్ష్మాతలంబునఁ జోలదేశంబునందుఁ, బ్రభు వొకండు గలండు సుబాహు వనఁగ
నతఁడు హరిభక్తుఁ డమితధైర్యాన్వితుండు, ధర్మపరిపాలనక్రియాతత్పరుండు.

ఆ. అఖిలగుణసమేతుఁ డయ్యును నా ఱేఁడు, దానవిముఖుఁ డగుచు ధరణి నేలు
చుండఁ దత్పురోహితుం డగుజైమిని, యొక్కనాఁడు వానియొద్దఁ జేరి. 1255

క. మానవలోకాధీశ్వర, దానమునకు సాటి యైనధర్మము నెందున్
గానము గావునఁ జేయుము, దానములను బాత్రు లైనధరణిసురులకున్.

సీ. కొందఱు పఠియించుచుందురు విడిచి ని, ద్రాహారములను ద్రవ్యంబుకొఱకుఁ
గొందఱు సేవించుచుందు రల్పులనేని, యవమాన మనక ద్రవ్యంబుకొఱకుఁ
గొందఱు కృషి చేయుచుందురు శ్రమ యెంత, యైనను సైఁచి ద్రవ్యంబుకొఱకుఁ
గొందఱు కావించుచుందురు చేయరా, నట్టిపాపములు ద్రవ్యంబుకొఱకుఁ

గీ. గొంద ఱడవులలోఁ జొచ్చుచుంద రబ్ధు
లందుఁ గొందఱు పడుచుందు రర్థమునకుఁ
బ్రియము లగుప్రాణములు గూడఁ దృణములట్లు
విడుచుచుందురు కొందఱు విత్తమునకు. 1257

గీ. కాన బహుళశ్రమార్జిత మైనధనము, నంత మొందింపకుండ నిరర్థకముగ
నర్పణముచేసి సత్పాత్రమందు బుధులు, శ్రద్ధతో నిల్పికొందురు శాశ్వతముగ.

క. దానము లనేకములు గల, వైనను బ్రాణులకు నైహికాముష్మికసౌ
ఖ్యానువిధానచణం బగు, దానము లే దన్య మన్నదానముకంటెన్. 1259

క. ఒకకబళమేని బ్రాహ్మణున, కకు ననుదినమును నొసంగినను నది శ్రీకాం
పక యేనాఁడును దాతకు, నొకటికిఁ బదిరెట్లు ఫలము నొసఁగుచు నుండుఁ.
గీ. అన్నదానంబు చేయలేకున్న యెడలఁ, బ్రతిదినంబును నొక్కపర్వమున నైన
నన్నమును విప్రునకుఁబెట్టునతని కొదవు, ననుదినంబును భుక్తి జన్మాంతరమున.
గీ. జన్మమున నొక్కపరి యైనఁ జలిపెనేని, పాత్రునకు నన్నదానంబు భక్తితోడఁ
ద్రిదివమునఁ గ్రోలుచుండును దృప్తిదీరఁ, బ్రతిదినంబును నమృతధారల నతండు.
గీ. అన్నమునె ప్రాణ మనియెద రార్యులెల్లఁ, బ్రాణమున కన్న మాధార మైనకతన
నన్నదానంబు గావింపు మవనినాథ, కలుగుఁ బ్రాణంబొసంగినఫలము నీకు.
గీ. అనుటయును జైమినికి నిట్టు లనియె నతఁడు
స్వామి నీచెప్పినట్టులె సలుపువాఁడఁ
గాని యొకప్రశ్న మడుగంగఁ గాంక్ష గలిగె
ననుటయును జైమిని నరేంద్ర యడుగు మనియె. 1264
గీ. అంతట సుబాహు వతని కిట్లనియె స్వామి, స్వర్గ మొదవును దానంబువలన నంటి
వట్టిస్వర్గంబునను గలయట్టిగుణము, లేవొ దోషము లేవొ నా కీవె చెపుమ.
గీ. అనుటయును బ్రాహ్మణుం డిట్టు లనియె భూప
క్రూరులు కృతఘ్నులును నాస్తికులును దురభి
మానులును జోరులును నసంభావితులును
లోభులును లేరు నిర్జరలోకమందు. 1266
క. అమరులకు క్షుత్పిపాసలు, శ్రమమును గ్లానియును శైత్యసంతాపవిషా
దములును వార్ధకమును రో, గములును శోకమును మృతియుఁ గలుగవు భూపా.
సీ. కామయానము లైనవ్యోమయానంబులు, సమకూర్చు లోకసంచారసుఖము
నానందమునఁ దేల్చు నతిలోకసౌందర్య, యుత మైనయప్సరోయువతిజనము
నీప్సితంబుల నెల్ల నీడేర్చు నఖిలార్థ, దము లైన దేవతాతరువు లైదు
భూరితేజంబునఁ బొలిచెడిదివ్యదే, హంబులు బహువిస్మయంబు గొలుపు
గీ. సర్వసంపత్సమృద్ధియు సత్యమార్గ
వర్తనంబును ధర్మసంవర్ధనమును
నమృతభోజనమును మహాహ్లాద మొసఁగుఁ
ద్రిదివమున నుండుగుణములు దెలుపఁ దరమె. 1268
గీ. ఎంతదోషమొ యమరుల కేమి చెప్ప, నిచట నార్జించుకొనినది యెల్ల నచట
ననుభవింపఁగఁ జేసి యనంతరంబ, నెట్టుదురు భూమిపైఁ బడునట్లు లధిప. 1269
గీ. పరులయౌన్నత్యమును సహింపమిని గొప్ప
కార్యముల కెన్నొ యెన్నొ విఘ్నములు సేయఁ

గడఁగుచుండెద రనుచు లెప్పఁగను గూఁడ
లోటు గాదొక్కొ యది స్వర్గలోకమునకు. 1270

చ. అనుటయు భూవరేణ్యుఁ డనఘా త్రిదివంబున కిట్లు దోషముల్
వినిచితి వెట్టిదోషములు లేనిపదం బెది యేని యున్నచో
వినిచెదవేని నాకు విన వేడుక యయ్యెడు నాఁగ నాతఁ డి
ట్లనియెను దేవ బ్రహ్మభువనాదులకుం గల విట్టిదోషముల్. 1271

గీ. కావుననె కోరరు యథార్థభావవిదులు, ప్రాకృతులుపోలె స్వర్గాదిలోకములను
నొకటిమాత్రము కోరుదు రున్నవాని, కన్నిటికిఁ గూడ నూర్ధ్వ మైయున్నపదము.

గీ. అదియె విష్ణుపదంబు బ్రహ్మంబు నాఁగ, నదియె జ్యోతి యనంగను నదియె భూప
జ్ఞానహీనులు దానిని గానలేరు, ధ్యానయోగనిరస్తపాతకులు దక్క. 1273

—: సుబాహు జైమిని సంవాదము :—

గీ. అనుటయును నాసుబాహుఁ డిట్లనియె స్వామి, కర్మ మొనరింపనేల యాకర్మమునకు
ఫలముగా నుండుస్వర్గము వడయ నేల, పడసి స్వర్గంబు కడ కధఃపతన మేల.

గీ. కానఁ బంకంబులోఁ బడి కడుగుకొనుట, కంటె దానిని స్పృశియింపకుంటె మేలు
దాన మొనరింప నుత్తమధ్యానయోగ, మునను విష్ణుపదంబు చేకొనుదు నేను.

సీ. అని పల్కుటయును జైమిని యిట్లు లనియె రా, జేంద్ర నీపల్కిన దెల్ల నిజము
కాని దానంబును గావింపకున్నచో, క్షుత్పిపాసాబాధ క్షోభపఱుచు
నాక్షోభమున జ్ఞాన మాచ్ఛాదితం బగు, దానిచేతను సిద్ధి కానరాదు
జ్ఞానయోగము గాని ధ్యానయోగము గాని, యూర్జితం బగు దానయోగముననె

గీ. కావుననె మున్ను జ్ఞానము గలిగినట్టి, భూధవులు యజ్ఞములు యాగములును దాన
ములును ధర్మంబులును బెక్కు సలిపి తుదకుఁ, బడసిరి సుఖంబుగను విష్ణుపదము నధిప.

గీ. మునులు సైతము భిక్షాన్నమునను బ్రాహ్మ
ణునకు నొకభాగమును ధేనువునకు నొక్క
భాగమును బార్శ్వవర్తికి భాగ మొకటి
యును నొసంగుదు రొందంగ నూర్ధ్వపదము. 1277

క. కావున నిష్కామంబుగఁ, గావింపుము దానములను గలుగును దానన్
గైవల్యంబు సుఖంబుగఁ, గావింపనియెడల సిద్ధి గలుగదు భూపా. 1278

గీ. అనుటయు సుబాహుఁ డతని కిట్లనియె స్వామి, ధ్యానయోగంబుచేత ననారతంబు
వాసుదేవుని భజియించువాని కితర, సాధనము లేల సద్గతి సంఘటిల్ల. 1279

క. అని పలికి యాసుబాహుఁడు, మనమున ధ్యానించుకొనుచు మాధవుని సతం
బును దుదకుఁ గాలధర్మం, బును జెందుట నరిగి విష్ణుపురమున కంతన్. 1280

—: వైకుంఠగతుఁ డయ్యును సుబాహుఁడు దానము చేయమిని క్షుద్బాధను జెందుట :—

సీ. తనముందు నాట్యంబు లొనరించుచున్నను, నప్సరోవనిత లత్యద్భుతముగఁ
దనకంఠమును బుష్పదామంబుల నలంక, రించుచున్నను గిన్నరీజనంబు
దనప్రక్కలను జేరికొని స్తోత్రపాఠముల్, గావించుచున్నను దేవసమితి
దనముందలను నిల్చికొని పాడుచున్నను, గంధర్వ లక్ష్మముల్ గరఁగునట్లు

ఆ. లొక్కటియును జూడకుండ నాఁకలిబాధ, వలన నెచటఁ గూడ నిలువలేమిఁ
దిరుగఁజొచ్చె భార్య తిరుగంగ వెనువెంట, నెట్టనోలె నగరవీథులందు. 1281

ఆ. అట్లు తిరిగి తిరిగి యాకస్మికంబుగ, నరిగి యొక్కతాపసాశ్రమమున
కచట వామదేవుఁ డనుతపస్విని గాంచి, నమ్రుఁ డగుచు వందనం బొనర్చె.

క. హరి తనకుఁ గానరామియు, భరియింపఁగ లేనిక్షుత్పిపాసలవలనన్
బరితాప మొదవుటయు న, ప్పరమర్షికి విన్నవించె భయభక్తులతోన్. 1283

ఆ. విన్నవించుటయును విని వామదేవుఁడు, యోగదృష్టి నతనియోగ మెల్లఁ
గాంచి యిట్టు లనియె క్ష్మానాథ చేసిన, కర్మమునకుఁ దగినగతియె కలిగె.

ఆ. మానసంబునందు ధ్యానించితివి గాని, పరమపురుషు నెంతొ భక్తితోడ
నళినలోచనునకు నైవేద్య మొనరింప, వైతి వొక్కఫలము నైనఁ దుదకు.

గీ. దశములందును నేకభక్తములు చేసి, చేసి తేకాదశుల నుపవాసములను
గాని ద్వాదశులం దొక్కకబళమేని, యొక్కనాఁడును విప్రున కొసఁగ వైతి.

ఆ. అన్న మమృతరూప మమృతంబు బ్రాహ్మణ,హస్తమందు నుంచినట్టు లైనఁ
గలుగుఁ దృప్తి దేవతలకును గలుగును, బితరులకును దృప్తి క్షితితలేంద్ర. 1287

గీ. అతిథులు భుజింప శేషించినట్టియన్న, మమృతమని చెప్పఁబడియె నయ్యది భుజించి
నట్టివారికిఁ దృష్ణయు నాఁకలియును, గలుగనేరవు పుణ్యలోకంబులందు. 1288

గీ. ధర్మసుత సుమి శ్రద్ధ యద్దానివలనఁ, గాంచి రూర్ధ్వపదంబు నకించనులును
జేసినను గోటిదానముల్ చెందలేఁడు, శ్రద్ధ లేనట్టివాఁడు శాశ్వతసుఖంబు.

గీ. అవ్యయానంద మనెడునన ర్ఘఫలము, ననుభవింపంగ వాంఛించునట్టివాఁడు
భూసురుం డనుసుక్షేత్రమునను నాఁట, వలయు దానము లనుబీజములను భూప.

గీ. ఫలముపై వాంఛ గలకృషీవలుఁడు భూమి
నొక్కక్షణమును నెడఁబాసి యుండనట్లు
పరమపదకాంక్షి యగువాఁడు పాత్రుఁ డైన
బ్రాహ్మణుని వీడి యుండఁ డెప్పటికిఁ గూడ. 1291

గీ. చెడ్డపని చేసి మేలును జెందఁబోఁడు, మంచిపని చేసి కీడును గాంచఁబోఁడు
నింబమును నాఁటి చూతఫలంబు గొనునె, నింబఫలమును గొనునెచూతంబు నాఁటి.

గీ. దాన మొనరింపకున్నఁ బాత్రం బెఱింగి, కలుగ నేరదు తద్దానఫలము భూప
చేయకుండిన యెడలను క్షేత్ర మెఱిఁగి, బీజవాపంబు గలుగునె బీజఫలము.

గీ. అమృతసన్నిభ మైనయన్నమున మేను, పెంచుకొంటివి కండలు పెరుఁగునట్లు
పట్టెఁ డన్నంబు నైనను బెట్టవైతి, పాత్రుఁ డైనట్టివానికిఁ బార్థివేంద్ర. 1294

క. కలిగియును భూరిసంపద, గలిగియును హితంబు చెప్పఁగలిగిన పెద్దల్
తెలిసికొను తెలివి గలిగియుఁ, జలుపక దానంబు చెడితి సర్వవిధములన్. 1295

గీ. దేవతలు పితరులును భూదేవతలును, క్షేత్రరూపంబు లనుచును జెప్పఁబడిరి
కాన వా రిచ్చుచుందురు కాల మెఱిఁగి, దత్త మైనట్టిదానికిఁ దగినఫలము.

ఆ. జననమరణములకు సౌఖ్యదుఃఖములకుఁ, గారణంబు స్వకృతకర్మ మొకఁడె
కాన నధిప నీవు గావించియుండిన, కర్మముననె యిట్టికర్మ మొదవె. 1297

క. నారాయణుని మనంబున, నారాధించితివిగాన నద్దానను నె
వ్వారికి దొరకనివైకుం, ఠారోహణఫలము ప్రాప్తమయ్యెను నీకున్. 1298

ఆ. పాపకర్మమునకుఁ బాపఫలంబును, బుణ్యకర్మమునకుఁ బుణ్యఫలము
గలిగె నీకుఁ బూర్వకర్మఫలంబుల, ననుభవింప కుండ నగునె యధిప. 1299

గీ. అనుటయును ఱేఁడు భయకంపితాంగుఁ డగుచు
క్షుత్పిపాసావిషాదంబు సోఁకకుండ
శాశ్వతపదంబునను నిల్పఁ జాలినట్టి
పుణ్యకార్యంబు లేవొ తెల్పుము మహాత్మ. 1300

క. అని వేఁడుకొనుటయును న, మ్మునివరుఁ డి ట్లనియె లోకమున కుపకారం
బొనరించెడినీప్రశ్నం, బునకున్ సంతోష మయ్యె భూతలనాథా. 1301

వ. అన్నదానంబును నుదకదానంబును నుదకపాత్రదానంబును భూదానంబును గోదానంబును స్వర్ణదానంబును ఛత్త్రిదానంబును నుపానహదానంబును నను నెనిమిదిదానంబులు క్షుత్తృష్ణానివర్తకంబు లగుచు దాతకుఁ బరలోకంబునను జన్మాంతరంబునను ననేకసుఖంబులఁ జేకూర్చు. మృత్యుసమయంబునందుఁ గావింపంబడుతిలదానంబును బూర్వోక్తఫలంబు నిచ్చుచు సర్వభోగపతిత్వంబు ననుగ్రహించు.

గీ. అనుటయును ఱేఁడు ముని కిట్టు లనియె స్వామి
నేఁడు నీ వనినట్టులె నాఁడు నాకు
జైమిని వచించె దానముల్ సలుపు మనుచు
సత్యమునె చెప్పుదురు చూవె శాస్త్రవిదులు. 1303

క. అనుకొంటిఁ గాని ధ్యానము, ననె ధన్యుఁడ నగుదు ననియు నా కితరంబుల్
పని లే దనియును నింతటి, పని యగు నని తలఁపనైతిఁ బా పైపోతిన్. 1304

వ. ఇంక దీనికిఁ బ్రాయశ్చిత్తం బేదియేని యున్న ననుగ్రహించి నన్ను బాధావిముక్తునిఁ గావింపు మనుటయు వామదేవుం డతని కి ట్లనియె. 1305

క. ప్రాయశ్చిత్తము దీనికి, నేయదియును లేదు కాని యేపపడక మీ
కాయంబులె తినుచుండుం, డేయెడ నవి పడెనొ యచటి కేఁగుచు నింకన్.
గీ. ఎచటఁ బడియెనొ మీమేను లచట నుండు, నక్షయములుగ మీకుఁ గర్మానుభవము
పూర్ణమగునంతవఱకును బొందు చేసి, నట్టికర్మంబునకు ఫల మనుభవింప.
ఆ. అనుటయును సుబాహుఁ డతిహేయ మగుపని, చేయవలసె ననుచుఁ జింత నొంది
స్వామి యెంతకాల మీమాడ్కి శవదేహముల భుజించుచుండవలెనొ చెపుము.
వ. అని సప్రశ్రయంబుగా నడుగుటయు వామదేవుండు రాజా వాసుదేవాభిధానంబు
గలస్తోత్రంబు మీరు వినంగలనాఁడు క్షుత్తృష్ణాదిముక్తులై భవభయనివారకం
బగుధామంబు వడయంగల రని చెప్పి యంతర్హితుం డయ్యె. 1309
గీ. అంతటను వార లాస్తోత్ర మాలకింపఁ, జేసి యత్నంబు లెన్నియో చిట్టచివర
కాశ యుడుగంగ క్షుత్తృష్ణ లాఁగకునికి, నాత్మశవములఁ దినఁజొచ్చి రనుదినంబు.
ఆ. వత్స నీవు గన్నవారలు వారల, వారు ప్రతిదినమును వచ్చి విష్ణు
పురమునుండి యట్లు భుజియించి శవముల, నేఁగుచుందు రెదల నేడ్చుకొనుచు.
సీ. ఇరువురు చెలులుగా నేతెంచి ప్రజ్ఞయు, శ్రద్ధయు వారలచర్యఁ జూచి
నవ్వుచుండిరి మమ్ము దవ్వుగాఁ జేసిన, కతన మీ కీగతి గలిగె ననుచు
మఱియొక యిరువురు తెఱవలు గాఁగను, జనుదెంచి క్షుధయుఁ దృష్ణయును గూడి
యతిదారుణంబుగా నఱవంగఁ జొచ్చిరి, పెట్టుఁ డింకను మాకుఁ బెట్టుఁ డనుచు
గీ. వారలాఱుగు రెవ్వరో వారిచరిత, మెట్టిదియొ సర్వమును వచియించినాఁడ
నింక నడుగంగవలసిన దేదియేని, మదిని గలిగిన నడుగు చెప్పెదను వత్స. 1313
గీ. అనుటయును విజ్వలుం డిట్టు లనియెఁ దండ్రి, భవపయోనిధిగట్టుఁ జేర్పంగఁదగిన
వాసుదేవాభిధానస్తవంబు నాకుఁ, జెప్పు మనుటయు నతఁ డిట్లు చెప్పఁదొడఁగె.

—:వాసుదేవాభిధానస్తోత్రము:—

వ. శ్రీవాసుదేవాఖ్యస్తోత్రమహామంత్రంబున కనుష్టుప్పు ఛందస్సు. నారదుండు
ఋషి. ప్రణవంబు దేవత. సర్వపాపనాశనార్థంబును జతుర్వర్గసాధనార్థంబును
నగుజపంబు నందు వినియోగంబు. వాసుదేవద్వాదశాక్షరమంత్రంబు జప్యంబు.
సీ. గంధర్వగీతభోక్తయు నిరాకారంబు, సుప్రకాశంబు గీతప్రియంబుఁ
బరమంబు వేదరూపంబు వేదాఖ్యంబు, శుద్ధంబు సూక్ష్మంబు సూక్ష్మతరము
యజ్ఞవల్లభము విద్యాధారమును మఖా, ధారంబు విశ్వవేత్తయును శివము
గీతజ్ఞమును గుణాతీతంబు గుణనాయ, కంబుఁ గైవల్యధామంబు సుఖముఁ
గీ. బుణ్యమును వేదమందిరమును మహోద
యమును గుణకర్తయును నిర్గుణమును బావ
నమును వేదజ్ఞమును విచారమును మోహ
శమనమును నైనప్రణవంబె శరణు నాకు. 1316

గీ. అంతటను నిండి భాసిల్లునదియు నేక, మైనను ననేక మైనట్లు కానవచ్చు
నదియు భవవార్ధి దాఁటించునదియు సర్వ,శక్తియును నైన ప్రణవంబె శరణు నాకు.

గీ. అఖిలలోకంబులకు మూల మనియు సకల, ధర్మములకును మేలైన ధర్మ మనియు
జ్ఞాన మనియును వేదశాస్త్రములయందుఁ, దెలుపఁబడియున్న ప్రణవంబె దిక్కు నాకు.

క. ఏయది జన్మస్థాన మొ, గాయత్రీసామగానకళ కేది ముని
ధ్యేయ మొ యేయది మోక్షో,పాయ మొ యాప్రణవమునకె ప్రణతు లొనర్తున్.

గీ. దేనినూఁయను బ్రహ్మాది దేవతలును, గడవఁజాలక ముక్తిమార్గంబుకొఱకు
నెమకుచుందురో యాప్రణవము నె మదిని,వదలకుండఁగఁ బాదుకొల్పుదును నేను.

సీ. పరమపదంబుగా భాసిల్లువాఁడును, బ్రణవరూపంబునఁ బరగువాఁడు
నఖిలగుణంబుల కాధార మగువాఁడు, జగము లన్నియు సృష్టిసలుపువాఁడు
రవివహ్ని తేజోవిరాజితుం డగువాఁడు, వేదకోశంబుగా వెలయువాఁడు
దుఃఖంబు లన్నియుఁ దొలఁగఁద్రోసెడివాఁడు, శ్రేయంబులను దయ చేయువాఁడు

గీ. గదయు ఖడ్గము శంఖచక్రములు నాల్గు, హస్తములలోన ధరియించినట్టివాఁడు
కేవలుఁడు సర్వమయుఁడు పరాపరుండు,సాక్షియును నైన శౌరియె శరణు నాకు.

గీ. స్వప్రకాశంబుచేత నె సర్వలోక, ములను భాసిల్లఁజేయుచుఁ గొలువఁబడుచు
సకలవిబుధులచేతను శాశ్వతముగఁ, దేజరిలువాసుదేవుఁడె దిక్కు నాకు.

గీ. అరుణరూపంబు దాలిచి కిరణములను, నుదకమును శోషిలంగఁ జేయుచును మరల
నొసఁగుచును లోకముల నెల్ల నోముచున్న, దేవకీసుతుఁ డొక్కఁడె దిక్కు నాకు.

గీ. అనిలరూపంబునను మేనులందుఁ జేరి, జీవులను బ్రాణయుతులను జేసి తెలియఁ
బడనివాఁ డయి విశ్వంబు నడుపుచున్న, దేవకీసుతుఁ డొక్కఁడె దిక్కు నాకు.

గీ. ఎల్లలోకంబులను గూడఁ దల్లివోలె, నక్షయం బగుకరుణాకటాక్షమునను
నుదరమం దుంచుకొని ప్రోచుచుండినట్టి, దేవకీసుతుఁ డొక్కఁడె దిక్కు నాకు.

గీ. ఇంద్రియంబులు లేకపోయినను గూడ, నింద్రియసమన్వితులకంటె నెక్కుడుగను
నెల్లవిషయంబులను గ్రహియించుచుండు, దేవకీసుతుఁ డొక్కఁడె దిక్కు నాకు.

గీ. అమృతకరరూపమును దాల్చి యమృతమునను
ననిశమును బ్రదికించుచు ననిమిషులను
సర్వలోకోపకారంబు సలుపుచున్న
దేవకీసుతుఁ డొక్కఁడె దిక్కు నాకు. 1327

గీ. పద్మ కరపద్మములచేతఁ బాదపద్మ, ములను సంవాహనము సేయ జలధియందు
శేషపర్యంకమును నధిష్ఠించియున్న, సరసిజేక్షణుఁ డొక్కఁడె శరణు నాకు.

గీ. పాపముల నన్నిటిని రూపుమాపునట్టి, సకలతీర్థంబులును బదాబ్జముల సేవ
సలుపుచుండఁగఁ దీర్థరాజంబువోలెఁ, దేజరిలువాసుదేవుఁడె దిక్కు నాకు.

గీ. తన్ను ధ్యానించుచున్నమాత్రమున సకల, పాతకములను దహియించి పావనులను
జేసి ప్రాణులఁ దనదరిఁ జేర్చుకొనెడి, దేవకీసుతుఁ డొక్కఁడె దిక్కు నాకు.

క. ఆనంద మనంతము ప్ర, జ్ఞానము బ్రహ్మంబు పరము సత్యంబును నై
కానఁబడకుండ నుండియుఁ, గానంబడుచుండుహరియె గతి నా కిం కన్. 1331

క. అనునీపావనసంస్తవ, మును శఠునకు నాస్తికునకు మూర్ఖునకు నభ
క్తునకు నవిశ్వాసునకును, వినిపింపకు మనుచుఁ జెప్పి విరమించుటయున్. 1332

క. జనకునియాజ్ఞను గైకొని, చని యానందాటవికి వెసన్ విజ్వలుఁ డా
జనపతిరాకకు దెసలను, గనుఁగొనుచు వసించె నొక్కతన్మోజముమీఁదన్. 1333

గీ. అంతట విమాన మేతెంచె నాశుగతిని, గగనముననుండి కింకిణుల్ గల్లు మనుచు
మొరయుచుండంగ దీప్తులు ముసురుకొనఁగ, దిక్తటంబులఁ దరణిదీధితులువోలె.

క. అరుదెంచుటయు విమానము, ధరణికి దిగి దానినుండి ధాత్రీంద్రుఁడు ద
త్తరుణియుఁ గృశాంగములతో, సరోవరమునందుఁ జలిపి స్నానం బంతన్.

క. విధి తమనుదుటను వ్రాసిన, విధానమున కాత్మలందు విలపిల్లుచునున్
క్షుధ కాఁగలేమి శవస, న్నిధికిం జని కోసి వాని నిస్త్రింశములన్. 1336

క. తినఁబోవుచున్నసమయం, బున విజ్వలుఁ డిట్టు లనియెఁ బుణ్యాత్ముల కీ
పని తగునె యెవరొ మీరలు, వినిపింపుఁడు యుష్మదీయవృత్తాంతంబున్.

క. అనవుడు నాభూపతి యి, ట్లనియెను శుకరాజ ప్రాకృతాఘఫలముగన్
దినుచుంటి మీశవంబుల, ననుదినమును నిప్పటికి శతాబ్దము లాయెన్. 1338

క. అని పలికి యశ్రుధారలు, గనుఁదమ్ములనుండి కాఱఁగను నేడ్చుచుఁ జె
ప్పెను జరిగినవృత్తాంతం, బును శుకమున కానుపూర్వ్యముగ నఖిలంబున్.

ఆ. ఆయుదంత మెల్ల నాలించి విజ్వలుఁ, డాత్మలోనఁ గరుణ యంకురింపఁ
దండ్రి చెప్పినట్టిస్తవమును బఠియించె, వీను లొగ్గి వారు వినుచు నుండ. 1340

ఉ. అంతట క్షుత్పిపాస లుడుగాఱఁగ వింతగ రాజదంపతుల్
సంతస మొందుచున్ హరిని స్వాంతములందు స్మరించుచుండ దై
త్యాంతకుఁ డేఁగుదెంచి సకలాశ్రితవర్గముతోడ నామహీ
కాంతున కాలతాంగికిని గట్టెదుట న్నిలిచెన్ స్వయంబుగన్. 1341

క. నిలుచుటయుఁ గోటిసూర్యుల, వెలుఁగులను నతిక్రమించి వెలిఁగెడివానిన్
దిలకించి లేచి భయభ, క్తులతో నారాజదంపతులు మ్రొక్కుటయున్. 1342

గీ. వారలకు నిట్టు లనియె దైత్యారి నేఁడు, నాస్తవంబును వినినదానను నశించెఁ
దొల్లి మీ రొనరించినదురిత మెల్ల, దాన నొనగూడె మీకు నాదర్శనంబు.

—: వాసుదేవస్తోత్రశ్రవణపఠనఫలకథనము :—

సీ. వేదపారగుఁ డయి విలసిల్లు విప్రుండు, జయమును గైకొను క్షత్త్రియుండు
వైశ్యుఁ డప్రతిహతైశ్వర్యయుక్తుఁ డగు, శూద్రుఁడు వడయును సుఖము లెల్లఁ

క్రూరమృగంబులు దూరీకృతము లగు, స్తంభింపఁబడును దస్కరగణంబు
భస్మీకరింపఁగాఁ బడుదురు వైరులు, సంహృతం బగును పిశాచబృంద

గీ. మంత్రరాయంబు లన్నియు సంతరించు, సర్వకామసమృద్ధులు సంఘటిల్లు
శ్రద్ధతోడను మామకసంస్తవంబు, వినిన వినిపించినను జదివినను గాని. 1344

క. రాజద్వారంబున స్తవ, రాజమును బఠించెనేని రాజు వశుండై
భోజనభాజనములు గజ, వాజిరథాదులు నొసంగి వాంఛలు దీర్చున్. 1345

గీ. శ్రాద్ధమున బ్రాహ్మణులు భుక్తి సలుపుచుండు
సమయమున స్తోత్రపఠనంబు సలిపెనేని
యమృతమును బోలె శ్రాద్ధాన్న మారగించి
తృప్తు లగుచును బితరు లొందెదరు నన్ను. 1346

సీ. పుత్రార్థి యగువాఁడు పుత్రవంతుం డగు, ద్రవ్యవంతుం డగు ద్రవ్యకాంక్షి
విద్యార్థి యగువాఁడు విద్యాచణుం డగుఁ, గీర్తిమంతుం డగుఁ గీర్తికాంక్షి
పుణ్యార్థి యగువాఁడు పుణ్యవంతుం డగు, భోగవంతుం డగు భోగకాంక్షి
స్వర్గార్థి యగువాఁడు స్వర్గంబు వడయును, మోక్షార్థి యగువాఁడు మోక్ష మొందు

గీ. నిదియు నదియు నటంచును నెన్న నేల, యిచ్ఛగించునో యెవఁ డెవఁ డేది యేది
యందుకొనుచుండు నది యది యతఁ డతండు, ప్రేమమున నాస్తవంబు జపించెనేని.

గీ. బ్రహ్మ మును లోకములు సృజింపంగ నెంచి
త్రోవ గానక ననుఁగూర్చి స్తుతి యొనర్చి
దానిచే సృష్టి గావింప దక్షుఁ డయ్యె
శివుఁడు దానినె జపియించి సిద్ధుఁ డయ్యె. 1348

బ్రహ్మహత్యావిముక్తిని బడసె మున్ను, వృత్రసంహారకుండు నాస్తోత్రముననె
దానినె జపించి దేవతామాని సాధ్య, సిద్ధవిద్యాధరాదులు సిద్ధి గనిరి. 1349

అనుదినమును నాస్తోత్రం, బును నొకసంవత్సరంబు పూర్ణం బగుదాఁ
కను జపియించినధన్యున, కును నాకును భేదమొప్పికొన వాగమముల్. 1350

కావున మీకును నపవ, ర్గావహ మైనది స్తనంబె యగు దెం డనుచున్
గోవిందుండు విమానము, పై వారల నుంచుకొని నభంబున కరిగెన్. 1351

అంతట విజ్వలుండు సరయంబుగ వచ్చి వచించె సర్వవృ
త్తాంతముఁ దండ్రి కాతఁడు ప్రహర్షముఁ జెంది మనంబులోన నీ
వెంతటిపుణ్యమూర్తివో యుపేంద్రునిఁ గంటివి కన్నులార నా
ద్యంతవిహీనుఁ డైనపరమాత్ముఁడు వాఁడె సుమీ తనూభవా. 1352

క. అని పలికి పిదప నాల్గవ, తనయునిఁ గని వత్స నీవు దర్శించినచో
ట్లను నేయపూర్వ మైనను, వినఁదగినది యున్నఁ జెపుమ వినియెద ననుడున్.

వ. కపింజలుండు కుంజలునకుఁ బ్రణామంబు గావించి యి ట్లనియె. 1354

గీ. అరిగితిని నేఁడు కైలాసగిరికిఁ దండ్రి, దానిశిఖరంబుపై నద్భుతముగ నుండె
నొక్కగంగాహ్రదము దశయోజనముల,విస్తృతియుదివ్యమైన తావియునుగలిగి.

గీ. తత్తటంబున నొకశిలాతలమునందుఁ
గుంతలంబులు దిగజాఱఁ గూరుచుండి
యెవ్వతెయొ యొక్కమానిని యేడ్చుచుండె
రతియొ కాత్యాయనియొ సరస్వతియొ యామె. 1356

గీ. శోకసంతప్తయైన నాసుదతిరూపు, చూచుచున్నకొలందియుఁ జాడవలయు
ననెడుకౌతూహలముగల్గునాత్మలోన, నేమి మాహాత్మ్యమున్నదొయామెయందు.

ఆ. అట్లు లేడ్చుచుండ నామెకన్నులనుండి, హ్రదమునందుఁ బడెడియశ్రుబిందు
తతులవలన నెఱ్ఱ తామరసంబులు, గలుగుచుండెఁ గంటిఁ గన్నులార.

వ. ఆపద్మంబులు తత్ప్రవాహంబులోనం బడి దాని కనతిదూరంబునం దుండురత్న
గిరిపై యోజనద్వయవిస్తారంబున విలసిల్లుచుండునొక్కహ్రదంబునం బడుచుండు
టయు నాపద్మంబుల నన్నింటిని సేకరించి వానిచే నిరాహారుండును ద్వగస్థి
మాత్రావశిష్టుండును భస్మోద్ధూళితావయవుండును జటిలుండును నగునొక్క
ముని రత్నాద్రియం దుండురత్నేశ్వరునిఁ బూజించుచు నేడ్చుచు నుండె. 1359

గీ. ఆసతీమణి యెవతెయొ యతఁ డెవండొ, వార ల ట్లుండుటకు నేమి కారణంబొ
తెలుపుము సమస్తమును గూడఁ దెలిసినట్టి,ప్రాజ్ఞుఁడవు నీవు విన వేడ్కపడెడినాకు.

గీ. అనుటయును గుంజలు డిట్టు లనియె వత్స
హుండుఁ డనియెడునొక్కదైత్యుని వధించె
మున్ను త్రిదశులసాహాయ్యమునను జేసి
నహుషుఁ డనువాఁడు త్రిభువనానందముగను. 1361

—: వి హుం ం డు ని చ రి త్ర ము :—

గీ. తండ్రిని వధించినట్టిక్రోధమునఁ జేసి, తత్సుతుండు విహుండుఁ డత్యంతఘోర
తపము నొనరించి నానావిధంబులైన,వరములను జెంది యమితగర్వమును బొంది.

క. బాధింపఁదొడఁగె సురలను, బాధింపఁదొడంగె ధర్మపరిపాలకులన్
బాధింపఁదొడఁగె మునులను, బాధింపఁదొడంగెఁ దుదకుఁ బ్రజలను నెల్లన్.

ఆ. అతనిదుండగంబు లంతంతకును మించఁ, జాలకునికి దేవసంఘ మెల్లఁ
గూడి పోయి చెప్పె గోవిందునకు వాఁడు,చేయుచున్నదుష్టచేష్ట లెల్ల. 1364

క. విని వారినుఁడులు కృష్ణుఁడు, చనుఁ డింకను మీఁదు నేను శాసించెద నా
దనుజాధముఁ డింతటిపను, లొనరించునె జీవితేచ్ఛ యుండినయెడలన్. 1365

క. అని పలికి యాదితేయులఁ, బనిచి దివంబునకు వానిఁ బరిమార్పంగన్
గనుఁగొని యుపాయమును నే, ర్పునఁ దాలిచి మోహినీస్వరూపము నంతన్.

గీ. నందనారామమున కేఁగి యందుఁ దపము
సలుపుచున్నట్టు లొకశిలాఫలకమందుఁ
గూరుచుండంగ నాదైత్యకుంజరుండు
దివమునకుఁ బోవుచును నేఁగుదెంచి యటకు. 1367

గీ. ఆమెరూపంబు గాంచి యత్యద్భుతమును
బొంది మదిలోనఁ దత్పార్శ్వమునకుఁ జేరి
కలికి నీ వెవ్వతెవొ నిన్నుఁ గాంచినంత
నా కధీనంబు గాకుండె నామనంబు. 1368

క. హుండునికొమరుఁడ నేను వి, హుండుండను ద్రిభువనముల నోడించిన శూ
రుండను రాక్షసమూర్ధ, న్యుండను నాకేలు వట్టు ముత్పలనేత్రా. 1369

గీ. నీవు కోరిన దెల్లను నేన తీర్తు, నింకఁ దప మేల చేసెద విందువదన
యనుడుఁ గనులెత్తి విష్ణుమాయావధూటి, చూచి వానిని గౌరవసూచకముగ.

గీ. ఈవు ననుఁ గోరితేని దైత్యేంద్ర సప్త, కోటిసంఖ్యాకకామోదకుసుమములను
శూలి నర్చించి తత్పుష్పమాలఁ దెచ్చి, పొనరుపుము కంఠభూషణంబుగను నాకు.

క. అనుటయు విహుండుఁ డట్టులె, యొనరించెద నింతి యిటనె యుండు మటంచున్
జని తిరిగి దేశ మంతయుఁ, గని కని కామోదతరువు గానక తుదకున్. 1372

గీ. అరిగి శుక్రునికడకు మహానుభావ, కలదె కామోదవృక్ష మెక్కడను నైనఁ
జెప్పు మనుటయు శుక్రుఁడు శిష్యునందుఁ, గలుగువాత్సల్యమున నిట్లు పలికె నపుడ.

గీ. అసురవల్లభ యేదేశమందుఁ గూడ, లేదు కామోద మనియెడిపాదపంబు
కాని కామోద యనియెడిఖ్యాతి గనిన, కంబుకంఠి యొకర్తుక గలదు చూవె.

వ. ఆయమకు గంగాద్వారంబునందు విశ్వకర్మనిర్మితంబై కామోదం బనుప్రసిద్ధిం
బడసియుండినయొక్కపురంబు నివాసస్థానంబుగా నయ్యె. 1375

గీ. ఆమెకడ కేఁగి నవ్వించినట్టులైన, నా ప్రహాసంబునుండి యత్యద్భుతముగ
జల్లునను రాలుఁ బువ్వులు జల్లువోలె, వానికిని గల్గుఁ గామోదసూనసంజ్ఞ.

క. ఆకామోదసుమంబులు, శ్రీకంఠున కెంతయేని ప్రియములు వాని౯
గైకొని శివు నర్చించినఁ, జేకూరు సమస్తకార్యసిద్ధులు వత్సా. 1377

క. అనుటయు నాపుష్పంబులె, వనజాయతనేత్ర తనకు వచియించిన వం
చును హర్షించుచును దదా, జ్ఞను గైకొని యచటి కతఁడు చనుచుండంగ౯.

ఆ. త్రోవలోన నారదుండు గోవిందుని, ప్రేరణమున వాని కెదురు వచ్చి
యెచటి కేఁగుచుంటి వీ వని యడుగంగ, నతఁడు చెప్పె నున్నయంత యెల్ల.

ఉ. అంతట నారదుండు దనుజాధిప యెవ్వఁడు చెప్పె నీకు దై
త్యాంతకుఁ డుండు నెప్పుడును నచ్చట నాతఁడు నిన్నుఁ జూచిన౯

జింతిత కార్యసిద్ధికిని జేటు ఘటిల్లులె గాక పైని న
త్యంతవిషాదహేతు వగునట్టిదుపాయము గూడఁ గల్గెడిన్. 1380

క. కావున నీ వాదరికిన్, బోవల దానోహనాంగి పొందు దృఢముగాఁ
గావలయు నన్నకోరికి, భావములో నున్న నేఁట బహుభాషణముల్. 1381

క. అనుటయు విహుండుఁ డాతనిఁ, గనుగొని యిట్లనియె నట్లు కావింపని చో
మునినాథ యేయుపాయం, బున నా కాదివ్యపుష్పములు లభియించున్. 1382

గీ. అనుటయును నారదుం డిట్టులనియెఁ గొలఁది, కాల మిచ్చోట నున్న గంగాప్రవాహ
సలిలమునఁ బడి యాపుష్పసముదయంబె, వచ్చు నిచ్చోటికి కవి కొనవచ్చు నీవు.

చ. అనుటయు దానవుండు సదుపాయము చెప్పి మహాత్మ కార్యసా
ధనముగ నంచు నెంచి ప్రముదంబును జెందుచుఁ జూపినట్టిచో
టనె నివసించె నంతటఁ దటాలున నారదుఁ డేఁగెఁ బోయిన
త్తును దనుజేంద్ర సెందకుము తొందరపా టని చెప్పి వానితోన్. 1384

—: మత్స్యకూర్మవరాహావతారకోరకథనము :—

గీ. అరిగి కామోదపురమున కచట నుండి, నట్టి కామోదకడ కేఁగి యామెవలన
నర్ఘ్యపాద్యాదిసత్కార మంది యడిగె, సౌఖ్యమున నున్న దాన వెసాధ్వియనుచు.

గీ. అడుగుటయు నామె మౌని కి ట్లనియె స్వామి
యేమి మాయయొ కాని నా కీదినంబు
నిద్ర యుదయించె స్వప్నంబు నిద్రలోనఁ
గలిగె దారుణముగ నుషఃకాలమందు. 1386

క. అది యే మన నెవ్వఁడో నా, సదనమునకు వచ్చి హీనజన్మంబులలో
గుదివడును శౌరి యని యను,వదమ చనియె దాని కేమి ఫలము మునీంద్రా.

గీ. అనుటయును నారదుం డిట్టు లనియె నపుడు, కమలలోచన విను మఉషఃకాలమందు
మంచిస్వప్నంబు గలిగిన మంచి గలుగుఁ, జెడ్డస్వప్నంబు గలిగినఁ జెడ్డ గలుగు.

గీ. తెలిపినను దుఃఖపడెదవు కలికి నీవు, పరమపురుషుఁడు జన్మసంబంధమందుఁ
దగులువడియెడియోగంబు దాపరించె, నాకతన నట్టిస్వప్నంబు నీకుఁ గలిగె.

చ. అనుటయు విస్మయం బొదవ నాయమ యి ట్లనియెన్ మహాత్మ యె
వ్వనికిని గోచరింపనిప్రవర్తన గల్గినవాని కాత్మమా
యను సకలప్రపంచముల నట్టిట్టు లూఁపెడువాని కేల క
ల్గెనో జననంబులం దగులుక్లేశము నాకు వచింపు మియ్యెడన్. 1390

వ. అని యడుగుటయు నారదుం డాయమను జూచి. 1391

సీ. భృగు వనునొకమహాఋషి వచ్చి చనుదెమ్ము, యజ్ఞరక్షణమున కనుచుఁ గోర
నరుదెంతు నని చెప్పి హరియాతఁ డది నమ్మి, చని యధ్వరంబును జలుపఁదొడఁగె

నంతలో నమరాలయము దానవులు ముట్టి, రనువార్త విని కృష్ణుఁ డటకుఁ జనియె
నదియె సందని వచ్చి యసురులు చెడఁగొట్టె, రమ్మౌని చేసెడియధ్వరంబు
గీ. దానిచే నాగ్రహము గల్గి తాపసుండు, జలజలోచనునకు ఘోరశాప మొసఁగె
హేయ మగుమూఁడుజన్మంబు లెత్తునట్లు, గడవలే రెంతవారును గర్మ మతివ.
క. అని చెప్పి బ్రహ్మలోకం, బున కాకలహాశనుండు వోవుటయును నా
వనజాక్షి యేడ్వఁదొడఁగెను, గనులను బాష్పములు రాల గంగాంబువునన్.
గీ. అంత నాశోకబాష్పము లబ్జములుగ, నగుచు నరుదేరఁగను బ్రవాహంబునుండి
వాని నతిహర్షమునఁ గొని దానవుండు, చెలువకొఱకయి శివపూజ చేయఁదొడఁగె
గీ. ఆవిహుండుఁడె నీవు కన్నట్టిమౌని, హ్రదతటంబున నేడ్చుచున్నట్టిపద్మ
వదన కామోద యనియెడుసుదతి వత్స, సంశయం బున్న నడుగు మేయంశమేని.
క. అనుటయుఁ గపింజలుం డి, ట్లనియెను గామోద యనెడునామెచరిత మె
ల్లను దండ్రి సవిస్తరముగ, వినిపింపుము నాకు వినఁగ వేడుక గలిగెన్. 1396
వ. అని యర్థించుటయుఁ గపింజలునకుఁ గుంజలుం డి ట్లనియె. 1397

—: కామోదాఖ్యానకథనము :—

గీ. వినుము దేవాసురులు మున్ను వనధిఁ ద్రచ్చు
నపుడు కన్యాచతుష్టయ మందుఁ బుట్టె
నొకతె వారుణి మఱియును నొకతె లక్ష్మి
యొకతె కామోద మఱి వేఱయొకతె జ్యేష్ఠ. 1398
గీ. అందులోపలఁ గామోద యచ్యుతునకుఁ, బరమసంతోషమును గొల్పుపద్మగంధి
యామె నవ్వినఁ గురియు నత్యద్భుతముగఁ, దావి వెదచల్లుపూలు వక్త్రంబునుండి.
గీ. అదియునుం గాక యెప్పుడైన నాలతాంగి, యేకతంబున నేనియు నేడ్చె నేని
కురియు నద్భుతముగ వాన గురిసినట్లు, పరిమళము లేనిపూలు బాష్పములనుండి.
గీ. నవ్వినపు డేర్పడినప్రసూనములచేత, శివునిఁ బూజింప సర్వార్థసిద్ధి గలుగు
నేడ్చినపు డేర్పడినపూల నిందుధరునిఁ, బూజసేయ సర్వానర్థములును గలుగు.
క. తులసీవృక్షంబుగఁ గాఁ, గల దా కామోద భావికాలంబునఁ ద
ద్దళ మొకఁ డిచ్చిన నే మీఁ, గలను ఫలం బనుచుఁ గుంపఁ గమలాక్షుఁ డెదన్.
క. కామోదాఖ్యానం బిది, యేమడుగఁ దలంచితొంటి వింకను ననఁగా
నామోదమునఁ గపింజలుఁ, డామీఁదటికథను జెప్పు మని యడుగుటయున్.
గీ. అపుడు కుంజలుఁ డతని కి ట్లనియె వత్స, శూలిని విహుండుఁ డారీతి శోకపుష్ప
ములను బూజించుచును దానఁ గలిగినట్టి, పాపమున నేడ్చుచుం డెను బ్రతిదినంబు.
గీ. అంతటను గొన్ని నాళ్ల కతనిపాప, మంతయును బండ నాఁడు శోకాంబుజములఁ
బ్రాణపతికి నొనర్చునర్చనకు మిగుల, నాగ్రహము నొంది యీశ్వరి యాత్మలోన.

గీ. బ్రాహ్మణాకృతి దాలిచి రాత్రిచరుని, చెంత కరుదెంచి పాపాత్మ చేయ నగునె
శోకపంకేరుహములను శూలిపూజ, చేసితివె నీవు శుక్రుఁడు చెప్పినట్లు. 1406

క. అనుటయు విహుండుఁ డాగ్రహ, మున జెంది యెవండ వీవు భూసుర వేషం
బున వచ్చినచండాలుఁడ, వనఁగూడనిమాట లాడ నగునే నన్నున్. 1407

క. పాపాత్ముండనె నేను మ, హాపాపివి నీవు నాపు నధికారివె నా
లోపముల నెంచ నవలకుఁ, బో పో బలి యగుదు విచటఁ బో కుండినచోన్.

చ. అనుటయు బ్రాహ్మణుండు దనుజాధము చేసినతప్పు చెప్పినన్
గనలెద వేల నీకుఁ దుదికాలము దాపురమయ్యె దానిచేఁ
గనులను గప్పెఁ జీఁకటులు గర్మఫలంబును గాంచు మంచు హుం
మ్మనఁగను దద్రవం బశనియట్లు విహుండునిఁ దాఁకి కూలిచెన్. 1409

గీ. అంతటను దేవదుందుభు లాకసమున
మ్రోఁగె సకలప్రపంచవిద్రోహి యైన
యసురుఁడు నశించె ననువార్త యన్నిదెసల
ముసురుకొనఁగను దప్పెటల్ మ్రోఁగినట్లు. 1410

వ. అనుటయుఁ గపింజలుండు తండ్రీ నహుషుండు హుండుని వధించినవిధంబు విన వేడ్క యయ్యె. వినిపింపు మని యడుగుటయుఁ గుంజలుం డతని కిట్లనియె.

— :నహుషోపాఖ్యానము: —

క. ఒకనాఁడు మున్ను శంకరు, నకు మ్రొక్కి భవాని ప్రాణనాథా యేదే
నొకదివ్యవనము గనఁ గా, తుక మొదవెను దీర్పు మీప్రతోషము నాకున్.

క. అనుటయును శంకరుం డా, మెను దోడ్కొని యెక్కి వృషభముమీఁదను స్వర్గం
బున కేఁగి నందనవనం, బును జూపెను నేత్రపర్వముగ నాయమకున్. 1413

సీ. వినుచును వీనులవిందుగాఁ గంఠంబు, లెత్తి క్రోలిచెడికోయిలలపాట
కనులపండువుగను గాంచుచు ఫలపుష్ప, భరితంబు లగుదివ్యపాదపముల
ననుభవించుచు దేహమునకు సుఖంబుగా, మలయసమీరసంస్పర్శములను
ఘ్రాణతృప్తిగను నాఘ్రాణించుచును నలు, ప్రక్కల వ్యాపించుపరిమళముల

గీ. నచ్చరలు కిన్నరులును విద్యాధరులును, సురలు బ్రహ్మాదులును నుండుచోటు లెల్ల
హర్ష మొనగూర్చుచుండ నాహరునితోడ, నందనంబున విహరించె నగతనూజ.

గీ. అట్టికాలంబునను నామె కద్భుతముగఁ, దేజరిల్లుచు సౌవర్ణదీప్తితోడ
దర్శనీయంబుగా నుండుతరు వొకండు, గనఁబడియె నొక్కచోట నవ్వనమునందు.

క. కనఁబడుటయుఁ గౌతుకమునఁ, గనుగొని యాపాదపమును గాత్యాయని యి
ట్లని యడిగెఁ జెంత నుండిన, తనభర్తను నాథ యేమి తరు విది చెపుమా.

గీ. అనుటయును నీశ్వరుం డిట్టు లనియెఁ దన్వి, యేమి చెప్పుదు నిది కల్పవృక్ష మనెడి
పేరు గాంచినదేవతాభూరుహంబు, దీనిమహిమ మపారము దెలియరాదు.

సీ. నదులలోపలను జాహ్నవివోలె నాహ్లాద, కరులలోపల సుధాకరుఁడువోలె
వారణంబులలోన నైరావతమువోలె, సృష్టికర్తలలోన స్రష్టవోలె
నాదితేయులలోన నంబుజాక్షుఁడువోలె, విద్యలలో నాత్మవిద్యవోలె
నరులలోపలను భూవరుఁడువోలె జలాశ, యంబులలో సముద్రంబువోలె
గీ. శైలములలోనఁ దుహినాద్రివోలె భూత, చయములో ధాత్రివోలె నోషధులలోన
నోదనౌషధివోలె నీపాదపంబు, దానశౌండులలోనఁ బ్రధాన మబల. 1417
గీ. అనుటయును నాథ యొకకోర్కి యాత్మలోనఁ, గలిగె నీకల్పతరువును గాంచినంత
ననుమతింపుము నాయాశయంబు దీరఁ, గోరుకొనియెద నని దేవి కోరుటయును.
ఆ. కోరుకొనుము తన్వి కోర్కి దీర్చెడిదాత, దొరకినపుడు గాక దోహదంబు
సఫల మగునె యన్యసమయంబునం దని, పలికె శర్వుఁ డమృత మొలుకునట్లు.
గీ. అంతట భవాని యతిలోకమైనరూపు, గలయొకానొకకన్య కావలయు ననుచుఁ
దలఁచికొనుటయు నాకల్పతరువునుండి, కలిగె నొకదివ్యకన్య తత్క్షణమునందు.
గీ. కలిగి యాకన్య శాంభవికడకు వచ్చి, మ్రొక్కి నిలువంగఁబడుటయు ముద్దులొలుకఁ
గౌఁగిటను జేర్చి యాకన్యకను భవాని, యనుభవించి సుతాశ్లేషజనితసుఖము.
క. తనయారత్నమ నినుఁ జే, కొని గంటి నశోకసుందరీనామంబున్
గొని వర్ధిల్లుము శశికుల, జనితుం డగునహుషభూమిజానికి సతివై. 1422
క. అని యాశీర్వాదంబుం, బొనరిచి పతితోడఁ గూడి పోయెను గాత్యా
యని రజతగిరికి మెచ్చుచు, మనమునఁ దత్కల్పవృక్షమాహాత్మ్యంబున్. 1423

—: అశోకసుందరిని హుండాసురుఁడు మోహించుట :—

ఉ. అంత నశోకసుందరి ప్రహర్షముతోడను గూడి నందనా
భ్యంతరమందు నెచ్చెలుల నాడుచుఁ బాడుచు నుండ నామె న
త్యంతకుతూహలంబునను నభ్రపథంబుననుండి చూచి వి
భ్రాంతమనస్కుఁడై యటకు రాక్షసుఁ డొక్కఁడు వచ్చె గ్రక్కునన్. 1424
గీ. కలికి నీవంటికాంత నెక్కడను గూడఁ, గాన నైతిని మూఁడులోకములలోన
నెవరిదానవో నీవు నా కెఱుఁగఁ జెపుము, హుండుఁ డనుదానవాధీశ్వరుండ నేను.
క. అనుటయు నాయమ వానిం, గనుఁగొని యి ట్లనియె నేను గాత్యాయనికిన్
దనయను నీకల్పద్రుము, నను సాఁకెడితల్లి యేల నాకథ నీకున్. 1426
చ. అనుటయు హుండుఁ డి ట్లనియె నంబుజలోచన విప్రచిత్తినం
దనుఁడను నేను హుండుఁ డనునామముఁ గైకొని యింతవాఁడు లేఁ
డనియెడుఖ్యాతి నొందినమహాబలుఁడన్ ననుఁ జెట్టవట్టి నీ
వనుపమ...గభాగ్యముల నందుము పొందుము సర్వసౌఖ్యముల్. 1427

క. అనుటయు నశోకసుందరి, దనుజాధిప నాఁడె నాకు ధవుఁ డగు నహుషుం
డని చెప్పి చనియెఁ గాత్యా,యని కా వాతల్లినుడువు లనృతము లెప్పుడున్.

క. కావున నహుషుం డనియెడి, భూవరుఁడె ధవుండు నాకుఁ బో మ్మనుటయుఁ ద
ద్భావం బెఱింగియును గా, మావిష్టుం డగుచు నామె కతఁ డి ట్లనియెన్.

క. పుట్టఁగఁబోయెడినహుషునిఁ, గట్టుకొనఁగవలయు ననుచుఁ గాత్యాయని యాఁ
కట్టుటయును సుందరి నీ, వట్టులె యుండుటయు నెంతహాస్యము కంటే. 1430

క. కాంతలు తారుణ్యమున డు, చింతురు పురుషులకు నది నశించిన పిదపం
గాంతురె పురుషులు పొలఁతుల, నెంతటిసాహసము చేయ నెంచితి నబలా.

క. ఎప్పుడు పుట్టునొ నహుషుం, డప్పటివఱకును నమూల్య మగుజవ్వన మే
చొప్పున నిలుచునొ నీవే, చెప్పుము విత చేసికొనక సిద్ధాన్నంబున్. 1432

క. వనితలు పురుషులకంటెను, గనిష్ఠలై యుంట చెల్లుఁ గాని లతాంగీ
వనితలకంటెను బురుషులు, గనిష్ఠులై యుంట నీవు కంటివె చెపుమా. 1433

క. అనుటయు నశోకసుందరి, దనుజున కి ట్లనియె సూక్ష్మధర్మములు సనా
తనము లవి పెక్కువిధములు, గను నుండు నెఱుంగఁ దరము గా దందఱకున్.

వ. కృతయుగంబునందు జన్మించిన రేవతి భవిష్యదష్టావింశద్వాపరయుగంబునం దవతరించినబలరామునకు భార్య యయ్యె. యుగత్రయప్రమాణంబుచే నాయమ బలరామునికంటె జ్యేష్ఠగా నుండె. పూర్వమం దుదయించినమాయావతి యను గంధర్వకన్యను భవిష్యదష్టావింశద్వాపరయుగంబునందు గోవిందునకు జన్మించి శంబరాసురుని సంహరించి ప్రద్యుమ్నుండు భార్యగాఁ బరిగ్రహించె. జ్యేష్ఠకనిష్ఠభావంబులు సామాన్యధర్మంబులుగాని విశేషధర్మంబులు గావు. 1435

క. నే నింక నహుషపత్నినె, కాని మ ఱొక్కనికిఁ జెందఁగలిగినదానం
గా ననుకొని నిర్భ్రాంతిని, మాని చనుము లేనియెడఁ బ్రమాదము గలుగున్.

చ. అనుటయు హుండుఁ డామె నెటు లైనను జేకొన నెంచి యాత్మలోఁ
జని యటనుండి యప్పటికిఁ జయ్యన నాపయి నాత్మమాయచే
తను వనితాకృతిం బడసి తత్సవిధంబున కేఁగుదెంచి యా
ననమునఁ జింత దోఁపఁగఁ గనంబడుచున్ నిలుచుండె నంతటన్. 1437

క. కనుఁగొని యశోకసుందరి, కనికర మొదవంగఁ దన్ముఖంబును జంద్రా
నన యేల చింత నొందెద, వనుటయు నాకపటకాంత యతిదుఃఖమునన్.

గీ. అమ్మ నాదురవస్థ యే మని వచింతు, హుండుఁ డనునొక్కదుష్టదైత్యుండు నన్నుఁ
బడయఁగా నెంచి చంపె నాప్రాణవిభుని, నది మొదలుగను నన్నంబు వదలి నేను.

ఆ. తపము చేయుచున్నదాన నాదైత్యుని, నాశనంబుకొఱకు నళినగంధి
యుల్లమంచు శ్రద్ధ యున్న నాయాశ్రమ, మునకు రమ్ము నియమములను జూడ.

ఆ. సాధ్వి లైనయట్టిజలజాక్షులకుఁ, దప్పు విట్టిముప్పు లెప్పటికిని
గాన నాత్మరక్ష గావించుకొనుటకుఁ, దపమె సాధనంబు దలిరుఁబోఁడి. 1441

క. అని పలుకుటయును గౌరీ, తనయ తపోనియమములవిధానమును గనుం
గొన నాశ గలిగి మాయా, వనితామణివెంటఁ జనియె వాస్తవబుద్ధిన్. 1442

వ. అంతట నమ్మాయావధూటి యశోకసుందరిం దోడ్కొని చని మేరుశిఖరంబునం దుండుకాంచనపురంబునకుం జేరి మాణిక్యకుడ్యభాసమానంబును గనకప్రాసాదవిరాజమానంబును నానావిధరత్నఖచితహేమప్రాకారమండితంబును మనోజ్ఞంబును నగునిజమందిరంబునం బ్రవేశించి స్వస్వరూపంబు దాల్చి నిలువంబడి.

గీ. ఇంతి యిది నాగృహంబు న న్నేలుకొనిన, ననుభవించెద వెల్లసౌఖ్యముల నిచట
సమ్మతింపుము వీరె యచ్చరలు వీరె, కిన్నరులు నిన్ను సేవింప నున్నవారు.

—: అ శో క సు ం ద రి హు ం డు ని శ పి ం చు ట :—

క. అనుటయు నశోకసుందరి, కనులను నిప్పుకలు రాలఁ గన్గొని వానిన్
దనుజాధమ యెంతటిపని, యొనరించితివి బ్రదుక నాశ యున్నదె నీకున్. 1445

క. ననుఁ దెచ్చుట యిచ్చోటికి, ననలశిఖను దెచ్చికొనుటె యనుకొను మిది ని
న్నును నీజనమును నీకుల, మును సర్వము గూడ భస్మముగ నొనరించున్.

క. నను ధర్షింపఁ దలంచుట, దనుజాధమ తీక్ష్ణఖడ్గధారను ఘట్టిం
పను నంగుళ్యగ్రముచే, తను దొరఁకొనుటయ నిజంబు దాఁపఁగ నేలా. 1447

గీ. ప్రతిఘముననుండుకృష్ణసర్పంబుమీఁది,రత్నముగ్రహించుటకును గర్జనముసేయు
కేసరిముఖంబునం దుండుమీసములను, లాగుటకును దొరంకొంటి బాగుపడెదె.

క. దనుజాధమ నీ వొనరిం, చినపాపంబునకుఁ దగినశిక్షను గావిం
పను నహుషుఁడు శీఘ్రంబుగ, జనియించును గాక యనుచు శాపం బిచ్చెన్.

గీ. అట్లు శపియించి క్రోధంబు నాఁపలేక
ఖండపరశుతనూభవ మండిపడుచు
దహనశిఖవోలె జాహ్నవీతటమునందుఁ
దపము సలుపంగఁదొడఁగెఁ దద్వధముకొఱకు. 1450

వ. అంతట హుండాసురుండు చింతాక్రాంతహృదయుండై తనమంత్రి యగుకంపనునకు జరిగినవృత్తాంతం బంతయు నెఱింగించుటయుఁ గంపనుండు దేవా యీయల్పకార్యంబున కింత చింతింప నేల. నహుషుండు జన్మించినతోడనె యసురమాయాశక్తిచే నతని నపహరించి వధించితివేని యాసుందరి నిరాశయై లోకైకవీరుండ వగునిన్నుఁ దనయంతఁ దాన శరణుచొచ్చు నని చెప్పె. 1451

క. అప్పుడు హుండుఁడు ధైర్యం, బుప్పతిలఁగ నహుషుఁ డుదయమొందెడికాలం
బెప్పుడు వచ్చునో యాతని, నెప్పుడు చంపుదునో యంచు నెంచుచు నుండెన్.

సీ. అది యట్టు లుండఁగా నైలపుత్రుఁ డగు, నాతఁడు పుత్రుఁ డైనట్టి కతన
నంతంతకును జింత యతిశయిల్లుచునుండ, నోపఁగాఁ జాలక యొక్కనాఁడు
కాంతాసమేతంబుగా నేఁగి మహనీయుఁ, డైన దత్తాత్రేయునకడకు
బహుభక్తితోడఁ దత్పాదసేవ సేయుచు, నచట నుండెను శతహాయనంబు

గీ. లట్లు లుండంగ నొక్కనాఁ డమ్మహర్షి, తద్వినిశ్చలభక్తి కెంతయును మెచ్చి
యతని కొకఫల మిచ్చి నీయతివ కిమ్ము, దీని నని చెప్పుచునె తిరోధాన మొందె.

గీ. ఆయు వాఫలమును దనయతివ కైన, యిందుమతి కీఁడు నామె యానంద మొదవ
దాని భుజియించి గర్భంబు దాల్చె సిద్ధ,పూరుషులసేవ యూరక పోదు సూవె.

గీ. అంత స్వర్భానుతనయశత్రుగ్రహములును,గర్భమునవహించి యొకరాత్రికాలమందుఁ
గనియె నొకనాఁడు దివిజాధిపకాంతితోడ, నిశలు వెలుఁగొందఁ జేసెడిశిశువు నొకని.

ఆ. అది గ్రహించి హుండుఁ డాసమయంబునఁ, నొక్కదాసిమేన నొదిఁగి పోయి
సూతిసదనమునకుఁ జూచి యట్టిబాలు, బాలకుని స్పృశింప భయము నొంది.

గీ. అంతమున కెట్లొ కొంత ధైర్యము వహించి, యెత్తికొని వానిఁ దనయింటి కేఁగి వేగ
భార్యచేతి కొసంగి యీపరమవైరి, బాలను నేఁడు భుజింపఁగా వలయు ననియె.

క. అనుటయు నాయమ మేకల, యనియెడిసైరంధ్రి కిచ్చి యాబాలుని సూ
దునికడకుఁ బంప సూదుఁడు, కనుఁగొని శాబకునిఁ జంప ఖడ్గం బెత్తెన్. 1458

గీ. ఎత్తుటయు ఖడ్గమును గనులెత్తి చూచి, నరవరసుతుండు పకపక నవ్వఁదొడఁగె
నపుడు వధియించుటకుఁ జేతు లాడ కునికి, ఖడ్గమును డించి సూదుఁ డక్కడనె నిలిచి.

క. అడవులను బట్టి చనినను, నడిసంద్రమునందు మునిఁగినను ననలములోఁ
బడినను వధశిలను నిలం, బడినను జెడిపోవ రొరుల మనిచినవారల్. 1460

క. ఈ పాపఁ డెవ్వఁడో పరులను, గాపాడినయట్టిపుణ్యకర్మమె వీనిం
గాపాడ నేఁడు దైవము, కాపాడెడివాఁడు వశుఁడె కదలింపంగన్. 1461

క. ఎప్పటి కెది కానున్నదొ, యప్పటి కది కాక తప్ప దజునకు నైనం
దప్పింప రాదు కావున, నిప్పాపనిఁ జంప నేల యెఱిఁగి యెఱిఁగియున్.

క. అని చింతించి మనంబునఁ, దనయాశయ మెల్లఁ దెలుప దాసికి నమ్మా
నిని సమ్మతించి బాలునిఁ, గొనిపోయి వసిష్ఠపర్ణకుటికడ నునిచెన్. 1463

ఆ. ఉంచి శీఘ్రముగను నొరు లెఱుంగక యుండ,నానిశీథసమయమంద వచ్చె
నంతలోన సూదుఁ డట నొక్కమృగమును, జంపి తత్పలంబు సంస్కరించె.

క. అంతట హుండుఁడు దాపల, మంతయు భుజియించి గఱ్ఱుమని త్రేఁచుచు నా
కంతము లేదిఁక ననుకొని, సంతోషముతోడఁ దిరుగసాగెను జగతిన్. 1465

వ. మఱునాఁడు ప్రాతఃకాలంబునందు వసిష్ఠుండు పర్ణకుటీరంబునుండి బహిర్గతుండై
తత్సమీపంబునందు కోటిసూర్యప్రభాభాసమానం బగు దేహకాంతితోడ వెలుం

గుచు నేలం బడియున్నబాలకునిం గాంచి తద్దివ్యలక్షణంబుల కచ్చెరువొంది
తద్వృత్తాంతం బంతయు జ్ఞానదృష్టిచే విలోకించి సంతోషించుచు స్వహస్తం
బులచే లేవనెత్తికొని యాకసంబునుండి పుష్పవర్షంబు గురియుచుండ స్వాశ్ర
మంబులోనం బ్రవేశించి ఋషిగణంబుతోడం గూడి యక్కుమారునకు జాత
కర్మంబును బాలభావంబులకు లోఁబడనికారణంబునం జేసి నహుషుం డనునామ
కరణంబును నొనర్చె. అది యట్టులుండ నింద్రప్రస్థపురంబునందు నాయువును
నిందుమతియును బుత్రవియోగదుఃఖభారంబు సైఁపంజాలక హాహాకారంబులు
గావించుచు.

సీ. అపహరించితిమేమొ యెప్పుడైన రత్నముల్, పుత్రరత్నమును గోల్పోతి మిపుడు
శిశువిరోధంబు చేసితిమేమొ యెప్పుడైన, శిశువియోగము తటస్థించె నిపుడు
పరిభవించితిమేమొ పాఱుల నెప్పుడైన, నడఁగనిదుఃఖ మేర్పడియె నిప్పు
డెప్పుడైనఁ జెఱచితిమేమొ నమ్మినవారిఁ, బ్రాప్తమైనఫలంబు వాసె నిప్పు

గీ. డనుచు శోకించుచుండునయ్యవసరమున, నారదుం డేఁగుదెంచి యవ్వారికడకు
భద్రముగ నున్నవాఁడు మీపట్టి యుండఁ,దగినచోటనె మీ రింక వగవవలదు.

క. గడిదేఱి సర్వవిద్యల, నడఁగాఁచి దానవులను నమరులవరముల్
వడసి చనుదెంచుఁ జుమి మీ, కొడుకు శివాత్మజను గూడుకొని మీకడకున్.

క. అని చెప్పి తిరోధానం, బును జెందుటయును విషాదమును విడిచి సుఖం
బున నుండి రాయువును డ, ద్వనితారత్నమును నిజనివాసమునందున్. 1469

వ. అది యట్లుండ వసిష్ఠుండు దినక్రమంబున నహుషున కుపనయనసంస్కారంబు
గావించి యథావిధిగ వేదవేదాంగంబులు నేర్పి ధనుర్వేదరహస్యంబు లెల్ల నుప
దేశించి రాజధర్మములను బోధించి నానావిధశస్త్రాస్త్రంబుల ననుగ్రహించి సర్వ
శక్తులును నేర్పడినపిదప నొక్కనాఁడు. 1470

క. వనమునకు నేఁగి వన్యము, లను గైకొని వత్స రావలయు నని చెప్పన్
బనివిని నహుషుఁడు చయ్యనఁ, జని యొకగహనమున నున్నసమయమునందున్.

క. అరుగుచు వ్యోమపథంబున, నిరువురు చారణులు నహుషుఁ డీతఁడె హుండా
సురుని వధింపఁగవలసిన, ధరణీశ్వరుఁ డనుచు సమ్మదంబునఁ గనుచున్. 1472

గీ. ఎప్పటికి మాపఱునో హుండుఁ డితనిచేత, నెప్పటికిఁ జూచెదరొ యాయువిందుమతియు
నితనిఁ గనులారఁ బార్వతీసుతతపంబు, ఫలము గను టెప్పటికొ యని పలికి రంత.

క. అది యాలకించి నహుషుం, డెదలోపల నెవరికథయొ యిది యనుకొనుచున్
బదపడి వన్యములను గొని, యదనున కరుదెంచి మరల నాశ్రమమునకున్.

గీ. మ్రొక్కి గురువరునకుఁ గందమూలములను
నర్పణము చేసి తనవిన్న యట్టిమాట

లన్నియును దెల్పి యిది యేమి యనుచు నడిగె
నడుగుటయుఁ జెప్పెఁ గథ యెల్ల నమ్మహర్షి.

—: నహుషుఁడు హుండుని వధించుట :—

ఆ. అపుడు విస్మయమును నాగ్రహమును గల్గ, నాత్మలోన నహుషుఁ డాఁగలేక
స్వామి యానతిమ్ము సమయింతు హుండుని, సకలలోకములకు శాంతి గలుగ.

క. అని పలుకుటయును దీవన, లొనరించి వసిష్ఠుఁ డాజ్ఞ యొసఁగెడిసమయం
బున దేవదుందుభులు మ్రో, సెను సుమవర్షంబు గురిసెఁ జిత్రము గాఁగన్.

సీ. చక్రపాణి యొసంగె శంఖచక్రములను, బ్రహ్మాస్త్ర మొసఁగెను బద్మయోని
శూలహస్తుం డిచ్చె శూలాయుధంబును, వజ్రశక్తుల నిచ్చె వజ్రపాణి
శ్వసనుం డొసంగెను సశరచాపంబు నా, గ్నేయాస్త్రము నొసంగెఁ గృష్ణవర్త్మ
పాశధరుం డిచ్చెఁ బాశాయుధంబును, దండంబు నొసఁగెను దండపాణి

గీ. యిచ్చిరి నిజాస్త్రముల సుర లితరు లెల్ల, భానుకోటిప్రభాభాసమానుఁ డగుచు
నింద్రదత్తరథంబుపై నెక్కి యున్న, నహుషునకు రాజమార్తండనందనునకు.

ఆ. అట్టు లొసఁగి విజయి నగు మని దీవించి, వార లెల్లఁ బనుప వాయువేగ
మునను దోల రథము ముందుండి మాతలి, నహుషుఁ డరిగె వైరినగరమునకు.

గీ. అరిగి శంఖంబు పూరించె నరులగుండె, లద్రువ నంతట హుండామరారి వీర
భటుని నొక్కని వానిచెంగటికిఁ బనిచెఁ, బొమ్ము తత్కథ కనుఁగొని రమ్మటంచు.

క. అంతట వీరభటుం డ, త్యంతాటోపమున వచ్చి యతనిం గని పూ
రింతువె రణశంఖము దై, వాంతకుఁడు వినంగ నెవఁడ వగుదువొ చెపుమా.

క. అనుటయు నాశూరుం డి, ట్లనియెను నే నాయుభూతలాధీశసుతుం
డను సోమవంశవర్ధనుఁ, డను శివకన్యాభిలషితుఁడను నహుషుండన్. 1482

క. వినుము మఱి యొకవిశేషము, నను హుండుం డపహరించె నాఁ డాదోషం
బున కిపుడు శిక్ష వానికి, నొనరింపఁగ నేఁగుదెంచియుండినవాఁడన్, 1483

చ. అనవుడు నాభటాగ్రణి రయంబున నేఁగి తదుక్తు లన్నియున్
వినిచిన నవ్విహుండుఁడు వివేకవిహీనుఁ డెవండొ వీఁడు వీ
నిని దెగటార్పఁగా వలయు నేఁడె తడాయుతనూజుఁ డెన్నఁడో
చనియెను మాముకోదరకృశానుశిఖాశలభాయమానుఁడై, 1484

క. అని పలికి ధనుర్ధరుఁడై, తనసైన్యముతోడ వచ్చి తాఁకుటయును వెం
టనె నహుషుఁడు మార్గణములు, ధనువున సంధించి దైత్యతతిపైఁ గురిసెన్,

క, కురియుటయును దీవ్రం బగు, శరవర్షంబునకు నిలువఁజాలక మరణిం
చిరి కొందఱు నలుదెసలకుఁ, బరువెత్తిరి కొంద ఱసురబలములలోనన్. 1486

శా. అంతన్ గన్నుల నిప్పుకల్ గురియ రౌద్రాకారముం దాల్చి య
త్యంతావేగముతోడ హుండుఁడు దురాత్ముం డిట్లు మీవేళ నీ

యంతంబుం గనుఁగొంచు నంచు నొకతీక్ష్ణాజిహ్మాగం జేసి ది
గ్దంతుల్ తల్లడిలంగ నార్చె నిజసత్త్వప్రోద్భవప్రౌఢిచేన్. 1487

సీ. అప్పుడు నహుషుఁ డయ్యసురశరాహతి, కించుకేనియుఁ జలియింపఁ బోక
ప్రళయపావకసన్నిభం బైనయొకసాయ, కమును సూంపసిమేనఁ గాఁడ నేసె
నాయేటునకు హుండుఁ డంబరంబున కేఁగి, బాణవర్షము వానిపైని గురిసె
మునిఁగి యాశరవర్షమున నాయుపుత్రుఁడు, గ్రాలుచు నుదయభాస్కరునిపగిదిఁ

గీ. గాంచుటయు మాతలి నతంపు గగనమునకు
నడపె రథమును నసురకు నహుషునకును
జరిగె నచట మహాఘోరసంగరంబు
విస్మయంబునఁ గనుచుండ విబుధు లెల్ల. 1488

సీ. నహుషుఁ డప్పుడు మూఁడునారాచములచేతఁ, బడనైచి ధనువునుబుడమిమీఁదఁ
దురగంబులను నాల్గుశరములచేఁ గూల్చి, గొడుగుకామను నొక్కకోలఁ ద్రుంచి
పదిసాయకములను బరిమార్చి సారథి, భంజించి రథ మేనుబాణములను
కవచంబు రెండుమార్గణములచేఁ జించి, యమ్ము లాఱిటఁ గిరీటమ్ము మాపి

గీ. త్రింశదాశుగములచేత దేహ మెల్ల, నుట్టిపడ రక్తధారలు గొట్టుటయును
గళితపరికరుఁ డయ్యు నాక్రవ్యభోజి, దుమికె నహుషునిపైకి ఖడ్గమును దాల్చి.

క. నహుషుఁ డపు డతనిఖడ్గము, సహసముగఁ ద్రుంచె నిశితశరముల నంతన్
సహియింపక ముద్గరమును,వహియించి నిశాచరుండు వచ్చుచు నుండన్. 1490

క. ధరియించినముద్గరమున్, శరదశకముచేత నడువ నహుషుం డది స
త్వరము దశఖండములు గా, ధరపైఁ బడుటయును జూచి దైత్యుం డంతన్.

చ. గదను ధరించి మారుతముకైవడి తీవ్రున వచ్చుచుండ నా
గద గలబాహువుల్ నఱకె ఖడ్గముచే నహుషుండు హుండుఁ డ
య్యదనునఁ గూడ జంకక రయంబున మీఁదికి వచ్చుచుండఁ ద
ద్హృదయమునందు నాయుసుతుఁ డేసెను శక్తిని దారుణంబుగన్. 1492

క. ఆహతిచేతను వజ్ర, వ్యాహత మగుపర్వతంబువలె దెస లద్రువన్
హాహారావము సేయుచు, నాహుండాసురుఁడు పడియె నవనీస్థలిపై. 1493

క. నిహతుం డగుటయు హుండుఁడు, ప్రహర్షమునఁ బుష్పవృష్టి బర్హిర్ముఖు లా
నహుషునిపైఁ గురియించిరి, విహాయసమునుండి పొగడ విశ్వము లెల్లన్. 1494

క. అంతట నశోకసుందరి, సంతోషముతోడ వచ్చి సఖి యగురంభా
కాంతామణితో నహుషుని, యంతికమున కాత్మవృత్త మంతయు విని చెన్.

క. వినుచుటయును దానును మును, వినియుంటను నహుషుఁ డధికవిశ్వాసముతోఁ
దనరథముపైని వారల, నునిచికొని వసిష్ఠమునియొద్దకు వచ్చెన్. 1496

—: అశోకసుందరీనహుషులకథాకథనము :—

ఉ. వచ్చుటయుఁ గనిష్ఠుం డతివత్సలభావముతోడ నాతనిన్
గ్రుచ్చి కవుంగిలించుకొని కోరికి దీరెను నేఁటి కంచు వా
క్రుచ్చి సులగ్నమందుఁ గనుఁగొంచు నభంబున నిండ దేవతల్
వచ్చి యశోకసుందరికి వానికిఁ బెండ్లి యొనర్చె వచ్చుటన్. 1497

క. ఒనరించి ముని యథావిధి, గను బెండిలి యాయుసుతునిఁ గనుఁగొని వత్సా
చను మింక భవజ్జననీ, జనకులకన్నిట దుడువ సముచుము నచ్చెన్. 1498

క. అనుటయుఁ బ్రణమిల్లి వసి, ష్ఠునకున్ నహుషుం డశోకసుందరితోడన్
జనియె మహేంద్రస్యందన, మున నెక్కి స్వకీయ మైనపురమున కెలమిన్. 1499

క. చని పుత్రుఁ డెప్పుడు వచ్చునో, కనులకుఁ బండువుగ నెప్పు డౌంతు మొ యనుచున్
దినదినమును వగ రెడుతన, జననీజనకులకు మ్రొక్కి సాష్టాంగముగన్. 1500

క. తనవృత్తాంతం బంతయు, వినుచుటయును వారు మిగుల విస్మయ మొదవన్
మును నారదుండు సెప్పిన, పని యయ్యె నటంచు లోనఁ బ్రమదంపడుచున్.

గీ. మున్ను దమకు దత్తాత్రేయముని యొసంగి, నట్టిఫలమును దానికి ననుగుణముగఁ
గలిగినట్టిఫలంబును దెలిపి సుతునిఁ, గౌఁగిటను జేర్చికొని తృప్తి గాంచి రెదను.

వ. అంతట నహుషుండు మాతలిసారథికం బగునింద్రరథంబు నధిష్ఠించి ధనుర్బాణంబులం దాల్చి సప్తద్వీపముద్రితం బగుమహీమండలం బెల్ల జయించి వసుపూర్ణ యగువసుంధరను దండ్రి యగు నాయుమహీపాలునకు సమర్పించి యాతనిచే రాజసూయాదిమహాయాగంబులం జేయించి తల్లి యగు నిందుమతిచే ననేకదానధర్మంబులం జేయించి జననీజనకులను బ్రమోదభరితాంతరంగులం గావించె. 1503

గీ. అంతటను గొంతకాల మాయాయునృపతి
రాజ్యమును నేలి త్రైలోక్యపూజ్యముగను
దృప్తుఁ డయి భార్యతోఁ గూడ దివికి నరిగెఁ
బట్టమును గట్టి సుతునకుఁ బ్రజలు పొగడ. 1504

క. పితృతారకుఁ డగునహుషుని, కథ వినువారలకు నైహికం బగుసౌఖ్య
స్థితియును నాముష్మికస, ద్గతియును జేకూరు ననుట తథ్యము వత్సా. 1505

క. అని చెప్పి యూరకుండుట, యును సర్వము వినుచుఁ గ్రింద నున్నద్విజుం డి
ట్లనియెను శుకరాజ నినుం, గనుఁగొనఁగఁ బత్త్రిబుద్ధి గలుగదు నాకున్.

సీ. అమరుఁడవొ కిన్నరుఁడవొ విద్యాధరుఁడవొ, సిద్ధుఁడవొ శాపవశమునఁ జేసి కీర
తనువు దాల్చినయేమహాత్మ పసరుఁడవొ, చెప్పుము నీజ్ఞానమును జూడఁ జిత్రమయ్యె.

క. అని యడుగుటయును నాతనిఁ, గనుఁగొని కుంజలుఁడు ముందుగా నీ నరితం
బును వినిచి కొంత యావల, విని చెద నాచరిత మెల్ల వినుము ద్విజేంద్రా.

గీ. బ్రహ్మమూల మైనభార్గవకులమందు, జనన మంది చ్యవనుఁ డనెడిపేరఁ
బరగి విద్యకొఱకుఁ దిరుగుచు వచ్చితి, విటకు దైవికముగ నీవు వింటె. 1500

క. అనుటయు నత్యాశ్చర్యం, బును జ్యవనుఁడు చెంది చిత్తమున నే మే మిం
కను వినిపించునొ వినియెద, ననుకొని చెవులొగ్గి యుండ నతఁ డి ట్లనియెన్.

—: కుంజలజన్మవృత్తాంతకథనము :—

ఆ. నేను నిర్జరుఁడను గాను సిద్ధుండను, గాను గిన్నరుఁడను గాను గాను
శాపనిహతుఁ డైనతాపసుండను మఱి, యెట్టి దేవజాతియేని కాను. 1511

వ. కశ్యపప్రజాపతివంశంబునందు విద్యాధరుం డను నొక్కబ్రాహ్మణుఁడు జనియించె. వేదవేదాంగపారగుం డైనయమ్మహానుభావునకు వసుశర్మ నామశర్మ ధర్మశర్మ యనుమువ్వురు పుత్రులు జన్మించిరి. అందు జ్యేష్ఠుం డగువసుశర్మ వేదశాస్త్రార్థకోవిదుం డయ్యె. మధ్యముఁ డగునామశర్మ సకలగుణోత్తరుం డై జగద్విశ్రుతిం బడసె. కనిష్ఠుండ నగు నేను ధర్మశర్మ యనునిరర్థకనామంబు గలిగి సర్వవిధంబులం గనిష్ఠుండ నై పెద్దలవాక్యంబులు వినక విద్యాబుద్ధులను నిరాకరించి డింభకులతోడం గూడి క్రీడావ్యసనంబునం దిరుగం జొచ్చితి. 1512

గీ. అపుడు మాతండ్రి ననుఁ జూచి యాత్మలోన, వగచుచును వత్సబ్రాహ్మణవంశజుఁ డపు
తగునె నీ విట్లు చదువు సంధ్యయును లేక, సకలజనపరిహాసభాజనమ వగుట.

గీ. కష్టముగ నున్న నారంభకాలమందుఁ, గలుగఁ జేయును సర్వసౌఖ్యములు పిదపఁ
గానఁ జదువుము తండ్రి యీకాలమందె, భ్రష్టుఁడయి పోవుఁ జదువని బ్రాహ్మణుండు.

గీ. ఘనత గాంచినవిద్యాధరునిసుతుండు, పరమనిర్భాగ్యులను గూడి తిరుగుచుండె
ననినఁ బదిమందిలోనికిఁ జనెడి నాకు, నెట్లు తల యెత్తుకొన నగు నీవె చెపుము.

క. అని చెప్పుచుండుటయు నా, మనమున కవి కంటకములమాదిరి గాఁగ
జనకుం డుండినవేళను, జనక గృహంబునకుఁ గడపసాగితి దినముల్. 1516

ఆ. అట్లు కొంతకాల మరుగుటయును బ్రాయ, మధిక మయ్యె నాకు నంతలోన
నపహసింపఁ దొడఁగి రందఱు ననుఁ జూచి, తండ్రిమాట లపుడు తలఁపుఁ బట్టె.

గీ. అంతట మనంబులోఁ జింత యంకురించి, ముదిరెఁ బ్రాయంబు నాకింకఁ జదువు రాదు
చదువు రాకున్న స్వర్గమోక్షములు లేవు, తుదకు నరకంబె ధాత నానుదుట వ్రాసె

గీ. ఏమి చేయుదు నే నిపు డెటకుఁ బోదు, నెవఁడు న న్నుద్ధరించు నా కేది దిక్కు
దారి దప్పితి ననుచు సంతాపపడుచు, నొక్కదేవాలయమునఁ గూర్చుంటి నేను.

క. అటు లున్నసమయమున న, చ్చటి కొకసిద్ధుండు వచ్చి సర్వమును నెఱుం
గుటచేత జ్ఞానదృష్టిని, గటకటపడుచుండు నన్నుఁ గని యి ట్లనియెన్. 1520

ఆ. సత్య మేల నీవు పగవంగ నీవ్వ్య,వశను చేత నేను సచ్చినాఁడ
జమవులకను నెల్ల సారభూతం బగు,చదువు చెప్పువాఁడఁ జనువుకొనుము.

క. అనుటయుఁ బోయిన పెన్నిధి,కనఁబడిన తెఱంగునను నఖండానందం
బును జెంది పడితి నే నా,యనపదములమీఁద నంత నతఁ డి ట్లనియెన్. 1522

—: జ్ఞాన స్వరూప నిరూపణము :—

ఆ. కాయమధ్యమందుఁ గలదు జ్ఞానం బను, దివ్యవస్తు వొకఁడు దీపమట్లు
దానిఁ దెలిసికొనినవానికి సర్వంబు, గోచరించు వాఁడె కోవిదుండు. 1523

ఆ. ఆత్మ యనియు బ్రహ్మ మనియుఁ బరంజ్యోతి
యనియు జ్ఞానమునకె యాఖ్య లెసఁగు
నదియె విష్ణు నదియె యాద్యంతములు దానిఁ
దెలిసికొనుటె యెల్లఁ దెలిసికొనుట. 1524

సీ. హస్తవివర్జితం బయ్యును గ్రహియించుఁ, బాదశూన్యం బయ్యుఁ బరిచరించుఁ
గానంగఁబడు రూపు లేనిది యయ్యును, నాస్యహీనం బయ్యు నారగించు
నఘ్రాణ మయ్యును నాఘ్రాణ మొనరించు,నయనముల్ లేక యుండియును జూచు
నాల్క లేకుండియుఁ బల్కుఁ గర్ణములు లే, నట్టిది యయ్యును నాలకించు

ఆ. నగుణ మయ్యు సగుణ మగు నవశ్యం బయ్యు, వశ్య మగును గోప్యవస్తు వయ్యు
సర్వ మగును జ్ఞానసామర్థ్య మెన్నంగ, నలవి గాదు హరిహరాదులకును.

క. దానిప్రకాశము చేతనె, భానుఁడు చంద్రుఁడును దీప్తి వడయుచును బ్రపం
చానందదాయకులుగాఁ, గానంబడుచుందు రెల్లకాలములందున్. 1526

క. దానికి గడగడ వడఁకుచు,భానుం డుదయించు వీఁచుఁ బవమానుఁడు వై
శ్వానరుఁడు మండు నఖిలము, దానికి లోఁబడియె సంతతంబును నడచున్.

క. జ్ఞానం బను బ్రహ్మాస్త్రము, పూనినపురుషునకు వడఁకు భువనము లెల్లన్
గాన నది సెందుమార్గము, నే నుపదేశింతు నీకు నెఱుఁగుము వత్సా. 1528

సీ. నినుఁ జూచుకొనునట్లె కనుఁగొనుచుండుము, సమముగా మిత్రుల శత్రువులను
నింద్రియంబుల నిగ్రహింపుము వైరు లై, వ్వారు గూడను లేరు వానికంటె
మిత్రత్వమును గాని శత్రుత్వమును గాని, నెలకొననీకుము తలఁపులోన
విడిచి యుండకు మొక్కగడియ యైనను శాంతి, నది సర్వసుఖముల కాస్పదంబ

గీ. యాశ నడఁగింపు మేకాంత మాశ్రయింపు
మనియతాహారుఁడవు కాకు మనియమముగ
వర్తిలకు మప్రమాదప్రవర్తనుఁడవు
గమ్ము సర్వజ్ఞభావంబు గలుగు నీకు. 1529

గీ. అని ప్రబోధించుచుండగను నేనతనిమొదల, నుంచి గురుభావమును బ్రబోధించినట్లు
యాచరించుచునుండె నా కబ్బె సకల, లోకవృత్తాంతవిజ్ఞానలోచనంబు. 1530

చ. అని వచియింపఁగాఁ జ్యవనుఁ డాతనిఁ గాంచి మహానుభావ నీ
యనితరసాధ్యశక్తి కతిహర్షము గల్గెను గాని యట్టినీ
కును శుకజన్మ మేర్పడుటకుం గలకారణ మేమొ నాపయిం
గనికర ముంచి చెప్పు మని గౌరవ మొప్పఁగ వేఁడుకొంటయున్. 1531

వ. కుంజలుం డాతని కిట్లనియె. 1532

సీ. ఒకనాఁ డొకకిరాతుఁ డొకశుకంబును మున్ను, విక్రయింపఁగనుండ వీథులందు
దానిని గొని తెచ్చి ధరణీసురుం డొక్కఁ, డర్పించె నాకు నత్యాదరమున
నది నన్ను వదలక యనుదినంబును వచ్చు, చును నేను బోయెడి చోట్ల కెల్ల
ముద్దుపల్కులచేత మోహపెట్టుచునుండ, నేను దన్మోహంబులోనఁ జిక్కి

గీ. బిడ్డతీరున దానిని బెంచుకొనుచుఁ, గ్రమముగను నాఁటి జ్ఞానమార్గమును మఱచి
యుండ నొకనాఁడు నాచిల్క నొక్కపిల్లి, పట్టుకొని దానికడుపునఁ బెట్టుకొనియె.

క. అది మొదలుగఁ దద్దుఃఖం, బెదలోపలఁ బాదుకొని సహింపనితాపం
బొదవింప దానిమాటలె, మదిఁ దలఁచుచు నేడ్చుకొనుచు భ్రమందితిఁ దుదకున్.

గీ. మరణకాలంబునందు సంప్రాప్త మైన, మతియె గతి యగు నని చెప్పు శ్రుతిని బట్టి
పడితి నే నొకచిలుకగర్భమున నపుడు, స్మృతికి వచ్చెను బ్రాక్కృతం బెల్ల నాకు.

క. అసమయంబున సిద్ధుఁడు చేసినయుపదేశ మెల్లఁ జిత్తములోనన్
భాసిల్లి తననుకంపను, జేసి స్థిరం బయ్యె నేను జెడిపోకుండన్. 1536

గీ. అంతటను బుట్టి కీరంబ నగుచు నేను, జ్ఞానవిచ్ఛిత్తి కలుగనిదానివలనఁ
దెలిసికొనుచుఁ ద్రికాలవార్తలను గర్మ, శేషమును దాఁటుటకు నిరీక్షించుచుంటి.

గీ. కాన గురుతీర్థమునకు సమాన మైన, తీర్థములు లేవు జ్ఞానోపదేశమునను
దుఃఖమయ మైనసంసృతిఁ దొలఁగఁద్రోసి, కర్మరాహిత్య మొనరించుఁ గడకు నదియె.

క. అని చెప్పి యూరకుండుట, యును జ్యవనుం డమితహర్షయుక్తుం డగుచుం
జని సకలవృత్తములు గనుఁ, గొనుచును జ్ఞానమున ముక్తిఁ గొనియెను సనకన్.

చ. అని వచియించి కోరుకొనుమయ్య వరంబు నొసంగువాఁడ నీ
కనుటయు వేనుఁ డచ్చెరియ మంది జనార్దన చేర్చికొమ్ము నీ
తనువున నన్ను శీఘ్రముగ దాసుని పైని ననుగ్రహంబు గ
ల్గినయెడ నీకు వేఱొకటి లేదు వరింపఁగ నేఁడు నావుడున్.

క. ఒనరింపు మశ్వమేధం, బొనరింపుము రాజసూయ మొనరింపుము భూ
ధనధాన్యగోహిరణ్యా, ద్యనుపమవస్తుప్రదాన మవనీనాథా. 1541

గీ. బ్రహ్మహత్యాది ఘోరపాపములు గూడఁ
దొలఁగిపోవుఁ జతుర్వర్గ ఫలము గలుగు
నెట్టియభిలాషమును లేక యెడఁదలోన
నన్నుఁగూర్చి యొనర్చుదానంబువలన. 1542

క. ననుఁగూరిచి యేభావం, బునఁ జేయునొ పాత్రదానమును నాభావం
బును సఫలం బొనరించెడి, పని నాయది నేను బద్ధపడుదును దానన్. 1543

వ. సత్వరంబుగ మదాజ్ఞాపరిపాలనంబు గావించి నాలోన నేకీభవించెదవు గాక
యని పలికి జనార్దనుం డంతర్ధానంబు నొందె. 1544

క. అంతట వేనధరిత్రీ, కాంతుఁడు చనుదెంచి నిజనికాయ్యంబునకున్
సంతోషించుచుఁ బృథునకు, నంతయు వినిపించి యిట్టు లనియెన్ ముదమున్.

గీ. తనయ యస్మద్వసుంధరాతలమునందు, మనసుచేతను గాని వాక్కునను గాని
కాయమునఁ గాని పాపంబు చేయువాని,శిరము ఖండింపు మది యపేక్షితము నాకు.

క. అనుటయుఁ బృథువు తదాజ్ఞను, గొని చేయందొడఁగె నజునిఁగూర్చి తపంబున్
వనజాసనుండు దత్తప, మునకున్ ముద మొంది శీఘ్రముగ దయచేసెన్. 1547

గీ. అట్లు దయచేయుటయుఁ బృథుం డజున కెఱఁగి
స్వామి మారాజ్యమునఁ గలజనులలోనఁ
గలుష మొనరించువారలతలలు శంఖ
పాదపఫలంబులట్టులు పడును గాక. 1548

క. అని ప్రార్థించుటయును విధి, యనుగ్రహించి వర మట్లె యంతర్ధానం
బును జెందె నంత నిజపుర, మునకుం జనుదెంచి పృథువు మోదముతోడన్.

గీ. వినిచి తండ్రికి జరిగినవిషయ మెల్ల, నశ్వమేధంబు మొదలగునధ్వరములు
ధేనుభూస్వర్ణరత్నాదిదానములును, నతనిచేతను జేయించె నద్భుతముగ.

గీ. అంత వేనునిరాజ్యమునందు నెవ్వఁ, డేని త్రికరణములను నెద్దాననేని
దురిత మొనరించునెడ వానిశిరముదునిఁగి,యవనిపైఁబడుచుండె నత్యద్భుతముగ.

క. అది బ్రహ్మవరఫలం బని, విదితం బగుటయును మిగుల వెఱ జనియింపన్
వదలి యధర్మపథంబును, బదుగురును సధర్ము లగుచుఁ బరగిరి లోకుల్. 1552

గీ. ధర్మయుత మయ్యె లోక మంతయును ననెడు,పరమహర్షంబునను వేనపార్థివుండు
పృథునిపై రాజ్యభారంబు పెట్టి చనియెఁ, దనువుతోడనె వైకుంఠధామమునకు.

—:భూమిఖండ శ్రవణపఠన మాహాత్మ్య కథనము:—

క. ఇది భూమిఖండ మిందుం, జదివిన నొకపద్యమేని బ్రాహ్మణులకుఁ బ
ర్వదినంబునందు గోవులు, పదినూఱు లొసంగినట్టిభాగ్యము గలుగున్.

గీ. శత్రుసంహారమును రోగసంక్షయమును, శోకనాశనమును పాపశోషణమును
సంతరాయప్రశాంతియు నామతిల్లు, వినినయెడ భూమిఖండంబు ననుదినంబు.

క. సులభముగ విష్ణుధామము, గలుగవలయు ననెడికోర్కి గలిగినపుణ్యా
త్ములు భూమిఖండమును విన, వలయును వర్జించి యితరవాంఛల నెల్లన్.

క. అని చెప్పుటయును శౌనక, మునిముఖు లత్యంతహర్షమును జెందిరి యో
గనియూథు లగుటఁ గన్గొని, మనములలో భూమిఖండమాహాత్మ్యంబున్. 1557

క. గౌరీప్రాణేశ్వర సం, సారపయోరాశిమగ్నజనసంతానో
ద్ధారక తారకదేశిక, వారితకామాదివైరివర్గా భర్గా. 1558

పృథ్వీవృత్తము.

తపోధనమనోనికేతనకృతస్వకీయస్థితీ
ప్రపంచపరికల్పనాదికృతిపాండితీధూర్వహా
కృపారససమున్మిషన్మధురదృక్ప్రసారోద్ధృత
ప్రపన్నజనసంసృతిప్రబలభార విశ్వేశ్వరా. 1559

గద్యము

శ్రీ చిదంబరకవీంద్రప్రణీతం బైనశ్రీమదాంధ్ర పద్మపురాణంబున
భూమిఖండము
సమాప్తము.

శ్రీకాశీవిశ్వేశ్వరార్పణమస్తు.



శ్రీమదాంధ్ర పద్మపురాణము

బ్రహ్మఖండము



మత్కైలాసాచల
ధామా తామసజనప్రతారణనిపుణా
వ్యామోహితవాచంయమ
రామాజన విశ్వనాథ ప్రకటితబోధా. 1

వ. అవధరింపుము. 2

క. మనుజులకు సుగతి యేవిధ, మునఁ గలుగునొ కలియుగమున మునివర మాకున్
వినిపింపు మనుచు శౌనక, ముని యడుగుడు సూతుఁ డపుడు మునికిట్లనియెన్.

క. వినుము తపోధన యిప్పుడు, నను నీ వడిగినవిధంబుననె పూర్వము జై
మిని మాగురు వగుద్వైపా, యనముని నడుగంగ నతని కతఁ డిట్లనియెన్.

ఆ. సాధుసంగమమున శాస్త్రశ్రవణ మబ్బు, సంఘటించు దాన శార్ఙ్గిభక్తి
దానివలనఁ గలుగు జ్ఞానంబు సమకూడు, దానిచేత సుగతి మానవులకు. 5

ఆ. విష్ణుకథకు నెవఁడు విఘ్నంబు సేయునో, వాఁడు నరకలోకవాస మొందుఁ
గానరాదు చూడ వానికిఁ గోటిను, స్వంతరముల కైన నాత్మశాంతి. 6

సీ. వినఁ దలంచినమాత్రన విష్ణుకథను, బ్రహ్మహత్యాదిసకలపాపములు గూడ
భస్మమైపోవుఁ జిచ్చులోఁ బడినయట్టి, శలభములువోలె నిఁక నెంతో శ్రవణఫలము.

గీ. హరిచరిత్రంబు బోధించునట్టిగ్రంథ, మున్నయింటికిఁ జేరలే రెన్నటికిని
దన్మహత్త్వవిశోషితధైర్యు లగుచు, గజగజ వడంకుచుండెడి కాలభటులు. 8

గీ. అపహసించెడివాఁడు దైత్యారికథను, శ్రీపతిచరిత్రములను దూషించువాఁడు
హరిపురాణంబు రుచియింపనట్టివాఁడు, పరిగణితు లైరి మువ్వురు పాపులుగను.

క. అనృతం బని వచియించునొ, జనార్దనునిచరిత మెవఁడు జగమున నాపా
పిని దప్తాయఃపిండం, బున నిటు లటులును యముండు పొరలించుఁ జుమీ. 10

క. జరుగుచునుండునొ యెక్కడ, హరిసంకీర్తనము శౌరి యక్కడ నుండున్
దొరకును హరిభటులకుఁ ద, త్కరుణావీక్షణసుఖాధికారం బనఘా. 11

క. అనవుడు జైమిని హరిభటు, లన నెవ్వరు స్వామి చెప్పు మని యడుగుటయున్
మునిలోకవిభుఁడు ద్వైపా, యనుఁ డాతని కిట్టు లనియె నానందమునన్. 12

—: హరిభటనిరూపణము :—

సీ. హరినామకీర్తనపరు లైనవారును, విడువనివారును విష్ణుభక్తి
సత్యభాషణులు మత్సరవివర్జితులును, బరిహృతపరదారపరధనులును
దయగలవారును దంభవర్జితులును, వేదశాస్త్రపురాణసాదరులును
బ్రాహ్మణద్వేషంబు వడయనివారును, బితృతుష్టికరులును నతిథిరతులు
గీ. విషమువలెఁ జూచువారును విప్రధనముఁ, దులసి నర్చించువారును జలుపువారు
కన్యకాదానమును నాస్తికప్రసక్తి, లేనివారును హరిభటుల్ మానివర్య. 13

వ. మఱియును హింస చేయనివారును గామక్రోధలోభమోహంబుల నడంచినవారును దులసిని ధరియించువారును విష్ణువేశ్మంబు గట్టించువారును విష్ణుకైంకర్యంబు గావించువారును విష్ణునైవేద్యంబు భుజియించువారును గృహంబునందు సాలగ్రామార్చనంబు గావించువారును విష్ణుచరిత్రంబులు వినువారును నేకాదశీరాధాష్టమీవ్రతపరాయణులును నచ్యుతాభిషేకజలనిషిక్తాంగులును విష్ణుదేవాలయంబు దుడుచువారును విష్ణుమందిరంబున దీపంబు వెట్టువారును విష్ణుభవనంబునకు లేపనంబు గావించువారును హరిభటులుగాఁ జెప్పంబడిరి.

గీ. అట్టిహరిభటుఁ డొక్కఁడు పుట్టె నేని, వాఁడు పావన మొనరించు వంశ మెల్ల
నమసిపోవును వానిసంసర్గమునను, బ్రహ్మహత్యాదిఘోరపాపములు గూడ.

—: చోరునకు వైకుంఠప్రాప్తి గలుగుట :—

క. దీనికి దృష్టాంతముగను, నే నొకకథ వినుచువాఁడ నీ కది విన్నన్
గానంబడు హరిభటమహి, మానంత్యము చెప్ప నేల యధికం బింకన్. 16

వ. మున్ను ద్వాపరయుగంబునందు బ్రహ్మస్వాపహారకుండును మిత్త్రద్రోహియును నసత్యభాషణుండును బరదారలోలుండును గ్రూరుండును గోమాంసభక్షకుండును సురాపాయియుఁ బాషండజనసంగతుండును న్యాసాపహారకుండును శరణాగతహంతయు వేశ్యాలంపటుండును నగుదండకుం డనునొక్కచోరుం డొక్కనాఁడు భగవద్ద్రవ్యాపహరణాభిలాషంబున విష్ణుదేవాలయంబుం గర్దమవిలిప్తంబు లగుపాదంబులఁ బ్రవేశించి పాదకర్దమంబు దేవాలయభూమికిం దుడిచి రత్నకాంచనవిభూషణవిరాజమానుండును బీతాంబరధరుండును మనోహరపర్యంకశాయియును నగురాధాకృష్ణునిం జూచి ప్రణామంబు గావించి తద్భూషణంబు లన్నియు నొలిచి విష్ణుపీతాంబరంబునం గట్టుకొని చంకం బెట్టుకొనుటయు నాభూషణంబులు ఘోరారావముం జేయం దొడంగె. అంత నాచోరుండు భయప్రకంపితగాత్రుండై యామూట నచ్చటన పాఱవైచి వేగంబునం బోవుచు మార్గమధ్యంబున నొకకృష్ణసర్పంబు కఱనఁ దక్షణంబ యచ్చోటన పడి మృతుం డయ్యె.

సీ. అప్పుడు యమదూత లతనిఁ దోడ్కొనిపోయి, శమనునిసన్నిధానమున నునుప
దండధరుండు క్రోధమునఁ దచ్చరిత మే, మని చిత్రగుప్తుని నడుగుటయును
నతఁ డంతకున కిట్టు లనియె స్వామి యితండు, కావింపనియఘంబు కానరాదు
కాని స్వకృతసర్వకలుషఘ్న మగునొక్క, శ్రేయంబు వీనిచేఁ జేయఁబడియె

గీ. ననుటయును విస్మయం బొంది యంతకుండు, చెప్పుమది యేదొ నావుడుఁ జిత్రగుప్తుఁ
డిట్లనియె దేవరయొక్క నాఁడితఁడు దొంగ, తనము చేయంగఁ జని విష్ణుధామమునకు.

గీ. అచటఁ దన పాదముల నున్న యట్టిబురద, రాయఁగాఁ దత్ప్రదేశ రంధ్రములు పోయె
దానివలనను సకలపాతకము లడఁచి, హరిపదమునకుఁ జేర్చు పుణ్యంబు గలిగె.

క. అనుటయు శమనుఁడు శీఘ్రం, బున లేచి తదంఘ్రియుగ్మమునకుఁ బ్రణామం
బొనరిచి వైకుంఠమునకుఁ, బనిచె నతని స్వర్ణరథమునైని మునీంద్రా. 20

క. అనుటయును విష్ణుమందిర, మున కింకను భక్తితోడఁ బొసఁగించిన లే
పనమున కెంతటిఫలితము, జనియించునొ యనుకొనుచును జైమిని చనియెన్.

—: అపుత్రతాదిహేతుతన్నివారణోపాయకథనము :—

గీ. అనుటయును శౌనకుం డిట్టు లనియె సూత, పుత్రకులు గతించుటకును నపుత్రతకును
పండులుగఁ బుట్టుటకును స్త్రీసంతతికిని, గారణం బేమొ యెట్లొ తద్వారణంబు.

చ. అనుటయు సూతుఁ డిట్లనియె నార్య విరించిని మున్ను దేవతా
ముని యడుగంగ నిట్లు కడు మోదముతో వచియించె ధాత యా
తని కదె నీకు నే వినిచెదన్ విను బ్రాహ్మణవృత్తులన్ హరిం
చినను హరింపఁజేసినను జెందు నపుత్రత జంతుకోటికిన్. 23

వ. తద్దోషపరిహారంబుగాఁ బద్మపురాణశ్రవణంబును భూదానంబును గోదానంబును
సువర్ణవిష్ణుప్రతిమాదానంబును గావించెనేని పుత్రజననం బగు.

క. ఒనరిచి యతిథి నిరాశునిఁ, గను క్రోధవశంబుచేతఁ గావించినదం
డనమునఁ జేసి యపుత్రత, యొనగూడక తప్ప దెంతయోగ్యులకైనన్. 25

గీ. అట్టిదోషంబు శాంతింప నతిథులైన, బ్రాహ్మణుల కన్నజలములు భక్తి నొసఁగి
యాదరింపంగ వలయు నయ్యాదరమున, నామతిల్లును బుత్రపౌత్రాభివృద్ధి. 26

క. మును పరశిశువుల హింసిం, చినకారణమునను బుట్టి శిశువులు మరణం
బును గాంతురు తద్దోషము, చన స్వర్ణప్రతిమ నీయఁ జను విప్రునకున్. 27

వ. మఱియును. 28

క. మృతసంతతు లగుచుందురు, క్షితిలో మును భ్రూణహత్య చేసినయువతుల్
పతితోడను హరిదినస, వ్రతమును గావించి తొలఁగవచ్చును దానిన్. 29

వ. వెండియును. 30

క. జలమగ్నుఁ డైనబాలునిఁ, దిలకించియు నుద్ధరింపఁ దివురనిపాపా
త్ములు పుత్రహీను లగుదురు, కలకాలము దోషశాంతి గావింపనిచోన్. 31

వ. దీనికి దృష్టాంతంబుగా నొకగాథ వచియించెద.

సీ. త్రేతాయుగంబున శ్రీధరుం డనియెడి, భూధవుం డొక్కఁ డపుత్రుఁ డగుట
మనములోఁ దనకర్మమునకుఁ జింతిల్లుచు, నుర్వి నేలుచు నుండ నొక్కనాఁడు
దైవవశంబున ద్వైపాయనుఁడు తన, కడకు రా బహుభక్తి గడలుకొనఁగ
నతఁడు హేమప్రభావతి యనునిజకాంత, తోడ మౌనికిఁ బ్రణతుల నొసర్చి

గీ. స్వామి నాయనపత్యత కేమి హేతు, వగునొ వచియింపు మని వినయమున నడుగ
వ్యాసుఁ డిట్లని పలికె జనాధినాథ, వినఁ దగినయంశ మెల్లను వినుతు వినుము.

గీ. పూర్వజన్మంబునను నీవు భూమిపాల, చంద్రుఁ డనునామమునను నీచారుగాత్రి
శంకరీనామమునను బ్రశస్తి కెక్కి, పతియు సతియును నగుచు నొప్పితిరి వింటె.

గీ. అట్టు లుండంగ నొకసమయంబునందు, వనవిహారంబునకు మీరు చనినయపుడు
చూచియును నీటఁ బడినశిశువును నొకని, లేవఁదీయక వచ్చితి రేవపడుచు.

ఆ. అంత వాఁడు మునిఁగి యానీటిలోపలఁ, బ్రాణములను విడిచె నాయఘంబు
మిమ్ముఁ జుట్టుకొనియె మీకర్మమునఁ జేసి, కలిగె మీ కపుత్రకత్వ మిపుడు. 36

గీ. అనుటయును విని యాతఁడు మునివరేణ్య, యమ్మహాఘోరపాపంబు నడఁచివైచు
మార్గ మేదైన నున్నచో మాకు దానిఁ, దెలుపు మని చేతులొగ్గి ప్రార్థించుటయును

గీ. వ్యాసుఁ డారాజమౌళి కిట్లనియె నపుడు, గౌరి యైనట్టికన్యను గనకవసన
సంయుతము లైనవృషభకూశ్మాండములను, ధరణిసురునకు భక్తితో దానమిమ్ము.

గీ. వినుము పద్మపురాణము వినిచినట్టి, బ్రాహ్మణునకు నొసంగుము భక్తితోడ
ధనకనకవస్తువాహనార్థముల నెల్లఁ, దొలఁగిపోవు నపుత్రతాదోష మధిప.

గీ. అనుటయును తేఁడు వ్యాసమహర్షి చెప్పి, నట్టు లొనరించి వర్షమధ్యమున నఖిల
గుణగణాలంకృతుం డైనకొడుకు నొకనిఁ, గాంచె నపత్యతాపాతకంబు దొలఁగి.

గీ. తాను మును చేసినట్టిగోదమనమునను, బ్రాహ్మణీసంగమమునను బాదజుండు
పుట్టును నపుంసకుండు గాఁ బుడమిలోన, నవలఁ గావించెనేని పుణ్యంబు నతఁడు.

గీ. ఎన్నొ జన్మాంతరంబుల నెత్తి యపుడు, కన్యలనె కాంచుచును వారికతన ఘోర
దుఃఖములు చెందుచుండు నాదోషముడుగ, నగును బూర్వోక్తదానము లాచరింప.

—: వైకుంఠప్రాపకపుణ్యకథనము :—

గీ. అనుటయును శౌనకుం డప్పు డతనిఁ జూచి, సూత వైకుంఠలోకంబు చేతనులకు
నప్రతిహతంబుగాఁ గల్గు నట్టిపుణ్య, మేది యైనను నుండిన నెఱుఁగఁ జెపుమ.

క. అని యడుగుటయును సూతుఁడు, వినయంబున నిట్టు లనియె విప్రునకు నికే
తనమును వృత్తియు నొసఁగిన, జనులకు వైకుంఠపదము సంప్రాప్తించున్. 44

గీ. సౌధమును బ్రాహ్మణునకు నొసంగినట్టి, పుణ్యపురుషుండు వైకుంఠపురమునందు
స్వర్ణసౌధంబుపై నివాసంబు గలిగి, యనుభవించును దివ్యసౌఖ్యంబు లెల్ల. 45

గీ. పృథివిరేణువు లేనియు వృష్టితోయ, బిందుతతు లేనియును లెక్కపెట్ట వచ్చుఁ
గాని శక్యంబు గా దెంతవాని కైన, బ్రహ్మసంస్థాపనఫలంబు పరిగణింప. 46

గీ. కలుగు మఱియును విష్ణులోకంబు ధనము, నొసఁగి యైనను నసువుల నొసఁగి యైన
భూసురులఁ బ్రోచునట్టిసత్పురుషులకును, వినుము దీనికి నొకగాథ వినుతు నీకు.

—: నరమేధవృత్తాంతము :—

సీ. మున్ను ద్వాపరయుగంబున దీననాథుండు, నా నొక్క మేదినీనాయకుండు
పుత్రులు లేరని పొగులుచు నొకనాఁడు, కదలి గాలవఋషికడకు నేఁగి
తత్పాదములమీఁదఁ దల యుంచి తన కుప్ప, తిలినసంతాపంబు తెలుపుటయును
నతఁ డనుకంపాన్వితాత్ముఁడై యరమోడ్పుఁ, గనులతోడను నొకగడియ చూచి

గీ. యధిప చేయుము నరమేధయాగ మీవు, పుత్రులను గాంచుటకు బుద్ధి పుట్టెనేని
యనుటయునుదీననాథుఁడిట్లనియెఁజెపుమ, స్వామినరమేధపురుషలక్షణమునాకు.

గీ. అనుడు గాలవుఁ డతని కిట్లనియె రాజ, సుందరుఁ డకృష్ణవర్ణుఁడు శుద్ధవంశుఁ
డవికలాంగుఁడు యువయు నాహ్లాదకరుఁడు, శాస్త్రవిదుఁడునుగాఁదగు సవనపశువు

క. అనవుడు నట్టులె మఖముం, బొనరించెద ననుచు భూవిభుఁడు సంకల్పం
బును జేసి పంపె దూతల, ధనరాసు లొసంగి సప్తతంతునరునకై. 50

క. పనుచుటయు భటులు గ్రామము, లును బట్టనములును దిరిగి లోకుల నెల్లన్
గని కని నరమేధమునకు, నను వగునరుఁ డబ్బ కునికి నతిదుఃఖితులై. 51

ఆ. కడకు దైవికంబుగాఁ జని దశపుర, మనెడినగరమునకు నందులోనఁ
గృష్ణదేవుఁ డనెడిక్షితిసురునకు మంచి, కొడుకు లుండి రనెడిసడి నెఱింగి. 52

సీ. ఆబ్రాహ్మణునికడ కరిగి విప్రోత్తమ, తెలియుము రాజదూతలము మేము
మారాజు నరమేధమఖము గావింపఁగాఁ, దలపెట్టి బలి యీయఁ దగిననరునిఁ
గొని రం డనుచు మమ్ముఁ బనిచెఁ గైకొని ద్రవ్య,మిమ్ము నీపుత్రులం దెవని నైన
నటు లీయకున్నచో నెటు లైనఁ గొనిపోదు,మవిలంఘ్య మగుట భూధవునియాజ్ఞ

గీ. యనుటయును విప్రదంపతు లార్త లగుచుఁ, బుత్రకులఁ బాయఁజాలక పొగిలి పొగిలి
నేతృశాసన మవిలంఘనీయ మగుటఁ, జివర కిట్టు వచించి రా సేవకులకు.

ఉ. తల్లికిఁ జిన్నవానిపయిఁ దప్పదు మోహము పెద్దవానిపై
నుల్లము మెండు తండ్రి కిఁక నుండిన వాఁ డొకమధ్యముండు నా
నల్లన మధ్యముండు వినయంబున నొద్దకు వచ్చి తండ్రికిం
దల్లికి మ్రొక్కి నిల్చె వసుధాపతిదూతలమ్రోల నంతటన్. 54

గీ. భృత్యు లాతనిఁ దోడ్కొని యేఁగుచుండఁ
గాశికుఁడు స్వాశ్రమముకడఁ గాంచి వారి
నెవరొ మీ రీకుమారకుఁ డెవఁడొ యెచటి
కరుగుచుంటిరొ చెప్పుఁ డం చడుగుటయును. 55

దూతలు తమవృత్తాంతం, బాతపసికిఁ జెప్ప నతఁడు యాగపశువుగా
క. నే తెంతు నేను విడువుం, డీతని నని వేఁడుకొనియె భృత్యుల నంతన్. 56

ఆవేఁడుకోలు విని భటు, లీవు తగవు యాగబలికి వృద్ధుఁడ వగుటన్
క. భూవరుఁడు వేచి యుండును, బోవలయును మే మటంచుఁ బోవుచు నుండన్.

గీ. బ్రాహ్మణప్రాణరక్షణఫలవిదుండు, గాన నమ్మౌని వారలతోన యేఁగి
యాగశాలాంతరంబునయందు నున్న, దీననాథున కొనరించి దీవనలను. 58

గీ. దేవ యీవిప్రునిఁ ద్యజించి నీవు నేఁడు
గొనుము నను యాగపశువుగాఁ గోపకు పుట్టుఁ
గానిచో బలిరహితము గా నొనర్ప
మధ్వరము నీకు జనియించు నాత్మజుండు. 59

క. అనుటయును దీననాథుఁడు, ముని నుడివినయుభయపక్షములను ద్వితీయం
బును ననుసరించి యధ్వర, మును బలిరహితముగఁ జేసి పుత్రునిఁ బడసెన్.

సీ. అంతటఁ గాశికుం డావిప్రసుతునిఁ దో, డ్కొని వేగ దశపురంబునకు వచ్చి
కనుఁగొని సుతవియోగవిషాదమున నంధ, దశ నున్న బ్రాహ్మణదంపతులను
నెఱిఁగించి జరిగినవృత్తాంత మంతయుఁ, జూచికొనుండు మీసుతుని ననుచు
మునిసిద్ధవచనంబునను జేసి వార లాం, ధ్యంబు తొలంగి నందనునిఁ జూచి
గీ. హర్షవశమునఁ గౌఁగిట నదిమికొనుచు, వాని నమ్మౌని కెఱఁగి సన్మాన మొదవ
స్వామి జీవనదానంబు సలిపినట్టి, సుకృత మొనగూడె నీకు మాసుతుని నిడుట.

క. తరియించితి వైకుంఠము, కరగతమై యుండ నేమి కావలె నింకన్
ధరణిసురరక్షణార్థము, శరీరమును గూడ గణనసలుపని నీకున్. 62

క. అనవుడు నమ్మౌనివర్యుఁడు, చనియె నిజాశ్రమమునకు వెసన్ వైకుంఠం
బును నిజహస్తగతంబుగ, నొనరిచికొన్నట్టిసమధికోల్లాసమునన్. 63

గీ. శ్రద్ధతోడను నీకథ చదువుకొన్న, నట్లు కాదేని వినిన బ్రాహ్మణునివలనఁ
బ్రాప్త మగుఁ బునరావృత్తిరహిత మైన, విష్ణుధామంబు మాటలు వేయు నేల.

క. అట్టులె విష్ణ్వాలయమును, గట్టించి ప్రతిష్ఠ చేయఁ గలిగినవారున్
గట్టకడకు వైకుంఠపు, రాట్టాలికలందు నుందు రానందమునన్. 65

వ. దీనికి దృష్టాంతంబుగా మున్ను నారదునకుఁ బరమేష్ఠి చెప్పినయొక్క కథ వచి
యించెద నాలకింపుము. 66

—: పణ్యసుందరీవృత్తాంతము :—

సీ. మున్ను ద్వాపరయుగంబున నుండెఁ బణ్యసుం, దరి చంచలాపాంగ నాఁగ నొకతె
యాకాంత యొక్కనాఁ డధికధనాపేక్ష, నరుగుచు విటుఁడు ర మ్మనినకడకు
విష్ణ్వాలయమున దైవికముగా నిమిషమా, త్రంబు తాంబూలచర్వణము చేసి
తనహస్తమున కంటుకొనినసున్నము రాచి, తత్కుడ్యమునకు సత్వరము గాఁగ,

గీ. వనమునకుఁ జేరి జారుఁడు వచ్చియుండు, ననుచు నట్టిట్టు చూచుచున్నంతలోనఁ
జిలుపచిలుపని చీకటు లలముకొనఁగ, నప్పు డొకపులి వచ్చి యావనితను జంపె.

క. అంతట యమభృత్యులు త, త్కాంతామణి నొక్కచర్మదామముచే న
త్యంతదృఢంబుగఁ గట్టి కృ, తాంతునికడ కీడ్చికొనుచు నరుగుచు నుండన్. 68

గీ. శంఖచక్రగదాపద్మశాలు లైన, విష్ణుదూతలు చనుదెంచి వింటినడుమ
నెదురుకొని వారలను మీర లెవ్వ రీమె,నీడ్చుకొనిపోవుటకు హేతు వేమి చెప్పుఁడు

క. అనుటయు యమభటులము మే, మనేక పాపములు చేసినట్టికతన నీ
చెనఁటిని యమపురమునకుం, గొనిపోవుచునుంటి మెదురుకొన నేమిటికిన్. 70

క. అని యమభృత్యులు పలుకుడు, విని వారల కిట్టు లనిరి విష్ణునియోజ్యుల్
గొనిపోవ నంత సులభమె, వనజాక్షునిభక్తురాలు వదలుం డీమెన్. 71

చ. అనుటయు నింతమాత్రకె భయంపడువారమె చాలుఁ జాలు నీ
చెనఁటిని భక్తురా లనుచుఁ జెప్పఁగఁ జెల్లునె పాపవంతులన్
బొనరుపఁ బుణ్యవంతులను బుణ్యులఁ బాపులఁ జేయ బ్రహ్మకై
నను దర మౌనె పొందు గమనంబున కడ్డము వెట్టకుండఁగన్. 72

చ. అని యమదూత లాడుటయు నంబుజలోచనభృత్యు లాగ్రహం
బున గద లెత్తి పైనిఁ బడి మోఁదఁ దదాహతి కోర్వలేక యా
వనితను వీడనాడి సమవర్తిభటుల్ చని స్వామిచెంతకున్
వినిచిరి రోదనధ్వనులు విన్నగలింప నుదంత మంతయున్. 73

సీ. అది యంతయును విని యంతకుం డడఁగించు, కొని పొంగి పొరలెడిక్రోధ మెల్లఁ
జిత్రగుప్తునిఁ జూచి చెప్పు మావేశ్య చే, సినపుణ్య మేమియొ యనుచు నడుగ
నతఁడు కై మోడ్చి యి ట్లనియె మహాస్వామి, విన్నవించెద నున్నవిషయ మెల్ల
నాధనకామిని యాచరింపనియట్టి, పాతకంబులు లేవు భూతలమునఁ

గీ. గాని యొకనాఁడు జారసంగమముకొఱకు, నరుగుచును విష్ణుదేవాలయమున నాఁగి
క్షణము గావించి తాంబూలచర్వణంబు, రాచెఁ దద్భిత్తికకుఁ గరాగ్రస్థసుధను.

క. ఆపుణ్యముచేతను దన, పాపము లన్నియును బోయి పరమపదంబున్
బ్రాపింపఁ దగినయోగ్యత, యాపడఁతికిఁ గలిగె ననుచు నంతకుఁ డంతన్. 75

గీ. అంతమాత్రకె యింతమహత్త్వ మొదవ
నింక విష్ణ్వాలయము నిల నేర్పరించు
వారలమహత్త్వ మే మనవచ్చు ననుచుఁ
బొగడుచును మీఁదినిజకృత్యమునకు దిగిరి. 76

ఆ. అచట విష్ణుదూత లాపడంతిని రాజ, హంసయుక్త మైనస్యందనమునఁ
గూరుచుండఁ బెట్టుకొని పోయి దింపిరి, క్షేమముగను విష్ణుధామమందు. 77

క. అంతట గోవిందుం డా, కాంతకు దర్శన మొసంగి గౌరవమున నీ
వింతి వసియింపు మిచటనె, సంతతమును ననుచు నాత్మసన్నిధి నునిచెన్. 78

గీ. అనుటయును శౌనకుం డిట్టులనియె సూత, తెలుపు మేపుణ్యకర్మంబువలనఁగలుగఁ
గలదొ గోలోకవాసభాగ్యంబు నాఁగ, నమ్మహర్షికి సూతుఁ డి ట్లనియె నపుడు.

—: గో లో క ప్రా ప క పు ణ్య క థ న ము :—

క. మునినాథా విను మిప్పుడు, నను నీ వడిగినవిధంబున నె పూర్వము బ్ర
హ్మను నారదుఁ డడుగుటయును, వనజభవుం డిట్లు మౌనివరునకుఁ జెప్పెన్. 80

క. ఒకసమయంబున దుర్జను, లొకకొందఱు సంఘములుగ నొనగూడి ధరన్
బెకలింపఁ దొడఁగ మేదిని, యొకగో వయి వచ్చి శరణ మొందెను నన్నున్.

ఆ. అపుడు నేను శౌరియంతికమున కేఁగి, విన్నవించినాఁడ విషయ మెల్ల
నాలకించి కృష్ణుఁ డరుగు మీ వమరుల, తోడ భువికి నేను గూడ నత్తు.

క. అని చెప్పి నాకుఁ దనకాం, తను రాధను బిలిచి దేవి ధరణీభారం
బును దీర్ప నేను బుడమికిఁ, జనుదెంచెద నీవు మొదటఁ జను మక్కడకున్.

గీ. అనుటయును రాధ ప్రియునియాజ్ఞను ధరించి, భాద్రశుక్లాష్టమీదివాభాగమందుఁ
బొడమె వృషభానురాడ్యజ్ఞభూమిలోనఁ, గనుల మిఱుమిట్లుగొలిపెడికళలతోడ.

గీ. అపుడు వృషభానునరపాలుఁ డాకుమారి, నెత్తుకొని వచ్చి సంతసం బిగురులొత్తఁ
దనవధూమణి కీయ నాతన్వి పెనిచె, బాల నఱచేత నిడికొని ప్రాణముగను. 85

గీ. ఆమె యావిర్భవించినయట్టిదినము, కృష్ణునిమనంబునకు బహుప్రీతికరము
కాన రాధాష్టమీవ్రతకార్యమునను, గలుగు గోలోకవాసభాగ్యంబు వత్స.

సీ. వచ్చు రాధాష్టమీవ్రతముచే గంగాది, సకలతీర్థస్నానజనితఫలము
వచ్చు రాధాష్టమీవ్రతముచేఁ గన్యాస, హస్రప్రదానసంప్రాప్తఫలము
వచ్చు రాధాష్టమీవ్రతముచే మేరుస, మానసువర్ణప్రదానఫలము
వచ్చు రాధాష్టమీవ్రతముచే నేకాద, శీసహస్రవ్రతార్జితఫలంబు

గీ. కాన రాధాష్టమీవ్రత మేనికృష్టు, లేని యొకసారి యొనరించిరేని చాలుఁ
గోటిజన్మార్జితాఘంబుఁ గూలఁద్రోసి, విష్ణుపురసౌధములలోన విహృతి సలుప.

సీ. పూర్వము కృతయుగంబునను లీలావతి, యనునొక్క వేశ్య నానాఘములను
గావించుచును నొక్క దేవాలయములోన, దైవికంబుగ నొకతరుణమందు
రాధాష్టమీ మహావ్రతము గావించెడి, బహుజనంబులసమీపమున కేఁగి
వారికిఁ బ్రణమిల్లి మీరు చేసెడికార్య, మెయ్యది దీనిచే నేమి కలుగు
గీ. ననుచు వినయంబుతోడను నడుగ వార, లిట్లు వచియించి రాదర మెసక మెసఁగ
మెలఁత యియ్యది రాధాష్టమీవ్రతంబు, వృజినవారాశిగట్టు చేరిచెడితరణి.
వ. ఈవ్రతంబు బ్రహ్మహత్యాపాపంబును గోహననపాపంబును స్త్రీవధపాపంబును గురుతల్పగమనపాపంబును బరస్త్రీహరణపాపంబును స్వర్ణాపహరణపాపంబును విశ్వాసఘాతజనితపాపంబును మున్నగున శేషపాపంబులును రూపుమాపి గోలోకం బనియెడువిష్ణుపురంబున వసియింపంజేయు. 89
గీ. భాద్రశుక్లాష్టమీదివాభాగమందు, రాధ యుదయించినట్టికారణముచేత
నాచరించుచునున్నార మావ్రతంబు, నేఁడు పెద్దలు చెప్పిననియతితోడ. 90
క. అనుటయు లీలావతి తన, యొనరించినపాతకముల కొనగూడెను నా
శనకాలం బనుకొనిచ, య్యన వారలతోడఁ జేసె నావ్రత మచటన్. 91
గీ. వ్రతము నొనరించి యింటికి వచ్చి కొంత, కాలమున కాధనాంగన కాలధర్మ
మొందుటయు యమదూతలు ముందు వచ్చి, పాశములచేతఁ గట్టి రాపడఁతి నంత.
గీ. విష్ణుదూతలు వచ్చి యావేశమునను, యమభటులఁ బాఱఁద్రోలి పాశములు ద్రెంచి
యానెలంతను దివ్యవిమానమందు, నునిచికొని వేగ గోలోకమునకుఁ జనిరి. 93
క. అంతట రాధాకృష్ణుల, చెంతను వసియించి పణ్యసీమంతిని య
త్యంతప్రమోదమునఁ గ, ల్పాంతరములు గూడ క్షణము లట్టులు గడపెన్. 94
క. ఏతద్వ్రతమాహాత్మ్యము, శ్రోతల కిహపరములందు సుఖ మొనగూర్చున్
జేతనుల కింతకంటెను, బాతకశమమునకు లేదుపాయము వత్సా. 95
క. అనవుడు విని ముని హర్షిం, చెను నావుడు శౌనకుండు చెప్పుము సూతా
మును దేవాసురు లేకత, మునఁ జేసిరొ యబ్ధిమథనమును నని యడుగన్. 96

—: సముద్రమథనవృత్తాంతకథనము :—

వ. సూతుండు శౌనకున కిట్లనియె. 97
సీ. అత్రితనూభవుం డైనదుర్వాసుండు, సంచరించుచు ధరాచక్ర మెల్ల
నొకనాఁడు స్వర్గంబునకుఁ బోయి యొకచోట, నొక్కవిద్యాధరి యుండఁ జూచి
యట కేఁగి తత్కరంబం దద్భుతముగ వె, లైడిపారిజాతమాలికను గాంచి
యాదండ నా కీయు మని యామె నర్థింప, నాబోటి భక్తితో నతని కిచ్చె
గీ. నది గొని తపోధనుఁడు చెప్పనలవిగాని, హర్షమును జెందుచును నంతరంగమందుఁ
బిచ్చివానిచందంబున మెచ్చుకొనుచుఁ, ద్రిదశపురవీథులం దెల్లఁ దిరుగఁ జొచ్చె.

సీ. ఆపగిదిని జాలసేవ్రు దుర్వాసుండు, చరియించి చరియించి శ్రమము నొంది
యత్తఱి నైరావతారూఢుఁడై వచ్చు, సంక్రందనునకు నొసంగె దాని
నాదామమును గొని యమరాధిపుఁడు తన, దంతావళంబుమూర్ధమున వైచె
నంత నామాల నాదంతి తొండముతోడఁ, ద్రెంచి గిఱ్ఱునఁ ద్రిప్పి క్రిందఁ గొట్టె
గీ. నది కనుంగొని యమహాత్ముని యాగ్రహమున, శాపము నొసంగె నాపాకశాసనునకు
నీకుఁ గలలక్ష్మి తొలఁగును గాక యనుచు, నంత నమరాలయైశ్వర్య మంతరించె.
గీ. అపుడు సురలెల్ల క్షుత్పిపాసార్తు లగుట, నిలువఁజాలక విష్ణుసన్నిధికిఁ బోయి
విన్నవింపంగ జరిగినవిషయ మెల్లఁ, గృష్ణుఁ డాలించి కరుణార్ద్రహృదయుఁ డగుచు
గీ. అసురులును మీరలును గూడి యమరులార
మంథదండంబుగను జేసి మందరమును
భుజగరాజును దద్దామముగను జేసి
చిలుకుఁడు పయోంబురాశిని సిరి లభించు. 102
గీ. కదలిపోకుండ మందరక్ష్మాధరమును, బృష్ఠభాగంబుపైని నిల్పెదను నేను
గచ్ఛపాకారమునఁ జొచ్చి కడలిలోన, ననుడు ధైర్యంబుతోఁ బోయి యమరులెల్ల.
వ. దానవులతోడ సఖ్యంబు గలిగించుకొని తత్సాహాయ్యంబున మందరపర్వత
మును బెకలించి తెచ్చి మంథదండంబుగా క్షీరసాగరంబునం బడవైచి దానికి
నాగేంద్రునిఁ ద్రాడుగాఁ జుట్టి తన్ముఖదేశంబును దైత్యులును దత్పుచ్ఛదేశం
బును దామునుం బట్టికొని యేకాదశీపర్వంబునందు మథియింపఁ జొచ్చుటయు
నందు మొదటఁ గాలకూటం బుదయించె. 104
క. జ్వలనమును గ్రక్కువిషమును, దిలకించినమాత్రముననె దేవాసురకో
టులు పరువులెత్తి సాగిరి, జలనిధిమథనంబు మాని సంత్రాసమునన్. 105
గీ. అపుడు శంకరుఁ డేతెంచి యడల వలదు, రండు పో నేల యింతమాత్రమున కనుచు
నెదను నామత్రయుని జపియించుకొనుచు, గుటుకుసను మ్రింగె నా కాలకూటవిషము.
క. నామత్రయవిద్యాజప, సామర్థ్యముచేత నావిషము విషకృత్యం
బేమియును జేయఁ జాలక, కామారిగళంబునందుఁ గదలక నిలిచెన్. 107
క. అప్పుడు విస్మయ మొందుచుఁ, జప్పునఁ జనుదెంచి సురనిశాచరవర్గం
బెప్పటియట్టులె నిలఁబడి, యప్పతిని మథింపఁదొడఁగె నాసమయమునన్. 108

—: వారుణీదేవి ప్రాదుర్భావము :—

గీ. స్ఖలితగతితోడ నెఱ్ఱనికనులతోడ, విరియఁబాఱిన మూర్ధజవితతితోడ
నేకవస్త్రంబుతోడను నేఁగుదెంచె, వారుణీదేవి బిరబిర వార్ధినుండి. 109
గీ. అట్లు చనుదెంచి యామె దేవాసురులను, గాంచి యిట్లనియెను నన్నుఁ గైకొనియెడి
వారికిచ్చెద బలము నవ్వారి గాఁగ, ననుడుఁ గొనరైరి సురలామె నశుచియగుట,

క. అంతట దైతేయులు దత్కాంతావచనములు తమకుఁ గలిగింపంగన్
సంతసమును గొని రామెను, గంతు లిడుచు నంత నామె కల్లుగ మాటన్.

చ. అపు డది ద్రావి కైపు తల కానఁగ నేత్రము లెఱ్ఱవాఱఁగాఁ
ద్రప విడనాడి ప్రేలుచును దర్పముఁ జూపుచుఁ దూలిపోవుచున్
శపథములన్ బొనర్చుచును జంకలు గొట్టుచుఁ దాఱుమాఱుగా
నపగతచిత్తులై పెనఁగులాడుచు వార్ధిని ద్రచ్చి రంతటన్. 112

—: జ్యేష్ఠాదేవీప్రాదుర్భావకథనము :—

సీ. రక్తలోచనయు జరద్దేహయును గళా, శూన్యాస్యయును మహాశోకయుతయు
జ్యేష్ఠయు నగునలక్ష్మీదేవి జనియించి, యనిమిషులను జూచి యమరులార
నేను గావింపఁగా నైనకార్యం బేమొ, తెలుపుఁడు శీఘ్రంబ నలుపుదాన
నని పల్కుటయును నావనితయమంగళ, విగ్రహంబును జూచి విబుధు లెల్ల

గీ. తల్లి నీకాలు వెట్టినతావు లెల్ల, నిప్పు లేకుండ మండుట నిశ్చయంబు
కాన నీ విచ్చటను జేయ నైనయట్టి,కార్య మెయ్యదియును మాకుఁ గానరాదు.

—: జ్యేష్ఠాదేవీనివాసస్థానకథనము :—

సీ. సంధ్యలయందు భోజనము సేసెడియింటఁ, గలహంబు లొనరించునిలయమునను
ననృతనిష్ఠురభాష లాడెడిగృహమునఁ, గితవులు నివసించుగేహమునను
బరదారపరధనపరు లుండుచోటను, దానధర్మంబులు లేనియెడను
బితరుల సంతోషపెట్టనినెలవున, వేదదూషకు లుండువేశ్మమునను

గీ. బొగ్గులు కపాలములు గేశములును దుషయు
ధూళియును నస్థులును గలయాలయమున
భూసురాతిథిదేవతాపూజ లేని
సదనమందును నుండుము శాశ్వతముగ. 114

గీ. గృంజనంబు ఛత్రాకము శ్రీఫలంబు, పూతికాదళమును గలంబువు పలాండు
వును నలాబువుఁ దిలపిష్టమును భుజించు, వారలగృహంబులను నుండవలయు నీవు.

క. ఒనరుతురో యెవరు రదధా, వనమును నంగారలవణవాలుకలను నా
తనుధారులయిండ్లను నీ, వనిశముఁ బెద్దమ్మ యుండుమమ్మా పొమ్మా. 116

గీ. మఱియు వృద్ధజనంబుల మనుపకుండు, సదనమునఁ బాదశౌచంబు సలిపికొనక
భోజనము చేసెడిఁపుగారమునను నీవు, పాదుకొని యుండవలయును బాయకుండ.

వ. అని పలికి యథాపూర్వంబుగ సింధుమథనంబు గావించుచుండుటయు నందు
నైరావతంబును నుచ్చైశ్శ్రవంబును బారిజాతంబును గామధేనువును ధన్వంత
రియును నచ్చరలును నావిర్భవించిరి. 118

గీ. అంత ద్వాదశినాఁ డుదయంబునందు
లక్ష్మియును దులసియు మృగలాంఛనుఁడును
నమృతమును బుట్టుటయు మహోత్సాహ మొదవఁ
దమమనోరథసిద్ధిని దలఁచికొనుచు. 119

క. నుతియించిరి లక్ష్మిని న, ద్భుతముగ సుర లెల్లఁ దన్నుతులు వినుటకై
కుతుకంబు గొలుప భార్గవి, యతిముదమున వారి కభయహస్త మొసంగెన్.

ఉ. అంతట నచ్యుతుం డచటి కచ్చెరియంబుగ నేఁగుదేరఁగా
నెంతయు భక్తితోడ సుర లెల్లఁ బ్రణామము లాచరించి స
ర్వాంతరగామి వీ వెఱుఁగనట్టి దొకింతయు లేదు దేవ మే
మెంతటివార మన్నిటి కతీతుఁడ వైననినున్ నుతింపఁగన్. 121

గీ. ఆదినారాయణుండ వైనట్టినీకె, యర్హ్మారాలు గ్రహింప నీయాదిలక్ష్మి
వనజదళనేత్ర శ్రీపతి యనెడికీర్తి, యిప్పటిది గాదు నీ కింక నేమి చెప్ప.

చ. అనుటయు లక్ష్మి వంచికొని యానసమున్ ద్రపచేత శౌరి కి
ట్లనియెను దేవ జ్యేష్ఠ యగునా మెకుఁ బెండిలి చేసి పిమ్మటన్
నను గ్రహియించు టర్హము సనాతనధర్మము లెల్ల గుర్తెఱిం
గినమహనీయమూర్తి కెఱిఁగించెడిదాన నె నేను నాథుడన్. 123

క. హరి మదిలో హర్షించుచు, సరగున నుద్దాలకున కొసంగి యలక్ష్మిం
బరిణయ మొనర్చి ముందటఁ, దరువాతఁ బరిగ్రహించెఁ దా నాలక్ష్మిన్. 124

—: విష్ణువు మోహినీరూపముందాల్చుట :—

సీ. అంతట దైతేయు లాదితేయులు గూడ, నమృతంబు గ్రోలెడివారసత్త్వ
మేము ముందనుచును మేము ముం దనుచును, గలహించుకొనుచుండ కాలమునకు
విష్ణువు మోహినీవేషంబు దాలిచి, వచ్చుటయును జూచి వార లెల్ల
సుందరి నీవు మా కందఱకును బోయు, మమృతంబు గ్రోలెద మనుచుఁ గోర

ఆ. మొదట దేవతలను బిదప దానవులను, గూరుచుండఁ బెట్టి బారులుగను
బోయఁ దొడఁగె నమృతమును గలశంబుతో, మోహినీలతాంగి ముదము లలరు.

గీ. అప్పు డమృతంబు ద్రావుచున్నట్టిసురల
పంక్తిలోపల నమరరూపమునఁ గూరు
చున్నస్వర్భానునకుఁ బోసె నుత్పలాక్షి
యమృతమును నాతఁ డది మ్రింగునంతలోన. 126

గీ. అతఁడు రాక్షసుఁ డనుభావ మవగతముగ
సూచన మొనర్చుటయు రవిసోము లామొ

యాకర్ణంబునఁ గ్రోధతామ్రనయనుఁ డగుచు
గలశధారను మునిమోఁ దత్కాంతుఁ డలరు. 127

ఆ. తెగినశిరము రాహువగును గేతువగును, గాయ మయ్యె నప్పు డాయిరువురు
ప్రాణభీతిచేతఁ బరువెత్తుకొని పోయి, రంత నాగ్రహమున నసురు లెల్ల. 128

క. అమరులపైఁ బడుటయు న, య్యసురులకును నసురులకును నయ్యెను యుద్ధం
బమితముగ నపుడు సురలకు, సమకూరెను జయము శౌరిసాహాయ్యమునన్.

క. అంతట నమృతనిరాశ, స్వాంతు లగుచు నసురు లెల్ల నరుగుటయును దై
త్యాంతకుఁడు సుధాకలశము, సంతసమున సురల కిచ్చి చనియె నిజేచ్ఛన్.

వ. అది మొదలుకొని రాహుకేతువు లనుస్వభావంబున సూర్యచంద్రుల నప్పు
డప్పుడు గ్రసించుచు మ్రింగంజాలక విడిచిపెట్టు చుండిరి. 131

క. మునివర యేతచ్చరితం, బును వినువారలకు మంత్రములు సిద్ధించున్
ధనమును విద్యయు సంతును, నొనగూడును సుదక ముక్తియును బ్రాప్తించున్.

వ. అనుటయు శౌనకుం డిట్లనియె. 133

గీ. అతివ దేనఁ బతిప్రియ యగునొ దేనఁ, గన్యలకు మంచివరుఁడు సంఘటితుఁడగునొ
దేనిచే లక్ష్మి కలుగునొ దేనిచేత, సిరి తొలఁగునొ తెలియగాఁ జెప్పుము సూత.

—:లక్ష్మీవారవ్రతమాహాత్మ్యము:—

సీ. అనవుడు సూతుఁ డిట్లనియె మౌనివరేణ్య, విను మొక్కగాథ యీవిషయమందు
మున్ను ద్వాపరయుగంబున నుండె సౌరాష్ట్ర, దేశంబునందుఁ బృథ్వీశుఁ డొకఁడు
భద్రశ్రవుం డనంబడుపేర నతనికి, సురతిచంద్రిక యనుసుదతి యుండెఁ
బుట్టిరి వారికిఁ బుత్రు లేడ్గురు శ్యామ, బాలాఖ్య యగు నొక్కబాలికయును

గీ. నట్టులుండంగ నొక్కనాఁ డాదిలక్ష్మి, బ్రాహ్మణీవేషమును దాల్చి బయలు దేఱి
వచ్చి భద్రశ్రవునిగృహద్వారమందు, నిలిచి దౌవారికిని జూచి పలికె నిట్లు.

గీ. ద్వారరక్షణి లోనికి దారి నిమ్ము, సురతిచంద్రికకడకు నే నరుగవలయు
ననుటయునుఁ దల్లి నీకు మాయమ్మవలన, నేమి పని నీచరిత్రము నెఱుఁగఁ జెపుము.

వ. అని దౌవారికి యడుగుటయును నమ్మహాలక్ష్మి యామె కిట్లనియె. 137

క. దయితుఁడు భువనేశుం డా, హ్వాయము కమల ద్వారవతి నివాసము నాకున్
బయి నేల పెక్కుమాటలు, స్వయముగ నే వచ్చినట్టిసంగతి వినుమా. 138

సీ. ప్రాగ్జన్మమందు మీరాజ్ఞి వైశ్యాంగన, యై పుట్టి పతితోడ ననుదినంబుఁ
గలహించుచుండఁ దత్కాంతుఁ డామెనుగొట్టి, యీడ్చించె నొక్కనాఁ డింటినుండి
యామె యేడ్చుచు వీథియందుండఁగాఁ జూచి, పోయి తత్సామీప్యమునకు నేను
గనికరంబునఁ దోడుకొని వచ్చి యాయింటి, కొనరింపఁ జేసితి నొక్కవ్రతము

క. అంతటను సురతిచంద్రిక, సంతాపముతోడఁ బ్రాసదనంబున కే
కాంతముగ నరిగి తమవృ, త్తాంతం బంతయును దెలిపె నాత్మోద్భవకున్. 160

ఉ. అప్పుడు శ్యామబాల మనమందు విషాదముఁ జెంది నేటికిఁ
జొప్పునఁ దల్లిదండ్రులకు సోఁకెనొ దుర్దశ యంచు నంత నా
తప్పు గ్రహించి వెంటనె వ్రతం బొనరింపఁగఁ జేసి తల్లిచే
నొప్పుగ నాయమన్ బనిచె నూరికిఁ బౌరులు చూచి మెచ్చఁగన్. 161

గీ. సురతిచంద్రిక యూరికి నరుగుదెంచు
నంతలోపల గతియించినట్టిరాజ్య
మంతయును గూడఁ బ్రాప్తించె నద్భుతముగఁ
గలదె లోపంబు లక్ష్మ్యనుగ్రహము గలుగ. 162

క. ఈకథ వినువారల కిహ, లోకంబున సకలసుఖములును గలిగి తుదిన్
జేకూరితీఱు లక్ష్మీ, లోకము వ్రతపరుల కింక లోపము గలదే. 163

—: కృష్ణాష్టమీ వ్రత మాహాత్మ్యము :—

క. అని చెప్పుటయును శౌనక, మునివరుఁ డిట్లనియె సూత మోదం బొప్పన్
వినఁ గృష్ణాష్టమిమహిమము, వినిపింపుము మాకు దానివిషయము నెల్లన్.

క. అనవుడు సూతుం డిట్లని, యెను మానివరేణ్యా నన్ను నీ వడిగినయ
ట్లనిమిషముని మున్ను విరిం, చిని నడుగుడు ధాత యిట్లు చెప్పఁదొడంగెన్.

గీ. శ్రావణంబునఁ గృష్ణపక్షంబునందు, రోహిణీతార కాసమారూఢ మైన
యష్టమీతిథినాఁడు రాత్ర్యవసరమున, నగును గృష్ణాష్టమీవ్రతం బాచరింప.

గీ. కృష్ణజన్మాష్టమీవ్రత మెన్నఁడేని, యొక్కపరిఁ జేయునెడ నది యొకటె చాలు
సకలపాపంబులను భస్మసాత్కరించి, తావుకొలుపంగ వైకుంఠధామమందు.

సీ. అనుదినంబును గోసహస్రంబు పాత్రుఁ డై, నట్టివిప్రున కిచ్చునట్టిఫలము
తల్లిదండ్రులకు విద్యాదాతకును భక్తి, చేత శుశ్రూష చేసినఫలంబు
రేవాసరస్వతీత్రిపథగాతోయంబు, లందుఁ దీర్థం బాడినట్టిఫలము
శ్రద్ధతోడను నిందుసంక్షయంబున శ్రాద్ధ, మును బితరుల కొనర్చినఫలంబు

గీ. నాపదుద్ధారమునఁ గల్గినట్టిఫలము, యజ్ఞకోటిని గావించినట్టిఫలము
కన్యకాకోటిశతదానజన్యఫలము, వచ్చితీఱు జయంత్యుపవాసమునను. 168

గీ. చలుపునో జయంతి నెవఁడు నిచ్చలును వాని
దేహమున నుండుదురు సర్వదేవతలును
సకలతీర్థంబులును నెల్ల సుకృతములును
నధివసించును వాని గేహంబునందు. 169

క. హరివాసరమునఁబోలెను, నరకంబునఁ గూలు భోజనము చేసినచో
నరుఁడు జయంతీదినమున, దరి లేనివిషాద మొదవఁ దనవంశముతోన్. 170

వ. మున్ను స్కందుండును గౌతముండును గార్గ్యుండును జామదగ్న్యుండును వాల్మీకియుఁ గార్తవీర్యార్జునుండును గర్గుండును సగరుండును గాకుత్స్థుండును దిలీపుండును మున్నగువారలు జయంతీవ్రతంబు గావించి సిద్ధిం బడసిరి. 171

గీ. అనఘునిఁగఁ జేయుఁ బతితు నైనను గురుఘ్నుని
జనితు నైనను సుమతి నైనను జయంతి
ధన్యుఁ డగుచును వైకుంఠధామమునకు
నరుగును జయంతి సలిపినయట్టివాఁడు. 172

ఆ. ధనసమేతుఁ డగును ధనకాంక్షి పుత్రులఁ, బడయుఁ బుత్రకాంక్షి పడయు ముక్తి
మోక్షకాంక్షి నేమమున జయంతీవ్రతి, మాచరించె నేని యనుసమంబు. 173

గీ. కోటినియమంబులేనియుఁ గోటివ్రతము, లేనియును గోటితీర్థములేని సాటి
గా వొకజయంతిషోడశకలకుఁ గూడ, దానిమహిమంబు వర్ణింపఁ దరము గాదు.

క. కలుగ దపత్యనిరోధము, కలుగదు వైధవ్య మార్తి గలుగదు కలహం
బులు గలుగవు దారిద్ర్యము, గలుగదు సలిపినను భక్తి గలిగి జయంతిన్.

క. సలిపెద జయంతి ననుచుం, దలఁచినమాత్రమున వానిదరి కేతేరక
గలుగక ధైర్యము యమభృత్యులు గజగజ వడఁకుచుందు రుల్లములందున్.

వ. మున్ను దిలీపుండు నీవు నన్నడిగినయట్ల వసిష్ఠమహర్షి నడుగ నమ్మహర్షి యాతని కిట్లనియె. 177

సీ. వినుము మహారాజ మును వసుంధర బాధ, పడ లేక కంసునిపాలనమునఁ
గన్నీళ్లు కాల్వలు గట్టఁగా నేడ్చుచుఁ, గైలాసమున కేఁగి కాంచి శివునిఁ
గావించి ప్రణతులు దేవ కంసునిబాధ, భరియింపలేక నీపాలఁ బడితిఁ
గావుము నన్నని కాళ్లపైఁ బడుటయు, సకరుణస్వాంతుఁడై శంకరుండు

గీ. కూడి బ్రహ్మాదిదేవతాకోటితోడ, క్షీరసాగరశయనునిచెంత కరిగి
నుతుల నొనరించి సుప్రసన్నుని నొనర్చి, యిట్లు వచియించెఁ బుండరీకేక్షణునకు.

క. గరుడధ్వజ నే నొసఁగిన, వరమునఁ గంసుఁడు మదించి వసుమతికి మహా
పరిభవ మొనర్చె మన మే, వరుసను నైనను వధింప వలయును వానిన్.

గీ. ఆతనికి భాగినేయునిచేతఁ దక్కఁ, బరునిచే లేదు మరణ మేపగిది నైనఁ
గాన నీ వేఁగి దేవకీగర్భమందుఁ, బుట్టవలయును దీర్పంగ భూభరంబు. 180

క. అనుటయు జనార్దనుం డి, ట్లనియె మహాదేవ తద్వధార్థము సాయం
బొనరింపఁగ శర్వాణిని, బనుపుము నావెంటఁ జాలుఁ బని సాధింపన్. 181

దానివెంటన పడి తరుముచుఁ బరువిడి, యాయాసమునఁ జేసి యలసి సొలసి క్షుత్పిపాసార్తుఁడై కొనకు సంధ్యాకాల, మున యమునాతీరమునకుఁ జేరి

గీ. యచటఁ గృష్ణాష్టమీవ్రతం బాచరించు, చున్న గోపాంగనలఁ జూచి యన్నులార యాఁకలికి నోర్వఁజాల నీయన్న మింత, పెట్టి నాప్రాణములు నిల్పఁబెట్టుఁ డనియె.

వ. అంత నవ్వరాంగన లందఱును నాతని నవలోకించి యేకగ్రీవంబుగా ని ట్లనిరి.

సీ. నేఁడు కృష్ణాష్టమి నియమంబుతో మేము, వ్రతము చేయుచు నున్నవార మిచట నీదినంబున భుజియించిన నది గృధ్ర, ఖరకాకగోమాంసఖాదనంబ ప్రాణముల్ దేహంబునం దుండి నేఁ డుప, వాసంబు చేయనివాఁడు హేతుఁడు సమవర్తి చేయు శాసనము నేఁడు భుజించు, నట్టివారలకు దేహాంతమునను

గీ. కృష్ణజన్మాష్టమిని భుజియించువాఁడు
పతితులను జేయువాఁడ స్వపితృగణంబుఁ
బితరులకు వాఁడు శ్రాద్ధంబు పెట్టుటయును
దర్పణము చేయుటయును వ్యర్థంబ చూవె. 204

చ. అనుటయుఁ జిత్రసేనుఁడు యథార్థము నారసి క్షుద్వ్యథాభరం
బును సహియించికొంచు వ్రతముం బొనరించి వ్రతప్రభావసా
ధననిహతాఖిలాఘుఁ డయి తత్పితృవర్గముతోడఁ గూడి పో
యెను దివిషద్విమానమును నెక్కి యుపేంద్రునిరాజధానికిన్. 205

వ. మఱియును నిం కొక్కయుపాఖ్యానముం జెప్పెద వినుము. 206

సీ. మును హరిశ్చంద్రుఁ డన్ జననాథుఁ డొక్కఁడు, సర్వసర్వంసహాచక్రమునకు నేతయై యేలుచు నిఖిలజనంబుల, ననుభవించుచును సౌఖ్యముల నెల్ల నొకనాఁడు విస్మయం బొంది నిజౌన్నత్య, మునకు దివ్యవిమానమున వసించి యరిగి సనత్కుమారాశ్రమంబున కమ్మ, హర్షికి మ్రొక్కి సాష్టాంగముగను

గీ. మునివరేణ్య మదౌన్నత్యమునకు నేమి
హేతు వైయుండు నయ్యది యెఱుఁగఁ జెపుమ
యనుడు నమ్మౌని యతనివృత్తాంత మెల్ల
దివ్యదృష్టిని దిలకించి తేటపడఁగ. 207

సీ. భూతలాధిప నీవు పూర్వజన్మంబున, జన్మించి వైశ్యవంశంబునందు స్వకులవృత్తిని వీడి సత్యనిష్ఠను నుండ, నొనగూడె నిఱుపేదతనము నీకు నంతట నీవార లందఱు నినుఁ జూచి, హసియింపఁదొడఁగిరి యనుపదంబు దానిచే వారిలోఁ దలయెత్తికొని నీవు, నిలువంగ లేమి నాస్థలము విడిచి

గీ. యొక్కయడవికిఁ బోయి యం దొక్కప్రాగము
గానఁబడుటయు నందలికమలములను

నోసి చేకొని యవి వారణాసి కేఁగి
విక్రయింపంగఁ దిరిగితి వీథు లెల్ల. 208

గీ. ఆదినంబున నొకఁడు జైన సజ్జనులను, గొనమిఁ జింతిల్లుచును నీవు చనుచు నుండ
దైవికంబుగ భద్రవాద్యస్వనంబు, వినఁబడియె నీకు నొకయింట వీను లలర. 209

వ. అప్పుడు నీ వాగృహంబుకడ కేఁగి కాశీరాజగు నింద్రద్యుమ్నునిపుత్రికయగు చంద్రావతి కృష్ణాష్టమీవ్రతంబు చేయుచుండం జూచి యాపద్మంబు లన్నియును గృష్ణునకు సమర్పించి యాదినం బన్నం బెచ్చటను లభింపకుంటచే నుపవాసంబు గావించితివి. తత్పుణ్యఫలంబుగా నీ కీయుత్తమజన్మంబును మహైశ్వర్యంబును సత్యనిష్ఠయును సత్యహరిశ్చంద్రుఁ డనుభూరిప్రశస్తియునుం జేకూరె.

క. అనుడు హరిశ్చంద్రుండు త, దనుమతి గొని వచ్చి యింటి కనువత్సరముల్
బూనరించుచుఁ దద్వ్రతమును, గని యిహసుఖములను దుదకుఁ గాంచెను ముక్తిన్.

గీ. అరిగి మధురకుఁ గృష్ణముఖాంబుజంబు,స్వయముగను గాంచినఫలంబుసంఘటిల్లుఁ
జేసి యుపవాసమును సవిశ్వాసముగను, గృష్ణజన్మాష్టమి నొనర్చి రేని వ్రతము.

క. ఈకృష్ణాష్టమిమహిమము, నాకర్ణించిన నభీప్సితార్థము లెల్లన్
జేకూరు ననిన నింకను, జేకూరని దేది వ్రతము చేసినయెడలన్. 213

క. అనవుడు దిలీపుఁ డెంతయు, మనమున సంతసము నొంది మాసీంద్రునకున్
వినయమ్మున మ్రొక్కి తదా, జ్ఞను గొని నిజనగరమునకుఁ జనియె మునీంద్రా.

వ. అని చెప్పుటయు నారదుం డమితాహ్లాదంబుతోడఁ దదనుజ్ఞం గొని చనియె.

సీ. అనుటయును శౌనకుం డిట్టు లనియె సూత
బ్రాహ్మణుఁడు శ్రేష్ఠుఁ డన్నివర్ణములలోన
ననుచు వచియింతు రతనిమహాత్మ్య మేమొ
చెప్పు మొకసారి నాకు శాస్త్రీయముగను. 216

:—బ్రాహ్మణ మాహాత్మ్య కథనము:—

చ. అనవుడు సూతుఁ డిట్లనియె నమ్మునికిన్ మహనీయ బ్రాహ్మణుం
డనఁగ సమస్తదేవతల కాశ్రయభూతుఁడు గాన విష్ణువే
యనఁ దగు వాని మానవుఁ డటంచుఁ దలంపఁగ రాదు బ్రాహ్మణా
ర్చన మఖిలార్థసిద్ధులకు సాధన మంచు వచించు శాస్త్రముల్. 217

క. మును నారదుఁ డీవిషయం, బును నడుగఁ బయోజభవుని మునివర్యున కి
ట్లనియెను విధాత దానినె, వినిపించెదివాఁడ మీకు విశదము గాఁగన్. 218

ఆ. విష్ణుబుద్ధిచేత విప్రున కెరఁగెడు, నట్టివాఁడు చెందు నభ్యుదయము
గర్వమునను ద్విజునిఁ గాంచియు వంగని, వానిమస్తకంబు వంచు శౌరి. 219

ఆ. దాన మిచ్చునెడల దాత యుత్తముఁ డైన, బ్రాహ్మణుఁడు కొసంగి పడియు ముక్తి
యధము లైనభూసురాన్వయజాతుల, కిడినయావి బూది నిడినఘృతము. 257

గీ. యోజనాసత్ప్రతిగ్రహాధ్యాపనములఁ, బడయు రఘుముల ద్విజులు తత్పాపములను
క్షణములోనఁ బ్రాణాయామజపమువలన, హుత మొనర్చుచునుండువా రగుటఁ జేసి.

గీ. ఇనుఁడు కరములఁ జండాలగృహము ముట్టి
కొనిన సందుండినను వహ్ని కనదొ యెట్టు
లశుచిభావంబు నట్టులె యవనిసురుఁడు
పాపలేపంబునను గాఁ డపావనుండు. 259

క. వాయువు ఘనములఁ ద్రోసెడి, చాయను బ్రాహ్మణుల పాపజాలము నెల్లన్
బాయంగఁ ద్రోయు నవలకు, గాయత్రీజపబలాధికత్వము చేతన్. 260

గీ. ఉత్తమబ్రాహ్మణుఁడు కృపాయుక్తుఁ డగుచుఁ, జేయునెడ దీవనల సర్వసిద్ధు లొదవు
నట్లు గాకుండఁ దిట్టిన నాగ్రహమున, సర్వనాశము గల్గు సంశయము లేదు.

సీ. దర్శించునెడలఁ బ్రత్యహము భూదేవుని, సమకూరు హయమేధసవఫలంబు
దినదినంబును భూసురునకు మ్రొక్కిన యెడ, సకలపాపములును సమసిపోవుఁ
బ్రతిదివసమును సంభాషింప ద్విజునితో, భాగీరథీస్నానఫలము గలుగు
నొనరించునెడ నిత్యమును బ్రాహ్మణునిసేవ, సకలార్థసిద్ధులు సంఘటిల్లు

గీ. నెప్పుడును గూడ విప్రులు తృప్తి పడఁగ, నన్నము నొసంగుచుండిన నఖిలలోక
ములకుఁ గూడను బ్రాభవంబును వహించు, జన్మమును జెందు దేహావసానమందు.

సీ. సకలజాత్యన్నభక్షకుఁడుగా నున్నను, బతితుఁ డైనను మహాపాపి యైనఁ
గలసియున్నను నంత్యజులలోనఁ గూడి యు, న్నను మ్లేచ్ఛజాతిసంతతులతోడ
సర్వజాతిస్త్రీలసంపర్కమును జెంది, యున్నను దుర్వృత్తి నొందియున్నఁ
బశుపక్షిమృగముల బాధించు చున్నను, ద్విజధర్మబాహ్యుఁడై తిరుగుచున్న

గీ. నెట్టిదుర్మార్గుఁ డైనను గట్టకడకు, బ్రాహ్మణాన్వయభవుఁ డైన బ్రాహ్మణుండు
తగఁడు చంపంగ నెట్టిదుర్దశలయందుఁ, గూడ నతని ద్విజత్వంబు వీడకుంట. 263

గీ. అట్టిఁడులఁ గూడ వధియించునట్టివాఁడు, బ్రహ్మహత్య యొనర్చినపాపి యగుటఁ
దప్పదొందక నరకయాతనల వింటె, యెట్టిదియొ బ్రాహ్మణమహత్త్వ మేమిచెప్ప.

వ. దీని కొకదృష్టాంతముం జెప్పెద వినుము. 265

సీ. ఒకబ్రాహ్మణునకుము నొక్కపుత్రుఁడుండెనా, తండు యౌవనము ప్రాప్తంబు [illegible]
బ్రాక్కర్మవశముచే నొక్కచండాలకా, మినిని మోహించి తన్ని [illegible]
దానియింటనె యుండి తనయుల దుహితలఁ, గని దానియందు [illegible]
నొకనాఁడు నడ [illegible]

దానివెంటను పడి తరుముచుఁ బరుపిడి, యాయాసముసఁ జేసి యలసి సొలసి
క్షుత్పిపాసార్తుఁడై కొనకు సంధ్యాకాల, మును యమునాతీరమునకుఁ జేరి

గీ. యచటఁ గృష్ణాష్టమీవ్రతం బాచరించు, చున్న గోపాంగనలఁ జూచి యన్నులార
యాఁకలికి నోర్వఁజాల నీయన్న మింత, పెట్టి నాప్రాణములు నిల్వఁబెట్టుఁ డనియె.

వ. అంత నవ్వారాంగన లందఱును నాతని నవలోకించి యేకగ్రీవంబుగా ని ట్లనిరి.

సీ. నేఁడు కృష్ణాష్టమి నియమంబుతో మేము, వ్రతము చేయుచు నున్న వార మిచట
నీదినంబున భుజియించిన నది గృధ్ర, ఖర కాక గోమాంసభక్షణసమంబు
ప్రాణముల్ దేహంబునం దుండి నేఁ డుప, వాసంబు చేయనివాఁడు నరకమందు
నమవర్తి చేయు శాసనము నేఁడు భుజించు, నట్టివారలకు దేహాంతమునను

గీ. కృష్ణజన్మాష్టమిని భుజియించువాఁడు
పతితులను జేయువాఁడు స్వపితృగణంబుఁ
బితరులకు వాఁడు శ్రాద్ధంబు పెట్టుటయును
దర్పణము చేయుటయును వ్యర్థంబ చూడ. 204

చ. అనుటయుఁ జిత్రసేనుఁడు యథార్థము నారసి క్షుద్వ్యథాభరం
బును సహియించికొంచు వ్రతముం బొనరించి వ్రతప్రభావసా
ధననిహతాఖిలాఘుఁ డయి తత్పితృవర్గముతోడఁ గూడి పో
యెను దివిషద్విమానమును నెక్కి యుపేంద్రునిరాజధానికిన్. 205

వ. మఱియును నిం కొక్కయుపాఖ్యానముం జెప్పెద వినుము. 206

సీ. మును హరిశ్చంద్రుఁ డనుజననాథుఁ డొక్కఁడు, సర్వసర్వంసహాచక్రవర్తి
నేతయై యేలుచు నిఖిలజనంబుల, ననుభవించుచును సౌఖ్యముల నెల్ల
నొకనాఁడు విస్మయం బొంది నిజౌన్నత్య, మునకు దివ్యవిమానమున వసించి
యరిగి సనత్కుమారాశ్రమంబున కమ్మ, హర్షికి మ్రొక్కి సాష్టాంగముగను

గీ. మునివరేణ్య మదౌన్నత్యమునకు నేమి
హేతు వై యుండు నయ్యది యెఱుఁగఁ జెపుమ
యనుడు నమ్మౌని యతినివృత్తాంత మెల్ల
దివ్యదృష్టిని దిలకించి తేటపడఁగ. 207

సీ. భూతలాధిప నీవు పూర్వజన్మంబున, జన్మించి వైశ్యవంశంబునందు
స్వకులవృత్తిని వీడి సత్యనిష్ఠను నుండ, నొనగూడె నిఱుపేదతనము నీకు
నంతట నీవార లందఱు నినుఁ జూచి, హసియింపఁదొడఁగిరి యనుపదంబు
దానిచే వారిలోఁ దలయెత్తికొని నీవు, నిలువంగలేమి నాస్థలము విడిచి

గీ. యొక్కయడవికిఁ బోయి యం దొక్కగ్రామము
గానఁబడుటయు నందలిక మలములను

గోసి చేకొని యవి వారణాసి కేఁగి
విక్రయింపంగఁ దిరిగితి వీథు లెల్ల. 208

సీ. ఆదినంబున నొకఁ డైన సజ్జములను, గొనమిఁ జింతిల్లుచును నీవు చనుచు నుండ
దైవికంబుగ భద్రవాద్యస్వనంబు, వినఁబడియె నీకు నొకయింట వీను లలర. 209

వ. అప్పుడు నీ వాగృహంబుకడ కేఁగి కాశీరా జగునింద్రద్యుమ్ను నిపుత్రిక యగు చంద్రావతి కృష్ణాష్టమీవ్రతంబు చేయుచుండం జూచి యాపద్మంబు లన్నియును గృష్ణునకు సమర్పించి యాదినం బన్నం బెచ్చటను లభింపకుండుటచే నుపవాసంబు గావించితివి. తత్పుణ్యఫలంబుగా నీ కీయుత్తమజన్మంబును మహైశ్వర్యంబును సత్యనిష్ఠయును సత్యహరిశ్చంద్రుఁ డనుభూరిప్రశస్తియునుం జేకూరె.

క. అనుడు హరిశ్చంద్రుండును త, దనుమతి గొని వచ్చి యింటి కనువత్సరముల్
బొనరించుచుఁ దద్వ్రతమును, గని యిహసుఖములను మదకుఁ గాంచెను ముక్తిన్.

గీ. అరిగి మధురకుఁ గృష్ణముఖాంబుజంబు,స్వయముగను గాంచినఫలంబుసంఘటిల్లుఁ
జేసి యుపవాసమును సవిశ్వాసముగను, గృష్ణజన్మాష్టమి నొనర్చి రేని వ్రతము.

క. ఈకృష్ణాష్టమిమహిమము, నాకర్ణించిన నభీప్సితార్థము లెల్లన్
జేకూరు ననిన నింకను, జేకూరని దేది వ్రతము చేసినయెడలన్. 213

క. అనవుడు దిలీపుఁ డెంతయు, మనమున సంతసము నొంది మహేంద్రునకున్
వినయమ్మున మ్రొక్కి తదా, జ్ఞను గొని నిజనగరమునకుఁ జనియె మునీంద్రా.

వ. అని చెప్పుటయు నారదుం డమితాహ్లాదంబుతోడఁ దదనుజ్ఞం గొని చనియె.

సీ. అనుటయును శౌనకుం డిట్టు లనియె సూత
బ్రాహ్మణుఁడు శ్రేష్ఠుఁ డన్నివర్ణములలోన
ననుచు నదియింతు రతనిమహత్త్వ మేమొ
చెప్పు మొకసారి నాకు శాస్త్రీయముగను. 216

:— బ్రా హ్మ ణ మా హా త్మ్య క థ న ము :—

చ. అనవుడు సూతుఁ డి ట్లనియె నమ్మునికిన్ మహనీయ బ్రాహ్మణుం
డనఁగ సమస్తదేవతల కాశ్రయభూతుఁడు గాన విష్ణువే
యనఁ దగు వాని మానవుఁ డటంచుఁ దలంపఁగ రాదు బ్రాహ్మణా
ర్చన మఖిలార్థసిద్ధులకు సాధన మంచు వచించు శాస్త్రముల్. 217

క. మును నారదుఁ డీవిషయం, బును నడుగఁ బయోజభవుని మునివర్యున కి
ట్లనియెను విధాత దానినె, వినిపించెడివాఁడ మీకు విశదము గాఁగన్. 218

ఆ. విష్ణుబుద్ధిచేత విప్రున కెరఁగెడు, నట్టివాఁడు చెందు నభ్యుదయము
గర్వమునను ద్విజునిఁ గాంచియు వంగని, వానిమస్తకంబు వంచు శౌరి. 219

సీ. [illegible] [illegible] [illegible] [illegible]
బ్రా[illegible]ంచుటకు [illegible] [illegible] [illegible] [illegible]
[illegible] [illegible] [illegible] భ[illegible]ము [illegible]
[illegible] జూచి కను [illegible] [illegible] [illegible]

గీ. ధారగించుకొ [illegible] [illegible] [illegible] [illegible]
స్వ[illegible]గను [illegible] [illegible] [illegible] [illegible]

క. క్షణమాత్ర మేనియును [illegible], హృ[illegible]గనము [illegible] [illegible]
[illegible]మాత్రలోన [illegible], [illegible]మాత్రము [illegible] [illegible] [illegible]

క. [illegible]కొనిన [illegible], [illegible] [illegible]
[illegible]లోన భ_క్తి[illegible], [illegible] [illegible]. 222

క. [illegible] [illegible] [illegible], [illegible] [illegible] [illegible]
[illegible]హీన [illegible]భాగిని, [illegible] [illegible] [illegible]. 223

గీ. ఉండు నుదధులలోన బ్రహ్మాండమందు, నున్నతీర్థంబు లన్నియు నుదధులందు
నున్నతీర్థంబు లన్నియు నుండు నొక్క, క్షితిసురవర్యునిపాదపంకేరుహమున.

గీ. ఎవనిశీర్షంబు సంసిక్త మగునొ విప్ర, పాదసలిలంబుచేత నప్పావనుండు
సకలతీర్థంబులందును స్నానమాడి, నట్టివాఁడయి యఘ[illegible] [illegible] బ్రా[illegible].

గీ. మఱియు నొకమాట చెప్పెద [illegible]సర్వ, బ్రాహ్మణునిపాద[illegible] [illegible] [illegible]
[illegible] గావున ద్విజపా[illegible] [illegible], [illegible] [illegible]. 226

గీ. జన్మజన్మంబులందును శాశ్వతముగఁ, [illegible] [illegible] [illegible]
[illegible] [illegible] [illegible], [illegible] బ్రాహ్మణ [illegible].

క. అనుకూలుఁ [illegible] [illegible], [illegible] [illegible] [illegible]
[illegible] జెందఁగలుగు స్వర్గం, బును సంపాదించుకొనిన భూదే[illegible]. 228

క. చలిపియు సాహసకృత్యం, బుల [illegible] చేసి పర్వములలో భూదే
వుల కర్పనచేఁ దృప్తిం, గలిగించెడివారు ము_క్తి గాంతురు [illegible]. 229

సీ. మొదట విప్రుఁడు వేదములు బ్రహ్మముఖమున, నుండి [illegible] మొదట బ్రహ్మ
విప్రముఖంబున వేదంబు లుంచె లో[illegible], కంబుల [illegible] క్షేమంబు గలుగ
దానను భూదేవతాత్వంబు [illegible] [illegible], బ్రహ్మ [illegible] పూజ్యుం డయ్యె సంవత్సరను
బ్రాహ్మణానుజ్ఞను బడయక చేసిన, నిఖిలకార్యములును నిష్ఫలములు

గీ. విప్రవర్జితముగను గావించినట్టి, యాగములు దానములు బలితర్పణములును
స్నానజపహోమతపములు దాన[illegible], [illegible] [illegible] క_ర్త [illegible] [illegible]

క. ధాత్రీసురపదరేణువు, విత్రము లగు మందిరములు విశ్రుతపుణ్య
క్షేత్రసమంబులు గావునఁ, [illegible] యుండు సకలభద్రంబులకున్. 231

ఆ. శాస్త్రశూన్యములును స్వాహాస్వధాస్వస్తి, వర్జితములు దానవర్జితములు
బ్రాహ్మణాంఘ్రిరేణురహితంబులును నైన, సదనములు శ్మశానసమము లనఘ.

గీ. సంభవము నొంది బ్రాహ్మణజాతియందుఁ
దగినసంస్కారమునఁ ద్విజత్వంబు నడసి
విద్యచేతను విప్రుఁడై వెలయువాఁడు
శ్రోత్రియుఁడు పూజ్యుఁ డతఁడు భూసురులలోన. 233

వ. విద్యాపూతుండును వేదపూతుండును మంత్రపూతుండును తీర్థపూతుండును
నగు శ్రోత్రియబ్రాహ్మణుండు పూజ్యతముండు. 234

సీ. తనుఁ గోరి తనగృహంబునకు వచ్చిన నన్య, యోషను స్పృశియింప కుండుటయును
నటవీస్థలంబునందుం బ్రసన్నతృణ మేని, యును హరియింపక యుండుటయును
గామాదిశత్రుషట్కమునకు వశముగా, కుండఁగా వర్తించు చుండుటయును
దలిదండ్రులకు గురుదైవతంబులకును, నుపచారమును జేయు చుండుటయును

గీ. నమ్రతవచనంబు కల నైన నాడమియును
జనులకుఁ బురాణధర్మముల్ వినుచుటయును
స్నానసంధ్యాదివిధులను జలుపుటయును
బ్రాహ్మణున కుండఁదగినలక్షణము లనఘ. 235

క. ధరణీసురుండు పాత్రా, త్పరమేశుఁడై యుద్ధరింప భవవారిధిలోఁ
బరిపతితు లైనవారిక, హరియించుటఁ జేసి యాశ్రితాఘము లెల్లన్. 236

గీ. భక్తియును శ్రద్ధయును గల్గి బ్రాహ్మణునకు
దానము లొనర్పఁగాఁ దగు మానవుండు
నాకలోకార్థి యగునేని యట్లు గాక
బ్రాహ్మణధనంబు గొనిన దుర్గతుల నొందు. 237

గీ. విష్ణుసమ మైనవస్తువు విప్రుఁ డొకఁడె, కాని మఱియొక్కఁ డెందును గానరాదు
కాన సుఖవాంఛ గలిగినమానవులకు, విప్రపూజాసమం బైనవిధియె లేదు. 238

క. ధాత్రీసుపర్వునకు గా, యత్రీజప మపరిహార్య మన్నిటికంటెన్
బాత్రతను జెంది దానసె, గోత్రామరుఁ డఖిలకలుషకోటుల నడఁచున్. 239

క. అని చెప్పుటయును సురముని, విని సర్వంబును మహాత్మ విన వేడుక గ
ల్గెను గాయత్రీవిధమును, వినిపింపుము నేఁడు నాకు విశదము గాఁగన్. 240

వ. అని ప్రార్థించుటయు బ్రహ్మ నారదున కి ట్లనియె. 241

—: గాయత్రీ ప్రకార కథనము :—

వ. గాయత్రి గాయత్రీఛందస్సును విశ్వామిత్రఋషియును సవితృదేవతయును నగ్ని
ముఖంబును బ్రహ్మశీర్షంబును విష్ణుహృదయంబును రుద్రశిఖయును పృథివీయోని

యును జతుర్వింశత్యక్షరంబులును త్రిపాదంబులును ప్రణవంబులును షట్కుక్షు
లును సాంఖ్యాయనసగోత్రంబును సూర్యాదిత్రయాణంబులును పంచశీర్షంబులుం
గలిగి బ్రహ్మసాక్షాత్కారంబునకు హేతువగును. ఈ వేదాంబునందు గాయత్రీ
వర్ణన్యాసంబు గావించుకొని గాయత్రీజపంబు చేయువాఁడు బ్రహ్మవిష్ణుశివాత్మ
కుండును మహాయోగియును మహాజ్ఞానియును నై పునరావృత్తిరహితం బగు
మోక్షపదముం జెందు. తత్కారంబు పాదాంగుష్ఠంబులందును సకారంబు
గుల్ఫదేశంబులందును వికారంబు జంఘలయందును తుకారంబు జానుమధ్యంబు
నందును ర్వకారం బూరుదేశంబునందును రేకారంబు గుహ్యదేశంబునందును
ణ్యకారంబు వృషణంబులందును మకారంబు కటిదేశంబునందును భకారంబు
నాభిమండలంబునందును ర్గోకారంబు జఠరంబునందును దేకారంబు స్తనంబు
లందును వకారంబు హృదయంబునందును స్యకారంబు కంఠదేశంబునందును
ధీకారంబు వదనంబునందును మకారంబు తాలుదేశంబునందును హికారంబు
నాసికాగ్రంబునందును ధికారంబు నేత్రంబులందును యోకారంబు భ్రూమధ్యం
బునందును యోకారంబు లలాటంబునందును నఃకారంబు ముఖపూర్వదేశంబు
నందును ప్రకారంబు ముఖదక్షిణదేశంబునందును చోకారంబు ముఖపశ్చిమ
దేశంబునందును దకారంబు ముఖోత్తరదేశంబునందును యాత్కారంబు
మూర్ధంబునందును న్యాసంబు గావించుకొనం దగు. సంధ్యాకాలంబునందుఁ
గావింపందగు న్యాసంబు వినుము. సప్రణవప్రథమవ్యాహృతి హృదయంబునందును
సప్రణవద్వితీయవ్యాహృతి శిరస్సునందును సప్రణవతృతీయవ్యాహృతి శిఖ
యందును సప్రణవగాయత్రీమంత్రప్రథమపాదంబు కవచంబునందును సప్రణవ
గాయత్రీమంత్రద్వితీయపాదంబు నేత్రంబులందును సప్రణవగాయత్రీమంత్ర
తృతీయపాదంబు కరంబులందును న్యాసంబు గావించుకొని యంతంబున గాయత్రీ
శిరోమంత్రంబుచే నుదకస్పర్శంబు గావించెనేని సర్వపాపవిముక్తుండై విష్ణుత్వముం
జెందు. సప్తవ్యాహృతులయాదులందు సప్తప్రణవంబులును మంత్రంబున కాది
మధ్యావసానంబులందుఁ బ్రణవత్రయంబును శిరస్సున కాద్యంతంబులందుఁ
బ్రణవద్వయంబునుం గలసి ద్వాదశప్రణవంబు లయ్యె. సప్తవ్యాహృతిశిరం
బులునుం గలగాయత్రిని సంధ్యాకాలంబునఁ గుంభకంబుచే వారత్రయంబు
జపించి సూర్యోపస్థానంబు గావించెనేని మహావిద్యాధిపతియై బ్రహ్మత్వముం
జెందు. మఱియును గాయత్రీషట్కుక్షుల నెఱింగి గాయత్రిని జపించెనేని బ్రహ్మ
స్థానముం బడయు. మఱియును గాయత్రీపంచశీర్షంబుల నెఱింగి గాయత్రిని
జపించెనేని విష్ణుసాయుజ్యముం జెందు. సప్రణవసప్తవ్యాహృతియుక్త మగు
గాయత్రిని న్యాసంబు గావించుకొనియెనేని సాక్షాద్విష్ణురూపుం డగు. తన్న్యాస

విధానమును జెప్పెద. సప్రణవంబు లగుసప్తవ్యాహృతులు క్రమంబుగాఁ బాద
జానుకటినాభిహృదయకరలలాటంబులందును గాయత్త్రిని శిఖయందును న్యాసంబు
గావింప వలయును. మఱియును ప్రాణాయామగాయత్త్రిని జపించెనేని సకృ
దుచ్చారణమాత్రంబున మహాపాతకంబులును భస్మీభూతంబు లగు. తద్విధా
నంబు వినుము. గుదసమాకుంచనంబు గావించి గుదదేశస్థం బగు నపానంబును
హృద్దేశస్థం బగు ప్రాణంబుతోడఁ బూరకంబుచేఁ గలిపి కుంభకంబు గావించి
సప్రణవవ్యాహృతిశిరోయుక్తం బగుగాయత్త్రిని త్రివారంబు జపించెనేని యొక్క
ప్రాణాయామం బగు. మఱియును ప్రతివర్ణస్థానంబును నెఱింగి దేహంబున
గాయత్త్రిన్యాసంబు గావించుకొనియెనేని పరమేశ్వరధ్యానముం బొందం గలుగు.

క. కావించిన గాయత్త్రీ, దేవీమనుజపము వర్ణదేవజ్ఞానం
బావహిల ద్విజుఁడు సురలన్, ద్రావఁడు జపసిద్ధియోగరక్షింబుల్. 243

వ. ప్రథమవర్ణం బగ్నిదేవతాకంబు. ద్వితీయవర్ణంబు వాయుదేవతాకంబు. తృతీయ
వర్ణంబు సూర్యదేవతాకంబు. చతుర్థవర్ణంబు వియద్దేవతాకంబు. పంచమ
వర్ణంబు యమదేవతాకంబు. షష్ఠవర్ణంబు వరుణదేవతాకంబు. సప్తమవర్ణంబు
బృహస్పతిదేవతాకంబు. అష్టమవర్ణంబు పర్జన్యదేవతాకంబు. నవమవర్ణం
బింద్రదేవతాకంబు. దశమవర్ణంబు గంధర్వదేవతాకంబు. ఏకాదశవర్ణంబు
పూషదేవతాకంబు. ద్వాదశవర్ణంబు మిత్త్రదేవతాకంబు. త్రయోదశవర్ణంబు
త్వష్టృదేవతాకంబు. చతుర్దశవర్ణంబు వసుదేవతాకంబు. పంచదశవర్ణంబు
మరుద్దేవతాకంబు. షోడశవర్ణంబు సోమదేవతాకంబు. సప్తదశవర్ణం బంగిరో
దేవతాకంబు. అష్టాదశవర్ణంబు విశ్వేదేవదేవతాకంబు. ఏకోనవింశవర్ణం బశ్వి
దేవతాకంబు. వింశవర్ణంబు ప్రజాపతిదేవతాకంబు. ఏకవింశవర్ణంబు సర్వదేవ
మయంబు. ద్వావింశవర్ణంబు రుద్రదేవతాకంబు. త్రయోవింశవర్ణంబు బ్రహ్మ
దేవతాకంబు. చతుర్వింశవర్ణంబు విష్ణుదేవతాకంబు. 244

క. ఈవిధమున గాయత్త్రిని, భావించుచు మనమునందుఁ బ్రత్యహమును ద
ద్దేవీమంత్రజపంబును, గావించెడిద్విజుఁడు సర్వకలుషము లడఁచున్. 245

గీ. ఈవిశేషము లెల్ల గ్రహించి వేద, మాతను జపించునట్టిబ్రాహ్మణుఁడె నాల్గు
వేదములును నెఱింగినవిబుధవరుఁడు, దానపాత్రుండు వాఁడె విజ్ఞాని వాఁడె.

క. ఒకప్రక్క నాల్గువేదము, లొకకడ గాయత్త్రి నుంచి యొకతులలో నే
నొకతఱిఁ దూఁపఁగ గాయ, త్త్రికి గౌరవ మొదవె నిర్వృతిప్రద యగుటన్.

సీ. ప్రకృతజన్మార్జితపాతకం బంతయు, దశసంఖ్యజపముచేతను నశించుఁ
బ్రాగ్జన్మములఁ జేయఁబడినదుష్కృత మెల్ల, శతసంఖ్యజపముచేతఁ క్షయమునొందుఁ

ద్రియుగంబులం దొనర్చినయఘం బంతయు, శమియించును సహస్రజపముచేత
ననృహంబును ద్రిసంధ్యములం జేయుజపంబు, వలన జన్మకోటికలుష మడఁగ

గీ. నక్షమాలికతోడ సాయంసమయము. నందుఁ బ్రాతస్సమయమునయందుఁ జేయ
జపముచేతఁ జతుర్వేదజపఫలంబు. ప్రాప్త మగు నని చెప్ప గాయత్రిమహిమ.

మ. అనవద్యస్ఫురణంబుచే నెసఁగుగాయత్రీస్వరూపం బెఱుం
గనిభూదేవునివిద్యయుఁ ఘనము ప్రఖ్యాత్యాస్వయుతాన్నత్యముల్
జనసంబుఁ బలముఁ జపంబుఁ దపముఁ సర్వంబు వ్యర్థంబు లయ్యెం
చు నెఱుంగం దగుఁ జూనె శౌచవిహీనత్వోత్పన్నపుణ్యంబులన్. 249

వ. మఱియొకగాయత్రీమంత్రంబుం జెప్పెద నియ్యది సకలమునిగ్రహిష్టం బగుమహా
మంత్రంబు. "ఓం అగ్నే ర్వ్యాకర్షంసి యజుర్వేదేన సోమం పిబ స్వాహా"
యనెడియష్టాదశాక్షరయజుర్గాయత్రీమహామంత్రంబు జలంబునం దుండి శతంబు
జపించిన మహాపాతకోపపాతకాతిపాతకవిముక్తుండై ముక్తిస్థానంబునకుఁ జేరం
గలుగు. 250

క. హరవిష్ణుగణాధిపభా, స్కరదేవీప్రముఖులఁ బొందినయభయమంత్రో
త్కరజపములు గాయత్రీ, పరులకు నుత్తేజకప్రభావప్రదముల్. 251

క. నిగమాగమావగాహమె, యగు గంగాస్నానముప్వారాముదునకుఁ ద
ద్విగళితుఁ డగువిప్రుఁడు తీ, ర్థగుఁ డైనను నతముఁ దగఁడు తత్ఫల మొందన్.

—: నానాస్నానస్వరూపకథనము :—

వ. బ్రాహ్మణున కాగ్నేయవారుణబ్రాహ్మవాయవ్యదివ్యంబు లనుపంచస్నానం
బులు విహితంబులు. భస్మస్నానం బాగ్నేయంబు. సలిలస్నానంబు వారుణంబు.
మంత్రస్నానంబు బ్రాహ్మంబు. గోరజస్స్నానంబు వాయవ్యంబు. ఆతపవర్షాం
బుస్నానంబు దివ్యంబు. మంత్రపూర్వకంబుగా నుక్తస్నానంబులలో నేదేని
గావించిన భూసురుండు సకలతీర్థస్నానఫలముం బొందు. తులసీపత్రలగ్నజలం
బును సాలగ్రామశిలాసలిలంబును గోశృంగోదకంబును విప్రపాదతోయంబును
బరమపవిత్రంబులు. తత్స్నానంబువలన యజ్ఞప్రతిమహాదానతీర్థస్నానాది
ఫలంబు లభించు. 253

క. పితరులకుఁ జేయఁ దగుని, త్యతర్పణముఁ జేయనట్టియవనిసురుఁ డగుఁ
బితృహంత సంధ్యవార్చని, క్షితిసురుఁ డగు విప్రహంత చెప్పుదు రిరువురన్.

వ. యజ్ఞార్థకుఁడు దేవలకుఁడు నాక్షత్రుఁడు గ్రామయాజకుఁడు పారదారికుఁడును
నగుబ్రాహ్మణు లేగురును బ్రాహ్మణాధములు. 255

గీ. స్నానసంధ్యావిహీనులు శౌచనియమ, వర్జితాశనులును స్వైరవర్తనులును
వ్రతవిహీనులు వేదవిచ్యుతులు నైన, విప్రు లధమాధములు జాతివిప్రు లగుట.

ఆ. దాన మిచ్చునెడల దాత యుత్తముఁ డైన, బ్రాహ్మణున కొసంగి పడయు ముక్తి
యధము డైనభూసురాన్వయజాతుల, కిడినయది బూది నిడినఘృతము. 257

గీ. యాజనాసత్ప్రతిగ్రహాధ్యాపనములఁ, బడయు నఘముల ద్విజులు తత్పాపములను
క్షణములోనఁ బ్రాణాయామజపమునలన, హత మొనర్చుచునుందురు వా రగుటఁ జేసి.

సీ. ఇనుఁడు కరములఁ జండాలగృహము ముట్టి
కొనిన సందుండినను వహ్ని కనదొ ముట్టు
నశుచిభావంబు నట్టులె యవనిసురుఁడు
పాపలేపంబునను గాఁడు పావనుండు. 259

క. వాయువు ఘనములఁ ద్రోసెడి, చాయను బ్రాహ్మణుఁడు పాపజాలము నెల్లన్
బాయంగఁ ద్రోయు నవలకు, గాయత్రీజపబలాధికత్వంబుచేతన్. 260

గీ. ఉత్తమబ్రాహ్మణుఁడు కృపాయుక్తుఁ డగుచుఁ, జేయునెడ దీవనల సర్వసిద్ధు లొదవు
నట్లు గాకుండఁ దిట్టిన నాగ్రహమున, సర్వనాశము గల్గు సంశయము లేదు.

సీ. దర్శించునెడలఁ బ్రత్యహము భూదేవుని, సమకూరు హయమేధసవఫలంబు
దినదినంబును భూసురునకు మ్రొక్కినయెడ, సకలపాపములును సమసిపోవుఁ
బ్రతిదివసమును సంభాషింప ద్విజునితో, భాగీరథీస్నానఫలము గలుగు
నొనరించునెడ నిత్యమును బ్రాహ్మణునిసేవ, సకలార్థసిద్ధులు సంఘటిల్లు

గీ. నెప్పుడును గూడ విప్రులు తృప్తి పడఁగ, నన్నము నొసంగుచుండిన నఖిలలోక
ములకుఁ గూడను బ్రహ్మభవంబును వహించు, జన్మమును జెందు దేహావసానమందు.

సీ. సకలజాత్యన్నభక్షకుఁడుగా నున్నను, బతితుఁ డైనను మహాపాపి యైనఁ
గలసియున్నను నంత్యజులలోనఁ గూడి యు, న్నను మ్లేచ్ఛజాతిసంతతులతోడ
సర్వజాతిస్త్రీలసంపర్కమును జెంది, యున్నను దుర్వృత్తి నొందియున్నఁ
బశుపక్షిమృగముల బాధించుచున్నను, ద్విజధర్మబాహ్యుఁడై తిరుగుచున్న

గీ. నెట్టిదుర్మార్గుఁ డైనను గట్టకడకు, బ్రాహ్మణాన్వయభవుఁ డైన బ్రాహ్మణుండు
తగఁడు చంపంగ నెట్టిదుర్దశలయందుఁ, గూడ నతని ద్విజత్వంబు వీడకుంట. 263

గీ. అట్టిఁడులఁ గూడ వధియించునట్టివాఁడు, బ్రహ్మహత్య యొనర్చిన పాపి యగుటఁ
దప్ప దొందక నరకయాతనల వింటె, యెట్టిదిగొ బ్రాహ్మణునిమహత్త్వమేమి చెప్ప.

వ. దీని కొకదృష్టాంతముం జెప్పెద వినుము. 265

సీ. ఒకబ్రాహ్మణునివంశమున నొక్కపుత్రుఁ డుండెనా, తండు యౌవనము ప్రాప్తంబుగాఁగఁ
బ్రాక్కర్మవశముచే నొక్కచండాలకా, మినిని మోహించి తన్మిళితుఁ డగుచు
దానింటనె యుండి తనయుల దుహితలఁ, గని దానియందుఁ బెక్కండ్రఁ దమిని
నొకనాఁడు సురాపాన మొనరఁగ సహ్యము గామి, నవలకుఁ ద్రోయంగ నామె నవ్వి

ఆ. యతనిముఖముపైని నాసురవల్లుడు, దన్ముఖంబునుండి దపసియింట
బయలువెడలి కాల్చి భస్మంబొనర్చె నా, యుగ్మలిని నసూయాయుక్తముగను. 266
క. అంతట నాద్విజుఁ డెంతయు, సంతాపము నొందు చుండె సమయంబున న
త్యంతము విస్మయ మొదవ న, ఖాంతర దేశంబునుండి యతని చెవులకున్. 267
గీ. బ్రాహ్మణాధమ తానక బ్రహ్మతేజ, మిప్పటికిఁ గూడ విడలక యిట్టు లుండె
నది యె దహియించె నెరల నాత్మహితముఁ, గోరి నీ తేజమును బెంచుకొనుము మరల.
క. అనుమాటలు వినఁబడుటయు, విని వాఁడు విరక్తి గలుగ విషయంబులపైఁ
దన బ్రహ్మతేజ మేవిధ, మున వృద్ధిని గనునో యనుచుం బొగులుచు మదిలోన్.
సీ. చని యొక కాననంబున నం దొక చోట, నాసీను లైయున్న యతులఁ గాంచి
వందనం బొనరించి వారికిఁ దన గాథ, వినిచి యాత్మహితంబు వేఁడుటయును
దివ్యదృష్టిని వారు తిలకించి ధర్మంబు, భ్రష్టుండ వైతి వీవు బ్రాహ్మణంపు
కృచ్ఛ్రంబులను దప్తకృచ్ఛ్రంబులను నీవు, తాపసనాథుల నాచరించి
గీ. దాన సకలాఘములను దగ్ధంబు చేసి, పడయ వచ్చును మరల నీ బ్రాహ్మశక్తి
నని వచింపంగ నతఁడు ధైర్యమునఁ జేసి, యుక్తవిధులను బ్రాహ్మణ్యము బడసె నయ్య.
వ. ఈవిషయంబున మఱియొక గాథ వచియించెద వినుము. 271

—: సుపర్ణచరిత్రకథనము :—

సీ. మును వినతాగర్భముననుండి గరుడుండు, జనియించి క్షుద్బాధ సైఁప లేక
జనని భుక్తిని బెట్టు మని కోర నాతని, పనిచెను వినత కశ్యపునికడకు
నతఁ డేఁగి వేగ కశ్యపునియొద్దకుఁ బోయి, సన్నుతింప గశ్యపుఁ డాతనిఁ గాంచి
తనయ సరిత్పతితటమునఁ బాపిష్ఠు, లైన మ్లేచ్ఛులు గలరు తిను మిఁక ను
గీ. దినుము వారల నాఁకలితీర నీవు, నాపుడు దదాజ్ఞ గైకొని నాగవైరి
యరిగి పాథోధితటమున నచట నున్న, యట్టి మ్లేచ్ఛులను బట్టి నారగింప.
గీ. అట్లు ప్రారంభ మొనరించి యారగింప, నందఱను మ్రింగుచుండంగ నందొకండు
తగులునడి పన్నగారికంధరములోన, వెలుపలికి రాక పోక లోపలికి నిలిచె.
ఆ. అంత గ్రుక్క మ్రింగ నలవి గాని సుపర్ణుఁ, డట్టిట్టు లగుచు నాఁగ లేక
తండ్రికడకు వచ్చి తత్క్షణంబ యటులుంగఁ, జేసెఁ దనయవస్థ చేతు లొగ్గి. 274
వ. అంతటఁ గశ్యపుఁడు తద్గళాంతర్గతుం డగువాఁడు బ్రాహ్మణుం డని తనదివ్య
దృష్టిచే నెఱింగి యాతని నుద్దేశించి. 275
గీ. బ్రాహ్మణోత్తమ రమ్ము వెల్పలకు నీవు, హితము దెల్పెద ననుచు వాఁ డిట్టు లనియె
స్వామి యీకుక్షి నున్న నావారి నెల్ల, విడిచి నామన నొప్పదు వెడలి రాఁగ.
గీ. గలరు శ్వశురులు స్యాలకుల్ గలరు సుతులు
గలరు పెక్కండ్రు బాంధవుల్ గలరు నాకుఁ

వచ్చినను సిరుల నేను బాసి పోను
బ్రతికినను సిరితో నేను బ్రదుకఁగలయు. 277

సీ. అసన్నుఁడగు కశ్యపుం డాత్మలో విస్మయం, బెనయంగ నాతని కిట్లు లనియె
వత్స నీవు ద్విజాతివంశంబునను బుట్టి, కలిసి మ్లేచ్ఛులలోనఁ గామమునను
బతితుఁడ వైతి వాపాపంబునను నకు, బ్రాహ్మణ్య సంతతియు భ్రష్ట మయ్యెఁ
గాని జన్మంబున గర్మానుబంధము గాక, నాశిర్యబలమున నీయందు నిలిచె

గీ. కాన నిను బ్రమింగలేఁ డయ్యె వైనతేయుఁ, డనుగుడె మ్లేంకఁ బాతకు లైనవారి
తోడ సంబంధమును విడనాడి యిపుడె, నిన్నుఁ బావనునిఁగఁ జేయ నున్నవాఁడ.

గీ. పాపజాతుల కెల్లను బాపమండె, సక్తమగు బుద్ధి వారికి ముక్తి లేదు
సాగరము దాఁటఁ దగి మె పాసాణనౌక, నెక్కియున్నట్టివారల కెన్నఁడేని. 279

మ. అని బోధింపఁగ విప్రుఁ డి ట్లనియె దేవా నీవు నా కేమి చె
ప్పిన నావారిని బాసి రా నవలకుఁ బ్రేమంబు విశ్వాసముం
దనరన్ నాయెడ నున్న బాంధవుల నాత్మక్షేమవాంఛం ద్యజిం
చిన వో నిట్టివిపత్తునం బడనె నిస్సీమాఘవారాశిలోన్. 280

క. నాకింక బోధ చేయకు, మీ కరణిని బ్రాణములను నిటు త్యజింతున్
గాకుండిన నావారల, నేకై వడి నైన విడువఁ జేయను వత్సా. 281

చ. అనవుడు బ్రహ్మహత్య యగు నంచు మనంబున నెంచి తార్క్ష్యునిం
గనుఁగొని కశ్యపుండు సుత క్రక్కుము మ్లేచ్ఛుల నెల్ల నావుడున్
జనకుని మాజ్ఞఁ దాల్చి ఖగనాథుఁడు మ్లేచ్ఛుల నెల్లఁ గ్రక్కె నం
తను బడి నూడి బ్రాహ్మణుఁడు తద్గళమధ్యమునుండి భూమిపై. 282

గీ. అపుడు తార్క్ష్యముఖోద్గీతు లైన మ్లేచ్ఛు, లందఱును భీతులై చని యష్టదిశల
కచట నుండిరి ధర్మబాహ్యాంబు లైన, వేషములతోడ నది యెల్ల వినుతు వినుము.

వ. పూర్వదిక్కునందు శ్మశ్రువర్జితులును నల్పశ్మశ్రుసమన్వితులును గేశహీనులును భోజనప్రియులును నాగ్నేయదిక్కునందు నగ్నులును మహాపాపులును దక్షిణదిక్కునం దవాచకులును బ్రాణివధకారకులును గవాశనులును గ్రూరులును నైరృతదిక్కునందు గోబ్రాహ్మణవధకారకులును గువాదులును బశ్చిమదిక్కునందు దొంగలును వంచకులును భయంకరులును వాయవ్యదిక్కునందు శ్మశ్రుపూర్ణులును గవాశనులును దురగపృష్ఠారూఢులును యుద్ధోద్ధతులును శస్త్రపాణులును నుత్తరదిక్కునందుఁ బర్వతవాసులును సర్వభక్షులును వధబంధనిరతులును దురాచారులును నైశాన్యదిక్కునందు వృక్షవాసులును బాపరతులును స్వైరసంచారులును మదోద్ధతులును నై నివసించి యవన చండాల తురుష్కనిషాదనామంబులతో నెల్లరును సురాపానపరదారగమనపరద్రవ్య

హరిణాపరప్రహరణాబిచునిచ్చా రిష్టిఅగ్న్యాదుల గలిగి సర్తింపం గోరుచుండె.
తత్సంభాషణాస్పర్శంబులు గావించిన నరులన్నింటికి నొనరింపవలయు.

ఆ. గళితధర్మమైన కలికాలమున విప్ర, లోభమునను బుద్ధిలోపమునను
లిప్తపాపులైన న్మ్లేచ్ఛులతోఁ గూడి, సంచరింతు రఖిలజనులు గూడ. 285

వ. అని చెప్పుటయు నారదునకు తండ్రి శ్రీభగవంతుఁ ప్రసన్నుఁడగుటం గావల నేమి చేసె
నని యడుగ నాతనికిఁ బ్రహ్మయిట్లనియె. 286

సీ. అంతట ఖగనాథుఁ డాకలి తీరంగఁ, దగువార్త నామునితండ్రి నడుగఁ
గశ్యపుఁ డాతనిఁ గని నన్ను గజకచ్ఛపములు రెండు సముద్రభాగమందు
యుద్ధంబు గావించుచున్నవి యొకదాని, నొకటి క్రుంగఁ దలంచి యుద్ధతముగ
నారెంటిని భుజింపు నాహారముగ నీవు, శాంతించు నాకలి సత్వరంబ

గీ. యని వచింపంగ గరుడుఁ డాతనికి మ్రొక్కి, చని సముద్రంబున నొక్కచోట జగడమాడు
చున్న గజకచ్ఛపంబుల నొడిసి పట్టి, యాకసంబున కెగిరె నుత్సాహముగ. 287

వ. వానిం బెట్టుకొని భక్షింపం దగినచోటు గానంబడమి నానాగంబులును బర్వ
తంబులును వనంబులునుం గడచి యోజనలక్షద్వయంబు చని యొకచోట
బహువిశాలంబును బలిష్ఠంబును నగునొక్కజంబూశాఖ నుపలక్షించి యది
భారంబు మోయంగల దని తలంచి దానిపైని వ్రాలె. 288

గీ. అంత నాజంబుశాఖ యిట్టట్టు లూఁగి, తన్మహాభారము సహింపఁ దరము గామి
విఱిగెఁ జెళపెళఁ బగులంగ విష్ణుపదము, ధరణి యదరంగ దిక్కులు దద్దరిల్ల.

గీ. అట్టు లాకొమ్మ విఱిగి భయంకరముగ, నిలను బడఁబోవుచుండ ఖగేశ్వరుండు
దానిఁ బడకుండ గోవిప్రహానిభీతిఁ, బట్టుకొని ముక్కునను మింటఁ బఱచుచుండె.

సీ. అప్పు డాతనిబలం బాశ్చర్యమును గొల్ప, వానిఁ గైకొన నెంచి వాహనముగ
నరరూపమును దాల్చి నారాయణుఁ డు వాని, కెదురుగా నేతెంచి యిట్టు లనియెఁ
బతగేంద్ర యెచటికిఁ బఱచుచుంటివి నీవు, భరియింపఁగా రానిభరముఁ దాల్చి
యీ వెవండవు దీన నేమి కార్యము నీకు, వచియింపు మంతయు వాస్తవముగ

గీ. ననుటయునుఁ గశ్యపాత్మజుం డాత్మచరిత
మంతయును జెప్పి తా నిల్వ నాశ్రయంబు
దొరకలే దని సూచించెఁ దుట్టతుదకు
విని తదీయోక్తు లెల్లఁద్రివిక్రముండు. 291

గీ. అండజాధిప నాబాహుదండమందు, నీవు కూర్చుండి యీకొమ్మ నీమహీధ్ర
శిఖరములమీఁద విడిచి భక్షింపు మెదకుఁ, గలుగ సంతృప్తి యీగజకచ్ఛపముల.

క. అని భుజము చాఁచుటయు న, వ్వినతానందనుఁడు నవ్వి విపినములు గిరుల్
ఘనధులును మోయఁజాలని, నను నీవు వహింతు నన్న నగరె జనంబుల్.

ఆ. చాలుఁ జాలుఁ బొమ్ము సజ్జనుఁడవు నీవు, పరికించి శ్రమంబు వాయ నొక్క
మాట యైన నోట నాకియ్యదియె తృప్తి, గలుగఁ జేసె ననుఁ గైటభారి.
ఆ. పక్షిరాజ నేను బహుభాషణుఁడఁ గాను, నెలవు లేని నీకు నెలవు చూపి
నిలువు మనిన నీవు నిలువకుండఁగఁ బోవఁ, దలఁచితేని పొమ్ము తప్పు నీదె. 295
క. అని దృఢముగఁ బలుకుటయును, విని వినతానందనుండు వీఁ డెవఁడొ కనుం
గొన వలయు ననుచు మదిలో, ననుకొని నీ వెవఁడ వనుచు నాతని నడిగెన్.
గీ. అడుగుటయుఁ దార్క్ష్యుఁ డావిధి నంబుజాక్షుఁ, డిట్టు లనియె సుపర్ణ నే నెవఁడ నైన
నేమి నీపని తీర్చుకొ మ్మావు ముందు, విదిత మగు నీకు నవల నావిషయ మెల్ల.
క. అనవుడు గరుడుం డట్లాతె, యొనరించెద నని వచించి యొయ్యనఁ జని యా
తనిబాహుదండమున వ్రా, లిన శాఖ నొకింతయును జలింపక యుండెన్.
సీ. అది చూచి తార్క్ష్యుఁ డత్యాశ్చర్య మొందుచు, శైలశృంగములందు శాఖ విడిచి
గజకచ్ఛపములను భుజియించి దానిచే, నాఁకలి దీఱమి నతనిఁ గాంచి
స్వామి నాక్షుద్వహ్ని చల్లార కున్నది, యేమి చేయఁగ నగు నింక నేను
నావుడుఁ బంకేజనయనుఁ డాతనిఁ గాంచి, పతగేంద్ర నాభుజపలము దినుము
గీ. నాఁగ నాగాంతకుఁడు మహానందమునను, దద్భుజామాంసమును మెక్కి తనివిదీఱ
స్వామి క్షుద్బాధ తీఱె నీవలన నాకుఁ, గోరుకొ మ్మేది యేని నీకోర్కి తీర్తు. 299
సీ. అనవుడు గోవిందుఁ డతనికిఁ బ్రత్యక్ష, మై తనదివ్యదేహంబుతోడఁ
గశ్యపనందన కలకాలమును నాకు, వాహనంబుగ నుండవలయు నీవు
నావుడుఁ దార్క్ష్యుఁడు నారాయణునిపాద, పంకేరుహంబులపైని వ్రాలి
తండ్రి భవత్ప్రసాదమున ధన్యుఁడ నైతి, నేమి కానలయు నా కింతకంటె
గీ. ననుడు నారాయణుఁడు వాని కప్రమేయ,గమనమును నజరామరత్వమును గలుగ
నొసఁగి వరము నదృశ్యత్వ మొందె నంత,గరుడుఁ డానందమునఁ దండ్రికడకు వచ్చి.
సీ. ప్రణమిల్లి తత్పాదపంకేరుహములకు, వినిచెను జరిగినవిషయ మెల్ల
నది విని కశ్యపుం డాశ్చర్యమును జెంది, వత్స నీవలన మావంశ మెల్లఁ
దరియించె విష్ణుసందర్శనభాగ్యంబు, కలుగునె యెంతవారలకు నేని
నినుఁ గాంచుటను జేసి నేను ధన్యుఁడ నైతి, ధన్యురా లయ్యె నీతల్లి వినత
గీ. జన్మకోటిసహస్రసంజనిత మైన, యట్టిబహుపుణ్యమునను సంప్రాప్త మయ్యె
నచ్యుతునిసేవ చేయుభాగ్యంబు నీకు, నని మహానందమున సుపర్ణుని నుతించి.
గీ. తండ్రి నీతల్లిచిత్తఖేదంబు దీర్చి, శీఘ్రముగఁ బొమ్ము మాధవుసేవ చేయ
ననుడుఁ దార్క్ష్యుఁడు జనకునియాజ్ఞ వడసి, వినతకడ కేఁగుదెంచి వందనము చేసి.
గీ. ఆయమకుఁ దెల్పి జరిగినయట్టిగాథ, యంతయును నోలలార్చి హర్షాబ్ధిలోన
జనని నీకు హితంబును జలుప నెంచి, యరుగుదెంచితి నీకోర్కి యానతిమ్ము.

సీ. అనవుడు నామె యిట్లనియెఁ గుమారా నా, గాథ విన్నను నీకుఁ గలుగు బాధ
యైనను జెప్పెద నాత్మజుఁడవు గాన, నుపతాప మునఁ గొంత యుపశమింప
నొకనాఁడు కద్రువయును నేను జలకంబు, లాడుచుండఁగఁ జూచి యామె నన్ను
వినత రేపు దివాకరునితురంగము నల్ల, గా నుండు ననుచు నక్కజము దోఁప

గీ. నేను గాదంటి నవుడామె కానియెడల, నగుదు దాసిని నీకు నే నైనయెడలఁ
గావలయు నాకు దాసివి నీవు నాఁగ, నట్లె యగుఁగాక యంటి నే నకపటముగ.

గీ. అంతటను రాత్రి యగుటయు నరిగె నామె, యింటి కాఁపను నేను నాయింటి కేఁగు
దెంచితిని నుదయమున నేతెంచి యామె, నాకడకు రవివాహంబు నాకుఁ జూపి.

గీ. ఎట్టులున్నదొ హరివాజి యీవె చెప్పుమ, యనుటయును నల్లగా నుండెనంటవలన
నల్లగా నున్న దంటి నంతటను నామె, సవతి నా కింకఁ బరిచర్య సలుపు మనియె.

వ. అది మొదలుకొని కద్రువకు నేను దాస్యంబు చేయుచుంటి మాకు వాదంబు జరిగినరాత్రి యామె తనపుత్రు లగునాగులతోడఁ దనప్రతిజ్ఞ చెప్ప నాగులు శీఘ్రగమనంబునం జని హరిహయంబుం గఱచి రనియును దానిచే హరిద్వర్ణంబు గలసూర్యాశ్వంబు కృష్ణవర్ణోపేతం బయ్యె ననియును గర్ణాకర్ణికావశంబున నాకు శ్రవణగతం బయ్యె. 307

గీ. అనినమాటకు మాఱుమాటాడ నాకు, ననుచితంబుగఁ దోఁచుట నామెకడను
నేదియును ముచ్చటింపక యింతవఱకు, నట్లె చేయుచు నుంటి దాస్యంబు నేను.

వ. ఆమెయం దేదోషం బున్నను బరిగణింపక యామెకోరికఁ దీర్చి నన్ను దాస్యవిముక్తం జేయవలయు. 309

సీ. అనవుడు ఖగనాథుఁ డతిరయంబున నేఁగి, కద్రువ యున్ననికాయ్యమునకు
నామెపాదములకు నభివాదనము చేసి, దీవన లొంది యాదేవివలన
నమ్మ మాతల్లిదాస్యమ్ము దీఱెడిమార్గ, మే మైన నున్న నాకెఱుఁగఁ జెపుమ
యని వేఁడుటయు వానిఁ గని యామె నాయన, తల్లిదాస్యము దీర్పఁ దలఁచితేని

గీ. యమృతమును నాకుఁ దెచ్చియి మ్మనియె నంతఁ
దార్క్ష్యుఁ డట్లె యొసంగెదఁ దల్లి యనుచు
నామెయాజ్ఞను గైకొని యాక్షణంబ
వచ్చి జనకునికడకుఁ దద్వార్తఁ దెలిపె. 310

గీ. అంతఁ గశ్యపముని యది యాలకించి, శీఘ్రముగ నాతనికిఁ గార్యసిద్ధి గాఁగఁ
జలిపి దీవన లాజ్ఞ యొసంగ నెగిరి, యంతరిక్షంబునకుఁ దార్క్ష్యుఁ డరిగి యరిగి

చ. అమరపురంబుఁ జేరి త్రిదశాశన ముండెడిచో టెఱింగి శీ
ఘ్రముగను బోయి యచ్చటికిఁ గావలి యున్నసుపర్వయోధబృం

దమును జయించి కైకొని సుధాకలశంబును నచ్చుచుండఁగా
నమరవిభుండు తారసిలి యాతనిపైఁ గురియించె బాణముల్. 312

క. ఆశరనివహము నెల్లను, నాశన మొనరించి తీక్ష్ణనఖములచే నా
గాశనుఁడు విసరె ఱెక్కల, నాశ లదర నమరు లెల్ల నట్టిట్టూఁగన్. 313

ఉ. అప్పుడు వజ్రపాణి ప్రళయాగ్ని తెఱంగున రేఁగి కన్నులన్
నిప్పులు రాలఁ జూచి ఖగ నీ కిదె యంత్యదినంబు కూల్తు ని
న్నిప్పుడె యంచుఁ గేల ధరియించినవజ్రము నేసి వానిపై
రొప్పుచు దూఁకె దాన నొకరోమమునుం దెగదాయె వానికిన్. 314

సీ. అది చూచి దేవేంద్రుఁ డడలు పుట్టఁగ లోన, నతఁడు మహాబలుం డని యెఱింగి
యాయుధంబులు విడనాడి నిర్జరబృంద, సహితుఁడై వచ్చి తత్సవిధమునకుఁ
బక్షీంద్ర యమరుల రక్షింపు మనిలోన, నీతోడ నెదిరించి నిలువలేము
కొనిపోయి యమృతంబు జననిదాస్యముఁ దీర్పు, మయ్యది మా కెల్ల నభిమతంబ

గీ. కాని యమృతంబు ఘనుల కధీనమైన, సృష్టి యెల్లను జెడు వారు దుష్టు లగుటఁ
గాన నీకార్య మైనతత్క్షణమ యమృత, మేను గొనిపోవఁగ ననుజ్ఞ యిమ్ము నాకు.

సీ. అని వేఁడుకొనుటయు వినతాతనూజుండు, శక్రునికోర్కికి సమ్మతించి
వాయువేగంబున వసుధకు విచ్చేసి, యమృతంబుకద్రువ కప్పగించి
తనజనయిత్రిని దాస్యముక్తను జేసె, నంతలో దేవేంద్రుఁ డరుగుదెంచి
యొరులకుఁ గనఁబడకుండ నయ్యమృతంబు, గొని యచ్చటను విషకుంభ మునిచి

గీ. చనియె స్వర్గంబునకు నంత సర్పమాత, హర్షమునఁ బిల్చి తనయపత్యముల నెల్ల
నమృతమును ద్రావుఁ డని పోసియావిషంబు, నమరు లైతిరె పొండు మీ రని వచించె.

గీ. అంత మృత్యువు తమకు లే దనెడిగర్వ
మునను గన్నులు గానక భోగు లెల్ల
జనుల బాధించుచుండ నాసర్పములను
గరుడుఁడు భుజింపఁదొడఁగె లోకముల మనుప. 317

ఆ. అపుడు భీతిచేత నాశీవిషంబులు, దాఁగికొనఁ దొడంగెఁ దరువులందుఁ
బర్వతంబులందుఁ బాతాళమునయందు, సలిలనిధులయందు బిలములందు. 318

క. అంతట లోకం బంతయు, శాంతం బగుటయును సంతసం బొదవంగన్
స్వాంతంబునఁ జనియె గరు, త్మంతుఁడు మాధవునిసన్నిధానంబునకున్. 319

గీ. ఈసుపర్ణచరిత్రంబు నెవ్వఁడేని, వినినఁ బఠియించినను వినిచినను నిలను
ననుభవించి సమస్తసౌఖ్యములఁ బిదప, స్వర్గలోకంబునం దుండు శాశ్వతముగ.

వ. అంతట మ్లేచ్ఛత్వముం జెందినబ్రాహ్మణుండు కశ్యపునిప్రబోధంబున శాస్త్ర
విహితంబు లగుగాయత్రీజపహోమతీర్థస్నానహరికీర్తనచాంద్రాయణాదివ్రతం

బుల నొనరించి మరల స్వబ్రాహ్మణ్యముం బడసి స్వధర్మంబున స్వర్గలోక నివాసభాగ్యముం జెందె. 321

క. అని చెప్పుటయును నారదుఁ, డనవధికం బైనహర్ష మానమతిలంగన్
జనియెను మీ కీవిషయం, బును మఱియొక పూర్వచరితమును వచియింతున్.

—: భీమవృత్తాంత కథనము :—

క. వినునడ నీకథ మీకున్, జనియించును విస్మయంబు స్వాంతములందున్
మును భీముఁ డనెడినామము, గనినుజఘన్యజుఁ డొకండు గలఁ డిలలోనన్. 323

క. ఆతఁడు నిజకులధర్మా, పేతుం డయి పాతకము ల నేకములు బహు
స్వాతంత్ర్యంబునఁ జేయుచుఁ, గాతర్య మొకింత లేక కాంక్షఁ దిరుగున్. 324

గీ. అట్టు లుండంగ సమృద్ధద్రవ్యంబు చాలఁ, గనిన నాపాలి నిసత్యయుతుండు నొక్క
నాఁడు ద్రవిణంబు గలలోభి నాఁగఁ బేరు, వడసినాఁడొక భూసురవర్యునికడకుఁ జేరి.

క. ఆవిప్రునిద్రవిణంబును, నేవిధి నైనను హరింప నెంచి మదిని భూ
దేవ తనుధార్తిని నసువులు, పోవుచు నున్నవి ఋణంబు ప్రోవుము నన్నున్. 326

క. అని తత్పదములపైఁ బడి, కనకన మనుచుండుకుచో గసఁబొఱుచుచు నే
డ్చిన నాబాపఁడు కనికర, మెనయఁగ ని ట్లనియె మోస మెఱుఁగనికతనన్.

ఆ. తండ్రి నిర్గమించెఁ దల్లియు గతియించె, సతియుఁ బోయెఁ బోయె సంతతియును
నమ్మవంకవార లైనను నావంక, వార లైనఁ గాని లేరు నాకు. 328

క. హరి యొకఁడు దప్ప శరణము, పరుఁ డెవఁడును లేఁడు నాకుఁ బాకము సేయన్
దొరఁకొనఁగఁ జాలఁ గైకొని, యురుగుము తండులము లిత్తు నాఁకలిదీఱన్.

క. అని తండులములు గొని రాఁ, గను నాతం డిట్టు లనియె త్వాన్నిర్ఝర నీ
వును నేనును సంసారము, నను సముల మె దిక్కు లేదు నాకును నెందున్. 330

క. నీపాదసేవ సేయుచుఁ, బాపంబులు దొలఁగిపోవ భవదంతికమం
దే పడియుండెద మరణము, చేపడియెడిదాఁకఁ గరుణ సేసిన యెడలన్. 331

చ. అనుటయు బ్రాహ్మణుండు మనమందుఁ బ్రహర్షము నొంది తత్క్షణం
బున నె యొనర్చి పాకమును భుక్తిని వానికిఁ బెట్టి నంత భో
జన మొనరించి వాఁడు ద్విజసద్మమునందె వసించి సేవ చే
యను సమకట్టె బ్రాహ్మణున కత్యధికం బగుభక్తి చూపుచున్. 332

గీ. ప్రతిదినంబును మొదటఁ దత్పాదములను, గడిగి పాదోదకము మస్తకమునఁ గొంత
చల్లుకొని శేషమును ద్రావి సలుపుఁ బిదపఁ, జలుప వలసిన సేవను ధరాసురునకు.

ఆ. అట్లు కొంతకాల మరుగంగఁ గనిపట్టి, బాపఁ డర్థ ముంచుపట్టు లెల్ల
నొక్కనాఁటిరేయి నొడమి యంతయు వాఁడు, కొనిచనంగఁ దలఁచుకొనుచు నుండ.

గీ. దైవికంబుగ నపు డొకతస్కరుండు, కన్నమును వైచి ద్విజునినికాయమునఁ
జేరి లోనికి వెసలు వీక్షించుచుండఁ, గాంచి వాఁడు లేచి జన్నయజుండు. 335

గీ. పట్టుకొనుటకును నాచోరుఁ డట్టు నిట్టుఁ, గదలనీయక మొల నున్నకత్తి దూసి
పట్టుననువాని మెడ గోసి పాఱిపోయె, నంత నచటనె పడి భీముఁ డసువు లుడిగె.

ఉ. అంతట విష్ణుదూతలు రయంబున వచ్చి మహానుభావు డై
త్యాంతికుఁ డీవు చేసినధరామరసేనకు మెచ్చె నీయఘం
బంతయు నంతరించె రథ మయ్యది యెక్కుము విష్ణుమందిరా
భ్యంతరమందు నీ కొకమహాసన మేర్పడె నంచుఁ బల్కుచున్. 337

గీ. అపుడు వృషలుఁడు సంతోస మంది యెంత
ఫలము గలుగునో గుఱిక శుద్ధభక్తితోడఁ
జేయుద్విజసేవ కని లోన సిగ్గుపడుచు
రథముపై నెక్కి విష్ణుపురమున కరిగె. 338

క. ఈవిప్రమహిమ వినునెడ, నేవాఁడైనను దొలంగి యెల్లయఘంబుల్
పోవును వైకుంఠమునకు, దేవానీకంబు సంస్తుతించుచు నుండన్. 339

క. అనుటయును శౌనకుం డి, ట్లనియెను బ్రాహ్మణున కెట్టియపచారములం
బొనరింప నేమి కలుగునో, వినిపింపుము మాకు సూత విశదము గాఁగన్. 340

క. అని యడుగుటయును సూతుఁడు, మునివర నీ వడిగినట్లె మున్నొకదివసం
బున బ్రహ్మ నడుగ నారద, మునివరుఁడు పితామహుండు మునికి ట్లనియెన్.

—: బ్రాహ్మణాపచారఫలకథనము :—

సీ. ఆఁకలియై వచ్చినట్టిబ్రాహ్మణునకు, నన్నంబు పెట్టనియట్టివారు
యాచకుండై వచ్చినట్టిభూదేవుని, నాడఁగూడనిమాట లాడువారు
పాదరక్షాపాణిపాదదండాదుల, క్షోణీసురవ్వనిఁ గొట్టువారు
చౌర్యంబునను గాని శౌర్యంబునను గాని, యిలవేల్పుసొమ్ము గ్రహించువారు

గీ. ఘోరనరకంబులను జెంది కొట్టకొనకు, నుర్విలోఁ బుట్టుదురు హీనయోనులందుఁ
బేదలుగ మూఁగివారుగఁ బాదహీని, వర్జితులుగను వంశవివర్జితులుగ. 342

గీ. తల్లిదండ్రుల గోవును ధరణిసురుని, గురువును వధించునట్టిముష్కరులు కల్ప
శతమువఱకు నసహ్యదుర్గతులఁ జెంది, పుట్టుదురు తుట్టతుద కిలఁ బురువులుగను.

గీ. బ్రాహ్మణునిపైని దన్నంగఁ గాల మెత్తు, నట్టివారలు శ్లీపదవ్యాధితులుగ
ఖంజులుగ ఖండపాదులుగను బ్రకంప, గాత్రులుగఁ బుట్టి పడుదురు కష్టములను.

గీ. పక్షపాతంబునను జేసి బ్రాహ్మణులను, దూషణము చేయుపాపు లాదోషమునను
బ్రభవమును జెంది యిలలోన బక్షవాత, జాడ్యపీడితు లగుదురు జన్మశతము.

వ. సైఁప రానిదుర్భాషణంబులచే బ్రాహ్మణునకు క్షోభంబు గలిగించువారలు

జన్మాంతరంబున విచర్చికాదద్రుమండలశుక్తిసిధ్మారుణకాలశుక్లంబులను నష్ట
కుష్ఠవ్యాధులచేఁ బీడితు లగుదురు. అష్టకుష్ఠంబులయందును దరుణకాలశుక్ల
కుష్ఠంబులు మూఁడును మహాకుష్ఠంబులు. అయ్యవి యతిపాతకుల దేహంబులం
దుండు. తత్సంసర్గసంబంధంబువలన నారోగం బన్యులకును సంక్రమించుం గాన
వారలను దూరీకరింపం దగు. 346

క. ఒనరింపవలయు స్నానం, బును దాఁకిన యెడల శునకమును బతితునిఁ గు
ష్ఠిని స్త్రీధర్మిణిని గవా, శిని భిల్లునిఁ బుల్కసుని నిషిద్ధులు గానన్. 347

గీ. బ్రాహ్మణద్రవ్యమును దిన్నఁ బ్రాణమునను
సప్తకులముల దహియించు శౌర్యమునను
ననుభవించిన యెడలఁ బూర్వాపరముల
దశకులంబులవఱకును దగులఁబెట్టు. 348

గీ. వ్యాప్త మగునది కావున నయ్యొ విషము
విషముచేఁ జచ్చు నొక్కఁడె విప్రధనము
వలన వంశంబు సర్వంబు విలయ మొందు
విషము బ్రహ్మస్వమొ విషంబె విషమొ చెప్పుము. 349

క. గురుపత్నిని జనయిత్రిని, ధరామరునిసతిని మోహసహాక్రాంతాం
తరుఁ డయి కవసిన రౌరవ, నరకమునం గూలి వాఁడు నష్టాత్ముఁ డగున్.

గీ. ఎవనికతమున విడుచునో యవనిసురుఁడు
ప్రాణముల నాతఁ డొందును బ్రహ్మహత్య
చేసినయఘంబు దాన నాచెడుగు కూలుఁ
గాలసూత్రాదిఘోరదుర్గతులలోన. 351

గీ. అధికుఁ డగుటను జేసి బ్రాహ్మణులలోన, శ్రోత్రియుఁడు వానిఁ జంపిన క్షోణిసురుల
గోటిలక్షసహస్రసంఖ్యలను గెడపి, నట్టిపాపమునకు గుఱి యగు నిహంత. 352

వ. అగ్నిదుండును గరదుండును ధనాపహారియును సుప్తఘ్నుండును క్షేత్రాపహారి
యును దారాపహారియును రాజవధోద్యోగుండును బిత్రువధోద్యుక్తుండును
బ్రాహ్మణవధోద్యతుండును నాతతాయులుగాఁ జెప్పంబడిరి. 353

గీ. ధరణి నెవ రేనియును నాతతాయు లైన, యెడల వారిని దగు వధియింప దాన
నఘవిలిప్తుఁడు గాఁడు నిహంత వాని, కైహికాముష్మికములందును హాని లేదు.

గీ. అనుటయును నారదుఁడు హర్షమునను దండ్రి
పాప మొనరింపకుండంగ బ్రాహ్మణుండు
జీవనంబు నొనర్చెడిత్రోవ యేదొ
యెఱుఁగఁ జెప్పుము నా నజుం డిట్లు లనియె. 355

—: బ్రాహ్మణజీవికాప్రకారకథనము :—

గీ. అవనిసురున కయాచిత మైనభిక్ష, ముత్తమం బది గాకచో నుంఛవృత్తి
శ్రేష్ఠ మావల యజ్ఞకారణము విద్య, చెప్పుటయు స్వాధ్యాయనమును శ్రేష్ఠములు.

క. ఆవలఁ బ్రతిగ్రహంబును, గావించుట సుప్రశస్తకార్యము ధాత్రీ
దేవునకు దాన నొదలను, గానములను జేసి తాను భద్రము లొందున్. 357

సీ. అదియును బొసఁగకున్న నైన క్షత్రియ, వృత్తిచే ద్విజుఁడు జీవింప వచ్చు
చాపవేదము నేర్చి శస్త్రాస్త్రసంప్రయో, గంబుల నోర్వ్యమార్గంబు లెఱిఁగి
ధరియించి వీరవ్రతంబు సేనాపాలు నై, తన మొంద ధర్మయుద్ధములు చేసి
పాలించుచును న్యాయబద్ధమార్గంబునఁ, బ్రజలను గోరఁ దగ్గపన్ను గొనుచు

గీ. దానఁ గ్రతువులు వ్రతములు దానములును, నతిథిపితృదేవతారాధనములును నాచ
రించుచును జీవనంబు గావించునేని, బ్రాహ్మణున కన్యవృత్తిదోషంబు లేదు.

క. మునిజనవనితాజనస, జ్జనగురుజనధర్మకర్మసంరక్షణమున్
బొనరించుటచేఁ గల్గిన, యనుపమసుకృతమునఁ జెందు నతఁడు దివంబున్. 359

గీ. శత్రుసమ్ముఖమున న్యాయసమ్మతముగ, నిలిచి రణభూమిలోఁ దృణంబులను బోల
బ్రాణముల వీడుశూరుఁడు బ్రహ్మవాదు, లేఁగుపరమపదంబున కేఁగువాఁడు.

సీ. భంగపాటును జెంది పరువెత్తువానిని, యుద్ధంబు చేయక యుండువాని
శరణు చొచ్చినవాని శస్త్రవిహీనునిఁ, బ్రహరింప వల దని పలుకువాని
భయము చెందినవానిఁ బ్రస్తుతించెడివానిఁ, బ్రతిభటుండై నిల్వఁబడనివాని
వధియింపకుండఁగావలయు యుద్ధము చేయ, నొప్పు నయ్యది ధర్మయుద్ధ మనఁగ

గీ. నట్లు యుద్ధంబు గావించునట్టివాఁడు
స్వర్గమున నొక్కకల్పంబువఱకు నుండి
యనుభవించి సమస్తసౌఖ్యములఁ బిదపఁ
బ్రభవమును జెందు నిల సార్వభౌముఁడుగను. 361

గీ. బ్రాహ్మణక్షత్రియులె కాక పరమపదముఁ, జెందుదురు ధర్మయుద్ధంబు చేసిరేని
యర్యులైన జఘన్యజులైన మ్లేచ్ఛులైనఁ జండాలురైన నేరైనఁ గాని.

గీ. అట్లు కాకుండఁ గపటజన్యములు చేసి, దేహములు దాఁచుకొన్నక్షత్రియుల కైన
బ్రాహ్మణుల కైనఁ దదితరభటుల కైన, ననుభవింపక తప్పదు యమునిశిక్ష.

సీ. అదియును గానిచో నగు వైశ్యవృత్తిచే, జీవింపఁగను మహీదేవుఁ డిలను
ధర్మదేవతయుండుధటమందుఁ గానమో, సముదూకమునయందుఁ జలుపమియును
ననృతంబునం దుండు నఖిలపాపములును, నఖిలవిపత్సంచయమును గాన
చులలోనఁ దూఁపఁగా వలను గాకుండు ద్రవ్యములలో ననృతంబు నాడమియును

గీ. వైశ్యవృత్తిని సేవింప వ్యవసాయములు, వాణిజ్యమును గోరక్షణముల్ ధర్మహాని
కరము లగుటను కారణవశకరములు, దాలిసికొని పాడిపశువులు నొలంగనలయు.

గీ. అర్థవృత్తిని గ్రయవిక్రయములలోన, నవలనలయును ద్విజుఁడు విక్రయించు వస్తువులను
దధ్యంబును భుజియింపఁ దగును దాను, దృప్తి పఱుచుచు మఱి పితరుల దేవతలను.

గీ. అట్లు కాదేని కృషికర్మ మాచరించి, బ్రతుకఁ దగు నిర్భయంబుగ బ్రాహ్మణుండు
శాస్త్రకృషిక్రియ ధర్మంబు దాఁటకుండఁ, జేయునేడ స్వర్గలోకంబు చేరి యుండు.

గీ. జంతుహననపాప మద్దాన సంభవింపఁ, దదుపశాంతికై ధనధాన్యములను
దాన మిచ్చి మహీదేవతలకు శుద్ధిఁ, బడయఁగా వచ్చు నుత్తమబ్రాహ్మణుండు.

గీ. మఱియు నావృత్తివలన సంప్రాప్తమైన, వస్తువుల యజ్ఞసాధనులకును గ్రాసములకును
ననిమిషులకును బితరుల కతిథులకును, నగ్నికిని నర్పణము సేయుచుఁ జేయవలయు.

గీ. కష్టముల నెల్ల సహియించి కడన సేసి, సస్యద్రవ్యంబు విప్రదేవాతిథులకు
బ్రాహ్మణులకును వినియోగపఱిచెనేని, కోటిగుణముగఁ బెంచునగు నేతండె.

గీ. అన్యవృత్తులు జీవికకై గ్రహింప, వచ్చు ద్విజులకు స్వధర్మంబు నడలకుండ
విడిచెనేని స్వధర్మంబు విడుచు జన్మ, శతసహస్రార్జితబ్రాహ్మణత్వయుతని. 370

గీ. నాల్గువృషభంబులను గట్టి నడపవలయు, నర్ధదివసంబువఱకును నవల వాని
వ్యాఘ్రచోరాదిభయశూన్యమైనసత్తృణ, ధాత్రిలోపల విడువంగఁ దగు భుజింప.

క. కావలసినప్పు డెల్లను, గావలసినయంత గడ్డి గ్రాసముగా నం
గోవులకు నొసఁగుచుండం, గావలయును దన్మనోవికాసం బొదవన్. 372

క. దోమలు గ్రిములును నీఁగలు, గోమారులు గోమయంబు గోమూత్రంబుల్
జమలును లేనిగోష్ఠము, ధామంబుగ గోవులకును దగు నొనరింపన్. 373

సీ. మోయించినను భారమును జతచేసి దుర్బలములతోడను బలయుతముల
బాధించినను నతిబాల్యాతివార్ధక, యుతముల నామయయుక్తములను
గట్టివైచినను నాఁకలిదప్పులను గొన్న, వానిని ఘాసంబు సర్జితముగఁ
గొట్టినను జలంబు గ్రోలుచుండిన వానిఁ, దినుచున్న వానిని దృణచయంబు

గీ. సంభవించును గోహత్య సలిపినట్టి, పాతకం బందుచే నట్టిపనులు విడిచి
తనశరీరంబు గాపాడుకొనినయట్లు, కానవగు నాల నెద్దులఁ గర్షకుండు. 374

గీ. పూర్ణిమాదర్శసంక్రాంతిపుణ్యదినము,లందు వృషభంబు మెడపై నిహాలము మోపి
నట్టివారల కయుతగోహత్య లొక్క,సారిగ నొనర్చినయఘంబు సంభవించు.

క. పూవుల నలంకరించియుఁ, గావించియుఁ బత్త్రరచన కాయమునందున్
దేవతనుబోలె గోవును, సేవించెడివాఁడు సకలసిద్ధులు చెందున్. 376

క. ఒకఘాసముష్టి నొసఁగిన, నొకయావున కనుదినమును నోడఁగూడును దా
తకు సర్వైశ్వర్యములును, సకలామగపూజ్యతయును స్వర్గసుఖంబుల్. 377

క. గోవును ద్విజులను మున్నులు, గావున నావస్తువులను గాపాడవలెన్
సేవకులు వారలె నెల్లరు, దేవతలకుఁ గూడ నవియె దిక్కై యుంటన్. 378

గీ. అని వచింపుటయును విని యమరవరాని
జనక విప్రుఁడు గోవును సములటంచుఁ
జెప్పితివి యెట్లు తెల్పుమో చెప్పు మింకఁ
బశు వయినయావు నరుఁడైన బ్రాహ్మణుఁడును. 379

వ. అని యడుగుటయుఁ బరమేష్ఠి యాతని కిట్లనియె. 380

—: గోమాహాత్మ్యకథనము :—

సీ. బ్రహ్మవక్త్రమునుండి ప్రభవించె మున్ను దే, జఃకూట మొకటి విస్మయము గలుగ
దానిలోనుండి వేదంబు వహ్నియును గోవు, విప్రుండుఁ బుట్టిరి వేఱువేఱ
దేవతాసంతృప్తి గావింప నానాల్గు, వస్తువు లయ్యె నావశ్యకములు
నిలువవు లోకముల్ నిర్జరసంతృప్తి, గలుగుకార్యంబులు సలుప కున్న

గీ. నొసఁగ మంత్రంబులను వేద మొసఁగ గోవు
ఘృతపయోరూపహవ్యము క్షితిసురుండు
మంత్రములచేత హవ్యహోమంబు చేయ
నగ్నిముఖమున భుజియింతు రమరు లెల్ల. 381

క. అనిమిషులు చెంది తృప్తిని, ననువుగ గురియింప వర్ష మద్దాన ఫలిం
చును మేదిని తత్ఫలమున, జనములు బ్రతుకుదురు దాన జగములు నిలుచున్.

క. ఆనాలుగువస్తువులును, లేనియెడల జగము లెల్ల లేనివ యగు న
ద్దాననె కలిగెను బూజ్యత, వానికి నధికముగఁ బ్రాజ్ఞవర్గములోనన్. 383

గీ. ఒక్కజన్మంబుననె మోక్ష మొదవ వరము, నిచ్చినాఁడను గోవున కేను మున్ను
దానఁ జేసియు గోవు పాత్రతను జెందె, సేవ చేయంగ విప్రులు దేవతలును.

సీ. కాయంబునను బాపకణ మేమియును లేమిఁ, బావనం బైయుండు గోవు సతము
దానిపేఁడయునుమూత్రమును నాజ్యంబును, బెరుఁగుఁ బాలును శుద్ధికరములయ్యె
నాపంచగవ్యముల్ ప్రాశనం బొనరింప, భస్మంబు లగు సర్వపాపములును
దనువు వీడినక్షణంబుననె నాసన్నిధి, కరుదెంచు నిష్పాప మగుట గోవు

ఆ. కాన గోవు సకలకలుషంబులును మాపు, నట్టి దగుట దాని కన్వహమును
సేవ చేయునెడలఁ జెందు స్వర్గపదంబుఁ, గలుషకోటిదళితకాయుఁ డేని. 385

క. గోవునకుఁ బ్రదక్షిణమును, గావించిన నొక్కసారి గతకలుషుం డై
యేవేళను నివసించును, దేవత లెల్లరును గొలువఁ ద్రిదివమునందున్. 386

క. అకలుషమతియై ధేనువు, నకు నేడుప్రదక్షిణము లొనర్చిన సురనా
యకపదము నొంది విబుధ, ప్రకరము గొలువంగఁ ద్రివిష్టపంబున నుండున్.

వ. కల్యంబున నుత్థితుండై జలపాత్రంబునం గోమాహాత్మ్యమునకుం జని సలిలంబు
గోశృంగంబుపయిం బోసి శృంగంబునుండి జాఱెడునాజలంబు మస్తకంబునం
దాల్చి యాదినం బుపవసించినయెడఁ ద్రిలోకవిఖ్యాతంబులును మహర్షిసేవితం
బులును నగుసకలపుణ్యతీర్థంబులలో స్నానంబు గావించినఫలంబు నొందం
గలుగు. ప్రాతఃకాలంబున గోగోఘృతమధుప్రియంగుసర్షపంబుల స్పృశించె
నేని సకలపాపనిర్ముక్తుం డగు. 388

సీ. జనుఁ డెవ్వఁడేని యుషఃకాలమునను సా, యంకాలమందును నాచమించి
ఘృతయోనులునుఘృతక్షీరదంబులుఘృ తా,వర్తముల్ఘృతసరస్వతులు నైన
గోవు లుండునుగాక యేవేళలను నాగృ, హమున నాసర్వగాత్రములయందు
నానాల్గుప్రక్కల నేను గోవులమధ్య, మందు నిత్యంబును నుండుఁగాక
గీ. యనుచు జపియించెనేని సర్వాఘములును, దొలఁగి దేవతలెల్లరుఁగొలువఁదాను
స్వర్గలోకంబునం దుండు శాశ్వతముగ, నఖిలసౌఖ్యంబు లిహమున ననుభవించి.

క. గోవువలె బ్రాహ్మణుఁడు భూ, దేవునిచందమున వాసుదేవుండును నా
గోవిందుఁడువలె గంగా, దేవియు సేవ్యులు సమానదేవత లగుటన్. 390

క. మనుజునకున్ గోవును గో, వునకున్ మనుజుఁడును బాంధవులు గావున గో
ధనశూన్యం బై యుండెడి, మనుజగృహము బంధురహితమందిరము సుమీ.

ఆ. తాల్చునో యెవండు గోఖురోత్థితరజంబు, మూర్ధమున వాఁడు భూతలంబునఁ గలట్టి
సకలతీర్థంబులందును స్నానమాడి, నట్టిఫల మొంది దాన ధన్యతను జెందు.

సీ. శ్వేతగోదానంబు చేసిన మేదినీ, కాంతుఁడై సకలభోగములఁ జెందు
సర్వపాపములును సమసి సంసార పా, థోధి దాఁటు నొసంగ ధూమ్రగోవు
నెట్టిశోకమ్మును నెఱుఁగక సుఖియించుఁ, గృష్ణగోవును సమర్పించెనేని
వర్ధిల్లఁ జేసినవాఁ డగు వంశవృ, క్షంబు నిచ్చినయెడ గౌరగోవు
గీ. భువనమోహనరూపంబు వొందఁ గలుగు, నిచ్చునెడ రక్తధేనువు నిచ్చునెడలఁ
గపిలగోవునుశతజన్మకలుషములను,భస్మమొనరించి త్రిదివంబుఁ బడయఁగలుగు.

ఆ. ఒక్కకపిలగోవు నొసఁగినఁ జాలును, సకలగోప్రదానసుకృత మొంద
దానఁ గపిలగోప్రదానంబు గావించు,వాఁడె ధన్యుఁ డఖిలసంద్యుఁ డతఁడె.

గీ. స్వర్ణశృంగయుఁ దామ్రపృష్ఠయును క్షౌమ
యుతయుఁ గాంస్యోపదోహనయును సరౌప్య
ఖురయు సుమగంధభూషణసురుచిరయును
నైనగోవును దాన మీయంగ వలయు. 395

గీ. పదయుగంబును ముఖము వెల్పలకు రాఁగ
గర్భమున దూడ సగ మున్నకాలమందు

నుభయముఖి యగు ధేనువు నొసఁగెనేని
తత్ఫలం బింత యం తనఁ దరము గాదు. 396

ఆ. భర్మసౌధములును బాయసకర్దమం, బు లగునదులుఁ గామఫలము లైన
వృక్షములును నెచట విలసిల్లు చుండునో, యేఁగు నటకు గోవు నిచ్చువాఁడు.

గీ. అఖిలలక్షణయుతయుఁ బయస్వినియును,దరుణయును నైన ధేనువు ధాత్రియనుచుఁ
జెప్పఁబడియెను దానినిచ్చిన ధరిత్రి, యంతయు నొసంగినఫలంబు నతఁడు చెందు.

క. హరియించినయెడ గోవును, మరణించినపిదపఁ గోటిమన్వంతరముల్
పరిదేవన మొనరించుచుఁ, బురువులు గలనరకకూపమునఁ బడి యుండున్. 399

క. ఒనరించినయెడఁ గోవధ, మును గుంభీపాకనరకమును నాకల్పం
బును ననుభవించి కడకున్, జనియించును భూతలంబునను సూకర మై. 400

వ. గోవునకు ముఖంబున షడంగపదక్రమయుతంబు లగు వేదంబులును శీర్షంబునందు బ్రహ్మయును శృంగంబులందు హరిహరులును శృంగాగ్రంబునందు మహేంద్రుండును లలాటంబునందు వృషధ్వజుండును గర్ణంబులం దాశ్వినులును నేత్రంబులందు శశిభాస్కరులును దంతంబులందు గరుడుండును జిహ్వయందు సరస్వతియును నుదరంబునందు స్కందుండును రోమకూపంబులందు ఋషులును బూర్వభాగంబునందు యముండును బశ్చిమభాగంబునం దగ్నియును దక్షిణపార్శ్వంబునందు వరుణకుబేరులును వామపార్శ్వంబునందు యక్షులును ముఖమధ్యంబునందు గంధర్వులును నాసాగ్రంబునందుఁ బన్నగులును ఖురపశ్చిమపార్శ్వంబున నప్సరసలును నపానంబున సర్వతీర్థంబులును బ్రస్రావంబున గంగయును గోమయంబున లక్ష్మియును బాదాగ్రంబున ఖేచరులును హంభారవంబునఁ బ్రజాపతియును స్తనంబులందుఁ జతుస్సాగరంబులును నుండు. 401

గీ. కాన నొకగోవును స్పృశించెనేని నరుఁడు, సకలతీర్థంబులందును స్నానమాడి
నట్టిఫలమును నమరుల కందఱకును, సేవ చేసినఫలమును జెందఁ గలుగు. 402

క. అని చెప్పుటయును నారద, మునివరుఁ డత్యంతహర్షమును జెంది దివం
బున కరిగెను నావుడు సూ, తునిఁ గనుఁగొని శౌనకుఁడు గుతూహల మొదవన్.

క. అనఘ ప్రమోదము జనియిం, చెను నా కెద నింక శౌరిచేతస్సంతృ
ప్తిని బాతకనాశనమును, నొనరించెడిసులభకార్య ముండినఁ జెపుమా. 404

—: ఆశ్వినపూర్ణిమామాహాత్మ్యకథనము :—

చ. అనవుడు సూతుఁ డిట్లనియె నాశ్వినపూర్ణిమనాఁడు నందనం
దనునకు నారగింపఁగ ఘృతప్లుతలాజలు గవ్వ లాడ న
ప్పున మొనరించ్చిన ట్లయినఁ బద్మదళాక్షుఁడు తృప్తి చెందు దా
నను దురితంబు లన్నియును నాశన మొందుఁ దపోధనాగ్రణీ. 405

సీ. పూర్వము కరవీరపురమునం దొకశూద్రుఁ, డుండెను గాలద్విజుండు నాఁగఁ
గావించి వాఁ డసంఖ్యాకంబు లగుపాత, కము లొక్కనాఁ డొక్కకడను జచ్చె
నంతట యమదూత లతనిఁ గైకొనిపోయి, నిలిపి రంతకునిసాన్నిధ్యమందు
దండధరుండు తత్కర్మానుసారంబు, గను క్రోధ ఘోరదుర్గతుల వాని

గీ. నంతటను వాఁడు నూఱుమన్వంతరములు, గడపి కఠినంబు లగునరకంబులంద
పిమ్మటను నొకభుజగిగర్భమ్మునఁ జొచ్చి, తుదకు జన్మించె నొకశిలాసదనమందు.

గీ. పుట్టియచ్చోటఁ బెరుఁగుచు నెట్టొయొకరి, కంటఁబడకుండఁ గుసుచు నంగష్టములను
నొక్కయాశ్వినపూర్ణిమ నొక్కలాజ, యొక్కగవ్వను వెలికి లోనుండి త్రోసె.

క. ఆగవ్వయు నాలాజయు, నాగట్టున వెలసియున్న హాటకస్ఫటికన్
వేగముగఁ బోయి పడుటయు, నాగశయానుండు తనదునాళి మొనర్చెన్. 408

ఉ. అంతటఁ గొంతకాలమున కాఫణి దేహవియోగ మొందఁ బ్ర
త్యాంతికసేవకుండు సురయానము గైకొని వచ్చి దానియ
భ్యంతరమందు నుంచుకొని యాసుకృతాత్ముని నేఁగి విష్ణుగే
హాంతరసౌధమం దునిచె సంతకు నెంతఫలంబొ వింటివే. 409

క. ఈపూర్ణిమామహాత్త్వము, పాపాత్ముం డైన వినినపక్షంబునఁ ద
త్పాపంబు లెల్లఁ దొలఁగును, శ్రీపతికరుణామృతాబ్ధి శీకరముపలనన్. 410

గీ. మఱియు ద్వాదశినాఁడు రమానాథునకు, శర్కరాదుల స్నపనంబు సల్పునరునకు
నన్నదానంబుఁ గావించినట్లు లైన, హరికి సంతృప్తియును బాపహారియుఁ గలుగు.

గీ. అనుటయును శౌనకుం డిట్టు లనియె సూత, విన్నకొలఁదిని ధర్మముల్ విసువు రాదు
చెప్పు మెట్టిదో యేకాదశీమహాత్త్వ, మది వినంగ మనోరథ మంకురించె. 412

—: ఏకాదశీమాహాత్మ్యకథనము :—

వ. అని యడుగుటయు సూతుం డమ్మునివర్యున కిట్లనియె. 413

క. ఏకాదశి యనుశబ్దం, బాకర్ణించినను జాలు నత్యంతభయ
వ్యాకులమానసు లగుచును, నాకడకును రాక యుంట కంతకునిభటుల్. 414

గీ. ధన్య మా రాజుజన్మము ధన్యు లతని, జనపదంబుల నుండెడిజనము లెల్ల
హరిదినంబున నెవనిరాజ్యంబునందు, జరుగుచుండునో విష్ణుపూజామహంబు. 415

క. వెలిఁగింతురో ఘృతదీపము, జలజాక్షునియెదుట నెవరు శ్రద్ధాభక్తుల్
గలిగి హరివాసరంబున, వెలుఁగుదురు సతంబు వారు విష్ణుపురమునన్. 416

గీ. దినములం దెల్ల నుత్తమదినము నాఁగ, వాసికెక్కెను వైకుంఠవాసరంబు
నాఁ డుపవసించి జాగరణం బొనర్చి, శార్ఙ్గి నర్చించుజన్మమె జన్మ మనఘ.

సీ. బ్రహ్మహత్యాదిపాపము లెల్ల నశియించు, వైకుంఠదివసోపవాసమునను
గాసకుష్ఠాదిరోగము లన్నియును మాయు, వైకుంఠదివసోపవాసమునను
చిత్తమాలిన్య మశేషంబును దొలంగు, వైకుంఠదివసోపవాసమునను
నాగామ్యాపర్థంబు లన్నియు నడఁగారు, వైకుంఠదివసోపవాసమునను

గీ. చంద్రసూర్యోపరాగముల్ సంఘటిల్లి, నపుడు గంగాదితీర్థంబులందు స్నాన
మాచరించుటచేఁ గల్గునట్టిఫలము, వచ్చు వైకుంఠదివసోపవాసమునను. 418

క. ఉందురో యుపవాసము గో, విందునిదినమందు నెవరు విష్ణుపురంబం
దుందురు శాశ్వతముగ వా, రందఱును విషాదవిరహితాంతరంగముల్. 419

గీ. ఆరగింతురో హరిదినమందు నెన్ని, యన్నకణములు పూనపు లన్ని బ్రహ్మ
హత్యలొనరించినయఘంబునందిశమన, లోకమునఁ జెందుదురు ఘోరశోకములను

గీ. చేసి యుపవాస మేకాదశీదినమున, శౌరి నర్చించి ద్వాదశీపారణంబు
విధివిధానంబు నెఱిఁగి కావించెనేని, గర్భనరకాభిశప్తుఁడు గాఁడు మనల. 421

ఆ. అఖిలపాపములును హరివాసరంబున, నాశ్రయించి యుండు నన్నమంద
కాన నాదినమునఁ గావించునెడ భుక్తి, నలిపినట్లు సకలకలుషభుక్తి. 422

గీ. ఎన్ని పాపంబు లొనరించియున్నఁ గాని, యొక్కపరి నైన నిష్కృతి యొందవచ్చు
హరిదినంబునఁ గావించినట్టిభుక్తి, కెన్నఁటికిఁ గూడ నిష్కృతి యేరుపడదు.

గీ. నాతితోడ నమావాస్యనాఁడు గలసి, కొన్న యెడఁ గల్గుదోషంబు కొట్టికేఱు
హరిదినంబున నన్నంబు నారగించు, నట్టిమూఢాత్ములకు సంశయంబు లేదు.

సీ. హరివాసరంబున నన్నంబు తినునేని, కలుగుఁ గుష్ఠాదిరోగంబు లెల్ల
హరివాసరంబున నన్నంబు తినునేని, దారిద్ర్య మొనగూడుఁ దరచికంబు
హరివాసరంబున నన్నంబు తినునేని, నమకూరు నతినీచజన్మకోటి
హరివాసరంబున నన్నంబు తినునేని, బ్రహ్మహత్యాదిపాపంబు లొదవు

గీ. బాగుపడ నెంచువారలు బాగుపడఁగఁ, జెప్పినదె మాటిమాటికిఁ జెప్పుచుంటి
హరిదినంబునఁ దగ దన్న మారగింప, హరిదినంబునఁ దగ దన్న మారగింప.

క. వనజాక్షుఁడు శయనించెడి, దినమందును నొత్తిగిలెడిదినమందును మే
ల్కాను దినమునను నుపోషణ, మొనరించెడివార లెదుట నుండుదురు హరికిన్.

గీ. చిత్త మెవనికి నేకాదశీవ్రతంబు, నందు నుండునో యతనికై యుపతెంపు చెందు
హరిపదంబును సాధనాంతరము లేదు, గతులు గలుగంగ హరిదినవ్రతముకంటె.

క. పతితోడను హరిదివస, వ్రతమును గావించుతరుణి స్వామిప్రియ యై
సుతులను గని యిహమున స, ద్గతులను బరమందుఁ జెందుఁ దనపతితోడన్.

గీ. హరిదినంబున నేవస్తు వైనఁ గాని, భక్తితోడను శౌరి కర్పణముచేయు
నట్టివానికి నక్షయ మైనపుణ్య, మొదవి శాశ్వతముగ విష్ణుపదము గలుగు.

గీ. కాంస్యమును మాంసమును జణకములు మధుప్ర
సురతమును గోద్రవములు మసూరములును
శాకము పరాన్నమును బునర్భుక్తి తగవు
దశమినాఁ డివి పదియును దాపసేంద్ర. 430

గీ. కూడ నచ్యుతదినమునఁ గూఢహింస, యనృతమును నాగ్రహమును భోజనముదంత
ధావనమును బరాపవాదమును రతియు, ద్యూతమును దమ్ములంబును దొంగతనము.

గీ. జనకు ద్వాదశినాఁడు వ్యాయామ కాంస్య, పతితభాషణమధుసురాపానములును
రతిపునర్భుక్తిమాంసకోద్రవమసూర, తైలములును బ్రవాసముఁ దగవు చూవె.

గీ. తోయములలోన నుండుబుద్బుదములట్లు, దేహధారులలోని పుణ్యకలు వోలె
జనన మొందుచు నుందురు చావుకొఱకె, హరిదినవ్రత మొనరింపనట్టిజనులు.

గీ. నల్ల నగు ధేనువునకును తెల్ల నైన, ధేనువునకును బాలొక్కటీరు గాఁగ
నుండునట్లు లె ఫలముండు నొక్కఁడుగ నె, యుభయపక్షముల హరిదినయుగమునకును.

సీ. కాంచనం బను పేరు గలపురంబున మున్ను, వల్లభుం డనునొక్కవైశ్యుఁ డుండె
నతనికిఁ గల యొక్కయతివ హేమప్రభ, యనునామమున నుగుణముగ
నాకాంత చెడిపయై యనుదినంబును గూడఁ, బరుల గేహములకుఁ దిరుగఁ జొచ్చె
నది చూచి యొక్కనాఁ డాఁగఁ జాలక కొట్టె, నామెను వల్లభుం డాగ్రహమున

గీ. నంత నాయింతి గదిలోని కరిగి పండు, కొనియె భుజియింపకుండఁగాఁ గ్రోధమునను
నాదినం బంతయును గూడ నాదినంబె, విష్ణువాసర మయ్యె దైవికము గాఁగ.

వ. అంతఁ బ్రభాతం బగుటయు హేమప్రభ హరివాసరోపవాసంబునం జేసి వినిర్మ
లాంతఃకరణయై భోజనంబు గావించి యాకస్మికంబుగా నారాత్రి మరణించె.

ఉ. అప్పుడు విష్ణుదూతలు రయంబున వచ్చి విమానమందు నా
కప్పురగంధి నుంచుకొని గౌరవ మొప్పఁగ నేఁగి శౌరికిం
జెప్పుటయుఁ జనార్దనుఁడు చిత్తములోపల నెంతో సంతసం
బుప్పతిలంగ నుంచెఁ దనయొద్దనె యామెను శాశ్వతంబుగన్. 437

గీ. చేసియుపవాసమును హరివాసరమునఁ, దెలియకయె యూర్ధ్వపదమతిసులభముగను
జెందె హేమప్రభ యెఱింగి చేసె నేని, కలుగుఫల మింత యంతని తెలుపనగునె.

గీ. ఉభయపక్షంబులందును నుండువిష్ణు, వాసరములకు భేదంబు వీసమేని
లేదు రెండును మోక్షసంపాదకముల, కాన నేకాదసులు రెండు మాన రాదు. 439

వ. దశమినాఁ డేకభక్తంబు గావించి యేకాదశీదినంబున గృహస్నానం బధమం
బనియును వాపీకూపస్నానంబు మధ్యమం బనియును బుష్కరస్నానం బుత్తమం
బనియును నదీస్నానం బుత్తమోత్తమం బనియును జెప్పంబడియెం గాన
యథాశక్తిఁ బ్రాతస్స్నానంబు చేసి వ్రతనియమంబు వహించి నిద్రా

మైథునవర్జితుండై క్రోధలోభమిథ్యావాదధర్మనిందాపరులసంగంబు వర్జించి ధర్మవిచారపరాయణుండై మాధ్యాహ్నికస్నానంబు గావించి గంధపుష్ప ధూపదీపాదులచే మాధవుని నారాధించి రాత్రి జాగరంబున నాదినం బెల్ల నుపవసించి ద్వాదశినాఁడు పారణ గావింపవలయు. అయ్యది సాంగం బగు నేకాదశీవ్రతంబు. వారాణసియందు నలువదివేలవత్సరంబు లుండిన ఫలంబును గురుక్షేత్రంబునందుఁ జంద్రసూర్యోపరాగకాలంబునఁ గావించిన దానంబునకుం గలఫలంబును వైధృతినాఁడు లక్షదానంబులు చేసినఫలంబును ప్రభాసక్షేత్రంబున సోమపర్వసహస్రంబులందు దానంబు గావించినఫలంబును ప్రతిదినంబును గృహంబునందు లక్షమందియతులు భుజియించినఫలంబును గేదారక్షేత్రంబునం దుదకపానంబు గావించినఫలంబును హరివాసరోపవాస షోడశకలకును నీడు గానేరవు. గోసహస్రదానపుణ్యంబుకంటె బ్రాహ్మణారాధన పుణ్యంబు శతగుణాధికంబు. బ్రాహ్మణసహస్రారాధనపుణ్యంబుకంటె బ్రహ్మ చార్యారాధనపుణ్యంబు దశగుణాధికంబు. బ్రహ్మచారిసహస్రారాధనపుణ్యంబు కంటె వానప్రస్థారాధనపుణ్యంబు దశగుణాధికంబు. వానప్రస్థసహస్రారాధన పుణ్యంబుకంటె భిక్షుకారాధనపుణ్యంబు దశగుణాధికంబు. భిక్షుకసహస్రారా ధనపుణ్యంబుకంటె భూదానపుణ్యంబు దశగుణాధికంబు. దానికంటెఁ గన్యా దానపుణ్యంబు దశగుణాధికంబు. దానికంటె విద్యాదానపుణ్యంబు దశగుణాధి కంబు. దానికంటె నన్నదానపుణ్యంబు దశగుణాధికంబు. దానికంటె గోమేధ పుణ్యంబు దశగుణాధికంబు. గోమేధసహస్రపుణ్యంబుకంటె నశ్వమేధపుణ్యంబు దశగుణాధికంబు. అశ్వమేధసహస్రపుణ్యంబుకంటె నరమేధపుణ్యంబు దశగుణాధి కంబు. నరమేధశతపుణ్యంబుకంటెఁ గేదారక్షేత్రోదకపానపుణ్యంబు దశ గుణాధికంబు. కేదారోదకపానంబువలన జన్మరాహిత్యంబు గలుగు. దానికంటె నేకాదశీపుణ్యం బధికంబుగాఁ జెప్పంబడియె. ఏకాదశీపుణ్యం బసంఖ్యంబు. ఏకాదశికంటెఁ బుణ్యాధికం బగునది మఱియొండు లేదు. 440

గీ. కానఁ బుష్కరమును బ్రయాగమును గయయుఁ
గాశియును గంగయును గూడఁ గావు సాటి
హరిదినంబున కొకదాని కవనిలోన
ననుటయును శౌనకుం డిట్టు లడిగె మరల. 441

గీ. అనఘ ప్రతిమాసమును వచ్చుహరిదినంబు
లెట్టివియొ వానిమాహాత్మ్య మెంతటిదియొ
చెప్పుము సవిస్తరంబుగాఁ జెప్పఁదగిన
యంశ మంతయు లోటు లేనట్లు నాకు. 442

వ. అనుటయు సూతుండు శౌనకున కిట్లనియెను. 443

క. మునివర యీతెఱఁగంబున, నను నీ వడిగినవిధంబున నా ప్రార్థ్యము కృ
ష్ణుని ధర్మజుఁ డడుగఁగ ని, ట్లని చెప్పెను గృష్ణుఁ డాదరాన్వితుఁ డగుచున్. 444

వ. మార్గశీర్షకృష్ణపక్షంబున మురాసురసంహారార్థము నా దేహంబునుండి యేకాదశి మొదట నుత్పన్న యగుటం జేసి మార్గశీర్షకృష్ణైకాదశి యుత్పన్నైకాదశి యని చెప్పంబడియె. దానిమహిమం బనిర్వచనీయంబు. 445

—: మార్గశీర్ష కృష్ణైకాదశీ మాహాత్మ్య కథనము :—

క. అనుటయు ధర్మజుఁ డది యె, ట్లని యడుగఁగఁ గృష్ణుఁ డిట్లు లనియెను బూర్వం
బునఁ గృతయుగంబునను మురుఁ, డనియెడి రాక్షసుఁ డమరుల ననువుగఁ దఱుముచున్.

గీ. దైత్యసేనలతోఁ గూడి దండు వెడలి, సురల నోడించి స్వర్గంబు కరగతంబు
చేసికొని దండగంబులు చేయఁ దొడఁగె, స్వర్వరసదనమునను ముముక్షువులకును.

గీ. అప్పుడు పురుహూతుఁ డుండుట కైనఁ దావు
నాస్పదము లేమిఁ జింతాపరాత్ముఁ డగుచు
నాదితేయులతోఁ గూడి యరుగుదెంచి
నాకడకు నిట్లు లనియె విభ్రముఁ డగుచు. 448

గీ. స్వామి మును పుట్టె బ్రహ్మవంశంబునందుఁ
దాళజంఘాహ్వయుం డను దైత్యుఁ డొకఁడు
వాని కుదయించె మురుఁ డనుసూనుఁ డొకఁడు
చంద్రవతి యనుపురము తత్స్థాన మయ్యె. 449

గీ. అతఁడు బ్రహ్మవరంబున నమిత మైన, శక్తి నార్జించి మమ్మెల్లఁ జరియు మోఁది
యాక్రమించె దినంబు నయ్యది యె కాక, యెన్నొ సాహసములు చేసి యున్నవాఁడు

క. వేఱుగ నింద్రుని వహ్నిని, వేఱుగ రవిచంద్రభముల వేఱుగ సురలన్
వేఱుగ గ్రహముల వేఱుగ, వేఱుగ నొసరించె దివమున నే యెయ్యెడలన్. 451

చ. అనుటయు నేను జిత్తమున నాగ్రహ మొంది దురాత్ముఁ డింత చే
సెనె యెగటార్తు వాని నని చేతను జక్రముఁ బూని నిర్జరుల్
వెనుకను రాఁగ నామురునివీటికిఁ బోయి కఠోరశంఖని
స్వనమును జేసినాఁడను నిశాచరు లెల్లరుఁ బర్వ లెత్తఁగన్. 452

ఉ. అంతట నామురుండు ప్రళయాగ్ని తెఱంగునఁ బ్రజ్వరిల్లుచుం
గుంతముఁ దాల్చి కేల సురకోటిపయిం బడ వారు సాధ్వసా
క్రాంతమనస్కులై పఱవఁగా మురదైత్యునితోడ నేన యా
త్యంతభయంకరంబుగను సాహసముం బొనరించితిన్ నృపా. 453

గీ. అట్లు లక్షీకృతోరమునగ సహస్రదివ్య, వర్షములు నేను ఘోరాజి వానితోడఁ
దుదకు విసువొంది పరువెత్తి బదరికాశ్ర, మమున సింహావతీగుహామధ్యమునకు.

గీ. అచట మార్గశ్రమంబు వాయంగ నేను
మఱచి నిదురించుచుండ గుత్తఁగ మురుఁడు
వచ్చి యాగుహాలోపలఁ జొచ్చి చూచి
నన్ను లంఘించి పయిఁబడ నున్నవేళ. 455

క. జనియించె దేహమున కన్యక, జనవర నామేననుండి చయ్యన నాదై
త్యుని సంహరించి నిలిచెను, గనులకు మిఱుమిట్లు గొలుపఁగను నాయెదుటన్.

గీ. నిలుచుటయు మేలుకని నేను నిద్రనుండి, కన్నులను విచ్చి చూచి యాకన్య నెదుట
విస్మయముఁ జెంది బాల యీవిపినమునకు, నేల వచ్చితి నెవతెవీ వెఱుఁగఁజెపుమ.

క. అనుటయు నే నేకాదశి, యనుదానను దేవ నిన్నె యర్థింపఁ జెడిదా
నను నేఁడు మురవినాశన, మొనరుప నీమేన జనన మొందినదానన్. 458

గీ. అనుటయును నేను బ్రక్కగా ననువు లుడిగి, నేలమీఁదను బడియున్న తాళజంఘ
సుతునిఁ గనుఁగొని నిశ్చలస్థితిని జెంది, నిమిషమాత్రంబు మితి లేనిప్రమదమునను.

ఆ. బాల నన్నె కాక బ్రతికించితి వశేష, భువనములను నమితపుణ్య వగుట
నిచ్చెదను వరంబు లెన్నైనియును నీకుఁ, గోర్కి తీరునట్లు కోరుకొనుము. 460

క. అనుటయు నాకన్యక యి, ట్లనియెను నీమాయ తెలియ నగునె ప్రపంచం
బున కేది యెట్లు చేయం, జనునో యటులె చేయుచుందు సర్వము తండ్రీ.

గీ. కాన నీవిచ్చువరమును గాదనంగ, రాదు గావునఁ గోరెద నాదినంబు
నందు నుపవాస మొనరించునట్టివారి, కపునరావృత్తి యగుపదం బబ్బఁ గాక.

గీ. నాదినంబునఁ జేసెడినక్తమునకు, ఫలము సగ మీయు ముపవాసఫలములోన
నక్తఫలమున సగ మేకభక్తమునకు, నొసఁగు మఖిలజనంబుల నుద్ధరింప. 463

గీ. నాదినంబున నుపవాసనక్తములకు, నేకభక్తంబునకుఁ గూడ నెట్టిఫలము
యట్టిఫల మిమ్ము మదిని నీయందు నిలిపి, జాగరం బొనరించెడిజంతువులకు. 464

గీ. ప్రియము గాకుండుఁగాక యేదియును గూడ, నాదినమువోలె నీకు ననాదినిధన
యనుచుఁ బ్రార్థించుటయు నట్లె యగును గాక, యని వచించి యంతర్ధానమైతి నేను.

—: మార్గశీర్ష శుక్లైకాదశీమాహాత్మ్యకథనము :—

వ. మార్గశీర్ష శుక్లైకాదశి మోక్షైకాదశి యనునామంబు వడసె. తచ్ఛ్రవణ
మాత్రంబున వాజపేయఫలంబు ప్రాప్తించు. 466

గీ. సర్వపాపంబులను గూడ సమయఁజేసి, మోక్ష మొసఁగును గావున మోక్ష యనెడి
నామమును జెందె నయ్యది భూమిపాల, వినుము దానిమహాత్మ్యము వినుతు నీకు.

సీ. కలదు పూర్వము చంపకం బనుపురం [illegible]
వైఖానసుం డనువసుమతీంద్రుఁ [illegible], పాలింపుచుండె నాపత్తనంబు
నటు లుండ నొక్కనాఁ డతనికిఁ దత్పితృ, గణము స్వప్నమునఁ గానఁబడియెఁ
గనఁబడి కన్నీళ్లు గాల్వలు గట్టఁగా, నేడ్చుచు [illegible] కనికిఁ
గీ. దండ్రి తరియింపఁ జేయు మిత్తఱిని మమ్ము, నిరయకష్టంబులకు నోర్వనేర మింక
ననుచు మొఱవెట్టుచుండఁగా నంతలోన, నచ్చో మేలుకొనిన [illegible],
క. అంతట వైఖానసుఁ డత్యంతవిషాదాభిభూతుఁడై [illegible] నే
కాంతముగను బర్వతముని, యంతికమున కేఁగి [illegible].
క. తనస్వప్నగాథ యంతయు, వినిచి తపోనిలయ [illegible]
గనికరమున నెఱిఁగింపుము, మన[illegible]లను బితరు [illegible] నుండఁగన్.
క. అని ప్రార్థించుటయును న, మ్ముని యొకనిముసంబు యోగముద్రాకృతిలో
చనుఁడగుచును దద్ధేతువుఁ, గనుఁగొని యిట్లనియెఁ [illegible] లతనితోన్.
సీ. భూపాల నీతండ్రి పూర్వజన్మంబున, క్షత్త్రియకులమందు సంభవించి
రాజకార్యప్రవర్తనలౌల్యమునఁ జేసి, ఋతుకాలమున నున్నసతిని విడిచి
యన్యదేశంబున కరిగె నాకతమున, నిజపితృగణముతో నిరయ మొందె
వారల కెల్ల నుద్ధారంబు గలిగింప, నను పైనయొక్కయుపాయంబు గలదు
ఆ. మార్గశీర్ష మనెడిమాసంబునను శుద్ధ, పక్షమందు వచ్చు మోక్ష యనెడి
హరిదినంబునందు నాచరించి వ్రతంబు, [illegible]. 472
క. అనుటయు వైఖానసుఁ డ, మ్మునియనుమతి నొంది [illegible] నిజపురికిం
జనుదెంచి విధివిధానం, బునఁ జేసి వ్రతంబు ధారపోసెను ఫలమున్. 473
క. అంతటఁ దత్పితృవర్గము, సంతసమున దీవనలను [illegible]
కాంతునకు దర్శనం బే, కాంతంబున నొసఁగి యరిగె ననిమిషపురికిన్. 474
క. కావున మోక్షైకాదశి, కేవియు సరి గావు నాకసంతతముఁ బ్రీతిం
గావించు నది విముక్తిని, గావించుటఁ జేసి సకలకలుషాత్ములకున్. 475

—: పౌషకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము :—

వ. మఱియును పౌషమాసకృష్ణపక్షంబున వచ్చునేకాదశి సఫలైకాదశి యని చెప్పంబడియె. సఫలైకాదశియందు నారికేళక్రముకబీజపూరకజంబీరదాడిమధాత్రీఫలలవంగబదరామ్రాదిఫలంబులచేతను ధూపదీపాదులచేతను నన్నారాధించి రాత్రి జాగరణంబు గావింపవలయు. తద్వ్రతంబునకుఁ దీర్థంబులు గాని యజ్ఞంబులు గాని వ్రతంబులు గాని తపంబులు గాని సరి గానేరవు. దీని కొక్క దృష్టాంతంబు చెప్పెద. వినుము. 476

క. క్షితినాథ కలదు చంపా, వతి యనుపుర మొండు మున్ను వసుమతిపైఁ ద
త్పతి యగుచు నుండె మాహి, ష్మతుఁ డనుతేఁ డొకఁడు ధర్మమార్గాశ్రితుఁడై.
క. అతనికిఁ బుట్టిరి యేగురు, సుతు లం దగ్రజుఁడు బుద్ధిశూన్యులతోడన్
జతగూడి సకలపాతక, రతుఁడై తిరుగంగఁ జొచ్చె రాత్రియుఁ బవలున్. 478
ఆ. అతనిదుండగంబు లంతంతకును హెచ్చి, బాధ వెట్టుచుండఁ బ్రజల నెల్ల
నది యెఱింగి రాజు మది నాగ్రహము నొంది, యుంపఁ దగదు వీని నూరిలోన.
క. అని తలఁచి యపుడె లుంభకుఁ, డనునామము నెట్టి వాని కాత్మజుఁ డనుప్రీ
తిని విడిచి వెడలఁగొట్టెను, దనపురమునుండి రాజధర్మజ్ఞుండై. 480
గీ. అంతటను లుంభకుం డొకయడవి కేఁగి
వాస మొసరించుకొనియుండి వాసుదేవ
ధామ మనునొక్కయశ్వత్థతరువుక్రిందఁ
బ్రాణులను జంపుకొని తిని బ్రతుకఁ దొడఁగె. 481
గీ. అట్లు బహుకాల మరుగంగ నాఖలుండు, వృద్ధుఁ డగుటను నొకపౌషకృష్ణపక్ష
దశమినాఁ డెచ్చటికిఁ గూడఁ దరల లేమి, నచ్చటనె శయనించి క్షుధార్తుఁ డగుచు.
గీ. పరదినంబున నమ్మహాతరువుకడను, వఱలినఫలంబులను నేఱి వాసుదేవు
నకు సమర్పణ మొనరించి నాకుఁ గలిగి, నట్టిదురవస్థ మానుపు మనుచు నేఁడ్చె.
ఆ. అట్టు లేడ్చి యేడ్చి యాదినం బంతయు, నొదవ కునికిఁ దినఁగ నదియుఁ గూడ
నుపవసించి యంధను నొనగూడమిని నిద్ర, సలిపె లుంభకుండు జాగరంబు. 484
గీ. అప్పు డాకాశవాణి యి ట్లనియెఁ బుత్ర, వచ్చు సఫలాప్రసాదమువలన నీకు
నచిరకాలంబునసె రాజ్య మనుడు వాని, కఖిలశక్తులు ప్రాప్తించె నాక్షణంబ.
ఉ. అంతట లుంభకుండు హరియందె మనంబును జేర్చి భక్తితో
సంతతనృత్యగీతములు సల్పుచు దైవకృపావశంబుచే
సంతును రాజ్యముం బడసి సర్వసుఖంబులు చెంది ధాత్రిలో
నంతమునందు విష్ణుపద మందెను జన్మము సార్థకంబు గాన్. 486

—: పౌషశుక్లైకాదశీ మాహాత్మ్యకథనము :—

వ. మఱియును బౌషశుక్లపక్షంబునందు వచ్చునేకాదశి పుత్రదైకాదశి యని చెప్పం బడియె. అమ్మహైకాదశియందు న న్నారాధించెనేని యఖిలపాతకంబులుం దొలంగి పుత్రప్రాప్తి కలుగు. 487
సీ. వినుము దీనికి నిదర్శనముగా నొకగాథ, వచియించెదను నీకు వసుమతీంద్ర
ధాత్రిలోపలను భద్రావతి యనుపేర, నుండెను బూర్వమం దొకపురంబు
దానికి నధిపతిగా నుండెను సుకేతు, మంతుండు నా నొక్కమేధవుండు
చంపకాహ్వాయ యైనసతితోడ నాప్రభు, వఖిలభోగంబుల ననుభవించి

గీ. తుదకుఁ బుత్రులు గలుగమి కెదను మిగుల, వగపు జనియింప సర్వంబు వదలిపెట్టి
యెవరికినిఁ జెప్పకుండంగ నేగి యొక్క, గహనదేశంబునకుఁ దురంగమము నెక్కి.

క. అట్లు లేఁగి గహనమున నొ,చ్చటఁ దిరుగుచుఁ బిచ్చిహానిచందంబున ను
త్కటముగను బరితపించుచు, నెటులో కనియె నొకహ్రదంబు నీశ్వరకృపచేన్.

క. కనుఁగొని యతండు తత్తటి,మునఁ దప మొనరించుచుండు మునులసమీపం
బున కేఁగి మ్రొక్కి వారికి, వినయంబునఁ దెలిపె స్వీయవృత్తాంతంబున్. 490

క. కరుణింపఁగలమహాత్ముల, కరణిని గనఁబడిరి మీప్రకాశము మీ రె
వ్వరో స్వాములార మా కు, పరితాపము దీర్పుఁ డనుచుఁ బ్రార్థించుటయున్.

క. ఆవసుధేంద్రునిమాటలు, గావింపఁగ నెదను దమకుఁ గరుణను విశ్వే
దేవులము మేము జననర, దైవం బనుకూల మయ్యెఁ ద్వత్ప్రార్థనకున్. 492

వ. నేఁడు పుత్రదైకాదశి కావునఁ దద్వ్రతం బాచరించి సఫలమనోరథుండ వగుమని యనుగ్రహించుటయు సుకేతుమంతుండు తదనుగ్రహభాషితంబు శిరంబునం దాల్చి మునిజనోపదిష్టప్రకారంబునఁ బుత్రదైకాదశీవ్రతంబు నచ్చటన యథావిధిఁ గావించి యమ్మహామునులయనుజ్ఞం బడసి నిజగృహంబున కరుదెంచె.

గీ. అంతటను గొన్నిదివసంబు లరుగుటయును
గర్భమును దాల్చి చంపకాకంబుకంఠి
కనియెఁ గులవర్ధనుం డైనతనయు నొకని
నొక్కదినమున నొకసుముహూర్తమందు. 494

గీ. అంతటను బుత్రకుఁడు రవికాంతితోడఁ, దేజరిల్లఁ దొడంగెను దినదినంబు
తత్ప్రభావంబుఁ జూచి భూధవుఁడు గట్టెఁ, బట్టమును నాతనికి మహీప్రజల నేల.

ఆ. అపుడు రాజ్యభరము నానృపతనయుఁడు, దాల్చి యేలఁ దొడఁగె ధాత్రి నెల్ల
ధర్మదేవతావతారంబె యితఁ డని, భూజనంబు లెల్లఁ బొగడుచుండ. 496

—: మాఘకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము :—

వ. మఱియును మాఘకృష్ణపక్షంబున వచ్చునేకాదశి షట్తిలైకాదశి యని చెప్పంబడియె. అయ్యది బ్రహ్మహత్యాదిమహాపాతకంబుల నశియింపం జేయుమాఘమాసంబు ప్రాప్తించుటయుఁ గామక్రోధాదివివర్జితమానసంబున నేలఁబడని గోమయంబు గ్రహియించి యందుఁ దిలలును గార్పాసపిండకంబులును నుంచి నన్ను స్మరియించికొనుచు నష్టోత్తరశతపిండంబులు గావించి యుంచికొని మాఘకృష్ణపక్షంబున వచ్చునేకాదశినాఁడు ప్రాతఃకాలంబున లేచి నానామంబు స్మరియించుచుఁ దిలపిష్టోద్వర్తనంబు గావించుకొని తిలస్నానంబు చేసి తిలోదకంబు విడిచి తిలగోమయపిండంబులు హోమంబు గావించి నన్నారాధించుచు

నుపవాసంబుతోడ రాత్రి జాగరణంబు చేసి శతకూశ్మాండంబులచేఁ గాని శత నారికేళంబులచేఁ గాని శతబీజపూరకంబులచేఁ గాని తదభావపక్షంబున శత పూగీఫలంబులచేఁ గాని యథావిధి నాకర్ఘ్యంబు నొసంగి నాకు సంప్రీతి గలుగ వలయు నని భావించి తిలోదకపాత్రంబును ఛత్త్రోపానహంబులును వస్త్రంబులును గృష్ణధేనువును బ్రాహ్మణునకు దానంబు చేసి తిలపిష్టంబు భుజియించి పిదప ద్వాదశీపారణంబు గావింపనలయు. ఇయ్యది షట్తిలైకాదశీవిధానంబు. స్నానప్రస్థానకంబులయందుఁ గృష్ణతిలలు ప్రశస్తంబులు. తిలస్నానంబును దిలోద్వర్తనంబును దిలహోమంబును దిలోదకంబును దిలదానంబును దిలభోజనంబును గావించెడివ్రతంబు గావున నయ్యది షట్తిలైకాదశీవ్రతంబుగాఁ జెప్పంబడియె.

ఆ. అమ్మహావ్రతంబు నాచరించినయెడ, సకలపాపములును సమసి పోయి
యుండఁ గలుగు నమరు లుండెడిపదమున, నడలుకుండ దివ్యవర్షశతము. 498

క. విను మేతద్వృత్తాంతము, గను నీ కొకగాథ వినుతు త్వామవర పూర్వం
బున నొకబ్రాహ్మణి భూతల, మున నుండె వ్రతోపవాసముల నొనరుచుచున్.

క. దేవబ్రాహ్మణపూజలు, గావించుచు నాలయములు గట్టించి మహీ
దేవులకును దేవులకును, నావరవర్ణిని యొసంగు నతిభక్తిమెయిన్. 500

ఆ. కాని యామె యెట్టికాలంబునను గూడ, నొకరి కింతయన్న నొసఁగదాయె
దానివలనఁ దద్వ్రతప్రభావంబులు, కానరాక యుండె మానవేంద్ర. 501

ఆ. అది యెఱింగి కరుణ యావిర్భవింప నే, నామె నుద్ధరించునాసతోడ
నరిగి భిక్షుకుండ నై తద్గృహమునకు, ద్వారమందు నిలిచి తరుణ మరసి. 502

గీ. కేక వైచితిఁ బాత్రను గేలఁ బట్టి, యామె వినఁగను దేహి భిక్షామ టంచు
నంతటను నమ్మహీసురకాంత వచ్చి, తెఱచి దలుపును నామోము తేఱిచూచి.

గీ. బిరబిరను లోని కరిగి మృత్పిండ మొకటి, పట్టికొని వచ్చి వైచె నాపాత్రలోన
నపుడు నే నేఁగుదెంచితి నంత నామె, తనువుతోడనె వైకుంఠమునకుఁ జేరె.

గీ. చేరుటయు నాయమకు మహాగార మొకటి, వాసధామంబుగా దయచేసినాఁడఁ
గాని యది శూన్యముగ నున్న కారణమున, భూసురాంగన వచ్చి నావాసమునకు.

గీ. స్వామి నేఁ జేసినట్టికృచ్ఛ్రవ్రతములు, దాన మొనరించినట్టిసద్మములు నిలిపి
నట్టిదేవాలయము లసంఖ్యములు వాని,కన్నిటికిఁ గూడ శూన్యగృహంబె ఫలమె.

చ. అనుటయు నిట్టు లంటిని ద్విజాంగన కేను సతీమతల్లి సే
వానరిచినట్టికర్మములయోగ్యతకున్ దగునట్టులే ఫలం
బొనరెను గాని చేయనిది యొక్కటియున్ లభియింప దెందు నీ
మనమున ఖేద మొందకుము మా కుదయింపవు పక్షపాతముల్. 507

గీ. పెట్టితివి భిక్షుకునకు మృష్టాన్న మొకటి, చేసితివి గృహదానాదివిశేషములును
వ్రతములును బూజలును నుపవాసములును, గాని యన్నము వెట్టితె వేని కైన.

క. అన్నమె ప్రాణాధారం, బన్నమె దోషాదము బుద్ధి కన్నను దేహో
భ్యున్నతికి మూల మది లే, కున్నను విశ్వంబె శూన్య ముజ్జ్వలగాత్రీ. 509

క. అనుటయు బ్రాహ్మణి గనతి, ప్పు నెఱింగి మహాత్మ బుద్ధిపూర్వపాటునఁ జే
సినదోషము సైఁచి ననుం, గనికరమునఁ బ్రోవు మెవరు గతి యింక నాకున్.

క. అని ప్రార్థించుటయును నా, మనమునఁ గనికరము వొడమి మానిని నిన్నున్
గనుఁగొనఁగ దేవపత్నులు, చనుదెంతురు చూడ వచ్చుసమయమునందున్.

గీ. తలుపు తెఱవక యింటిలోపలనె యుండి, షట్తిలావ్రతఫలము నొసంగు నేని
దలుపు దీసెద ననుము [illegible] నీకు, గలుగు సుఖాలాగ్నిసిద్ధులు కంబుకంఠి.

చ. అని వచియించి బ్రాహ్మణిని సంపితి నింటికి నంత నాయమున్
గనుఁగొన దేవపత్ను లతికౌతుక మొప్పఁగ రాఁగ నేను జె
ప్పినయటు లామె చేయుటయుఁ బ్రీతి నొసంగిరి షట్తిలావ్రతం
బునఫల మామె కానతులు పొగడఁగ లోకము లెల్ల సంతతున్. 513

గీ. ఆమహీసురసుందరి యనుభవించె, దివ్యవర్షశతంబు తద్దివ్యసుఖము
కావునను నెట్టిపుణ్యంబు గాని భూప, షట్తిలాసుకృతమునకు సాటి గాదు.

—: మాఘశుక్లైకాదశీమాహాత్మ్యకథనము :—

వ. మఱియును మాఘశుక్లపక్షమందు వచ్చునేకాదశి జయైకాదశి యని చెప్పం
బడియె. తద్వ్రతంబువలన సర్వపాతకంబులును నశించి పిశాచత్వంబు తొలంగు.

క. విను దీనికి దృష్టాంతము, గను నీకు వచింతు నొక్కకథ సురలోకం
బునఁ జిత్రసేనుఁ డనుపే, రను నొకగంధర్వుఁ డుండె రాజవరేణ్యా.

క. అతనికి మాలిని యనియెడు, సతి యొక్కతె గలదు సుగుణశాలిని యాదం
పతులకు దయించె నొకయా, యతలోచన పుష్పవంతి యనియెడు పేరన్. 517

క. ఆకోమలిరూపము నా, లోకింపఁగవలయుఁ గాని లోచనములచే
వాకలితో నిట్టిది యని, వాకొనఁగ నశక్య మెంతవానికి నైనన్. 518

క. నానాటికి నాచేడియ, గానమునను నాట్యమునను గౌశల మొదవం
గా నవనవలావణ్యము, గానంబడ మేన మిగులఁ గ్రాలుచు నుండెన్. 519

క. అటు లుండఁగ నొకనాఁడా, చటులేక్షణ యింద్రసభకుఁ జని తనవిద్యా
పటిమము గనఁబడఁ బాడుచు, నటియింపఁ దొడంగె నమరనాథుఁడు మెచ్చన్.

వ. అప్పు డచ్చట గానవిద్యావిశారదుండును రూపవంతుడును బుష్పదంతుఁ డనెడి
గంధర్వసుతనూజుండును నగుమాల్యవంతుం డను తదీయలావణ్యమోహితమాన

సుండ్రై కామవికారంబు సహింపఁజాలక భావసూచకంబులగు నాకోము
లాంగి నాలోకింపఁ దొడంగె. 521

ఉ. అంతటఁ బుష్పవంతియుఁ దదాకృతిమోహితచిత్తవృత్తియై
కంతునిబారిఁ జిక్కి కడగంటను గాంచుచు వాని లోపసం
క్రాంతి నెఱుంగకుండఁగను గానము సేయుచు నాడఁ జొచ్చె వృ
త్తాంతముఁ దాయసభ్యతను దద్యోడ నారసి యాగ్రహంబునన్. 522

గీ. ఇచ్చె శాపంబు వారల కిరువురకును, బడయుఁడట్లు పిశాచదేహంబు లంత
వార లరిగిరి దారుణాకారములను, దాల్చి విషాదమున హిమశైలమునకు. 523

క. అరిగి హిమాచలమున కా, యిరువురును సహింపరానిహిమజనిత మహా
పరితాపభరితు లగుచును, జరియింపఁదొడంగి రద్రిసానువులందున్. 524

క. ఆహారము లభియింపమి, వ్యాహారింపఁగ నశక్తు లగుచును వా రా
నీహారశైలభూమిని, దేహంబులు మఱచి యెట్లొ తిరుగుచు నుండన్. 525

సీ. దైవయోగంబునను నొక్కతరుణమందు
వారు పడుబాధ చూడంగ వలను గామిఁ
గావ వచ్చినకారుణ్యదేవి నాఁగ
వచ్చెను జయాఖ్య గలహరివాసరంబు. 526

గీ. అమ్మహాదినమందు నాహారనిద్ర, లుడిగి గజగజ వడఁకుచు నొక్కచోటఁ
గదలఁగా లేక యుండినకారణమున, వారలకుఁ జేకుఱెను జయావ్రతఫలంబు.

గీ. అంతటఁ బిశాచరూపంబు లంతరించి, ప్రాప్తమైనట్టిపూర్వరూపములు దాల్చి
చనిరి వారు త్రివిష్టపంబునకు వ్యోమ, యానమున నెక్కి యమరుల కచ్చెరువుగ.

క. చని వారలు సంతోషం, బున నింద్రునిసభకుఁ బోయి మ్రొక్కిరి దేవేం
ద్రున కపుడు వారి నింద్రుఁడు, గనుఁగొని యాశ్చర్య మొదవఁగా ని ట్లనియెన్.

క. మీ కేసుకృతముచేతను, జేకూరెను శాపముక్తి చెప్పుఁడు నాఁగన్
వాకొనిరి వారు తమకథ, సాకల్యంబుగ వ్రతప్రసాదం బనుచున్. 530

క. అంతట వారలను మరుత్వం తుం డత్యధికగౌరవంబున నిజసౌ
ధాంతరమున నునిచి నిర, త్యంతరముగ సేవచేయ నారంభించెన్. 531

క. కావున జయాప్రభావము, భూవర బ్రహ్మకులేని పూర్తిగఁ దెలియం
గా వలఁతులు గా రని నా, భావము పలుపలుకు లింకఁ బలుకఁగ నేలా. 532

—: ఫాల్గునకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము :—

వ. మఱియును ఫాల్గునకృష్ణైకాదశిం గూర్చి మున్ను బ్రహ్మను నారదుం డడు
గుటయు నమ్మునివరునకు బ్రహ్మ యి ట్లనియె. 533

గీ. కనుము ఫాల్గునకృష్ణపక్షమున నుండు, నట్టిదేకాదశీవ్రతము విజయము నొసంగుఁ
గాన విజయాభిధానంబు గలదె యదియ్యు, వినిచెదను దాని కొంత గాథ మునివరేణ్య.

సీ. మును రామచంద్రుండు వనవాసమున నుండుచు, జానకీసౌమిత్రిసహితుఁ డగుచు
నాసమయంబున హరియించె జానకీ, దేవినిఁ గామాంధుఁడై రావణుండు
భార్యావియోగతాపమున నిష్ఫలుఁ డై రాఁగి, దరి తోడ రాముఁడు తిరుగఁ జొచ్చె
నత్తరుణమున రఘురాముఁ డవని నరిగి, గాంచె సుగ్రీవునితోడ మైత్రి

ఆ. యంత నాంజనేయుఁ డరిగి లంకాపురి, కవనిసుతను జూచి యరుగుదెంచి
వార్త దెలుపుటయును వానరసేనతోఁ, బయలుదేరె రామభద్రుఁ డపుడు. 535

గీ. కడలి దాఁట నుపాయంబు గానరాక
బరితపించుచు సాగరపరిసరమునఁ
గనఁబడెడియొక్కయాశ్రమంబునకు నేఁగి
కాంచి బకదాల్భ్యమునిఁ మహానుభావు నొకని. 536

గీ. వినయమున మ్రొక్కి తనచరిత్రను వచించి, స్వామి దెలుపుము పాయము సాగరమును
దాఁటుటకు నంచుఁ బ్రార్థింపఁ దాపసుండు, మూసికొని కన్నులను సర్వమును గ్రహించి.

వ. తరువాతఁ గన్నులు దెఱచి రామచంద్రు నవలోకించి రామా ఫాల్గునకృష్ణపక్షంబున వచ్చునేకాదశి విజయాభిధానంబు గలయది. ఆపుణ్యదివసంబునందు హేమకుంభంబు గాని రజతకుంభంబు గాని తామ్రకుంభంబు గాని మృత్కుంభంబు గాని జలంబుచేఁ బూరించి పంచపల్లవంబులచే నలంకరించి యొక్క పవిత్రప్రదేశంబునందు స్థాపించి దానిపైని హేమమయం బగు నారాయణప్రతిమ నుంచి తత్సమీపంబున నఖండఘృతదీపంబు ప్రతిష్ఠించి షోడశోపచారంబులచేఁ బూజించి యథావిభవంబుగ నైవేద్యంబు సమర్పించి యారాత్రి జాగరంబు గావించి ద్వాదశీదినంబున సూర్యోదయం బైనపిమ్మట నాకుంభంబు సముద్రతీరంబునం గాని నదీతీరంబునం గాని తటాకతీరంబునం గాని స్థాపించి పూజ గావించి ప్రతిమాయుక్తంబుగా బ్రాహ్మణునకు సమర్పించి తదనంతరకాలంబున యథాశక్తి దానంబులఁ గావింపవలయును. 538

గీ. ఇట్టు లేకాదశీవ్రతం బీవు నడుప, నట్టి యంభోనిధిని దాఁటి సులభముగను
లంకలోఁ జొచ్చి రాక్షసులను వధించి, కొనుము సతితోడ విజయలక్ష్మిని నరేంద్ర.

చ. అనుటయు రాఘవుండు విజయావ్రతముం బొనరించి తద్బలం
బున సులభంబుగాఁ గపిసమూహముతోడఁ బయోధి దాఁటి లం
కను నరికట్టి రాక్షసనికాయయుతంబుగ రావణాసురుం
దునిమి జయంబు గాంచి సతితోడ నయోధ్యకుఁ జేరె నారదా. 540

క. అనుటయు నారదుఁ డావ్రత, మునఁ గలమహిమంబు లోకముల కన్నిటికిన్
జని తెలుపసాగెఁ దద్వ్రత, మును జేసి జనంబు మోక్షమును జను బొందన్.

—: ఫాల్గునశుక్లైకాదశీమాహాత్మ్యకథనము :—

వ. మఱియును ఫాల్గునశుక్లపక్షంబున వచ్చునేకాదశిం గూర్చి మాంధాత వసిష్ఠ మహర్షి నడుగ నమ్మహర్షి యమ్మహీంద్రున కిట్లనియె.

గీ. అధిప ఫాల్గునసితపక్షమందు వచ్చు, హరిదినం బొప్పు నామలక్యాహ్వయమునఁ
జలుపు నెడఁ దద్వ్రతంబును సంఘటిల్లు, నఖిలపుణ్యంబులును జేసినట్టిఫలము.

సీ. సచరాచరము లైనజగము లన్నియు మునున్న, బ్రళయకాలమునందు విలయ మొంద
నాసమయంబున నఖిలజగంబుల, సృజియింప నెంచి సర్వేశ్వరుండు
నిష్ఠీవనము చేయ నిష్ఠీవనమునుండి, బ్రభవించె నొకమహాపాదపంబు
దానినుండి జనించి ధాత పూర్వమునోలెఁ, గావించె నఖిలలోకముల మరల

గీ. నంత దేవర్షి సంతాన మాశ్రమంబుఁ, గాంచి తద్వృక్ష తెలియనికారణమున
నచ్చెరువు నొందు చుండంగ నాత్మలందు, నప్పు డశరీరవాణి యి ట్లనియె నధిప.

గీ. ఆమలకి యనువృక్ష మియ్యది స్మరించి, రేని దీని లభించు గోదానఫలము
దీని నంటినఁ గలుగుఁ దద్ద్విగుణఫలము, త్రిగుణఫల మబ్బు భక్షింప దీనిఫలము.

క. ఇది మాధవునకుఁ బ్రీతి, ప్రద మగుటను జేసి సర్వపాపహరం బై
నది గాన దీనిసేవను, వదలక చేయుదురు ముక్తి వలసినవారల్. 546

వ. దీనికిమూలంబునందు నారాయణుండును నూర్ధ్వంబునందుఁ బితామహుండును స్కంధంబునందు రుద్రుండును శాఖలయందు మునులును బ్రశాఖలందు దేవతలును బర్ణంబులందు వసువులును బుష్పంబులందు మరుత్తులును ఫలంబులందుఁ బ్రజాపతులును నివసించియుందురు. కావున నామలకీద్రుమంబు సర్వదేవతామయంబుగాఁ జెప్పంబడియె. ఫాల్గునశుక్లైకాదశినాఁడు నియమయుక్తంబుగాఁ గాల్యకృత్యంబులు నెఱవేర్చికొని ప్రాతస్స్నానంబు గావించి నేఁడు నిరాహారంబుగా నుండి జనార్దనప్రీతికరంబుగా మఱునాఁడు ద్వాదశీపారణ గావించెద నని సంకల్పించి యామలకీవృక్షంబుకడ కేఁగి తత్పురోదేశంబునఁ బంచపల్లవసమేతంబును సుగంధవాసితంబును బుష్పమాలాలంకృతంబును నూతనవస్త్రాదిభూషితంబును నగునొక్కకుంభంబు మంత్రపూర్వకంబుగా స్థాపించి దానిపైని లాజపూరితం బగునొకపాత్రంబు నుంచి దానిమీఁద విత్తానుసారంబుగాఁ జేయింపఁబడినసువర్ణజామదగ్న్యప్రతిమను బ్రతిష్ఠాపించి యథావిధిఁ బూజించి యామలకీయుక్తం బగునర్ఘ్యం బొసంగి నృత్తగీతవాద్యంబులచేతను విష్ణుపురాణాఖ్యానాదిసత్కథాపఠనశ్రవణంబులచేతను నాదినం బంతయును నిరాహారంబుగా జాగరంబుతో వెడలించి మఱునాఁ డుదయంబున విష్ణునామంబులచే

జామదగ్న్యప్రతిమాశోభితం బగునామలకీవృక్షంబునకుఁ బ్రదక్షిణంబులుగావించి నీరాజనం బొసంగి పిదప బ్రాహ్మణుని నర్చించి జామదగ్న్యస్వరూపి యగు నారాయణుండు ప్రీతుం డగుఁగాక యని భావించి యాబ్రాహ్మణునకుఁ బూజా ప్రతిమాదు లన్నియును సమర్పించి నమస్కరించి పిమ్మట నామలకీతరువును స్పృశించి ప్రదక్షిణంబు గావించి స్నానంబు చేసి ద్వాదశీపారణ గావింపవలయు.

గీ. ఈవ్రతంబును గావించెనేని యిట్లు, చెందు సకలాధ్వరములు చేసినఫలంబు
నఖిలతీర్థంబులను మునిగినట్టిఫలము, నఖిలదానంబులును జేసినట్టిఫలము. 548

క. అనవుడు దేవర్షులు తమ, మనములలోపలను మిగుల బ్రమోదపడి మమ్ముం
బొనరుప ధన్యుల నేతెం, చిన దేవుఁడ వెవఁడ వీవు చెప్పుము దేవా. 549

క. అని ప్రార్థించుటయును ని, ట్లనియె నభోవాణి జగము లన్నిటికిని గ
ర్తను నేను మత్ప్రశాసన, మునను బ్రవర్తిల్లు చుండు భూతతతు లెల్లన్. 550

గీ. విష్ణు వనియెడిపేరను వెలసి నేను, సర్వలోకంబులకు నుండు సాక్షి నగుచుఁ
గానరాఁడు మఱొక్కఁడు కర్త నాకు, నని పలికి మాఱు మ్రోపోయె నంతలోన.

క. అది విని దేవర్షులు స, మ్మదమునఁ దద్వ్రతముఁ జేసి మాహాత్మ్యం బిం
పొదవఁగఁ బ్రశస్తి కెక్కిరి, పదిమందియుఁ గూడి తమ్ము భావింపంగన్. 552

క. అనుటయు మాంధాత వసి, ష్ఠునకుఁ బ్రణామం బొసర్చి చొచ్చె నిజపురం
బున నామలకీవ్రతముం, బొనరిచి యిహపరములందుఁ బొందెఁ బ్రశస్తిన్.

—: చైత్రకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము :—

వ. మఱియును జైత్రకృష్ణైకాదశిం గూర్చి మాంధాత యొకనాఁడు లోమశమహర్షి నడుగ నమ్మహర్షి యన్నరేంద్రుని కిట్లనియె. 554

గీ. చైత్రమాసస్థకృష్ణపక్షమున నొప్పు, హరిదినము పాపమోచని యనెడిపేర
నడిగితివి గానఁ జెప్పెద నాలకింపు, మధిప దానిమహాత్త్వ మత్యద్భుతంబు.

సీ. మును చైత్రరథమునం దొనరించుచును దపం, బుండె మేధావి నా నొక్కద్విజుఁడు
చూచి యావిప్రునిసోయగంబును గాము, మార్గణవిద్ధయై మంజుఘోష
కొంతదూరంబునఁ గూర్చుండి గానము, మొదలుపెట్టెను జగన్మోహనముగ
నాపాట శ్రవణపేయంబుగా మేధావి, తెఱచి కన్నులు దెసల్ దేఱి చూచె

గీ. నంత నొకదిక్కునను రతికాంతవోలె, గోచరించుటయును మంజుఘోష మరుఁడు
తావుకొని తద్వధూమణితనువునందు, హృదయకవచంబు భేదిల్ల నేసె నతని.

ఉ. అప్పుడు మంజుఘోషయును నమ్మునియున్ వివశీకృతాత్ములై
యెప్పుడు వోయెనో దినము లెప్పుడు వోయెనొ రేలు కన్నులన్
గప్పినయట్లు లేదియును గానక మన్మథకేళిఁ దేలుచున్
ముప్పిరిగొన్నమోహమున మున్గఁ దొడంగిరి నాఁటనాఁటికిన్. 557

గీ. అట్లు లేఁబదియేడేఁడు లరుగుటయును, మదిని గతకాలము నెఱింగి మంజుఘోష
భయవికంపిత యగుచుఁ దాపసున కెఱఁగి, స్వామి సెలవిమ్ము పోయెద స్వర్గమునకు.

క. అని ప్రార్థించుటయును న, మ్మునిని యి ట్లనియెను లతాంగి ముగిసెనె రే యే
మనుకొంటివో యింతటిలోఁ, జన నెంచుట కేమి కతము చయ్యనఁ జెపుమా.

చ. అనవుడు మంజుఘోష వినయావనతాననయై మహాత్మ నీ
కును విదితంబు గానియది కొండొక యున్నదె యంచుఁ బల్క న
మ్ముని యొకమూర్త మక్షులను మూసి గతించిన కాల మంతయుం
గనుఁగొని క్రోధతామ్రనయనంబులతోఁ దిలకించి యాచెలిన్. 560

ఆ. భ్రష్టురాల యెంతపని చేసితివి స్నాన, సంధ్య లడఁగిపోయె జపము కూడఁ
దపము తగులఁబడియెఁ ద్వత్సమాగమమునఁ, జేసి నాకు నిట్టిచేటు వచ్చె.

క. ఛీ ఛీ నినుఁ గనరాదు పి, శాచి తెఱంగునను నాప్రశాంతిని దొలఁగం
ద్రోచితివి గాన నీవు పి, శాచివి గ మ్మనుచు ఘోరశాపం బిచ్చెన్. 562

ఉ. అంతట మంజుఘోష వినయంబున మ్రొక్కి మహానుభావ నీ
చెంతను నెంతో కాలము వసించినదాన నటంచు నైన నీ
స్వాంతమునం దలంపకయె శాప మొసంగితి వెందుఁ బోదు శా
పాంత మనుగ్రహింపుము క్షణాధికకోపులె బ్రాహ్మణోత్తముల్. 563

క. అనుటయును నమ్మునీంద్రుఁడు, కనికరమున నిట్లు లనియెఁ గంజాక్షి వ్రతం
బొనరుపుము పాపమోచని, యనుహరిదివసమున శాప మంతము నొందున్.

ఉ. నావుడు మంజుఘోష తరుణంబు నెఱింగి వ్రతంబు చేయుటన్
బావనమూర్తి యయ్యె నిజపాతక మెల్లఁ దొలంగిపోయి మే
ధావియుఁ దండ్రియాజ్ఞను వ్రతంబు నొనర్చి విశుద్ధుఁ డయ్యె ధా
త్రీవర పాపమోచనికి దీ టగువాసర మేది చూడఁగన్. 565

క. అనుటయు మాంధాత మునీం, ద్రునకుం బ్రణమిల్లి భక్తితో నిజనగరం
బున కేఁగుదెంచి వ్రతముం, బొనరించి ప్రశస్తి కెక్కె ముజ్జగములలోన్. 566

—: చైత్రశుక్లైకాదశీమాహాత్మ్యకథనము :—

వ. మఱియును జైత్రశుక్లైకాదశిం గూర్చి మున్ను దిలీపుండు వసిష్ఠమహర్షి నడుగ
నమ్మహర్షి యమ్మహీంద్రున కి ట్లనియె. 567

సీ. వినుము మహారాజ మును నాగపురమును, బుండరీకుం డనుభుజగరాజు
పాలించుచుండ నాప్రభునిసన్నిధిలోనఁ, దనపాండితిని జూపుతలఁపుతోడ
లలితాభిధానంబు గలయొక్కగంధర్వుఁ, డరుదెంచి తత్సభాంతరముఁ జొచ్చి
యొనరించుచును గానమును బ్రియాభినివిష్ట, మానసుం డయ్యెఁ దన్మధ్యమందుఁ

గీ. దానఁ బదబంధవిచ్యుతి దాపరించె
నది యెఱింగి కర్కోటకుఁ డనెడిచక్రి
తెలుపుటయుఁ బుండరీకున కలిగి యాతఁడు
గాయకునిఁ దిట్టె నగుము రాక్షసుఁడ వనుచు. 568

గీ. అంత గంధర్వుఁ డాశరం బగుచు వికృత, రూపమునఁ బ్రియురాలిసమీపమునకు
వచ్చి కన్నీళ్ళు గాఱఁగా వరదలుగను, నేడ్చుచును దనవృత్తాంత మెల్లఁ జెప్పె.

గీ. అపుడు గుండె గుభుల్లన నతనికాంత, యేమి చేయుటకును దోఁచకేఁగి వాని
వెంటఁబడి యేడ్చుచును ఘోరవిపినభూము, లందుఁ దిరుగంగఁ జొచ్చె నహర్నిశంబు.

క. అట్టులు దిరుగుచుఁ బతికిం, బట్టినకర్మంబు తలఁచి పట్టినరీతిన్
జెట్టనకయు గుట్టనకయుఁ, గట్టకడకుఁ జేరె నొక్కగహనంబునకున్. 571

గీ. చేరి యక్కాననంబునఁ జింతతోడఁ
దిరుగుచును దైవకృప నొక్కతరువుక్రిందఁ
దపము గావించుకొనుచున్న తపసి నొకనిఁ
గాంచి యాయింతి యాతనికడకుఁ బోయి. 572

గీ. భక్తితోడను మ్రొక్కి తత్పాదములకు
నిలువఁబడి యుండుటయును గన్నులను దెఱచి
చూచి యమ్మౌని యెవతెవు సుదతి నీవు
కారణం బేమొ చెపుము నాకడకు రాఁగ. 573

క. అని యడుగుటయును వినయం, బున నాసతి యిట్టు లనియెఁ బుత్రికను దపో
ధన నేను వీరధన్వుం, డనుగంధర్వునకు లలిత యందురు నన్నున్. 574

క. నాపతికి స్వామి యొక్కరి, శాపంబునఁ గలిగె రాక్షసత్వము దానన్
వాపోవుచు నే నాతని, నోపక విడువంగఁ దిరుగుచుంటిని వెంటన్. 575

గీ. ఇప్పు డతఁ డీవనంబున కేఁగుదేఱ, వచ్చితిని నేను గూడను వానివెంట
దానివలనను దేవరదర్శనంబు, గలిగె నాకు శుభప్రాప్తి గలదొ యేమొ.

గీ. అనుటయును మౌని కనికరం బంకురింప, నిట్టు లనియెను సాధ్వి నీ వేడ్వ వలదు
చైత్రమాసస్థశుక్లపక్షమున వచ్చు, హరిదినమునకుఁ గామదాహ్వయము గలదు.

క. కావున నాదినసంబునఁ, గావింపుము వ్రతము సర్వకామము లొందం
గావచ్చు నతివ యనుటయు, నావెలఁదుక పట్టరానిహర్షముతోడన్. 577

గీ. అమ్మహర్షిసమక్షమునందె చేసి, కామదావ్రతమును దానఁ గలిగినట్టి
పుణ్యమును భర్తకై ధారవోసె నంత, లలితునకుఁ బూర్వరూపంబు లబ్ధమయ్యె.

క. అంతట లలితాలలితులు, సంతోషముతోడ నరిగి స్వర్గంబునకున్
వింతగను గామదావ్ర, త్తాంతము వచియించి రమరు లచ్చెరు వొందన్. 579

క. లోకోద్ధారంబునకై, నీకుం జెప్పితిని మేదినీవల్లభ నే
నీకథ తద్వ్రతమహిమము, సాకల్యంబుగను జెప్పఁజాలఁ డెవండున్. 580

క. అనుటయు దిలీపుఁ డమ్ముని, యనుమతి గొని యాచరించి యావ్రతమును భూ
జను లెల్లఁ బొగడఁ బాలించెను నేకచ్ఛత్రముగను క్షితిమండలమున్. 581

—: వైశాఖకృష్ణైకాదశీ మాహాత్మ్యకథనము :—

వ. మఱియును వైశాఖకృష్ణపక్షంబునందు వచ్చునేకాదశి వరూథినీనామంబునఁ
బ్రసిద్ధం బయ్యె. 582

క. ఆనాఁడు చేయువ్రతమున, భూనాయక కలుగుపుణ్యఫలములు నెవ్వం
డేనియును దెలియఁ జాలఁడు, దాని కదియె సాటి నీకు దాఁపఁగ నేలా. 583

గీ. ఆదినంబున నుపవాస మాచరించి, నట్టులైనను సౌభాగ్య మందితేజు
నెంత దౌర్భాగ్యవతి యైన నిగురుఁబోఁడి, కావున వరూథినికి సాటి గాన రాదు.

గీ. పుణ్యదివసంబు లొకకొన్ని భుక్తి నొసఁగు
నొసఁగు ముక్తిని మఱికొన్ని యుర్వరేంద్ర
భుక్తిముక్తుల నిచ్చెడిశక్తి గలది
యొకవరూథిని దప్ప వేఱొకటి లేదు. 585

సీ. అనుభవించి సుఖంబు లన్నియు నిలలోనఁ, జనియెను మాంధాత స్వర్గమునకు
విశ్వంబులో మహావిశ్రుతి గొని ధుంధు, మారుఁ డూర్ధ్వపదాధికారి యయ్యెఁ
గైలాసనాథుండు గడియలో బ్రహ్మక, పాలవినిర్ముక్తపాణి యయ్యెఁ
బుడమి నేకచ్ఛత్రముగ నేలి ధర్మాంగ, దుండు వైకుంఠంబుఁ దుదకుఁ జేరె

గీ. నెంద ఱెందఱో మహనీయు లిహమునందుఁ,బరమునందును నెట్టిలోపమును లేక
శ్రద్ధతోడ వరూథినీవ్రతము చేసి, చెంది రఖిలార్థసిద్ధులు క్షితితలేంద్ర. 586

వ. అశ్వదానంబుకంటె గజదానంబును దానికంటెఁ భూదానంబును దానికంటెఁ
దిలదానంబును దానికంటె స్వర్ణదానంబును దానికంటె నన్నదానంబును
నధికంబుగాఁ జెప్పంబడియె. కన్యాదానం బన్నదానసమంబు. 587

గీ. కన్నియ నలంకరించి యొక్కనికి నిచ్చు,కంటె హెచ్చైనసుకృతంబు గాన రాదు
విక్రయము చేసి కన్య నావిత్తమునను, బ్రదుకుకంటెను హెచ్చుపాపంబు లేదు.

వ. ధేనుదానంబు కన్యాదానతుల్యంబుగాఁ జెప్పంబడియె. అన్నిదానంబులకంటెను
విద్యాదానం బధికంబు. విద్యాదానఫలంబు వరూథినియుపవాసంబున సులభం
బుగాఁ జేకూరు. 589

—: వైశాఖశుక్లైకాదశీ మాహాత్మ్యకథనము :—

వ. మఱియును వైశాఖశుక్లైకాదశింగూర్చి మున్ను రామచంద్రుండు వసిష్ఠమహర్షి
నడుగ నమ్మహర్షి రామచంద్రున కిట్లనియె.

క. లోకానుగ్రహకాంక్షను, నీ కట్టిమనోరథంబు నేఁ దెలియించెన్
గాకున్నను బరమాత్ముఁడ, నీకరణిని నన్ను నడుగ నేటికి రామా. 590

వ. మున్ను సరస్వతీతీరంబున భద్రావతి యనునగరంబునందు ధనపాలుం డను వైశ్యుండు గలఁడు. ఆతనికి సుమనుండును ద్యుతిమంతుండును మేధావి సుకృతుండును ధృష్టబుద్ధి యనునేగురుపుత్రులు గలరు.

ఆ. అందు ధృష్టబుద్ధి యనుపంచముఁడు దుష్టుఁ, డన్యనిరతుఁ డగుచు ఖలులఁ గూడి
స్వైరవర్తనమున సంచరించుచు నుండెఁ, బ్రజల కెల్ల మిగుల బాధ గలిగె.

గీ. ఎఱిఁగి యది వెల్లఁ దండ్రి రాజభయమ్మున దుష్టుఁ డగువానిఁ బుట్టువునను
వెడలఁగొట్టెను బదిసంది వేలుపదార్థ, మొసఁగినను దాని చింతమాలుప.

ఉ. అంతట ధృష్టబుద్ధి వనమందు నిరాశను దాను నాస్నస్న
త్రాంతము సంస్మరించుకొను కొన్నిగ్రహ మేర్పడ నేఁగి తానకుటన్
జంతువులన్ భుజించుచును సాఁకుచు మేను గిరాతవృత్తిచేఁ
గొంత వెడల్చి కాల మతిఘోరముగా సదిశోకడఁ బిమ్మటన్. 594

గీ. తాను జేసినఘోరపాతకములకును, జింత నొందుచు మదిలోన సిగ్గుపడుచు
మాని యాహారనిద్రలు కానలందుఁ, దిరిగి దప్పుల నెఱుఁగునఁ దిరుగుచుండ.

గీ. దైవికంబుగ నొక్కకాంతారమందు, సగమిడియెఁ దన శోకతాపసాశ్రమంబు
దానికడ కేఁగి యాతఁడు తత్క్షణంబ, కాంచి కౌండిన్యుఁ డనుపారికాంక్షి నొకని.

క. వినయమున మ్రొక్కి మౌనికిఁ, దనకథ నెఱిఁగించి నిజకృతము లగునఘముల్
చనుటకు నుపాయ మొక్కటి, కనికరమునఁ జెప్పు మనుచుఁ గాంక్షించుటయున్.

క. తాపసుఁడు వానిఁ జూచి, పాపమునకు నిదను గలుగ నదియ యుల్లనిదెన్
వాపోవ వలదు వినుము నీ, పాపంబులు తొలఁగ నొక్కయుపాయము సత్పా. 598

వ. వైశాఖశుక్లపక్షంబున వచ్చుహరివాసరంబు మోహినీనామంబునఁ బ్రసిద్ధం బయ్యె. ఆదివసంబున జనార్దనుని నారాధించుచు నుపవాసజాగరంబులు గావించితి వేని సర్వపాతకవిముక్తుండ వయ్యెదవు. 599

చ. అనవుడు ధృష్టబుద్ధి మునియాజ్ఞను గైకొని తత్సముచితమం
దాచరించి నైష్ఠికవ్రతము నొందెను విష్ణుపదంబు మునీశ్వరో
డని జను లెల్ల నబ్బురపడంగను నే విని చెప్పఁ బాపనా
శనమునఁ దద్వ్రతంబునకు సాటి మఱేదియు లేదు రాఘవా. 600

క. అనుటయు రాఘవుఁ డావ్రత, మును జేసెఁ బ్రజాసమేతముగఁ జూచెడిభూ
జను లెల్లను దద్వ్రతముం, బొనరించి కృతార్థభావమును జెందంగన్. 601

—: జ్యేష్ఠకృష్ణైకాదశీ మాహాత్మ్య కథనము :—

వ. మఱియును జ్యేష్ఠకృష్ణపక్షంబున వచ్చునేకాదశి యపరైకాదశి యని చెప్పంబడియె.

సీ. బ్రహ్మహత్యలు భ్రూణపాతకములు గోవధం, బులును గావించెడువారైనఁ
బరధనహరణంబు పరదారగమనంబు, పరదూషణముఁ జేయువారైన
స్వామిగురుద్రోహసాధుజనద్రోహ, ముల నొనరించెడిమూర్ఖులైన
నాత్మధర్మము మాని యన్యధర్మములోనఁ, జొరఁబడియెడి ధీశూన్యులైనఁ
గీ. కూటసాక్ష్యము లిచ్చెడికుమతులైన, నపహితార్థంబులను జెప్పువారలైన
సర్వపాపవిముక్తులై స్వర్గమందు, నిలుతు రపరావ్రతంబును సలిపిరేని.

సీ. గయలోనఁ బితృతృప్తి గలుగంగ నొనరించు, పిండదానమునఁ బ్రాప్తించుఫలము
శివరాత్రినాఁడు కాశీపురంబున నుప, వాసంబు చేసిన వచ్చుఫలము
సింహస్థితుండు గా జీవుండు గౌతమీ, జలమున మునిఁగినఁ గలుగుఫలము
రవిమాఘమున మకరస్థుండు గాఁ బ్రయా, గస్నాన మొనరింపఁ గలుగుఫలము
గీ. బదరికాశ్రమయాత్ర చేనొదవుఫలము, కాంచఁ గేదారమును లక్షియించుఫలము
గజతురగహేమదక్షిణక్రతుఫలంబు, గలుగు నపరావ్రతం బొందు సలిపెనేని.

—: జ్యేష్ఠశుక్లైకాదశీ మాహాత్మ్య కథనము :—

వ. మఱియును జ్యేష్ఠశుక్లపక్షంబున వచ్చునేకాదశి నిర్జలైకాదశి యని చెప్పం బడియె. దానిమాహాత్మ్యముం గూర్చి సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞుండును వేదవేదాంగ పారగుండును ధర్మాత్ముండును సత్యవతీసుతుండును నగుకృష్ణద్వైపాయన మహర్షి నడుగఁ దలఁచి యుధిష్ఠిరుండు భీమసేనసమేతంబుగా నమ్మహర్షిసన్నిధి కరిగి సవినయంబుగా నిర్జలైకాదశిం గూర్చి యడుగుటయు వ్యాసమహర్షి ధర్మజున కిట్లనియె. 605

గీ. అధిప యల్పశ్రమంబున నధికఫలము, చేకుఱుచు నొక్కయేకాదశీదినంబ
యాదినంబున భుజియించునట్టివాఁడు, ఘోరనరకాగ్నిలోపలఁ గూలువాఁడ.

ఆ. అనుడు భీమసేనుఁ డశ్వత్థపత్త్రంబు, రీతిఁ గంపమొంది తాత నాకు
నేమి గతియొ యెఱుఁగ నేవేళ నైనను, దిండి లేకయున్న నుండఁ జాల. 607

క. మాయన్నయు మాతమ్ములు, మాయమ్మయు ద్రౌపదియును మాటికి నాకున్
శ్రేయమును గోరి బోధము, చేయుదు రేకాదశిని భుజింపకు మనుచున్. 608

క. ఐనను వృక మనియెడుజఠ, రానలము గలట్టివాఁడ నగుటను క్షుధకున్
నేను సహింపఁగ లేమిని, మానీంద్ర విరోధి నగుదు మావారలకున్. 609

క. నీ విప్పు డనినమాటకు, భావంబునఁ గలిగె మిగులఁ బరితాపము నా
కేవిధమునఁ దరియించెడి, త్రోవ గలదొ చెప్పు మనుచు దోసిలి యొగ్గెన్.

గీ. అంతటను వ్యాసుఁ డతని కిట్లనియె వత్స, వత్సరంబున కొకసారి వచ్చునట్టి
నిర్జలైకాదశిని బోల నేర వెట్టి, వ్రతము లైనను మఱి యెట్టిక్రతువు లైన.

గీ. జ్యేష్ఠమాసంబులోపల శుక్లపక్షమందు, గాని మిథునసంబునను గాని భానుఁడుండి
వచ్చుహరివాసరమునకు వచ్చెఁ బేరు, నిర్జలైకాదశి యటంచు నిత్యముగను.

గీ. ఆదినంబున నాచమనోదకంబు, దప్ప నన్యోదకంబును ద్రావకుండ
నుపవసించినయెడ నది యొకటి చాలు, సకలహరివాసరవ్రతసుకృత మొసఁగ.

ఆ. అట్టు లుపవసించి యానాఁడు మఱునాఁడు, బ్రాహ్మణులకు నుదకపాత్రములను
నొసఁగి యన్నదాన మొనరింప వలయును, హరికిఁ బ్రీతి గలుగ నాత్మ నెంచి.

క. ఆమీఁద ననుమతిం గొని, భూమిసురులవలనఁ దాను భుజియింపఁ దగున్
గామితము గలుగు నెడలను, భూమీశ్వరతనయ సులభముగను దరింపన్. 615

క. అనుటయును భీమసేనుఁడు, తన కనుగుణమైన యట్టివ్రత మొనరిం
చెను పిదప ధర్మతనయుఁడు, వినిచెను గృష్ణునకు నచటివృత్తాంతంబున్. 616

వ. అంతటఁ గృష్ణుండు నవ్వియుధిష్ఠిరునిం జూచి రాజేంద్రా యింక నాషాఢ
కృష్ణైకాదశిం గూర్చి చెప్పెద. వినుము. 617

—: ఆషాఢకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము :—

సీ. అలకాపురాధీశుఁ డగుకుబేరున కుండె, హేమమాలి యనంగ భృత్యుఁ డొకఁడు
వాని కుండెను భార్యగాను విశాలాక్షి, యనుపేరు గలయొకయందకత్తె
యటు లుండ నొకనాఁడు యక్షాధినాథుఁడు, పూలు దెమ్మని హేమమాలి ననిపెఁ
జని హేమమాలి యాపని మాని తనచాన, తోడ రతిక్రీడ లాడఁదొడఁగె

గీ. నంత శివపూజ కదను గాఁ యక్షరాజు, పూలు దేరంగఁ జని హేమమాలి రామ
కేళిఁగి జిక్కులవలనను పోయె వెల్ల, నాగ్రహముఁ జెంది తనయంతరంగమందు.

గీ. పాపి యగుహేమమాలి తత్పాపఫలము, ననుభవించునుగాక కుష్ఠామయంబు
వలన భార్యావియోగంబువలన ననుచు, ఘోరశాప మొసంగె దుర్వారముగను.

ఉ. అంతట హేమమాలి తనచాలిని బాసి కళేబరంబునం
దెంతయు నావరింపఁ బదునెన్మిదికుష్ఠములున్ మహావ్యథా
క్రాంతమనస్కుఁడై తెరువు గానక తిర్గుచు వెక్కివెక్కి నా
నంతమునందు నెట్లొ కనకాద్రికిఁ జేరెను దైవికంబుగన్. 620

గీ. చేరి యందొక్కచోటను శివుఁడునోలెఁ, గానఁబడెడిమార్కండేయమౌనిఁ గాంచి
యెదుటఁబడిమ్రొక్కితనగాథ యెల్ల వినిచె, సంతఁగరుణార్ద్రిమానసుండగుచు నతని.

ఆ. ఆచరించి వ్రతము నాషాఢమాసము, నందుఁ గృష్ణపక్షమందు వచ్చు
నట్టియోగినీమహావిష్ణుదినమున, భక్తితోడ శాపముక్తి గనుము. 622

క. అని యుపదేశించుటయును, మనమున ముద మొందె హేమమాలి వ్రతంబుం
బొనరించి కుష్ఠరోగంబునుండి విముక్తి నొంది పొలఁతిని జేరెన్. 623

గీ. తద్వ్రతమహాత్మ్యమునఁ జేసి తానివిడిచి, యనుభవించి యశేషసౌఖ్యముల నతఁడు
కడకు వైకుంఠమును జేరెఁ బడఁతితోడ, యోగినిప్రభావ మెంతని యుగ్గడింతు.

గీ. ఎనుబదెన్మిది వేలమహీసురులకు, భోజనంబు నొసంగినపుణ్య మొదవు
యోగినీవాసరమునందు నుపవసించి, ప్రీతితో నను నన్ను నర్చించెనేని. 625

—: ఆషాఢశుక్లైకాదశీమాహాత్మ్యకథనము :—

వ. మఱియును నాషాఢశుక్లైకాదశి శయన్యేకాదశి యని చెప్పంబడిరెు. తన్నామ
శ్రవణమాత్రంబున సర్వపాపంబులును నశియించు.

సీ. మున్ను త్రేతాయుగంబున నుండె బలి యను, దానవుం డొకఁడు మద్భక్తి గలిగి
యొకకొంత కాలంబునకు వాఁడు ద్రోహంబు, గావింపఁదొడఁగెను దేవతలకు
నది నా కెఱింగింప నమరు లుపేక్షింప, ననుచితం బగుటచే నతనితప్పు
చని వామనాకారమునఁ బలికడ కేను, వాని నోంపఁగ నెంచి వ్యాజమున ను

గీ. నడిగితిని మూఁడుపదములయవనితలము, నెంతవారించినను శుక్రుఁ డీకు మనుచు
దానవీరుఁడు గావున దానవుండు, ధరణి నేఁ గోరినది నాకు ధారవోసె. 627

వ. అప్పుడు నేను విరాడ్రూపంబు దాల్చి రెండుపాదంబులచే భూమ్యాకాశంబుల
నాక్రమించి మూఁడవపాదంబును వానిపృష్ఠంబునం బెట్టి త్రొక్కితి.

గీ. అంతట రసాతలం బంటి యతఁడు నన్ను, వేఁడుకొనుటయుఁ గరుణ యావిర్భవింప
నుంచినాఁడను నామూర్తి యొకటి వాని,యందు మఱియొకమూర్తి క్షీరాబ్ధియందు.

గీ. అయ్యె నాషాఢశుక్లమునందు వచ్చు, హరిదినం బది శేషశయ్యాగతుండ
నగుటచేతను నాదినమందు నేను, శయని యనుపేరు దానికి సంఘటిల్లె. 630

గీ. శయనినాఁ డుపవాసంబు సలిపి నన్నుఁ, గొలుచునెడ నంత్యజున కైనఁ గలిగితీరు
సకలపాపంబులును గూడ సమసిపోయి, కొలఁది కాలములోనె వైకుంఠపదము.

వ. శయనినాఁడు నేను శయనించి కార్తికశుక్లపక్షంబున వచ్చుహరివాసరంబు
నందు లేచువఱకును నుండునాలుగుమాసంబులును దీపదానంబును బలాశ
పత్త్రభోజనంబును హరివాసరవ్రతంబును గావించువాడు నా కత్యంతప్రియము
గావించినవా రగుదురు. శ్రావణంబున శాకంబును భాద్రపదంబున దధియును
నాశ్వయుజంబున దుగ్ధంబును గార్తికంబున ద్విదళంబును బరిత్యజించి బ్రహ్మ
చర్యంబునం దుండెనేని మిగులఁ బ్రశస్తంబు. 632

—: శ్రావణకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము :—

వ. మఱియును శ్రావణకృష్ణైకాదశీమాహాత్మ్యముం గూర్చి మున్ను పితామహుని
నారదుం డడుగ నమ్మహర్షికిఁ బితామహుం డి ట్లనియె. 633

గీ. అఖిలపాపంబులను నడఁగార్చి సకల, కామములు దీర్చుఁ గావునఁ గామికాఖ్య
గలిగి శ్రావణకృష్ణపక్షమున వచ్చు, హరిదినం బొప్పు దానికి నదియె సాటి.

గీ. పుష్యమాసంబున నైమిశారణ్యమున దినము, భానుదినమున సోమదినములందు గాఢ
యందు జాహ్నవియందును బొందఁ దేని, కామికావ్రతమును జేసి కాంచుఫలము.

గీ. చతురశీతిసాహస్ర ముద్రితక్ష్మాతలంబు, ప్రాఁగ్జాఁటగు బ్రాహ్మణునకు సర్వణముచేసి
నట్టివాఁడును గామికావ్రత మాచరించి, నట్టివాఁడును నిముషాల నందువారు.

గీ. అనఘ ప్రసవించుచుండుగోవును బవిత్ర, మైన బ్రాహ్మణునకు నిచ్చునట్టివాఁడు
చెందుపుణ్యఫలంబును జెందుఁ జూనె, కామికావ్రతనిరతుఁ డాదినమునందు. 637

గీ. ఆత్మవిద్యావిచార పరాయణుండు, చెందుఫల మొక్క దినమునందె చెందఁగలఁడు
శ్రద్ధతోడను గామికావ్రతము చేయు, నట్టిపుణ్యాత్ముఁడును బురుషోత్తముండనేల.

వ. అని చెప్పుటయు నారదుండు విని పరమహర్షంబునం బొసఁగెను.

—: శ్రావణశుక్లైకాదశీ మాహాత్మ్యకథనము :—

వ. మఱియును శ్రావణశుక్లైకాదశి పుత్రదైకాదశి యని చెప్పంబడియె. 639

సీ. బ్రాహ్మణదేవతాద్రవ్యంబు స్వప్నమం, దైనను గోరనినట్టివాఁడు
న్యాయార్జితం బైనయర్థంబు నిజకోశ, నిలయంబులోపల నిలుపువాఁడు
తప్పు చేసినయెడఁ దనవాని కైనను, జేయఁగాఁ దగుశిక్ష చేయువాఁడు
కంఠంబు తెగుచున్నకాలంబునను నాడి, నట్టిమాటను దప్పనట్టివాఁడు

గీ. నయవిదుండు మహీజిదాహ్వాయమువాఁడు
తేజు గలవాఁడు నగునొక్కరాజు మున్ను
ద్వాపరాదిని మాహిష్మతీపురంబు
నేలుచుండెను బ్రజలకు హితము గాఁగ. 640

ఆ. అట్టు లేలుచుండ నబ్దంబు లెన్నియో, చనియెఁ గాని యొక్కతనయుఁ డేని
తనకుఁ గలుగఁ డాయె ననుచింత యాతని, యెడఁదఁ గలఁత వెట్టఁదొడఁగె నంత.

ఆ. అమ్మహీజిదుర్వరాధీశ్వరుం డొక్క, నాఁడు తనపురంబునను గలట్టి
బ్రాహ్మణోత్తములను భక్తితోఁ బిలిపించి, వారి కెఱుఁగఁజేసె వాంఛితంబు.

ఉ. అంతట విప్రులెల్లను దదాశయముల్ గ్రహియించి రాజచిం
త్యంతము నీయభీష్టమును దీర్చుట కంచు వచించి తానికిన్
గొంతవిషాదశాంతి నొనగూర్చి పదంపడి యొక్కకాననా
భ్యంతరభూమికిం జని తపం బొనరింపఁదలంచు చుండఁగన్. 643

క. దైవికముగ నాధరణీ, దేవుల కగపడియె నొక్కదెస నచ్చోటన్
దేవుఁడువలె లోమశముని, కావించుచుఁ దపము లోకకల్యాణమతిన్. 644

క. అంతట బ్రాహ్మణు లమ్ముని, చెంతకుఁ జని మ్రొక్కి తెలిపి క్షితిపాలునివృ
త్తాంతమును వేఁడి రతనికి, సంతానము గలుగునట్టిసదుపాయంబున్. 645

గీ. అపుడు లోమశముని మీఁదలితాత్ముఁ డగుచు, ధ్యానమున గుర్తెఱింగి భూధవునిగాథ
తెలిచి కన్నులు విప్రులఁ జేఁచూచి, యేర్పడఁగ విస్మయము వారి కిట్టు లనియె.

సీ. పూర్వజన్మమున నీభూపతి వైశ్యుండు, గా నుండి దారిద్ర్య కారణమున
స్వల్పవాణిజ్యంబు సలుపుచు నూరూరు, తిరుగుచు నొకగ్రీష్మదివసమందు
దప్పి కోరువలేక దారిలోపలఁ జూచి, యొకతటాకము దానియొద్ద కేఁగి
రేవులో దిగి నీళ్ళు ద్రావుచుండెడిగోవు, నదలించి తాఁ గ్రోలె నాజలంబు

గీ. నాయఘంబునఁ జేసి సంప్రాప్తమయ్యె, నతని కనపత్యభావ మయ్యది తొలంగ
క్షోణిమీఁదను శ్రావణశుక్లపక్ష, హరిదినం బొండు దక్క నన్యంబు లేదు.

క. ఆవిష్ణునాసరంబునఁ, గావించి వ్రతంబు దానఁ గలిగెడిఫలముల్
భూవరునకు ననపత్యత, పోవలయు న టంచు ధారపోయుఁడు మీరల్. 648

చ. అనుటయు బ్రాహ్మణుల్ మిగుల హర్షముఁ జెంది మహర్షియభ్యను
జ్ఞను గొని యందె తద్వ్రతము సల్పి తదాప్తఫలంబు సర్వముల్
జనపతిపాతకంబునకు శాంతి ఘటిల్లఁగ ధారపోసి చ
య్యనఁ జని రాజధానికి సమస్తముఁ దెల్పిరి భూమిజానికిన్. 649

గీ. అపుడు భూమీంద్రుఁ డాశ్చర్యమంది మొదను
బహుమతులను నొసంగి యాబ్రాహ్మణులకుఁ
బనుచుటయు నొక్కయబ్దంబు చనెనో లేదొ
యంతలో గర్భమయ్యెఁ దత్కాంత కధిప. 650

గీ. గర్భమై నవమాసముల్ గడచుటయును
నొక్కసుముహూర్తమునఁ బుత్రుఁ డుద్భవించె
బాలచంద్రుఁడు వోలె నాశీలవతికి
నాభ్యుదయికము లైనచిహ్నములతోడ.

గీ. అంతట మహీజుదుర్వీతలాధినేత, తనయభీష్టము తీరినదానఁ జేసి
చేయుచు వ్రతంబు జీవితశేష మెల్లఁ, గడపి వైకుంఠధామంబుఁ గడకుఁ జేరె.

—: భాద్రపదకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము :—

వ. మఱియును భాద్రపదకృష్ణైకాదశి యజైకాదశి యని చెప్పం బడియె. 653

ఆ. అజకు సాటి గాన మఘములు హరియించి, కష్టవార్ధినుండి గట్టు చేర్ప
దీని కేను నీకు దృష్టాంతముగ నొక, గాథ వినుతు వినుము ధ్మాతలేంద్ర. 654

సీ. మున్నుండె భూచక్రమును నేలుచును హరి, శ్చంద్రుండు నా నొకచక్రవర్తి
యతఁడు రాజ్యభ్రష్టుఁడై యమ్ముకొని తన్నుఁ, దనయుని సతిని సత్యంబుకొఱకుఁ
గాటికాపరి యయి కడకుఁ జండాలుని, దాస్యంబులోఁ జిక్కి దారి లేమి
నడుగుటయును బహుహోమనంబులు శోక, సాగరంబును దాఁటఁజాల కునికిఁ

గీ. బరితపించుచు నుండెడితరుణమందు, నతనిక్లేశంబు నూహ్య సత్యంబె మేను
దాల్చి వచ్చినపగిది గౌతమమహర్షి, యేగుచును వచ్చె నచటికి దైవికముగ.

క. అరుదెంచినగౌతమునకు, నరపతి ప్రమొక్కుటయు నాసనంబునఁ జింతా
పరవశత దోఁప నమ్ముని, కిరుఁ దాదృష్టులను నతనిఁ గని యిట్లనియెన్. 656

గీ. భాద్రపదమాసమునఁ గృష్ణపక్షమందు
వచ్చునజ యనియెడుహరివాసరంబు
వ్రతము నాఁనాఁడు చేయుము క్షితితలేంద్ర
సులభముగ నెల్లకష్టముల్ తొలఁగిపోవు. 657

గీ. అనుచు బోధించి గౌతముఁ డరుగుటయును
సమయమునఁ దద్వ్రతము హరిశ్చంద్రనృపతి
సలిపి విధియుక్తముగను రాజ్యమును సతిని
సుతునిఁ బడసి త్రిలోకవిశ్రుతిని గాంచె, 658

క. కావున నజావ్రతంబును, గావించెడివారి కెట్టికష్టము లైనన్
బోవుటయె కాక భూవర, కైవల్యపదంబు గలుగుఁ గాయాంతమునన్. 659

—: భాద్రపద శుక్లైకాదశీ మాహాత్మ్య కథనము :—

వ. మఱియును భాద్రపదశుక్లైకాదశిం గూర్చి మున్ను బ్రహ్మను నారదుం డడుగ నమ్మహర్షికి బ్రహ్మ యిట్లనియె.

సీ. ఆశ్చర్యకర మైనయట్టిగాథ యొకండు, వినుము నారద నీకు వినుతు నేను
మహి నేలుచును మున్ను మాంధాత ధర్మమున, నాల్గుపాదములచే నడపుచుండ
గగ్గోలుపఱచె నాకస్మికంబుగ ననా, వృష్టిదోసము దేశ మెల్ల నపుడు
క్ష్మాపతి తనయపచార మేమైనను, గలదేమొ యనుచును గలఁత చెంది

గీ. యంగిరోముని యుండెడియాశ్రమమున, కరిగి మౌనికి వందన మాచరించి
సవినయంబుగఁ దన ప్రశ్నసంశయంబు, దెలిపి యడిగె ననావృష్టి దొలఁగువిధము.

సీ. అంతట నమ్మౌని ధ్యానయోగంబున, నెఱిఁగి యుగధర్మంబు లిట్టు లనియె
జననాథ నీదేశమున గోప్యముగ నొక్క, వృషలుండు తపము గావించుచుండె
నాపాతకమున ననావృష్టి సమకూడెఁ, గాని లేదు మఱొక్క కారణంబు
తద్దోషశాంతికిఁ దగినకార్యం బొండు, గావింపఁదగినది కలదు వినుము

గీ. భాద్రపదమాసమున శుక్లపక్షమందుఁ, బద్మనాభాహ్వయంబునఁ బ్రథిత మైన
హరిదినంబున నొనరించునట్టివ్రతము, శాంతిలఁగఁజేయు నెట్టిదోషముల నైన.

క. అనుటయు మాంధాత తపో, ధనునియనుజ్ఞను గ్రహించి తనపురమునకున్
జనుదెంచి వ్రతము సలుపుడు, ననుపదము సువృష్టి [illegible]

క. జనకాఘం బది మొదలుగ, ననువర్షముఁ బద్మనాభయందు వ్రతంబున్
బోసరించుచును బ్రశస్తిని, గని యిహామునఁ గడకుఁ జెందెఁ గైవల్యంబున్.

—: ఆశ్వయుజకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము :—

వ. మఱియును నాశ్వయుజకృష్ణపక్షంబున వచ్చునేకాదశి యింద్రైకాదశి యని ప్రసిద్ధిం బడసె. 665

క. నిరయగతులైనపితరులఁ, దరియింపఁగఁ జేయుటకును దక్షం బగుచో
వ్రతము మఱియొక్కఁడు లే దిం, దిరకంటెను దానిమహిమ తెలిపెద వినుమా.

సీ. పూర్వము కృతయుగంబునను మాహిష్మతి, నగరేశుఁ డింద్రసేనప్రభుండు
నాల్గుపాదములచే నడపుచు ధర్మంబు, ధర నేలుచుండె నత్యంతమహిమ
నరుగుచు నారదుం డాకాశపథమునఁ, జనుదెంచె నమ్మహీశానికడకు
వచ్చినయమ్మౌనివరునికి నర్ఘ్యపా, ద్యాసనంబు లొసంగ యావిభుండు

గీ. స్వామి దయచేయుటను మాకు క్షేమ మేవొ
కలుగు నని తోఁచుచున్నది తలఁపులోన
ననుటయును నారదుం డిట్టు లనియె రాజ
సజ్జనులయూహ కాదు నిష్ఫలము వినుము. 667

సీ. చనుదెంచుచును నేను సత్యలోకమునుండి, యరిగినాఁడను జూడ యమునిసభను
శమనుండు ననుఁ జూచి సభలోపలను లేచి, యుచితాసనమునఁ గూర్చుండఁబెట్టి
యిచటికేఁగుచు స్వామి లిచటికేతెంచిరో, సెలవీయుఁడనుచు వాంఛింపటయును
భూలోకమున కేను బోవుచు నినుఁ జూడ, నేతెంచితిని దేవ యిచటికిం గంటి

గీ. నంతటను లేచి తత్సభాభ్యంతరమున, ననుఁ గనుంగొని మీతండ్రి కనులనుండి
యేఱులుగ నశ్రువులు పాఱ నేడ్చెఁ బాప, మెంతవేదన గలిగెనో యెడఁదలోన.

ఆ. అట్టు లేడ్చి యిట్టు లనియెను స్వామి నే, శమనలోకబాధ సైఁపఁజాలఁ
గొండలట్లు తఱుఁగ కుండఁగా నాచేసి, నట్టిపాప మెంతవట్టు గలదొ. 669

గీ. కాని నాపుత్త్రుఁ డగునింద్రసేననృపతి, కీవు దయతోడ మదవస్థ నెఱుఁగఁజేసి
యిందిరావ్రతపుణ్యము నిచ్చి నాకు, గతులు గలిగింపు మంచు శీఘ్రముగఁ జెపుము.

క. అనవుడు నాడెందంబునఁ, గనికర ముదయింప నతనిగతి నీ కెఱిఁగిం
పను వచ్చినాఁడ నిచటికిఁ, బని యయ్యెను బోదు ననుడుఁ బార్థివుఁ డంతన్.

క. జనకున కొదవినదుఃఖం, బును విని మదిలోన మిగులఁ బొగులుచు మౌనీం
ద్రున కెఱిఁగి యిందిరావ్రత, మును జేయువిధాన మేమొ మునివర చెపుమా.

క. అని యడుగుటయును ముని యి, ట్లనియెను నాశ్వయుజకృష్ణహరిదినమందున్
బూనరింతు రిందిరావ్రత, మును విని చెదఁ దద్విధానమును విను మధిపా. 673

వ. ఆశ్వయుజకృష్ణదశమీదివసంబునఁ బ్రాతఃకాలంబునందుఁ గాల్యకృత్యంబులం దీర్చికొని మధ్యాహ్నసమయంబున మాధ్యాహ్నికక్రియాకలాపంబు నెఱవేర్చికొని యేకభక్తంబు చేసి యారాత్రి స్థండిలంబున శయనించి యేకాదశినాఁడు ప్రాతఃకాలకృత్యంబులు నెఱవేర్చికొని నేఁడు విష్ణుప్రీత్యర్థంబై సర్వభోగవర్జితుండనై నిరాహారంబుగా నుండి ద్వాదశినాఁడు భుజియించెదనని సంకల్పించి మధ్యాహ్నసమయంబున సాలగ్రామశిలయందు పితృదేవతల నుద్దేశించి పితృలోకంబులు గలుగవలయు నను సంకల్పంబుతో విప్రభోజనాదిసహితంబుగా శ్రాద్ధంబు గావించి పిండంబులను ఆఘ్రాణించి పితృశేషాన్నంబు గోవున కొసంగి పిదప విష్ణుపూజ గావించి యారాత్రి జాగరంబొనరించి మఱునాఁడు హరి నర్చించి బ్రాహ్మణులను భుజియింపఁజేసి పుత్రమిత్రబాంధవసహితంబుగా భుజియింపవలయును. 674

క. ఈవిధమున నావ్రతమును, గావించిన యెడలఁ బితృగణములెల్లన్ దివిఁ బొందుదురు ప్రతివిధాతను, దీవన లొసఁగుచును సంతసిల్లుచుఁ దెల్లన్. 675

క. అని చెప్ప నారదుండును చ, య్యని సంతోషంబునఁ బొంది నావ్రతమొనరించెను నేఁడు విధివిధానంబున గగనమునుండి పుష్పములు గురియంగన్. 676

క. అంతట నాతనిజనకుఁడు, సంతోషముతోడ దివ్యరూపమునఁ ధరణీకాంతునకు వ్యోమయానా, భ్యంతరమునుండి యిచ్చు నాశీస్తతులన్. 677

క. అది మొదలుగ నావ్రతమిం, పొదవఁగఁ బ్రతివర్షమును నొనరించుచు నభ్యుదయము నిహమున నచ్యుతపదమును బరమునను గాంచెఁ బార్థివుఁ డధిపా.

—: ఆశ్వయుజశుక్లైకాదశీమాహాత్మ్యకథనము :—

వ. మఱియును నాశ్వయుజశుక్లైకాదశి పాపాంకుశైకాదశి యని చెప్పంబడియె.

సీ. కలుగు మేదినిలోనఁ గలసర్వతీర్థంబు, లందు స్నాన మొనర్చినట్టిఫలము సమకూరు శాస్త్రోదితములైన దానంబు, లన్నియుఁ జేసినపుణ్యచయంబు కలుగును ధనధాన్యములును సంతానంబు, ధీరత్వమును రాజగౌరవమును నొదవు నుద్ధారంబు పదితరంబులవారి, కాత్మమాతృపితృత్రయాన్వయముల

గీ. నాశ్వయుజశుక్లపక్షమునందు వచ్చు, నట్టిపాపాంకుశాహ్వయహరిదినమునఁ బద్మనాభాహ్వయంబుచేఁ బరగునన్నుఁ, గొలిచి యుపవాసజాగరంబుల నొనర్ప.

గీ. అనఘ పాపాంకుశావ్రత మాచరింప, కుండునంతటిదాఁక నె యుండు మేన నఖిలపాపంబులును మాయమగును బిదపఁ, జల్లునెడ భస్మమునుబిశాచములవోలె

గీ. ఉర్వరేంద్ర పాపాంకుశ నుపవసింప, నట్టివారును నాభక్తు లగుచు శివునిఁ దిట్టువారును శివునిఁ జేపట్టి నన్నుఁ, దిట్టువారును బుధగులై పుట్టువార. 682

గీ. అనఘ పాపాంకుశావ్రతి నాచరించు, నట్టివాఁ డెగుసదిమును దెలుగ లేఁడు
సవనశతములు వ్రతసహస్రములు కోటి, మంత్రజపములు చేసినమహిమఁ జేని.

క. నరుఁ డెవ్వఁ డేని భూవర, ధరలోఁ బాపాంకుశావ్రతం బొనరించెన్
హరిమందిరమున కేఁగును, గరుడారూఢుఁ డయి నాల్గుకరములతోడన్. 684

క. వరపర పాపాంకుశ యను, హరిదినమును వ్యర్థపఱుచునట్టిండు లోకన్
జరియించుచున్న నూర్పులు, పరాసుకుఁడ లోహకారభస్త్రికవోలెన్. 685

క. కలవారును దీర్ఘాయువు, గలవారును వంశశుద్ధి గలవారును వ్యా
ధులు లేనివారలును మును, సలిపినవారల యఘాంకుశావ్రత మధిప. 686

—: కార్తికకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము :—

వ. మఱియును గార్తికకృష్ణైకాదశి రమైకాదశి యని చెప్పంబడియె. తత్ప్రభావం
బున కొక్కయితిహాసంబు చెప్పెద వినుము. 687

సీ. మును విభీషణసఖుండును విష్ణుభక్తుండు, నగుముచుకుందధరాధిపతికిఁ
బ్రభవమొందెను జంద్రభాగాసరిద్వర, చిన్నారిపొన్నారికన్నియగను
నతఁ డిచ్చె నాకన్నియను జంద్రసేనజు, మాభర్తృసుతుఁ డైనశోభనునకు
నల్లుఁడు శ్వశురగృహంబునం దుండ ర, మాహరిదినము సంప్రాప్తమయ్యె

గీ. నపుడు ముచుకుందుఁ డెప్పటియట్ల పురిని, గలజనంబుల కెల్లను దెలియునట్లు
చాటఁబనిచెను హరిదివసంబునందు, నారగింపంగఁ దగ దెవ్వఁ డైన ననుచు.

గీ. అంతటను శోభనుఁడు తనయింతితోడ, నిట్లు లనియెను గలికి నే నెన్నఁ డేని
జననమొందిన దాదిగాఁ జలిపి యెఱుఁగ, నొక్కయుపవాసమును నేమి దిక్కు నేఁడు.

చ. అనుటయుఁ జంద్రభాగ యిటు లాతనికిన్ వచియించె నాథ మా
జనకుఁడు చండశాసనుఁడు సైఁపఁడు విష్ణుదినంబునన్ దృణం
బును బశువుల్ భుజించినను భోజనముం బొనరింప నింక సైఁ
చునె జనులన్ బ్రజాఘములు శోణితలేంద్రునిఁ జెందఁగల్గుటన్. 690

గీ. ఎట్టు లైనను స్వామి నేఁ డీవు క్షుధకు, నోర్చుకొని యుండవలయు లేకున్నయెడల
మరణశిక్ష విధించు మామామ నీకు, నాకుఁ దీఱనిశోకంబు చేకుఱుంగ. 691

క. ప్రియ నగుట నేను నీకున్, దయితుఁ డ వీ వగుట నాకు దయతోడను నా
కుయి యూలకించి తైనను, గయికొను ముపవాసదీక్ష కాదనకుండన్. 692

చ. అనుటయు శోభనుండు కమలాక్షి త్వదుక్తి సమంజసంబుగాఁ
గనఁబడియెన్ మనంబునకుఁ గావున నేఁ డుపవాసదీక్ష గై
కొనియెద దైవ మెట్టు లొనగూర్చునొ యట్లగుఁగాక సౌఖ్య మొం
దను మఱి దుఃఖ మొందను స్వతంత్రత యున్నదె దేహధారికిన్. 693

క. అని చెప్పి దీక్షఁ గైకొని, జననాథసుతుండు క్షుద్వశంబున నాఁ డు
ల్లను బాధ చెంది మఱునాఁ, డినుఁ డుదయము నొందుచుండ మృతుఁడయ్యె నృపా.

క. అంత ముచుకుందుఁ డల్లుని, కంతటివాఁటకొని రాని మృతి వచ్చుట క
త్యంతము విస్మయపడుచు న, నంతరకృత్యంబు జరిపె నందఱుఁ జూడన్. 695

ఉ. అప్పుడు చంద్రభాగ హృదయంబున భర్తృపదారవిందముల్
ముప్పిరిగొన్న భక్తిమెయి మోపి తదర్చలు చేసికొంచు న
ల్లప్పుడు గూడ మాని విషయాంతరముల్ పతిదేవతాస్థితిన్
జెప్పక చెప్పుచున్ క్రియలచే వెడలింపఁగఁ జొచ్చెఁ గాలమున్. 696

గీ. అంతటను గొన్ని నాళ్ళకు నప్పురంబు, నందు నివసించుచుండు మహాతపస్వి
సోమశర్మాహ్వయము గల భూమిసురుఁడు, తీర్థసేవాపరుండగుచు తిరుగఁ జొచ్చె.

గీ. తిరుగుచును కేన దేశముల్ తీర్థములను, గ్రుంకు లిడుచు జాగును మందరనగరమునకు
వచ్చుటను నొకసానువునందుఁ గాంచె, దైవికముగను నొక దేవతాపురంబు.

సీ. కాంచి యందొకచోటఁ గనకమయస్తంభ, మును నవరత్నవిభూషితమును
దివ్యశోభాసముద్దీపితంబును నయి, జానొప్పునొక మహాసౌధమందుఁ
గావించుచుండంగ గానంబు గంధర్వు, లచ్చరల్ నాట్యంబు లాడుచుండ
ననిమిషుల్ స్తోత్రంబు లొనరించుచుండంగఁ, గురియుచు నుండంగఁ గుసుమవృష్టి

గీ. హారకుండలకటక కేయూర కాంతి, తేజరిలఁ జేయుచుండంగ దిసల నెల్ల
నొక్క సింహాసనమునఁ గూర్చుండి యున్న, దివ్యపురుషుని నొక్కనిఁ దేఱి కాంచి.

క. ఈతఁడు ముచుకుందునిజా, మాతగదా చెడిన నేమి మహిమను జేసి
రీతిని మహాప్రభావుఁ, డీతం డయ్యెనొ యటంచు నెంచుచు నదలన్. 700

గీ. అతనికడకేఁగుటయును సింహాసనంబు, నుండి లేచి మహాసంత సమున సోమ
శర్మకు నమస్కరించి యాధర్మమూర్తి, యోగక్షేమంబు లడిగెను ముదముతోడ నతఁడు.

ఉ. అంతట సోమశర్మ మననందు ముదంబును జెంది దేవ నీ
కింత మహాప్రభావ ముదయించుట కేమి కతంబొ సర్వవృ
త్తాంతము నాకుఁ జెప్పు మన నాతఁడు నవ్వి మహాత్మ మద్వివా
హాంతమునందు నేను శ్వశురాలయమందు వసించి యుండఁగన్. 702

గీ. కార్తికంబునఁ గృష్ణపక్షంబునందు, వచ్చుటయును గమా హరివాసరంబు
శ్వశుర శాసనమున నుపవాస ముంటి, నాఁడు తప్పించుకొను త్రోవ నాకు లేమి.

క. అంతటను నోర్వఁజాలని, సంతాపము గలిగి క్షుద్వశంబున నాకే
యంతయును నేడ్చు మఱునాఁ, డంతము నొందితిని నుదయ మగుచుండంగన్.

క. అది యెంతటియభ్యుదయ, ప్రద మగు హరివాసరంబొ ప్రాప్తంబయ్యెన్
దదనంతరంబ నాకీ, పద మయథార్థములె బుధులుపలికెడి పలుకుల్.

గీ. కాని యశ్రద్ధచేతను నేను నాఁడు, చేసినయుపవాసమునఁ జేసి స్థిరము గాక
యుండుటను విపదము గొనుచుండె ననుచు, వేగ చని చెప్పుమా చంద్రభాగతోడ.

క. అనుటయు నంత నాతనివిహారాదులు, విని కనికర మొదవ లోన విప్రుఁడు శీఘ్రం
బున వచ్చి చంద్రభాగకుఁ, వినిచెను దయితునియ శేషవృత్తాంతంబుల్. 707

గీ. అంతటఁ జంద్రభాగ ప్రహృష్టమునను, దశమమా వ్రతఫలమును ధారవోసె
స్వర్గపురవాసభాగ్యంబు శాశ్వతముగ, దయితునకునుండునట్లు లోఁదలచికొనుచు.

గీ. ధారవోసె యప్పుడు తాను బాల్యమునుండి, చేసినట్టివిష్ణువాసరోప
వాసములఫలంబువలన దేహముతోడఁ, జనియె నామె భర్తృసవిధమునకు.

గీ. అంత నా చంద్రభాగయును సతీజనుఁ గూడి, యనుభవించుచు స్వర్గసౌఖ్యముల నెల్లఁ
గల్పశతములు గడచిన తీరుగానట్లు, హరిదినవ్రతమహిమ నే మనఁగ నచ్చు.

—: కార్తిక శుక్ల ఏకాదశీ వ్రతమాహాత్మ్యకథనము :—

వ. మఱియును గార్తికశుక్లైకాదశిం గూర్చి బ్రహ్మయు నారదుం జెప్పఁగ సమ్మహా
ర్షికిఁ బరమేష్ఠి యిట్లనియె.

క. నారద నీప్రశ్నంబుప, కారక మఖిలప్రజానికాయమునకు నా
కారణమున నొలయును నీ, కోరికి తీరుపక పోవఁ గూడదు మాకున్.

గీ. కార్తికంబున శుక్లపక్షమున వచ్చు, హరిదినంబు ప్రబోధిని యనెడిపేర
విశ్రుతిం జెందె నానాఁడు విష్ణుమూర్తి, గాఢపాచ్ఛయ్యనుండి మేల్కొనుటఁ జేసి.

సీ. అభిలషించినయెడ నాయువు దయచేయు, నారోగ్య మొసఁగును గోరునెడల
నర్థించునెడలఁ బుణ్యము లెల్లఁ జేకూర్చు, నిచ్ఛగించినయెడ నిచ్చు సుఖము
ప్రార్థించునెడల సామ్రాజ్యంబు నొడఁగూర్చు, విద్యలన్నియు నిచ్చు వేఁడునెడలఁ
గాంక్షించునెడ సర్వకలుషంబుల నడంచు, వాంఛించునెడల సన్వయము నిలుపు

గీ. నివి యవి యనంచు వాక్రువ్వ నేల వేయి, త్రిభువనంబులలోన దుర్లభము లైన
యీప్సితార్థంబు లేవేని యిచ్చునట్టి, దీక్ష గలయది యొకప్రబోధినియె చూవె.

గీ. వాజిమేధసహస్రముల్ రాజసూయ, శతములును జేసినఫలంబు సంఘటిల్లుఁ
జేసెనేని ప్రబోధినీవాసరమున, నొక్కయుపవాసమును శ్రద్ధ యుంచి మదిని.

గీ. పూర్వజన్మసహస్రసంభూత మైన, పాతకం బెల్లఁ జిచ్చులోఁ బడినదూది
చందమున డిందు నొకరాత్రి జాగరంబు, చేసెనేని ప్రబోధినీవాసరమున. 716

గీ. శాస్త్రము విధించినట్టులు శ్రద్ధతోడఁ, జేసెనేని ప్రబోధినీవాసరమున
సుకృత మణుమాత్ర మేని యాసుకృతలవమె, మేరుసమ మయి కర్తకు మేలుగూర్చు.

గీ. వాఁడె యతి వాఁడె సుఖభోగి వాఁడె యోగి
వాఁడె విజ్ఞాని వంశపావనుఁడు వాఁడె

యుక్తరీతిని జాగరోపోషణములఁ
జలుపునో ప్రబోధినీదినమున నెవఁడు.

గీ. త్రిభువనంబులలో నున్నతీర్థనిచయ, లన్నియును బ్రబోధినీవ్రత మాచరించు
నట్టివానిగృహంబున నధివసించుఁ, గాన వేయేల పుణ్యంబు సాటి కేల. 719

గీ. స్నానదానతపోహోమజపములందు, చేని నైనఁ బ్రబోధినీదినమునందుఁ
జేయునెడఁ దత్ప్రభావముచేత నగును, నక్షయంబుగ నది మోక్షసిద్ధి.

గీ. వ్రతము చేసి ప్రబోధినీవాసరమున, హరిని బూజించి ... నశంఖ
జలముచే శౌరి కర్ఘ్యం బొసంగెనేని, యమితతీర్థస్నానపుణ్యము లభించు.

గీ. శమదమంబులు గాని తీర్థములు గాని, దానములు గాని వ్రతములు గాని కావు
సమములు ప్రబోధినికి నొక్కశౌరి దక్క, ... యని బ్రహ్మ.

క. అంతటఁ బ్రబోధినీవ్ర, తాంతము దెలుపుచును జనకునకు ... మహా
సంతోషముతోడఁ బ్రభుఁ, డంతర్ధానంబు నొందెనని సూతుఁ డనియెన్. 723

—: అధికమాసకృష్ణైకాదశీమాహాత్మ్యకథనము :—

వ. మఱియును బురుషోత్తమమాసం బనుప్రసిద్ధిం బడసిన యధికమాసంబున వచ్చు కృష్ణైకాదశి కమలానామంబునఁ బ్రసిద్ధం బయ్యె. తన్మహిమంబు వాగతీతంబు.

క. దీనికి దృష్టాంతంబుగ, నేనొకకథ వినుచువాఁడ ని కర్ణాసన్
గాసంబునఁ గమలామహిమా, మానంత్యం బగుచు ... లింకన్. 725

సీ. మున్నవంతీపురంబున నుండె శివశర్మ, యనుబ్రాహ్మణోత్తముం డొక్కఁ డవనిలోన
నతనికిఁ గల రేవు రాత్మజుల్ జయశర్మ, యనుకనిష్ఠుం డందు సంతులోన
నాకనిష్ఠుఁడు దుస్సహాపాసమునఁ జేసి, చేయఁబోఁడంగను జిష్టపనుల
నవి సహ్యములు గామి నతని గేహమునుండి, యుంటికి శివశర్మ వెడలఁగొట్టె

గీ. నంతటను నాకనిష్ఠుఁడు కొంత కాల, మడవులం దుండి క్షుద్బాధ కాఁగలేక
యక్కడక్కడఁ దిరుగుచు నొక్కనాఁడు, దైవికముగఁ బ్రయాగతీర్థమున కరిగె.

చ. అరిగి త్రివేణిలో మునిఁగి యాతఁడు తత్సవిధంబునందు భూ
సురపరిషత్పరీతుఁ డగుచున్ హరిమిత్త్రమహర్షి యుండఁ ద
చ్చరణసరోరుహంబులకు సాఁగిలి మ్రొక్కి నిజస్థితిన్ సవి
స్తరముగ విన్నవించి నను ధన్యునిఁ జేయుఁ డటంచు వేఁడినన్. 727

క. హరిమిత్త్రుఁ డతనిపయిఁ గని, కర మురయుంపంగ నెనను గమలావ్రత మ
త్తఱుణంబునఁ జేయించెను, బరిషన్మధ్యమున నాప్రపన్నునిచేతన్. 728

గీ. వ్రతము చేసినపిదప నారాత్రియందు, నరుగుదెంచి మహాలక్ష్మి కరుణతోడ
నిదురలో నున్నజయశర్మయెదుట నిలిచె, దేహకాంతులచే దెసల్ తేజరిల్ల.

సీ. అంతట జయశర్మ యామెను గనుఁగొని, యత్యంతవిస్మయం బాత్మ నొంది
తల్లి నీ వేదేవతామతల్లివో నాకుఁ, దెలుపు మటంచుఁ బ్రార్థించుటయును
వత్స వచ్చితి నేను వైకుంఠమునసుండి, శౌరియానతిని నాపేరు కమల
సంతోషమయ్యె నీసలిపినకమలావ్రత, తమున కిచ్చెదను గోడము వరంబు
గీ. నని రమాదేవి వచియింప నతఁడు మ్రొక్కి, భక్తితోడుతఁ దత్పాదపద్మములకుఁ
దల్లి చెప్పుము కమలావిధాన మనుడు, నింది రాదేవి హర్షించి యిట్టు లనియె.
గీ. అధికమాసంబునను గృష్ణహరిదినమున
నుత్థితుం డయి బ్రాహ్మముహూర్తమందు
నెనను బురుషోత్తముని స్మరియించుకొనుచు
స్నాన మొనరించి శాస్త్రవిధానమునను. 731
వ. గృహంబున నేకగుణంబుగను నదీతీరంబున ద్విగుణంబుగను నగ్నిహోత్ర
గృహంబునను శివక్షేత్రంబులందును దీర్థంబులందును దేవతాసన్నిధియందును
శతగుణంబుగను గోష్ఠంబునందు సహస్రగుణంబుగను కాలసీసాన్నిధ్యంబున
లక్షగుణంబుగను విష్ణుసన్నిధానంబున ననంతగుణంబుగను ఫలంబు చెప్పం
బడుటం జేసి ప్రాప్తస్థానంబునందుఁ గమలావ్రతం బొనరించెద నని సంకల్పించి
యాదినం బెల్ల నుపవాసజాగరంబులతోఁ బంచామృతస్నపనాదులచేఁ బురు
షోత్తమునిఁ బూజించి మఱునాఁడు ప్రాతఃకాలంబున స్నానంబు చేసి పయ
స్స్నపనాదులచే జనార్దనుని నారాధించి యంజలి గావించి. 732
గీ. స్వామి యజ్ఞానసంతమసమున గ్రుడ్డి, నైననాకు నొసంగుము జ్ఞానదృష్టి
ననుచుఁ బ్రార్థించి బ్రాహ్మణులను భుజింపఁ, జేసి చివరకుఁ దాను భుజింపవలయు.
గీ. ఆవ్రతంబున ధర్మకామార్థములను, బడసి వ్రతకర్త ముక్తిని గడకుఁ జెందు
నని వచించి యంతర్ధానమయ్యె లక్ష్మి, యంతటను మేలుకొనియెఁ ధరామరుండు.
ఆ. అంతలోనె గజము లశ్వంబులును రథ, ములును బరిజనమును గలిమితోడఁ
బ్రాప్తమయ్యెఁ దత్ప్రభావంబునను జయ, శర్మ కచ్చెరియము సంఘటిల్ల. 735
క. ఆవిభవముతో నింద్రుని, కైవడి జయశర్మ పితృసకాశంబునకుఁ
బోవుటయును శివశర్మ మ, హావిస్మయ మొదవ నతని నాలోకించెన్. 736
క. అంతట జయశర్మ స్వవృ, త్తాంతం బంతయును దెలిపి యాత్మీయుల క
త్యంతానందము గలుగ న, నంతఫలం బొసఁగువ్రతమహత్త్వము వినిచెన్. 737

—: అధికమాసశుక్లైకాదశీమాహాత్మ్యకథనము :—

వ. మఱియు నధికమాసశుక్లైకాదశి కామదైకాదశి యని చెప్పంబడు. 738
క. అరమఱ లేకుండఁగ నా, దరిఁ జేరినయెడలఁ గామదాదినసమునన్
బరిపాలింపఁగ భక్తులఁ, బురుషోత్తమనామధేయమున నే నుందున్. 739

సీ. భస్మీకృతము లగుఁ బాపంబు లన్నియు, రోగంబు లెల్లను రూపుమాయు
నాయుష్య మభివృద్ధి నందు [illegible], వ్యాధులు [illegible] దిగ్వలయమునందుఁ
దనరుఁ దా [illegible] ధనధాన్యపశుభవనంబు. [illegible] సంఘటిల్లు
శాత్రవుల్ [illegible] శేషంబుగా నుండరు, [illegible]

గీ. గామితార్థంబులను దీర్పఁ గల్పతరువు, [illegible] దినమునందు
నన్నుఁ గూరిచి భక్తిసంపన్ను లగుచుఁ, జలిపి [illegible] యుండు [illegible] గరములు. 740

క. భూవర వే యేటికి వసు, ధావలయమునం [illegible]
జీవన్ముక్తిని గాంతురు, [illegible] శ్రద్ధ [illegible]. 741

క. ఈవిష్ణువాసరములు [illegible], భానము [illegible]
శ్రీవర సముద్రముద్రిత, భూవల [illegible]. 742

క. అనుటయు సజాతశత్రుఁడు, మనమున [illegible] నై
నను నింక [illegible] దలఁచిన, మునివర [illegible] మున [illegible] గ్రముగ [illegible] గింతుక.

—: చాతుర్మాస్యవిధికథనము :—

గీ. అనుటయును శౌనకుండు ప్రహర్ష మొంది, విదితధర్మ చాతుర్మాస్యవిధులు నాకు
నాలకింప మనోరథ మంకురించె, నని పలుక సూతుఁ [illegible] లానునికి ననియె.

వ. నేఁడు నీవు న న్నడిగినట్లు మున్ను నారదుండు [illegible] ననుగ. 745

గీ. హరుఁడు చిఱునవ్వు నవ్వి [illegible] యుట్లనియె నడుగఁ, దగునె [illegible] తాపసేంద్ర
నవనవోన్మేషములు రమానాథువునికథలు, వినుటకును [illegible] ను [illegible] గాలువు.

వ. శయని యని చెప్పంబడు నాషాఢశుక్ల కాదశి [illegible] యని చెప్పం
బడు కార్తికశుక్లైకాదశివఱకును [illegible] చాతుర్మాస్య
మని చెప్పంబడియె. శయనైకాదశినాఁడు [illegible] గాల్యకృత్యం
బుల నెఱవేర్చికొని విష్ణుప్రతిమను [illegible] శంఖచక్ర
గదల నలంకరించి పీతాంబరంబు గట్టి [illegible] సోపధానం
బును నగుపర్యంకంబునందు స్థాపించి చందనంబు [illegible] లగు
పుష్పంబులచేఁ బూజించి ధూపదీపాదు [illegible]. 747

గీ. నీవు సుప్తుండవై యుండ నీరజాక్ష, [illegible] జగము లెల్ల
నీవు మేల్కాంచిన మేల్కాంచు నిద్రనుండి, జగములకు [illegible] వగుటఁ జేసి.

వ. అని ప్రార్థించి తత్పురోదేశంబునందుఁ దాను [illegible] చాతుర్మాస్యవ్రత
దీక్షానియమంబులు నివేదింపవలయు. [illegible] చాతుర్మాస్యవ్రతం
బయ్యె నేని [illegible] మిథునరాశిగతుండై [illegible] నోత్సవంబును
దులారాశిగతుండై యుండఁ బ్రబోధోత్సవంబును మాఘస్నానకొనరింపవలయు,

దేవతాప్రతిష్ఠలును యజ్ఞాదిక్రియలును వివాహాదిమంగళకార్యంబులును దండ
యాత్రలును జాతుర్మాస్యాదినంబులందు నిషిద్ధంబులు. చాతుర్మాస్యదినంబు
లందు హింసాత్యాగంబువలన దేవత్వంబును తైలవర్జనంబువలన సంతతియును
ఘృతవర్జనంబువలన లావణ్యంబును కటుతైలత్యాగంబువలన శత్రునాశం
బును సుగంధతైలత్యాగంబువలన సౌభాగ్యంబును పుష్పభోగపరిత్యాగంబు
వలన విద్యాధరత్వంబును మద్యపరిత్యాగంబువలన సురూపంబును సౌగంధ్యంబును
తాంబూలవర్జనంబువలన భోగంబును మధురకంఠంబును ఫలత్యాగంబువలన
బహుపుత్రత్వంబును యోగాభ్యాసంబువలన బ్రహ్మపదంబును నభ్యంగ
త్యాగంబువలన కీర్తియు ద్రవ్యపతిత్వంబును దధిదుగ్ధపరిత్యాగంబువలన
గోలోకంబును స్థాలీపాకవర్జనంబువలన నింద్రసింహాసనంబును స్థండిలస్థలభోజ
నంబువలనఁ బృథివీపతిత్వంబును విష్ణుపాదాభివందనంబువలన సర్వదానఫలం
బును విష్ణుపాదాంబుజస్పర్శంబువలనఁ గృతకృత్యత్వంబును విష్ణుదేవాలయోప
లేపనమార్జనంబులవలన వైకుంఠనిత్యనివాసంబును నష్టోత్తరశతవిష్ణుప్రదక్షిణం
బులవలన హంసయుక్తదివ్యవిమానగమనంబును విష్ణుసన్నిధియందు గీత
వాద్యంబు లొనరించుటవలన గంధర్వలోకంబును బంచగవ్యప్రాశనంబువలనఁ
జాంద్రాయణఫలంబును లోకంబునకు శాస్త్రంబు బోధించుటవలన వ్యాసత్వం
బును విష్ణుపదప్రాప్తియును మాధవునిఁ దులసీదళంబులచేఁ బూజించుటవలన
విష్ణుధామంబును విష్ణుపాదోదకప్రోక్షణంబువలన నప్సరస్థానంబును శీతోదక
స్నానంబువలన నిర్మలదేహంబును నుష్ణోదకవర్జనంబువలనఁ బుష్కరస్నాన
ఫలంబును బత్త్రిభోజనంబువలనఁ గురుక్షేత్రనివాసఫలంబును శిలాభోజనంబు
వలనఁ బ్రయాగనివాసఫలంబును తామ్రపాత్రభోజనంబువలన నైమిశవాస
ఫలంబును పాలాశపత్త్రిభోజనంబువలనసంవత్సరాగ్నిహోత్రోపాసనాఫలంబును
నారాయణాష్టాక్షరీజపంబువలన విద్యాధరపతిత్వంబును పుష్కరస్నానంబు
వలన గంగాస్నానఫలంబును బ్రహ్మపత్త్రిభోజనంబువలనఁ జాంద్రాయణవ్రత
ఫలంబును నేకాదశ్యుపవాసఫలంబును సర్వదానఫలంబును సర్వతీర్థస్నానఫలం
బును నరకనివృత్తియును విష్ణువునకుఁ దనుగురువునకు నాత్మార్పణంబు గావిం
చుటవలన ననంతఫలంబును స్థండిలశయనంబువలన దివ్యవిమానప్రాప్తియును
నక్తభోజనంబువలనఁ దీర్థయాత్రాఫలంబును నయాచితాన్నభోజనంబువలన
వాపీకూపాదిస్థాపనఫలంబును మధువర్జనంబువలన సర్వయజ్ఞఫలంబును దాడిమ
మాతులుంగనారికేళవర్జనంబువలన సంపన్నత్వంబును సుభగత్వంబును దేవ
త్వంబును వైకుంఠనివాసంబును నేకభక్తంబువలన శాశ్వతవిష్ణులోకనివాస
భాగ్యంబును యవవ్రీహిగోధూమవర్జనంబువలన నశ్వమేధయాగఫలంబును

ధనధాన్యసమృద్ధియును బహుపుత్త్రత్వంబును దిలదర్భతులసీదళంబులచేఁ జేయు తర్పణంబువలన సహస్రయుగంబులవఱకును విష్ణుసాన్నిధ్యనివాసంబును వేదంబున ఋక్కు గాని యజుస్సర్గము గాని సామము గాని యష్టిపదంబు గాని విష్ణుసాన్నిధ్యమునందుఁ బఠించుటవలన వైకుంఠనివాసంబును మైథునవర్జనంబువలన నొక్కమన్వంతరంబువఱకును విష్ణులోకవాసంబును దక్రశాకవర్జనంబువలన మోక్షంబును నామలకస్నానంబువలన మహాపుణ్యంబును సంధ్యామౌనంబువలనను సత్యనిష్ఠవలనను ననంతసుకృతంబును నిత్యస్నానంబువలనఁ జతుర్మన్వంతరములవఱకును వైకుంఠనివాసంబును స్వయంపాకభోజనంబువలన నయుతవర్షంబులవఱకును స్వర్గలోకనివాసంబును మాసప్రసాదంబువలన వైకుంఠసత్యలోకనివాసంబును మౌనభోజనంబువలన సుపుత్రసంతానప్రాప్తియును సమస్తము. మాసభోజనంబువలన భిక్షుకులకును స్వర్గప్రాప్తి కలిగె.

—: మౌనభోజనఫలనిరూపణము :—

గీ. ఆడుచును జల్పనములను నారగించు, నన్న మరుగు నపవిద్ధ మౌలునన్న దినెడు
తినునతఁ డగుఁ బాపము దినినవాఁడ, కాన పలుకుము మౌనము భుక్తికాలమందు.

గీ. భోజనము చేయునెడ మౌనమును వహించి, యుపవసించినపుణ్యము నొందువాఁడు
కొనకుఁ బ్రాణాహుతులకాలమునను నైన, మౌనము వహించువాఁ డగు మౌనభోజి.

ఆ. భస్మ మగును జూవె పంచమహాపాత, కములు గూడ నొక్కగడియలోన
నితరపాతకముల నెన్నంగ నేటికి, మౌనభోజి [illegible]. 752

వ. చాతుర్మాస్యంబునందు నియమితంబుగా నర్పించినపదార్థంబులు బ్రాహ్మణునకు మొదట దానము చేయవలయు. ఏపురుషుఁడు దత్తమైనపదార్థంబు గోరునతండై తన కక్షయంబుగా వైకుంఠముం బ్రసాదించు. హరినామసంకీర్తనంబువలనను బురాణశ్రవణంబువలనను విష్ణుపూజవలనను భూసురార్చనమునను సర్వపాపవిముక్తియును విష్ణులోకప్రాప్తియును జేకూరు. ఇంకను నిత్యనైమిత్తికంబు లనేకంబులు నిర్వర్తించుటవలన ననేకవిధపుణ్యలోకంబులు ప్రాప్తించు. 753

గీ. ఏవిధంబున నైనను దేవదేవుఁ, డగు జనార్దనునకుఁ బ్రీతి యుప్పతిల్లఁ
జేయ నగు నియమాదులచేత శక్తి, ననుసరించి చాతుర్మాస్యదినములందు.

గీ. సమయయోగ్యంబు లగు నియమములలోన, దేని నైనఁ జాతుర్మాస్యదినములందు
నాచరింపక కాలము వ్యర్థపఱచు, నట్టివారలజన్మము వ్యర్థ మనఘ. 755

గీ. అనుటయును నారదుం డిట్టు లనియె దేవ, వింటి నేఁడు చాతుర్మాస్యవిధుల నెల్లఁ
ద్వత్కృపావశమునను సంతసము గల్గె, నింకఁ దద్ధ్యాపనావిధం బెఱుఁగఁ జెప్పుమ.

—: చాతుర్మాస్యవ్రతోద్యాపనవిధికథనము :—

క. అనుటయు మహేశ్వరుం డీ, ట్లనియెను నారద వరింతు నవధానమునన్
విను చాతుర్మాస్యవ్రత మునకు నుద్యాపనము మిగుల ముఖ్యము సూవే. 757

క. ఒనరింపకున్న నుద్యా, పనము వ్రతంబునకు విఫలభావము గలుగున్
జనియించు దాన వ్రతముం, బొనరించినవాని కాంక్ష్యమును నష్టంబున్. 758

వ. జగన్నాథుండు సుప్తోత్థితుం డైనవెనుకను దాను బాటించిననియమంబుల నెల్ల నివేదించి తైలంబు వర్జించినయెడల ఘృతంబును ఘృతంబు వర్జించిన యెడల క్షీరంబును స్నానంబు వహించినయెడల సహిరణ్యంబు లగుతిలపిండంబులును భోజననియమంబు వహించినయెడల హిరణ్యసహితంబును దధియుతంబును నగునన్నంబును బలాశపత్త్రభోజనంబు గావించినయెడల ఘృతపూర్ణంబగుభోజనంబును నక్తభోజనంబు గావించినయెడల షడ్రసభోజనంబును వయాచితభోజనంబు గావించినయెడల సహిరణ్యంబగువృషభంబును మాసంబు వర్జించినయెడల సవత్సయగుగోవును నామలకస్నానంబు గావించినయెడల మాషపరిమితంబగుసువర్ణంబును ఫలనియమంబు వహించినయెడల ఫలంబులును ధాన్యనియమంబు వహించినయెడల ధాన్యంబును స్థండిలశయనంబు గావించినయెడల సతూలంబును సోపధానంబును నగుశయ్యయును నిత్యస్నానంబు గావించినయెడల సశాకంబును సదక్షిణంబును సగులవణంబును నిస్స్నేహభోజనంబు గావించినయెడల ఘృతసక్తువులును నఖకేశధారణంబు చేసినయెడల నాదర్శంబును బాదరక్షావర్జనంబు గావించినయెడలఁ బాదరక్షలును మాంసంబు వర్జించినయెడల సవత్సయగుకపిలగోవును దీపంబు వెలిఁగించినయెడల సువర్ణపాత్రంబున ఘృతంబున వెలిఁగించినదీపంబును శాకనియమంబు వహియించినయెడల శాకంబును మైథుననియమంబు వహించినయెడల రౌప్యంబును నాగవల్లీదళవర్జనంబు గావించినయెడల సహిరణ్యంబగుకర్పూరతాంబూలంబును బ్రాహ్మణునకు నొసంగవలయు. బ్రహ్మచర్యంబు వహించినయెడల బ్రాహ్మణదంపతుల కిరువురకు భోజనంబు పెట్టవలయు. మఱియును నితరనియమంబు లేవైనను వహించినయెడలఁ దత్తదర్హంబుగా శాస్త్రవిహితంబు లగుదానంబులు గావింపవలయు. 759

క. ఈయుద్యాపనవిధులను, జేయునెడల శ్రద్ధతోడ శ్రీపతి సకల
శ్రేయముల నొసఁగు భక్తని, కాయమునకు జన్మసార్థకత్వము గలుగన్. 760

వ. అనుటయు నారదుండు మహేశ్వరునకు సవినయంబుగా వందనం బొనరించి త్రిస్పృశావ్రతముం గూర్చి యడుగ సదాశివుం డాతని కిట్లనియె. 761

—: త్రిస్పృశా మాహాత్మ్య కథనము :—

గీ. త్రిస్పృశాద్వాదశీవ్రతాధిక్య మిట్టి, దనుచు వచియించుటకును నా కలవి గాదు
కలుగుఁబంచమహాపాతకులకుఁ గూడ, [illegible] సామ్రాజ్య మీవ్రతంబున [illegible]

గీ. క్రతువులొనరించఁగాక తీర్థములలోన, మునుఁగుఁగాక బహువ్రతంబులను జేయఁ
గాక త్రిదశుల నర్చించఁగాక ముక్తి. గలుగ నేరదు త్రిస్పృశ [illegible]

క. కలికాలంబున వినుమా, కులమానసు లైన ప్రాణికోటుల కెల్లన్
గలిగింప ముక్తి నయ్యెడ, జలజాక్షుండు చేసెఁ ద్రిస్పృశాతిథి నిలలోన్. 764

సీ. తొలఁగిపోయె శతాయుధునకుఁ గానన ముక్కోఁ, [illegible] జంపినపాతకంబు
నశియించె శతమన్యునకు నముచిప్రాణ, హరణంబునను గల్గినట్టిపాప
ముడిగెను బాహుబలీంద్రునకు హత్య, [illegible] హత్యపాతకంబు
నడగెను గంగాభవానికిఁ బాపనం. [illegible] త్రిస్పృశావ్రతంబు

గీ. పడిరయె నాగాస్త్రముననుండి [illegible] యుగములకొలది [illegible] యుండుకొన్న
యట్టిబ్రహ్మకపాల మత్యద్భుతముగ, నొనరుచుటఁ జేసి త్రిస్పృశోపోషణంబు.

గీ. అనఘ కాశీప్రయాగములందు మరణ, మొందినను గోమతీస్నాన మొనరిచినను
నొందఁదగుముక్తి త్రిస్పృశోపోషణమున, సంభవించును గృహమందు జంతువులకు.

గీ. బ్రహ్మహత్యాద్యనేకపాపములు గలిగి, నట్టిప్రాణులు తనజలమందు మునుఁగఁ
దత్తదఘసంతతులు తన్నుఁ దగులుకొనుట, నిలువఁజాలక మున్ను చింతించుచు గంగ.

సీ. సత్వరంబుగఁ బోయి శౌరిసన్నిధి కరిగి, [illegible] మున [illegible] పిన్నవింపు
హరి యిట్లు లనియె జాహ్నవి చింతిలకుము నీ, పాపంబు [illegible] బాసిపోవు
శ్యామవటంబు నాస్థానంబు నే నుందు, నానటంబునఁజుంద యుమ్యాహమును
బ్రవహించుచుండును బ్రాచీసరస్వతి, నాయగ్రభాగంబునను సతంబు

గీ. నీవు తత్తీర్థజలమందు నియతముగను, స్నాన మొనరింపు మొకసారి [illegible] సదియె
బ్రహ్మహత్యాసురాపానభర్మహరణ, గోవధాద్యఘముల నెల్లఁ గూలఁద్రోయు.

గీ. అనుటయును గంగ వినయసమ్మాన్య యగుచు
స్వామి తత్తీర్థమున కేఁగఁజాల నేను
సులభముగఁ బాపములు వాయఁగలుగునట్టి
తెరువు మఱియొండు కరుణించి తెలుపు మనియె. 769

గీ. అనుటయును మాధవుం డిట్టు లనియెఁ బుత్రి, సకలపాపంబులను గూడ సంహరింప
సులభ మైనయుపాయంబు కలదు గాని, పరమగోప్యంబు దానిఁ జెప్పంగ రాదు.

క. ఐనను మత్పదజాతవు, గాన వచించెదను నీకుఁ గల దొకతిథి య
ద్దానికి సరి గా దేవ్రత, మేనియు నేతీర్థమేని యేమఖమేనిన్. 7[illegible]

వ. ఏకాదశియును ద్వాదశియును రాత్రిశేషంబునఁ ద్రయోదశియును చేరియుండు టంజేసి యది త్రిస్పృశ యనునామంబు గలది యయ్యె. 772

గీ. అట్టితిథియందు వ్రతమును నాచరించి, పుట్టు లైనను జేకూరు సకలపుణ్య కర్మములు చేసినఫలంబు గడియలోన, దానికి సమాన మగుదె యింక దాఁప నేల.

గీ. దశమి యేకాదశియును భద్రయును జేరి, చక్రికిదినమును త్రిస్పృశాఖ్యంబు కాని యది యసురులకుఁ బ్రియమైన దగుట నంటఁ,దగదు పుష్పిణి తైలంబు దగినయట్టు.

క. దశమీయుత మగు నేకా, దశి నాకుఁ బ్రియంబు గాదు దశకూదోష ప్రశమితగుణ మగు నేకా, దశిని నుపోషణము చేయఁ దగ దెవ్వరికిన్. 775

క. అనుటయును దద్విధానము, వినిపింపుము దేవ నాకు విశదముగా నే నొనరించి తద్వ్రతంబును, గని యెద నఘశుద్ధి యనుచు గంగ యనంగన్. 777

వ. మాధవుండు గంగను గరుణాకటాక్షంబుల నిరీక్షించి దేవీ పంచరత్నసమంచితంబును బుష్పమాలావేష్టితంబును గర్పూరాదిసువాసనావాసితసలిలపూరితంబును నగునొక్కఘటంబునందుఁ దిలపూర్ణం బగుతామ్రపాత్రంబు నుంచి పలంబు గాని పలార్ధంబు గాని తదర్ధంబు గాని పరిమాణంబు గలమదీయసువర్ణప్రతిమను నభిషేకపూర్వకంబుగా దానిపైనిఁ బ్రతిష్ఠించి తత్ప్రతిమకు గంధపుష్పపరిధానఛత్త్రిపాదుకావేణుదండయజ్ఞోపవీతఫలోపహారంబు లర్పించి దామోదరునిపాదంబులును మాధవునిజానువులును గామప్రదాయకునిగుహ్యంబును వామనునికటియును బద్మనాభునినాభియును విశ్వమూర్తిజఠరంబును జ్ఞానగమ్యునిహృదయంబును నైకుంఠగామికంఠంబును సహస్రబాహునిబాహువులును యోగరూపునిచక్షువులును దులసీపత్త్రంబులచేఁ బూజించి శంఖోపరిస్థాపితంబును సూత్రవేష్టితంబును నగునారికేళంబు హస్తంబులం దుంచుకొని. 777

గీ. అంబుజాక్ష మదీయము లైనయఘము,లన్నియును గూడ రూపుమాయంగఁ జేసి నన్ను రక్షింపు మీవేళ నాయొసంగు, నర్ఘ్యమును గొని వందన మాచరింతు.

వ. అని పలికి తన్నారికేళఫలోదకార్ఘ్యప్రదానపూర్వకంబుగాఁ బ్రణామంబు గావించి ధూపదీపనైవేద్యనీరాజనంబు లొసంగి పిదప గురువునకు నర్చనాపూర్వకంబుగా భోజనతాంబూలదక్షిణలును వస్త్రంబులును గంచుకోష్ణీషంబులును ఛత్త్రోపానహంబులును ముద్రికాకమండలువులును సప్తధాన్యంబులును సమర్పించి రాత్రి జాగరంబు గావించి మఱునాఁడు ప్రాతఃకాలంబునందు స్నానాదిక్రియాకలాపంబు నొనర్చుకొని యర్ఘ్యప్రదానంబు గావించి పారణ యొనర్పవలయు. 779

క. చతురాననుఁడును సురలును, యతులును గావించి యిమ్మహావ్రతమును వాంఛితసిద్ధి మున్ను వడసిరి, క్రతుశతఫల మొందు దీనిఁ గావించునెడన్. 780

సీ. ఉభయవంశంబులను గూడ నుద్ధరించి, యట్టివాఁ డెవఁడు త్రిస్పృశకు నాచరించి
నట్టివాఁ డాతనికి మీఁదుగట్టి యుండె, సాధనములు గొన్ని నాసీట సంతతమును;

క. అని చెప్పుటయును జాహ్నవి, మనమున సంతోషించుచును మహాశ్రేష్ఠక త్రా
నొనరించి త్రిస్పృశావ్రత, మును జెందె నశేషపాపముక్తి మునీంద్రా. 782

క. అని చెప్పెను నున్మీలని, యన నెట్టిదొ దేవ చెప్పు మనుచును విశిష
న్మని వినయంబున నడుగుట, యమును నతనికిఁ బార్వతీప్రియుం డిట్లనియెన్.

—: ఉన్మీలనీ మాహాత్మ్య కథనము :—

వ. ఏకాదశి యహోరాత్రంబును బూర్ణంబుగా నుండి మఱునాఁడు ప్రభాతకాలం
బున ఘటికామాత్రంబు శేషించెనేని నాస్పదము ముక్తం బగు ద్వాదశి యున్మీలని
యని చెప్పంబడు.

గీ. ఆదినంబు ప్రియం బైనయట్లు హరికిఁ, బ్రియము గావించి దింక సేవయునుగూడఁ
గాన నున్మీలనికిఁ గలగౌరవంబు, గానరా దేదినంబునఁ గైనఁ గాని. 785

గీ. కాశియును గంగయును బ్రయాగమును గయయు
గోమతియుఁ గాంచనాద్రియు నైమిశమును
దపములును వేదములు సప్తతంతువులును
జాల నున్మీలనీశతాంశమున కేని. 786

గీ. మాటిమాటికి నీకుఁ బెక్కుమాట లేల, చెప్పఁదగినది యొక్కటె చివరమాట
కాన నున్మీలనికి సాటి యైనవ్రతము, వాసుదేవునిఁ బోలు దైవంబుఁ గనము.

వ. ఉన్మీలని ప్రాప్తించినమాసంబుపేర స్వర్ణమయం బగు విష్ణుప్రతిమను జేయించి
పంచరత్నసమంచితంబును గంధపుష్పాక్షతాదిశోభితంబును సలిలసమేతంబును
నగునొక్కకుంభంబునందు గోధూమపూరితం బగునొక్క తామ్రపాత్రంబు
నుంచి దానిపైని నాప్రతిమను బ్రతిష్ఠించి షోడశోపచారంబులచేఁ బూజించి
మాసనామునిచరణంబులును విష్ణురూపునిజానువులును భగవత్పతిగుహ్యంబును
బీతవాసునికటియును బ్రహ్మమూర్తినాభియును విశ్వయోనికిఁ బుదరంబును జ్ఞాన
గమ్యునిహృదయంబును వైకుంఠమూర్తికంఠంబును నుదరగునిలలాటంబును
సురేశునియుత్తమాంగంబును సర్వమూర్తిసర్వాంగంబులును దదాయుధంబు
లును నర్చించి శంఖోపరిస్థితంబును సూత్రవేష్టితంబును సగునారికేళంబుం
బట్టికొని. 788

గీ. పుండరీకాక్ష పాపకర్ముండ నైన, నన్ను దరిఁ జేరుపుము భవార్ణవమునుండి
గతులు గలిగించి మొదట దుర్గతులఁ జిక్కి, వగచుచుండెడిమత్పితృవర్గమునకు.

వ. అని ప్రార్థించి యర్ఘ్యంబు నొసంగి యాదినం బెల్ల హరినామసంకీర్తనస్తోత్ర
నృత్యగీతాదులచేతను జాగరంబుచేతను గడపి మఱునాఁడు గోభూవస్త్ర

హిరణ్యాదిదానంబులచేతను షడ్రసోపేతభోజనంబుచేతను గురువును సంతోష పఱచి తాను భుజింపవలయు. 790

క. ఈవిధిచే నుస్మిలని, గావించినవాఁడు కోటికల్పశతంబుల్
గోవిందునిమందిరమునఁ, దావుకొని వసించు దేవతలు గొలువంగన్. 791

గీ. అనుటయును నారదుం డిట్టు లనియె దేవ, పక్షవర్ధినిమహిమ మపార మనుచుఁ
దెలుపుచుంటి వెట్లబ్బానితీరు నాకు,వినఁ గలదు వేడ్క సెలవిమ్ము విశదముగను.

—: పక్షవర్ధనీమాహాత్మ్యకథనము :—

గీ. అనుటయు మహేశ్వరుం డిట్టు లనియెఁ బక్ష,వర్ధిని యటంచు ద్వాదశి వాసికెక్కెఁ
బూర్ణముగ నున్న యెడలను బౌర్ణమాసి,కాని లేక యమావాస్య గాని యనఘ.

వ. అమ్మహాతిథియందుఁ జేయువ్రతంబువలన నశ్వమేధాయుతఫలంబును జాగరంబు వలనఁ బంచాగ్నిసాధనపుణ్యంబును దీర్థయాత్రాసుకృతంబును దశజన్మంబుల వఱకును గృహాముసంకు నిత్యోత్సవంబులును నుపవాసంబువలన బ్రహ్మ హాత్యాదికోటిపాతకప్రశమనంబునుం జేకూరు. 794

క. వినిచెదను దద్వ్రతంబును, విను మయ్యది సకలపాపవిచ్ఛేదంబున్
బొనరించి విష్ణుపదమున, నునుచు నపాయంబు లేక యుండెడిరీతిన్. 795

వ. అవ్రణపంచరత్నసమేతంబును జలపూర్ణంబును గంధమాల్యాలంకృతంబును నగునొక్కకుంభంబుమీఁద గోధూమపూరితం బగునొకతామ్రపాత్రంబు నునిచి దానిపైనిఁ బంచామృతాభిషిక్తంబును దన్నామనామాభిహితంబును నగుసువర్ణ విష్ణుప్రతిమను స్థాపించి కుంకుమాగురుచందనాదు లలంది వస్త్రయుగ్మంబు కట్టి ఛత్త్రోపానహంబులు ధరియింపం జేసి పద్మనాభునిపాదంబులును విశ్వమూర్తి జానువులును జ్ఞానగమ్యునియూరువులును జ్ఞానప్రదునికటియును విశ్వనాథుని యుదరంబును శ్రీధరునిహృదయంబును గౌస్తుభకంఠునికంఠంబును క్షత్రాంతకారిబాహువులును వ్యోమమస్తకునిలలాటంబును సర్వరూపిశిరంబును మాసనాముని శస్త్రంబులును దివ్యరూపునిసర్వాంగంబులును యథావిధిగఁ బూజించి ధూపదీపనైవేద్యతాంబూలాదు లర్పించి. 796

గీ. నిఖిలలోకైకకర్తవు నీవె నీవె, నిఖిలలోకైకభర్తవు నీరజాక్ష
యుద్ధరింపకయున్న నీ వొండు దిక్కు, కలదె భవవార్ధిలోఁ బడి కలఁగునాకు.

క. అని ప్రార్థించి యొసంగన్, జను శౌరికి నారికేళజలమున నర్ఘ్యం
బును వ్రతపరిపూర్ణత్వం, బెనయుటకై భక్తితోడ నెవ్వం డైనన్. 798

వ. అటుమీఁద జాగరోపవాసంబులచే నాదినం బెల్లఁ గడపి గురువునకు విష్ణుప్రతి మాసహితం బగుకుంభంబు నొసంగి వస్త్రాలంకారాదులచేఁ బూజ గావింపవలయు.

క. ఈరీతి నంబరీషుఁడు, భారద్వాజుండును బ్రభువుండుఁ బలువురంది సదా
చారులును జేసి వ్రతమును, గోరినభాగ్యములఁ బొంది కొనిరి మునీంద్రా. 800

గీ. అనుటయును నారదుండను మహానుభావ, విష్ణుజాగరమహిమంబు వేడ్క గలిగెఁ
జెప్పు మొక సారి దయతోడ సేవకునకు, ననుచు బ్రహ్మ నిటులను నిట్టులనియె శూలి,

—: జాగరమహాత్మ్యకథనము :—

సీ. కృష్ణునినామముల్ కీర్తించుచును నోట, ధ్యానించుచును బానవారి నెదను
నాట్యంబు చేయుచు నారాయణునిముందు, నెసరించుచును మాధవునకు నతులు
కేశవునకుఁ బ్రదక్షిణములు సలుపుచు, నుతియించుచును సంసునోదునికథలు
కాంచనాంబరుసెఁ బూజించుచుఁ బాలచే, విష్ణునకు నొసఁగు న్నైవేద్యములను

గీ. స్వాప మనియెడిమాయకు నస్లు గాక, హరిదినంబున జాగర మాచరించు
నట్టిపుణ్యాత్ము లుందురు విభయ మైన, విష్ణుపదమును బునరావృత్తు లగుచు.

ఆ. నిమిషమేని లేక నిమిషార్థమేనియు, హరిని బేడుకొనుచు నాచరించు
జాగరంబువలన సమకూరుపుణ్యముఁ, బరిగణింపలేఁడు బ్రహ్మ యైన. 803

గీ. హరికి నారాత్రికము యామయామమునను, జలుపుచును జాగరంబును జలిపెనేని
దాని కెన గావు వాజిమేధములు వేయి, యైనఁ బదివేలు వాజపేయంబు లైన.

గీ. వేదశాస్త్రపురాణాదివేత్త యైన, యజ్ఞములు వేయి చేసినయజ్వ యైన
విష్ణుదినజాగరంబు గావించువాని, నపహసించినఁ జండాలుఁ డయి జనించు.

గీ. విష్ణుదినజాగరంబు గావింపుఁ డనుచు, మానవులకుఁ బ్రబోధించుమానవుండు
చెందు నైకుంఠధామంబునందు నిత్య, వాసభాగ్యంబు స్వామితో దేవతలతోడ.

గీ. కోటిజన్మంబులను సమకూడినట్టి, పాతకము లెల్ల నేకరాత్రిభాగమంద
నాశమును జెందు విష్ణుదినంబునందు, శ్రద్ధతో జాగరంబును జలిపెనేని. 807

గీ. శాశ్వతము లైనలోకముల్ సంపదలును, బుత్రపౌత్రాదులును దివ్యభోగములును
ఖ్యాతియును నీతియును జెంద నెంచు రెయున్న, విష్ణుదినజాగరంబు గావింపవలయు.

గీ. హరిదినంబున జాగర మాచరింప, వలయు ననియెడిబుద్ధి యెవ్వనికి లేదొ
వాని కధికార మిసుమంత యేని లేదు, విష్ణుదేవునిపూజ గావించుటకును. 809

క. అరుగునొ యెన్నిపదంబులు, హరిధామంబునకు జాగరార్థము చెందుర్
నరుఁ డన్నియశ్వమేధా, ధ్వరములు గావించినట్టిఫల మొందయుసుర్. 810

ఆ. పడునొ ధాత్రి నెన్నిపదరేణువులు జాగ, రార్థ మచ్యుతాలయమున కరుగు
నవసరమున నన్నియబ్దసహస్రము, లుండు నరుఁడు త్రిదశు లుండుచోట. 811

వ. పరాపవాదసంయుతంబును మనఃప్రసాదవర్జితంబును శాస్త్రహీనంబును నగాంధ
ర్వంబును దీపవర్జితంబును నుపచారశూన్యంబును నుదాసీనంబును సనిందనం
బును గలియుక్తంబును నగు నవవిధజాగరం బధమంబు. సశాస్త్రంబును నృత్య

యుక్తంబును గాంధర్వసమేతంబును వాద్యయుతంబును దాళసంయుక్తంబును గీపయుతంబును మధురసంయుక్తంబును భక్తిభావితోచ్చారణయుక్తంబును బ్రసన్నంబును దుష్టిజననంబును నమూఢంబును లోకరంజనంబును నగుద్వాదశవిధ జాగరంబు మాధవప్రియంబు. 812

గీ. ఉభయపక్షంబులందును నుక్తవిధిని,జాగరము చేయువాఁడు నాసన్నిహితుఁడు విష్ణుదినజాగరంబు గావింపనట్టి, వాఁడు నాకును భక్తుఁడు గాఁడు చూవె. 813

ఆ. నాకుఁ బూజ్యుఁడైననారాయణునిఁ గొల్వ,నట్టివాఁడు భక్తుఁ డగును నాకు నాచరించుఁగాక యఖిలవ్రతంబులు, చేయుఁగాక తీర్థసేవ లెల్ల. 814

క. హరభక్తుఁడ నే ననియెడి, గరువంబున నెవఁడు గన్నుగానక హరివా సరమున భుజియించునో యా, నరుఁ డొనరిచినట్టివాఁడ నాకప్రియముల్. 815

గీ. ఎన్నిదినంబులు శ్రీపతి, సన్నిధిలోఁ జేయునరొ ప్రజాగరమును దా మన్నియుగంబులు నిలుతురు, పన్నగశయనునినివాసభవనమునందున్. 816

క. హరిదివసజాగరమునకు, సరి గా వెన్నఁడును నదులు సాగరములు పుష్కరమును గాశియు గయయును, సరస్సులును దీర్థములును సంయమివర్యా.

ఆ. విద్ధమైనయట్టివిష్ణువాసరమున, యందు వ్రతము చేయునట్టివాఁడు స్వపితృదేవతలను సంహరించినవాఁడ, రాజ్య మిడినవాఁడ-రక్కసులకు. 818

గీ. కాన హరివాసరంబున మానవుండు, జాగరోపోషణంబులు సలిపి పిదప హరికిఁ బ్రీతికరంబుగా నాచరింప, వలయుఁ బారణ వ్రతపూర్తి గలుగునట్లు.

—: ద్వాదశీమాహాత్మ్యకథనము:—

గీ. అనుటయును నారదుం డిట్టు లనియె దేవ, ద్వాదశీమహిమంబును దద్విధియును నాలకింపఁగఁ గౌతుకం బంకురించె, నానతీయుము దయ గలదేని నీకు. 820

చ. అనుటయుఁ జంద్రమౌళి యిటు లమ్మునికిన్ వచియించె ద్వాదశీ దినమున నిత్యకర్మములు దీరిచి పూర్వదినవ్రతంబు న ప్పన మొనరించి శ్రీపతికిఁ బారణముం జనుఁ జేయ దానిచే తను సకలార్థసిద్ధులును దద్వ్రతకర్తకు సంఘటిల్లెడిన్. 821

గీ. లేశమేనియు ద్వాదశి లేనినాఁడు, పారణ మొనర్పరా దట్టిపక్షమందుఁ జేయనగుఁ బారణంబును రేయియందు, ద్వాదశి యొకించుకే నుండవలయుఁ గాను.

గీ. స్నానమును భోజనంబును జలుపఁగూడ, దనునిషేధము నడిరేయి కగును గాని యంత్యమునునాద్యమునునైనయామములకుఁ,గాదుదినషట్లతగునవికర్మములకు.

గీ. పారణదినంబునందు స్వల్పముగ నుండె, నేని ద్వాదశి ప్రాతరాహ్నికము చేసి యపుడె మాధ్యాహ్నికముగూడ నగును జేయ,నది నిషిద్ధంబుగా దట్టియవసరమున.

గీ. సాధకుం డగువానికి సంఘటిల్లు, సకలపురుషార్థములును నిస్సంశయముగ

సముఁడు కనరాఁడు ద్వాదశీసాధకునకు, ద్వాదశికి సాటియైనవ్రతంబు లేదు.
గీ. కలుగనేరదు ధర్మార్థకామమోక్ష, వర్గమం దేదియును మహాగ్వరము లెన్ని
సలిపినను నొక్కద్వాదశీజాగరంబు, సలుప కుంకినయెడలను సంయమీంద్ర.
క. ఒనరించినయెడ జాగర, మును సాలగ్రామశిలపు ముంగల వాఁడొం
దును దీర్ఘకోటులందును, మునిఁగినపుణ్యంబు యామయామును యామంబుల్. 828
వ. ద్వాదశి జయ యనియు విజయ యనియు జయంతి యనియును పాపనాశని యనియును నాలుగు విధంబులుగా నుండు. పునర్వసునక్షత్రయుక్త మగు శుక్లపక్షద్వాదశి జయ యని చెప్పంబడియె. ఆద్యుద్యాదివసంబునఁ గావించునుపవాసంబు సకలపాపంబుల నపహరించు. శ్రవణనక్షత్రయుక్తం బగుశుక్లద్వాదశి విజయ యని చెప్పంబడియె. విజయయందుఁ గావించుదానంబు సహస్రగుణఫలప్రదంబు. మఱియును విప్రభోజనంబును హోమంబును నుపవాసంబును సహస్రగుణాధికఫలప్రదంబు. ప్రాజాపత్యనక్షత్రయుక్తం బగుశుక్లద్వాదశి జయంతి యని చెప్పంబడియె. 829
ఆ. ఆజయంతియందు నాచరించెనేని, సకలసుపూజ సప్తజన్మపాప
కర్దమంబు నెల్లఁ గడుగును లసమేని, మిగులకుండ మారలఁ దగులకుండ. 830
వ. పుష్యనక్షత్రయుక్త మగుశుక్లద్వాదశి పాపనాశని యని చెప్పంబడియె. పాపనాశనియందుఁ జేయునుపవాసంబు సంవత్సరంబువఱకును బ్రతిదినంబును గావించుతిలప్రస్థదానంబుతోడ సమానంబుగావున దానివలన సర్వేశ్వరుం డగు జనార్దనుండు సంతసించి ప్రత్యక్షం బయి యనంతఫలంబు నొసంగు. 831
గీ. గాధిసూనుమకరధ్వజసాగరులు పాప, నాశనీదివసమున నొనర్చి వ్రతము
చెంది రఖిలార్థములు మున్ను చేసినట్టి, వ్రతమునను దుష్టి నొందుటవలన శౌరి.
ఆ. ఉపవసించెనేని యొకపాపనాశని, నదియె చాలు వేయిహరిదినంబు
లందు నుపవసించి యార్జించుకొనినంత, ఫలము నొంద వేయి పలుకు లేల.
గీ. స్నానహోమంబులును దపోదానములును
జపము స్వాధ్యాయదేవతార్చనలు కొంచె
మేనియును పాపనాశనిలోనఁ జేయ
నక్షయఫలంబు గా నుండ నదియె చాలు. 834
క. అనిచెప్పుటయును నారద, మునివరుఁ డత్యంతహర్షమును జెంది జగం
బునకుఁ దనవిన్నధర్మము, లను బోధించెడి కుతూహలమునఁ జనియెన్. 835

—: విష్ణుపాదోదకమాహాత్మ్యకథనము :—

గీ. అనుటయును శౌనకుం డిట్టు లనియె సూత, హర్షమొదవెను నీచెప్పినట్టిపుణ్య
కథల చేఁ గాని మఱియొకకాంక్ష వొడమె, హరిపదాంబుమహాత్మ్యము నాలకింప

చ. అనవుడు నాతఁ డిట్లనియె నచ్యుతపాదపయఃకణంబు మో
ట్టిన నఖిలాఘనాశము ఘటిల్లుటె కాక యకాలమృత్యువుల్
గనమియు నెట్టిజాడ్యమును గల్గమియుల్ సమకూడి గంగలో
మునుఁగుటచే లభించుఫలముల్ గొనుభాగ్యము ప్రాప్తమయ్యెడిన్. 837

గీ. దానవారిపదోదకపానమునను, బాయు నంతర్బహిస్స్థితపాప మెల్ల
నది గనుంగొని వరియించు నాక్షణంబ,ముక్తపాత్రుఁ డగువాని ముక్తికాంత.

క. తులసీదళయుక్తం బగు, జలజాక్షపదోదకంబు చల్లుకొనినచోఁ
దలపైని నదియె చాలును, నిలుపఁగ హరిమందిరమున నిరపాయముగన్. 839

సీ. స్వర్ణాద్రితుల్యసువర్ణదానము చేయ, నద్దాన లభియించునట్టిఫలము
ధేనుకోటిసహస్రదానంబు గావింప, నద్దానఁ బ్రాప్తించునట్టిఫలము
సప్తతంతుసహస్రశతకోటు లొనరింప, నద్దానఁ జేకూరునట్టిఫలము
కన్యకాకోటిలక్షప్రదాన మొనర్ప, నద్దానఁ బ్రభవించునట్టిఫలము

గీ. నఖిలవిశ్వంభరాదాన మాచరింప, నమ్మహాకార్యమునఁ గల్గునట్టిఫలము
శార్ఙ్గిపాదోదకస్పర్శజనిత మైన, ఫలమునకుఁ గ్రిందె చూవె యెప్పటికిఁ గూడ.

సీ. మున్ను త్రేతాయుగంబున సుదర్శనుఁ డను,నొక్కబ్రాహ్మణుఁ డుండె నుర్విలోన
నతఁడు కుక్షింభరి యయి భుజించుచు విష్ణు, వాసరంబులలోన దోస మనక
వ్రతకర్త లగునట్టివారలఁ దిట్టుచు, నొకనాఁడు నిధనంబు నొందెఁ గడకు
నంతట యమదూత లరుదెంచి వానిని, గట్టి పాశములచేఁ గదలకుండ

గీ. యమునికడకీడ్చుకొనిపోయియతని యెదుట,నిలుపుటయు వానినీక్షించినిర్దయముగఁ
బండ్లుపటపటఁగొఱుకుచుభయము పుట్ట, యముఁడుతనభృత్యులకునిట్టులానతిచ్చె.

గీ. విష్ణుదినమున భుజియించె వీఁడు వీని, కంటెఁ బాపాత్ముఁ డెవఁడును గానరాఁడు
గాన మన్వంతరశతంబు గడచుదాఁక, ఘోరనరకంబులను వీనిఁ గూల్పవలయు.

క. అనవుడు యమభటు లాతనిఁ, గొనిపోయి క్రిమిప్రపూర్ణకూపంబులలో
మునిఁగించుచుఁ గాలుచుచును, ననలాయఃపిండములను హతమార్చుచున్.

క. యమనిర్ణీతం బగుకా, లము దాఁటెడివఱకు బాధలను బెట్టి కఠో
రముగను బిమ్మట విడిచిరి, తమయంతటఁ దామ యాసుదర్శనుఁ డంతన్. 844

గీ. ధరణి కేతెంచి గ్రామసూకరవధూటి
గర్భమునఁ బుట్టి తిన రానిగడ్డి యెల్లఁ
గుడుచుచును నెట్లొ జీవించి కొన్నియేండ్లు
కడకు మృతి నొంది జనియించెఁ గాకి యగుచు. 845

గీ. అట్లు జన్మించి కాకిగా నాద్విజుండు, కష్టముల నొందుచును నేండ్లు గడపి కొన్ని
దైవికంబుగ నొకనాఁడు దారివట్టి, పోవుచును నచ్యుతాలయంబునను నిలిచి.

గీ. దాహ మడఁగుటయును గానుగమాత్రంబునందునే, వెలికి వచ్చుడీ హరిపాదజలము ద్రాప్తి
యెగిరిపో మొదుతటి నొక యెఱుకఁ గలుగుఁ, గోలచే దాని నిలమీఁదఁ గూల నేసె.

గీ. కూలి యాకాకి గిలగిలఁ గొట్టుకొనుచు, విడిచెఁ బ్రాణములను సంగవిస్ఫుటులు
దాని నెక్కించుకొని వ్యోమయానమందుఁ, దరలిపోయిరి వైకుంఠధామమునకు.

క. కావున హరిపాదాంబుని, షేవణమహిమం బొకింత చెప్పితి నింకన్
భావించుకొనుము దాసిప్రభావం బంతయును సాధ్యపడదు వచింపన్. 849

క. అనుటయును శౌనకుం డి, ట్లనియె నగమ్యాగమనమహాదోషము చే
సినవాని కెట్లు శుద్ధిం, గనఁ గలుగును చెప్పుము సూత కారుణ్యమునన్. 850

క. అనవుడు శౌనకునకు ని, ట్లనియెను సూతుండు మునిజనాగ్రణి లోకం
బును నుద్ధరింప నీచే, సినప్రశ్నంబునకు బదులు చెప్పెద వినుమా. 851

—: అగమ్యాగమన ప్రాయశ్చిత్త నిరూపణము :—

వ. అజ్ఞానంబున నొక్కపరి చాండాలీగమనంబు చేసె నేని బ్రాహ్మణుండు సశిఖంబుగా వపనంబు చేయించుకొని ప్రాజాపత్యవ్రతంబును ద్రిదినోపవాసంబును నాచరించి బ్రాహ్మణునకు దక్షిణాసహితం బగుగోద్వయంబు నర్పించెనేని శుద్ధుం డగు. క్షత్త్రియుండు గాని వైశ్యుండు గాని కృచ్ఛ్రసమేతం బగుప్రాజాపత్యవ్రతం బొనరించి గోమిథునద్వయంబు బ్రాహ్మణున కొసంగెనేని శుద్ధుం డగు. శూద్రుండు ప్రాజాపత్యవ్రత మాచరించి గోమిథునచతుష్టయంబు విప్రున కొసంగెనేని శుద్ధుం డగు. తల్లిని గాని సోదరిని గాని పుత్త్రికను గాని కోడలిని గాని పొందెనేని కృచ్ఛ్రత్రయంబును జాంద్రాయణత్రయంబును గావించి గోమిథునత్రయంబు బ్రాహ్మణున కొసంగి సశిఖంబుగా వపనంబు గావించుకొని పంచగవ్యప్రాశనంబు చేసి యగ్నిదగ్ధుం డయ్యెనేని శుద్ధుం డగు. పితృదారను గాని మాతృభగినిని గాని గురుపత్నిని గాని మాతులానిని గాని భ్రాతృభార్యను గాని స్వగోత్రజను గాని పొందెనేని ప్రాజాపత్యద్వయంబును జాంద్రాయణత్రయంబును నాచరించి దక్షిణాయుతంబుగాఁ బంచగోమిథునంబులను బ్రాహ్మణుల కర్పించెనేని శుద్ధుం డగు. గోవును బొందెనేని యుపవాసత్రయంబు చేసి ధేనుదానంబును నన్నదానంబును జేసి శుద్ధుం డగు. వేశ్యాఖరీసూకరీవానరీమహిషులలో దేని నైనఁ బొందెనేని కంఠదఘ్నం బగుగోమయోదకకర్దమంబునందు నిరాహారంబుగాఁ ద్రిరాత్రంబు లుండి పిదప సశిఖంబుగా వపనంబు గావించుకొని మూఁడుదినంబు లుపవసించి యేకరాత్రంబు జలంబునం దుండెనేని శుద్ధుం డగు. బ్రాహ్మణిని బొందెనేని ప్రాజాపత్యత్రయంబును జాంద్రాయణత్రయంబును గావించి బ్రాహ్మణునకు గోత్రయంబు నొసంగెనేని శుద్ధుం డగు. బ్రాహ్మణి పంచరాత్రంబులు పంచగవ్యంబుం బుచ్చుకొని దక్షిణా

సహితంబుగా గోద్వయంబు బ్రాహ్మణులకొసంగనేని శుద్ధురాలగు. పరాంగనను బొందెనేని సాంతపనకృచ్ఛ్రంబు నాచరించి శుద్ధుం డగు. మోహవశంబున స్వబంధువులను విడనాడి పరపురుషునితోడ గృహంబునుండి వెడలిపోయిన యింతి కులభ్రష్ట గావున మరల దత్సమాగమంబు సేయఁదగదు. మోహవశంబున సతివ పరపురుషుని బొందెనేని ప్రాజాపత్యకృచ్ఛ్రంబు నాచరించి పంచగవ్య ప్రాశనంబు గావించి గోద్వయంబును బ్రాహ్మణుల కిచ్చెనేని శుద్ధురాలగు. వర్ణబాహ్య యగుస్త్రీ చాంగనను బొందెనేని కృచ్ఛ్రప్రాజాపత్యంబులవలన శుద్ధుం డగు. ౮౫౫

గీ. పడఁతి జారునివలన గర్భమును దాల్చెనేని దాని మొగంబును గాన రాదు
గాన విడనాడవలయును దానివలనఁ, గలుగ దేదోషమును త్యాగకారకునకు.

—: అభక్ష్యభక్షణప్రాయశ్చిత్తకథనము :—

గీ. అనుటయును శౌనకుం డిట్లనియె సూతా, సలిపెనేని యభక్ష్యభక్షణము దాని
వలనఁ గలిగెడిదోషంబు తొలఁగి శుద్ధియొదవుటకు మార్గమును జెప్పు ముండెనేని.

క. అనుటయు సూతుం డిట్లని, యెను మానివరేణ్య వినుతు నెఱిఁగినయంశం
బును వినుము ధర్మమును వినఁ, గను గోరికి పుట్టుఁ బుణ్యకర్ముల కెంతకే.

వ. అజ్ఞానంబువలన విణ్మూత్రప్రాశనంబును సురాస్పర్శంబును గావించెనేని తీర్థాభిగమనంబును నేకాదశవృషదానంబును గావించి సశిఖవపనంబు చేసికొని ప్రాజాపత్యవ్రతంబు నాచరించి గోద్వయదానంబు సలిపి పంచగవ్యప్రాశనంబు చేసి బ్రాహ్మణుల కన్నదానంబు గావించెనేని శుద్ధుం డగు. చండాలాన్నజలంబులు తెలిసి యాపద్ధర్మంబుగా నొక్కపరి స్వీకరించెనేని కృచ్ఛ్రచాంద్రాయణంబు గావించి సశిఖవపనంబు గావించికొని పంచగవ్యప్రాశనంబు చేసి నాలుగుగోవులను బ్రాహ్మణుల కొసంగవలయు. వృషలాన్నజలంబులు గాని సూతకాన్నజలంబులు గాని శూద్రోచ్ఛిష్టంబు గాని విప్రక్షత్రియుండు దెలిసి యొక్కపరి స్వీకరించెనేని ప్రాజాపత్యద్వయంబును చాంద్రాయణత్రయంబును నాచరించి గోద్వయంబు నొసంగి పంచగవ్యంబుం ద్రావి యగ్నియందు హోమంబు గావించి బ్రాహ్మణులకు నన్నదానంబు చేసెనేని శుద్ధుం డగు. ఆఖునకులమార్జాలంబులు భక్షించినయన్నంబు తిలదర్భోదకంబులచేఁ బ్రోక్షింపఁబడెనేని శుద్ధం బగు. పలాండువును లశునంబును శిగ్రువును నలాబువును గృంజనంబును బలంబును భక్షించెనేని చాంద్రాయణవ్రతంబున శుద్ధుం డగు. 856

గీ. చేయుచును మద్యమాంసనిషేవణంబు, నీచకర్మానువర్తనులై చరించు
నట్టివారల నెల్ల నంత్యజులఁబోలెఁ, దగును దూరీకరింపంగ ధర్మవిదులు. 857

సీ. విడిచి మాంసంబు మద్యము ద్విజులసేవ
చేయుచును నిజధర్మానుశీలనంబు
గలిగి యుండెడిశూద్రుఁ డేకాలమునను
దగఁడు విడువ జఘన్యజో త్తముఁడు వాఁడు. 858

వ. తెలియక సూతకమృతకాన్నంబును భుజియించెనేని యయుతగాయత్రీజపంబున బ్రాహ్మణక్షత్రియులును బంచసహస్రగాయత్రీజపంబున వైశ్యుండును బంచగవ్యప్రాశనంబున శూద్రుండును శుద్ధిం జెందు. నీచునిభాండంబునం దుండు దధ్యాజ్యసలిలంబులు తెలియక త్రావినను బ్రాజాపత్యవ్రతంబు నాచరించి బహుదానంబు గావించి సశిఖంబుగా వపనంబు గావించికొని యహోరాత్రోపవాసంబు చేసెనేని శుద్ధుం డగు. శూద్రునకు దానంబు దక్క నుపవాసంబు విహితంబు గాదు. నీచులచే దండాదితాడితుం డగునరుండు ప్రాజాపత్యవ్రతంబు గాని చాంద్రాయణవ్రతంబు గాని యాచరించి సశిఖంబుగా వపనంబు గావించికొని పంచగవ్యప్రాశనంబు చేసి యగ్నియం దన్నాదిహోమంబు గావించి గోద్వయంబు బ్రాహ్మణున కొసంగెనేని శుద్ధుం డగు. తెలిసి మద్యపానంబు గావించెనేని కులభ్రష్టుం డగు. గోబీజహంతయును దళచ్ఛేదకుండును స్వర్ణస్తేయియుఁ గృచ్ఛ్రప్రాజాపత్యత్రయంబు నాచరించి సశిఖంబుగా వపనంబు గావించుకొని పంచగవ్యప్రాశనంబు గావించి యథావిధిగా నగ్నియందు విహితహోమంబు చేసి ధేనుత్రయంబు బ్రాహ్మణున కొసంగెనేని శుద్ధిం జెంది పంక్తిగ్రాహ్యుం డగు. కూశ్మాండఘాతిని యగుపడంతి మూఁడుదినంబులు పంచగవ్యప్రాశనంబు గావించి సువర్ణవస్త్రసహితంబుగా గూశ్మాండపంచకంబు దానంబు చేసెనేని శుద్ధిం జెంది గ్రాహ్యురా లగు.

—: ప్రాజాపత్యవ్రతలక్షణము :—

వ. మూఁడుదినంబులు ప్రాతఃకాలంబునను మూఁడుదినంబులు సాయంకాలంబునను నయాచితాన్నంబు భుజియించి మూఁడుదినంబు లుపవాస ముండెనేని యది ప్రాజాపత్యవ్రతంబుగాఁ జెప్పంబడియె.

—: సాంతపనకృచ్ఛ్రలక్షణము :—

వ. గోమూత్రంబును గోమయంబును గోక్షీరంబును గోదధియును గోఘృతంబును గుశోదకంబును దినద్వయంబు ద్రావి యేకరాత్ర ముపవసించెనేని యది సాంతపనకృచ్ఛ్రంబుగాఁ జెప్పంబడియె.

—: అతికృచ్ఛ్రవ్రతలక్షణము :—

వ. ఒక్కొక్కయయాచితాన్నగ్రాసంబు ప్రాతస్సాయంకాలములయందు మూఁడు దినంబులు భుజియించి మూఁడు దినంబు లుపవసించెనేని యది యతికృచ్ఛ్రవ్రతంబుగాఁ జెప్పంబడియె.

—: తప్తకృచ్ఛ్రలక్షణము :—

వ. సకృత్స్నానంబు గావించుచు మూఁడు దినంబు లుష్ణోదకంబును మూఁడు దినంబులు గోక్షీరంబును మూఁడు దినంబులు గోఘృతంబును ద్రావి యుండెనేని యది తప్తకృచ్ఛ్రంబుగాఁ జెప్పంబడియె.

—: పరాకకృచ్ఛ్రలక్షణము :—

వ. పంద్రెండుదినంబు లభోజనంబుగా నుండెనేని యది పరాకకృచ్ఛ్రంబుగాఁ జెప్పంబడియె.

—: చాంద్రాయణవ్రతలక్షణము :—

వ. ప్రతిదినంబును నొక్కొక్కగ్రాసంబు శుక్లపక్షంబున హెచ్చించుచును గృష్ణపక్షంబునఁ దగ్గించుచును భుజియించి యమావాస్యనాఁ డుపవసించెనేని యది చాంద్రాయణవ్రతంబుగాఁ జెప్పంబడియె.

—: శిశుచాంద్రాయణవ్రతలక్షణము :—

వ. ప్రాతఃకాలంబున నాలుగుగ్రాసంబులును సాయంకాలంబున నాలుగుగ్రాసంబులును భుజియించియుండెనేని యది శిశుచాంద్రాయణవ్రతంబుగాఁ జెప్పంబడియె.

క. అనుటయు శౌనకుఁ డిట్లని, వెను దులసీమహిమ మేమొ యించుక సూతా
మునివల్లభ యెఱిఁగింపుము, వినుటకు నభిలాష ముద్భవించెను మదిలోన్. 860

—: తులసీమాహాత్మ్యము :—

క. అనవుడు సూతుఁడు మునికి, ట్లనియెను మునినాథ తులసియంతికమున నుం
డినగృహము పుణ్యతీర్థం, బనఁబడు యమభటులు చేర రాగృహమునకున్.

క. మునివర తులసీరోపణ, మును దులసీపాలకత్వమును దులసీద
ర్శనమును దులసీస్పర్శం, బును దులసీపూజనమును మోక్షము నొసఁగున్.

వ. ఈవిషయంబున మున్ను వ్యాసునిఁ దనశిష్యు లడుగ వారల కమ్మునీంద్రుం
డిట్లనియె. 863

ఆ. ఛాత్రులార మున్ను స్కాందమందు శర్వాని, నడుగ నన్ను మీర లడిగినట్ల
యష్టమూర్తి యిట్టు లనియెను బుత్రవా, త్సల్యమునను గ్రౌంచదారణునకు.

ఆ. పుత్ర సకలవృక్షములలోనఁ దులసియొ, క్కటియె పూజ్యమైనత్రోరుహంబు
దానిపత్త్రములును దానిపుష్పములును, బ్రాణసమము లగుట నచ్యుతునకు.

ఆ. మును సమస్తలోకములను నుద్ధరింపంగఁ, దలఁచి [illegible] యులను మొలసి నాఁటి
సర్వపుణ్యములును సంప్రతిష్ఠితము లై, [illegible] నొక్క తులసియందు.

గీ. దాసవారికిఁ బ్రియపదార్థములు [illegible]
లక్ష్మియును నేనుఁ బొలసియు [illegible]
విడిచి తులసీదళంబును వేయుపసిఁడి
పూలఁ బూజించినను దృప్తిఁ బొందఁ [illegible]. 867

సీ. తులసీదళంబుచే జలజాక్షునకుఁ బూజ, సలిపిన యది జన్మజన్మమునను
వేదశాస్త్రపురాణవిజ్ఞానమును శుద్ధ, సంతోషమును సద్గ్రసమును
యజ్ఞదానవ్రతాద్యాచరణఫలంబు, [illegible] సుఖము
ధనధాన్యసంపత్తియును శరీరారోగ్య, మును [illegible] లోకపూజ్యతయును

గీ. గలుగుటయె కాక కలుగును గట్టకడకు, జన్మరాహిత్యము హరిప్రసాదమునను
సమరసని [illegible] స్వర్గమందుఁ దులసి,ధరణి [illegible] పావనత్వమును గొలుప.

క. తులసీదళమిశ్రిత మగు, సలిలంబున సంతసంబు [illegible] గంగా
సలిలామృతాభిషేకం, బులనలనను [illegible] వతాన. 869

క. ఎవనికి విష్ణుపు సమ్ముఖుఁ, డెవ్వనికి యతిని కొదవు శ్రద్ధ యుద్భింపఁగ మా
ధవునిఁ దులసీదళంబుల, భవభవమున నతఁడె ముక్తిఁ బడయును దుదకున్.

క. ఇల నెవరు మంజరీయుత, తులసీదళములను నచ్యుతుసు కర్చనముల్
జలుపుదురో వారి శ్రేయః, ఫలముఁ దెలుప నలవి గాదు బ్రహ్మాస కైనన్. 871

క. తులసీవన మెచట నుండునొ, జలజాక్షుం డుండు నచట జలజాలయతో
జలజాక్షుని భార్గవియును, గలచోట వసించు సునిశికాయం బెల్లన్. 872

క. తులసీసాన్నిధ్యంబునఁ, జలిపిన వ్రతములును దపము జపమును జెంద
గలుగు ననంతఫలంబును, విలసిల్లుచునుంట [illegible] లచటన్. 873

గీ. మస్తకంబున విష్ణునిర్మాల్యతులసిఁ, దాల్చువాఁడును శిఖయందుఁ దాల్చి తులసి
మరణ మొందినవాఁడును హరిపురంబు, నందు శాశ్వతముగ నుండునట్టివారు.

గీ. భువిని గేవలమాధవపూజకొఱకు, నాఁటినట్టి యెవంశు తులసీవనంబు నతఁడు
గర్భవాసవిషాదంబు గలుగకుండ, నుండు సతతంబు గోవిందుఁ డుండుచోట.

వ. తులసీపత్రిపుష్పఫలశాఖాస్కంధత్వఙ్మూలంబులును [illegible] మృత్తికయును
బరమపావనంబులు. 876

క. తులసీకాష్ఠోపగత, జ్వలనంబున మృతుల దేహసంస్కారంబుల్
జలిపెడివారును మృతులును, వెలయుచు నుందురు సతంబు విష్ణుపురమునన్. 877

క. మరణసమయమున విష్ణు, స్మరణము శ్వాసానిలంబు చనఁగనె తులసీ
తరుకాష్ఠదహనమును నె, వ్వరికొదవునొ విష్ణునగరవాసులు వారల్. 878

క. దారువులలోనఁ దులసీ, దారు వొకండేని యుంచి దాస దహనసం
స్కారము చేసిన మృతు లగు, వారలపాతకము లెల్ల వారితము లగున్. 879

క. దారువు లేయువి తులసీ, దారువిమిశ్రితము లగునో తగ నవి గంగా
నీరముతో మిశ్రిత మగు, నీరముచందమునఁ బుణ్యనిలయంబు లగున్. 880

గీ. ఎవని చితి తులసీకాష్ఠనివహమునను, బ్రజ్వరిల్లునో యాతనిపాతకాద్రు
లన్నియును భస్మమై కూలు నాక్షణంబ, దహనమునఁ బడ్డశలభసంతతులువోలె.

క. తులసీకాష్ఠజ్వలన, జ్వలితుం డగువానిఁ జూచి శమనభటులు దూ
తొలి పఱచుచుండ హరిభృ, త్యులు గైకొని వాని నడుగుమరు హరిపురికిన్.

క. తులసీకాష్ఠజ్వలనము, వలనను దహియింపఁబడినవానిపయి సుప
ర్వులు చల్లుదురు సుమంబులు, చలువుడు రచ్చరలు వానిసన్నిధిని నృత్తిన్.

వ. అగ్న్యాగారమం దేనియు శ్మశానంబునం దేనియుఁ దులసీకాష్ఠవహ్ని నాజ్య
ప్రజ్వలితంబు గావించిన సకలపాపంబులును భస్మీభూతంబు లగు. తులసీకాష్ఠ
వహ్నియందు హోమంబు గావించిన నగ్నిష్టోమఫలంబు చేకూరు. తులసీకాష్ఠ
ధూపంబు గోవిందునకు సమర్పించిన శతక్రతువులు గావించినపుణ్యంబు
ప్రాప్తించు. తులసీకాష్ఠాగ్నిపక్వపదార్థంబు హరికి నైవేద్యంబు గావించిన మేరు
తుల్యాన్నదానఫలంబు చేకూరు. తులసీకాష్ఠదీపంబు మాధవున కర్పించిన
దీపలక్షసహస్రప్రదానఫలంబు లభించు. తులసీకాష్ఠచందనంబు విష్ణువున కలందిన
గోవిందసాన్నిధ్యనివాసంబు సమకూరు. తులసీకాష్ఠగంధలిప్తాంగుండై జనార్ద
నునిఁ బూజించెనేని ప్రతిదినంబును గోశతదానంబు గావించినపుణ్యంబు వడయు.
పితృపిండంబులందుఁ దులసీదళంబులు సమర్పించెనేని పితరులు శతాబ్దపరిమిత
సంతృప్తిం జెందుదురు. తులసీమూలమృత్తికాస్నానంబు గావించెనేని సకల
తీర్థస్నానఫలంబు సంఘటిల్లు. నారాయణునకు నవీనతులసీమంజరులచేఁ బూజ
గావించెనేని చంద్రాదిత్యు లుండునంతవఱకును నానాపుష్పములచేఁ బూజ
చేసినఫలంబు చేకూరు. 884

క. తులసీవృక్షము లెవ్వాని, నిలయంబున నుండు వానినిఖిలాఘములున్
విలయంబు నొందు నిత్యముఁ, గలుషఘ్నం బైనతులసిఁ గాంచఁ గలుగుటన్.

గీ. పితరులకుఁ జేయఁబడియెడిపిండదాన, మక్షయం బగుఁ దులసి యున్నట్టిచోటఁ
జలుపునెడఁ దులసీవనచ్ఛాయయందుఁ, దర్పణం బది పితృకులోద్ధారకంబు.

సీ. తులసీదళంబులతోడ మాధవునకు, నర్చన గావించునట్టివారు
తులసీదళంబులతోఁ గూడుకొని యంత, వేళను దేహంబు విడుచువారు
తులసిపూసలపేరు గళదేశమునయందు, నవిరతంబుగఁ దాల్చునట్టివారు
తులసీద్రుకాష్ఠంబువలనఁ దీసినగంధ, మును గాత్రములఁ బూసికొనెడివారు

గీ. తులసీమూలంబునం దుండు జలము వెస, గొని శిరోభాగమునఁ జల్లుకొనెడివారు
తులసినమమను శౌరిని గొలుచువారుఁ, గొనక హరిసన్నిధికిఁ జేరుకొనెడివార,

క. తులసీద్రుమవాగతానిల, ములు సోఁకినఁ దోఁచు పెల్లుఁ బూతంబు లగున్
దులసికిఁ గావించినయెడ, జలసేకము దూపుగూర్పు సకలాఘములన్. 888

క. తులసీద్రుమకాష్ఠమాలను, దిలకించినమాత్రమునను దెసలకు భీతిన్
గలఁగి పరువెత్తి పోదురు, గళితాంతస్స్వాంతులగుచుఁ గాలునిభృత్యుల్. 889

క. తనయు తులసీదళంబున్, జనవస్త్యులఁ ద్వాదశీదినంబునఁ గోయం
జన దళులు చేయుపక్షమున, నను దప్పును ... నరకములోనన్. 890

గీ. మూలమున బ్రహ్మ యగుసు మధ్యమునను హరియు
నేను పంజరియందున నిలిచియుండు
మొప్పుగను గూర్చి మహిమ ...
దానఁ దులసికిఁ బావనత్వంబు గలిగె. 891

వ. హరిహరాలయంబులయందును ... తులసీవనంబు నాఁటినం బునరావృత్తిరహితం బగు పదంబు ప్రాప్తించు. పార్వణావసరశ్రావణసంక్రాంతిదినంబులందుఁ దులసీదోహణంబు వి...ప్రదంబు. 892

క. తులసీమూలగతం బగు, ... సకలాఘములున్
దొలఁగి హరిధామమునకున్, గలుగు ... నైనన్. 893

సీ. మున్ను ద్వాపరయుగంబున ... సేవను ... యవనిసురుఁడు
స్నాతుఁడై యొక్కనాఁ ... వేశ్మమున కరిగె
నంతట నొకకుక్క యచట కేఁగి త్రిమసుద, ద్వారి యందియుఁ ద్రావి వచ్చుచుండ
నసిమర్దనుం డనువ్యాధుఁ డొక్కఁడు దాని, కెమిరుగాఁ జని పొట్టయుదుటు చూచి

గీ. తనగృహంబున నున్న యోదనము నెల్లఁ
దినియె ననుకొని యాగ్రహంబునను గొట్టెఁ
గట్టెచే దానితలమీఁదఁ గఠనముగను
నప్పు డది నేలపైఁ గూలి యసువు లుడిగె. 894

క. అంతన్ యమభటులచటికి, గంతులు వైచుచును వచ్చి కని యాకుక్కన్
స్వాంతంబులందుఁ గనికర, మింతయు లేకుండఁ గట్టి యీడ్చుచు నుండన్.

ఆ. అపుడు విష్ణుదూత లరుదెంచి యచటికిఁ, బాశములను ద్రెంచి బంధ ముడిపి
శునకమును రథంబుపై నుంచి కొనిపోవఁ, గడఁగుచుండ నట్టికాలమందు.

క. యమభటులు చూచి వారిని, సమముగఁ బోరాడి నిలుపఁజాలసి కతనన్
శమము వహించి వినీత, క్రమమున ని ట్లనిరి భక్తి గడలుకొనంగన్. 897

గీ. శౌరిభటులార యీపుక్క సలిపినట్టి, పుణ్య మేమొకొ యొకింత చెప్పుండు మాకు
నేసుకృత మైన లేకున్న యెడల దీని, నాదరింతురె ప్రాజ్ఞు లైనట్టివారు. 898

సీ. అని యడుగుటయు నయ్యమదూతలకు విష్ణు, భృత్యులు నవ్వుచు నిట్టు లనిరి
యీపుక్క మును నొక్క ఋష్యాశ్రమందుగా, నుండి చేసెను దాన ముక్కటముగఁ
గాని తా నొకపరాంగనను హరించిన, కారణంబున నూర్ధ్వగతులు లేక
యమలోకమున కేఁగి యచటఁ జెప్పఁగరాని, యమయాతనల నెల్ల ననుభవించి

గీ. నరకశేషంబుకొఱకు నానాకుయోను, లందు జన్మించి పలుమాఱు లంతమునకు
శునకరూపంబునను బుట్టి చనుచుఁ జనుచుఁ, దులసిమూలంబులో నున్న జలముఁ ద్రావె.

గీ. ఆకతంబున నీపుక్క కబ్బె విష్ణు, ధామమున కేఁగు భాగ్యంబు దానఁ జేసి
వచ్చితిమి మేము విష్ణుసేవకుల మగుటఁ, దీనిఁ గొనిపోవ హరిసన్నిధానమునకు.

గీ. అనుటయును మాఱుమాటాడ కాక్షణంబ, చనిరి వచ్చిన త్రోవనె శమనభటులు
శమనభటు లేఁగినంతనె శార్ఙ్గిపురికిఁ, జనిరి దానిని దోడ్కొని శౌరిభటులు.

గీ. తులసి గలయింటనుండవు మృత్యువులును, భూతములు పాతకంబులు ప్రేతములును
నాపదలును నలక్ష్మియు నశుభములును, జాడ్యములు రోదనంబులు జగడములును.

క. తులసీమహిమముతోడను, విలసిల్లెడి గ్రంథ మున్న వేశ్మంబున వ్యా
ధులు దారిద్ర్యము దుఃఖము, కలహములును నుండ వెట్టికాలమునందున్. 903

క. ఈతులసీమాహాత్మ్యముఁ, బ్రాతఃకాలంబునందుఁ బఠియించినచో
శ్రోతకును వాచకునకును, బాతకము లడంగి విష్ణుపదము లభించున్. 904

గీ. కలుగు వానికగ్నిష్టోమఫలము దీని, నెవ్వఁ డొకసారి చదువునో యెవఁడు పెక్కు
సార్లు చదువునో దీని నాసజ్జనునకు, రాజసూయమహాఫలప్రాప్తి గలుగు. 905

వ. అని వచియించుటయుఁ గార్త్తికేయుం డమందానందకందళితహృదయారవిందుండై దానిమహిమంబున కచ్చెరువడుచు నిజనివాసంబున కరిగె. మఱియును మున్ను దాశరథిప్రముఖులు తులసీవనంబులు నాఁటి వానిం బాలించి సేవించి యభీప్సితార్థసిద్ధిం బడసిరి. 906

క. తులసీమిశ్రితతోయము, తలపైనిం జల్లుకొనెడి ధన్యుఁడు గంగా
సలిలస్నానము చేసిన, ఫలమును జెందంగలండు ప్రతిదివసంబున్. 907

క. తులసీనామము నోటం, బలికినయెడ సర్వవేదపారాయణమున్
జలిపినవానికిఁ గలిగెడి, ఫలమును వాఁ డొంది విష్ణుపదముం జెందున్. 908

క. కలుగ దధర్మంబున మతి, గలుగదు దుర్మరణ మూర్ధ్వగతివిచ్యుతియున్
గలుగదు దుఃఖము గలుగదు, తులసీమహిమంబు వినిన దుష్టున కైనన్. 909

గీ. అనివచించుటయును ఛాత్త్రు లమిత మైన, హర్షమును జెంది చనిరి నా నతనిఁ జూచి
శౌనకుం డిట్టు లనియె మహానుభావ, తెలుపు మేదానమున నెట్టిఫలము గలదొ,

—: నా నా దా న మా హా త్మ్య క థ న ము :—

వ. అని యడుగుటయును సూతుండు శౌనకున కిట్లనియె. 911

గీ. ధాత్రి గోచర్మమాత్రము పాత్రుఁ డైన
బ్రాహ్మణున కిచ్చునేని సర్వపాపముక్తుఁ
డగుచు హరిమందిరమునకు నరుగువాఁడు
తగవు భూదానమును గోటిదానములును. 912

—: గోచర్మమాత్రభూలక్షణము :—

వ. నూఱుగోవులును నొక్కవృషభంబును యంత్రితంబులు గాకుండఁగా నుండు
ప్రదేశంబు గోచర్మమాత్రం బగుధాత్రిగాఁ జెప్పంబడియె. 913

గీ. ఇలను సస్యంబులతో నిచ్చునేని విష్ణు, సదనమునఁ బెంపు సుఖములు పడసి భువిని
సార్వభౌముండునై పుట్టి సకలభోగ, ములననుభవించి గడకొందు ముక్తిపదము.

గీ. భూమి నిచ్చినవాఁడును భూమిఁ గొనిన, యట్టివాఁడును బొందును నమరపురికిఁ
గాన దానశతంబుల నైన నూని, భూమి గ్రహింయింపఁగాఁ దగు భూసురునకు.

క. పుడమిని నజ్ఞానంబున, విడిచినధాత్రీసురుండు వివిధవ్యథలన్
గుడుచును దారిద్ర్యం బను, కడలిం బడి కొట్టుకొనుచుఁ గలకాలంబున్.

క. భూసురునకు భూదానము, చేసిన స్వయముగను బరులచేతను జేయం
జేసినను విష్ణుపదము ని, వాసంబుగ నొందుఁ బాపవంతుఁడు గూడన్. 917

ఆ. ఆత్మదత్తయైన యన్యదత్తం బైన, నైనభూమి నెట్లు యపహరించు
నట్టివాఁడు కూలు నతిదారుణం బగు, నట్టినరకమందు నాస్వయముగ.

గీ. దేవతాబ్రాహ్మణక్షేత్రదేశములను, నపహరించెడిఘోరపాపాత్ములకును
గానఁగా రాదు నిష్కృతి కల్పకోటి, శతసహస్రంబులకు నైన సంయమీంద్ర.

ఆ. అన్యుఁ డిచ్చినట్టియవనిని గాపాడు, నట్టితఁడు చెందు నవనిదాత
కనినపుణ్యయంబుకంటెను గోటిరెట్లధిక మైనపుణ్య మమలచరిత. 919

వ. జలంబునందుఁ బడినతైలబిందువు ప్రసరించినట్లు భూమిదానఫలము జన్మజన్మం
బులందును బ్రాప్తించుచుండు. గోవు క్షీరము నొసంగి దూడను బోషించునట్లు
భూమి యన్నంబు నొసంగి భూదాతను రక్షించుచుండు. భూదానంబు సర్వ
దేవతాసంతుష్టికరంబు. సరస్వతీగోపృథ్వీదానంబు లతిదానంబులుగాఁ జెప్పం
బడియె. జపహోమవ్రతపనంబులవలన నతిదానకర్తలు నరకోద్ధారకు లగు
దురు. భూమిదునికంటెఁ బుణ్యవంతుండును భూహర్తకంటెఁ బాపవంతుండును
లేఁడు. ఆభూతసంప్లవంబును భూదాత స్వర్గంబునందును భూహర్త నరకంబు
నందును నివసించు. అగ్నియపత్యమగు కాంచనంబును విష్ణుసంతానమగుపృథ్వి
యును సూర్యసంతతి యగుగోవును దాతల కనంతపుణ్యఫలంబు నొసంగు. అ

మేధశతంబుఁ జేసినను వాపీకూపసహస్రంబులు త్రవ్వించినను కోటిదానంబు గావించినను భ్రూణహత్య శుద్ధి నొందంజాలఁడు. కన్యానృతంబు పంచపురుషాంతరంబులను గవానృతంబు దశపురుషాంతరంబులను అశ్వానృతంబు శతపురుషాంతరంబులను భూమ్యనృతంబు సహస్రపురుషాంతరంబులను హిరణ్యానృతంబు జాతాజాతులను స్వర్ణానృతంబు సర్వంబును నశింపఁజేయు. బ్రహ్మస్వంబును బ్రహ్మహత్యయును దేవస్వంబును దరిద్రధనంబును గురుమిత్త్రధనంబును గులనాశమ్ము నొనరింపంగావించు. అపాత్రంబునం దుంచిన కాంచనమ్మునంత మధువులు చేసిన శ్లపాత్రమున నిచ్చినదానంబు వ్యర్థం బగు. ధనమునకు దానంబును జీవితంబునకు జీవరక్షణంబును యశైశ్వర్యారోగ్యంబులకు సహింపవలయును ఫలంబు లని బృహస్పతిచేఁ జెప్పంబడియె. 920

సీ. ఉర్వీతలం బెల్ల నొసఁగిన పుణ్యంబుఁ, బొందు గోదానంబు చేసినట్టి
యఖిలపాపవిముక్తిఁ బడయుఁ గైలాసంబు, నొందును వృషభంబు నొసఁగనేని
వంశయుక్తంబుగా స్వర్గంబునకుఁ బోవు, హేమంబు తిలపాత్ర మిచ్చెనేని
చంద్రలోకమునకుఁ జని యమృతము గ్రోలు, నొకయింత రజతంబు నొసఁగనేని

గీ. యిచ్చెనేని ప్రవాళముల్ హీరకములు, మౌక్తికములును గొను స్వర్గమందిరంబు
పొందితీరుఁ జతుర్దశభువనసంప్ర, దానఫలము సాలగ్రామదానమునను. 921

గీ. పొందఁ డొకఁడేనియును దులాపురుషదాన, మొసఁగెనేని పునర్జన్మ ముర్విలోన
వస్త్రదానంబు గావించువాఁడు సతము, స్వర్గమున నుండు దివ్యవస్త్రములుదాల్చి.

సీ. కన్యాప్రదానంబు గావించువాఁ డుండు, శాశ్వతంబుగ బ్రహ్మసదనమందు
నాతపత్రోపానహములు నిచ్చినవాఁడు, శోకంబు లేకుండు నాకమందు
నమృతకల్పఫలంబు లారగించుచు నుండు, స్థిరముగా ఫలదాత త్రిదివమందు
దధిఘృతతక్రదుగ్ధము లొసంగినవాఁడు, నివసించు విష్ణుసాన్నిధ్యమందు

గీ. గంధపుష్పవిభూషితకాయుఁ డగుచుఁ, గ్రాలు సురలోకమునఁ బుష్పగంధదాత
సప్తభువనంబునను బుష్పశయ్యయందు, హాయిగాఁ బవ్వళించు శయ్యాప్రదాత.

గీ. ముసలి దగు ధేనువును జీర్ణవసనకమును, బుష్పవతి యైనకన్యను భూసురునకు
నిచ్చువాఁ డొందు నరకంబు నెట్టిపాప, కర్ముఁడును జెందఁ డందురు ధర్మవిదులు.

గీ. కన్య నమ్మినవానిముఖంబు చూడఁ, గూడ దది యెప్పుడేని చేకూడెనేని
భానుబింబంబుఁ జూచి తత్పాతకంబు, తక్షణమ మాపికొనఁ దగు ధార్మికునకు.

గీ. నాకమునను౦డి యాగమనంబు మరలఁ, గన్యకాదానకర్తకుఁ గాన రాదు
నరకమునను౦డి యాగమనంబు మరలఁ, గన్య నమ్మినవానికిఁ గాన రాదు.

సీ. దీపకాంతులలోన దేదీప్యమానుఁడై, దివమున విలసిల్లు దీపదాత
శార్ఙ్గిసన్నిధి కేఁగి జ్ఞానంబు నార్జించి, యందు మోక్షంబు విద్యాప్రదాత

శివునిమందిరముకఁ జెలువారు చుండును, శోకంబు లేకంత దానదాత
యమరేంద్రుసింహాసనమునందుఁ గూర్చుండు, బ్రహ్మదానఫలము బడసి భూదాత

గీ. యవని నెల్లసుఖంబుల ననుభవించి, స్వర్గమున దేవ [illegible] యనుభవించుఁ
బవ్వళించును దాంబూలభక్షణంబు, సలుపకొను [illegible] దానంబు లసద్రప్రదాత.

క. గతి లేక పరితపించెడి, శ్రీనిధేవుని [illegible] కడ
చ్యుతునిని కేతనమున శా, శ్వతముగ నివసించు [illegible].

గీ. పుస్తకము నెవ్వఁ డిచ్చునో భూసురులకు, [illegible] [illegible] ప్రత్యక్షరమును
గోటికపిలల నీయఁ జేసూడునట్టి, పుణ్యమును బొందు నను [illegible] బుధులు.

గీ. మధుగుడంబుల నొసఁగినమానవుండు, స్వర్గమున [illegible] నిత్యసాగరంబు
లవణదానంబు చేయునో [illegible] వాఁడు, [illegible] నివాసముండు.

సీ. అన్ని దానములలో నన్నోదకప్రదా, నము [illegible] గాఁగ
నన్నోదకము లిచ్చినట్టివాఁ [illegible], [illegible] లిచ్చినట్టివాఁడ
యన్నోదకంబు లనన్యసాంబు సముములు, [illegible] లేమి
నన్నోదకములచే నాఱు [illegible] తృప్తులు, దానిచే నగుఁ బ్రాణధారణంబు

గీ. కాన నన్నోదకము లిచ్చుమానవుండు, ప్రాణదానంబు గావించునట్టివాఁడ
ప్రాణదానంబు చేసినపావనునకు, నంట నేరవు బ్రహ్మహత్యాదులేని. 931

గీ. అగునో జీర్ణంబులుగ నెన్ని యన్నతోయ, కణము లుర్విసుపర్వనిగర్భమందు
నన్ని కల్పంబు లన్నతోయప్రదాత, స్థిరముగా నుండు [illegible] ముకుందు.

గీ. అన్నదానంబు గావించునట్టివారి, పాతకము లెల్ల వారి [illegible] భోక్త
లైనవారినిఁ జెందు నద్దాన భోక్త, పాతకులయున్న మునుచ దగుఁ [illegible].933

సీ. అన్నదానముకంటె నధిక మైనది జల, దానంబు [illegible] మిను
త్రవ్వింపఁబడినఖాతములందు నుండెడి, తోయంబు ద్రావి జంతువులు బ్రతుకఁ
దత్తోయమునఁ బిత్రుతృప్తి గాంచఁ జేయ, నగు దేహదార్ఢ్య మనసయింపఁ
[illegible] శుద్ధియు [illegible] సరిశోధనంబును, శౌచంబు శోభయు [illegible]

ఆ. [illegible] నిర్వహింప మంచికార్యము లెల్ల, నంబు వగును సాధనంబు గాన
సుకృతి మెల్ల దాన సుప్రతిష్ఠిత మయ్యె, ధన్యుఁ డనిన సలిలదాత యొకఁడె.

గీ. ఖాతమున నెన్ని తోయశీకరము లుండు, నన్ని వర్షసహస్రంబు లమరపురిని
దాత నివసించుఁ గావునఁ దగు నొనర్పఁ, గూపవాపీతటాకసంస్థాపనంబు. 935

సీ. ఒనరించి సర్వస్వదానియోగము జేసి, [illegible] లెల్లయత్నంబుల నెట్టులైన
స్థాపింపఁదగును ఖాతంబు మేదినిమీఁద, జన్మంబు నెత్తినజనులు లెల్ల
జలశూన్య మైన దేశమున జలాశయం, బును నెలకొల్పినపుణ్యమూర్తి
కల్పశతంబు స్వర్గమునందు దేవతా, గణ్యుఁడై సకలసౌఖ్యముల నొంది

గీ. కడకు జన్మించి ప్రభు వయి పుడమి నెల్లఁ, బాలనము చేసి తుది బ్రహ్మపదమునొందు
నవనిసురుఁడైన నృపుఁడైన నర్యుఁడైన, శూద్రుఁడైనను స్త్రీయైన శూద్రుఁడైన.

వ. పరోపకారార్థంబు చతుర్హస్తప్రమాణరూపంబు త్రవ్వించువాఁడు కల్పంబు వఱకును దశహస్తప్రమాణరూపంబు త్రవ్వించువాఁడు కల్పద్వయంబు వఱకును శతహస్తప్రమాణరూపంబు త్రవ్వించువాఁడు శతకల్పంబులవఱకును స్వర్గసౌఖ్యంబు ననుభవించును. వింశతికిష్కుప్రమాణపుష్కరిణిని త్రవ్వించువాఁడు కల్పసహస్రంబు నైకుంఠంబునం దుండును. సహస్రకిష్కుప్రమాణపుష్కరిణిని త్రవ్వించువాఁడు శాశ్వతంబుగ దివంబునందు నివసించును. 9 ,7

గీ. అనఘులకును ఋషుల కగతికులకు, సఖుల కుపకారకులకును తన్మాత్రలంబు
నందుఁ ద్రవ్వించి సలిలాశయంబు లిచ్చు, వార లుందురు సతతంబు స్వర్గమందు.

సీ. ధనికుఁ డొక్కఁడు మును జలాశయ మొండు, త్రవ్వించి నిర్జలస్థలమునందు
దానికై వెచ్చించి తనయొద్దనుండిన, యయుతదీనారము లంతమునకు
నిస్స్వుఁడై యుండ వానిని జూచి యొక ఱేఁడు, స్వామి యి మ్మ జలాశయము నాకు
దీనికై వ్యయ మూపు కావించినధనంబు, నిచ్చెద ననుడు వాఁ డిట్టు లనియె

గీ. దీనిలోఁ బ్రతిదినమును స్నానపాన, కర్మములు చేయుచుంట లోకంబు లెల్ల
నయుతదీనారసమధిక మైనపుణ్య, మనుదినంబును గలుగు నీయంగఁ గలనె.

గీ. అనుడుఁ బకపక నగి విభుఁ డనియె వెఱ్ఱి, వాఁడ పుణ్యంబు లెక్కింప వలనుపడునె
యనుడు వాఁ డిట్టు లనియె సత్యంబు నీవు, కాంచఁదలఁచిన యెడఁ బరీక్షించి కనుము.

సీ. అనవుడు భూపాలుఁ డయుతదీనారముల్, కట్టి గట్టిగ నొక్కగ్రావముననుఁ
నా జలాశయమునందుఁ దుంచి మునిఁగిన, జడము తేలినఁ బరాజయము నాఁగ
నా మూట సలిలంబునందు మునుంగక, తేలియాడుచు నుండెఁ దెప్పవోలె
నప్పు డా నృపునకు నంతరంగమునుండి, కరిగెను నత్యాశ్చర్యకరము గాఁగ

గీ. నంత భూపతి యొక్క జలాశయంబు, తగినచోటను ద్రవ్వించి తత్ఫలంబు
ననుభవింపంగ దినమున కరిగె దివ్య, యానమున నెక్కి ధనికతనయు లోకమునకు.

వ. మూఁడు చంపకవృక్షంబులును మూఁడు దర్భవృక్షంబులును నెనిమిది బిల్వవృక్షంబులును నేడు న్యగ్రోధవృక్షంబులును బది నింబవృక్షంబులును వనంబుగా స్థాపించిన మహాఫలంబు ప్రాప్తించు. చూతసహస్రవనంబు నెలకొల్పెనేని వైకుంఠవాసంబు చేకూరును. 942

క. రాజ్యమును మంగళమును శౌర్యమును సకల
భోగములు రోగరాహిత్యమును యశంబు
పుత్రపౌత్రాభివృద్ధియుఁ బూజ్యతయును
స్వర్గమును గల్గు నారామసాధకునకు. 943

వ. వృక్షారోపణంబును నారామస్థాపనంబును గావించువారు పక్షికీటాదులకు జీవన ప్రదానంబును జేసి తాపమనుష్యులకు ఫలప్రదానంబును నాశ్రితజనంబు సంతానంబునకు ఛాయాప్రదానంబును గావించిన మహాపుణ్యమునం [illegible] చిరకాలంబు స్వర్గసౌఖ్యంబు ననుభవించి మరల మహారాజులై భూమండలంబున జన్మించి పూర్వవాసనం జేసి తిరుగ మహారామములు నెలకొల్పి [illegible] బ్రహ్మలోకవాస భాగ్యము బడయుదురు. [illegible] నిర్జలమార్గంబునందుం బ్రపాస్థాపనంబు గావించి గ్రీష్మవర్షకాలం[illegible] పాంథజనంబులకు నుపవేశస్థలంబును [illegible] స్వర్గనివాసభాగ్యంబు చేకూరు. అట్లు సర్వ[illegible] గావించినం బుష్కరిణీస్థాపనఫలంబు లభించు. గ్రీష్మకాలంబున [illegible] దొక్క మాసంబు ప్రపాసలిలదానంబు గావించు నొక్క [illegible] ప్రతిష్ఠపావాస భాగ్యంబు ననుకూలు. ప్రపాస్థాపనలు పుష్కల[illegible] బడసి మహాభోగంబు లనుభవింతురు. ప్రపాస్థాపనాశక్తు లగువారు [illegible] స్వర్ణదక్షిణాసహితంబుగా ధర్మఘటదానంబు గావించి [illegible] చేకూడు. అట్లు వర్షత్రయంబు ధర్మఘటప్రదానంబు గావించినం బ్రపాస్థాపనఫలంబు ప్రాప్తించు. ధర్మఘటప్రదానాశక్తు లగువారు [illegible] లగువారలకు శక్తికొలందిని సలిలప్రదానంబు గావించి రేని స్వర్గలోకవాసము బడయుదురు. కాంతారంబున సలిలంబు [illegible] సంక్రమణంబులను [illegible] శేషములను నేర్పఱచినను గోశిరంబు నేర్పఱచినను దివ్యవర్షశతంబు స్వర్గభోగంబు లనుభవించి [illegible] భూమిపై జన్మించి సార్వభౌ[illegible].

సీ. చోరుం డొక్కరుఁడు మున్ను దారుల నడకట్టి, కొట్టి పాంథుల [illegible] చుకొను ధనము
ననుభవించుచుఁ దాను దనకుటుంబముతోడఁ, [illegible] సముద్యమమునందుఁ
ద్రవ్య గోశిర మొండు దారి నేర్పఱిచి వారు, దానిలో [illegible] తనియు
నంతట నొక్కనాఁ [illegible] కస్మికంబుగాఁ, దనువును [illegible]

గీ. యమభటులు వానిఁ గొనిపోయి యముఁడు నిలువ
యముని సాన్నిధ్యమునఁ జూచి యముఁడు వాని
నితఁడు చేసినపుణ్య మేమేని యున్న
నుడువు మని చిత్రగుప్తుని నడిగె నంత. 945

గీ. చిత్రగుప్తుఁడు వాఁడు చేసినయఘంబు, లన్నియును బలుక [illegible] చెప్పి
కడకు వచియించె గోశిరకార్యజనిత, మైనపుణ్యంబు నది విని యంతకుండు.

క. కనుఁగొని ధర్మము ధ్యానం, బున వీఁ డొనరించినట్టిపుణ్యముచే ధా
త్రిని ద్వాదశాబ్దములు పా, లన మొనరింపంగఁ దగు నిలాపతి యగుచున్

క. అని పలికి చోర భూతల, మునకుం బో నిల్చి నన్నుఁ బ్రమ్రొక్కి యతం డి
ట్లనియెఁ బ్రభూత్తమ యీపూర్వస్మృతి, ననుగ్రహింపుము విభుండ నగు నెడ నాకున్.

క. అని వేఁడుటయును యముఁ డి, ట్లనియె నగుంగాక యట్ల యదుగుము శీఘ్రం
బున ననుఁడు వాఁడు భూతల, మున నొక్కదరిద్రగేహమున జనియించెన్.

గీ. అట్లు జనియించి వాఁడు పూర్వాఘమునను
సలుగు మును నేకవింశతిహాయనములు
గడపి బహుదుఃఖములతోడఁ గట్టకడపఁ
ననుపు విపనాడఁగను లోనఁ దలఁచుచుండె. 951

సీ. ఆపురం బేలెడిభూపాలుఁ డపుత్రుఁడై, మరణంబు నొందఁగ మంత్రులెల్ల
రాజచిహ్నములచే రాజిల్లుచోదుని, నొద్దకు నిల్పి సంతోషమునను
జేసి పట్టాభిషిక్తుని సలిపిరట, వాఁడు పూర్వస్మృతివర్తనగుచు
వాసికెక్కఁ గాళికూపప్రపాగోష్ఠి, రస్తాక్రమాది కార్యములఁ జేసి

గీ. భూమిసురుల నిల్పి యారామములను, బాముకొల్పి సమస్తపాపక్షయంబు
గాఁగ నొసఁగెం బహుపుణ్యకార్యములను, గోపకరూపన పాపిష్ఠ్యమునకుఁ జేసె.

వ. గోప్రదానంబునకు భూదానంబు గావించువాఁడును గోదానంబు గావించు
వాఁడును సమానసద్గతిం జెందుదురు. 952

గీ. పుణ్యపాదపముల ధర్మభూరుహముల, గోప్రచారక్షితిని జలకూపములను
బాడుచేసిన వాఁడు విభ్రష్టవంశుఁ, డగుచు రౌరవనరకమునందుఁ గూలు. 953

వ. హరిహరబ్రహ్మగణపతి దేవీభాస్కరాది దేవతాలయమండపాదులు కట్టించు
వారును దేవాలయసంరక్షణంబునకు భూప్రదానముల నొసంగువారును దత్త
ద్దేవతాలోకంబులందుఁ గల్పకోటిసహస్రంబులు సుఖంబుగా నివసింతురు.
దేవాలయమండపంబులు తృణంబుచే నేర్పఱిచిన నొక్కదివ్యహాయనంబును
శిలాఖండంబుచే నేర్పఱిచిన దివ్యశతహాయనంబులును సన్యకాష్ఠంబులచే
నేర్పఱిచిన దివ్యాయుతవర్షంబులును ఘనదారువులచే నేర్పఱిచిన దివ్యలక్ష
వర్షంబులును పాషాణంబులచే నేర్పఱిచిన దివ్యకోటివర్షంబులును స్వర్గలోకం
బున నివసింతురు. దేవాలయమండపకారకుండు స్వర్గలోకంబునం దుండునంత
కాలము తద్భ్రంశకారకుండు నరకలోకంబునం దుండు. నదీతటాకకూపాది
సమీపంబునం దధ్వగులు విశ్రమింప సత్త్రంబులును మండపంబులును గట్టించు
వారలు దేవాలయమండపకారకులొందు ఫలంబుం జెందుదురు. బ్రాహ్మణులకు
గృహంబులం గట్టించి యిచ్చువారలు తద్ద్విగుణఫలంబుం గాంతురు. అనాథు
లకు శరణంబులు గట్టించి యిచ్చువారలు శాశ్వతస్వర్గమందిరావాసముం
బడయుదురు. తత్తద్దేవతాసన్నిధానంబులందు ఘృతదీపంబుఁ బెట్టువారు దివ్య

వర్షాయుతంబును దత్తద్దేవతలకు ఘృతాభిషేకంబు గావించువారు కల్పకోటి సహస్రంబును స్వర్గవాసముం జెందుదురు. తైలదీపతైలాభిషేకంబులవలనఁ దదర్థఫలంబు చేకూరు. దేవతలకు వస్త్రపుష్పగంధానులేపధూపాదుల నొసంగి లేని సామ్రాజ్యంబు లభించు. స్వర్ణనిర్మితంబుల దేవతల కొసంగిన భూమండలాధిపత్యంబు ప్రాప్తించు. సుగంధిద్రవ్యదానంబుచే [illegible]త్వంబును సౌందర్యంబును జేకూరు. పూగిదానంబున [illegible] గలుగు. వరదాసీప్రదానంబునఁ గల్పసహస్రంబు స్వర్గ[illegible] స్వర్గంబునందు బహుభృత్యసమేతత్వంబును [illegible] సర్వ[illegible]సంపన్నత్వంబును నృత్యగీతాదిప్రవర్తనంబున గంధర్వ[illegible]త్వంబును గోప్రదానంబునను దుగ్ధప్రదానంబునను గల్పసహస్ర[illegible] [illegible]కంబునఁ దద్భక్త [illegible] [illegible] ప్రదానంబున [illegible] [illegible] పారగత్వంబును [illegible] [illegible] లావణ్యంబును [illegible] స్వర్గ[illegible] సర్వపాపవిముక్తియుం ప్రాప్తించు. [illegible] దివ్యవర్షశతంబు స్వర్గవాసంబును లోకవంద్యత్వంబును గలుగు. దేవతా[illegible] [illegible]కంబు ననుభవించి కడపటఁ గిట్టనైప్పి.

క. శివనైవేద్యముఁ దిన్నను, శివ[illegible] [illegible]
గరగూడిన దారుణతా, నరకమునుండి [illegible] [illegible]. 955

క. దేవలుఁడు తెవ్వఁడు గూడదు, దేవద్రవ్యంబు దినుట [illegible]
బోవుదురు నరకమునకు౯, దేవుం [illegible] [illegible] [illegible]. 956

క. ధన కాంక్షాసంగముచే౯, బొనరించిన వారు [illegible]
ననుభవింతురు [illegible], [illegible] [illegible]. 957

క. నానాపుష్పఫలాశ్రయమును, మీ [illegible] [illegible]
[illegible] దాఁకిన వెంటనె, స్నానం బొనరింప [illegible] [illegible]. 958

క. ధన కాంక్షను మానసుబసెఁ, [illegible] ముక్తి[illegible]
గాని పూజను వైకుంఠం, బున వాసము చేయు వారి పునరావృత్తిః. 959

గీ. దేవతార్చనంబును దేవతాస, [illegible] దేవతాత్మభావము నొంది
గారవించెడివారు నాకమున నుండు, రవ్వ[illegible] గూడ నపునరావృత్తు లగుదు.

వ. దేవదాసదాసీవర్గంబులకు భూములును గృహంబులును నొసంగువారు శాశ్వత వైకుంఠవాసముం బడయుదురు. 961

గీ. ద్రవ్య మార్జింపవలయును దానమునకె, దాన మొనరించుటకు దారిద్ర్య మొదవె
నేని కాఁ జాలఁడు దరిద్రుఁ డీశ్వరుండు, పెట్టకుండినఁ గలుగవు పుట్టగతులు.

ఆ. దానరహిత మైనద్రవ్యంబు రక్షించు, కొనుచు నుండువాఁడు కొట్టుకొనకఁ
బుట్టగతులు లేక పోవు నాద్రవ్యంబు, నెల్ల విడిచిపెట్టి యేఁగునాఁడొ. 963

క. ధన మున్నప్పుడు దానం, బొనరింపక తాను దినక యుండెడియజ్ఞా
నునికంటె లేఁ డెంచనుఁ, డనియెడివాఁ డొకఁడు వసుధయందు మునీంద్రా.

గీ. తపముకంటెను శ్రేష్ఠంబు దాన మనుచుఁ
బలుకుదురు పెద్ద లెల్లఁ దద్భాషితంబు
సత్యదూరంబు గామిని జలుపవలయు
దానమునె సౌఖ్యమును గోరుమానవుండు. 965

గీ. ఇచ్చి స్మరియించువాఁడును బుచ్చుకొనియు
సుఖముగువాఁడును నరకాబ్ధియందు మునిఁగి
తేలుచుండెడివారల దిక్కు లేక
యొంటిగానుండు రవియును నుండుదాఁక. 966

క. దానమున ఘోరపాపము, లైనను నశియించుఁ గాన నాత్మహితార్థుల్
మానక శక్తికొలందిని, దానం బొనరించుచుండఁ దగు నెల్లపుడున్. 967

క. ఈధర్మాఖ్యానంబును, బోధించిన నఖిలకార్యములు సిద్ధించున్
వ్యాధులు తొలంగు సంసృతి, బాధలు శమియించు మోక్షపదమును నొదవున్. 969

వ. అని చెప్పుటయు శౌనకుండు సూతున కిట్లనియె.

—: ప్రతిజ్ఞాపాలనాదిఫలకథనము :—

గీ. ప్రతినఁ బాలించుకొనుట కేఫలము గలదొ
ప్రతిన నెఱవేర్చుకొనమి కేఫలము గలదొ
సత్యశపథంబున కసత్యశపథమునకు
నేమి ఫలములు గలవొ నా కెఱుఁగఁ జెపుము. 970

సీ. అనుటయు సూతుఁ డిట్లనియె శౌనకునకుఁ, బాలించుకొనునెడఁ బ్రతినఁ జేసి
కలుగు గోశతదానఫలముకంటెను హెచ్చు, గాఁ గోటిగుణములు గలఫలంబు
పొనరించియును బ్రతిజ్ఞను దప్పినట్లైనఁ, గఠినంబు లగునరకంబులందుఁ
బడరానిబాధలు పడుచు నిత్యమును నే, గతినో మన్వంతరశతము గడపి

గీ. తుదకు నిలలోన నిరుపేదనరముఁడై, బుట్టి తిన నన్నమును గట్ట బట్ట లేక
పరితపించుచుఁ గావింపఁబడినయట్టి, కర్మశేషంబు గుడుచుచుఁ గడకుఁ జచ్చు.

గీ. సత్య మైనను శపథంబు సలుప రాదు, సలుపునెడ దేవగురువహ్నిసన్నిధమందుఁ
జెందు హరిగాత్రమును గాలిచినయఘంబు, నింక మిథ్యాశపథపాప మేమి చెప్ప.

గీ. విష్ణుగాత్రంబు ముట్టి కావించె నేని, సత్యశపథంబు నరకవాసంబు [illegible]
వాఁడు మన్వంతరశతంబు [illegible] నింక, సన్మతిని [illegible] ఫలం [illegible] యనె.

గీ. ముట్టికొని విష్ణువి[illegible] [illegible]
నట్టియిన సత్యశపథంబు [illegible]
పురుషుఁ [illegible] [illegible]
గుప్తి [illegible] [illegible]. 974

గీ. సత్యశపథఫలం బిట్టిదౌను [illegible], [illegible] సత్యశపథ [illegible] చెప్ప
ననుటయును శౌనకుం డిట్లు లనియె సూత, దక్షిణాకరప్రదానవ్రతంబు వరుస.

—: దక్షిణహస్తప్రదానఫలకథనము :—

వ. అని యడుగుటయును సూతుండు శౌనకున కిట్లనియె. 976

సీ. వినుము దక్షిణహస్తము [illegible], [illegible]
[illegible] విష్ణు [illegible], బ్రహ్మ [illegible] ప్ర [illegible]
గావించి దక్షిణకరదానమును మాట, పాలించుకొన [illegible]
కడచుదాఁకను గోటికల్పముల్ ఘోరంబు, లగుయమయాతన లనుభవించు

గీ. వచనపాలన మగుదాఁక వానిపితరు, లేప్పుడును నారకాంబుధి నీఁద లేక
సొమ్మసిల్లుచు సోలుచు దిమ్మఁ దిరిగి, వనుచు లేమమఁ గాలంబు గడపుచుంద్రు.

వ. దీని కొక్కదృష్టాంతంబు చెప్పెద వినుము. 978

సీ. మున్ను కాంచీపురంబున నుండె [illegible], [illegible]
ప్రాణంబు పో నున్నఁ బ్రతిన దప్పనివాఁడు, దేవతాబ్రాహ్మణ సేవనంబు
శ్రవణసముపలబ్ధసర్వధర్మంబును, దానశీలంబును ధైర్య [illegible]
వసుధనధాన్యసంపత్సమేతుండును, బుత్రమిత్రకళత్ర [illegible]

గీ. నట్టు లుండంగ నొకసమయమ్మునందు, శ్వపచుఁ డొక్కఁడు విప్రవేషంబుఁ దాల్చి
వానికడ కేఁగుదెంచి దీవన లొసఁగి, చిట్టచివరకు నయముగా నిట్టు లనియె.

గీ. వీరవిక్రమ నీపేరు విశ్రుతంబు, [illegible] నిరుఁ గాఁడు [illegible] [illegible]
యరుగుదెంచితిఁ గొండంత యాశతోడఁ, బాత్రుఁడను నేను నిజముగ బ్రాహ్మణుఁడను.

క. ఇల్లు చెడియున్నవాఁడను, నిల్లాలు గణించె బ్రతుక [illegible] కని నా
యుల్లమునఁ బొడమె వగ పా, పుల్లాంబుజ [illegible] పోయునపిచపడ. 981

సీ. కలకంఠముక్కులకంటె రుచ్యంబుగా, మాటలాడుచు నుండు మం [illegible]
యొంటిసఁ గనుగొంచు [illegible] లతోడఁ, జెలువారు చుం [illegible]
ముద్దుగారుచు నుండు ముత్తెపుంపడలతో, సంతోషమును గొల్పు [illegible]
చిందులాడుచు నుండు [illegible] వెన్నెలల్, వింతగాఁ గనుపట్టు [illegible]

గీ. నా మనోరాజ్ఞి నా సుగుణాళులకొలని, నా నిధానంబు నా కళానాట్యసభయు
నా ప్రమోదపయోధి నా సాధ్వి సంఘ్రి, నాకుఁ గన్పట్టఁ గలదె దేవేంద్రకైన. 982

గీ. విప్రసంరక్షణంబు గావింప నధిప, యుష్మదీయమతంబైన మాటమాటాడకుండ
నాకొసంగుము నీకన్యకను గలుగు, శాశ్వతబ్రహ్మలోకవాసంబు నీకు. 983

గీ. చేసెనేని వివాహంబు భూసురునకు, నదియె చాలు సమస్తపుణ్యముల నొసఁగ
నేల దానంబులు వ్రతంబు లేల యేల, క్రతువులు తపంబు లేల తీర్థంబు లేల.

చ. అనుటయు వీరవిక్రముఁడు హర్షముతోడ మహాత్మ నీకు నా
తనయ నొసంగువాఁడ నని దక్షిణహస్తము నుంచి వానికే
లను బలికెన్ దృఢంబుగను లాభము గల్గె నటంచు సంతసం
బును సహియించె సంస్త్రీయుఁడు మోసము గెల్చిన కారణంబునన్. 985

ఆ. అట్లు సాధ్వి వొందె యంత్యజుఁ డతనితో, నిట్టులనియె విష్ణు మేలు యగునె
యాలసించు నేఁడు గారగించి రయంబ, కన్య నిమ్ము మాట గడవకుండ. 986

చ. అనవుడు వీరవిక్రముని పుత్రులు కొందఱు చేరి బ్రాహ్మణుం
డనుటకు వీలు లేదితని నన్వయ మెట్టిదొ దేశ మేదొ యే
పని గలవాఁడొ యారయక భార్యముగా నొసఁగంగ గన్యకా
జనము నటంచు షోడశి లెడి శాస్త్రములన్ వలదే గణింపఁగన్. 987

క. తొందరపడఁగా నేటికి, నందఱకును హితము గాని యట్టివివాహం
బెందులకుఁ జేయ వలయును, సందేహము గలుగుచోటు చను విడువంగన్.

క. కనుఁగొన నీతని మాటలు, నిను మోసము చేయ మేదినీసురవేషం
బున వచ్చిన చండాలుం, డని తోఁచెను మాకు విడుచు టర్హము వీనిన్. 989

చ. అనవుడు వీరవిక్రముఁ డనాదరణీయము గాదు మీరు ప
ల్కినది హితంబ కాని పరికింపఁగ దక్షిణహస్త ముంచి చే
సిన ప్రతినన్ త్యజింపు మని చెప్పుటమాత్ర మపథ్య మంచుఁ దోఁ
చెను మది కేమి చెప్పెదరొ చెప్పుఁడు ధర్మము మీఱకుండఁగన్. 990

చ. అనుటయు వార లందఱును నచ్చెరు వేర్పడఁ జూచు చుండఁగా
మనమున సందియంబు లవమాత్రము గూడను లేక వానికిన్
దనయను వీరవిక్రముఁడు దానము చేయఁగ నున్నవేళఁ జ
య్యనఁ జనుదెంచి నిల్చెను జనార్దనుఁ డాతని ప్రోల నవ్వుచున్. 991

ఉ. అంతట వీరవిక్రముఁ డనన్యపరాయణచిత్తుఁడై రమా
కాంతునిఁ జూచి విస్మయము గల్గఁ గరంబులు మోడ్చి మ్రొక్కె దై
త్యాంతకుఁ డాతనిం గని కృతార్థుఁడ వైతివి నీవు నీకులం
బంతయు ధన్య మయ్యెఁ జరితార్థతఁ గాంచిరి నీసతీసుతుల్. 992

క. అక్షయఫల మర్థ్యాను నీ, దక్షిణహస్తంబు ప్రతిన ధన్యతఁ గాంచెన్
మోక్షము నొసఁగితి నీ వన, వేడ్కఁబడ వైనను ద్విదీప్యమానముగన్.
గీ. అధివసింపుము గరుడవాహనము నిప్పుడె, సపరివారంబుగా ననె సర్వాంబ
వారి నెల్లను దనయిరువైపులందు, నునిచుకొని తాను వైకుంఠమునకుఁ జనియె.
క. అంతట వైకుంఠంబునఁ, జింతాలను మీని లేక చిరకాలంబ
త్యంతసుఖ మనుభవించి యు, సంతరమను విముక్తి నొందె నంత గూడన్.
క. అని చెప్పుటయును శౌనక, మునితల్లజుఁ డిట్టు లనియె మునిహర్ష జనా
ర్దననామోచ్చారణమున, ననసిన మాహాత్మ్య మేమొ యెఱుంగఁ జెప్పుమా.
వ. అని యడుగుటయు సూతుండు పరమహర్షసమేతుండై శౌనకున కిట్లనియె. 997

—: విష్ణునామమాహాత్మ్యకథనము :—

క. మునివర వినుము వచించెద, ననుపమ నిప్పు డెఱిగినట్లు నానామహిమం
గను మును సనత్కుమారునిఁ, గనికరమున నారదుఁ డడుగఁగ నయి యిట్లనియెన్.
క. గళితాచారులు పిశునులు, మలినులు వంచకులు పరగ నిర్మానులు సంసా
రులు పాపు లయ్యు నగుచుండు, జలజాక్షపదారవిందశరణాగతులన్. 999
క. హరి యను రెండక్షరములు, దురితంబుల నెల్లఁ బొలియఁ ద్రోచి గుణములొ
బరమపదంబును జేరుచు, నరసిన దఱచు లేదె మోక్షము మనుజులకున్. 1000
క. హరినామ మొకటి కైకొని, తరియింపఁగవచ్చు దుస్తరంబగు భవసా
గరము సులభముగ నూరక, పరిపరివిధములను జేయు పనులెల్లఁగన్. 1001
క. అంతయును గల్ల యని సి, ద్ధాంతము నొనరించుకొని నిజాత్మను ని
శ్చింతముగ విష్ణునామము, సంతతము స్మరించు చుండు సజ్జను లెల్లన్.
క. ఉపవాసంబులు క్రతువులు, తపములు జపములును స్నానదానములును గా
వుపకారకరణదక్షము, లుపేంద్రనామము స్మరింప నొందిన ఫలముల్. 1003
గీ. అపునరావృత్తిలక్షణం బైనవిష్ణు, నామకీర్తనమునకుఁ బుణ్యప్రవృత్తి
కారకం బైనస్వర్లోకగమనమునకు, హస్తిమశకాంతరము గాదె యరసి చూడ.
క. ఘోరము లగు పాపములను, మారణ మొనరించునట్టి మంత్రంబు నమో
నారాయణాయ యనియెడి, భారతి యొక్కటియె యేల బహుభాషణముల్.
గీ. సత్యమును జెప్పుచున్నాఁడఁ జాటి నేను, సకలపాపంబులను గూడ సమయఁ జేసి
నరకమునఁ బడనీయక నరుల విష్ణు, ధామమున నిల్పునది హరినామ మొకఁడె.
ఆ. రామ రామ యని విరామంబు లేకుండ, జపము చేసెనేని శ్వపచుఁ డేని
పూతుఁ డగుచు దాను బూతంబు గావించు, వసుధ నెల్ల నిజనివాసమునను. 1007
గీ. కృష్ణ కృష్ణ యటంచుఁ గీర్తించు చుండు
వాఁడు నివసించుధామమె ద్వారకయును

గయయు వారాణసియుఁ బ్రయాగమును సకల
తీర్థములు గూడఁ జేర్చి తెలుప నేల. 1008

గీ. అట్టి విష్ణుకళావతారాహ్వయములు, కీర్తితము లైనయెడ సర్వకిల్బిషములు
జ్వలనమం దుంపఁబడిన కాష్ఠములువోలె, భస్మ మైపోయి చేకూడుఁ బరమపదము.

గీ. కృతయుగంబున ధ్యానంబు త్రేతయందు, యజ్ఞములు ద్వాపరంబున నర్చనంబు
గలుగఁజేయంగఁగలవో యేఫలమునదియె, కలుగుఁ హరికీర్తనంబు చేఁ గలియుగమున.

గీ. ఎట్టియపరాధములు చేసినట్టివారి, నేని శరణన్న రక్షించువానియెడను
నపచరించెడివాఁడు నామాశ్రయమునఁ, బాలితుం డగు నామప్రభావ మేమొ.

గీ. అట్టినామంబు నెడఁను నపచరించు, నట్టివానికి లేదు వే ఱట్టిగతియు
ననుటయును నా ర దుండిట్టులనియెఁ స్వామి, యేయె నామాపచారము లెఱుఁగఁ జెపుడు.

వ. అని యడుగుటయు సనత్కుమారుం డిట్లనియె. 1013

—: నామాపచారకథనము :—

సీ. అచ్యుతనామమాహాత్మ్యంబు నాలకిం, చియును నామశ్రద్ధ చేయమియును
గ్రహియించి గురునిముఖంబున నామముల్, చివరకు గురుని దూషించుటయును
హరినామములు స్తుతు లనుటయు భేద మా, పాదించుటయు విష్ణుభర్గులకును
నిగమాగమపురాణనింద చేయుటయును, త్యజియించుటయును స్వధర్మములను

గీ. నామములో భావులకు లోఁగి కాని కార్య
ములను గావించుటయు దుర్మతులను గూడి
యెడ లెఱుంగక చరియించు చుండుటయును
లేదుకొనఁబడు నామాపచారములుగ. 1014

గీ. అట్టియుపచారములు విడనాడి నామ
జపము గావించునెడ సర్వసౌఖ్యములును
జెంది యిహమందుఁ బరమందుఁ జెందు ముక్తి
యనుటయును నారదుం డిట్టు లనియె మరల. 1015

గీ. స్వామి ప్రియసాహసులు జ్ఞానవర్జితులును
గాయసంరక్షణైకపరాయణులును
సంసృతినిమగ్నులును నైన సజనుల కెట్లు
కలుగు నోకో యుపచారముల్ సలుప కునికి. 1016

గీ. అనుటయు సనత్కుమారుఁ డిట్లనియె ననఘ
యవిరతముగఁ బ్రయుక్తము లయ్యె నేని
సంహరించును నామాపచారములను
నామములె ఛాళ్ళ వడఁప నన్యములు వాని. 1017

గీ. తనుధనసతీసుతాదులఁ దగులుకొనిన, మానసముతోడనను బ్రాయుక్తమైనయట్టి
నామ మవిలంబఫలదము గామి నెదను, నునిచి హరిస్మృతిని దగు నామమును జపింప,
గీ. ఈరహస్యంబు చెప్పె నాకీశ్వరుండు, మున్ను దయతోడ సనకాదిమునులు తొలంగ
నామమాహాత్మ్యమును బురాణములనలరు, దెలిసికొనఁ దగు నింకను పలసెనేని,
క. అనవుడు నారదుఁ డెంతయు, మనమున సంతోష మొంది మాహేశియు విన
గను విష్ణునామముల నె, ల్లను నా కుల్లంబునను వలం [illegible]. 1020
సీ. కలదేని నాకు యోగ్యత యని యాలింపఁ, బత్నిని దయతోడ నతిప్రియముగను
నావుడు లోన సనత్కుమారుఁడు విస్మ, యము నొం[illegible] నారదమునిని
నారదా శార్ఙ్గపాణినామ [illegible]
నిన్నామముల నెల్లఁ దరము గా దెలుపంగ, [illegible] వచింపఁ
గీ. జెప్పఁ దద్దివ్యనామముల్ శివుఁడు ప్రకటించె, దయఁ దెలుపుము [illegible] మునకు
నావుడుఁ దదాజ్ఞ గైకొని నారదుండు, [illegible] లమునకు.
గీ. అష్టమూర్తికి మ్రొక్కి సాష్టాంగముగను
వినిచెఁ దనవాంఛ నయ్యది విని మునీశ
విష్ణునామంబులను నేఁడు వినుచుభాగ్య
మొదవె నని సంతసించుచు హృదయమందు. 1022
సీ. నారదా మున్నొకనాఁడు పార్వతి నాకు, సాష్టాంగనమనముఁ బాటించి
దేవ సర్వజ్ఞమూర్తివి నీవు బ్రహ్మాదు, లర్చించుచుందురు విశ్వరూప నిన్ను
వినియుంటి నిన్ను మించిన దైవము త్రిలోక, ములలోన లే దని మునులు చెప్ప
గోప్యంబుగను నీవు గూడ దేనినో జప, యించుచుండ దవది యేదొ దెల్పుము
గీ. యనుడు నే నిట్టు లంటిఁ దన్వంగి నీవు, భక్తురాలవు నీకుఁ జెప్పంగరాని
దేదియును లేదు కావున నెఱుకపఱుతుఁ, గాని యిదిగోప్యముగఁ [illegible] నుదీని.
సీ. అఖిలలోకములకు నాదినారాయణుం, డొకఁడె కారణముగా నున్న వాఁడు
భజియించుచుండిరి బ్రహ్మాదు లెల్ల స, త్యయుగంబునందు మున్నెవని నొకని
నపుడు నే నొకకల్ప మాచరించితి ఘోర, తపము నతని ప్రసాదంబుకొఱకు
నాతపంబున కాదినారాయణుఁడు మెచ్చి, ప్రత్యక్షముగ వచ్చి పరమకృపను
గీ. విష్ణునామసహస్రంబు విశదముగను, నాకు వచియించి వత్స యీనామములను
సంస్మరించుచు నుండుము సంతతమును, సగుణు నాకంటె నధికుఁడ వని వచించె.
గీ. అదియె మొదలుగ నామసహస్రజపము, సలుపఁ జూడఁగిరి దానినె సర్వశక్తు
లేర్పడియె నాకు దాన సర్వేశ్వరుండ, నైతి నేను జనార్దనుం డవదుఁ డయ్యె.
చ. అని వచియింపఁ బార్వతి ప్రహర్షము నొందుచు నాత్మలోన ని
ష్ఠనిడెను బ్రాణనాథ మధురాన్నముఁ నొక్కఁడె యారగింపఁగాఁ

జన దని పెద్ద లంప రది సర్వవిదుండవు నీవె సత్యముం
బొసరుపకున్న నెవ్వరికిఁ బూజయొనర్తురు వృద్ధవాక్యమున్. 1026

క. ఆనవుడు గ్రహించి తన్మన, మున నేను రమాధవుండు మును నాకు వచిం
చిననామసహస్రంబును, వినిచితిఁ బార్వతికి నదియె వినిచెద నెకుఁడా. 1027

—: విష్ణుసహస్రనామకథనము :—

అస్య శ్రీవిష్ణునామసహస్రస్తోత్రస్య శ్రీమహాదేవ ఋషిః. అనుష్టుప్ ఛందః. పరమాత్మా దేవతా. హ్రీం బీజమ్. శ్రీం శక్తిః. క్లీం కీలకమ్. చతుర్వర్గఫలార్థకామమోక్షార్థే జపే వినియోగః.

ఓం వాసుదేవాయ విద్మహే మహాహంసాయ ధీమహి తన్నో విష్ణుః ప్రచోదయాత్.

ఓం నమో నారాయణాయ పురుషాయ మహాత్మనే విశుద్ధశుద్ధసత్త్వాయ మహాహంసాయ ధీమహి తన్నో దేవః ప్రచోదయాత్.

క్లీం కృష్ణాయ విద్మహే హ్రీం రామాయ ధీమహి తన్నో దేవః ప్రచోదయాత్.

శ్రీం నృసింహాయ విద్మహే శ్రీకంఠాయ ధీమహి తన్నో విష్ణుః ప్రచోదయాత్.

ఓం వాసుదేవాయ విద్మహే దేవకీసుతాయ ధీమహి తన్నః కృష్ణః ప్రచోదయాత్.

శ్రీవాసుదేవః పరం బ్రహ్మేతి అంగుష్ఠాభ్యాన్నమః. మూలప్రకృతిరితి తర్జనీభ్యాం స్వాహా. మహావరాహ ఇతి మధ్యమాభ్యాం వషట్. సూర్యవంశధ్వజ ఇతి అనామికాభ్యాం హుమ్. బ్రహ్మాదికామ్యలాలిత్యజగదాశ్చర్యశైశవ ఇతి కనిష్ఠికాభ్యాం వౌషట్. పార్థార్థఖండితాశేష ఇతి కరతలకరపృష్ఠాభ్యాం ఫట్. శ్రీవాసుదేవః పరం బ్రహ్మేతి హృదయాయ నమః. మూలప్రకృతిరితి శిరసే స్వాహా. మహావరాహ ఇతి శిఖాయై వషట్. సూర్యవంశధ్వజ ఇతి కవచాయ హుమ్. బ్రహ్మాదికామ్యలాలిత్యజగదాశ్చర్యశైశవ ఇతి నేత్రత్రయాయ వౌషట్. పార్థార్థఖండితాశేష ఇత్యస్త్రాయ ఫట్. నమో నారాయణాయేతి దిగ్బంధః.

ఓం హ్రాం హ్రీం హ్రూం హ్రైం హ్రౌం హ్రః క్లీం కృష్ణాయ గోవిందాయ గోపీజనవల్లభాయ నమః స్వాహా.

శ్లో. ఇతి మంత్రం సముచ్చార్య యజేద్వా విష్ణుమవ్యయమ్।
శ్రీనివాసం జగన్నాథం తతస్తోత్రం పఠేత్సుధీః. ౧

ఓం వాసుదేవః పరం బ్రహ్మ పరమాత్మా పరాత్పరః।
పరం ధామ పరం జ్యోతిః పరం తత్త్వం పరం పదమ్. ౨

పరశ్శివః పరో ధ్యేయః పరం జ్ఞానం పరా గతిః।
పరమార్థః పరశ్రేష్ఠః పరానందః పరోదయః. 3

పరోఽవ్యక్తాత్పరం వ్యోమ పరమార్థః పరేశ్వరః ।
నిరామయో నిర్వికారో నిర్వికల్పో నిరాశ్రయః. ౪
నిరంజనో నిరాలంబో నిర్లేపో నిష్పరిగ్రహః ।
నిర్గుణో నిష్కలోఽనం[illegible]ఽనంతః. ౫
అతీంద్రియోఽమితో[illegible]యః ।
సర్వజ్ఞస్సర్వగస్స[illegible]. ౬
సర్వశాస్తా సర్వసాక్షీ పూజ్య[illegible] ।
సర్వశక్తిస్సర్వసారస్స[illegible]. ౭
సర్వావాసస్సర్వరూపస్స[illegible] ।
సర్వాధ్యక్షస్సర్వ[illegible]. ౮
సర్వాభిజ్ఞయితిస్స[illegible] ।
షడ్గుణ[illegible]. ౯
నిత్యోదితో నిత్యయుక్తో నిత్యా[illegible] ।
మాయాపతిర్యోగపతిః కైవల్య[illegible]. ౧౦
జన్మమృత్యుజరాతీతః కాలాతీతో భవాతిగః ।
పూర్ణస్సత్యశ్శుద్ధబుద్ధస్వరూపో [illegible]. ౧౧
యోగప్రియో యోగగమ్యో భవబంధైకమోచకః ।
పురాణపురుషః ప్రత్యక్చైతన్యః పురుషోత్తమః. ౧౨
వేదాంతవేద్యో దుర్జ్ఞేయస్తాపత్రయవివర్జితః ।
బ్రహ్మవిద్యాశ్రయోఽనఘః స్వప్రకాశస్స్వయంప్రభుః. ౧౩
సర్వోపాయ ఉదాసీనః ప్రణవః (౧౧౧) సర్వతస్సమః ।
సర్వానవద్యో దుష్ప్రాప్యస్తురీయస్తమసః పరః. ౧౪
కూటస్థస్సర్వసంశ్లిష్టో వాఙ్మనోగోచరాతిగః ।
సంకర్షణస్సర్వహరః కాలస్సర్వభయంకరః. ౧౫
అనుల్లంఘ్యశ్చిత్రగతిర్మహారుద్రో దురాసదః ।
మూలప్రకృతిరానందః ప్రద్యుమ్నో విశ్వమోహనః. ౧౬
మహామాయో విశ్వబీజం పరశక్తిస్సుఖైకభూః ।
సర్వకామ్యోఽనంతలీలస్సర్వభూతవశంకరః. ౧౭
అనిరుద్ధస్సర్వజీవో హృషీకేశో మనఃపతిః ।
నిరుపాధిప్రియో హంసోఽక్షరస్సర్వనియోజకః. ౧౮
బ్రహ్మప్రాణేశ్వరస్సర్వభూతభృద్దేహనాయకః ।
క్షేత్రజ్ఞః ప్రకృతిస్వామీ పురుషో విశ్వసూత్రధృక్. ౧౯

అంతర్యామీ త్రిధామాఽన్తస్సాక్షీ నిర్గుణ ఈశ్వరః।
యోగిగమ్యః పద్మనాభశ్శేషశాయీ శ్రియఃపతిః. ౨౦
శ్రీశిరోపాస్యపాదాబ్జో నిత్యశ్రీః శ్రీనికేతనః।
నిత్యవక్షస్స్థలస్థశ్రీః శ్రీనిధిః శ్రీధరో హరిః. ౨౧

వశ్యశ్రీర్నిశ్చలశ్రీదో విష్ణుః క్షీరాబ్ధిమందిరః।
కౌస్తుభోద్భాసితోరస్కో మాధవో జగదార్తిహా. ౨౨
శ్రీవత్సవక్షా నిస్సీమకల్యాణగుణభాజనమ్।
పీతాంబరో జగన్నాథో జగత్త్రాతా జగత్పితా. ౨౩
జగద్బంధుర్జగత్స్రష్టా జగద్ధాతా జగన్నిధిః।
జగదేకస్ఫురద్వీర్యో నాహంవాదీ జగన్మయః. ౨౪
సర్వాశ్చర్యమయస్సర్వసిద్ధార్థస్సర్వరంజితః।
సర్వామోఘోద్యమో బ్రహ్మరుద్రాద్యుత్కృష్టచేతనః. ౨౫
శంభోః పితామహో బ్రహ్మపితా శక్రాద్యధీశ్వరః।
సర్వదేవప్రియస్సర్వదేవమూర్తిరనుత్తమః. ౨౬
సర్వదేవైకశరణం సర్వదేవైకదేవతా।
యజ్ఞభుగ్యజ్ఞఫలదో యజ్ఞేశో యజ్ఞభావనః. ౨౭
యజ్ఞత్రాతా యజ్ఞపుమాన్ వనమాలి ద్విజప్రియః।
ద్విజైకమానదో(౨౦౦)విప్రకులదేవోఽసురాంతకః. ౨౮
సర్వదుష్టాంతకృత్సర్వసజ్జనానన్యపాలకః।
సప్తలోకైకజఠరస్సప్తలోకైకమండనః. ౨౯
సృష్టిస్థిత్యంతకృచ్చక్రీ శార్ఙ్గధన్వా గదాధరః।
శంఖభృన్నందకీ పద్మపాణిర్గరుడవాహనః. ౩౦
అనిర్దేశ్యవపుస్సర్వపూజ్యస్త్రైలోక్యపావనః।
అనంతకీర్తిర్నిస్సీమపౌరుషస్సర్వమంగళః. ౩౧
సూర్యకోటిప్రతీకాశో యమకోటిదురాసదః।
కందర్పకోటిలావణ్యో దుర్గాకోట్యరిమర్దనః. ౩౨
సముద్రకోటిగంభీరస్తీర్థకోటిసమాహ్వయః।
బ్రహ్మకోటిజగత్స్రష్టా వాయుకోటిమహాబలః. ౩౩
కోటీందుజగదానందీ శంభుకోటిమహేశ్వరః।
కుబేరకోటిలక్ష్మీవాన్ శక్రకోటివిలాసవాన్. ౩౪
హిమవత్కోటినిష్కంపః కోటిబ్రహ్మాండవిగ్రహః।
కోట్యశ్వమేధపాపఘ్నో యజ్ఞకోటిసమార్చనః. ౩౫

సుభా[illegible] [illegible]।
బ్రహ్మవిద్యా[illegible] [illegible] సువిశ్రే[illegible]. ౩౬

విశ్వంభర స్తీర్థపాదః పుణ్య[illegible]।
ఆదిదేవో జగజ్జైత్రో ముకుందః కాల[illegible]. ౩౭

వైకుంఠో[illegible] [illegible]।
నిత్యో[illegible] [illegible] నిశ్చింతో [illegible]. ౩౮

[illegible]।
జగత్[illegible] [illegible]. ౩౯

యోగేశ్వర[illegible] [illegible]।
[illegible] విశ్వ[illegible] [illegible]. ౪౦

[illegible]।
సూర్య[illegible] విశ్వ[illegible] సర్వస్య [illegible]. ౪౧

జగ[illegible] విశ్వ[illegible]।
నిర్మమో[illegible] నిస్సంగో[illegible]. ౪౨

వశ్యమాయో వశ్య[illegible] విష్వక్సేనః సురో[illegible]।
సర్వశ్రేయః[illegible]. ౪౩

సర్వలక్షణలక్షణ్యః సర్వదైత్యంప్రదర్పహా।
సమస్తదేవసర్వస్వం సర్వదైవత[illegible]. ౪౪

సమస్తదేవకవచం సర్వదేవశి[illegible]।
సమస్తదేవ[illegible] ప్రపన్నాశనిపంజరః. ౪౫

సమస్తభయహృన్నామా భగవాన్ విష్టరశ్రవాః।
విభుస్సర్వహితో[illegible] హంతా[illegible] స్వర్గతిప్రదః ([illegible]). ౪౬

సర్వదైవతజీవేశో బ్రాహ్మ[illegible]దినియోజకః।
బ్రహ్మా[illegible]యుర్బ్రహ్మా జ్యేష్ఠః శిశుస్స్వరాట్. ౪౭

విరాడ్భక్తపరాధీనః స్తుత్యః స్తోత్రార్థసాధకః।
పరార్థకర్తా కృత్యజ్ఞః స్వార్థకృత్యసదోజ్ఝితః. ౪౮

సదానందస్సదాభద్రస్సదాశాంతస్సదాశివః।
సదాప్రియస్సదాతుష్టస్సదాపుష్టస్సదార్చితః. ౪౯

సదాపూతః పావనాగ్ర్యో వేదగుహ్యో వృషాకపిః।
సహస్రనామా త్రియుగశ్చతుర్మూర్తిశ్చతుర్భుజః. ౫౦

భూతభవ్యభవన్నాథో మహాపురుషపూర్వజః।
నారాయణో మంజుకేశః స్సర్వయోగవినిస్సృతః. ౫౧

వేదసారో యజ్ఞసారః సామసారస్తపోనిధిః।
సాధ్యశ్రేష్ఠః పురాణర్షిర్నిష్ఠా శాంతిః పరాయణమ్. ౫౨
శివత్రిశూలవిధ్వంసీ శ్రీకంఠైకవరప్రదః।
నరః కృష్ణో హరిర్ధర్మనందనో ధర్మవర్ధనః. ౫౩
ఆదిదేవో జగత్కర్తా సర్వస్త్రీరత్నదర్పహా।
త్రికాలజగదాధార ఈశ్వరేశ్వరేశ్వరః. ౫౪
ఆద్యః కపిలయోగీశః సర్వజ్ఞానీశ్వరేశ్వరః।
సర్వదేవమయో బ్రహ్మా గురువాగీశ్వరీపతిః. ౫౫
అనంతవిద్యాప్రభవో మూలావిద్యావినాశకః।
సార్వజ్ఞ్యదో నమజ్జాడ్యనాశనో మధుసూదనః. ౫౬
అనేకమంత్రకోటీశః శబ్దబ్రహ్మైకపారగః।
ఆదివిద్వాన్ వేదకర్తా వేదాత్మా శ్రుతిసాగరః. ౫౭
బ్రహ్మార్థవేదాహరణః సర్వవిజ్ఞానజన్మభూః।
విద్యారాజో జ్ఞానమూర్తిర్జ్ఞానసింధురఖండధీః. ౫౮
మత్స్యదేవో మహాశృంగో జగద్బీజవహిత్రదృక్।
లీలావ్యాప్తాఖిలాంభోధిః ఋగ్వేదాదిప్రవర్తకః. ౫౯
ఆదికూర్మోఽఖిలాధారస్తృణీకృతజగద్భరః।
అమరీకృతదేవౌఘః పీయూషోత్పత్తికారణమ్. ౬౦
ఆత్మాధారో ధరాధారో యజ్ఞాంగో ధరణీధరః।
హిరణ్యాక్షహరః పృథ్వీపతిః శ్రాద్ధాదికల్పకః. ౬౧
సమస్తపితృభీతిఘ్నః సమస్తపితృజీవనమ్।
హవ్యకవ్యైకభుక్ (౨౦౦) హవ్యకవ్యైకఫలదాయకః. ౬౨
రోమాంతర్లీనజలధిః క్షోభితాశేషసాగరః।
మహావరాహో యజ్ఞఘ్నధ్వంసకో యాజ్ఞికాశ్రయః. ౬౩
శ్రీనృసింహో దివ్యసింహః సర్వానిష్టార్థదుఃఖహా।
ఏకవీరోఽద్భుతబలో యంత్రమంత్రైకభంజనః. ౬౪
బ్రహ్మాదిదుస్సహజ్యోతిర్యుగాంతాగ్న్యతిభీషణః।
కోటివజ్రాధికనఖో జగద్దుష్ప్రేక్ష్యమూర్తిధృక్. ౬౫
మాతృచక్రప్రమథనో మహామాతృగణేశ్వరః।
అచింత్యామోఘవీర్యాఢ్యః సమస్తాసురఘస్మరః. ౬౬
హిరణ్యకశిపుచ్ఛేదీ కాలస్సంకర్షణీపతిః।
కృతాంతవాహనాసహ్యః సమస్తభయనాశనః. ౬౭

సర్వవిఘ్నాంతకస్సర్వసిద్ధిదస్సర్వపాలకః ।
సమస్తపాతకధ్వంసీ సిద్ధమంత్రాధికాహ్వయః. ౬౮
భైరవేశో హరార్తిఘ్నః కాలకోటిదురాసదః ।
దైత్యగర్భస్రావినాదః స్ఫుటద్బ్రహ్మాండగర్జితః. ౬౯
స్మృతమాత్రాఖిలత్రాతాఽద్భుతరూపో మహాహరిః ।
బ్రహ్మచర్యశిరఃపిండీ దిక్పాలోఽర్ధాంగభూషణః. ౭౦
ద్వాదశార్కశిరోదామా రుద్రశీర్షైకనూపురః ।
యోగినీగ్రస్తగిరిజాత్రాతా భైరవతర్జకః. ౭౧
వీరచక్రేశ్వరోఽత్యుగ్రో యమారిః కాలసంవరః ।
క్రోధేశ్వరో రుద్రచండీపరివారాదిదుష్టభుక్. ౭౨
సర్వాక్షోభ్యో మృత్యుమృత్యుః కాలమృత్యునివర్తకః ।
అసాధ్యసర్వరోగఘ్నః సర్వదుర్గ్రహసౌమ్యకృత్. ౭౩
గణేశకోటిదర్పఘ్నో దుస్సహాశేషగోత్రహా ।
దేవదానవదుర్దర్శో జగద్భయదభీషణః. ౭౪
సమస్తదుర్గతిత్రాతా జగద్భక్షకభక్షకః ।
ఉగ్రశోఽంబరమార్జారః కాలమూషకభక్షకః. ౭౫
అనంతాయుధదోర్దండీ నృసింహో వీరభద్రజిత్ ।
యోగినీచక్రగుహ్యేశః శక్రారిపశుమాంసభుక్. ౭౬
రుద్రో నారాయణో మేషరూపశంకరవాహనః ।
మేషరూపశివత్రాతా దుష్టశక్తిసహస్రభుక్. ౭౭
తులసీవల్లభో వీరో వామాచారాఖిలేష్టదః ।
మహాశివశివారూఢో భైరవైకకపాలధృక్. ౭౮
ఝిల్లీచక్రేశ్వరః శక్రదివ్యమోహనరూపదః ।
గౌరీసౌభాగ్యదో మాయానిధిర్మాయాభయాపహః. ౭౯
బ్రహ్మతేజోమయో బ్రహ్మశ్రీమయశ్చ త్రయీమయః ।
సుబ్రహ్మణ్యో బలిధ్వంసీ వామనోఽదితిదుఃఖహా. ౮౦
ఉపేంద్రో నృపతిర్విష్ణుః కశ్యపాన్వయమండనః ।
బలిస్వారాజ్యదః సర్వదేవవిప్రాన్నదోఽచ్యుతః. (౫౧౦) ౮౧
ఉరుక్రమస్తీర్థపాదస్త్రిపదస్థస్త్రివిక్రమః ।
వ్యోమపాదః స్వపాదాంభఃపవిత్రితజగత్త్రయః. ౮౨
బ్రహ్మేశాద్యభివంద్యాంఘ్రిర్ధృతధర్మాఽహిధావనః ।
అచింత్యాద్భుతవిస్తారో విశ్వవృక్షో మహాబలః. ౮౩

రాహుమూర్ధాపరాంగచ్ఛిద్ భృగుపత్నీశిరోహరః ।
పాపత్రస్తః సదాపుణ్యో దైత్యాశానిత్యఖండకః. ౮౪
పూరితాఖిలదేవాశో విశ్వార్థైకావతారకృత్ ।
స్వమాయానిత్యగుప్తాత్మా భక్తచింతామణిస్సదా. ౮౫
వరదః కార్తవీర్యాదిరాజరాజ్యప్రదోఽనఘః ।
విశ్వశ్లాఘ్యోఽమితాచారో దత్తాత్రేయో మునీశ్వరః. ౮౬
పరాశక్తిసదాశ్లిష్టో యోగానందసదోన్మదః ।
సమస్తేంద్రారితేజోహృత్ పరమామృతపద్మపః. ౮౭
అనసూయాగర్భరత్నం భోగమోక్షసుఖప్రదః ।
జమదగ్నికులాదిత్యో రేణుకాద్భుతశక్తిధృక్. ౮౮
మాతృహత్యాదినిర్లేపః స్కందజిద్విప్రరాజ్యదః ।
సర్వక్షత్రాంతకృద్వీరదర్పహా కార్తవీర్యజిత్. ౮౯
సప్తద్వీపవతీదాతా శివార్చకయశఃప్రదః ।
భీమః పరశురామశ్చ శివాచార్యైకవిశ్వభూః. ౯౦
శివోఽఖిలజ్ఞానకోశో భీష్మాచార్యోఽగ్నిదైవతః ।
ద్రోణాచార్యగురుర్విశ్వజైత్రధన్వా కృతాంతజిత్. ౯౧
అద్వితీయతపోమూర్తిర్బ్రహ్మచర్యైకదక్షిణః ।
మనుశ్రేష్ఠః సతాం సేతుః మహీయాన్ వృషభో విరాట్. ౯౨
ఆదిరాజః క్షితిపితా సర్వరత్నైకదోహకృత్ ।
పృథుర్జన్మాద్యేకదక్షో గీః శ్రీకీర్తిస్వయంవృతః. ౯౩
జగద్వృత్తిప్రదశ్చక్రవర్తిశ్రేష్ఠోఽద్వయాస్త్రధృక్ ।
సనకాదిమునిప్రాప్యభగవద్భక్తివర్ధనః. ౯౪
వర్ణాశ్రమాదిధర్మాణాం కర్తా వక్తా ప్రవర్తకః ।
సూర్యవంశధ్వజో రామో రాఘవః సద్గుణార్ణవః. ౯౫
కాకుత్స్థో వీరరాజార్యో రాజధర్మధురంధరః ।
నిత్యస్వస్థాశ్రయః సర్వభద్రగ్రాహీ శుభైకదృక్. ౯౬
నరరత్నం రత్నగర్భో ధర్మాధ్యక్షో మహానిధిః ।
సర్వశ్రేష్ఠాశ్రయః సర్వశస్త్రాస్త్రగ్రామవీర్యవాన్. ౯౭
జగదీశో దాశరథిః సర్వరత్నాశ్రయో నృపః ।
సమస్తధర్మసూః సర్వధర్మద్రష్టాఽఖిలార్తిహా. ౯౮
అతీంద్రో జ్ఞానవిజ్ఞానపారద్రష్టా క్షమాంబుధిః
సర్వప్రకృష్టః శిష్టేష్టో(౬౦౦)హర్షశోకాద్యనాకులః. ౯౯

పిత్రాజ్ఞాత్యక్తసామ్రాజ్యః [illegible] ।
గుహాదేశార్పితైశ్వర్యః శివస్పర్ధాజటాధరః ॥ ౧౦౦
చిత్రకూటాప్తరత్నాద్రిజగదీశో వనేచరః ।
యథేష్టామోఘసర్వాస్త్రో దేవేంద్రతనయాక్షిహా ॥ ౧౦౧
బ్రహ్మేంద్రాదినతైషీకః [illegible] విరాధహా ।
బ్రహ్మశాపహతాశేషదండకారణ్యపావనః ॥ ౧౦౨
[illegible] ।
ఖరారి[illegible] ॥ ౧౦౩
జటాయుషోఽగ్నిగతిదో[illegible] ।
శిలాధనుః[illegible] ॥ ౧౦౪
[illegible] ।
సుగ్రీవరాజ్యదో[illegible] ॥ ౧౦౫
హనుమద్రుద్రముఖ్యేశః సమస్తకపిదేహభృత్ ।
సనాగదైత్యబాణైకవ్యాకులీకృతసాగరః ॥ ౧౦౬
సమ్లేచ్ఛకోటిబాణైకశుష్కనిర్దగ్ధసాగరః ।
సముద్రాద్భుతపూర్వైకబద్ధసేతుర్యశోనిధిః ॥ ౧౦౭
అసాధ్యసాధకో లంకాసమూలోత్సాదదక్షిణః ।
వరదృప్తజగచ్ఛల్యపౌలస్త్యకులకృంతనః ॥ ౧౦౮
లోకవిఘ్నః ప్రహస్తచ్ఛిత్ కుంభకర్ణభిదుగ్రహా ।
రావణైకశిరశ్ఛేత్తా నిఃశంకేంద్రైకరాజ్యదః ॥ ౧౦౯
స్వర్గాస్వర్గత్వవిచ్ఛేదీ దేవేంద్రానింద్రతాహరః ।
రక్షోదేవత్వహృద్ధర్మాధర్మఘ్నః పురుష్టుతః ॥ ౧౧౦
నతిమాత్రదశాస్యారిర్దత్తరాజ్యవిభీషణః ।
సుధావృష్టిమృతాశేషస్వసైన్యోజ్జీవనైకకృత్ ॥ ౧౧౧
దేవబ్రాహ్మణనామైకధాతా సర్వామరార్చితః ।
బ్రహ్మసూర్యేంద్రరుద్రాదివంద్యార్చితసతీప్రియః ॥ ౧౧౨
అయోధ్యాఖిలరాజాగ్ర్యః సర్వభూతమనోహరః ।
స్వామ్యతుల్యకృపాదండో హీనోత్కృష్టైకసత్ప్రియః ॥ ౧౧౩
శ్వపక్ష్యాదిన్యాయదర్శీ హీనార్థాధికసాధకః ।
వ్యాధవ్యాజానుచితకృత్తారకోఽఖిలతుల్యకృత్ ॥ ౧౧౪
[illegible]వ్రత్యాధికయుక్తాత్మా ప్రియాంత్యక్తః స్మరారిజిత్ ।
సాక్షాత్కుశలవచ్ఛద్మేంద్రాదితాతో హ్యపరాజితః ॥ ౧౧౫

[illegible]కేంద్రో వీరబాహుః సత్యాస్త్రైత్యక్తసోదరః ।
శరసంధాననిర్ధూతధరణీమండలో జయః ॥ ౧౧౬

బ్రహ్మాదికామ్యసాన్నిధ్యసనాథీకృతదైవతః ।
బ్రహ్మలోకాప్తచాండాలాద్యశేషప్రాణిసార్థకః ॥ ౧౧౭

స్వర్ణీతగర్దభశ్వాదిశ్చిరాయోధ్యావనైకకృత్ ।
రామో ద్వితీయస్సౌమిత్రిర్లక్ష్మణః ప్రహతేంద్రజిత్ ॥ ౧౧౮

విష్ణుభక్తః సరామాంఘ్రిపాదుకారాజ్యనిర్వృతః ।
భరతోఽసహ్యగంధర్వకోటిఘ్నో లవణాంతకః ॥ ౧౧౯

శత్రుఘ్నో వైద్యరాజాయుర్వేదగర్భౌషధీపతిః ।
నిత్యామృతకరో ధన్వంతరిర్యజ్ఞో జగద్ధరః ॥ ౧౨౦

సూర్యారిఘ్నః సురాజీవో దక్షిణేశో ద్విజప్రియః ।
ఛిన్నమూర్ధాపదేశార్కః శేషాంగస్థాపితామరః ॥ ౧౨౧

విశ్వార్థాశేషకృద్రాహుశిరశ్ఛేత్తాఽక్షతాకృతిః ।
వాజపేయాదినామాగ్నిర్వేదధర్మపరాయణః (౨౦౦) ॥ ౧౨౨

శ్వేతద్వీపపతిః సాంఖ్యప్రణేతా సర్వసిద్ధిరాట్ ।
విశ్వప్రకాశితజ్ఞానయోగమోహతమిస్రహా ॥ ౧౨౩

దేవహూత్యాత్మజస్సిద్ధః కపిలః కర్దమాత్మజః ।
యోగస్వామీ ధ్యానభంగసగరాత్మజభస్మకృత్ ॥ ౧౨౪

ధర్మో వృషేంద్రః సురభీపతిః శుద్ధాత్మభావితః ।
శంభుస్త్రిపురదాహైకస్థైర్యవిశ్వరథోద్వహః ॥ ౧౨౫

భక్తశంభుజితో దైత్యామృతవాపీసమస్తపః ।
మహాప్రళయవిశ్వైకనిలయోఽఖిలనాగరాట్ ॥ ౧౨౬

శేషదేవస్సహస్రాక్షః సహస్రాస్యశిరోభుజః ।
ఫణామణికణాకారయోజితాబ్ధ్యంబుదక్షితిః ॥ ౧౨౭

కాలాగ్నిరుద్రజనకో ముసలాస్త్రో హలాయుధః ।
నీలాంబరో వారుణీశో మనోవాక్కాయదోషహా ॥ ౧౨౮

అసంతోషదృష్టిమాత్రపాతితైకదశాననః ।
బలిసంయమనో ఘోరో రౌహిణేయః ప్రలంబహా ॥ ౧౨౯

ముష్టికఘ్నో ద్వివిదహా కాళిందీకర్షణో బలః ।
రేవతీరమణః పూర్వభక్తిఖేదాచ్యుతాగ్రజః ॥ ౧౩౦

దేవకీవసుదేవాహ్వకశ్యపాదితినందనః ।
వార్ష్ణేయస్సాత్వతాంశ్రేష్ఠః శౌరిర్యదుకులేశ్వరః ॥ ౧౩౧

నరాకృతిః పరంబ్రహ్మ సవ్యసాచివరప్రదః ।
బ్రహ్మాదికామ్యలాలిత్యజగదాశ్చర్యశైశవః. ౧౩౨
పూతనాఘ్నః శకటభిద్యమళార్జునభంజనః ।
వాతాసురారిః కేశిఘ్నో ధేనుకారిర్గవీశ్వరః. ౧౩౩
దామోదరో గోపదేవో యశోదానందదాయకః ।
కాళీయమర్దనః సర్వగోపగోపీజనప్రియః. ౧౩౪
లీలాగోవర్ధనధరో గోవిందో గోకులోత్సవః ।
అరిష్టమథనః కామోన్మత్తగోపీవిముక్తిదః. ౧౩౫
సద్యఃకువలయాపీడఘాతీ చాణూరమర్దనః ।
కంసారిరుగ్రసేనాదిరాజ్యవ్యాపారితామరః. ౧౩౬
సుధర్మాంకితభూర్లోకో జరాసంధబలాంతకః ।
త్యక్తభగ్నజరాసంధో భీమసేనయశఃప్రదః. ౧౩౭
సాందీపనిమృతాపత్యదాతా కాలాంతకాదిజిత్ ।
సమస్తనారకత్రాతా సర్వభూపతికోటిజిత్. ౧౩౮
రుక్మిణీరమణో రుక్మిశాసనో నరకాంతకః ।
సమస్తసుందరీకాంతో మురారిర్గరుడధ్వజః. ౧౩౯
ఏకాకిజితరుద్రార్కమరుదాద్యఖిలేశ్వరః ।
దేవేంద్రదర్పహా కల్పద్రుమాలంకృతభూతలః. ౧౪౦
బాణబాహుసహస్రచ్ఛిన్నంద్యాదిగణకోటిజిత్ ।
లీలాజితమహాదేవో మహాదేవైకపూజితః. ౧౪౧
ఇంద్రార్థార్జుననిర్భంగజయదః పాండవైకధృక్ ।
కాశీరాజశిరశ్ఛేత్తా రుద్రశక్త్యేకమర్దనః. ౧౪౨
విశ్వేశ్వరప్రసాదాఢ్యః కాశీరాజసుతార్దనః ।
శంభుప్రతిజ్ఞావిధ్వంసీ కాశీనిర్దగ్ధనాయకః (౮౦౦). ౧౪౩
కాశీశగణకోటిఘ్నో లోకశిక్షాద్విజార్చకః ।
శివతీవ్రతపోవశ్యః పురాశివవరప్రదః. ౧౪౪
శంకరైకప్రతిష్ఠాధృక్ స్వాంశశంకరపూజకః ।
శివకన్యావ్రతపతిః కృష్ణరూపశివారిహా. ౧౪౫
మహాలక్ష్మీవపుర్గౌరీత్రాతా వైదళవృత్రహా ।
స్వధామముచుకుందైకనిష్కాలయవనేష్టకృత్. ౧౪౬
యమునాపతిరానీతపరిలీనద్విజాత్మజః ।
శ్రీదామరంకభక్తార్థభూమ్యానీతేంద్రవైభవః. ౧౪౭

సుర్వల్పత్రిశిశుపాలకముక్తిదో ద్వారకేశ్వరః ।
ఆచాండాలాదికప్రాప్యద్వారకానిధికోటికృత్. ౧౫౮
అక్రూరోద్ధవముఖ్యైకభక్తః స్వచ్ఛందముక్తిదః ।
సబాలస్త్రీజలక్రీడామృతవాపీకృతార్ణవః. ౧౫౯
బ్రహ్మాస్త్రదగ్ధగర్భస్థపరీక్షిజ్జీవనైకకృత్ ।
పరిలీనద్విజసుతానేతార్జునమదాపహః. ౧౬౦
గూఢముద్రాకృతిగ్రస్తభీష్మాద్యఖిలకౌరవః ।
పార్థార్థఖండితాశేషదివ్యాస్త్రః పార్థమోహహృత్. ౧౬౧
గర్భశాపచ్ఛలధ్వస్తయాదవోర్వీభరాపహః ।
జరావ్యాధారిగతిదః స్మృతమాత్రాఖిలేష్టదః. ౧౬౨
కామదేవో రతిపతిర్మన్మథః శంబరాంతకః ।
అనంగో జితగౌరీశో రతికాంతః సదేప్సితః. ౧౬౩
పుష్పేషుర్విశ్వవిజయీ స్మరః కామేశ్వరీప్రియః ।
ఉషాపతిర్విశ్వకేతుర్విశ్వతృప్తోఽధిపూరుషః. ౧౬౪
చతురాత్మా చతుర్వ్యూహశ్చతుర్యుగవిధాయకః ।
చతుర్వేదైకవిశ్వాత్మా సర్వోత్కృష్టాంశకోటిసూః. ౧౬౫
ఆశ్రమాత్మా పురాణర్షిర్వ్యాసః శాఖాసహస్రకృత్ ।
మహాభారతనిర్మాతా కవీంద్రో బాదరాయణః. ౧౬౬
కృష్ణద్వైపాయనః సర్వపురుషార్థైకబోధకః ।
వేదాంతకర్తా బ్రహ్మైకవ్యంజకః పురువంశకృత్. ౧౬౭
బుద్ధో ధ్యానజితాశేషదేవదేవీజగత్ప్రియః ।
నిరాయుధో జగజ్జైత్రః శ్రీధరో దుష్టమోహనః. ౧౬౮
దైత్యవేదబహిష్కర్తా వేదార్థశ్రుతిగోపకః ।
శౌద్ధోదనిర్దృష్టదిష్టః సుఖదః సదసస్పతిః. ౧౬౯
యథాయోగ్యాఖిలకృపః సర్వశూన్యోఽఖిలేష్టదః ।
చతుష్కోటిపృథక్తత్త్వప్రజ్ఞాపారమితేశ్వరః. ౧౭౦
పాషండవేదమార్గేశః పాషండశ్రుతిగోపకః ।
కల్కీ విష్ణుయశఃపుత్రః కలికాలవిలోపకః. ౧౭౧
సమస్తమ్లేచ్ఛదుష్టఘ్నః సర్వశిష్టద్విజాతికృత్ ।
సత్యప్రవర్తకో దేవద్విజదీర్ఘక్షుధాపహః. ౧౭౨

[illegible] ।
[illegible]. ౧౬౩
[illegible] ।
[illegible]. ౧౬౪
[illegible] ।
[illegible]. ౧౬౫
[illegible] ।
[illegible]. ౧౬౬
[illegible] ।
[illegible]. ౧౬౭
[illegible] ।
[illegible]. ౧౬౮
దేవర్షిరాట్ [illegible] ।
[illegible]. ౧౬౯
గంగా తీర్థోత్తమో ద్యూతం ఛలతామగ్ర్యం నరోత్తమః ।
అన్నం సుఖకృతామగ్ర్యం వజ్రం ప్రహరతాం పతిః. ౧౭౦
ఉచ్చైశ్శ్రవా వాజిరాజ ఐరావత ఇభేశ్వరః ।
అరుంధత్యేకపత్నీషు హ్యశ్వత్థోఽశేషవృక్షరాట్. ౧౭౧
అధ్యాత్మవిద్యా విద్యాగ్ర్యః ప్రణవశ్ఛందసాం వరః।
మేరుర్గిరిపతిర్మార్గో మాసాగ్ర్యః కాలసత్తమః. ౧౭౨
దినాద్యాత్మా పూర్వసిద్ధః కపిలస్సామవేదరాట్ ।
తార్క్ష్యః ఖగేంద్ర ఋత్వగ్ర్యో వసంతః కల్పపాదపః. ౧౭౩
దాతృశ్రేష్ఠః కామధేనురార్తిఘ్నాగ్ర్యః సుహృత్తమః ।
చింతామణిర్గురుశ్రేష్ఠో మాతా హితతమః పితా. ౧౭౪
సింహో మృగేంద్రో నాగేంద్రో వాసుకిర్నృవరో నృపః ।
వర్ణేశో బ్రాహ్మణశ్చేతః కరణాగ్ర్యం (౧౦౧౦) నమోనమః. ౧౭౫
ఇతి శ్రీవ్యాసదేవస్య విష్ణోర్నామసహస్రకమ్.

—: విష్ణుసహస్రనామ మాహాత్మ్య కథనము :—

సీ. సకలదుఃఖప్రణాశకము సమస్తసౌ, ఖ్యప్రదాయకము మోక్షప్రదంబు
బ్రహ్మవిష్ణ్వాదిదుర్లభలోకసోపాన, మార్గంబు రాజసమ్మానదంబు
జాడ్యహారంబు రాజ్యప్రదం బఖిలవి, ద్యాదాయకంబు పుత్రప్రదంబు
సర్వసిద్ధికరంబు సర్వపుణ్యక్రియా, ఫలదంబు సర్వసౌభాగ్యదంబు

గీ. సాంపత్తార్థ[illegible] [illegible], శ్రేష్ఠ [illegible]
సంస్కృతిశ్లేశవిశ్లేషస్యాంతకమిమగ, భువ్ర మిహి విష్ణునామసహస్ర నామము. 1028

క. ఈనామంబులు శ్రద్ధా, హీనునకును నాస్తికునకు స్వేచ్ఛావాదా
జ్ఞానునకు [illegible], మానసుడకు చెప్పఁ దగదు మంత్రమునో శుకా. 1029

క. హితకాంక్షికి సుతునకు నా, శ్రితునకు శిష్యునకు వినఁ జెప్పఁగను [illegible]
స్థితి కష్టం లగుట ధర్మ, చ్యుతి లేకుండంగ [illegible] చుండుడు వారల్. 1030

క. అరుణోదయసమయంబున, హరినామసహస్రపఠన మనునిత్యముగ ని
వ్వరు గావింతురొ వారలు, పరివర్ధితు లగుదు రఖిలభాగ్యంబులతోన్. 1031

క. నామంబె జపము తపమును, నామంబె సమర్చనంబు నామంబె క్రతుప్రా
నామంబె తీర్థయాత్రలు, నామంబె సమస్తవిధులు నామంబె సుమీ. 1032

క. నామసహస్రములో నొక, నామం బైనియు స్మరించినను బ్రతిదినమున్
నేమమున వారి కఖిల, క్షేమంబులు గల్గు నేల చెప్పఁగ నింకన్. 1033

క. స్మృతి నొందెడి వేళ మనో, ధృతి చెడిపోకుండ నిలిచి యెదుటను మూర్ధ్వ
స్థితికిం గొనిపోయెడియు, చ్యుతనామముకంటె దేహి కొరు లెవరు హితుల్.

క. ఈనామసహస్రంబును, మానవుఁ డనుదినము సనియమముగఁ జదివినన్
గాని స్మరించినఁ గాని య, మానుషమహిమమున లోకమాన్యత నొందున్.

గీ. విష్ణునామసహస్రంబు వెలయుచోటు
సర్వతీర్థాలయము గాన సదనమందు
నుంచికొని నామములు వ్రాసి యుంచు పుస్త
కమును బూజించుచుండినఁ గలుగు మేలు. 1036

గీ. కోటియజ్ఞఫలంబు చేకూరుఁ దులసి, తోడఁ బూజించునెడ నచ్యుతుని సహస్ర
నామములు చెప్పుచును విష్ణునామమహిమ, యింత యంత యటంచు నే నెన్నఁజాల.

గీ. కార్యమేదేని యొనరింపఁ గడఁగునపుడు
మార్గమునఁ బోవునపుడును మానసమున
సంస్మరించిన నామముల్ జయము గలుగుఁ
గార్యమున శుభయంబు మార్గమునఁ గలుగు. 1038

వ. విష్ణునామసహస్రపారాయణంబు శక్తికొలందియు ననుదినంబును నేకకాలంబు
నం గాని ద్వికాలంబులం గాని త్రికాలంబులంగాని కావించుచుండి రేని సకల
శ్రేయంబులుం జేకూరు. 1039

క. పరమపవిత్రము సర్వా, ఘరహితము భుక్తిముక్తిదాయకము విప
త్తర విష్ణునామసహస్రము, దొరకదు తలక్రిందు లైన దురితాత్ములకున్. 1040

—: [illegible] :—

సీ. భూతలంబున మున్ను పుండరీకుం డను నాఁగ, [illegible] బ్రాహ్మణోత్తముండు
బ్రహ్మచర్యంబును బాలించుచును [illegible], వేదవేదాంగశాస్త్రము లెల్ల
గురునియొద్దను నేర్చికొని యున్న [illegible]ములు, [illegible] శ్రద్ధతోడ
నిష్పరిగ్రహుండై పిదప నిజబాంధవుల నిజ, గృహంబును [illegible] క్షేత్రములను
గీ. మూలశాకఫలాశనంబునను జేసి, [illegible] గడపుచు [illegible] దగుటఁ జేసి
యనుభవించుచు నమితసౌఖ్యమును [illegible], తీర్థములలోన [illegible] మెందిరిగి తుదకు,
సీ. అరిగి సాలగ్రామ మను క్షేత్రమున కంత, [illegible] చక్రాంకితగ్రావములను
బొందుచు విస్మయంబును సరస్వతిలోన. దేవప్రవాహం బను తీర్థమునను
జక్రకుండంబున స్నానంబు గావించి, [illegible] నిగుల
నచ్చోట [illegible] నిష్ఠతోడ
గీ. విష్ణునామజపంబు గావింపఁ [illegible], [illegible] సహస్రనామమాహాత్మ్యమునను
శార్ఙ్గి ప్రత్యక్షమై నిజస్వర్గసమున. [illegible] మునకుఁ జనియె.
గీ. అని వచించుచు నిట్లన నమరముని, [illegible] సహస్రతుల్య
మైనయొకనామ మేదేని యానతిమ్ము, [illegible] నెల్ల వారును దరింప.
వ. అని ప్రార్థించుటయు మహేశ్వరుం డమ్మునికి ట్లనియె. 1044
క. నారద నీ విపు డడిగిన, [illegible] మున్ను [illegible]
నారీమణి నంకంబునఁ, జేర్చికొని లోనిగుట్టు చెప్పితి నిట్టుల్. 1045

—: రామనామమాహాత్మ్యము :—

క. కామాక్షి రామ యనియెడి, నామ మ్మొక్కటియె సహస్రనామసమము త
న్నామామృతపానము నా, కామోదము గొలుపుచుండు ననవరతంబున్.
గీ. పడఁతి యీరామనామంబు ప్రతిదినంబు, జపముచేయుచు నుండిన శక్తికొలఁది
భస్మ మొనరించు నఖిలపాపముల నగ్ని, కణము తూలాద్రులనుబోలె క్షణములోన.
ఆ. మఱియు రామనామమంత్రంబును జపించు, నట్టివారి కెట్టియాపదలును
గలుగ నేర వాపదలకు మూలం బగు, పాప మెల్ల దాన భస్మ మగుట. 1048
గీ. రామనామము మోక్షసామ్రాజ్యపదముఁ
బడయఁ దలఁచినమానవప్రతతి కెల్ల
నాశ్రయింపంగఁ దగుమంత్ర మంతకంటె
సులభ మగుసాధనము లేదు కలియుగమున.

వ. ఇంక రామరక్షాకవచముం జెప్పెద వినుము.

—: రామరక్షాకవచము :—

అస్య శ్రీరామరక్షాకవచమంత్రస్య విశ్వామిత్ర ఋషిః. శ్రీరామో దేవతా, అనుష్టుప్ ఛందః. విష్ణుప్రీత్యర్థే జపే వినియోగః.

శ్లో॥ శిఖాం మే పాతు విశ్వాత్మా కర్ణౌ మే పాతు కామదః।
చక్షుషీ పాతు మే దేవః సీతాపతిరనుత్తమః. ౧
జిహ్వాం మే పాతు పాపఘ్నో లోకశిక్షాప్రవర్తకః।
రాఘవః పాతు మే దంతాన్ శ్రీకంఠః కంఠమేవ చ. ౨
పాతు మే హృదయం రామః కేశాన్ రక్షతు కేశవః।
నాభిం పాతు మఖత్రాతా కటీ మే విశ్వరక్షకః. ౩
పార్శ్వయోస్తు సురత్రాతా కాలకోటిదురాసదః।
సక్థినీ పాతు మే దత్తవిజయో నామ విశ్వసృక్. ౪
కరౌ దాశరథిః పాతు పాదౌ మే విశ్వరూపధృత్।
అనంతస్సర్వతః పాతు శరీరం విశ్వనాయకః. ౫

గీ. వసుధ నీరామరక్షాకవచము నెవరు, పఠనమొనరించుచుందురో ప్రతిదినంబు
చెంది వారలు సర్వార్థసిద్ధులిలను. గాంచెదరు మోక్షపదమును గట్టకడకు.

—: రామస్తవము :—

గీ. మానిని వచింతు వినుము రామస్తవంబు
బ్రహ్మహత్యాదిసకలపాపముల నడంచి
మోక్ష మొనగూర్చు నిది స్వయంభువు వచించెఁ
బ్రమదమున దీని మును రహస్యముగ నాకు. 1052

సీ. రాఘవ నీ వక్షరబ్రహ్మరూపుఁడ, వబ్జనాభుఁడవు నారాయణుఁడవు
భూతభవ్యభవాత్మభూతుండవు పురాణ, పురుషుఁడ వాద్యంతవిరహితుఁడవు
చక్రాయుధుండవు శార్ఙ్గివి సచ్చిదా, నందమూర్తివి జగన్నాయకుఁడవు
శతజిహ్వుఁడవు ప్రజాపతివి సృష్టిస్థితి, ప్రళయకారకుఁడ వప్రాకృతుఁడవు

గీ. హరివి వైకుంఠుఁడవు ప్రణవాత్మకుఁడవు, వేదమూర్తివి ధర్మప్రచోదకుఁడవు
కృష్ణుఁడవు జిష్ణుఁడవు ధృతత్రిభువనుఁడవు, కారణవివర్జితుఁడ వాదికారణమవు.

సీ. రుద్రులం దష్టమరుద్రుఁడ వీవె వం, చమసాధ్యుఁడవు నీవె సాధ్యులందు
యజ్ఞంబు నీవె హవ్యము నీవె హవ్యదా, తయు నీవె హవ్యభోక్తయును నీవె
స్వాహావషట్కారవహ్నిరూపుఁడ వీవె, యజ్ఞఫలప్రదాయకుఁడ వీవె
గోచరింతువు నీవు గోబ్రాహ్మణులయందు, నాశాంతరిక్షకులాద్రులందు

గీ. నాశ్వినేయులు శ్రోత్రము లర్క [illegible] తలంబు
స్థైర్యము స్నేహము దినంబు [illegible] జగ మెల్ల మేను నీకు

గీ. రామచంద్ర భవన్నామ రథము నొప్పి [illegible] పరాజయము లేదు
నీకు [illegible] లోకములకును [illegible] 1055

గీ. విస్తరము [illegible]
[illegible] మహానుభావ.

క. [illegible]
[illegible] రాఘవా.

క. అని [illegible] సింద్రుం
[illegible] 1058

క. ఈ రామ స్తవమును [illegible]
గోరి వినుచుట్టివారును, [illegible] శ్రీ [illegible] 1059

క. ప్రాంత [illegible] స్తవము [illegible]
[illegible] మునుపు [illegible]

క. అనవుడు విని శౌనకుఁడు [illegible] మహాభాగ [illegible]
యనివిజ్ఞాన [illegible] బాధ [illegible] 1061

క. అని [illegible] మునుల [illegible]
[illegible] శ్రీ [illegible] డిట్లనియెన్.

—: సర్వ [illegible] :—

వ. శ్రీధరుని శిఖయందును శ్రీకరుని శిరోభాగంబునందును హృషీకేశుని కేశంబులందును నారాయణుని మూర్ధంబునందును విష్ణుని నూర్ధ్వశ్రోత్రంబునందును జలశాయిని లలాటంబునందును కృష్ణుని భ్రూయుగంబునందును హరిని భ్రూమధ్యంబునందును నరసింహుని నాసికాగ్రంబునందును నర్ణవేశయుని నేత్రంబులందును పుండరీకాక్షుని చక్షుస్సులందును భూధరుని చక్షురధోభాగంబునందును కల్కినాథుని కపోలంబులందును వామనుని కర్ణమూలంబులందును శంభుని నోష్ఠంబులందును గోవిందుని వదనంబునందును ముకుందుని దంతపంక్తియందును వాక్పతిని జిహ్వయందును రాముని హనువునందును వైకుంఠుని కంఠంబునందును బలఘ్నుని బాహుమూలాధోభాగంబునందును కంసఘాతిని నంసంబులందును నజుని భుజద్వయంబునందును శార్ఙ్గపాణిని కరద్వయంబునందును సంకర్షణుని కరాంగుష్ఠంబులందును గోపుని నంగుళిపఙ్క్తుల

యందును నధోక్షజుని వక్షంబునందును శ్రీవత్సుని వక్షోమధ్యభాగంబునందును ననిరుద్ధుని స్తనంబులందును దామోదరుని నుదరంబునందును బద్మనాభుని నాభియందును గేశవుని నాభ్యధోభాగంబునందును ధరాధరుని మేఢ్రంబునందును గదాగ్రజుని గుదంబునందును బీతాంబరధరుని గటియందును మధుద్విషుని నూరుయుగ్మంబునందును మురద్విషుని బిండకంబులందును జనార్దనుని జానుయుగ్మంబునందును ఫణీశుని గుల్ఫంబులందును ద్రివిక్రముని గ్రమంబులందును శ్రీపతిని బాదాంగుష్ఠంబులందును ధరణీధరుని బాదాధోభాగంబునందును విష్వక్సేనుని రోమకూపంబులందును మత్స్యరూపుని మాంసంబునందును గూర్మరూపుని మేదస్సునందును వారాహరూపుని వసామధ్యంబునందును నచ్యుతుని నస్థులయందును ద్విజప్రియుని మజ్జయందును శ్వేతపతిని శుక్రంబునందును యజ్ఞపురుషుని సర్వాంగంబునందును బరమాత్ము నాత్మయందును న్యాసంబు గావించికొని సాక్షాన్నారాయణాత్మకుం డై సహస్రాగ్రంబు లగుకళలం గైకొని సుదర్శనచక్రంబును వారాహనారసింహవామనావతారంబులను విష్ణునామంబులను స్మరించుచు. 1063

సీ. నేను జక్రధరుండ నిఖిలపాపములను, నిఖిలవిషంబుల నిఖిలరుజల
సకలవిపత్తుల సకలాశుభంబుల, సకలగ్రహంబుల సకలరిపుల
నశియింపఁజేయుచున్నాఁడను మద్దేహ, జము లైనకళలచే క్షణములోన
నసిపత్రివానిచే నోసరించునెడ నహా, మూర్ఖనం బచ్యుతమంత్రపఠనఁ
గీ. సకలపిశాచములు సకలదోషములు సకల, పాపములును సమస్తసంతాపములును
సకలదిక్కులను నశియించి సకలవిధము, లైనసుఖములఁ బడయుదు రార్తజనులు.

గీ. ఈయపామార్జనం బనుపేరు లైన, విష్ణుభక్తులచేతఁ గావింపఁబడిన
సిద్ధికం బగు దీనన్న సిద్ధి నొందు, దఖిలజనులకు నిది గొప్పయాత్మరక్ష. 1065

గీ. సర్వభూతహితంబును జలుప నెంచి, మును బులస్త్యుండు దీని దాల్భ్యునకొసంగ
నమ్మహర్షి సమస్తలోకమ్ములందు, శిష్యముఖమున వ్యాపింపఁజేసె నబల.

వ. అని వచియింప శర్వాణి యపరిమితానందభరితాంతరంగ యయ్యె.

క. ఇది పద్మపురాణకథా, విదితం బగు బ్రహ్మఖండవిషయము దీనిన్
జదివినను వినిన వినిచినఁ, బదిలంబుగ నుండు విష్ణుభవనమునందున్. 1068

వ. అని చెప్పుటయు శౌనకాదిమహర్షు లత్యానందమును జెందిరి. 1069

క. ఆరాధకజననివహా, ధారక ఫాలాగ్నిదగ్ధదర్పక యూప
ద్వారక సృష్టిస్థితిలయ, కారక శ్రీవిశ్వనాథ కాశీనాథా. 1070

—: మేదినీవృత్తము :—

అనవరతాశ్రిత "వనపరాయణాంతరంగ"
మునిజనమానసాంబురుహముఖ్యవాసభామా
యనిమిషసన్నుతాత్మ చరితామృతప్రభావా
వినతసమస్తలోక ప్రసుతపద్య విశ్వనాథా. 107

గద్యము

చిదంబరకవీంద్రప్రణీతంబైన శ్రీమదాంధ్రపద్మపురాణంబున
ప్రథమఖండము
సమాప్తము.



శ్రీ కాశీవిశ్వేశ్వరార్పణమస్తు.

